కృష్ణస్వామయ్య, ఏ.

లతాంగి

(S. l.), 1928

Record no. 617

Kṛṣṇasvāmayya, Ē.

Latāṅgi

(S. l.), 1928

Record no. 717

కృష్ణస్వామయ్య, ఏ.
లతాంగి / ఈ గ్రంథము ఏ. కృష్ణస్వామయ్య గారిచే రచియింపబడినది.- (S.l.) : ఆనంద ముద్రాక్షరశాల, 1928.
iii, (1), iii, 317, 2 p. ;18 cm.
Record no. 717

Kṛṣṇasvāmayya, Ē.
Latāṅgi / Ī granthamu Ē. Kṛṣṇasvāmayya gāricē raciyimpabaḍinadi.- (S.l.) : Ānanda Mudrākṣaraśāla, 1928.
iii, (1), iii, 317, 2 p. ;18 cm.
Record no. 717

శ్రీరస్తు.

లతాంగి

ఈ గ్రంథము

ఏ. కృష్ణస్వామయ్య బి. యె. గారిచే

రచియింపబడి

ఆనంద ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె.

1928 వ సం॥

దీని వెల. రూ. 2.]

శ్రీరస్తు.

లతాంగి

ఈ గ్రంథము

ఏ. కృష్ణస్వామయ్య బి. ఏ. గారిచే

రచియింపబడి

ఆనంద ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె.

1928 వ సం॥

be
o1
fc
ch

వెల. రూ. 2.]

PREFACE.

In presenting this volume to the public, I may say that my main object is, that it may be of use to students. Unlike the old Telugu publications in poetry or prose and many of the later ones, which are mostly in praise of some deity, man or woman, this book is full of daily events in life, whose value to the young pupils cannot be over-estimated. In as many places as possible, emphasis is laid on the education of women and their freedom; hence, the novel is styled as 'Lathāngi.' Prominence has not been given to a description of forests, landscapes and other natural phenomena, which, more or less fertilise the reader's imagination. Short discourses have been introduced on social customs, such as, early marriage, child widows, waste in jewellery, nautches, etc., with their concomitant evils.

The inordinate delight exhibited by some voracious eaters at the sumptuous dinners given on the occasion Ranganatha's upanayanam and marriage, and, the bickerings of priests respecting their presents will not be uninteresting. Faith in black-art, observance of omens, consultation with astrologers, fasts, taking vows for appeasing the family deity, and dubiousness in choosing between the Eastern and the Western methods of medical treatment present one aspect of the home-life of the ordinary Hindu. The humor and intelligence displayed by 'Dhanistapanchami,' an old servant and fool, will I hope not be distasteful, and, his short

sketch of town-life with its stir and bustle, will be a contrast to the silent, peaceful and lovely mode of village-life.

Missionaries have been given their due praise for the interest they have been evincing in the education of the Indians and in the uplift of Audi Andhras. The Government has been thanked for the grant of freedom of press, speech and movement, and, for the interest evinced in diffusing education by increasing the number of schools year after year, notwithstanding the financial stress.

The heroine's address at Kesavapuram, and her advice to pupils may be read with advantage. When she was even a little girl, her love for neat and legible hand, and for drawing, is not unworthy of imitation. She was simple and modest in life and habits, a loving and dutiful child, a loyal citizen, and ever respectful to others particularly to teachers and elders. Offering prayers daily with a full belief in their efficacy, free discourse for its educative value and refining effect, a ruling passion to educate and advance women, and, straining every nerve to ameliorate the condition the Indian woman-hood—these will be found by t reader to be the main traits of the heroine.

The mode of punctuation observed is what is followed in English writings. Wherever a word, phrase or clause is punctuated by a comma, there is no 'Sandhi.' A true rendering of English expressions and quotations is given in many places, and, in portraying characters, a description of lines and lineaments is followed as in English novels.

Where there are no English equivalents to words such as, bicycle, automobile, aeroplane, railway station, platform, etc., they have been rendered into Telugu as ద్విచక్రి, స్వగమనరథము, గగనమార్గపునావ, ఇనుపదారిస్థలము, నిడుపుతిన్నె (దీర్ఘవేదిక) respectively.

If the book should be found to be of use to students for whom it is mainly intended, I shall feel amply rewarded for my pains.

A. KRISTNASWAMI AIYAR, B. A.

అవతారిక.

కం. దినదినము జనుల చెవులను
గనులను బడుబలుక నడవడికల నీగ్రంథం
బున సంభాషణములను
గనఁ బఱచితి విద్యార్థుల గమనముకొఱకున్.

కం. కొన్నినవీనాంశములును
గన్నెలవిద్ధవిషయములను గణియించుటతో
నెన్నియొ దురాచారంబులు
బన్నము సేయుట జూపితి భంజించుటకున్

కం. రచనకు మెచ్చుకొనఁ దగిన
రుచిరోక్తులు నర్థము దనరుమధురపాకం
బుచితమని తెలిసికొనియు వి
నిచితి విషయములమాత్రము నెఱుగమనముతోన్.

కం. తెనుఁగున నిపుణులనేకులు
వినుతి గలిగియుండఁగన్ విస్తృత భాషా
జ్ఞానములేక యొ వ్రాసితి
జనులదురాచారంబులఁ జోలించుటకై.

గ్రంథకర్త.

విషయసూచిక.

లతాంగి.

కం. శ్రీరాజితుఁ జిరకాలము
నారాధించిన మహానుల కాలింగన మి
చ్చిరమించి మోక్ష మొసఁగఁ
నారీ జన్మము నిచ్చిన నాథు నెఱుఁగుదున్.

కం. తనువుం దాఁకఁగఁ ద్రాఁచును
దన నైజగుణమడఁగి శాంతగానం బొందన్
తాన బల మెఱిఁగిన యెఱుక
వెనునియ్య సవారిచేయు వేలుపు దలఁతున్.

1–వ యధ్యాయము.

శ్రీమంతపల్లె; భద్రయ్యకు పుత్రోత్సవమును పుత్రికోద్భవమును.

ఇనుపదారికి మూఁడు యోజనముల దూరంబున శకటరమార్గమున వెళ్ళినచో, నానావిధ పరిమళ గంధద్రుమంబులచేతను మాలికావనంబులచేతను శోభితంబైన గున్నగట్లు దృశ్యమగుచున్నవి. వాటిమధ్యనిర్ఝరపోషితంబైన సెలయేఱొక్కటి 'అమృతవాహిని' యనంబరఁగి తనమధురోదకంబుచే భూసురాది జనవరులకు స్నానపానాదులను సమర్పించి నిరంత

రముఁ బోషించుచుండును. ఈ పుణ్యనదీ తీరంబున నదీమాతృక మధ్యంబున గొట్టిక యొక్కటి పిక్కటిల్లుచున్నది. ఈ వాసయోగ్యమైన దివ్యస్థలంబును 'శ్రీమంతపల్లె' యని లోకులు వాడుకొనుదురు. రమ్యమైన పైరుపచ్చలును మిక్కుటమైన యాప్పరిగెలును, యింటిగ్రుంగలఁ బోసియుండు సస్యపుప్రోగులును, యింటింటికి శోభనాంకమైన నారికేళకదళీవృక్షములును, ఊరిగ్రుంగలఁ గనఁబడు గోవ్రజములును భద్రవ్యూహములును—యీలాటి వైభవములఁగాంచియే 'శ్రీమంతపల్లె' యని నామంబిడిరో యనఁదగు. గ్రామ పరిసరంబున దీర్ఘశాఖలతోఁగూడిన బ్రహ్మాండ తింత్రిణీనక్తమాలమధూకమహీరుహంబులు మేఘమండలముఁ దాఁకఁ బోయినట్లు కనఁబడుచున్నవి. అవి గ్రామ సముదాయ వృక్షములట. వెండిపళ్ళెరముల కనర్హులైనవారు పత్రంబులను విస్తళ్ళుగా నుపయోగించు కొఱకోయన నటకుటంబులు దళంబులచే మెండుగ నిగిడియున్నవి. గ్రామమునకు మఱికొంత చేర్వంబోయిన శివాలయం బొండమరు. ఆలయంబెదుట రావిచెట్టొకటియు మూవంకల నుపవనమును స్థాపితమై యున్నవి. అందొక్కదిక్కున జంబీరరసాలకపిత్థపనసపాదపంబులును మఱొకదిక్కున రంభాలాంగలీవనంబును వర్ధిల్లుచున్నవి. దేవళంబునఁ ద్రికాలములలోను శంకరునికి డిండిమదుందుభి వాద్యంబులతోనుఁ గింకిణీలవంబులతోనుఁ బూజలు క్రమముగ జరుగుచున్నవి.

ఈ లక్ష్మీకరమైన గ్రామమున 'భద్రయ్య' యను బ్రాహ్మణోత్తముండు, తానుఁ దనపెద్దలుఁ దొలిఁ జేసిన పూజాఫలములవల్ల యథేష్టమైన ధనధాన్యసంపత్తులతోఁ గూడి, 'సుబ్బమ్మ' యను భాగ్యవతిని పెండ్లియాడి వర్ధిల్లుచుండె. ఇరువురికి వైశాఖ మాసంబున, 'బుధవారము, శుక్లపక్ష పంచమి, భరణీ నక్షత్రము, కన్యాలగ్నము'—యీ శుభవార శుభనక్షత్ర శుభముహూర్తంబున సీమంతపుత్రుఁడు దయంబయ్యె. పుత్రోద్భవమైనంతట భద్రయ్య 'ఓరి ధనిష్టాపంచమి' యని పిలిచినంతట "అయ్యా, చిత్తం!" అని సేవకుండు వచ్చి నిలఁబడె. "నాకు బుత్రోత్సవము గల్గినందులకు గ్రామము

లోని బంధుమిత్రాదులకు బులకండము నిచ్చిరమ్ము," అని భద్రయ్య యొక వెండితట్టయుఁ గల్కండ పొట్లములచే నింపబడిన సంచియొకటియు నొసంగెను నాటిఁ దీసికొని ధనిష్టాపంచమి వీధివెంబడి, బోవుచుండగ గ్రామరెడ్డిగా రతనిఁ బిలిచి, "మీ యజమానులువారింటి ముంజోరున మామిడి గుత్తులును వేపగుత్తులును జెక్కియున్నవి; ఏమి విశేషము?" అని యడిగెను.

"అయ్యా! మా యజమానులువారికి నేటిశుభదినమున నిరువది గడియలకు పైఁబడి సీమంతపుత్రుఁ డుదయంబైనందునఁ గండచెక్కెరఁ బంచి యిచ్చుచు వచ్చెద; ఇదిగో, మీ భాగము," అని యొకపొట్లమును రెడ్డిగారిచేత నిచ్చెను. రెడ్డిగారాపొట్లముఁ దీసికొని, "ఈ దినమే సుదినము," అనుచుండగ, ఓ అయ్యా, యని పిలిచినశబ్దము వినవచ్చి యిరువురును, "ఎవరక్కడ?' అని యడిగిరి.

"ఏను వీరుఁడయ్యా! అయ్యగార్కి కృషిచేయు భృత్యుండను," అని యొకఁడు చెప్పె.

"వీరా! ఏమిసమాచారము?" అని, ధనిష్టాపంచమి యడుగ, "అయ్యా ఏను నాభార్యయు మన పొడికడ గలుపుతీయుచుంటిమి; పగలు రెండు గంటలకు నాభార్యకు కానుపు నొప్పులు కనిపించి మఱియుంచేన అత్తిమ్రాని కడను, ఒక మగబిడ్డను కనినదయ్యా; అంబలియు సద్దిగంజియు వెచ్చచేసి యిచ్చుటకు యెందు పుల్లల నేఱుకొనవలెను; కనుక మేమిరువురము మా కొంపకువెళ్ళి తెప్పుతెల్లవాఱి కలుపుతీయను వచ్చెదము. ఈ సమాచారము నేలినవారి చెవులఁ బడవేయుమయ్యా!" అని, వీరుఁడు పల్కెను.

"మంచిది! ఇంటికివెళ్ళి తెపుతప్పకరండు," అని, ధనిష్టాపంచమి చెప్పినంతట వీరుఁడు తనగుడిసెకు వెళ్ళెను.

"ఇదేమివింత! నిషాదకులస్థుఁడైన వీరునికిని విప్రవరుడైన మీ యజమానులువారికిని నేకకాలమున మగబిడ్డలుదయంబైరి. (మందహాసముతో) ఈపొట్లు మిద్దఱి బిడ్డలకా?" అని రెడ్డి యడిగెను.

"అందుకు సందియమెందుకు?" అనుచు నింకొక పొట్లమునిచ్చి, ధనిష్ఠాపంచమి మిత్రపరిచయవర్గములకుఁ జేసియొక పొట్లము నిచ్చుచుఁ దన యజమానులువారికిఁ బుత్రోత్సవమైన వృత్తాంతమును వెల్లడించి యిల్లుఁ జేరెను.

"ఓరి, ధనిష్ఠాపంచమి! పులకండముఁ బంచి యిచ్చితివా?" అని, భద్రయ్య యడుగ, "ఇచ్చివచ్చినాను, దేవర! ఒక్కచోద్యమైన సమాచారము," అని, ధ- పంచమి చెప్పెను.

"ఏమిసమాచారము?"

"ఏనురెడ్డిగారి యింటియొద్ద నిలిచియుండఁగ, మన వీరుఁడు 'ఓఅయ్యా,' అని కూఁతలువెట్టి పిలిచి, తానుఁ దన యిల్లాలును మనమడికడను కలుపుతీయుచుండఁగ, తన భార్యకు నడుమునొప్పియెత్తి పగలు రెండు గంటలకు మడియంచున నత్తిమ్రానిక్రింద మగబిడ్డను గనినట్లును, యింటికి వెళ్ళి గంజివెచ్చ చేసి తనభార్యను త్రాగించి రేపువచ్చునట్లుచెప్పి వెళ్ళెను, దేవర!" "ఔర! నిజమా? ఈవిషయమును జ్యోస్యులవారితోఁ జెప్పి వారే మనుచున్నారో తెలిసికొనవలెను," అని, యచ్చెరువొందెను.

సుబ్బమ్మకుఁ బ్రసవమైన మూఁడవదినము పథ్యముఁ జేయించి, తల్లియు బిడ్డయు సౌఖ్యముగనుండిరి. ఎదిమిదవదినము సూర్యోదయంబైనంతట, భద్రయ్య ధనిష్ఠాపంచమినిఁ బిలిచి "రేపుసాయంత్రమును నాల్గవనాటి యుదయమునను, యీరెండు పూఁటలును మంగళవాద్యముతో వచ్చి మన యింటిముందఱ వాద్యమువాయించి వెళ్ళునటుల మంగళపాఠకులకుఁ జెప్పిరమ్ము; గ్రామజ్యోస్యులయొద్ద జని మందవారముదయంబేడు గంటలకు వచ్చి పొమ్మని పిలిచిరమ్ము; మన పురోహితులైన సుబ్బాశాస్త్రిలు వారింటికిఁ జని మందవారమునాఁడు రాహుకాలము వచ్చుటకుమునుపు మంగళస్నానమును బుణ్యావాహచనమును జేరగవలసియుండుటచేత జాగ్రతకొని ముందుగరమ్మని చెప్పిరమ్ము," అని చెప్పగ, "చిత్తం, బాబు!"

అనుచు ధ-పంచమి వీధికి వెళ్ళెను. బిడ్డజనియించిన నవమదినమైన శుక్లపక్ష త్రయోదశితోఁ గూడిన గురువారమునాటిసాయంత్రము మువ్వురవీధిలోఁ జుక్కలదొర బయలువెడలి వెలుంగుచున్న చల్లనివేళలో, మంజులమైన మంగళవాద్యములు వాఁగుచుండఁగ నిరుగుపొరుగున నుండిన మగువలుఁ గొందఱుకూడిరి. అపుడు సుబ్బమ్మ తల్లిగారు చెలువొందు జోలనుఁ దగిలించి, యందులోఁ బ్రన్నని పాన్పుఁబఱచి, పాపను పాన్పుపైఁ బరుండఁబెట్టి, పాపయొక్క కరములకుఁ బైడికడియములును, పాదములకు వెండిగాజులునుఁ దొడిగి, కౌనుకుఁ బసిడిపూసలంగట్టి, బంగరుతీఁగలచేనల్లిన సరుల మెడచుట్టు వ్రేలాడవేసె. పసిపాప 'క్వా', 'క్వా' యని యేడ్వఁగ నాఁకూఁతల ముద్దుగుమ్మ లాలించి సొంపుగాంచుచుండఁగ నొకరియెలనాఁగ 'చిన్నారి పొన్నారి' యని యూయలపాటలఁ బాడుచు నూయేల నూఁచుచుండె. భద్రయ్య తన తల్లినిఁ బిలిచి యీమె పౌత్రుని కేమి నామధేయం బిడవలెనని యడిగెను.

"చిత్తం! ఒక మనవి; మనవీరుని కుమారుఁ డత్తిమ్రానిక్రింద బుట్టినందున, 'అత్తి'యని పేరట; మనబిడ్డ సంపత్తులోఁ బుట్టినందున 'సంపత్తు' అని పేరుంచుట సహజము," అని, ధ-పంచమి చెప్పెను.

"ఓరి వెఱ్ఱివిధవా! ఊరకుండుము!" అని, భద్రయ్య కినుకతోఁ బలుకుచుండఁగ, "బిడ్డకు తాతగారైన మీనాయన పేరుఁ బెట్టుట సహజము" అని భద్రయ్య తల్లిగారు చెప్పిరి.

"అలాగే! అందుకేమి యభ్యంతరము," అని భద్రయ్య చెప్పినంతట నచటఁగూడి యుండిన ముత్తయిదువలలో నొకముదుసలి, 'రంగనాధ' యని పేరుంచి, "రంగనాధ! నా యుపరంజితిలక, ఏడవక నిదురపొమ్మ!" అని, యూయలపాటలఁ బాడుచుండఁగఁ జెలియలలోఁ గొందఱు నూయలనూఁచుచుండిరి. వాల్గంటి యొక్కతె శిశువుకు హారతిఁ జెట్టి వీధిముందఱ బోసివచ్చె. ముగుదలందఱుఁ బసుపుఁ బూసికొనియుఁ గుంకుమ తిలకం

ఱుఁ బెట్టుకొనియుఁ జెఱియొక నవాతిపాట్లమునుఁ బసుపు కొమ్మతోఁ దాంబూలమునుఁ జేత గ్రహించి తమతమ యిండ్లకుఁ జనిరి.

"నేఁడు స్థిరవారము; మంగళవాద్యములను శ్రవించుచున్నాఁడను. ఈలాగే నెప్పుడు మంగళకరముగ నుండుగాక!" అని, మూఁడవనాఁటి యుదయంబున జోస్యుండు దీవించుచు వచ్చిన నతనికి భద్రయ్య నమస్కారములు సమర్పించి యొకయాసనంబునఁ గూర్చుండఁ జేసి, "పదిదినముల క్రిందట నాకు సుతుఁడు జనియించె; పురుఁడు తీరినవెనుక జాతకము వ్రాయింపవలెనని యభిప్రాయముకొనియుంటి; నేఁడు పుణ్యాహవాచనమైనందున సుదినముగ నున్నది; కనుక, నేటికి జాతకము గుర్తింపవలెనని నాతల్లిగారి యభీష్టము. అందుచేతఁ దమను రప్పింపనైతి; శ్రమపెట్టినందుకు క్షమియింపఁగోరెద," అని, భద్రయ్య చేమోడ్పులతోఁ గూరుచుండె. జోస్యుండు, "తమకు పుత్రోదయమైన శుభవార్తను జననమునాఁడే ధ-పంచమివల్లఁ దెలిసికొంటి; అతఁడు లగ్నభావముల నడిగి తెలిసికొని, సంతసించి, జంటపులకండపుపాట్లముల నొసంగె; అయినను దాము కోరుటచేత నిదిగో, లగ్నభావముల గుర్తించెద," అనుచుఁ బలకమీఁదఁ గొన్ని లెక్కలువ్రాసె; పిదప, యొకకాగితమున జనన వర్ష మాస తిథివార నక్షత్రములనువ్రాసి, దిగువ రాశ్యాంశచక్రములలో నవగ్రహస్థానములఁ జూపి, యాకాగితమునకుఁ గుంకుమ నంటించి, దానిని భద్రయ్యచేత నిచ్చుచు,

"ఈజాతకునికి నాయుస్థానము చక్కగనున్నది; మాతాపితలకు దోషమేదియు లేదు; జీవనస్థానమును గురువు వీక్షించుట శ్లాఘ్యము," అనుచుండఁగ, "తాము చెప్పినంతమాత్రము చాలుతృప్తికరముగ నున్నది," అని భద్రయ్య చెప్పి, జోస్యులవారి శ్రమపరిహారార్థమై తానిచ్చు తాంబూలమునుఁ బరిగ్రహించుమనట్లు ప్రార్థించె. జోస్యుఁడును సదక్షిణ తాంబూలమును గ్రహించుచు, "నాకు తాంబూలమేల? నన్నుఁ బిలిపించిన, వారితో

వచ్చి నాకు తెలిసినంత చెప్పిపోయెద; మనయింటి శుభవార్త విన్నతోడనే తాము పిలిపింపక వచ్చియుందురు; రెడ్డినాండ్రును నాయుండ్రును నాయల్పగృహముఁ గనిపట్టివచ్చి, వారిజాతకముల ననుసరించి యోగభావముల నడుగుచుండుటచేత వారికిఁదగిన యుత్తరమిచ్చుచు, వారితోఁ బ్రొద్దు సరిపోవుచుండె," అని చెప్పి, దక్షిణను నడుమునఁ జెక్కుకొని, తాంబూలమును జేతఁబట్టుకొని, లేచె.

"జోస్యులార! నాకు పుత్రుఁడు పుట్టిన లగ్నమందే మాల వీరుని భార్య మడియుంచిన నత్తిమ్రానిక్రింద నొకమగబిడ్డను గనినదట; ఈ రెండు బిడ్డలకు భావభేదము లుండునా?" అని, భద్రయ్య యడిగెను.

"లగ్న మొక్కటైనఁ జాలునా? కులము, వర్ణము, స్థానము—యివియుఁ బొందియుండవలదా? అనుభవమునఁ జూడవలెను."

ఇటు సంభాషించినవెనుక, భద్రయ్య ధ-పంచమినిఁ బిలిచి, పురోహితుం డావలకు రానందున నతనిఁబిలిచి రమ్మనిపనిపె. కొంతసేపటికి ధ-పంచమి క్రమ్మఱి, "నేఁడు రెడ్డిగారింట రెడ్డిగారి తండ్రికిఁ గర్మంబట; కర్మాదులను మనపురోహితులే చేయించుచున్నారు; పిలిచినందుకుఁ ద్వరలో వచ్చునట్లు చెప్పి, కర్మముఁ దాను జరిపించువిషయమునుఁ దమచెవులఁ బడ వేయవలదని చెప్పిరి, బాబు," అనెను.

"మంగళకార్యమును ముందువెట్టుకొని యమంగళకార్యమును జరుపుట యసహ్యముగ నున్నది; పురోహితుల యవలక్షణ మీలాగ! వారికి ద్రవ్యాపేక్షయే ముఖ్యము," అని, భద్రయ్య కనుబొమల ముడుచుకొనెను. కొంతసేపు తాళి నిలవఁబడియుండిన జోస్యునిఁగని భోజనతాంబూలములకు నిలిచిపొమ్మని ప్రార్థింపఁగ బూజుఁ జేసికొని గ్రక్కున మళ్ళునట్లు చెప్పి జోస్యుండు బహిర్గమనుండయ్యె. పురోహితులైన సుబ్బాశాస్త్రులు దూర్గంబున వీధిఁ జనుచుండిన గణకునిఁగని, "ఎందాక వెళ్ళి సరసర వచ్చెదరు? తాంబూల మెక్కడిది?" అని, యడిగిరి.

"తాము రాలేదని భద్రయ్యగారు కోపముతో నుండెదరు. బిడ్డ జాతకము గుర్తించినందుకు తాంబూలము ప్రాప్తంబయ్యె."

"ఫలప్రాప్తమెంత?"

"ఏకశ్వేతమే!" అనుచు, జ్యోతిష్యుండు చెచ్చెరఁ జనుచుండె. భద్రయ్య పురోహితుల రాకంగని యతని కభిముఖ గమనుండై స్వాగత మిచ్చి, వారి పాదములకెరఁగి, "ఆలసించి విజయము చేసినందుకుఁ దమ కెట్టి యపచారముఁ జేసితినో?" అని చెప్పగ, "అపచారమేదియులేదు," అనుచు, పురోహితుండు, "దీర్ఘాయుష్యమస్తు," అని, దీవించి మంగళాక్షతల నానతదేహుండై నిలఁబడియుండిన భద్రయ్య శిరంబుమీఁద వర్షించి, కూర్చుండుమనెను.

"ధన్యోస్మి," అనుచు, భద్రయ్య కూర్చుండి, "పుణ్యాహవాచనము ముగియువేళకు భోజనమునకుఁ గాలాతీతమగునోయని వెరచెద," అని, చెప్పెను. "హోమమునకు వలసిన తండులము, ఘృతము మొదలగు సామగ్రులను సిద్ధపఱచుకొనునంతలో రాహుకాలము గతమగును; సంక్షేపముగ శీఘ్రములో ముగియించెద," అని పురోహితుండు వచించెను. కొంతసేపటికి భద్రయ్య గడియారముఁజూచి, "రాహుకాలము గతించె; ఎవరక్కడ! మంగళవాద్యం!" అని యఱచిన, వాద్యములు ఘోషింపఁ దొడఁగె. పురోహితుండు మంత్రపఠనముతో హోమంబుఁ జేయించి, పురుటింటికిఁ గలశతీర్థముఁ బ్రోక్షించి, తుదకు, "మంత్రలోపే క్రియాలోపే కించిత్ హిరణ్యదానంకరిష్యే" -అని, వాక్యము ముగియించేటకు మునుపు, భద్రయ్య కనలి, "ఆహా! స్వామీ! ఇంతడబ్బు ఖర్చు చేసియు మంత్రలోపములునుఁ గ్రియాలోపములును నేల? హిరణ్యదానమేల? ముందుగా జాగ్రతగానివచ్చి ప్రారంభించి యుండిన క్రియామంత్రలోపములకును హిరణ్యదానమునకును హేతువును నావశ్యకమును లేకయుండును గద!" అని చీదఱగొనెను.

"భద్రయ్యగారు! కోపతాపములఁ బడకుఁడు; మంత్రలోపములు లేవు! క్రియాలోపములును లేవు! ఏఁ జెప్పినమాటలు మంత్రములలోఁ గలసియున్నవి. అందుకు నేనేమి చేయఁగలను?"

"చిత్తం! మనరెడ్డిగారింట మనపురోహితుండు 'మంత్రలోపే క్రియాలోపే' యనిపల్కరుఁ జెప్పి, తడవకు పైసా తీసికొనుచుండగా, రెడ్డిగారలిగి, "అయ్యవారా! అడుగడుగుకు పైసా యడుగవద్దు; తుద కొక్కతేపగ నిచ్చెద," అనిరి. తాము తడవకొక్కరూపాయ నిచ్చియుఁ దమకు నాలాగే చెప్పిరి. 'కించిత్ హిరణ్యదానం', అను మాటలు పురోహితుల తంత్రములకు సంబంధించినవికాని మంత్రములకు సంబంధపడినవి కావు," అని, ధ-పంచమి చెప్పెను.

"ఓరి, యధికప్రసంగి! ఊరకుండుము! అమంగళములో జరిగిన విషయములను మంగళకార్యము జరిగెడి తరుణమునఁ జెప్పరాదు," అని భద్రయ్య కోపగిల్లె. వెంటనే సేవకుండు వీధి గుమ్మమునకుఁ దిన్నగ జరిగెను. పురోహితుండు భద్రయ్యఁజూచి, "ఇట్టి శుభ ప్రస్తుతకాలమునఁ బండ్రెండార్ల జతను బృహస్పతి సంభావనచేయవలసిన విధియు మామూలును నున్నవి. తాము జననంబైన కాలమునఁ దమతండ్రిగారు నాయప్పగారికి దోవతులు సంభావనచేసిరి! కనుక, తామిప్పుడు నాకు సంభావన చేయవలెను," అని, వాక్రుచ్చెను. భద్రయ్య తనతల్లినిఁ బిలిచి పురోహితుండాడినమాటల వినెనాయని యడుగ యామె విన్నట్టును దోవతులుఁ దీసియీవలసినట్లునుఁ జెప్పె. తోడుతో భద్రయ్య సేవకునిఁబిలిచి మిరియాలశెట్టి యంగడికివెళ్ళి పదిరూపాయలధరలో రెలం గుండంచుపండ్రెండార్లు జత యొక్కటి తక్షణమే కొనిరమ్మని యాజ్ఞాపించుచు నతనిచేతఁ బదిరూపాయల నోటొక్కటిఁబెట్టె. సేవకుండు వణిక్పథమునకేగి, "అయ్యా, మిరియాలశెట్టి?" అని యొక దుకాణమున నఱచిన, "ఏమి కావలెనయ్యా?" అని యొకశెట్టి యడిగె.

"సేలం గుండంచు పండ్రెండాంర్లజత జోళ్ళు," అని యడుగ శెట్టి నాలుఁగు రకములఁ జూపి వాటి ధరలు వాటిమీఁద వ్రాయఁబడి యున్న దని చెప్పె. ధ-పంచమి యొక కంబియంచు దోవతి జతఁ జేతఁ బట్టుకొని దాని ధర యెంతయని యడిగె.

"దోవతిపై వ్రాసియుండు విలాసముప్రకార మూడురూపాయలు పట్టుబడి ! అందుపై రూపాయయొక్కటికి లాభ మొక్కణా."

"శెట్టిగారు ! రొక్క మిచ్చెదను ; (డిస్కవుంటు) త్రోపుడెంత ?"

"నా యంగడిలో త్రోపుడను మాటలేదయ్యా."

"ఇత్తిగ రూపాయలిచ్చెద."

"అసలుపట్టుబడి చేతుక్కపగడ."

"అఱుంపాతిక."

"గిట్టుబడిలేదయ్యా"

"అఱున్నర."

"గిట్టదయ్యా."

"అఱున్నరాపరక ; అంతకు మించి యీయను ; ప్రక్కని యంగడికిఁ బెళ్ళుదు."

"దోవతు లెవరికయ్యా ?"

"పురోహితులకు సంభావనచేయుటకు."

"అయ్యో ! దండుగ శెలవుకా ! నాకు నష్టమైన గొదవలేదు ; కొని పొమ్ము."

"నాకు (కమిషన్) తఱుగెంత ?"

"కమిషన్ గిమిషన్ అనకుము."

"రేపు మఱునాఁడు బేరములఁ దెచ్చెద ; తఱుగు లేదనినఁ బొరుగంగడికి వెళ్ళెద."

"ఈయని పొండరికఁ దగిన విడువని పొండికట్టిగ నున్నాడవు; పసుపు కరవీసంరూపాయఁ దొలఁచెన ; బేరాలన్నిటిని నా యంగడికి

తెమ్ము," అని శెట్టి పదిరూపాయల నోటునుఁ దీసికొని మూఁడుంపాతికా వీసమరవీసం రూపాయలు దిగువపైచి, యింకొక తట్టరవీసం రూపాయను పసుపుకై యుంచెను.

"శెట్టిగారు ! మిరియాలశెట్టియని పేరేలకల్గె ?"

"ఏనాఁడో నాకన్నయ్య మిరియాల వ్యాపారము జేసిరట; ఆనాటి నుండి మిరియాలశెట్టియని జనులు వాడుకొనియెదరు."

"మంచిది, శెట్టిగారు ! నాచేత నుండిన నోటునుఁ దమచేతఁ బెట్టితి; అలాగున నాకు జేరవలసిన రూపాయల నాచేతఁ బెట్టక యెందుకు దిగువ నుంచినారు?"

"రూపాయలఁ జేతఁ దీసికొందుగాని నాచేతులార నింకొకరికీయము; లచ్చిని నంగీకరింపవచ్చుగాని పరుల కిచ్చి వెళ్ళగొట్టవచ్చునా?"

"నాకు జేరవలసిన రూపాయల నాచేతఁబెట్టుట కభ్యంతర మేమి?"

"మాకుల దైవము మాజాతివారిని శోధించే నిమిత్తముఁ బూర్వకాలంబున మా పెద్దల యెదుట 'చిన్నమ్మ' పెద్దమ్మ' యను రెండు రూపంబుల నెత్తికొని నిలఁబడి, వారిరువురిలో నెవతె లెస్సయని యడిగిరట! ఇరువురికిని మావాండ్రు సమాధానముగ నడచుకొన వలసినవారై యిరువురిని రెండు బారల దూరము నడచిపోయి రమ్మనిరట; ఇరుగురు మరలి వచ్చినంతట 'చిన్నమ్మ వచ్చుచుండిన ముందుప్రక్క లెస్స; పెద్దమ్మ పోవుచుండిన వెనుకప్రక్క లెస్స యనిరట; ఇద్దఱును సంతృప్తిఁజెందిరట; అది మొదలు మావారింటికి చిన్నామె వచ్చుచున్నదట; పెద్దామె మమ్మువదలి పోవుచున్నదట ; ఈకారణముచేత మాకులస్థులు లచ్చిని నంగీకరింతురేగాని యింకొకరిచేతఁ బెట్టి వెళ్ళగొట్టరు"

"ఈనాగరికమైన కాలమున నిట్టి యవ్వకథల నమ్ముచున్నారా ! మంచిది ! ఇఁకనైన నాలాగే చేయుడు", అని, ధ-పంచమి రూపాయల నెత్తికొని, "శెట్టిగారు ! జవళియంగడిలో నెల్లకరంబులయందు బంగారమును

టేల? దాని మీఁదఁ గూర్చుండి ధరవిషయమై యెంతబొంకినా బొంకవచ్చునట; నిజమా?" అని యడిగెను.

"పరిహాసమునకు జెప్పుకొనుటగాని నిజముకాదు; కప్పుకంబళిమీఁదఁ గూర్చుండి వెలఁజెప్పి విక్రయించుట మామూలు."

"దండములు, శెట్టిగారు," అని చెప్పి, ధ-పంచమి దోవతి జేతనుఁ గ్రిన్ననఁ గొంపోయి భద్రయ్యయొద్దఁ బెట్టెను.

"ఎందుకింత తామసించివచ్చితివి? ఇంతలఘువైన వెలలో నీదోవతి నెందుకు తెచ్చితివి? దీని ధరయెంత?" అని, భద్రయ్య యడుగగ నంగడిలో జరిగిన వృత్తాంతములను సేవకుండు సవిస్తరముగఁజెప్పి, రూపాయలను జిల్లర నాణెములను భద్రయ్య ప్రాపునఁబెట్టి వీధినడవకు జేరెను. భద్రయ్య యొకశ్వేతహరివాణంబునఁ దద్వస్త్రయుగంబును నారికేళ కదళీఫలపుష్పయుత తాంబూలమునుఁ గూర్చి, చేఁబంచ రూపాయలఁబెట్టి బృహస్పతి సంభావనయని పురోహితునికొసంగ నతండు కుతూహలంబుతో హరివాణమును లాగుకొని, ఫలపుష్పాదుల నొకజీర్ణ చేలంబున బంధించుచుండగ, ధ-పంచమి, "స్వామీ! పరాకునఁ బళ్ళెయముకు మూటలోఁ గట్టివేయుదురని వెరచెద; అందుచేత దట్టను నాచేతి కందఁజేసిన దానిఁ గదిలోఁ బెట్టివచ్చెద," అనెను

"ఓరి శుంఠకాయ! బయటికి వెళ్లుము," అని భద్రయ్య గొప్పధ్వనితోఁ జెప్పినంతట, సేవకుండు చెప్పుడుసేయక యుఱికెను.

అనంతరము, విప్రవరులు కదళీ పలాశములలో మెండుగ వడ్డింపబడిన పంచభక్ష్య పరమాన్నాదుల భోజనము చేసి హరిచందనలిప్తాంగులై తమతమ నివాసములకుఁ జనిరి. ఆఱవ మాసంబున రంగనాధునికి నన్నప్రాశనంబును మఱు సంవత్సరము చౌలంబునుఁ గ్రమేణ జరిగి యైదవవత్సరము, గురువారము, హస్తా నక్షత్రయుక్త చౌతి నాటి యుదయంబున నక్షరారంభము చేయఁబడి బోర్డుబడియందుఁ జదువవేయఁబడెను.

ఆసంవత్సరమే కార్తికమాసంబునఁ బూర్ణిమతిథితోఁ గూడిన శుక్రవారము నాఁడు, కన్యాలగ్నంబున శ్రీభద్రయ్యగారికి కథానాయికయైన సుపుత్రి జననంబయ్యె. ఎన్నిపుత్రులుండినను స్వగృహమునఁ బరిణయవైభవములఁ గాంచుటకుఁ దరుణములేకున్నదను కొఱఁత యీసుపుత్రి జననమువల్ల నివారణయయ్యె. జన్మించిన తొమ్మిదవ పదునొకటవ దివసంబులలో రంగనాధునికి జరిగించిన వైభవములకుఁ బ్రాబల్యముగను నెక్కువమక్కువతోను నామకరణ పుణ్యాహవాచనములు జరుపబడెను. సన్నని మేనితోఁబుట్టినందున నీ సుతకు 'లతాంగి' యని నామకరణంబయ్యె నింటను బంధుమిత్రవర్గములందును 'లత' యను ముద్దునామమే ప్రాయికముగ వాడబడుచుండె.

2, వ, అధ్యాయము.

రంగనాధుఁడు బడిలోఁ జదువుకొనుట.

సేవకుండనుదినము రంగనాధుని బడికి దోడ్కొని వెళ్లుచు సాయంత్ర మింటికి మరలునపుడు బాలునితో దాఁగూడవచ్చుచుండె. బాలుండు దినపాఠములఁ గ్రమముగ నొప్పించుచువచ్చినందున ప్రతిసంవత్సరముఁ బొడుగుతరగతికిఁ బోవుచు, నాల్గవవత్సరము నాలుగవ తరగతిలోఁ బదుగురు బాలురతోఁ జదువుచుండె. ఒకనాఁడు సందెవేళ సేవకుండు పాఠశాలకు వెళ్ళి, రంగనాధుని నింటికిఁ దోడ్కొనిపోను నిలువఁబడియుండె. మారయ్య యను పేరువహించిన యుపాధ్యాయుండు బాలురంగని, "బాలురార! నేటికి మిమ్ములనందఱిని నోటిలెక్కలలోఁ బరీక్షించెద," అని, మొదట కూర్చుండిన రంగనాధునిఁ జూచి, "నీతండ్రి నీతల్లియొద్ద పదిరూపాయల నిచ్చిపెట్టి యొకటిం పరకరూపాయ యొకతేపను మఱొకతేప రెండుం పాతిక రూపాయలును వెంటనే పాతికాపరకరూపాయలుఁ దీసికొని, వెనువెంటనే రూపాయలడిగిన నీతల్లి నీతండ్రి కేమియిచ్చె?" అని, యడిగెను.

రంగనాథుఁడు లేచి మిణుకరించుచుండుటం గనుంగొనిన ధ-పంచమి, "వెంటనే తీసికొనివదిగాక వెనువెంటనే రూపాయలడిగిన నాతల్లి చెంపమీఁద నే యిచ్చెనని చెప్పుము, రంగనాథా! ఎందుకు మిణుకరించుచున్నావు?" అని చెప్పెను. ఈమాటలను వినినంతట నుపాధ్యాయుండు తనకండ్ల నెఱ్ఱఁజేసికొని, భీకరమైన దృష్టితో దేఱిచూచుచు, "నీవెవ్వండవు? ఎందుకొఱకు వచ్చినావు?" అని, యడిగె. ధ. పంచమి రంగనాథుని నింటికిఁదోడుకొని వెళ్ళవచ్చినట్లు వాకుచ్చెను. అందుమీఁద నుపాధ్యాయుండు గర్జించి, కండ్లను 'కటకట' యని కఱచుచు ధ-పంచమిని బయటికి వెళ్లునటుల యాజ్ఞాపించె. "నిజమే చెప్పినానయ్యా," అనుచు, ధ-పంచమి కొంతదూరము జెఱిగి, నిలువబడియుండె. రంగనాథుఁడు నిలిచినది నిలిచినట్టేయుండి జవాబేదియు నీయకయుండె. మారయ్య, "మీతాత వలసినంత స్థితిని సంపాదించిపెట్టి పోయినందున నీకు జెమువునం దక్కువ లేనట్టున్నది," అనుచు రెండవస్థానమునఁ గూర్చుండియుండిన గ్రామరెడ్డిగారి కుమారుండైన నాగిరెడ్డి యను పసివాని కదే ప్రశ్న వేయుగ నతఁడులేచి నిలఁబడి, 'తనతల్లియిచ్చెనో యీయదో,' యని తనలోఁదాను సందియపడుచుఁ గొంత ధైర్యముఁ దెచ్చుకొని, "సార్, నాతల్లి యిచ్చెనో యీయదో," అని, దీననాదంబుతోఁ జెప్పికూర్చుండెను. "నీవు గ్రామాధికారిబిడ్డవు! నీకు జెమువునం దక్కువ లేదు," అనుచు, మూఁడవబాలుండైన సావుకార్ బీరశెట్టిపట్టి, జీరుశెట్టి యను పిన్నవాని నడుగ, నతఁడు నిలఁబడి దిగువఁజూచుచు "నాతల్లి మొదటినుండి యేదియు నీయదు," అనెను.

"నీవు సావుకారి బిడ్డవు," అని చెప్పి, యుపాధ్యాయుండు నాలుగు మొదలు సప్తమస్థానము వఱకుంగల పిల్లగాండ్రను వరుసక్రమముగ నడిగినందు కెవ్వండేనియుఁ బ్రత్యుత్తర మీయకపోయె. అటువెనుక, యెనిమిదవ మాణవకుఁడైన కుంభకారుని కుమారునిఁజూచి యదే ప్రశ్న నేస్య కొండికవాఁడు లేచి, "నాతల్లి చెంపమీఁద నే యిచ్చె," అని నంతట, మార

య్య కనలి, కండ్లను దోరపండ్లవలెం జేసికొని, యొక్కఁదాటునఁ బసివాని ప్రక్కనఁ బోయి తనకుడి యఱచెయితో బాలుని యెడమచెంపమీఁదను నెడమ చేయితోఁ గుడిదవడమీఁదను 'ఫళఫళ' యని వాయించుచు, "ఏమి యిచ్చెను? చెప్పుము?" అని, యడిగెను. బాలుఁడు కంటినుండి నీటిధార లొలుకగ గొంతెత్తి యేడ్చుచు, "అయ్యా! అయ్యా!" అని, కూఁతలువెట్టెను. ఒక్కటే విధమున దండించిన సారస్యము లేదనిపించుటకును దండనోపాయంబులలోఁ బృథగ్విధంబు లుండుటను నిరూపించుటకును నుపాధ్యాయుండు, "అఱవక! అఱవక!" అనుచుఁ దన పెనుబ్రేలు, జొట్టనవ్రేలు వీటితో, 'తొడపాయసంబను దండవను విధించెను. చిన్నవాఁడు వ్యథవస్త్రిండై దిసమొలతోను బాష్పంబులతోను, 'మోర, మెడ, దేహము' వీటిని వంకరసొంకరగఁ ద్రిప్పుచు, "మాయమ్మ యిచ్చెనయ్యా," అని, ధ్వనిచేసెను. పిమ్మట, మారయ్య తొమ్మిదవ బాలుండైన తక్షకునికడ నేగి, యతని వీనులనులుముచు, నీతల్లి యిచ్చెనా?" అని, యడుగ, బాలుండు, 'ఓ' యని క్రందన మొనర్చుచు, "సార్! ఇచ్చెను," అని, వణకుచుఁ జెప్పెను. పదియవస్థానమున నుండిన జాబాల బాలునియొద్దఁ జేరి, యతనిఁ గోదండముఁ బెట్టి, "నీతల్లి యిచ్చెనా!" అని యడుగ, "సార్, యిచ్చెను," అని, యాక్రందన ధ్వనితోఁ జెప్పె. అనంతరము, మారయ్య, 'హుఁ' అని, హుంకరించుచుఁ దనస్థానమున కరుదెంచి, దృఢస్వరంబుతోను దీక్ష్ణ దృష్టితోను, 'బాలురార,' యని సంబోధించి, "ఇపుడు చెప్పుడు; ఇచ్చెనా?" అని, యడిగె. బాలురందఱులేచి యొక్కగొంతున నిచ్చెనని చెప్పి నేలఁ జూచుచుండిరి.

"ఏమి యిచ్చెను?" అని, మారయ్య ప్రశ్నింపగ, బాలురుత్తర మీయలేక తమతమశిరంబులఁ గ్రిందవ్రేలాడవేసి రోదనమున కారంభము చేయు సమయమున, "మంచిది! నేఁడికఱకుఁ జాలును," అని, యుపాధ్యాయుండు బహిర్గమనుండయ్యె. చుట్టుకొని యుండిన పిల్లలందఱు నందు

మొగములతో నిండ్లకరిగిరి. కుమ్మరపిల్లగాఁడు గళిత చేలమును ధరించుకొని తొమ్మిదవ పదియవ స్థానముల బాలురతోఁ గూడుకొని, మువ్వురుఁ దమపంచలతోఁ గన్నీటిఁ దుడుచుకొనుచుఁ జిన్నవోయిన వదనములతో నింటికిఁజనిరి.

రంగనాథుఁ డింటికివచ్చి తల్లినిఁజూచి, "అమ్మా! అయ్యవారు తిట్టికొట్టిరి," అనుచు వాపోయెను. తల్లి తనయునిఁ గౌగిటం జేర్చి, "ఏడ్వకరా, అబ్బ! నాకొక్క కుమారుఁడవు; నినుమొత్తి నాకనులారఁ జూచి ప్రాణము నుంచుకొందునా? నీయప్పగారితోఁ జెప్పి బోధకుని ఖండింపఁ జేసెద," అనుచు, దనపైటఁ దనకండ్లపై యదుముకొనె. తోడుతో రంగనాథుని దేహమును మెల్లఁగ స్పృశించి, "అయ్యో! మైచెమరించుచున్నదే! బిడ్డ నీళ్లునీళ్లుగఁ బోవుచున్నాఁడే!" అని, తన చెఱఁగుతో స్వేదముఁ దుడుచుచు, "నాయనా! ఎందుకుకొట్టిరి?" అని, యడుగ రంగనాథుఁడు గొప్పధ్వనితో రోదనము చేయుచు ధనిష్ఠాపంచమిని నడుగుమని చెప్పె.

"ఓరి,పంచమి! శిక్షకుండెందుకు నాబిడ్డను మొత్తినాడు?"

"అయ్యవార్కి నేత్రములు సూక్ష్మము; హృదయమోపాషాణముకంటెజఠరము; కనుక, పిల్లగాండ్రను మొత్తి, చంపిరి, తల్లీ!"

"ఏకారణముంబట్టి కొట్టిరి?"

"నోటిలెక్కలలోఁ బరీక్షించిరి. నీతల్లియొద్ద నీతండ్రి పదిరూపాయల నిచ్చిపెట్టి, యొకటిం పాతికరూపాయ యొక తేపయు రెండుం పాతికరూపాయ లింకొకతేపయు వెంటనే పాతికాపరకా వీసం రూపాయయుఁ దీసికొని, వెనువెంటనే రూపాయలడిగిన నీతల్లి నీతండ్రి కేమి యిచ్చునని యడిగె. అందుకు మనపిల్లకాయ ప్రతివాక్యమీయలేక మిణకరించుచుండె. రూపాయలు మూఁడు తడవలఁ దీసికొనినదిగాక వెనువెంటనే రూపాయలనడిగిన నాతల్లి చెంపమీఁదనే యిచ్చునని చెప్పుము, రంగనాథా, యన్నాను. ఉపాధ్యాయుండు నను బెదరించి బయటికిఁ బంపినవెనుక,

యేను చెప్పిన జవాబుఁ జెప్పినందుకుఁ జెంపలమీఁదవాయించియుఁ జెవులనులిమియుఁ దొడపాయసం బిడియు, హింసలువెట్టిరి, తల్లీ!"

ఈమాటలను వినినంతట, సుబ్బమ్మ రంగనాథుని చివురువీనులం బట్టి చూచుచు, "ఓరి నాయన! ఎచ్చోట నులిమినారు?" చెంపల దాఁకి చూచుచు, "ఎచ్చోటున వాయించినారు?" అని, యడిగె. కోమలంబైన చిఱుకుఱువులను మెల్లన నొత్తుచు, "ఎచ్చోట దొడపాయసం బిడిరి?" అనుచు, గంటినుండి నీటిధారలొలుకఁగ విలపించెను. రంగనాథుఁడు మఱిమఱి యేడ్వసాగెను; దిగువ నుండిన లతాంగియు నేడ్వఁదొడఁగె. రెండు బిడ్డలఁ దనవక్షముపై నిరుప్రక్కల నణఁచుకొని, "ఓరీ, నాయన! చెంపమీద నిచ్చునని యెందుకు చెప్పినావు? నాతల్లియన్నియు నిచ్చునని చెప్పరాదా? నన్నడిగిన దంతయు నిచ్చివేయునా? ప్రాణము నడిగినా యిచ్చునని చెప్పరాదా?" అని విలపించుచుండగ, ధ-పంచమి, "తల్లీ! మన రంగనాథుఁడు బెగడొంది యేడ్చుచున్నాఁడు; రంగనాథుని మొత్తనేలేదు; కుమ్మరపిన్నవానిని, వడ్లపిన్నవానిని, గొల్లపిల్లవానిని, వీర్లనుమాత్రముఁ బ్రహరించిరి; మనరంగనాథునిఁజేతఁ గూడ నంటలేదు," అనెను.

"మంచివార్త విని నాకడుపు చల్లారుచున్నది. ఏడవకర, సామి! వెఱపుజెందకు! ఏనును మీనాయనయు మని యుండుదనుక నిన్నేవాఁడు దాఁకఁడు," అని బుజ్జగించినంతట, రంగనాథుఁడు ధైర్యముఁ దెచ్చుకొని యేడ్పును జాలించె; లతయు నేడ్పును నిలిపె. తోడుతో సుబ్బమ్మ బిడ్డలకు భక్ష్యములనిచ్చి బువ్వతినిపించి, రంగనాథునితో, "నేఁడు చదువకపోయినఁ జింతలేదు; నెమ్మదిగఁ బరుండుము", అని యిరువురినిఁ బఱుపుపైఁ బండపెట్టి నిదురవోవనిచ్చె.

భద్రయ్య మడినుండి నదీతీరమున కరిగి, యచ్చోట సంధ్యవార్చి స్వగృహమునకు మఱలెను. అంతట, సుబ్బమ్మ సేవకునివల్ల వినఁబడిన సాత

శాలలో జరిగిన వృత్తాంతములనన్నిటిని విన్నవించి రంగనాథుఁడు బెగ్గడిల్లి యులసి సొలసి పవ్వళించి యుంటను దెలిపించె.

"కొట్టుతిట్టులం బడని బిడ్డలెట్లు చేక్కఁబడు? మనకు సుతుం డొక్కఁడే యగుటంబట్టి మనకు వానియందుఁగల వాత్సల్యముచే వాని నప్పళించేటకు గూడా మనంబొప్పక యుండెదము. మన తనయుం డాటపాటలయందే సదాబుద్ధిఁ బోనిచ్చి దినపాఠములను వల్లిపంపక బడికి వెళ్ళిన నుపాధ్యాయుండేమి చేయఁగలఁడు? మన పిల్లగానివలెఁ బదుగురు చేదువక వారి పాఠముల నప్పగింపనిచో నుపాధ్యాయుండు తనకునుఁ దనబడికినిఁ గలకీర్తినిఁ గాపాడుటకొఱకు బాలురపై మండిపడి దండింపక యేమి చేయఁగలఁడు? అయినను, పురాతనకాలమున దండించుచుండిన మోటుపద్ధతు లిటీవల విసర్జింపబడి నవీనంబైన దండనావిధు లేర్పడియుండుటం జేసి, యిటంబట్టి యట్టి దండనల విధియింపకుండునటు లుపాధ్యాయునితో మాటాడివచ్చెద," అని భద్రయ్య చెప్పె.

"పడుచువాండ్రాడుకొనక యుందురా?" అని; సుబ్బమ్మ యడుగ, "పుస్తకముఁ జేతనంటక యేవేళ క్రీడించు బాలుండు జడుండగు; పుస్తకమేగతియని క్రీడయం దాసక్తిలేనివాఁడును శుంఠుఁడగు; కనుక, చేదువుకొనవలసిన కాలమునఁ జదువుకొని, యాటాడఁ దగిన కాలమున మాత్ర మాడుకొనవలెను," అని భద్రయ్య చెప్పినంతట నతని సతి నవ్వుచే లోఁగలికిఁ జనియెను.

రెండవనాఁడు వేడి వెలుంగు క్రుంకుమెట్టునఁ గ్రుంక రెండు బారల ప్రొద్దుండఁగ మారయ్య మాణవకులను సంబోధించి; "నిన్నటి రోజున మీకు లభించిన సన్మానము జ్ఞప్తిని నున్నదా?" అని యడిగెను. విద్యార్థులు వినమ్ర వక్త్రంబులతో బంధురమస్తకులై జ్ఞాపకమున్నదని క్షీణనాదంబున విన్నవించిరి.

"ముఖములం బైకెత్తుఁడు," అని బోధకుం డఱచినంతట నధోముఖులై యుండిన శిష్యులెల్లరు నూర్ధ్వముఖులై నిలఁబడిరి. వారి వెలవెలబోయిన మోములును దెల్లవాఱిన కనులునుఁ గాంచి, "మంచిది! నిన్నటి రోజున జరిగిన వాటిని జ్ఞప్తికిఁ దెచ్చుకొని మీపాఠపుస్తకమునుండి నేఁడు ప్రశ్నించు ప్రశ్నల కుత్తర మిత్తురని నమ్ముచున్నాఁడను;" అనెను. "రంగనాథా" అని పిలిచి యుపాధ్యాయుండు, "వాయసాది పక్షులవలనఁ బ్రయోజనమేమి? భూమి మీఁద విస్తరించియుండు క్రిమికీటాదులును దుర్గంధ వస్తువులును భుజించి భూమినిఁ బరిశుద్ధము—ముగింపుము వాక్యమును," అనినంతట రంగనాథుఁడు, "చేయును" అనెను.

"రెండవస్థానం నాగిరెడ్డి! వర్షమువలనఁ బ్రయోజనమేమి? భూమి మీఁదనుండు మలినమును శుభ్రముచేసి జీవకోటి రాసులకునుఁ బైరుపచ్చలకును జెట్టుచేమలకును జలాధారము—" అనినంతట "కలుగఁ జేయును," అని పిల్లగాఁడు చెప్పెను.

"మూఁడవస్థానం జీరుశెట్టి! జ్ఞానము వలన బ్రయోజనమేమి? అజ్ఞానమనెడి యంధకారమునుఁ బో—" అనినంతట పిల్లగాఁడు "గొట్టును," అనెను. దగ్గఱనుండిన ధ-పంచమి "బాలురు నేఁడు లెస్సగాఁ జదివి వచ్చినట్టున్నది," అనగ, మారయ్య "నిన్న బొందిన మర్యాద వల్లఁగద?" అనెను. "నాల్గవస్థానం, సామినాయఁడా! విద్దెలేని వాఁడు—ముగింపుము వాక్యమును," అని యడుగ, బాలుండుత్తర మీయక నిలువబడియుండగ, "విద్దెలేనివాఁడు మొద్దు," అని ధ-పంచమి చెప్పెను. మారయ్య గోపించి, "ఓరి మొద్దు! ఊరకుండుము; చిన్నప్రాయమునఁ జదువుకొంటివా?" అని యడుగ దాను చేదువుకొనలేదని చెప్పుకొనుటకు సిగ్గుపడి ధ-పంచమి తన యఱచేతులతో రెండస్థానుస్వారము లిడి యఱచేతులఁ జోఁచుకొని క్రీమోవినిఁ బైమోవి కఱువ ద్రొబ్బెను.

"ఓరి నిరక్షరకుక్షీ! ఈ స్థలము విడిచి యుఱుకుము," అని మారయ్య యాజ్ఞనేయగ, ధ-పంచమి దవ్వున నిలబడియుండె. ఉపాధ్యాయుండు "నాల్గవస్థానం సామినాయడ," అని మరలఁ బిలిచి, "జ్ఞానేనహీనః— వాక్యమును ముగింపుము," అనెను. సామినాయఁడు నోటినిఁ దెఱచికొని పైకప్పుజూచె. ప్రక్కన నుండిన బాలుని "అయిదవస్థానం," అని పిలిచి, "వాక్యమును ముగింపుము," అని నంతట, బాలుండు చూపుడు వ్రేలిని వాతెఱమీదనుంచుకొని దిగువఁజూచె. ఉపాధ్యాయుండు, "ఆఱు! ఏడు! ఎనిమిది కుమ్మర! తొమ్మది ఐడ్ల! పదిగొల్ల," అని తక్కిన వారిని నొక్కయూపిరితో సంబోధించి ప్రశ్నించె. బాలురందఱు దిగువబైన, యొగువదిగువఁ జూచిరి; అటు పిమ్మట రంగ్గనాథునిఁబిలిచి, "నీవు బుద్ధిశాలివి; వాక్యమును ముగియింపుము, చూతము; జ్ఞానేనహీనః పశుభిస్సమా" అని చెప్పినంతట "నః" అని రంగనాధుఁడు ముగించె. మారయ్య సంతోషపడి, "రంగ్గనాథ" అని పిలిచి, "నీవు నాలుఁగు మొదలు పదియవస్థానముఁవరకునుండు వారిలో నొక్కొక్క వానివద్దఁ బోయి చెంపమీఁద 'కరతాళ' మిచ్చిరమ్ము," అని నంతట, భద్రయ్యసుతుఁడు లేచి యాజ్ఞ ప్రకారము నాచరించి తన ప్రథమస్థానముఁజేరి కూర్చుండెను. "మీ పాఠపుస్తకములంగల విషయములలో నేఁడడగిన ప్రశ్నలేచాలు; పుస్తకములోలేని విషయములగూర్చి ప్రశ్నించి మీ బుద్ధిచాతుర్యము నెఱుంగఁ బోయెద," అనుచు బోధకుండు "ఎనిమిదవస్థానం భాండాధిపతి! నీవు మనుటకు దినుచున్నావా? లేక తినుటకు మనుచున్నావా?" అని యడిగెను. కుమ్మర చెంగన్న లేచి "తినుటకు మను-" అని వాక్యమును ముగియింపక యుండెను. మారయ్య గర్జించి "ముగింపుము వాక్యమును," అని నంతట, "చున్నావు," అని బాలుఁడు ముగించెను.

"ఎవరురా? నేనా?"

"లేదుసార్! నేను."

మారయ్య బాలుని చెంపమీఁద రెండు చెఱపుల నేసి, "మఱియేలాగున ముగింపవలెను," అని యడిగినపుడు, "చున్నాను," అని బాలుడు చెప్పెను. "తొమ్మిదవస్థానం," అని మారయ్య యఱచినంతట నాబాలుఁడు లేచి "చున్నాను," అని చెప్పి కూర్చుండెను; పదియవ స్థానమందుండిన బాలుండాలాగే చెప్పి కూర్చుండె. "ఓరి తిండిపోతులార," అని చెప్పి రంగనాథునిఁ బిలిచి, "ఓరినాయన! నీవు చెప్పుము చూతము; తినుటకు మనుచున్నావా? లేక మనుటకుఁ దినుచున్నావా? మనుటకుఁ దినుచు—" అని మారయ్య చెప్పినంతట, "చున్నాను" అని రంగనాథుఁడు చెప్పెను.

"నీవు మంచి తెలివిపరుండవు," అని రంగనాథుని మెచ్చి బోధకుండు బాలుర నెల్లరను సంబోధించి, "మీరు బాగుగ జదివి వచ్చినందుకు జాల సంతసమొందితి; అయిదు గంటలుకొట్టను బదునేను నిమిషములున్నవి; మీరింటికి వెళ్ళ సెలవిచ్చినాను; వెళ్ళవచ్చు," అని నంతటఁ బిల్లగాండ్రు దుముకుచును గేకలు వేయుచును ఘోషంబుతో బడి విడిచి వెళ్ళిరి.

3-వ అధ్యాయము.

లతాంగి బడిలోఁ జేదువుటయు, లతయు రంగనాథుఁడును తండ్రివెంట విహారము బోవుటయు.

"లతను గొంకఖండించెదరా? కొద్దిసేపైన నూరకుండక మడుగు మైలలేక యన్నిటి దాకుచుఁ దన యప్పయొద్దఁ జేని యామె ముసుఁగునుఁబైటతీసి యామె బుజము, వెన్ను, తల—వీటి మీఁద నెక్కి సవారి చేయుచున్నది; దాని చేష్టల సహింపలేను; తాము దాని బిలిచి కాస్త యదలించెదరా?" అని సుబ్బమ్మ తన పెనిమిటితో మొఱపెట్టుకొనెను.

"ఏదీ? ఓసి, లత!" అని భద్రయ్య పిలిచిన వెంటనే, లతాంగి "ఏమి నాయనా?" అనుచు, ముంగురులు మోమున వ్రేలాడగ సరగునఁ దండ్రి

యొద్దఁ జేరి, కాళ్ళనుమడచుకొని, జానువులతోఁ దనతండ్రితొడమీఁదఁ గూర్చుండి, యతనివామగండంబులోఁ దనతుండమునణఁచికొని, యతనికంధరంబునుఁ దనయిరుకరంబులతోఁ జుట్టుకొని, తనకరశాఖంబులఁ గ్రుచ్చుకొని, “ఏమినాయనా! ఎందుకుపిలిచినారు?” అని, యడిగె. భద్రయ్య లతాంగి చెంపలమీఁదఁజెంపకు రెండేసిముద్దులను దండనగవిధించి, “నీతల్లిని యెందుకు తొందరపెట్టుచున్నావు? నీయవ్వజోలికెందుకుపోయెదవు?” అనుచు నొకముద్దుపెట్టి, “చెప్పలంజేయక నీపాటికాడుకొనరాదా?” అని, వాత్సల్యతిరస్కారములనాడి, ఖండనముల ముగించునిమిత్తము దాని యధరంబుపై దీర్ఘచుంబనమొసంగెను.

“అన్న బడికి వెళ్ళుచున్నాడు; నాతో నాటాడుటకు జెలికత్తెలులేరు; నను బడికిఁ బనిపివేయునటుల నాతల్లి చెప్పుచున్నది; కనుక, నను బడికిఁ బంపినఁ జదువుకొనుచు నింట నూరకుండెద,” అని, ముద్దుగమంపలించెను.

లతకు నైదవయేఁడైనందున “ఈశ్రమఱునాఁడే సుదినముగనుండిన బడికి బంపవచ్చు,” అని, సుబ్బమ్మ విన్నవించె. తోడుతో భద్రయ్యపంచాంగముఁ జూచి “ఱేపుశుక్రవారము శ్రీకరమైన దినముగనున్నది; యోగమును దారాబలమును జక్కఁగనున్నవి; ఱేపటిదినమే బడికిఁ బంపెద,” అనినంతట నా మాటలను వినుచుండిన లతాంగి యాదివసంబంతయు గడువేడ్కతో నాడుచుండె. మఱుసటిదినమున భద్రయ్య మారయ్యగారిని రప్పించి, “ఇదిగో, నా పసిబిడ్డనుఁ దమ బడికిఁ బంపెద; బాలురతోఁ గూర్చుండఁబెట్టి విద్యగఱపుఁడు,” అనెను. “చాలసంతోషము; అలాగేచేసెద,” అనుచు, మారయ్య తనవెంటఁ బసిదానిఁ బిలుచుకొని బడిలోవిడిచి, “నీపేరేమి?” అనియడిగెను.

“నా పేరు, లత.”

“లతాంగియని పేరుగద?”

లతనోటఁ బ్రతిజెప్పక కనుగీటుతో బదులొనర్చె. “బాగుగజదువుకొందువా?” అని మారయ్య యడిగినందుకు నేత్రశిరఃకంపములతో

లతాంగి బదులొనరించె. బాల్యముమొదలుకొని స్త్రీజాతికి సంజ్ఞలతో బదులాడుట స్వభావమని యెఱుఁగుకొని, చిఱునగవుతో, మారయ్య బాలురకెడముగా నెడముఁజూపి, లతాంగిని గూర్చుండఁబెట్టె. నాటంగోలె, యెక్కువమక్కువతో నుపాధ్యాయుండు పాఠములఁజెప్ప, లతాంగి మిక్కిలి యుక్కఱతోఁ గఱచుచు సూక్ష్మముగ గ్రహించుచువచ్చె.

గ్రీష్మకాలంబున నొకమధ్యాహ్నము తపనునితాపం బోర్వలేక సూకరంబు పంకంబన్వేషించె; గృధ్రము దనపక్షయుగంబుల క్షోణిపై విస్తరించె; తైలపాయికాన్వేషణార్థమై నిశయందు భూబిలంబులను విడిచిపోయినద్రోణకర్ణజలూకంబులు గృహపటలంబులనుండి దిగువఁబడె; పురుషులు తిమితోత్తరీయులై వ్యజనహస్తులై గృహాంతరాంతరములఁ బరితపించిరి. దినాంతమునకుఁ గొంతపూర్వము మిత్రుంజూచి భయద్రుతుఁడైన జగత్ప్రాణుని మార్గణార్థమై భద్రయ్యపుత్రపుత్రికా భృత్యసమేతుండై గిరిమార్గము విహారమువోయెను. మార్గంబున నదీమధ్యంబున నూటనీటికాలువకుఁ జేరువ, లతాంగి సైకతపులినంబుపైఁ గూర్చుండి, “నాయనా; ఇచ్చోట గాలి వచ్చుచున్నది; కొంతసేపుండి చెమటలార్చుకొనిపోవుదము,” అనిన నందఱు సమ్మతించి కూర్చుండిరి. లతాంగి సైకతమును ఖననముసేయుచు, “నాయనా! ఇచ్చోటఁ ద్రవ్విననీళ్ళుకనిపించె; చూచితిరా? ఏలాగున నీళ్ళువచ్చె?” అని యడిగెను.

“అమ్మా! ప్రాపున నీళ్ళుపాఱుచున్నది; కనుక, యీసమమునఁ ద్రవ్విన నీళ్ళుకనిపించె.”

“మంచిది! ఏటియొడ్డుదాఁటి యీనీటిమట్టమునకుఁ ద్రవ్విన నీళ్ళుకనఁబడునా?”

“అచ్చోట బండవంటి గట్టిపొరలులేక యిసుక పొరలును వదులుపొరలును నుండిన నీళ్ళుకనఁబడు.”

లతాంగి జలములోని యండజములఁగని, “అన్నా! రంగనాథన్న! ఈ మత్స్యములెట్లు నీటియందున్నవి? ఊపిరి తిరుగక చేనిపోవా? కంటినిండు

నీరునిండి గ్రుడ్డివికావా ? ఏలాగున నీటిలోఁ బోవుచున్నవి ?'' అని యడిగె.

"అదేమో! నాకు తెలియదు,'' అని కసరుచు, రంగనాథుఁడు రెండడుగులు దాఁటి నిశ్చింతగఁ గూర్చుండె. "మత్స్యము లెప్పుడు నీటవసించు; నీటిలోని వాయువు నాకర్షించుటకుఁ దగినశ్వాసేంద్రియములు వాటివీపుననున్నవి! వాటికి 'పువ్వారలు' అనిపేరు. కంటిమీఁద తెప్పలకుబదులు పలుచని పొరయుండుటచేత నీరు కంటిలోదిగఁజాలదు. వీపు, ప్రక్కలు, వెనుక—యీప్రక్కలనుండు తెక్కలను గదలించి యీఁదు,'' అని, తండ్రిచెప్పెను.

పిమ్మటశాలూరంబులంజూచి, లతాంగి, "రంగనాథన్నా! ఏమి చేయుచున్నారు! ఇదియైనజెప్పుఁడు. ఈ కప్పలు భూమిమీఁదను నీటిలోను రెంటనెట్లు వసించుచున్నవి?'' అని యడిగెను.

రంగనాథుఁడు బదులాడక గొణగుచుఁ దటినీతటమున కేగి మూలుఁగుచుండె. తండ్రి తనయను సంబోధించి, "ఈజంతువులు భూమిమీఁదను నీటియందును వాసముచేయుటకు వెనుచర్మమున సూక్ష్మరంధ్రములున్నవి; వాటిగుండా నీటిలోని వాయువునుఁ దీసికొనుచు ముక్కుగుండా కూడ కొంత గాలి పీల్చుకొనును. అందుచేత నిలాజలంబులలో నిచ్ఛించిన చోటనుండు,' అని చెప్పె. "ఓయమ్మ! కఱచుటకు బైన దుముకుచున్నవి; చూచితిరా? ఎందుకు నడచిపోవక దుముకుచున్నవి?''అని, దిగులువడి రెండడుగులొత్తిగిల్లె? తండ్రి సుతకభయంబిచ్చి, "కప్పలు కఱవఁజాలవు; వాటిదంతములు నోటియందు లోతట్టుండుటచేత నోటిలోని యెఱను బయటికిఁ బోనీయక చేసికొనుఁగాని కఱవఁజాలవు. వాటికి ముందుకాళ్ళు పొట్టి; వెనుకకాళ్ళు పొడుగు; అందుచేత దుముకుచుఁబోవుచున్నవి,'' అనెను.

కొంతసేపటికి నందలు తరంగిణిదాఁటి గట్టుమీఁదికెక్కి వెళ్ళుచు నొక్కకుంజరమునుఁగాంచి, లోఁజొచ్చిరి. అందు నందలు విశ్రమించుచుండగ, లతాంగి మంజులమైన ముకుళపల్లవపర్ణంబులంగని ముద్దువెట్టి, చారుసుమన

సంబుల నంటియంటి కూర్మిసేయుచు వాటితో ముచ్చట లాడుచుండె. పరిమళపుష్పంబులనుఁ దనసుకుమారహస్తంబులతో మెల్లన నూడఁదీసి రెండొకటిని రంగనాథుని కేశబంధంబునఁ జెక్కియుఁ గొన్నిటినిఁ దన కుఱుమ్ముడిం దాల్చియు మఱికొన్నిటి ఘ్రాణించియుఁ జారువిరులుంగల చెట్లకడనేగి యొయ్యారపు నడకతో వాటిఁ జుట్టిచుట్టి సొంపుగాంచుచుండగఁ గొమత్రై యాటవాటలఁగని తండ్రియుదయుచే మయిమఱచె. మఱికొంత దూరమేగుచు నొక గొప్పవృక్షముఁజూచి, లతాంగి సేవకునిఁబిలిచి, "చేందమామ దాఁకుచుండునట్లుం డీపెద్దమ్రానేలాగున భూమిమీఁదనిలిచి యున్నది?'' అనియడిగె. "తల్లీ! చెట్టుపైయెన్నిశాఖలున్నవో యన్నిమూలములు నేలక్రిందవ్యాపించియున్నవి; ఆమూలములు భూమిలోబిగబడియుండుటచేత వృక్షమునిలిచియున్నది.''

"ఓరి, పంచమి! ఈ మ్రానికాహారమేమి?''

"చిన్నచెట్లకుంగల యాహారమే, తల్లీ!''

"ఏమియాహారము?''

సేవకుండు బదులాడఁజాలక యూరకుండినందున, భద్రయ్య "భూమిలో నవాసారము, గంధకము, జలవాయువు—ఏటితోఁ గలిసియుండు నీళ్ళను వేరులమూలముగాను సామాన్యవాయువును సూర్యరశ్మిసాహాయ్యముచేతఁ బత్రములమూలముగానుఁ బీల్చుకొనుశక్తిగలదు,'' అనెను.

"చెట్లుసేమలు కోట్లకొలఁదిన నుండుటచేతనవి వాయువును భక్షించిన మానవులకు వాయువు మిగిలియుండునా?''

"వాయువు నాకర్షించి వాయువులోని బొగ్గుపులుసువాయువుమాత్రము నుంచుకొని ప్రాణవాయువును మిక్కుటముగ వదలు; అదియుంగాక మనుజులవల్లనుఁ దక్కిన జీవజంతువులవల్లను శ్వాసము విడువబడ్డ బొగ్గుపులుసువాయువును నాకులద్వారాపీల్చి జీవరాసుల కావశ్యకమైన ప్రాణవాయువును బయటికి వదలు.''

లతాంగి తలను గ్రింద నూఁచి, "ఆలాగా! మనకుఁ బనికిరాని వాయువును కబళించి మనప్రాణాధారమునకు వలసిన వాయువునిచ్చునా? ఎంతయు పకారమే యమ్మ!"

"ఈ చెట్లు జీవరాసులకు ఫలపత్రముల నిచ్చుటఁగాక యింటి సామానులకును సామగ్రులకును నుపయోగ మగుచున్నవి; ఎండినవి ప్రొయ్యికి కట్టె లగుచున్నవి."

"నాయనా! ఈచెట్లు లేక యొక్కనిమిషమైనా జీవరాసులు బ్రతికి యుండఁ జాలవు; మూలము మొదలు కొట్టకొనవఱకు నేదియు వ్యర్థముగాదు."

"మానవుం డొక్కండే భూభారము; మనగాత్రమే వ్యర్థము," అని సేవకుండు చెప్పగ, "ఓరి వెంబజీవిత్తు! నీ వంటివారు భూభారము; నీగాత్రమే వ్యర్థము;" అని భద్రయ్య చెప్పెను.

"నాయనా! చెట్లలోని యాకులకు వివిధములైన వర్ణము లెట్లుకల్గె?"

"కంటి కగపడని యతిసూక్ష్మమైన రంధ్రములు వేలకొలంది పత్రములలో నున్నయవి; సూర్యరశ్మిచే నాయణువులలో వర్ణభేదము లేర్పడి, యణువుల చాయ పత్రములలో వెలియగుచున్నవి."

నవ్వుచు, "నాయనా! కంటి కగపడని వాటిని జను లెట్లు గనుంగొనిరి?" తండ్రి తనకూఁతు సూక్ష్మబుద్ధియు విచారణాసక్తియు మెచ్చి, "విజ్ఞానశాస్త్రజ్ఞులు భూతయద్దములఁ గనిపట్టి, వాటి ద్వారా తెలిసికొనిరి," అనెను.

లతాంగి కొంత దూరముఁజని, అన్న, రంగనాథన్న! నాయనా! వేగిరమురండు; బండలో నీళ్ళుండవని చెప్పితిరి గద! ఇదిగో చూడుఁడు! బండనుండి నీటిబుగ్గ వచ్చుచున్నది. ఈమట్టుక్రింద ద్రవ్విన బండేకద? అచ్చట నీళ్ళు దొరకుట దుర్లభము; మట్టుపై జలమున్నది; చూచితిరా? ఇదేమి చోద్యము?"

"చోద్యముగాదు. ఈగుట్టలో నెమ్మైన మంటిపొరయు మొరమువంటిపొరయు బండపొరకుఁ గ్రిందుమీఁదుగ నుండుటచేత వదలుపొరల లోని సూక్ష్మరంధ్రములగుండానీళ్లు బుగ్గగవచ్చుచున్నది."

ఈ యవసరంబున భద్రయ్య కనుచీఁకటి గావచ్చినందున మఱుఁగు పడుటకు ముందునిలుఁ జేరవలెనని చెప్పినంతట నందఱు మఱలఁ దొడఁగిరి. భద్రయ్యయు ధనిష్టాపంచమియుఁ బెట్టుచు వచ్చిన యొక్కొక యంజకు రంగనాథుఁడు రెండడుగులును లతాంగి మూఁడడుగులునుఁ బెట్టవలసినందున లతాంగి పరుగిడుచువచ్చె. సేవకుఁడు లతాంగ చెంతనిలిచి, "ఈవరకు నడచివచ్చినందున నీకాళ్ళకు నొప్పితగిలియుండు; నాబుజముమీఁద గూర్చుండుము; వెళ్లుదము," అని దగువఁగూర్చుండె. అందుకులతాంగి సమ్మతిపడనందునఁ దండ్రియు సేవకుండును వాజ్జెమీఁద వాజ్జెపెట్టి తిన్నగఁ జని, నదిచెంతఁ జేరిరి. అచ్చటఁ గాళ్లుసేతులగడుగుకొని మరలుచుఁ బశ్చిమ దిక్కునఁ జనిరి. గ్రామాంతమునకుఁ గొంతదూరమునఁ గనబడిన గుడిసెల గని, లతాంగ, "నాయనా! ఆచిన్ని తాటాకుగుడిసె లేమి?" అనియడిగెను.

"మనవీరుఁడును వాని జాతివారును నుండు వసతులు; 'మాలవాడ' యని పేరు," అని, సేవకుండు చెప్పె.

"వాటికి దారబందములును సొరగండ్లును లేవే!"

"తాటాకు తడకలతో మూసి కొనెదరు."

"ఓరి, పంచమి! ద్వారములు పొట్టిగనుండుటచేత జను లెట్లు లోఁజొత్తురు?"

"గుంజిళ్లువెట్టి పాకులాడుచు బోదురు, తల్లీ!"

"అయ్యోపాపము! ప్రాకుచుఁ బోవలెనా! ఎందుకు గుడిసెలమీఁద గుమ్మడితీఁగెలు 'సొరకాయ' తీఁగలుఁ బాకియున్నవి?"

"ఫలములమెండుగ నిచ్చుటకు."

"వాడపై యాకసంబునఁ బక్షులు వ్రటముగఁ దిరుగాడుచున్నవి ఎందుకు?"

"అచ్చోటనివసించువారు వృషభము మొదలగు జంతువుల మాంసమును భుజియింతురు; వాటిచేఁ బాఱవేయబడ్డమాంసపు ముక్కలను వెతకుచేఁ దిరుగాడుచున్నవి."

"అంతపొడుగునఁ దిరిగెడి పక్షులకు నేలనిూఁదఁ బడియుండు మాంసపు తునుక లేలాగున కనంబడు?"

"వాటికి దూరదృష్టిగలదు; అదియుంగాక చిన్నవస్తువులు దొడ్డవిగఁ గనఁబడు," అని, తండ్రి చెప్పెను. "నాయనా! మనవీరుని కైదారు బిడ్డలటనే! నాతల్లి నన్నొకనిని భరియింపలేకయు నాచేష్టల సహియింపలేకయు నను బడికిఁ బంపవలెనని చెప్పుచుండె; అన్ని చిన్నిబిడ్డలనుఁ జిన్న గుడిసెలలోఁ బెట్టుకొని వారితల్లి యేలాగున నిర్వహించుచున్నది?"

తల్లి కెన్నిబిడ్డలుండినా బరువుకాదు; తీఁగెకు కాయలుబరువా?" అని, తండ్రి చెప్పెను.

"పేదతనమునకే పెక్కుబిడ్డలన్నట్టు, వీరునిభార్య సంవత్సరము తప్పినా బిడ్డకాన్పు తప్పదు; మన రంగనాథునికివెనుక నైదుబిడ్డల గనెను, దేవర," అని, సేవకుఁడు చెప్పగ, "ధనాఢ్యులకుఁ గుటుంబాభివృద్ధియు నభివృద్ధియందిచ్ఛయుఁ దక్కువ; కుటుంబవృద్ధియుండువారికి ధనము తక్కువ," అని భద్రయ్యచెప్పె.

ఇవ్విధంబునఁ బ్రశ్నోత్తరములు జరుగుచుండగ, 'లొళ్' 'లొళ్లు' మని మాలవాఁడయంచునఁ గుక్కరములు మొఱిగె. "ఓయమ్మ," అని లతాంగి యులికిపడుచు సరగునఁ దండ్రిచేరువఁబోయి యతని మోకాళ్ళు బెనఁగె. భద్రయ్య దాని వెన్నునఁ దిన్నగఁ దట్టుచు, "జడియకుము; జడియకవే," అనిచెప్పి దానిఁ బైకెత్తి, బుజమున నానించి, తనమఱొకచేతి జొట్టనవ్రేలిని రంగనాథుఁడు పట్టుకొనిచ్చి, కింకరుని వెంటరమ్మని యడుగుమీఁద నడుగుపెట్టుచు నిలుఁజేరె.

లతాంగి తల్లినిఁ గనినంతట, "ఓ," యని యెలుగెత్తి యేడ్చుచు "మాలవాడనుండి రెండుకుక్కలు మొఱుగుచు ననుఁ గఱవవచ్చె. ఏను భయంపడి నాయనకాళ్ళఁ జొట్టుకొంటి," అని, మఱియు నేడ్వసాగెను. తల్లి తొడుతో బిడ్డనుఁ జంకఁబెట్టుకొని, "ఓయమ్మ! నాయమ్మ! ఏడవకే! పల్లెకువెలుపట వెళ్ళిన భయంపడుదువని తెలిసియు మీనాయనతో వెళ్ళినందున నూరకుండితి," అని, కర్పూరము వెలిగించి యెగదిగజొట్టి దిగఁదుడిచె. ఇవి చాలవని సేవకునిఁ బిలిచి టెంకాయగర్పూరములిచ్చి, దేవునికి దేవలునిచే నర్చనఁజేయించి యర్చించిన విబూదియుఁ గుంకుమయుఁ దెమ్మని యాజ్ఞాపించె. దేవళంబునుండి సేవకుండు మఱలివచ్చినంతట నతఁడు తెచ్చిన విబూది బిడ్డలనెత్తిమీఁదఁ బూసి, కుంకుమతిలకంబువెట్టి, బిడ్డల ముత్తపఱచె.

4–వ అధ్యాయము.

రంగనాథుఁడు బ్రహ్మచారియగుటయు వీరుఁడు కొలువును వీడ్కొనుటయు.

రంగనాథుఁడు జనియించిన పదియవ వత్సరమున మార్తాండుడు మిథునంబు జొచ్చియుండగ, సుబ్బమ్మ తన పెనిమిటిని మ్రొక్కి, "మనకుమారుని నిఁక వృషలకులస్థునివలెఁ బెట్టియుండుట నలుగురికి నగుబాటు; జ్యేష్ఠమాసము గతించుటకు మునుపు మంచిదినముఁజూచి సుముహూర్తంబున నొక జందియము నొక బాపనునిచే వేయింపవలెనని ప్రార్థించెద," అనెను.

"కడచిన సంవత్సరమున నల్పవృష్టి. ఈ వత్సరమున నీవరకుఁ దొలకరించే లేదు. నదియందు ప్రవాహము వచ్చి రెండేండ్లైనందున నావాటికి నూటనీరు తగ్గుచుఁ గొలములు లోలోతుగఁ బోయినందున నేలమీఁద నాగేటిని వాటి నాలుఁగు నెలలయ్యె. ఇట్టి దుర్భిక్షకాలమున నుపనయనముఁ గావించుట యుక్తమా?" అని, భద్రయ్య యడుగ నతని సహధర్మిణి,

''తమవార్త కడ్డమాడను. ఇంటిలోఁ బ్రకృతము ధాన్యాదులు సమృద్ధిగ నుండుటచేత నీసంవత్సరమును వర్షముగురియక పైరుపంటలుగానియెడఁ బై సంవత్సరముపనయనముఁ గావించుట కష్టసాధ్యమని తలఁచి యప్పన సేసితి; తమకెప్పుడు యుక్తకాలమని తోఁచుచున్నదో యట్టికాలమే నాకును సమ్మతము,'' అని, వినయముతోఁ బల్కి, యవనతశిరంబుతోఁ దనపాదముఁ జూచుచు నిలువఁబడె.

''శ్రేయసి! రాఁబోవుకాలము కాటకముగ నుండఁబోవుట నిజము. ఏఁడాదితాళి వస్తువులఁ గొని ముహూర్తమును జరిగించుటకంటె తత్కాలము మనయింటనుండు వస్తువులతో నుపనయనముఁ గావించుట మేలు. రేపు మనపురోహితునితో నాలోచించి ముహూర్తదినము నిర్ణయించెద,'' అని, సేవకునిఁ బిలిచి పురోహితుని బిరాన పిలుచుకొని రమ్మని భద్రయ్య యాజ్ఞాపించె.

మఱుసటిదినము సుబ్బాశాస్త్రిలు వచ్చినంతట, భద్రయ్య యతనికి పాద్యంబొసంగి, పాదప్రక్షాళనమునకనంతరము నుపస్పర్శంబునకు నుదకంబు రజతభాజనమున జేర్చి, పీఠంబమర్చె. శాస్త్రిలువారి పాదపద్మములకు డిగ్గి, పరస్పరక్షేమలాభముల విచారించినవెనుక, ''మనచిన్నవాని కుపనయనము జేయ నుద్దేశించి యుండెదరా?'' అని శాస్త్రిలడుగ, ''అవును; అందు నిమిత్తము ముహూర్తదినమును నిర్ణయించుటకు దమను రప్పింపనైతి; శ్రమవెట్టినందుకు క్షమింపఁగోరెద,'' అని, భద్రయ్యచెప్పె.

శాస్త్రిలు తనచంకఁబెట్టియుండిన మూటను వీడఁదీసి, యందుండిన దర్భలును సమిధలును నక్షతలును నొకప్రక్కగవైచి, పంచాంగ పుస్తకమును జేతగ్రహించి, కరశాఖంబులతో తిథివారయోగకరణముల గణియించి, '' జరిగెడి జ్యేష్ఠమాసమున శుక్రవారము, దశమి తిథియు నుత్తర ఫల్గుని నక్షత్రమును గూడిన మిథున లగ్నమున ముహూర్తము జరుపవచ్చును; '' అనెను.

''తమ యాశీర్వాదముచేతను దైవానుగ్రహముచేతను దాముపెట్టిన సుముహూర్తమున వడుగును జరిపెద,'' అని రెండు రూపాయలు, వీడియము, ముక్కంటిపండు, చూతఫలము, అలరులసరము,'వీటిని నొకశ్వేతపాత్రమునఁగూర్చి శాస్త్రిలకెదుటబెట్టి స్వీకరింపుఁడని ప్రార్థించె; శాస్త్రిలు వాటిని హర్షంబుతోఁ దీసికొని. ''శుభమస్తు! దీర్ఘాయుష్యమస్తు,'' అని దీవించి యక్షతల భద్రయ్య శిరముమీఁదఁ బడవేసె.

''తాము ముహూర్తము రెండుదినములుండగ నొండొకచోట శుభాశుభముల దగలక మనయింటికి దయచేసి యీశుభకార్యమును బూర్తి చేయుఁడు,'' అని భద్రయ్య వేడుకొనగ, ''ఏలాటివారు నెట్టివిషయమునకు బిలిచినను మనయింటి శుభకార్యమును ముందుగ జరిపి పిమ్మట వెళ్ళుదు,'' అని శాస్త్రిలు సెలవు పుచ్చుకొని చనెను. వెంటనే భద్రయ్య యిల్లాలు వచ్చి, ''ఎద్దడికాలమైనందున నిలవేలుపులు వేనవేలు విచ్చేయుదురు; కాన, శుభప్రస్తుతమునకుఁ గావలసిన వస్తుచయములను ముందు చేర్చిపెట్టవలసినవారమై యుండెదము; తామొక సుదినముజూచి ప్రథమమున, 'కుంకుమ, పసుపు, మినుములు, పెసలు,' వీటిని గొనితెండు; తక్కిన వస్తువుల నావలఁ గొనిరండు,' అని విన్నవించెను. ఇరువురు గొంతయాలోచించి సతిచెప్పిన మేరకు సామగ్రుల పట్టీలును జవళి జోపితాలును భద్రయ్య సిద్ధపఱచె. ఖర్చులకు బైకముగావలసి గురువారమున నీరైదు బండ్ల వడ్లగింజెలనుమండివీధికి బంప విక్రయధనము తొమ్మిది వందలరూపాయలు లభించె. శుభవారమైన శుక్రవారమున మామిడియాకులు గట్టిన ముహూర్తస్తంబమును నాటించి సేవకుని వెంటఁబెట్టుకొని వణిక్పథంబునకుఁ జని, కుంకుమకాంచనీమాషాదులం గొని మందిరంబున జాయాసన్నిధిం జేర్చె. మందవారమున నేడు కొండల దేవరకు మ్రొక్కి బ్రాహ్మణులకు సంతర్పణముచేసె. భానువారమున నంగడికి వెళ్ళి పట్టీలఁ గనిన వస్తువులఁ గొనుసమయంబున ధరలు ప్రియముగ నుండినందునఁ గొద్దిగఁ గొనిపోవచ్చునని సేవకుండు విన్నవింపగ భద్ర

య్యకనలి, తాను చేయఁబోవు శుభప్రస్తుతము మొదటిది యైనందుననుఁ దన కొక్క కుమారుఁడైనందుననుఁ దాను కొనువాటికి నేలాటి యభ్యంతరముఁ జేయఁగూడ దనెను.

భద్రయ్యగారిచేఁ దేఁబడిన పుష్కలమైన సామగ్రులును, స్వర్ణకారునిచేఁ దేఁబడిన కాంచన యజ్ఞసూత్రములును ఖర్జూర యజ్ఞసూత్రములును రూప్యకలశమునుఁ బంచపాత్రయు, శాల్బికునిచేఁ దేఁబడిన యారకూటకలశమునుఁ దామ్ర పంచపాత్రయు పరిష్కదర్వీలును—వీటినిఁ గని సుబ్బమ్మ మనంబుప్పొంగె. అటువెనుక బంధుమిత్ర వర్గంబులకు తపాలు ద్వారా పత్రికలు పంపఁబడె. ఇంటిముందర పందిలివేయఁబడియుఁ బచ్చతోరణంబులఁ గట్టబడియు ననటిచెట్లును టెంకాయ గుత్తులునుఁ గంబములకు బంధింపబడియు వీధియలంకరింపబడెను. ఆలాగే గృహాంతరమును నలంకరింపబడె. ముహూర్తమునకు ముందు దినము, 'చుట్టాలు, యిష్టులు, పురోహితులు, పరిచారకులు, సూపాపూపికులు,' వీరు వచ్చి చేరిరి. ముహూర్తమునాఁడు సుమారైదు వందల బ్రాహ్మణ్యముతోను మంగళవాద్యముతోను ముహూర్తముజెరిగె. నవగ్రహములకు బ్రతినిధిగ నియమమైన తొమ్మిది దీక్షితులువార్లలో నొక్కొక్కరికి దోవతిజతయు నిత్తడిచెంబును నుద్ధరణిసహితంబైన రాగిపంచపాత్రయు బ్రాప్తమై యెల్లరు సంతృప్తిజెందిరి.

భూరి దక్షిణ నిచ్చు సమయమున భద్రయ్య పురోహితునిఁ జెంతఁ బెట్టుకొని వారివారికి దగినయట్లు దక్షిణ నిచ్చుచుండగ నొక బ్రాహ్మణుఁడు శిరమును వంచుకొని చెయిఁజాఁచె. ఇంకొకఁడు శిరమునుఁ బైకెత్తి, చెయి జాఁచి, "బహుదూరమునుండి వచ్చితినయ్యా", అనెను. మఱొకఁడు తనచెయి జాఁచుచుఁ దనయొద్ద నుండిన బాలికల చెయిఁబట్టి 'వారిచేతుల జాఁపఁజేసి దిగువ జూచుచుండె. ఒండొక బాపనయ్య తనజీర్ణోత్తరీయముఁ జూపి రెండరచేతులఁ జాఁచె. ఇట్టి వేసంబులఁ జూచియుఁ జూడనట్లు, పురోహితుఁడు భద్రయ్యచే యథోచిత రూప్యదానంబుల నిప్పించియు గోష్ఠిలోనుం

డినవారికి సభాతాంబూల మిచ్చియు సుముహూర్తమున శుభకార్యమును ముగియించె.

రంగనాథుఁడు మంత్రోక్తంబై ధరింపబడిన చర్మముతోఁ గూడిన యజ్ఞసూత్రముతోను, అలంకారార్థమై ధరింపబడిన కాంచన యజ్ఞోపవీతంబుతోను మౌక్తికవిద్రుమసరంబులతోను మధ్యంబున బీతవస్త్రంబుఁ బరివేష్టించియుఁ గరంబున దండఁబట్టియుఁ బితామహికిని మాతాపితలకును నమస్కరించి, బాడబోత్తముల కభివాదన మొనరించుచుండగ, శర్మ యేమియని కొందఱును, గోత్రంబేమియని బంధువులు గొందఱును, శీఘ్రం వివాహసిద్ధిరస్తని కొందఱును, విద్యాభివృద్ధిరస్తని కొందఱును, దీర్ఘాయుష్యమస్తని యందఱును నాశీర్వదించిరి.

ముహూర్తము జెరిగిన తరువాత ద్విజులలోఁ గొందఱు స్రవంతికిఁ జని యందలి గభీరంబైన చెలమలఁ గనినంతట దిగులొంది క్రమ్మఱిరి; ధైర్యముగల కొందఱాప్లావముచేసియు మాధ్యాహ్నిక మాచరించియు గట్టెక్కి, విమల వస్త్రంబుల ధరించిరి; అలసులైన విప్రులుగొందఱు సవేశంబున నుండిన కూపంబుల యగాధంబును గాంచి భయంపడినందున గచ్చరమైన పటచ్చరంబుల మాత్రము మార్చి ధవళచేలముధరియించిరి. వృద్ధబ్రాహ్మణులెల్లరు భద్రయ్యగారి యింటితోఁటలోనుండిన నూఁతిపద్దఁజని, పరిచారకులచే ఘటీయంత్రముపై రజ్జుచేసముద్ధృతంబైన వనమున స్నానసంధ్యలంజేసి, గుంజియెండఁబెట్టిన వస్త్రములను మొలఁగట్టుకొనిరి. ఇట్లు బ్రాహ్మణోత్తములు వారివారి శక్తిసౌకర్యములకుఁ దగినయట్లు స్నానసంధ్యలసలిపి, పవలుపండ్రెండు గంటలకు పెండ్లియింటికివచ్చి చేరిరి.

ఏనూటికిపై విస్తరింపబడిన విస్తళ్ళముందఱు బాపనులు కూర్చుండి బోనము చేయుతరుణమున భద్రయ్య ఘృతపాత్రమును దానేయుంచుకొనివడ్డించుచేరాగా దొప్పలనిండు నేతిని గ్రహించినవారు గొందఱు, చాఁచినచెయిన ఘృతధారలునిండి క్రింద నొలికియుఁ జాఁచిన చెయిఁ దీయనివారుగొంద

లు, అన్నములోఁ బెద్దపల్లముచేసి దానిపై చెయిఁజోచినవారుగొందఱు, చేతిలోఁ బోసిననేతిని 'గుటుక్కు'మనిక్రోలి మరలచెయిఁ జోచినవారు గొందఱు - యీరీతిన ఘృతధారలను యథేప్సితముగ నంగీకరించిరి. మధుర భక్ష్యములును మాషాపూపములును వడ్డించేనపుడు జెన్నిగట్టొకండు తనప్రక్క నియాకుఁ జూపి నాలుఁగువడముక్కలును నాలుఁగుపూపములును వడ్డింపుడని సిపారసుచేసి, తనయాకుముందఱ వడ్డించేటకు వచ్చినపుడు, వలదనినోటఁ జెప్పుచే నాలుఁగేసి వడ్డించిపొమ్మని సన్నచేసె; నాలుఁగువడ్డించినపిమ్మట మరల నాలుఁగేయమని వ్రేళ్ళను గదలించె. బుభుక్షితులైన భూదేవు లిభ్భంగిన భుజించి, పరమాన్నమును గోరసమును సమృద్ధిగ 'జుర్రని' శబ్దములోఁ బానముచేసిరి.

భోజనానంతరముఁ బందిలిక్రింద నేలమీఁదఁ బఱుపబడియుండిన కిలింజకములమీఁద బాపలు కూర్చుండి తాంబూలము స్వీకరించి, యిరుగు పొరుగున నుండిన తిన్నెలకడ నేగి శయనించిరి. వార్లలో నొకండు మాషా పూపఫలమోయన ద్వితీయవాయువు విసర్జించుచుఁ దనకభిముఖమున వేదికపైఁ బఱుండిన ఛాందసుని, "ఓయిశాస్త్రులు," అని పిలిచి,

"నేటిప్రొద్దుపోయె; రేపును మఱునాఁడును భక్ష్యభోజ్యములు లఘువై యుండుటలో మూఁడవనాఁడు లభియించే దక్షిణయు సంక్షేపణ మగు; ప్రశస్తంబైన ప్రస్తుతంబు లింకెక్కడైన జరుగుచున్నవా ?" అని యడుగ, మూఁడు యోజనముల దూరంబున రెండుశుభప్రస్తుతములు జరుగఁబోవునట్లును నవి యంతధాటిగ జరుగవనియు నేదో యిచ్చిపెట్టినంత లభియించేననియు శ్రోత్రియుండు తెలియపఱచె.

అపుడు పురోహితుఁడు నవగ్రహప్రతినిధులయొద్దఁ జేని తన సిపారసువలన లభియించిన లాభమున నర్ధభాగము దనకియ్యవలెనని తర్కించినందుకు నవగ్రహ ప్రతిబింబు లొండొకరి ముఖములజూచి యధోముఖులైరి. వారిలో నొక తావదూకుఁడు తెగువతో, "ఓయి శాస్త్రులు, మాకు ప్రాప్త

మైనట్లు మీకును దోవతి జతయుఁ జెంబును పాత్రలును లభించినవి; మేము పొందని బృహస్పతి సంభావన నొక్కటికి రెండుగఁ దీసికొంటిరి; వాటి కభ్యంతరముచేసితిమా ? మామూలులేని హిరణ్య దానములఁ దీసినపు డడ్డపడితిమా? మీకెంత వచ్చిన దృప్తిలేదు ; మాకు వచ్చినంతకుఁ బదంతలు వచ్చియు మా వరుమానమున కోర్వఁజాలరా ?. ఊరక పోవోయి,తిక్క శాస్త్రులు," అనెను.

"మీ యభ్యంతరము లెందుకు పనివడు? మీరేలాటి యాటంకములఁ జేయగూడుదురు ? ఇచ్చెదరా ? లేదా ?" అని, పురోహితుఁడు ధ్వనితో నడిగినందుకు, "ఖండితముగ నీయము," అని యతివక్తఁడు వచించె. "ఈ గ్రామమునకు జుట్టుండు గ్రామముల కేనేపురోహితుఁడను; మరల మీరు ప్రస్తుతములకు వచ్చునపుడు చూచుకొనియెదను," అని పురోహితుఁడు చెప్పగ, "తామొక్కటికి రెండుగ సంభావనలఁ బొందుటను మేము చూచుకొనెదము," అని యతివక్తుండు సదుత్తరమిచ్చె. అంతట, పురోహితుండు గొణగుచుఁ బ్రత్యేకమైన వేదిక కరిగె. ప్రభాతంబున బ్రాహ్మణులెల్లరు లేచి యన్యస్థలములలో జరుగు శుభాశుభ ప్రస్తుతములకుఁ జనిరి. నాల్గవ నాఁడు బంధుపరిచారకాది వర్గమును బురోహితుండును వారివారి నిలయములకు వెడలిరి. ఈ శుభకార్యమునకై యిరువదివందల రూపాయలు ఖర్చుతగిలి, భద్రయ్య వదాన్యుండని వెల్లడినొందె; సుబ్బమ్మ మనంబు సంతుష్టినొందె.

ఉపనయన సంస్కారమైన యాఱవదినమున వీధియందున, "ఓ, అయ్యా," అను వీరుని కంఠనాదము వినవచ్చి, వెంటనే భద్రయ్య వీధికొట్టు కొనకేగి దవ్వున నిలఁబడియుండిన బత్తెకానిఁ గని,

"ఏమిర, వీర! ఎందుకు పిలిచితివి ? ఏమి సమాచారము ?" అని, యడిగె.

"అయ్యా! వానలులేక పైరుపంటలు లేవు; పనిపాటులులేవు; బత్యమేలాగున నడుగుదు ? నాకు బిడ్డలేడుగురైరి. నెలవిచ్చిన నాకుటుంబ

ముతో నగరమునకువెళ్ళి జీవనోపాయము వెతకుకొనెద; కాలము సుభిక్షమైనంతట మరలి వచ్చెదము,'' అని, వక్రనమస్కారముచేసి నిలువఁబడె. "మంచిది! వెళ్ళిరమ్ము,'' అని, భద్రయ్య పల్కెను.

వీరుఁడు కంటినిండుగ నీటిఁ బెట్టుకొని ధ-పంచమితోఁ గొంతసేపు మాటాడుచుండి, తుదకు ధనిష్టాపంచమికి వక్రనమస్కార మాచరించి గుడిసెకు తిరిగివెళ్ళుటకు సెలవుపుచ్చుకొనెను.

ఈ విషయముల వినుచుండిన సుబ్బమ్మ సేవకుని బిలిచి, "వీరుఁడు బిడ్డపాపలవాఁడు; బయటవెళ్ళిన బడిదినముల పయనమునకు దోవలో బువ్వకేమిచేయగలఁడు? మనయింటి శుభప్రస్తుతమున నొక్కనాఁడైన వానికంత (పుడిసిలిఁ జూపుచే) యన్నముపెట్ట వీలులేకపోయె. ఇదిగో, యీజొన్న సజ్జలలో నాలుఁగేసితూములు గొలిచి యిచ్చిరమ్ము,'' అనినంతట, ధ. పంచమి వాటిని రెండంకెములలో నేసికట్టిపెట్టెను.

ముహూర్తదినములందును వాటికిఁ బూర్వమునను బడిన యలసటలవల్ల ధ. పంచమి శ్రమపరిహారార్థమై యభ్యంజనముచేసి, క్షపాకాలమున మును ముందు వీధివితర్దిన బయ్యరకై పన్నుండె. ప్రత్యూషఃకాలమున నిద్రకనుగుణముగ మలయమారుతము వీచుచుండగఁ గుక్కుటకరటారావంబులు ధ. పంచమి గాఢనిద్రను భంగపెట్టఁగానందున, గంధవహుని విహారముంగని హర్షంబుతోలాస్యమాడు పాదపపలాశంబులమధ్యనర్కాంశువులు చౌర్యమున బ్రపరించి, ధ-పంచమి వక్త్రంబున నర్తనంబొనరించె. మిహిరునికరముల ఖరంబుచేత గ్రుక్కిన మేల్కని కనులనునులుముచుఁ జూడ నెలబోడు బారెఁడు పొద్దెక్కియుండె. తోడుతనతండు శంకలఁ దీర్చుకొని, మోమునుగాళ్లుసేతులును గడుగుకొని, యింటికిఁజని, చేలిదియన్నము గుడిచి, రంగనాథునతనితోఁబుట్టును బడిలోవదలి మాలవాడకడఁ బనివినియెను.

---

5 వ, అధ్యాయము.

మాలవాడలో పాదిరితో సంభాషణ; వీరుఁడు బాటమార్గమున బయనముచేసి పాదిరి మందిర మందుట.

పంచమకులముం జేరినవారి గుడిసెలయొద్ద జనులు కూటువకూడి మాటాడుచుండిరి. వారిమధ్య, శుక్లవర్ణంబుతోఁ బీవరతృణధ్వజముం బోలిన నరుం డొక్కండు నిలువబడియుండె. అతఁడు చేతియడుగులలో నాలుగులు పొడుగుగల్గి చీలమండపరకు బాపోసుల దొడిగియు, 'యిజారు, చొక్కాయ, టోపీ' వీటినిధరించియుఁ జేతనొకబెత్తమునుఁచేకొనియు మందహాసముతో మందలించుచుండె. అతనిని 'దొర' యని సంబోధించుచుండిరి. అతనికి దోడుగఁ గప్పువన్నె గల గిట్టయొకడుండె. వీరుఁడు దొరనుజూచి,

"అయ్యా! నా పెద్దలమతమును నేను విడువఁజాల; నూతనమైన క్రీస్తుమతము నవలంబించిన నాబంధుగులు ననువదలుకొందురు;దయచేసి నాకొకవృత్తిఁ జూపిన నేనును నాబిడ్డలును దమపేరుఁ జెప్పుకొని బ్రతికెదము,'' అని, చేమోడ్పుతో నిలువబడియుండె. ఈమాటలను వినుచువచ్చిన ధ. పంచమి,

"ఓరి వీర! దొరవారికేమి మనవి చేయుచున్నావు?'' అని యడిగెను.

"దొరవారు దిగువలోకమట; పాదిరియట; క్రీస్తుమతమును బోధించుచు, వారిమతమును నేనవలఁబించిన నాకుటుంబస్థుల దుర్దశ నివారణయై మంచిగతిఁ బొందుదుమట,'' అని, వీరుఁడు పల్కెను.

ధ-పంచమి దొరవారినిఁ జూచి, "సలాం,'' అని చెప్పగ, చేతిబెత్తముఁ గొంత పైకెత్తి, "సలాం,'' అని దొర చెప్పిరి.

"తాము పాతాళలోకమునుండి వచ్చినవారా? ఆలోకమునకుఁ బేరేదైన గలదా?"

"అమెరికా.'' (మొదటి యచ్చును తేలికగాఁ బల్కి తక్కిన యక్షరముల నొత్తి యుచ్చరించుచు)

"మెరిగలపింఛి చేసెదరే యానీమహా ?"

దొరతనకుబాసటగ వచ్చినవాని, " కాటికిస్ట్, " అని పిలిచి, 'కాస్ కూసు' మని యేదో చెప్పగ, గిట్ట, "అమెరికన్ ఫ్లోర్," అనెను. అందుమీఁద దొర, "ఓ !" అని దీర్ఘముగ నుచ్చరించుచు నవ్వెను. ధ-పంచమి పక్కన నవ్వినందున, దొర క్రోధముతో, "ఎందుకట్లు నవ్వుచున్నావు," అని, యడిగిరి.

"తమకు బాసటగ వచ్చి యుండు వారికి 'కాటిక' యని పేరా?"

" 'కాటిక' కాదు; కాటికిస్ట్."

విహసితంబుతో, "కాటికిటియా? మఱియు విశేషము!" అని, నవ్వగ దొరవారు కనలి, "కాటికిటి" కాదు, కాటి-కిస్-ట్," అనిరి.

"అదేమిభాష ?"

"ఇంగ్లీష్."

"ఎంగిలియిషు మాచిన్నవాఁడు, రంగనాథుఁడు 'కాస్కూస్' యని చేదువుకొనుచున్నాఁడు."

"రంగనాథుఁ డెవ్వండు ?"

"నా యజమానులువారి కుమాఁరుడు. అతని చెల్లియ యాఁడేండ్ల పసిది; లతయని పేరు ; మహాబుద్ధిమంతురాలు. ఈ యెంగిలిషు పింగిలిషు నిమిషమున జదువుకొను."

"మంచిది, సంతోషము !" అని నవ్వుచు, 'ఈమాలవాఁడలో నుండు వారికి జీవనమేమి ?" అని, దొర యడిగిరి. "వీరుఁ డొక్కఁడే నిన్నటివరకు బరాధీనుఁడు; తక్కినవారు కూలినాలిచేసి బ్రతికెదరు," అనుచుండగ, గుంపులో నుండిన యొకవదరుబోతు, "కూలిచేస్తే కుండకాలె; లేకుంటే యొండకాలె," అనినంతట నంపఱు పక్కన నవ్విరి. ధ. పంచమి దొరను జూచి, "తాము వీరునిచేతి యన్నము భుజియింతురా ?" అని యడిగె.

"మలినములేని వుట్టముగట్టి చేతులను శుద్ధపఱచుకొని వండిన, లేక, వడ్డించిన యన్నము గుడువ నభ్యంతరము లేదు."

"మీ మతముఁ జేరిన నిచ్చుకొనియుఁ బుచ్చుకొనియు సంబంధముఁ జేతురా ?"

"మేమన్యదేశస్థులము ; మావర్ణమువేఱు; ఇచ్చుకోలు పుచ్చుకోలు వల్లపడదు."

"మా వీరుడు మీమతముఁ జేరిన, మూఁడు లేక, నాలుఁగువేల రూపా యలిత్తురా ?"

"విత్తమున కాశపడి మామతముఁ జేరు టనుచితము."

"విత్తములేనివాఁడు రిత్త ; ఈకలికాలమున ద్రవ్యమే ప్రత్యక్ష దైవమని పెక్కుమతస్థులు మెండుగఁ గొండాడెదరు. లాభములేక స్వమతమునువదలి యన్యమతమైన తమ మతము నవలంబింపనేల ?"

(స్మితముఖంబుతో) "జ్ఞానముఁ దెచ్చుకొనుటకు."

"మతమునకును జ్ఞానమునకును సంబంధమేమి ? అన్న, మన్న, పాన్న — యీ యాశత్రయంబులవదలినదత్వజ్ఞానియు సిద్ధుఁడగు చున్నాఁడు. అట్టివానికి మతమేల ? దయచేసి వీరునిపంగడముఁజేరిన వారికిఁ జదువు చెప్పించి జ్ఞానోదయముఁ గలుగఁ జేసిన మీమతమును మెచ్చి యొక వేళ చేరినాచేరు."

"మా మతముఁ జేరినవారు మాత్రము మాసాహాయ్యముఁ బడయఁ గలరు."

"ఈఁత నేర్వక గుంటలోజాఱిపడిన యొకండు నీళ్ళలో మునిఁగి లేచుచు మరలమునుఁగఁబోవు సమయమున నచ్చేటనుండిన యీఁత నేర్చిన వేదాంతుఁడు .మరల మునుఁగబోవువానిఁజూచి, 'అయ్యో ! నీవు నాచెలి కాఁడై యుండిన నేను మునిఁగి నినుగట్టుచేర్చి నిప్రాణమిత్తు నని ట! తామూ డినమాట లత్తెఱంగుననున్నవి. అయినను, చింతలేదు. మావీరుఁడు మహాకష్ట

ప్రాణియు విశ్వాసపరుండును సత్యవంతుఁడును నగుటతో గొప్పకుటుంబి; అతని నేఁడైన యొకకొలువున నమర్చిన దమకుఁ గీర్తిదెచ్చి తానునుబ్రతుకు."

"నాకును దొడ్డకుటుంబమున్నది; వానిబిడ్డపాపలఁ జూతము; ఏదీ?" అనినంతటఁ జినుగుడుచేపాపతో వీరుని భార్యయుఁ గొమతి తెయుఁ గుమారులాఱుగురునువచ్చి వరుసగ నిలఁబడిరి. ధ పంచమి, రెండు మూరల యంపియను మొలఁగట్టియుండిన కొమతితెనుజూపి, "ఈ చిన్నది మొదటిబిడ్డ; పండ్రెండేండ్లది," అని, పురాతనమైనపేలికను నడుమునఁ జుట్టుకొని యుండిన 'అత్తిని'ఁ జూపి, "ఇతఁడు రెండవవాఁడు; జ్యేష్ఠపుత్రుఁడు; ఇతనికి, 'అత్తి' యనిపేరు," అని, చెప్పగ, దొరవారు, "ఆటీ," అని, చెప్పిరి.

ధ-పంచమి, "మీభాషలో నాలాగే; మాభాషలో, 'అత్తి' యని చెప్పుదురు," అని, సింఘాణ ముస్రవించుచు నిలఁబడియుండిన బిడ్డలు గొందఱు, జొల్లుకాఱుచునుండిన బిడ్డలుగొందఱు, బట్టలులేక పుట్టినయట్లే యుండిన యందఱినిజూపి, "వీరందఱును 'అత్తికి' జఘన్యజాలు," అని, చెప్పె. దొరవారు బిడ్డలనందఱిఁ జూచి యనుకంపమొంది, 'అత్తి'ని హస్తముతోఁ జూపి "ఇతం డెట్టిపనులఁ జేయఁగలఁడు?" అని, యడిగిరి.

"కృషిచేయుటయందుఁ దండ్రికిఁ దోడ్పడుచుండెఁ. ఏలాటిపనులఁ జేయఁగలఁడు," అని నంతట, దొరవారు, "నాయిలుఁజుట్టి పూదోఁట యుఁ గూరాకుతోఁటయుఁ బెట్టియుండెద; తోఁటమాలిగ వీరుని నియమించితి; వీరుని యిల్లాలిని నాకడపటిబిడ్డకు దాదిగ నియమించితి; 'ఆటీ'ని నతని యప్పను నా భార్యయుబిడ్డలును విహరించుకాలమునఁ దోడునీడ్తై యుండ నియమించితి," అని, వచించినంతట, దొరవారి కనికరముతోఁ గూడిన వచనానుగ్రహములకు సంతసించి, 'వీరుఁడు,' వీరునిభార్య, 'యారమ్మ', 'అత్తి', 'ధ - పంచమి,' వీరెల్లరుఁ దమకరద్వయంబులఁ బైకెత్తి తమనెత్తి మీఁదఁబెట్టుకొని, "సలాం! చాలాసలాం!" అని, యఱచిరి.

దొరవారు "శశిపురము, పాదిరి మందిరము," అని, యొకచీటివ్రాసి వీరునిచేతఁ బెట్టుచుఁ దానునివసించు నగరమునకు మార్గముఁదెలిపి యాలస్యముచేయక వచ్చిచేరునట్లాజ్ఞాపించి, తనసహబోధకుఁడైన నల్లగిడ్డయుఁ దానును సలాముచేసి, 'బైసికిల్' అను ద్విచక్రియైన త్రొక్కుడు బండ్లమీఁద సవారి వెళ్ళిరి.

ధ-పంచమి వీరునిఁ జూచి,

"ఓరి, వీర! నీకు మంచికాలము దొరకొనె; దొరవారి యనుగ్రహము గల్గినందున నీకుటుంబము నెమ్మదిఁబొందు. అత్తియు నతని యనుజులును దొరవారి భాషను నేర్చిన దొడ్డస్థితికి వచ్చుటకు సందియము లేదు; మీరెల్లరు నీపటికే శశిపురమునకు బయలువెడలుఁడు; దొరవారి కొలువున నమర్పబడినంతట, నాకొక లేక వ్రాయింపుము; చాల ప్రొద్దాయె. బడినుండి పిల్లగాండ్రను దోడ్కొనిపోవువేళ సమీపించె," అని, సుబ్బమ్మగారిచే నియ్యబడ్డ జొన్నసజ్జలఁ బేటకంబులఁబోసి, వాటిని వారిమార్గమునకుఁ బెట్టుకొనుఁడని చెప్పి, "మీరు వెళ్ళివచ్చెదర?" అనినంతట, వీరుఁడు తన కంటినుండి నీటిధారలొలుకుచు నిలఁబడి,

"వెళ్ళివచ్చెదమయ్యా; మీయనుగ్రహముచేత దొరవారి మనముకఱిగి మమ్మునతని కొలువులో నుంచుటకొన సమ్మతించిరి. ఏను కొలువుఁజేరినతోడు తోఁ గమ్మవ్రాయించెద. ఏనాఁడును తమజ్ఞాపకమేయుండు; తాముచేసిన మంచి నేనాటికి మఱవను. రోజుకు మాయింటవెలుంగు దీపము తాము ముట్టించిపెట్టిన దీపమనుకొందును. యజమానులువారికిని నాతల్లిగారికిని మాదండములు జెప్పుడు," అని, ధ. పంచమికి వక్రనమస్కారమొనర్చి నిలఁబడి యుండగ, ధనిష్ఠాపంచమి గుడిసెలదాఁటి వెళ్ళుచుండె. అతఁడు కంటికగోచరమైన పిదప, వీరుఁడు కన్నీటిఁ దుడుచుకొని యింటిలోన జేరెను.

అటుతర్వాత, యారమ్మ జొన్నసెజ్జలను బిండిగొట్టి, యాపిండితో రొట్టెలు గాల్చి, సంకటిముద్దలు జేసె. వీరుఁడు మార్గంబున నీళ్ళు త్రాగను

రెండు వంగపాత్రలు గడియించి, రొట్టెలును సంకటిముద్దలును నొక మూటఁగట్టి, యన్నిటి నొక శిక్యమున నేసి, కచమును గొట్టమునకుఁ దగిలించె. పిమ్మట, తనగుడిసెలో నుండిన మట్టిపాత్రలను బందుగుల కొసంగుచు వారియొద్ద సెలవుపుచ్చుకొని, రేయి గుడిసెలోఁ బరుండె. పయనమై పోవుటఁ జింతించి చింతించి తత్తరపాటు జెంది, యెపుడు తెల్లవాఱునోయని నిదుర పట్టక యానలించుచుండెను. 'కొక్కరోకో' యని జామకోడి కూసినపుడు కొంత నెమ్మది దెచ్చుకొనె; కొంత సేపటికి వాయసస్వానము శ్రోత్రము లంబడ నందఱిని లేపె. అందఱు లేచినవెంటనే, కచమును భుజమున వ్రేలాడ వేసికొని కుటుంబముతో శశిపురమునకుఁ బయనంబయ్యె.

గడియకొక్కమైలు పంతున వీరుఁడు 'పిల్లాపిసకలతో' దారినడచుచుఁ బదియవగడియకు వేవెలుంగు వేఁడిమిఁ దాళలేక డస్సి, బాటయంచున నొక కానుగుమ్రానిక్రింద బిడ్డలందఱు నీడిగిలఁ బడిరి. పసివాండ్రకు నోరెండుకొని పోయినందున మాటాడఁ ద్రాణతప్పి దప్పి బాధఁ జెయి సంజ్ఞలతో దెలుపనేదెసఁజూచినను సలిలము కనులగపడక యొకదిక్కున బచ్చగఁ బొలములవలెఁ గనిపించె. వీరుఁడు వంగబుఱ్ఱల నచ్చోటికి దీసికొని వెళ్ళిన నడబావియొకట్టి కనులఁబడె. అరుసమొంది దగ్గఱఁ బోయిన రెండు నస్యోతములు గుడిసెలో గూటములకు రజ్జుచేఁ గట్టబడియుండె; చేరువ నొకరుఁడు గుఱక పెట్టి నిదురించుచుండె; కపిల, చానత్రాడు మొదలగునవి నీటి తూములోఁ బదిలింపబడియుండె. "ఓ, అయ్య" అని వీరుఁడు కూఁతలువెట్టఁ గూర్కెడినవాఁడు మేల్కని, "ఎవ్వండవునీవు?" అని, యడిగె.

"అయ్యా! ఏను పంచమ కులస్థుఁడను; అదిగో, నాబిడ్డలు నోరెండి చెవులుగనులు మూసికొనిపోయి, డస్సి పడియుండెదరు. బావిలోదిగి యేను తెచ్చిన తమరపుతలియలలో నీళ్ళు నించుకొని వెళ్ళవచ్చునా?" అని యడుగ, మేల్కనినవాఁడు,

"పంచములు బావినీళ్ళనంటఁగూడదు; అదిగో (ఒకనిపానముఁ జూపుచు) గిబ్బలయొద్ద నొకతొట్టి యున్నది; అందు డబ్బరల నించుకొని మిగిలిన నీళ్ళను గొట్టముఁ దెఱచి బయటతీసి వెళ్ళుము," అనగ,

"అయ్యా! రెండవతేపవచ్చి తలియలలో నీళ్ళు నిండించుకొని, మిగిలిన నీళ్ళను బయటతీసి వెళ్ళెదను," అని చెప్పి, వీరుఁడు ప్రథమమున దన కాళ్ళు చేతులును ముఖమును గడుగుకొని, కొంత దాహముపుచ్చుకొని, తలియల నించుకొని బిడ్డలకడఁజనె. పిల్లగాండ్రు లేచి యొక్కొక్క డొక చెంబు నీళ్ళు ద్రాగె. రెండు తడవలు వచ్చి నీళ్ళు గొంపోయియు బిడ్డల దూప తీఱకపోయె. కడపటిసారి మరల దాహముపుచ్చుకొని, తలియల నిండించుకొని కొద్దిగ మిగిలిన నీళ్ళను గొట్టముఁ దెఱచి బయటతీసి, దండములువెట్టి వెళ్ళెను.

ఉబ్బడగినంతట నందఱు నడచిపోయి ప్రొద్దుగ్రుంకినచోట నొక పల్లెచెంత నిలిచిరి. ఆపల్లెకుఁ జేరినవారిలో నొకండు, "మీరెవ్వరు? ఏడ వెళ్ళెదరు?" అని, యడుగ,

"మేము పంచమకులస్థులము; శశిపురమునకు వెళ్ళెదము; ప్రొద్దు లేనందున నిచ్చోట నిలిచి యుదయంబున వెళ్ళెదము," అని వీరుడు చెప్పె.

"శశిపురమేడ? మీరేడ?" అనుచునతండు పల్లెలోనఁ జనెను.

ఒక పెద్దచింతమ్రానిక్రింద యెండి పడియుండిన చెత్తపుల్లల గుమికూర్చి యగ్గి ముట్టించి, యా వెలుఁగున దానును దన యిల్లాలును బిడ్డలందఱును రొట్టెలఁదిని, సంకటిముద్దల సాపిడి, మ్రానికిదిగువ మయిమఱచి నిదురవోయిరి. అరుణోదయంబున లేచి రెండవరోజు పయనముఁ దొడంగిరి. పవలంత నడచుచుఁ బ్రొద్దుగ్రుంకినచోట నిలుచుచు, దినమునకు రెండామడలు పంతున యాత్రచేయుచు నేడవదినమున జాముప్రొద్దుండగ శశిపురమునకు రెండుమైళ్ళదూరము జేరిరి. అచ్చోటఁ గొంత విశ్రమించి, పురద్వారమున స్థాపితమైయుండిన పాదిరిమందిరము జేరిరి. దొరవారు వారిని గని

యరుసమొంది తోఁటకడను వంటచేయుటకు వలసిన సామగ్రుల నిచ్చి, వారు మెసవి వచ్చినవెనుక, తన మందిరమున నొకమూలఁజూపి, మీరు "గాసిబడి వచ్చినారు; ఇచ్చోటఁ బరుండిన నుదయమున గనుఁగొనవచ్చె," అని, బంగళాలోన జనిరి.

ప్రాతఃకాలమున వీరుఁడు పన్నుండినచోటికి దొరవారు విజయము చేసి నపుడు వీరుని కుటుంబస్థులు సాష్ణమాఖులై భాషించుచుండిరి. వారిఁజూచి దొర పరితోషించి, "వారములో భానువారము జేజేప్రార్థనదినము; కనుక, యీ దినము విశ్రామదినము," అని, వారిలో నొక్కొక్కరిని బిలిచి వారు చేయవలసిన పనిఁ దెలిపించుచుండగ, దొరగారితోఁ దోలి వచ్చియుండిన కప్పుగిట్ట యేగుదెంచె. గిట్టనుజూచి వీరుడు మొదలగువారు సలాము చేయుగ, "మీరు మాటతప్పక వచ్చినందుకు సంతసమొందితి," అని తెల్లని పండ్లు నిగిలించె. గిట్ట దొరవారి యుత్తరువుచొప్పున 'అత్తి' యప్పుడుఁ బర్క్రెండుమూరల సల్లాగుడ్డను గట్టుకొననిచ్చి, అత్తికిని వానితమ్ములకును జెఱియొక షరాయియు జోక్కాయయు నిచ్చె; బాలురు వాటిని ముదమున దీసికొని ధరించిరి. దొరవారు ప్రముదితులై, 'బాయ్' అని పిలిచినంతట, మొలధవలచేలమును ధరించియు దేహముపైఁ జోక్కాయదొడుగుకొనియుఁ దలచుట్టుఁ దలకట్టుఁ గట్టుకొనియు నుండిన నీమ నేలబొగ్గువలె నొక మానవుండు, "సార్" అనుచు, ద్రుతంబునవచ్చి దొరవారి మ్రోల నిలఁబడె. దొర యీ నీమబొగ్గుకు వీరుఁడు వగైరాలను జూపుచు వారు చేయవలసిన పనులను దెలిపించి వారియొద్ద రోజుకు బనితీయుచు నొక్క వారమువరకు బైవిచారణచేయుచు రావలెనని యాజ్ఞాపించిరి. నేలబొగ్గు చెప్పినమేరకు వీరుఁడు వగైరాలు వంచనలేక, తమ శక్తికొలఁది పాటు పడుచు వచ్చిరి.

౬-వ అధ్యాయము.

లతాంగి పాఠశాలలో జదువుకొనుటయు జెలికత్తెలతో నాడుకొనుటయు.

రంగనాథుఁడు చదివిపెట్టిన పుస్తకములను లతాంగి స్వయముగఁ జదువుకొనుచు సామాన్యముగ రెండేండ్లలోఁ జదువుకొనదగిన పాఠముల నేఁడాదిలోఁ గఱచుచు నేటేట రెండు తరగతులు పైకి మారుచుఁ బదియవ వయస్సున రంగనాథుఁడు జదువు తరగతికిఁ గ్రింది తరగతిఁ జేరెను. లతాంగి యొకతడవ వల్లించిన పాఠమును మరల వల్లింపఁ బనిలేదు. ఒక్క తడవ చూచిన నది యద్దాని మనసున బాదుకొను. అట్టి యపారమైన జ్ఞాపకశక్తింబట్టి 'యేకసంతగ్రాహి' యనియు, సులభముగ గ్రహించుచుండినందున 'సూక్ష్మగ్రాహి' యనియుఁ బరఁగె. ఒక్కొక్కరిచేత నక్షరములు వికార రూపములనొంది వ్రాయఁబడుచున్నవి. లతాంగి వ్రాసిన యక్షరములఁ జూచిన నచ్చేక్షరములా, లేక, చేత వ్రాయఁబడ్డవా యని సులభముగఁ దెలిసికొన నలవికాదు. గిలుకకయు వంకరటింకరగ వ్రాయకయు వక్రకొమ్ములఁ బెట్టకయు నొత్తొక్కచో నక్షరములు మఱియొకచో లిఖియింపకయు సొట్టలులేక యక్షరములకేర్పడిన రూపపరిమాణములకొలఁది వ్రాయుటగాక, పదములమధ్యనునక్షరములమధ్యను విడువవలసిన విధాయకమైన చోటు విడిచి వ్రాయఁబడిన దానియక్షరలక్షణంబులఁజూచి యుపాధ్యాయుండు మెచ్చుచుండుటం బాలఁజూచుచుండిన ధనిష్టాపంచమి,

"స్వామీ! చెయివ్రాఁతంబట్టి నొసటివ్రాఁతఁ జెప్పఁ దరముగాక పోయినను కొన్నిగుణాతిశయములఁ గనుగొనఁ దగునట," అనెను.

"ఏగుణాతిశయములఁ దెలిసికొననగు?" అని యుపాధ్యాయుం డడుగ,

"ఒక్క తడవ వ్రాసినట్లు మఱియొకతడవ వ్రాయనివానికి స్థిరము లేని గొనమట; చిత్రరేఖలతోఁ జిత్రంబుగ వ్రాయువానికి డాంబికగుణమట; 'అక్షరములు, పదములు, పంతులు,' వీటి మధ్య చోటువిడువక వ్రాయువాఁడు పిసినారియట ; అనావశ్యమైనచోటు విడిచి దూరదూరముగ వ్రాయువాఁ డమితవ్యయపరుఁడట; శ్రమలేక యక్షరములఁ దెలిసికొనఁ గూడని చిక్కువ్రాఁతల వ్రాయువాఁడు గూఢ మనస్కుఁడట; ఈలాటి దుర్గుణము లెవ్వియులేక సుగుణసూచకములతో మసలతవలె వ్రాయువారు తమవంటివారిచే శ్లాఘింపఁబడుట కర్హులట," అని, నవ్వెను.

"ఈవింతయైన శాస్త్రము నెవరియొద్ద దెలిసికొంటివి ?"

"తమవంటి పెద్దలవాచా చాలు దినములకుముందు వింటి, దేవర."

లతాంగి యొకదినము పాఠముల నప్పగించినవెనుక, తక్కినవారు పాఠముల నప్పగించు సమయమున నూరకుండలేక యొక కాగితములోఁ బటము వ్రాయుచుండె. బోధకుఁడు సమీపమునవచ్చి లతాంగిచే వ్రాయఁబడుచుండు పసరుపటముఁజూచి,

"మమ్మారె ! దీని చెక్కఁదనము నేమందు ? దేవలోకముననుండు గోవువలెనున్నది. ఇంత ముద్దుగల యావును నీవెప్పుడైన జూచియుందువా ?" అని, యడిగెను. లతాంగి బదులాడక చిఱునగవుతో నుపాధ్యాయుని జూచె. బాలురందఱు బటముఁజూచి, "ఎంత ముద్దు ! ఎంత సొబగు !" అనుచుఁ బటమునకు ముద్దువెట్టిరి. అపరాహ్ణంబున బాలురు బడివిడిచి వెళ్ళుటకు ముందు, బోధకుండు, "బాలిక, బాలురార !" అని, సంబోధించి, "రేపును మఱుసటిదినమును సెలవుదినములైనందున నొక్కొక బాలుఁడును బాలికయు మన 'శ్రీమంతపల్లె' గ్రామపటమును జక్కఁగ గీచి, సోమవారమునాఁడు నాకు జూపవలెను. అట్లు వ్రాసిచూపనివారు నాతర

గతిలో బల్లమీఁద రెండువారములు నిలువఁబడి యుండవలెను; తెలిసెనా!" అని యడుగ నందఱు నట్లేయనిరి.

మఱునాఁడు లతాంగి తన కన్నయ్యతోఁ జెప్పి యంగడినుండి పటము వ్రాసెడి కాగితమును, రంగుపుల్లలును, గణికలును రప్పించి, శ్రీమంతపల్లె గ్రామపటము గీచి, యందునఁ దనకుదెలిసిన వీధులును, విపణియు, దేవళమును, నారామమును, గుట్టలు మొదలగువాటిని లాంఛనములతోఁ గనిపించె. ఇందువారము బోధకుఁడు బడికివచ్చుటకు మునుపు, బాలురు దాము వ్రాసి తెచ్చిన పటముల నొకరికొకరు జూపుచుఁ బరిహసించుచుండిరి. ఉపాధ్యాయుండు లతాంగిని వెంటబెట్టుకొని వచ్చుటంగని, బాలురు సద్దుడిగి తమ తమస్థానములఁ గూర్చుండిరి. లతాంగియుఁ దనకు నియమింపబడిన స్థానమున నెప్పటివలెఁ గూర్చుండె.

"పటముగీచుక వచ్చినవారెవరైవనుండిననట్టివారు లేచి కడపటి స్థానమునకేగి యచ్చోట నిలఁబడవలెను," అని, మారయ్య యాజ్ఞాపింపగ నిరువురుపిల్లగాండ్రు తిన్నగ లేచి, యేవారపేక్షింపని శాసనంబిడినచోటికి జేఱిగిరి. మారయ్య ప్రథమమున లతాంగిని బిలిచి యది గీచితెచ్చినపట మేది యనఁ దన పాఠపుస్తకమునుండి తాను గీచితెచ్చిన పటముఁ దీసి యయ్యవారి కందజేసె. శిక్షకుం డద్దానిఁజూచి తనలోఁ దాను సొంపుగాంచుచు "ఈ పటమును నీవు చేతగీచితివా ?" అనుచు, లతాంగినిఁజూడ నది నవ్వుచేఁ బిలిచెడి రీతినఁ దన ముద్దుమోముఁ గ్రిందికి నూఁచె. అంతట, బాలురందఱుఁ బటముఁ జూచుచు నుపాధ్యాయుని జుట్టుకొనిరి. మారయ్య పటముఁ జూచి, "ఇంతసున్నితముగ నింతసాదృశ్యముతో నెట్టిచిత్రకరులు వ్రాయలేరె ! జగత్ప్రసిద్ధితో నన్యదేశములందుండిన 'రూబెంస్,' 'సార్టో' 'అపెలిస్' యిటువంటి రంగాజీవుల పటములకు మించియున్నది. ఇదేమి? కోవెల; ఇదేమి ? ధ్వజస్తంభమా ? చిఱుగంట లిప్పుడే వాఁగునట్లున్నవి. గుడిచేట్టుపవనమా ? టెంకాయఫలములను మామిడిఫలములను

నిపుడే కోసి తినవచ్చునట్లున్నవి. అంగడివీథిఁ జూచిన ధనధాన్య లక్ష్మి తాండవమాడునట్లున్నది.'' ఈలాగునఁ బటమున దోఁచినవాటిని జెప్పుచు రాగా, లతాంగి నవ్వుచు నన్నిటికిఁ దల నూఁచుచుండె. మారయ్య మరల పటముఁ జూచుచు, ''ఇదిగో! తోరణంబులఁ గట్టి యరఁటిచెట్లఁ గట్టియున్న యీ యిల్లెవరిది? ఓ! మీ పెండ్లియిల్లా?'' అనినంతట, లతాంగి సిగ్గుపడి మూతిఁ ద్రిప్పుకొనెను. మరల బోధకుండు పటముఁజూచుచు, 'ఇది మాలవాడ; ఇదినది; ఇవి గుట్టలును దొనలును బుగ్గలును; నీళ్లిపుడు స్రవించునట్లున్నది; కొంత దాహముపుచ్చుకొందువా?'' అన, బాలురు నవ్విరి. ''ఇది వనము; ఇది పొదరింటివలె నున్నది. మంజులమైన వికసించిన మొగ్గలు, వికసించుచుండు మొగ్గలును నెన్నివర్ణములతో నింపుగనున్నవి. వనము నందలిపూలు వాడు; నీపటములోని పూవులు వాడవు. అహా! ఈయలరు లెంతరమ్యము! కొన్నిటి గోసికొందునా?'' అని, లతాంగి ముఖముఁ జూడ, లత స్మితముఖముతో గోసి కొనవచ్చునను సంజ్ఞ దెలుపునట్లు కనుగిలుపుచేసె. ''ఈ దొనలును బుగ్గలును బొదరింటినిజూచి యుందువా?'' అని యడుగ, ''మా నాయనగారితో నొకతేప వెళ్ళి చూచి యుండెద,'' అని, లతాంగి చెప్పెను.

''ఈపటమున నీపేరు నీచేతనే వ్రాయఁబడి యున్నది; నీ బంగారు చేత వ్రాయఁబడిన యీపటము నీతరగతిలోఁ దగిలించిపెట్టెద,'' అని యుపాధ్యాయుండు పటమును నొక్క చీలకు దగిలించి వ్రేలాడవేసె. అంతట బాలురందఱుఁ దమతమ స్థానములకు జని కూర్చుండిరి.

మారయ్య మొదటి బాలుని బిలిచి యతఁడు వ్రాసి తెచ్చిన పటము జూపుమని యడిగె. బాలుఁడు తాఁ దెచ్చిన పటము నయ్యవారిచేతఁ బెట్టి, యొక చేతితో దననోటిని మూసికొని, యింకొకచేతితోఁ దలను గోకుచు వంకరగ నిలువఁబడె.

''ఇదేమి?'' అని, మారయ్య యడుగ, ''పటము,'' అని, బాలుఁడు చెప్పె. ''పటమా? నీముఖమా? నీవెంత లక్షణముగ నిలిచి యుండెదవో యంతలక్షణముగనున్నది నీపటము; దీనిని నీముఖమున వేసికొనుము,'' అనుచు నాపటమును బాలుని ముఖమునకు బ్రక్కన బాఱవేసె. మారయ్య రెండవ బాలుని బిలువగ నతఁ డందిచ్చిన పటముఁజూచి,

''ఓరి, శెట్టి పిన్నవాఁడ, నీకు మంచి కాగితము దొరకలేదా? ఏమి! ఈ కాగితమున మందుగబ్బు కొట్టుచున్నది. ఈ పటము పొట్లముగట్టుటకే, సరి,'' అనుచుఁ బటమును శెట్టిచేతఁ బెట్టి, మూఁడవ బాలుం డిచ్చిన పటముఁ జేత గ్రహించి, ''ఏమి! కొక్కర బెక్కరగ గీతలు గీచి యున్నావు. ఎట్టివారుఁ జూచియుండని విచిత్రమైన కోఁగలవలె నున్నవి. దీనిని నీనెత్తిమీఁద నంటించెద,'' అనుచు, బాలుని గుళ్ళాయను బయట తీసి, పటముయొక్క పైభాగమును గుళ్ళాయయడుముకొనునట్లు నెత్తిమీఁదఁ బటమును, పటముమీఁద గుళ్ళాయనుబెట్టి యదిమి, ''పొమ్ము నీచోటికి! నీముఖము, నీపటము - ఏటియందచందముల నందఱుఁజూచి యానందపడుదురు,'' అని, పంపెను. నాల్గవస్థానమందలి బాలుని బిలువ నతఁడు పోను మనసులేక తిన్నఁగఁ గదలి పటము నయ్యవారి బల్లమీఁదఁబెట్టి క్రమ్మఱెను. మారయ్య యాపటముఁ జేతఁ బెట్టుకొని, బాలుని దగ్గఱ రప్పించి, ''లతాంగి పటమునకు నీపటము దృష్టి పరిహారము; లోకుల కెనిమిది దిక్కులైనను నీపటమునకు లెక్కలేని దిక్కులు. ఏ దిక్కున నీపటముం జూడవలెను? 'ఎల్లిశెట్టి లెక్క యేన లెక్క'న్నట్లన్నిటికి నొకటే రీతిగ గీతలు గీచి యుండెదవు; లత పటమునకు నీ పటముఁజుట్టి దృష్టితీసెద,'' అనుచుఁ బటమును జేత నలిపి, చెండుచేసి, విసరివేసె.

ఉపాధ్యాయుం డివ్విధంబున నొక్కొక్కబాలుని పటముఁ దీసి తిరస్కరించిన పిదప, తుదిన నిలిచి యుండిన బాలునికి ముందు నిలువఁబడి యుండిన బాలుని బిలిచి, ''నీవు మంచి బుద్ధిశాలివి; నీ సహపాఠకులు పట

పటమువ్రాసి తెచ్చియుం జీవాట్లుపడిరి; నీ వాపరిభవముం దప్పించుకొంటివి. నీ వెందుకు వ్రాయలేదు? తీరికలేక వ్రాయలేదా? లేక, వ్రాయను దెలియక వ్రాయలేదా?'' అని, యడిగె. బాలుఁడు, పటమువ్రాసి తెచ్చి యిచ్చియు నవజ్ఞనొందిన వారివలెగాక పటమువ్రాయకయే యవహేళనముం దప్పించుకొనెనను యెఱుక చేతఁగల్గిన యభిమానముతో నయ్యవారి దండ నవ్వుచు వెళ్ళి ''పటము వ్రాయఁ దెలియనందున వ్రాయలేదు,'' అనెను. మారయ్య, వెంటనే బాలుని చెవులఁబట్టి నులుముచు, ''వ్రాయఁదెలియదా?'' అని యడుగ, బాలుండు, 'ఉస్స' నుచు, ''తెలియదు, సార్,'' అనెను. మారయ్య చెవులను నొక్కి నులుమ నారంభించి, ''ఇఁకఁ దెలిసికొని వ్రాయుదువా?'' అని, యడిగినపుడు, ''తెలిసికొని వ్రాసెదను, సార్,'' అని, పిల్లగాఁడు మూలుగుచుఁ జెప్పె; బిత్తరపోయి బెదరిన చూపులతోఁ జివర నిలిచియుండిన బాలునికడ కేగి, ''నీవెందుకు పటము వ్రాయలేదు?'' అని యడిగినందుకు, బాలుఁడు కొంతయోచించి, ''సార్, తల నొప్పిచేత వ్రాయలేదు,'' అనెను. అందు మీఁద మారయ్య, ''తల నొప్పియే గాని చెయి నొప్పి లేదే?'' అని, బాలుని కరభంబున దన బలము కొలఁది చిటిక వ్రేయుచు లతాంగిని జూడ, దాని ముఖకళలు కృశ్యంబగుటఁ గనుగొని దండన జాలించి తన స్థానమునకు మరలి కూర్చుండె. ఇవ్విధంబున బ్రొద్దుటి పూఁట కడచిపోయె. అటు వెనుక దినపాఠములు యథాప్రకారము జరుగుచువచ్చెను.

లతాంగి ప్రతి వాసరమును ప్రభాతంబున లేచి, పుష్పవనమునకుఁ జని యచ్చోటి ననలంగోసి దేవతార్చనకుఁ దెచ్చుచుండె. ఒకనాటి యుదయమున దన తల్లితో, ''అమ్మా! మామ మూఁడు విగ్రహములఁ దెచ్చి యిచ్చిరి, కదా? వాటిలో సుమాదేవి విగ్రహముం దాము పూజించుచున్నారు; శ్రీసుబ్రహ్మణ్య విగ్రహమును నాతండ్రిగా రారాధించుచున్నారు; శ్రీరాముల విగ్రహ మెచట? ''అని, యడిగె. నాలుగేండ్లవాఁడు తెచ్చి యిచ్చిన విగ్రహ

ముల జ్ఞప్తిని నుంచుకొనియడుగుచున్నదని తనలోఁ దాను సంతసించి, ''శ్రీరాముల విగ్రహము పెట్టియలో నున్నది,'' అనెను.

''అమ్మా! విగ్రహము నర్చింపక యింటఁ బెట్టుకొనరాదు; నాచేత నిచ్చిన నేను పూజచేయుచు వచ్చెద. 'ఎట్లగు' పూలు దెచ్చుటకు బుష్పవనమునకనుదినము వెళ్ళుచున్నాను; మఱింత పూలఁ దెచ్చిన నాకొదుగు.''

''నీవెంత! నీవయసెంత! పసిబిడ్డలకు బూజలేటికి? పునస్కారము లేటికి?''

''ఏల? పసివారు పూజచేయరాదా? శ్రీమార్కండేయులు పసినాటి నుండిపూజించుచుండలేదా?'' తనకొమరితె బాల్యముననే మార్కండేయుల నామచరిత్రములఁ దెలిసికొనినందుకుఁ దనలోఁదాను పూరించుచు, ''పెద్దలుండగఁ బసివారికిఁ బూజాపునస్కారములేల? తల్లిదండ్రులపుణ్యము బిడ్డల జేరుగద?'' అని, తల్లి యడిగెను.

''బిడ్డలొందుట నిజమైనను బిడ్డలునుబూజచేసిన మఱియు విశేషము గద?''

''నీవింతశ్రద్ధతో నడుగుటచేత విగ్రహము నిచ్చెద,'' అనుచుఁ జేము పెట్టియలోభద్రపఱుపబడియుండిన శ్రీరాములవిగ్రహమును బెట్టియతోఁదల్లి లతాంగిచేతనిచ్చె. లతదానినెలమిఁ జేకొని, యింటిలో నొకగదిశుద్ధపఱచి, పెట్టియనులోనుంచి, తాళమువేసికొని, అలనాఁడు మొదలుకొని, వేకువజామునలేచి దంతకరచరణముల బరిశుద్ధము జేసికొని, పూలఁదెచ్చి, దినమొక్కటైనఁ దప్పక, శ్రీరాములవిగ్రహమును బత్తిమీఱ,

కం. శ్రీరాముల సేవించిన
ధారాళంబుగఁగల్గును ధరసేవరమున్
శ్రీరాఘవసంకీర్తన
సారథ్యమొసంగుసకల సౌభాగ్యమ్ముల్.
అను నమ్మికతో బూజించుచుండె.

భక్తికిమించిన బుద్ధియో బుద్ధికిమించిన భక్తియో యని కనుఁగొనలేని ద్విగుణ రత్నంబులఁ దలఁచితలఁచి, తల్లిదండ్రుల మనంబుప్పొంగె. పూజాంతమున లతాంగి శ్రీరాములఁ బ్రార్థించే సమయమున, తొలుతఁ దనను గన్నవారిని దనపెద్దను ననుగ్రహింపవేఁడి, తన్ను దన స్త్రీజాతిని ననుగ్రహింపవేఁడి, తుదకు సర్వజనులు ననుగ్రహ మొందుదురుగాక యని మ్రొక్కుచుండెను.

ఒకమందవారమునాఁడు, తనయింటికి నాల్గవయింటియొద్ద బాలికలు కూడి యాటాడుచుండుటఁగాంచి, తల్లితో లతాంగి, "అమ్మా, నాల్గవ యింటిదండ మనయిండ్లవారి పడుచులాడుకొనుచుండెదరు; నేనచ్చటికి వెళ్ళి వారితోఁ గొంతసేపాటాడి వత్తునా?" అని, యడిగెను. పోయి రమ్మని తల్లి సెలవిచ్చినంతట, లతాంగి యచ్చోటికి వెళ్ళుచుండఁగ, బాలిక లొకరితో నొకరు, "లత వచ్చుచున్నది; ఏదో మంచి కాలము," అని చెప్పుచుండగ, లతాంగి వారి మధ్య వచ్చి, నగవుముఖముతో నిలఁబడె. వారిలో చిత్రాంగి యను బాలిక, "ఈదినమే సుదినము; నీవు మాయొద్దవచ్చి నందుకు మేమెంత భాగ్యము జేసితిమో," అనెను.

"ఏమి, పెద్దలవలె మాటాడుచున్నావు," అని లతాంగి చెప్పుచుండగ, కోకిలాంబ యను చిన్నది.

"నేఁడు నిజముగ వానవచ్చును," అనెను.

లతాంగి నింగిఁజూచి, "ఏడ! రాలేదే," అని నవ్వెను.

సుందరాంగి యనుపిల్ల, "మా యాటలలో నీవు కలిసికొనెదవా"? అని యడుగ, లత,

"ఏమియాట లాడుచున్నారు? ఏదీ? చూతము," అనెను.

"తల్లిబిడ్డలాటలాడుకొనుచున్నాము; బిడ్డలకుఁ దలంటి, జలకము పోసి, బువ్వవండి తినుచున్నాము," అని, సుందరాంగి చెప్పుచుండగ, 'కోకిలాంబ'యను చిన్నది 'సుందరాంగి' చెయింబట్టి 'తలఁటుకొనుమె' యని

చెప్పి, 'సుందరాంగి' తలమీఁదఁ దనపట్టి చెయినిడాచి, నీళ్లు పోయు భావనను, అనగా, నీళ్ళను చెంబులో నించునట్లును నీళ్ళఁ దలమీఁదఁ బోయు నట్లును నుత్తచేతితో సంజ్ఞచేసె. దీనిఁ జూచినంతట, లతాంగి మనోరంజకమైన మందహాసముతో, తల్లి బిడ్డలేమి! తలంటులేమి! ఇవియెన్నడును మనయింట జెరుగునవియే, కద! ఈయాటలో రక్తిలేదు," అని, చెప్పెను.

"బొమ్మలపెండ్లిండ్లాట నాడుదమా?" అని, చిత్రాంగిచెప్పగ, "అబ్బబ్బ! ఎంతోఁ బసివారమైన మనకుఁ బెండ్లిమాటలేల? మనవంటి చిన్నవాండ్ర కనుచితమైనయాటను గలలోనైన దలఁచుట సరికాదు," అని, గంభీరస్వరముతోఁ బల్కఁగ,

"దాఁగుడు మూఁతలాటనాడుదమా?" అని, కోకిలాంబయడిగెను.

"అది నిష్కళంకమైనయాట; అందులో బాధకరములేదు; అని, లతాంగి వచించినంతట నందఱు సమ్మతించినవారై, యేకమతముగ లతాంగిని నాయికగ నేర్పఱచుకొనిరి. లతాంగి యొక కుఱ్ఱదానికనులనుమూసినంతటఁ దక్కినవారు దాఁగిరి. ఈక్రీడనుఁ గొంతసేపుసలిపి, చాలించినవెనుక, బాలికలు గుంపుకూడి సంభాషించుటకుఁ దొడఁగిరి. అపుడు పడుచులందఱు లతదేహము నంటుకొనునటుల దగ్గఱ కూరుచుండిరి.

చిత్రాంగి - ఓసి, లత! నీవు లావైన పెడల్పుగాజులఁ దొడుగుకొని యుంటివి గద? వాటిఁ దీసివేసి యీ సన్నగాజుల నేలతొడుగుకొన్నావు?

లత - అవి నాకంటికి రమ్యముగలేనందున వాటిఁ జెఱచి యీ సన్న కంకణంబులఁ బెట్టుకొంటి.

సుందరాంగి - ఈకాలములోఁ జేతికి రెండేసికంకణములఁ బెట్టుకొను చుండగ నెందుకొక్కటే పెట్టుకొన్నావు?

లత- ఉత్తచెయిగ నుండరాదని.

కోకిలాంబ - మనలతచెయికి గాజులు దొడిగినాలెస్స; తొడుగకున్నను లెస్స.

చిత్రాంగి- మనలతచేతికి సన్నగాజు లెంతలక్షణము! చూచితిరా, చెల్లెండ్రార?

సుందరాంగి- చేతియందమేగాని గాజుల యందమో?

కనకవల్లి- ఒకటికొకటి యందము; ముద్దుచెయికి ముద్దుగాజులు.

సావిత్రి- నీపాదములందు వెండిగాజులను మాత్రము నుంచుకొని గజ్జె గొలుసులనేల తీసిపెట్టితివి?

లత- బరువుగ నుండినందున (నవ్వుచు)

సుందరాంగి- మగవాండ్రతోఁ జదువుకొనుటచేత గొలుసును దీసి వేసి బూట్సువేసికొన బోయెదవా?

లత- బాలురకడముగఁ బ్రత్యేకమైన స్థలమునఁగూర్చుండి చదువు కొనుచున్నాను; బూట్సుమీఁద నీవరకపేక్షలేదు; ఇఁక నేమో!

చిత్రాంగి- ఎందుకు, పట్టుపావడల వదలిపెట్టి తెల్లబట్టలఁ దొడుగ నైతివి?

లత- బాలికలతోఁ జదువుచుండిన బట్టుపావడలును బట్టురవికలఁ దొడుగవచ్చు.

ఇవ్విధంబున బ్రియప్రశ్నోత్తరములు జరిగినవెనుక, లతాంగి కోకిలాంబ పైటపైనుండిన యల్లికపూలంజూచి, "ఈపూల నెవరల్లిరి?" అని, యడుగ, "మాబడిలో నేర్చి నేనేయల్లినాను," అని, కోకిలాంబచెప్పె.

"బాలురపాఠశాలలో నీయల్లికపనులైన గుట్టుపుపనులైన నేర్పరు; నీవు మందవారమైనా భానువారమైనా వచ్చెద; ఈయల్లికల నాయెదుట వేసి చూపెదవా?"

"రెండుదినములు వచ్చినా వేసిచూపెద; నీయింటికి రమ్మన్ననువచ్చెద; నీవెంతో చదువుకొనియుండుటచేత నీవిద్యను సులభముగ నేర్చుకొందువు; అల్లికగుట్టుపుపనులు బ్రహ్మవిద్యలా?"

"మన మిరువురికిని దీనికపాటుగనుండు సమయముఁగనుపెట్టియుండివచ్చెద."

కనకవల్లి -- నా మేనమామ కుమారుఁడు నీ తరగతిన జదువుటచేతనీ బడియందుఁ జదువుకొన నాకు సిగ్గు.

లత-అతని పేరేమి?

కనకవల్లి-పేరట, చెపుమే! (చిత్రాంగి వెన్నున దట్టుచు)

చిత్రాంగి-నల్లంభట్లు కుమారుఁడు, అన్నంభట్లు.

లత-ఆనామమును నీనోటం జెప్పరాదా? (నవ్వుచు)

చిత్రాంగి-భర్తనామముఁ జెప్పఁదగునా?

లత-ఇంత పసితనమున నీకు బెండ్లియాయెనా? (కనకవల్లిఁజూచి)

చిత్రాంగి-వారిరువురి పెండ్లిని బొమ్మల పెండ్లియనఁదగు.

లత-ఇంత పసితనమున బెండ్లియేల? పేరంట్రమేల? పసిపడుచులకు దల్లిదండ్రు లుండియు దిక్కులేనట్టున్నది.

ఇటు భాషించిన పిమ్మట, పండుగల విషయముఁ గూర్చియుఁ బురుష పాఠశాలకును స్త్రీలపాఠశాలకును విద్యనేర్పుటయందుగల తారతమ్యముల గూర్చియు మాటాడుచుండిరి. అట్టి సమయంబున ధ-పంచమియేతెంచి, లతమ్మను బిలిచి, కనుచీకటి కావచ్చియు రాలేదని తల్లిగారు పనిపినట్లుచెప్పె.

లతాంగి, "ఇదిగో, వచ్చెద," అనుచుఁ జెలికత్తెలవద్ద సెలవుపుచ్చు కొనుచు, "నాయందు బ్రేమనుంచి యాటపాటల నాడినందుకు సంతసము గాంచితి; మీనెయ్యము నేమఱవఁజాల; వెళ్ళివచ్చెద," అని నంతట నందఱును

"నీవు వచ్చినఁ జాలునని యుండెదము; నీనేస్తమును బంగారుగ, రత్నాలుగ మదించుచున్నారము," అనిరి.

లతాంగి మందహాసముతోను నాహ్లాదముతోను సేవకుని వెంట నింటికిఁ జనియెను.

అటు వెనుక, పడుచులందఱు నొకరి మొగము నొకరు తిలకించి లతాంగి గూర్చి సంభాషింపఁ దొడఁగిరి.

సుందరాంగి-చెల్లెండ్రార! లతాంగి వచ్చెననియు దాని సల్లాపములచే పొంపుగాంతుమనియు నెవరు తలఁచిరి?

కనకవల్లి-దాని మోమున దెలివి తొంగలించుచున్నది; గుర్తించితిరా?

చిత్రాంగి-మడ్డిబుద్ధియు వాడియైనబుద్ధియు నెత్తియందును నయనమందును దేటపడుఁగద!

కోకిలాంబ-దాని తెల్లబట్టలంగల రమ్యము మనపట్టుపావడలందుఁ గనలేము, కదె?

చిత్రాంగి-ఎవరియందు సడ్డలేక కనుపాపల బొమ్మరమువలెఁ ద్రిప్పుచు వచ్చెడి మిటారి కొనయింట నున్నదే! దాని మాటల తీవి నేమందు!

సావిత్రి-అగయాళిమాటలు మనకేల?

ఈరీతిని మఱియుఁ బెక్కు భంగుల లతాంగిని వర్ణించిమాటాడుచుండి యిరులు కమ్మఁగ నింటికి వెళ్ళిరి.

లతాంగి తనయింటికి వచ్చిన తరువాత తన సంగాడి కత్తెల ప్రియవచనములను చేతలను సంతసముతోఁ దలఁపుసేయుచుండె. మఱునాడు, తన తండ్రికి, 'కుట్టుపుపని, అల్లికపని,' వీటియందుఁ దనకుఁగల యభిలాషఁ దెలియఁజేసి, వాటిని బాలికలయొద్దఁ దాను నేర్చుకొనన నుద్దేశించి యుండు విషయము నెఱుకపడఁజేసి, సూదులు, పుల్లలు, అల్లిక గుడ్డలు, రంగువేసిన పోఁగులు, కంబళిసూత్రములు, కత్తెరలు,' వీటిని నంగడినుండి కొని తెమ్మని చెప్పె. తండ్రి వెంటనే, సేవకునిఁ బిలిచి లతాంగికిఁ గావలసిన వాటిని జాబితా వ్రాయించి వాటిని గొనిరమ్మని దుకాణమునకుఁ బంపె అట్లు తేఁబడిన వాటిని లతాంగి యరుసముతోఁ దీసికొని మందసమునఁ బదిలముగ వైచెను.

ఆదివారమునాఁడు సంజవేళలోఁ బడుచులందఱు లతాంగి రాలేదను కొఱఁత నొకరికొకరు జెప్పుకొని, యేక్రీడమీఁదను వాలిలేక, వివిధములైన యాటలనాడియుఁ జీదరపడుచుండగ, లతాంగి తిన్నఁగ వచ్చుచుండుటం గని యందఱు శోభనపాటలఁ బాడుచుండిరి. మెల్లఁగఁ బోవుచుండినలతాంగి, పాటలనువినిక్షిప్రగతిన్గదలి, బాలికలమధ్య నగుముఖంబుతో వచ్చి నిలిచె. లతాంగిని మధ్యఁబెట్టుకొని పడుచులందఱు మఱికొంతసేపు పాడి యాడి చాలించినంతట, లతాంగిజూచి, "చిత్రాంగి "నీరాక స్త్రీలు సొమ్ముఁ గాంచిన నెంతసొంపో యంతసొంపుగనున్నది," అనెను.

సావిత్రి-నీరాక చీకటిలోనున్నవారికి దీపము వచ్చినట్టున్నది.

కోకిలాంబ-నీరాక నావంటివెతోవకుఁ జీఁకటివేఱువిత్తు.

కనకవల్లి-నినుఁజూచుట తమ్మి జగముకన్ను గనునట్లు.

సుందరాంగి-నెమ్మి మొయిళ్ళఁ గాంచినట్లు కాదో!

ఇవ్విధంబున లతాంగి రాకను వర్ణించుటతో నొకరికొకరు మించుటఁ దలఁచి ప్రముదముఁజెంది,

"పంచకన్యలను నాపంచప్రాణములని తలఁచియుండెద; మీలోనొక్కరు లేకున్న నొక్కప్రాణము లేకున్నట్లు నామేనుచిక్కు," అని, లతాంగి వచించినంతట; బాలికలందఱు ముక్కుమీఁద వ్రేలిఁబెట్టుకొని,

"అందఱికొక్కజవాబిచ్చె; ఎంతబాగు! చూచితిరె!" అని, సుందరాంగిచెప్పె. అటువెనుక, కోకిలాంబ గుడ్డలమీఁద నల్లికవేసి నాలుఁగైదు రకములఁజూపె. తోడుతో లతాంగి తాఁదెచ్చిన వస్త్రఖండములమీఁద కోకిలాంబవేసిన రకములలో నల్లికవేయనారంభించి, పెక్కువత్సరంబు లభ్యసించిన దానివలె సూదులును బుల్లలును గ్రుచ్చితీయుటఁగని, యందఱునచ్చెరువొంది, గడ్డంబులఁ బట్టుకొనిరి. అటుపిమ్మట కత్తెరపనులును కుట్టుపుపనులును జూచి, లతాంగి తనయింట నభ్యసపఱచునట్లు చెప్పె.

*

కోకిలాంబ-మేము రెండేండ్లలో నేర్చిన విద్యను లత రెండు నిమిషములలో నేర్చె; ఎంతగట్టితనము! చూచితిరా?

చిత్రాంగి-ఎట్టివిద్దెను లత కంట నొక్కతడవ చూచినఁజాలు. ఆవిద్దె దానికి వచ్చినట్లే.

సుందరాంగి - బుద్ధిచమత్కారమునకుఁ బొందికగనుండు చేతులచతురతను నేమని శ్లాఘింపఁదగు!

కనకవల్లి-దాని బంగారుచేతులతో నంటినవన్నియు బంగారు కావ!

సావిత్రి-దానిబుద్ధియుఁ గుశలతయు జేతలలో బ్రతిఫలింపక యుండునా?

ఇట్లు వర్ణించుచు నేస్తకత్తెలందఱు లతాంగి కెంగేలునంటి యఱచెయికిని ముంజేయికిని ముద్దువెట్టిరి. సంజెపడినందున నూరియావులు మందనుండి వచ్చుచుండె. లతాంగివాటినిఁగని, "ఈశుభశకునమైన గోధూళిలగ్నమున గోవులవెంబడి యింటికివెళ్ళివచ్చెద," అంచు సంగడికత్తెల కరంబులఁ గంపించె. లతాంగి వెళ్ళుచుండగ, ఓసిలత! సెలవుదినములలోఁ దప్పకవచ్చెదవా?" అని, పడుచేలందఱుఁ బతిమాలిరి. లతాంగి వల్లెయనుటకుమారుగఁ దనవరాంగమునునూఁచె. నాటంబట్టి లతాంగి నానాటికి నూతనమైన యల్లికల వేయుచుఁ గుట్టుపనుల నలవరించుచుఁ గొంతకాలములో వస్త్రములరప్పించి, తానేకత్తెరతోఁ గత్తిరించి, యింపైనకుట్లనేసి, తనపెద్దకును నయ్యకును జోక్కాయల నప్పననేసె. నవీన విద్యలనేర్చినందుకు దానికిఁ గల్గిన యుత్సాహమునంతింతయని చెప్పఁదరముకాదు.

---

7 వ అధ్యాయము.

కుటుంబస్థుల సంభాషణయు, లతారంగనాథుల విషయమై పెండ్లిమాటలును యతనములును.

ఒకనాఁడు సుబ్బమ్మ తన పెనిమిటితో,

"కాటక కాలమైనందున బిచ్చగాండ్రు పెచ్చుపెరిగెదరు; దినమొక్కటికి దూమెఁడు బియ్యమిచ్చియు ధ-పంచమి బిచ్చగాండ్రతో రచ్చలఁ బెట్టుకొననేల? కాస్తవిచారించెదరా!" అని, చెప్పుకొనెను.

భద్రయ్య, "ఓరి, పంచమి," అనిపిలిచి, బిచ్చగాండ్రతో రచ్చెలెందుకని యడిగెను.

"రాత్రిపూఁట మనవీధిలో బ్రతిదినమువచ్చుచుండిన తిరిపగానికి నా తల్లిగారు పుడిసెఁడన్నము వెట్టుచువచ్చిరి; నిన్నటిరాత్రిన నేదో యసందర్భముచేత వాడుకపద్ధతిన నన్నమువెట్టనందున బిచ్చగాఁడు వెళ్ళుచుఁ జెప్పిన మాటలఁ దామువినిన నెంత క్రోధపడుదురో, బాబు!

"ఏమిచెప్పుచు వెళ్ళెను?"

"ఎన్నడును బెట్టని పుణ్యవతి నేటికిని బెట్టలేదు; దినదినము పిడికెఁడన్నము బెట్టుచు వచ్చిన లచ్చికి నేఁడేమి చేటువచ్చె? అని చెప్పుచు మన వీధిదాఁటి వెళ్ళెను, బాబు! నేఁడా బిక్షకుండువచ్చె; రాత్రి మాటలను లక్ష్యపెట్టక చారెఁడు బియ్యమేసితి; ఇంకొక చారెఁడేయుమని యడిగినందుకు, రాత్రి యన్నమువెట్టనందుకా యని యడిగితి. ఇచ్చె పుణ్యాత్మురాలు తూముతోనిచ్చి యుండగ నీకేమి చేటువచ్చె? రెండేసి పిడికెళ్ళేయరాదా? అనుచు, నోటికిరాని మాటలనాడుచు, కూఁతలు వెట్టుచు వెళ్ళె బాబు!"

"ఇది కలికాలము; తిరిపెమెత్తియు నభిమానము జెంది యుండెదరు. ఇంకొక పిడికెఁడు వాని నెత్తినఁ బాఱవేయరాదా! వానితో నెందుకు రచ్చలు!"

"రెండు నెలలుగ, దేవర, బిచ్చగాండ్రు నిచ్చలు వచ్చెదరు; వారికి పిడికెఁడు బియ్యమిడియు, తూమెఁడు బియ్యము రెండు గడియలలోఁ దఱిఁగిపోవుచున్నది. ఇంటింట యాచక మెత్తి, రెండుశేరుల బియ్యము సంపాదించి, యందున ముప్పాతికపాలు దుకాణమున నమ్మి, సందవేళఁ గల్లుత్రాగి, రాత్రి పూఁట ధర్మసత్రముకడ నరుగుపైఁ గూర్చుండి దొమ్మలాడెదరు; అచ్చట రెండొక మిండకోరీలును జేరుచున్నారు. ఇట్టి దుర్జనులకు బిచ్చమిడుట యుక్తముగాదు. పాత్ర మెఱిఁగి బిచ్చమిడవలెను. బిచ్చగాండ్ర రెట్టలును గుఱువులంజోచిన ననటి స్తంభములవలె బలిసియున్నవి; వారు బిచ్చమెత్తియు మహోన్మత్తులై మాఁపున జేయు అంపురోదనలు గ్రామమెల్ల వినఁబడుచున్నవి. అట్టి వారికా ధర్మముచేయవలెను? ఇఁక, 'గ్రుడ్డివారు, కుంటివాండ్రు, వికలాంగులు,' యిట్టివారు వచ్చిన వారిచేతఁ గొంత బియ్యమిడుదు; తక్కిన వారినోట మన్నుగొట్టిపంపుదు, బాబుగారు!"

"భిక్షుకులకు నిశ్చింత; నాలుఁగిండ్లకువెళ్ళిన నలుగురు పెట్టిన, వారి కడుపునిండుచున్నది; మహారాజులో, యేది కావలెనన్న నెంత కావలెనన్న గొనుటకు సత్తిఁగలవారు; మధ్యస్థితినుండువారికే యిబ్బందులన్ని. భిక్షుకులకు బిచ్చములే దనరాదు; మనవలె నాలుగిండ్లలో లేదనిన, వారు 'నైటాలము,' 'మలేయా,' మొదలగు సీమలకు వెళ్ళుదురు; వారట్లు వెళ్ళినచో మనదేశమునకు నష్టము; వెండియు బిచ్చమిడకుండిన, చౌర్యము వృద్ధియగు."

"ఈ బిచ్చగాండ్రు సోమరులు, దేవర! ఒడలువంగి పాటుపడరు; వా రన్యదేశములకుఁ బోఁజాలరు; పాటుపడఁ గలవారే పనిపాటులు దొరకక యన్యదేశములకు వెళ్ళుదురు, చిత్తగింపుడు! తమ చిత్తమువలె నడుచుకొన సిద్ధముగ నుండెద, దేవర! ఈ బిచ్చగాండ్రు ముచ్చిలించుటకు దిట్టలుకారు. కంటికి కగపడిన 'చెంబు, తపెల, పంచపాత్ర,' యిట్టి యల్పవస్తువుల నంటుకొని పోవుదురు. కొందఱు గడిదొంగలుండెదరు; వారు దాపరించుటలోఁ

దేరినవారు; బంగరుకడియములఁ దొడుగుకొని, సరిగతలగుడ్డలఁ గట్టుకొని, వ్యాపారులవలె వేసముఁబూని, తెక్కలికాండ్రయొద్ద దొంగసొత్తులఁ దీసి బ్రతికెడివా రుండెదరు; వారి యుడుపులం జూచిన దొడ్డ వారని తోఁపించు, వారియందు సందియ మొకింతయైనా తగలదు. వారు పోలీసు బంట్రోతుల చేతఁ జోలుకనగఁ జిక్కరు; ఒక్కవేళ చిక్కుకొనిన, వారితో సమాధానము జేసికొందురు. అట్టివారి ప్రోత్సాహముచేత దస్యులు హెచ్చుగుచున్నారు; వారు లేనిచోఁ దస్కరులు తక్కువగ నుందురు, బాబు!"

"బిచ్చములేదనుట ధర్మముగాదు; మనము ధర్మమేచేయుదము; వారి దౌర్జన్యములు వారితో నుండనిమ్ము."

"యాచకుల కేమి! వారు సర్వదావచ్చుచుందురు; బిచ్చగాఁడు మాపు చెప్పినమాటలను ధనిష్ఠా పంచమి వినిపింపగ, నామనంబు పుండయ్యె. వాని నడత 'తిన్నయింటికి రెండుఁ దలఁచినట్టాయె'. అట్టివాని కన్నముఁగాని బిచ్చముఁగాని పెట్టుటలో సార్థకములేదు. ఇటీవల బిచ్చగాండ్రు వేవురై నందున దూమెఁడు బియ్యమిచ్చియుఁ జాలలేదు; గాదెలో గింజెలు నానాటికిఁ దఱిఁగిపోవుటచేత మనయింటఁగల ధాన్యమేఁడాదివఱకుఁ జాలదు. ఇటఁబట్టి శేరెఁడేబియ్యమిత్తు; తగినవారికిఁ బెట్టి తక్కినవారిఁ బొమ్మన వచ్చు," అని, సుబ్బమ్మ చెప్పె.

"నాయన! సహవాస సాంగత్యదోషములచేతను జదువులేనందునను జనులు తస్కరము చేసెదరు; అట్టివారిఁ జదివించి మంచిసాంగత్యములఁ గల్పించిన, వారు తమదుర్వర్తనలమాని సువర్తనలఁ బూనుదురు," అని, లతాంగివచించె.

"యాచకము చేయువారిని శిక్షించునట్లు చేట్టమేర్పఱచిన బాగు; యాచకవృత్తియు నొకవృత్తియా?" అని, రంగనాథుండడిగె.

లతాంగి.- యాచకులవల్ల మనరాజ్యమునకు నష్టము; మనకుఁ గష్టము; బిచ్చము 'పెట్టనుపెట్టను' సోమరులు హెచ్చుపెరుగుదురు.

భ- జన్నిగట్టులకు యాచకము ముఖ్యము గదా ?

రం- జందెధారులు క్రమముగ సంధ్యవార్చెదరా? బ్రాహ్మణులందఱు వారి బ్రాహ్మణకృత్యములను గ్రమముగ జరిపెదరా?

భ- ఎంతోవ్యయముచేసి యుపనయము గావించిన నాలుఁగేండ్లకు నీలాగునజెప్పిన వడుగుచేసినందుకు ఫలమేమిర, నాయన?

లత- నెలవేలుపులు కొలువులో నుండుటచేత శాస్త్రవిధుల నేలాగున నాచరింతురు? వారిదేహము వారిది కాదు; పైయధికారులు పిలిచినవెంటనే బోవలసినవారు; అట్టివారు గృహకృత్యములఁజేతురా? కొలువుగొలుతురా? బ్రాహ్మణ విధిక్రమముల ననుసరింతురా?

రం- నాయనా! బాపనుడని తెల్లవాఱఁగను సాయమునను ముక్కుబట్టుకొని ముసుఁగు వేసికొని జపతపముల నాచరించుచుండిన బువ్వ దొరకునా?

భ- బ్రాహ్మణ విధానముల విడిచిపెట్టవలెనా?

రం- వదలిపెట్టనక్కఱలేదు; వదలక విధుల ననుసరించెదరా? అనుసరించుటకుఁ దగిన యనుకూలములున్నవా?

భ- బ్రాహ్మణులు గొద్దివృత్తులనే యనుసరింపఁదగు.

లత- ఈకాలమున జీవనమునకు దోవలేక బ్రాహ్మణులలో గొందఱు వారికిఁ దగనివృత్తులయందుఁ బ్రవేశించియుండెదరు ; కొందఱు మిఠాయియంగళ్ళను, కొందఱు పూఁటకూళ్ళ సత్రమును బెట్టియుండెదరు.

రంగ- చేలనికొదవకు, కొందఱు చర్మవ్యాపారముఁ జేసెదరు.

భద్రయ్య- బాపనులలోఁగొందఱు చేయరానిపనులఁ జేసిన నాదోషము వారినేజెందు ; అందుచేతఁ దక్కినవారేల మంచియనుష్ఠానముతో నుండరాదు? భిక్షుకులకై యిన్నిప్రల్లదములయ్యె; ధర్మము నేమాత్రము వదలఁగూడదు; ఉచితమైనవారికి ధర్మమిడుచు రావలెను ; భిక్షుకులలో వంచన, పక్షపాతము—వీటి జూపరాదు.

"పాటుపడఁగూడని యంగహీనులకుఁ బిడికెఁడు బియ్యమిత్తు; బలీయమైన యంగవహులకుఁ గరంబుతో నర్ధచంద్రప్రయోగము నిత్తు. పక్షపాతము, వంచన యివి భగవంతునికే యర్పణ," అని, సేవకుండు చెప్పె.

"ఎందుకు, పావనరహితమైన మాటల నాడెదవు?" అని, భద్రయ్య యడుగ, "భగవంతుడొకనిఁ బెట్టినట్లింకొకని బెట్టలేదు; లోకులలో నొకరికొకరికి హెచ్చుతక్కువలు మిక్కిలియై యున్నవి; అట్లుండుటకు సర్వేశ్వరుండుగద, కర్త!" అని, ధ- పంచమి బదులాడెను:

భ- అందఱు నందలమెక్కితే పల్లకి మోసేవారెవ్వరు ?

ధ-పం అందుచేత నెక్కువారని మోయువారని రెండుతెగల భగవంతుఁడు కల్పించె.

భ - వారివారి కర్మానుసారము సుఖదుఃఖముల ననుభవింపవలెను; అట్లుండగ భగవంతుఁ డేమిచేయఁగలఁడు?

రంగ- భగవంతుఁ డందఱికి మంచికర్మముఁ జేయ బుద్ధి నియ్యరాదా?

లత- చీఁకటికొన్నాళ్ళు, వెన్నెలకొన్నాళ్ళు; అటువలె మానవునికి నోగాములు సహజము; బుద్ధిచేతను భావన కృత్యములచేతను నిమపులఁ గొద్దిచేసి, మునుపాపముల హరించుకొనవలెను.

రం- దేవుఁ డందఱికి మంచిబుద్ధి నియ్యరాదా ?

ధ-పం- దేవునికి 'సుబుద్ధి,' 'దుర్బుద్ధి'—యీ రెండు తెగలవారు గావలసినట్లున్నది.

లత- దేవుఁడు బువ్వ పెట్టుంగాని తినిపించునా? మన బుద్ధిని సద్విషయములఁగాని దుర్విషయములఁగాని ప్రవర్తింపఁజేయుట మన యిష్టానుసారమును గర్మానుసారమును. మన సంరక్షణకొఱకు దేవుఁడు బుద్ధియను వాఁడియైన ఖడ్గము నిచ్చె; అట్టి దివ్యాయుధంబుచేత దుర్విషయంబుల ఛేదింపకుండిన దప్పెవ్వరిది? దేవుఁ డెందుకు చేతులనిచ్చె? చెడ్డవి చేయనా? నాలు

కెందుకు? దూషించుటకా? కద్రీతిగ బుద్ధి నెందుకిచ్చె? సద్విషయములను రక్షించుకొని దుర్విషయముల ఖండించుటకుగద?

ఇట్లు వచించుచుండగ, "ఏలిన వారికి గద?" అని, భద్రయ్యగారిని సేవకుం డెచ్చరిక సేయగ,

"ఏమి చెప్పబోయెదవు?" అని భద్రయ్య యడిగె.

"బీరశెట్టి వచ్చుచున్నారు; రెండు మూఁడురోజులక్రిందట నతని మండిలో దొంగలుచొఱఁబడి సొమ్ములును డబ్బును గొల్లపెట్టిరట; అతని యింటికి పోలీసుబంట్రోతులు తిరిగెదరు, దేవర!"

శెట్టిగారి రాకనుఁగని లతయు రంగనాధుఁడును గృహాంతరమునకు గమనముచేసిరి. బీరశెట్టి రెండు చేతులఁజేర్చి, "దండములు, స్వామీ," అనెను. భద్రయ్యతన యెడమ చేయిని వక్షముమీఁద నుంచుకొని, వీధివేదిక మీఁద నొకచాఁప వేయించి, "దయసేయుఁడు, శెట్టిగారు!" అని చెప్పగ, శెట్టిగారు తన గబ్బి పిఱుఁదులఁ జాఁపమీద నమర్చి, పద్మాసనముతోఁ గూరుచుండి, "ఏను వచ్చిన వేళ మంచి సమయము; తామును దమ బిడ్డలును సల్లాప మాడుచుండగ వచ్చితి," అనెను.

"చాల సంతోషము! బాజారులో నొక వదంతి వింటి; రెండు మూఁడురోజులక్రిందట తమమండిలో వస్తాడికాండ్రు చొఱఁబడి సొమ్ములును రొక్కమును దోఁచుకొని వెళ్ళినారటనే! అందుచేత బంట్రోతులు తమయింటికి వచ్చిపోయెదరటనే! ఇది యెంతమాత్రము నిజము?"

"మండియు నిల్లును నొక్కటిగనున్నవి; కన్నము వేసిరే కాని సొమ్ములఁ గొల్లపెట్టలేదు; రొక్కము నేనచ్చటఁ బెట్టలేదు; మత్సరముచేతఁ గాని వారు సొమ్ముల గొల్లపెట్టినట్టు వదంతిఁ గల్పించిరి."

"తమవద్ద సొమ్ములఁ గుదువపెట్టినవారికి సొమ్ముల దిరుగనీయక వాటికి గ్రయము కట్టియిచ్చితిరా?" అని, ధపంచమియడుగ,

"మాయింటి యాఁడువాండ్రు కుదువసొమ్ముల దొడుగుకొనియుండి, వాటిఁ బోగొట్టుకొనిరి; అందుచేత క్రయముకట్టి యిచ్చినాను."

"బంట్రోతు లెందుకు వచ్చిపోయెదరు?" అని, భద్రయ్య యడిగినందుకు,

"పెట్టికిటికటకు; కన్నము వేసినజాగాను జూచినదిగాక, యిలుకడ వెళ్ళ శోధనవేయవలెననిరి; మనయింటనుండు సొమ్ములను వారికిఁ జూప మనస్సును ధైర్యమునులేక వారితో సమాధానముచేసికొంటి. పదంపడి వారు వచ్చుటను మానుకొనిరి."

"తామింతదూరము విచ్చేసిన కార్యంబేమి?"

"మనపిన్నవాఁడు రంగనాధయ్యకు వడుగు పెండ్లియైననాటినుండి నేటివఱకుఁ దీసికొనుచువచ్చిన సరకులకు జమపోను కొంతపైకము దామచ్చవలసియున్నది; చాలుదినములాయె; రూపాయలకు గస్తియొక్కువ."

"ఏనెంత బాకి?"

శెట్టియొకచీటిని భద్రయ్యచేతనిచ్చి,

"నాలుఁగువందల నాలుఁగుపదులు రూపాయలుబాకి ఇంతే!" అని, చెప్పె.

"రెండుమూఁడు సంవత్సరములుగా వానలులేనందున మళ్ళలోను చేలలోను నల్పఫలముగల్గె; అందుచేత దుగ్గాణిదొరకుట దుర్లభము."

"కఠినకాలముగ నుండుటంబట్టి నాకును రూపాయలకు జరూరు. తమవంటివారు దుగ్గాణిదొరకుట దుర్లభమనిన మీవల్లబ్రతికెడి మాఁబోటివా రేలాగున బ్రతుకనగు; దయచేసి యిపుడే రూకలిచ్చినబాగు. ఈకున్న నాబిడ్డపాపలందఱుఁ దమయింటఁగుడిచి కట్టవలెను."

"ఇపుడు రూకలిచ్చుటకు వల్లపడదు, శెట్టిగారు!"

"అట్లుచెప్పుట ధర్మముగాదు స్వామీ!"

"వానలు యథేష్టముగ కురిసి పంటలు బాగుగఁ బండిన, మిమ్ముఁబిలిచి రూకలిచ్చెద."

"తామీలాగున దయచేసిన నేనేమి చేయఁగలను? రొక్కమియ్యకుండినా, పదిబండ్లగింజెల నానెత్తిన బాఁ వేసిన దీసికొనివెళ్ళెద"

"మామనికికిఁ జోలిచోలక యుండుట చేత ధాన్యముఁ గొలువవీలుపడదు."

"మీకే పొట్టపోసికొనిన నాపొట్ట కేమిచేయుదు?" (పొట్టనుఁ దట్టుచే.)

"ఈవేసములేల, శెట్టిగారు? జడికురిసి పంటలుపండిన తమకాసు తమ యింటియొద్దవచ్చు"

"వానలు కురియు టెన్నఁడు? పంటలుపండు టెప్పుడు! నాకాసు వచ్చి చేరు టెక్కాలము! తెనాలిరామలింగఁడు ఋణము దీర్చుటకుఁ జింతగింజెలఁ జూపినట్లున్నది."

"ఎందుకు చింతగింజెలఁ జూపె"?

"అప్పిచ్చినవాండ్రు వారిబాకినిమ్మని తొందరపెట్టగ, తెనాలిరామలింగఁడు గంపెఁడు చింతగింజెలఁ దెచ్చి, యవి వారి బాకీకిగానను చే, వాటిని విత్తిన నొక్కొటొక్కటి గొప్పవృక్షమై, వృక్షంబొక్కొటికి సరాసరి పదిరూపాయలైనను, పదిలక్షల చింతగింజెలకుఁ బదిపదిలక్షల రూపాయలైనందున వారి బాకిపోను మిగులురూపాయల నిచ్చిపొమ్మనెనట. ఈమాటలనువినియప్పిచ్చినవారు నగయగ, బాకి వచ్చివేసెనని వ్యవహారము నడిగెనట. ఆమాటలకుఁ దామాడిన మాటలకుఁ దారతమ్యమిక్కువగలేదు."

"శెట్టిగారు! తమ బాకీకి నీకథఁ గల్పన చేసితిరా?"

"పరిహాసమునకు లెక్కలేని కథలఁ గల్పించి యుండెదరు."

"వరప్రసాదియైన మహాకవింగూర్చియట్టి కథలఁ గల్పింపఁదగునా?"

"వేడుకార్థముఁ గల్పించిన కథలు, స్వామీ!"

"పరిహాసపుకథల దొడ్డవారి నామముతో సంబంధపఱచుటన్యాయము గాదు."

"శెట్టిగారు! తామునిన్నటిరోజునఁ గుదువనగలపై వేయిరూపాయలిచ్చితిరా?" అని, ధపంచమియడుగ, "అయ్యది నాయంటనుండు స్త్రీలపైకము; ఆరూకలకునాకు సంబంధములేదు."

శెట్టిగారు! తాముమాటలలో వెరవెరులు; పంటలుగాక పైకమిచ్చుటకువీలుపడదు."

"మేముసరకులనిచ్చి మాటలుమాత్రము నేర్చితిమి; మాయొద్దసరకులఁ గొన్నవారు వారివఱకుఁ బొట్టపోసికొననేర్చిరి; మేమచ్చేవలసినవారుమూకచ్చేవలసినవారు — వీరిమధ్య మేము మద్దెలవలె రెండుతట్లుదెబ్బలుపడనేర్చితిమి",

"తాముమర్యాదరీతి మాటాడుటచేత నాకుతమతోఁ బనిలేదు; మీకెంత (యిన్కంటాక్సు) వరుమానవరి విధియించియున్నది".

"అల్కనలదు, స్వామీ! వేడుకార్థమైచెప్పినమాటల కల్కవలదు; బాకినీద్వరలో నిచ్చిన బదివేలదండములు; నాకు రాఁబడియులేదు, వచ్చేబడివరియులేదు, కలహాపువెట్టకుఁడు, స్వామి! మీకు దండములు," అనుచు జెరచెరజారెను.

"శెట్టిరెండు 'ల' కారములకధిపతియట," అని ధపంచమిచెప్పగ,

"రెండులక్షలకా?" అని, భద్రయ్యయడిగె.

"ఔ, దేవర! కుదువనగలమీఁద మితములేని రూపాయలనిచ్చియున్నాడు."

"అతఁడెంత ధనవంతుఁడైనను నేసీవలసిన బాకి నీవలెనుగద!"

"ఎవ్వండులేదనుచున్నాఁడు! అతఁడు పక్కిరివేసముఁబూనుటచేత నతని యాస్తిఁ జెప్పితి. పల్లముమిట్టయు మిట్టపల్లముగనగుచున్నవి. అతండు తనద్రవ్యమును కాశ్యపమని యెఱచి యెంతమాటలండొప్పు, బాబు!"

"పల్లముమిట్ట, మిట్ట పల్లమన నేమి ?"

"నేఁడుపక్కిఁటి తేఁపునవాబు ! నేఁడునవాబు తేఁపుపక్కిరి; ఎందఱో చక్రవర్తులేగతిఁబొందిరి, బాబు !"

"మనము బాకిపడియుండగనవియెన్నియు నెన్నరాదు," అనుచు బహిర్గమనుఁడయ్యె.

రెండువారములకు వెనుక యొకదినము భద్రయ్యవంకనుండి వచ్చుటకుఁబూర్వము, తపాలువాఁడు వాకిటవచ్చినిలిచి, 'అయ్యా' యనియఱచి, పసుపు నంటింపబడియుండినజాబొక్కటిని సేవకునిచేతఁబెట్టివెళ్ళెను. దానిఁగని సుబ్బమ్మ, "ఓహో ! లతకువరునింగూర్చి రెండుమూఁడుచోట్లకుజాబు వ్రాసిరి. ఏదోయొక్కస్థలమునుండి యనుకూలమైనజవాబువచ్చినట్టున్నది," అని, చెప్పె. ఈమాటలను వినుచుండినలతాంగి, "పెండ్లియనుమాటనాచెవిలోఁబడినఁగఱగించిన సీసముఁబోసినట్టున్నది; నాకిప్పటినుండి పెండ్లియేల? పెండ్లిని నిశ్చయించినంతటనెవ్వరితోఁజెప్పక, 'వనము, వంక, గుట్ట, వీటిన బ్రాణము విడుతు," అనెను.

"ఏమె ! నీవుచెప్పెడి మాటలు విచిత్రముగనున్నవి; నీవయస్సుపడుచులకు రెండేండ్లకు ముందేపెండ్లియైయుండలేదా?"

"నాకుపెండ్లియక్కఱలేదమ్మ!"

"పెండ్లిలేక కన్యగనుండఁబోయెదవా?"

"ఓసి, లత!. నాకు కూఁతురులేదు; నేను మని యుండునపుడునీకుఁబెండ్లిచేసి నాకనులారఁజూడవలదా?" అని భద్రయ్యతల్లి చెప్పినంతట లతాంగి తనచేతితోనెత్తిమీఁదమొత్తికొని, గదిలోఁజని తలుపుమూసి గడియవేసికొని యేడ్వసాగె. "లతమ్మకుఁబెండ్లియనఁగాలేదు; అల్లికలు, పటము, పుస్తకము—యివియుండినఁజాలు," అని, ధ-పంచమిచెప్పె. "ఇది యపురూపమైనబిడ్డగనున్నది; మన గ్రామమున నెందఱుచిన్నపడుచులు తల్లిదండ్రుల మాటల జవ

దాటక పెండ్లిచేసికొని, యెంతముద్దుగనుండెదరు ! ఇదికీమనుండివచ్చిన బిడ్డవలెనున్నది," అని సుబ్బమ్మ చెప్పుచుండగ భద్రయ్యవచ్చి,

"ఓసీసుబ్బి ! ఎన్నడును లేకయీవేళనింతకూఁతలువెట్టిమాటాడనేల?" అని, యడిగెను.

"మీయతిశయమైన బిడ్డనుజూచితిరా?"

"ఎవరు?"

"లత,"

"ఏది?"

"అదిగో, తలుపుమూసికొని గడియవేసికొని యేడ్చుచున్నది."

"ఏటికి?"

"తామువరునివిషయమైరెండు లేక మూఁడు చోట్లకుజాబువ్రాసితిరి గద?"

"ఔను!"

ఏదియోయొక్కస్థలమునుండి యనుకూలమైనజవాబువచ్చె; దానిజూచితిరా?"

"మంచిసమాచారమువిగాద; దానికేడ్వనేల?"

"పెండ్లియనినా, పెండ్లిని నిశ్చయించినా, వనము, వంక, గుట్ట-వీటి నబ్రాణము విడుచునట."

"ఇందుకా యేడ్చుచున్నది ! పసితనము; సిగ్గుచేత నట్లుచెప్పె."

"సిగ్గా ! చేటో ! దాని గాస్త చూడుఁడు."

"ఓసి లత ! ఓయమ్మ ! తలుపు తీయవే," అని నంతట, లత కన్నీటిఁ దుడుచుకొనుచు వెలుపల వచ్చి, తండ్రికి జోత మొనరించి, "నాయనా ! నాకిపుడు పెండ్లియను మాట సరిపడదు; (దేహమువణకుచు) ఆ మాట నా చెవులఁబడిన సీసముగఱగించి పోసినట్టున్నది ! ఏనుచదువుకొనినవెనుక,

కావలెనన్న, (ఒకయుపాయముచే) పెండ్లివిషయమును నాలోచింపవచ్చు," అని చెప్పి, కంటిపై దనచెఱఁగు నడ్డుముకొనెను.

"'చేదివినవెనుక'' 'కావలెనన్న'' దానిమాటల వింటిరా?''

''వింటి''.

''చేదివినవెనుక నిన్నెవ్వండును పెండ్లిచేసికొనఁ?''

''ఏవాఁడు జేసికొనవలసినది లేదు''

''మఱి కన్యగ నుందువా?''

''నిమ్మళముగ నుందు నమ్మ''

''వింటిరా దాని మాటలను?''

"వింటి," అనుచు, భద్రయ్య తనదక్షిణబాహుమధ్యంబున దన తనయఁ బట్టుకొని వక్షంబున నణఁచికొని, దానియొడమ చెంపమీఁద దన యధరంబునదిమి, "పెండ్లిలేక యుండునని చెప్పకుము," అనెను. "నీవు పెండ్లి వలదనిన," నే నెక్కడికైనా వెళ్ళి ప్రాణత్యాగము జేసికొందు", అని తల్లి వచించిన మాటలవిని లతయోర్వజాలక యెలుఁగెత్తి యేడ్చె. వివాహము గుఱించి మాటాడుచుండగ నేడ్చుటయుఁ బ్రాణత్యాగముఁ జేసికొను నటుల వచించుటయు నట్టి యవలక్షణము లేల కల్గెనని చింతించి శోకపడుచు భద్రయ్య, ''జాబేడ? చూతము,'' అని యడుగ, సేవకుఁడు తెచ్చి యిచ్చిన జాబుఁ దీసి చూచుచు, ''శశిపురము ముద్రవేసి యున్నది; అచ్చటికి నే నెవ్వరికిని లతవరవిషయమై వ్రాయలేదు,'' అనుచుండగ, లతవాడినమోమున గళలు చూపడె. పసుపు పూయఁబడి యుండిన యొఱను వీడఁదీసి, యందుండిన జాబును జూడగ నెడమ ప్రక్కనికొనలో 'లాయర్ జంబయ్య' అని యచ్చువేయఁబడియుండె; కుడిప్రక్క కొనలో 'శశిపురము' అనియు, తేదిమాసవత్సరములును ముద్రింపబడి యుండెను. జాబును జదివి తన సతితో, ''ఈజాబు లతవరుని విషయమై మనకు గాదు; మన రంగనాథునికి లాయర్ జంబయ్య కుమార్తెను నిచ్చునటుల వ్రాసినారు

న్నారు,'' అనగ, నీమాటలను వినుచుండిన లతాంగి 'పకపక' యని నవ్వగ, సుబ్బమ్మగారి ముఖము చిన్నఁబోయెను. జాబును మరల చదివి, ''లాయర్ జంబయ్యకు కూఁతుండ్రైదుగురట; కుమారుఁడు లేడట; చిరంజీవి రంగనాథునికి దనయైదవ బిడ్డను నియ్యనభిప్రాయమట,'' అని చెప్పుచుండగ,

''చిత్తం! ఒక్క మనవి; ఏడవిన్నాను లాయర్ జంబయ్య నామము ప్రసిద్ధిగ నున్నది; 'అయిదుగురు కూఁతుండ్ర కప్పయైన అష్టాధిపతియు భిక్షాధిపతి యగు,' అను లోకోక్తిని యోచింపఁ బనిలేదా?'' అని, ధ-పంచమి యడిగెను. భద్రయ్య, జంబయ్యగారికి స్థితిమతులలో దక్కువలేదని బదులాడుచుఁ దనపత్నితో, ''రాఁగల చైత్ర వైశాఖ మాసములలో మన పిల్లఁడును బిల్లయు జదువుకొనుటకు శశిపురము బోవలసినవారై యుండుటచేత నతని కొమరితెను మనకుమారునికిచ్చి పెండ్లిచేసిన, వారే మన బిడ్డలకు విచారణకర్తలై యుందురు; మనబిడ్డ లతని కంటిముందుండిన మనము నిశ్చింతగ నుండవచ్చును,'' అనెను.

''లతకు యుక్తవయసు సమీపించుటచేత దానిపెండ్లిని ముందుజరుపవలెఁగాని చిన్నవాని పెండ్లికిఁ ద్వరలేదు.''

''తనంత వచ్చిన దానిని మనము నిరాకరింపనేల? రంగనాథునికి పెండ్లిచేయుదము; లతకును జరిపింతము.''

''ఒకతల్లి బిడ్డలైన యిరువురికి నొకసంవత్సరమున మనయింట నెట్లు పెండ్లిసేయనగు?''

''మనయింట లత పెండ్లి జరుగును; రంగనాథుని పెండ్లి శశిపురమున జరుగవలెగద?''

ఇట్లు భాషించుచుండగ, లతాంగి తిరుగ గదిలో వెళ్ళి, కవాటబంధము చేసికొనెను.

''ఓసి, లత! ఎందుకే, మరల తలుపు వేసికొంటివి?'' అని, తల్లి యడుగ,

"ఎందుకు లేదు, నాయన! వస్త్రములనుధరించుకొని బడికి పోయెద," అని, చెప్పుచు బయటికివచ్చి పెండ్లిమాటల విన సహియింపక తొమ్మిది గంటలప్పుడే పుస్తకమును బటమును జేతఁ బట్టుకొని బడికి చేక్కఁగ వెళ్ళెను.

"దీనికేవేళ 'బడి, నూదులు, పటము, పుస్తకము,' వీటితోనేపని," అని తల్లి చెప్పగ,

"బిడ్డ చేదువుకొనువయస్సున జదువుకొనక యేమిచేయును?" అని, తండ్రి చెప్పె.

"ఈకలికాలమున దీనికిఁ జిన్నపడుచే లెందరెంతో చొరవ గల్గి యుండగ దీనికేల మడ్డితనము?"

"పెండ్లి విషయమున జొరవలేదనుచున్నావా? లజ్జచేతఁ దనయిచ్ఛఁ గనుపింపదు; చొఱవలో దానికి సాటివారుఁ గలరా?"

"తాము లతకు వరుని నిశ్చయించి యటువెనుక మనచిన్నవాని విషయమును యోచించిన బాగు."

"దొడ్డవారికి తోడుతో జాబు వ్రాయకుండుట మర్యాద గాదు.

"ఏమని వ్రాయఁబోయెదరు?"

"తమ సుపుత్రిని మా కుమారుని కిచ్చి పెండ్లిచేయుట మాదంపతు లిరువురికి సమ్మత మనియు, మా కుమార్తె కీసంవత్సరమే పెండ్లిచేయ వలసిన జరూరుండుటచేత దానికి వరుని నిశ్చయించిన వెనుక పిల్లగాని పెండ్లి ముహూర్తమును నిశ్చయించుకొనగునని వ్రాసెద."

"బిడ్డనుఁ దాముఁ జూడక, నేను జూడక యెటుల పెండ్లి నిశ్చయింతురు?"

"బిడ్డ లక్షణముల నీజాబులో వ్రాసియున్నవి. (జాబునుఁ జదువుచు) చామని చాయయట; హార్మోనియాపెట్టె నింపుగ వాయించునట; రమ్యమైన పాటలఁ బాడునట; అంగహీనము లేవియు లేదట. ఈజాబున (ఫొటో)

రూపము తీసిన పటముఁ బంపి యుండెదరు," అని, జాబులో నుండిన పటమును బయటతీసి,

"ఇదిగో! చూడుము! ఇదియె నీ కోడలి పటము," అని, పటమును భార్యచేతి కందనిచ్చె. సుబ్బమ్మ పటముఁజూచి, "ముక్కుగన్నులు లెస్సగ నున్నవి; కాళ్ళుసేతులలో భిన్నములులేవు; సంసారమునకుఁ దగినబిడ్డ; బిడ్డనుఁ గంటఁ జూచిన నేలాగో తెలియదు," అనెను.

"యంత్రముచేత రూపముతీసిన పటమైనందున రూపమొక్కటియుఁ బటమొక్కటియు నుండఁగలవె?"

"ఏమోతాము చెప్పెదరు. ఎందుచేత తీసినపటమైనను హెచ్చుదక్కువల మఱుఁగుచేసి యుండరాదా?"

"లాయర్ జంబయ్య దొడ్డమనిషి; బద్దులు వ్రాయఁడు?"

"వారివారిబిడ్డ వారివారి కింపే; కాకిపిల్ల కాకికింపే; తన బిడ్డను గుఱించి యతను మఱియేలాగున వ్రాయఁగలఁడు?"

"దొడ్డవారి బిడ్డగనున్నది; ఈపటమేచాలు."

"పటముంజూచి గొనముల నెట్లు కనుఁగొనవగు?"

"గొప్ప వంశమున బుట్టిన వారికిగొప్పబుద్ధియుండు."

"దొడ్డవారి బిడ్డగ నుండుటచేత నది మన యింటికి వచ్చిన, దానికి మన చిన్నవాఁడు శుశ్రూష జేయవలసి వచ్చునో యేమో యని చింతించెద; దొడ్డవారి బిడ్డలకుఁ బనిపాటులు తెలసి యుండవు; కాపురముచేయఁ దెలియదు."

"మన లతకేమి తెలియు?"

"లతకేమి! కాపురముచేయలేదా? వంటపనులు మొదలు యావత్తు పనుల నీట్లుగఁ జేయును. బిడ్డపేరేమని వ్రాసియున్నది?"

"చంపకవల్లి యట."

"పేరు ముద్దుగ నున్నది; తమకిష్టమైనయది నాకిష్టము. నాకుం దక్కఁ తమకు లేదా?"

"తల్లీ! కోడలు పండుకొనిన లేవరాదట; కొడుకు కూర్చుండు తానుండి లేవరాదట," అని, సేవకుండు చెప్పె.

"ఏమి వెఱ్ఱి కూఁతలఁ గూయుచున్నావు!"

"నిజమే చెప్పితి, తల్లీ! కోడలు సమస్తగృహకృత్యములఁ జేసి పిమ్మటఁ బండుకొనిన దానిని లేపవలసిన జరూరు లేకయుండవలెనట; కొడుకు తనకుఁదగిన తావలముఁ గనిపెట్టి కూర్చుండవలెన; కూర్చుండుస్థలము విడిచి తక్కువస్థానమునకు వెళ్లుమని యొకఁడు చెప్పునట్లు పెట్టుకొనరాదట."

"సాబాస్! బళారె! బాగుగఁ జెప్పినావు," అని, భద్రయ్య, "నేఁడు మంచిదినముగ నుండుటచేత, 'శుభస్యశీఘ్రం', అన్నట్లు, యిపుడే జాబులు వ్రాసి పంపెద," అని, యొకజాబు వ్రాసి తపాలులో వేసిరమ్మనిపంపె.

"జాబు వ్రాసిపంపివేసినారు; లతకెపుడు వరునివెతకఁ బోయెదరు? లతవిచారమే నాకుఁ బెద్దదిగనున్నయది."

"ఏమె! లతకిఁగ వరుండు పుట్టఁబోవుచున్నాఁడా? ఏడనోపుట్టి పెరుగుచుండువాని వెతకికనిపెట్టవలసిన వాఁడను. నేటికి బోనమైనవెనుక మనబంధుకులవర్గములుండు వోట్లకరిగి, యెన్నాళ్లుండవలసి వచ్చినా యన్నిదినములుండి లతకు వరుని సేర్పఱుపక తిరుగను; నీకు సంతోషమే, కద? " చిఱునగవుతో, "లతకు వరుండు కుదిరినవెనుక నాయెద గుదురు. లతజాతకముఁ జూచినవారు దానికి గురుబలము రాలేదనియు మనచిన్నవానికిమాత్రము వచ్చినట్లును జెప్పుచున్నారు. గురుబలము రాలేదనుమాట నన్నేవేళ బాధించుచున్నది; గురుబలమురాక లతకేలాగున పెండ్లియగును? భగవంతునికే యెఱుక!" అని, సతి మనంబున నొచ్చుకొనెను.

"గురుబలము వచ్చుదాఁక యూరకుండవలెనా? ఏమి చేయుదుము? అట్లైన, నీవు నేటిమొదలు, ఉమాదేవిని రెండు పూఁటలు పూజించి ఫలమే భుజి

యించుచుండు తమ్మ. ఏనొక్కదినము శ్రీసుబ్రహ్మణ్యదేవతకుపవాసముండెద. ఈరెండు దేవతల కృపవల్ల లతకీసంవత్సరమే విఘ్నములేక వివాహము జరుగును."

"రెండు పూఁటలనియేల? మూఁడు పూఁటలుఁ బూజించుచు వచ్చెద; వారమొక్కదినముపవసించెద; లతకెట్టకేని పెండ్లియైన జాలు."

భోజనానంతరము నపరాహ్ణప్రారంభమున శాస్త్రోక్తముగ మార్గంబున జగ్ధిచేయ లాజములును జవిటికములును నీచవస్త్రాగ్రములలో బంధించి, కాంస్యభాండంబుఁ జేతఁబట్టుకొని, లతొంగికి వరాన్వేషణార్థమై బంధుకులవర్గములుండుస్థలములకుఁ బయనపడె. వీధిచివర వెళ్లుచుండగా, తిలఘాతకుం డొక్కండు తిలతైలకుంభంబును గండోలంబున బెట్టి, శిరంబుపై వహించి యభిముఖుండయ్యె. భద్రయ్య కొంత వెనుకఁదీసి నిలిచియుండగ ముట్టుముసుకొక్కతెకదిసె. బాపనుఁడు నెంజిలిఁజెంది, వచ్చిన త్రోవనే మళ్ళి యిలుఁజేరి, గుమ్మమున గూర్చుండి యలమటించుచుండె.

"ఇట్టి చెడ్డసకునములకుఁ గారణంబేమి? వివాహవార్తలనాడుచుండగ లతయు నాసతియు నేడ్చినదిగాక ప్రాణత్యాగము చేసికొనునట్లు వచించిరి. నాతనయకు వరునిఁగోరి పయనమై వెళ్లుచుండగ నాకెదుట గాండ్లశెట్టి నూనెకుండతో నెదురుపడె. అది చాలదని ముట్టుతోఁగూడిన మాసకమ్మ కదిసె. ఈలాటి దుశ్శకునములేల కల్గె?" ఇట్లని విచారపడుచుఁ దనముఖంబుమీఁది స్వేదముఁ దనపైగుడ్డతో నార్చుచుండె. కొంత సేపటికి నతనియిల్లాలు వచ్చి, "అపశకునములాయెనా? ఎందుకు తిరిగి వచ్చితిరి?" అని యడుగ, భద్రయ్య కొంత ధైర్యముఁ దెచ్చుకొని, "మంచిసకునములు గానందున మళ్లితి; మాఁపుపరస్థలము చేసి యుచితముగాక ముందు వెళ్లెద," అనగ, సుబ్బమ్మ ముఖము కసుగందఁ దొడంగె. కొంత సేపటికి సామి, "మునిమాఁపువేళ కావచ్చినందున సంధ్యవార్చి కొలఁగిర మొనర్చి పరస్థలము చేయుదును, పొమ్ము" అనినంతట, భద్రయ్య సంధ్యాజపములను ముగించి

రొనిమిది గంటలపుడే విస్తరియుందఁ గూర్చుండ, మనోవ్యాకులతచేత నన్నముసహింపక, రెండుమెతుకులను మెసవి, చేతులగడుగుకొని, పేలాల మూటఁ జంకఁబెట్టుకొని పొరుగింటఁ బరస్థలముచేసి, పరుండి, కాకులుకూయువేళలోలేచి చక్కఁగ వెళ్లెను. నిదురనుండి యేవారును లేచియుండనందున దుశ్శకునము లగపడకుండెను. అందుచేత మదిని నిశ్చింతఁజేసికొని తరువు దాలుపు లుండుచెట్టాలయిండ్లకుఁ బోయెను.

—••••—

8–వ అధ్యాయము.

సుబ్బమ్మ జ్యోస్యులతో నాలోచన; స్వప్నముకనుట; వరుండు కుదురక భద్రయ్యామళ్ళుట.

కంపితశిరముతో ముడుతలుపడిన మొగముగల కుబ్జుండొకండు చేత దుడ్డుఁగఱ్ఱఁబట్టుకొని, కక్షమున బంచాంగపుస్తకములకట్టతో లోగిలికి వచ్చినంతట, సుబ్బమ్మలేచి, "రండు, తాతగారు!" అని స్వాగతమిచ్చి,

"పీఠంబుమీఁదఁ గూర్చుండుఁడు," అనిచెప్ప, వృద్ధుండు పీటపై గుదిరినంతట, "తాతగారు! అత్తిఁపూతవలెఁ దమదర్శనంబు దుర్లభమయ్యె," అనిచెప్పె.

"వార్ధకముచేత నిటీవల బయటవచ్చుటను మానుకొంటి; మనయజమానులువారేడ?"

"మన లతకు వరుని నిశ్చయించి వచ్చుటకు వారు పల్లెవిడిచి యొక పక్షంబయ్యె; లత కీవఱకు వరుండేర్పడకుండుటచేత మదిన జోలకొదవయున్నది; ఏమిచేతును?"

"యజమానులువారి జాతకమును బిడ్డజాతకమును దెచ్చియిమ్ము; ఇప్పుడేచూచిచెప్పెద"

సుబ్బమ్మ యతనిచేత నొకపుస్తకమునిచ్చి యందులో నఱదతి జాతకములున్నట్లుచెప్పె. జోస్యుండు మొదట భద్రయ్యజాతకముంజూచి

ఇతనిజాతకరీతికి జరుగుచుండు సంవత్సరమున నొకశుభప్రస్తుతము జరుగు," అని, చెప్పగ,

"ఒక ప్రస్తుతమా? రెండు ప్రస్తుతములా?" అని, ధ-పంచమి యడిగెను.

"ఒకటి జరుగవచ్చును; రెండుజరుగవచ్చును; మూఁడు ప్రస్తుతములు జరిగినా జరుగవచ్చును", అని జ్యోస్యుఁడు కినక్కతోబల్కెను.

"నాకుమారుని వివాహము కుదురునువలె నున్నది," అని సుబ్బమ్మ చెప్పగ, ధ-పంచమి, "కుదిరినట్టే," అనెను.

"తాతగారు! శశిపురమున లాయర్గారుండెదరు; తమకు వినికిడి కలదా?"

"ఔఁ! లాయర్ జంబయ్య."

"అతని కుమార్తె నిచ్చునటుల జాబువ్రాసిరి."

"అదిచాల గొప్పచోటు; తోడుతోడఁ జేసికొనవచ్చు."

"లతకు ముందుపెండ్లి కావలెంగాని, చిన్నవాని పెండ్లికిఁ ద్వర లేదు; లతకీ సంవత్సరమే పెండ్లియగునేని తమకు దోవతిజత సన్మానము చేసెద."

"లతకు పెండ్లి కాఁబోవుట కభ్యంతరమేమి?"

"దానికి గురుబలము రాలేదట."

"గురుబలమా?" (జాతకముఁ జూచుచు) "గురుబలము రాకున్నను తక్కిన గ్రహబలములు లేవా? దాని జాతకరీతికి మంచిచదువువచ్చు; వాగ్ధాటియు వాక్శుద్ధియుఁ గల్గియుండు; దయాగుణముగలయది; లోకులకు సహాయకర్త్రి; మంచికీర్తి సంపాదించు; పరమసాత్త్వికి; ఇటువంటి యుత్కృష్ట గుణములుగల యిల్లాలు లభియించునా? ఇట్టిబిడ్డకు వివాహమగుటంగూర్చి సంశయపడనేల?"

ఈమాటలనువిని సంతసించి, "తాతగారు! లతకు పెండ్లికాఁబోవుటకు సందియములేదే?" అని సుబ్బమ్మయడిగెను

"పెండ్లికాఁబోవుట నిశ్చయము; ఏనును దోవతిసన్న్యాసము నొందఁబోవుటయు నిశ్చయము."

"ఆరూఢ మొక్కటి— ప్రశ్న యొక్కటిఁ జెప్పెదరా?"

"నూటయేనిమిదిలోఁ దక్కువ చెప్పుము."

"తొంబది."

"పుష్పములలో నొకదాని పేరుఁ జెప్పుము."

"చంపకము."

"దేహమున నేదైన నొకభాగమును నంటుకొనుము."

"వక్షను నంటుకొంటి."

గడియారము జూచి వ్రేళ్ళనువిడిచి, "పెండ్లియగుటకు సందియము లేదు; అయినను, కొంతయాలస్యమగు; మూఁడువారములో, లేక మూఁడు పక్షములో యాలస్యమగు," అని, జ్యోస్యుఁడుచెప్పుచుండగ,

"లేక, మూఁడుసంవత్సరములో," అని, ధ-పంచమి చెప్పినవ్వెను.

"ఓరి, ప్రాచీనావీతి; అని ధనిష్ఠాపంచమిఁ జూచిచెప్పి, సుబ్బమ్మతో, జ్యోస్యుఁడు "ఈయసభ్యుని నెదుటఁ బెట్టుకొనియేదియుఁ జెప్పరాదు," అనెను.

"జ్యోస్యులార! ప్రాచీనావీతి యననర్థమేమి?"

"ఓరి, అపసవ్యం!"

"అవి మంచినామములా?"

"దివ్యమైన నామములు."

"అట్టి దివ్యనామములు తమకే తగునిందు."

"ఓరి, అధికప్రసంగి!"

"తుదఁ జెప్పిన నామమే నాకుఁ జాలు," అని నంతట, సుబ్బమ్మ కసరి. "ఓరి, వదరుబోతు! వృద్ధులతో నెకసక్కములేల?" అని, గద్దించె. ధ-పంచమి నవ్వుచు వీధికి వెళ్ళెను.

వృద్ధుండు సుబ్బమ్మగారొసంగిన తాంబూలమును సంగ్రహించి కడపదాఁటుచుండగ, ధ-పంచమి, "జ్యోస్యులార! అని యఱచి తన కెప్పుడు పెండ్లియగునని యారూఢము చెప్పిపోవలెనని జ్యోస్యుల కడ్డముగ నిలఁబడె.

"గమనము చేయునపుడు ప్రశ్న నడిగిన నెంత యవలక్షణము! ఎఱుఁగుదువా? నాకు డెబ్బది యేండ్లాయె; నాకును నీకును నొకప్పుడే పెండ్లి," అని, ముదుసలి తొస్సగఁ బల్కి, బొక్కవాయితో నవ్వెను.

"అయ్యారె! మీకును నాకును నొకప్పుఁడేమి పెండ్లి? పిడుకల పెండ్లియా?"

"చాలే!"

"ఒక్కరూపాయ నిచ్చెద, స్వామీ! ప్రశ్నఁ జెప్పి వెళ్ళుఁడు."

"జాతక మున్నదా?"

లేదు; నా నామమునుంబట్టి చెప్పుమా?"

"నీ నామమా? ధ-ని-ష్టా-పం-చ-మి," యని యక్షరముల విడిచి యుచ్చరించి, "ఏడరూపాయ?" అని, జ్యోస్యుండడిగెను.

"నాకనుకూలించిన వెంటనే నిచ్చెద, స్వామి!"

"ఓహోరె! నేను ముందుఁ జెప్పినదియు సరి; నీనామ నక్షత్ర మెంత లక్షణమో నీకు పెండ్లి కాఁబోవుటయు నంత లక్షణమే," అనుచుఁ గుంటి కాలితో నెగసియెగసి జ్యోస్యుఁడు నడచిపోయెను.

"సుబ్బమ్మ, ఓరి, పంచమి!" అని పిలువ, "ఓహో," అని వచ్చి, "ఎందుకు పిలిచితిరి?" అని, సేవకుండడిగెను.

"జ్యోస్యుల వారికేమి యడుగుచుంటివి?"

"లోకులు బాలజ్యోస్యులను వృద్ధవైద్యులను గోరుచున్నారు; మన జ్యోస్యులకు ముదిమిచేత నరులుమరులు; లెక్కలు తబ్బిబ్బగుచున్నవి, తల్లీ!"

"వృద్ధుల కనుభవమెక్కువ; వృద్ధుల వాక్కు వృథబోదు," అనుచు సుబ్బమ్మ పాకశాలకుఁజనియెను.

బారెఁడు ప్రొద్దుండగ రంగనాథుఁడు బడివిడిచివచ్చి, "అమ్మా, నాబడి నేఁడు మూయఁబడె; నేటిమొదలు రెండునెలలవఱకు సెలవు దినములు; అటువెనుక చదువుకొనుటకు శశిపురమునకుఁ బోవలసినవాఁడను. ఏఁడాదియైనవెనుక సర్వకళాశాల ప్రవేశపరీక్ష లేక, పాఠశాలాంత్య పరీక్షకుఁ బోవలసినవాఁడను," అనెను.

"అదేమి పరీక్ష?"

"పండ్రెండు రూపాయలంగట్టి పోవలసినపరీక్ష."

"ఈ పాఠశాలలో మనలతకింకెన్నాళ్లు చదువుఁ జెప్పుకొనను?'

"ఒక్క సంవత్సరమువరకు; మఱి సంవత్సరమదియు శశిపురమునకుఁ బోయి చదువుకొనవలెను."

"ఔ లెమ్మ! లత యీవఱకుఁ జదువుకొన్నంతఁ జాలదా? అదియు శశిపురమునకు వెళ్ళవలెనా?"

"ఔగదే! ఏల చదువుకొనరాదు? ఈ సంవత్సరమే రంగనాథన్నతో శశిపురమునకు వెళ్ళి స్త్రీలకుఁ బ్రత్యేకముగ స్థాపితంబైయున్న పాఠశాలలో జదువుకొనఁబోయెద."

"స్త్రీలకుఁ బ్రత్యేకమైన పాఠశాలయున్నదా?"

"ఉన్నది; పైజదువుకు కళాశాలయున్నది," అని, సుతుఁడుచెప్పె.

"అందుకు మీఁదనేమి చదువు?"

"ప్రవేశ పరీక్షకు మీఁద ప్రథమ విజ్ఞాన పరీక్ష, లేక, మధ్యకాల పరీక్ష; అది యిరువదినాల్గు రూపాయలుగట్టి పోవలసిన పరీక్ష. అందుమీఁదఁ బట్ట మిచ్చెడి పరీక్ష; అది ముప్పదియాఱు రూపాయలుగట్టి పోవలసిన పరీక్ష; అందుమీఁద—"అని వాక్యమును ముగియించుటకుముందు, సుబ్బమ్మ

"బళీరయ్య! చదువుకుఁదుదలేనట్టున్నది; ఒకని జీవితకాలమంతయుఁ జదువుకొన వచ్చునువలె నున్నది; లత చదివినంత మాత్రమే చాలు," అనుచు గృహకృత్యములఁ జేయఁదొడఁగె.

కొన్నాళ్ళకు వెనుక తన భర్త గ్రామము విడిచి రెండు పక్షంబులయ్యెఁ దిరిగి రానందున నెట్టి శ్రమలు బడుచున్నారో; వేళ వేళకు భుజించుచున్నారో, లేదో; వారి యత్నములు సఫలమాయెనో, లేక, విఫలమాయెనో, అని సుబ్బమ్మ బహు విధంబులఁ జింతించి విచారపడుచు, మాపున గనులపై ఱెప్ప పడక, వేదనలఁ బడుచుండె. ప్రతి రాత్రియు నిదుర భంగమగుచు వచ్చినందున నొక శుక్రవారమున నభ్యంగనము చేసి, యుమాదేవి తన స్వప్నమునవచ్చి లతకు పెండ్లియగునని తెలిపింపవలెనని ప్రార్థించి, యాదినమంతయు ఫలముగూడ భుజియింపక యుపవాసముండె, యిరులు కమ్మిన యిరుమూఁడు గడియలకుఁ గనుమోడ్చె. నిశీథిని బసుపు వస్త్రముల గట్టుకొని యుండిన బాల్య దంపతులు కనఁబడిరి. తోడుతోఁ గనువిచ్చి చూడ దంపతుల గాన నందున స్వప్నమని యెఱింగి, కరచరణవదనములను శుభ్రము చేసి కొని, కుంకుమ నెత్తిన బెట్టుకొని యుమాదేవిని బ్రార్థించిన మేరకు నాదేవి కలలోఁ బసుపుబట్టలతో దంపతులఁ గనిపించెనని యెలమిఁజెందె. ఉదయంబైన తోడనే సేవకుని బిలిచి, తాఁగనిన స్వప్నముఁజెప్పి ముదముఁజెందగ నతఁడు,

"దంపతుల జత యొక్కటా? లేక, రెండా?" అని, యడిగె.

"ఎందుకురా జత యొక్కటా? లేక, రెండా? అని యడిగెదవు?"

"మన రంగనాథుఁడు నతని భార్య యొక జత; లతకొక జత కనఁబడవలదా?"

"ఏను ప్రార్థించినది లతను గురించియే; అందుచేత నొక్క జత కనులఁ బడె."

"సరే!" అనుచు సేవకుండు వీధి నడవకు వెళ్ళెను.

శ్రీమంతపల్లె విడిచి యిరవదివారములు గడచిన తర్వాత జేనెఁడు ప్రొద్దుండఁగ భద్రయ్య బడలి, మై 'నల్లవాటి'' సన్నగిల్లి, కూటామున వచ్చి కూర్చుండె. అతని సతి యర్ఘ్య పాద్యములకు జలమొసఁగ ముఖ కరపాదముల శుద్ధపఱచుకొని కూర్చుండె. "తాము వెళ్ళిన నాటినుండి 'పూఁట పూఁటకు' భుజియించుచు వచ్చితిరా? లేదా? మిమ్ముఁ జూచిన గడుపు బగ్గుమనుచున్నది. ఎందుకు తమ దేహము పుల్లవలెఁ దీసిపోయె? తాము వలచిన పని సమకూడ నందున మనోవ్యాకులముచేత మేను కష్టుఁజెంది పడకవలెఁ బోయెనా? ఒక్క బిడ్డకుగాను నింత గోరమా? తాము దిటవుగ నుండిన గద, బిడ్డలు సుఖపడుదురు; తమ దేహము పూర్వస్థితి కేలాగున వచ్చు" అని, సతి చేతుల బిసుకు కొనెను.

"మన వంగడముఁ జేరినవారి నందఱిఁ జూచి వచ్చితి; పరికించి చూడఁగ నిత్తిగ బమ్మాచారులగపడిరి; వారిలో—" అని పతి చెప్పుచుండఁగ,

"వివరములఁ జెప్ప నవసరము లేదు; నాలుగుఁ దినములు తాళి చెపుదురు; వరుం డెవ్వండైనఁ గుదిరెనా, లేదా?" అని యామె యడిగెను.

భ—కుదురలేదు; రెండుమూఁడుచోట్లనుండి త్వరలో జాబువచ్చు

సు—ఇపుడేదియుఁ జెప్పఁ ద్వరలేదు; తేపుమఱునాఁడు సవిస్తరముల మాటాడుకొనుదము, అని, విస్తరవేసి యన్నము వడ్డించె. భద్రయ్య మెక్కుచుండఁగ,

సు—ఎందుకో పామరులు బిడ్డలు లేదని విచారపడెదరు; ఉండేది రెండు బిడ్డలు; ఒక్క బిడ్డకుగాను పాటిల్లుపాటులేఁ జాలు. బిడ్డలవల్లఁ జింతపడుట నిశ్చయముగాని వారివల్ల సుఖముగాంచే బోవుటనిశ్చయమే.

"ఏనల్లాడి చేడ్పడవలసినవిధియుండఁగ, బిడ్డలపై విసుగేల?" అనుచు భద్రయ్య తనపఱుపుమీఁదికిఁ జేనిరె.

లతాంగి యల్లన దనయప్పయొద్దఁ జేనుదెంచి, చెంతఁ గూరుచుండి, తనయయ్య కాళ్ళు చేతులను మెత్తగఁ బిసుకుచు, సన్నని గొంతుతో, 'అయ్యా', యని పిలిచి, "తమతనువు బక్కటిల్ల నేల? తీఁగవలె నూసరిల్ల నేల? నను ప్రేమతోఁ బెంచినదిఁ గాక తమకువలసినసుఖముల నాకొఱకుఁ ద్యజించి శ్రమలఁ బడినందుకేగద, తమ కండలు కఱఁగి మేనిలో నెముకలును దోలునుమాత్రము నిలిచె; నాకండలు పెరుగుచుండఁగఁ దమకండలఱిగిపోవునట్లు చేసినందుకు నేనేమిపాపముఁ జేసితో; ఇఁకఁ దాముశ్రమపడఁ బనిలేదు; నాకు పెండ్లికావలసిన వేళవచ్చిన దనంత యగు; కూడిరాఁగల వేళలో నన్నియు గూడివచ్చు; వేళ రానియెడఁ దాము యతనములఁ జేయనేల? అవిబుసిపోయిన సిలుగొంది యొడలు నలఁగుడుపడ నేల? దైవబలములేక మనుష్యయతనములు కొనసాగవు. ఇఁక నెన్నినెలలైనను దమదేహము ముందుస్థితికి వచ్చువఱకుఁ దాము మనయింటివాకిటి దాఁటిపోఁబనిలేదు", అని చెప్పి, తనకన్నయ్య చెయిఁ దననెత్తిమీఁదఁ బెట్టి కండ్లపైనదిమి, మూచూచి ముద్దుపెట్టె. అంతఃకరణమునుండి వచించిన తనకూఁతురి హితవచనములు దనస్వాంతముఁ దాఁకినంతట నానందబాష్పములు మెండుగ వెలువడె. కన్నీటిఁ దుడుచుకొనుచు, భద్రయ్య, "నాకెంత దుఃఖముండినను నీతియ్యందనముచేత శమనమగుటకు సందియములేదు," అని, లతను దనప్రక్కన నణఁచికొని, "తల్లిదండ్రుల దుఃఖమును బిడ్డలాపుదురను లోకోక్తి నేఁడు నీచే మూదలయయ్యె", అనుచుఁ దన యధరములు లతచెంపలమీఁదనదిమి, "కొన్ని దినములు నీముద్దుమోముఁ జూచుచు నీముచ్చటలవినుచుండిన నాదేహము పూర్వస్థితికి వచ్చుట,

"రాత్రికి వెనుకఁ దెల్లవాఱునంతటి నిశ్చయము," అని, "బువ్వతింటివా?" అనియడుగ, లత తలనూఁచె. "ననుగుఱించి చింతపడవలదు; పండి నెమ్మదిగ నిదురపొమ్ము," అని తండ్రి చెప్పినంతటఁ గొమరిత తనపాన్పుమీఁదికిఁ జేని నిదుర గొనియె.

మఱువాఁడు సుబ్బమ్మ తాను మాదేవిని ప్రార్థించిపరుండినదియుఁ దనప్రార్థనకనుసరణగఁ గలకనినదియుఁ దనమగనితోఁ జెప్పి, లత పెండ్లివిషయమై నిశ్చింతగనుండవచ్చునని తెలియజేసె.

జాయాపతులనుదినముఁ దెల్లవాఱి తొమ్మిది గంటలు మొదలు పవలంతయు రేయియంతయు లత పెండ్లిఁగూర్చి యనుకూలమైన జవాబు వచ్చునని యాశతోనుండి యుదయ మెనిమిది గంటలకు తపాలువాఁడు జాబు లేక వెళ్ళుచుండినందున, వారి యాశ దినదినము భంగమగుచు నిత్తిగవారములు కడచి పోయె.

రంగనాథుఁడు శశిపురమునకుఁ జదువఁ బోవలసిన కాలము సమీపించినందున, భద్రయ్య లాయర్ జంబయ్యగారికి తన పుత్రుఁడును బుత్రికయు శశిపురమున జదువుకొనవలసి యుండుటచేత వారినొకవారములోఁ దోడ్కొని రాఁబోవునట్లును వారికిఁ దగిన బస నేర్పఱచి పెట్టునట్లును జాబువ్రాయుచుండె. ఆ యవసరంబున, సుబ్బమ్మ, పెండ్లిచేయక లతను శశిపురమునకు బంపఁగూడ దనెను.

"తానుండననియుఁ దన యన్నవెంటఁ బోవలెననియు నన్ను పీడించుచున్నది. ఏ నేమి చేయుదు? అది బడిలోఁ జదువుకొనుచునుండిన నొకవారమునకు సెలవు పుచ్చుకొని, పెండ్లిని జరపింతము."

"ఇచ్చట నింకొక సంవత్సరమువఱకు వలసిన చదువుండగ దాని బంపనేల? ఇంగ్లీషు చదువుకొనుచున్నదనిన మన యిండ్లవారు దానిఁ బెండ్లి చేసికొన వెనుదీయుదురను భీతిచేత దాని నీ సంవత్సర మిచ్చట నుంపుడని చెప్పుచున్నాను."

"తన యన్నవెంటఁ దను బంపకుండిన శ్రీమంతెపల్లెలోఁగాని మఱి యెచ్చటగాని యుండదని చెప్పుచున్నది; అందుకేమి చేయుదము?"

"దానికంత పట్టేల?"

"చదువుకొనుటయం దంతశ్రద్ధ."

"స్త్రీలకు విద్య మితముగ నుండవచ్చును; మితము మించిన నెవ్వఁడు పెండ్లిచేసికొన గలఁడు?"

"స్త్రీలకు విద్య పథ్యమా? స్త్రీ విద్దెకు మిత మెంత? మితము మీఱిన నెట్టి దోషము? ఎవ్వతుకకైన జదువు బాధకరం బనఁదగునా? నీవు చదువుకొన లేనందున నను జదువఁ బనిలేదని యెదవా? ఏను చదువుకొనుట చేత నన్నెవ్వఁడైన బెండ్లిచేసికొనని పక్షమున నాకు పెండ్లిలేక పోయినా గొదవలేదు; చదువును నెంతమాత్రము వదలను," అని లతాంగి చెప్పగ,

"ఓసి సుబ్బి! లతను దన యిష్టానుసారము జదువుకొననిమ్ము; గొప్ప చదువుఁ జదివినందుకు దానికి పెండ్లి కాక పోయిన, దానిని నా మగబిడ్డ యని తలఁచుకొందుఁగాని చదువకక్కఱలేదన జాలను," అని తండ్రిచెప్పె.

"తమ యిష్టము; దాని యదృష్టము."

ఈ మాటల విని నంతట లత కపారమైన సంతోషముగల్గె.

9–వ యధ్యాయము.

లతయు రంగనాథుఁడును తండ్రితో శశిపురమునకు బాట మార్గమునను రైలు మార్గమునను బోవుట.

"స్వామీ! రంగనాథా! లతమ్మ!" అని వీధి వాకిట బిలిచిన శబ్దము వినవచ్చి, యెవరక్కడ యని భద్రయ్యవీధికి బోవుచుండగ, ధ-పంచమి వచ్చి మారయ్య వచ్చియుండునట్లు చెప్పె. తోడుతో రంగనాథుఁడు వచ్చి

మారయ్యకు నమస్కరింపగ లతాంగియు వచ్చి చాఁగిలి, యతనిప్రక్కన నిలఁబడె. "నమస్కారములు, స్వామీ!" అనుచు భద్రయ్య బద్ధాంజలితో వచ్చి, "చాఁపమీఁద దయసేయుఁడు," అనెను.

"రంగనాథుఁడు శశిపురమునకు వెళ్ళెదఁడా?" అని మారయ్యయడుగ "లతయుఁదనయన్న వెంటఁబోయెడిని," అనిభద్రయ్యచెప్పె.

"సంతోషము! అందఱికిముందు లతచేదివిపరీక్షలనీఁగలదు. లతమ్మవలెఁ గుశాగ్రబుద్ధియు వివేకముంగల బాలుండైన బాలికయైన నాబడిలో నీవఱకుఁ జదువుకొనలేదు. స్త్రీల కింతటిబాల్యములో విద్యయందు పాళియుండుట దుర్లభము"

"లతను నామగబిడ్డయని భావించియుండెద."

మారయ్య రంగనాథునివెన్నుదట్టుచు, "శశిపురమునకు వెళ్ళెదవా?" అనియడుగ, "వెళ్ళెదను, సార్," అనెను.

"పయనమేనాఁడు?"

"అదెప్పుడో! నాకు తెలియదు, సార్!"

"లతమ్మ! నీవును నీయన్నగారి వెంటఁజని, చేదువుకొనఁ బోయెదవా?"

"గురువైనతమ యాశీర్వాదముతోను నాతల్లిదండ్రుల యనుజ్ఞానుగ్రహములతోను వెళ్ళివచ్చెద."

"పయనమెన్నఁడు?"

"ఱేపు బుధవారము మంచి దినముగ నున్నది; ఆనాటియుదయమున బయలుదేరెదము."

"మనబడినుండి యింకఁగొందఱు పిల్లవాండ్రు శశిపురమునకువెళ్ళనుద్దేశించి యుండెదరు."

"ఇంకెవ్వరు వెళ్ళనున్నారు?" అని భద్రయ్యయడుగ, మారయ్య బదులొనర్చునంతలో వీరశెట్టివచ్చి, "అయ్యవార్లిరువురికి దండములు" అని

చేతులఁ బైకెత్తి, మారయ్యతో, "తమయింటికివెళ్ళితి; తాము తమయింటలేదని తెలియవచ్చి భద్రయ్యగారి దర్శనమునకు నేతెంచితి. 'వెతకఁబోయిన తీఁగకాళ్ళంబెనగినట్టు,' తమదర్శనం బిచ్చటఁ గల్గినయది నాభాగ్యమే!" అని, పండ్లసిగిలించె. భద్రయ్యశెట్టిగారిని జాపమీఁద దయసేయుడనిచెప్పి, కుశలప్రశ్నలనడిగినంతట, "మనరంగనాథయ్యను శశిపురమునకెపుడుపనుపనుద్దేశించియుండెదరు?" అని శెట్టిగారడిగిరి.

"బుధవారముదయము, నాకొమరితెయు వెంటఁబోయెడిని."

శెట్టి ముక్కుమీఁద వ్రేలిఁబెట్టుకొని, "ఈకలికాలమున మగవారికి సరిగా నాఁడువాండ్రుఁ జదువుకొనవలెననెదరు", అనియెను.

"ఏమి శెట్టిగారు! ఆఁడువాండ్రు చేదువుకొనరాదా? వారిచేదువులు వంటింటి చదువులేనా?"

మరలవ్రేలిని ముక్కుమీఁదఁ బెట్టుకొని, "అమ్మాయీ! మాయింటియాఁడువాండ్రింత చదువుకొనలేరు; ఇంత మాటాడను జాలరు; బాపనులకే, సరి!"

"చేదువు బ్రాహ్మణులకేయనిన దమకుమారుని శశిపురమునకేల పనిపెదరు?"

"స్త్రీలవిషయమైచెప్పితి, తల్లీ! నీవుకోపము గొనవలదు."

"తమకూతుండ్రనెపుడైనబడికిఁ బంపితిరా? బడిలో విడువక నే చేదువుకొనరని చెప్పెదరా?"

"వారినెపుడు బడికిఁ బంపలేదు, అమ్మాయీ!"

"అందుకెవ్వరేమిచేయఁగలరు? తమకూతుండ్రు మూఁగదీలా? మాటాడఁజాలరా?"

మూఁగలుకారు; ఇంత ధాటిగ నింత ధైర్యముగ మగవారితో మాటాడఁ జాలరు."

"నట్టింటిలోను వంటింటిలోను వారి యెల్లకాల ముంచియుండిన వారే వారితో మాటాడఁ గలరు? స్వతంత్రమును బరిచయమునుగల మగవారితో మాటాడుదురా, లేక, తూష్ణీం శీలురై యుందురా?"

"నట్టింటిలోను వంటింటిలోను చెప్పుడుచేసి రాకాసులవలె భాషించెదరు; పరిచయమైన వారితోను నాతోను మాటాడునపుడు, (తన రెండు చేతులఁ బైకెత్తి దిగువదించి) యెంత యెగరవేసి యెంతదింపి మాటాడెదరు, తెలియునా?"

నవ్వుచు, "వారు చదువరులై యుండిన నిట్టట్టు చెదరని నిండుకుండవలెఁ జెప్పుడులేక, వినయముతోను వివేకముతోను భాషింతురు; వారిని జదివింపని దోషము తమదే. వారిని రాకాసులనుచున్నారు; తమకు వలసినపుడు వారు దైవములును, వలదన్నపుడు రాకాసులో!"

"నీకు జవాబు చెప్పలేను, తల్లీ! బాపన పిల్లలు చదువ నారంభించిన దక్కిన జాతివారుఁ దమంత చదువ నారంభింతురు. లతమ్మ! నీవు చదువుకొనఁబోవు విషయము నాకు సంతోషకరము." "శెట్టిగారు! తమ కుమారుఁ డెన్నఁడు వెళ్ళఁగలఁడు?" అని భద్రయ్య యడిగెను.

"తమకును నాకును బురోహితుఁ డొకఁడే; తమ పయనమునకు బెట్టి యిచ్చిన లగ్నమును నా కుమారుని పయనమునకును బెట్టి యిచ్చె; నా పిన్నవాఁడెచ్చు బండిని దమ బండి వెంటఁ బంపిన నొకటి కొకటి తోడుగనుండు"

"మంచిది!"

ఇత్తరుణమున గ్రామరెడ్డిగారైన రామిరెడ్డిగారు విచ్చేసి, యందఱికి దండములు సమర్పింపగ, శెట్టిలేచి, యెదురుకొని వెళ్ళి, "వేంచేయుఁడు, రెడ్డిగారు! దయచేయుఁడు," అంచు రెడ్డిగారిచేతులఁ బట్టుకొని, "తాము కూర్చుండిన దమప్రక్కన గూర్చుండెద," అని, రెడ్డిగారిని గూర్చుండబెట్టి ప్రక్కన దాను గూర్చుండె.

"గ్రామాధికారు లింత దూరము దయచేసిన కార్యంబేమొ," అని భద్రయ్య యడుగ,

"శెట్టిగా రేవిషయముగూర్చి వచ్చియున్నారో యట్టి విషయమునుబట్టి యేనును వచ్చినాఁడను; పిన్నవాండ్రే నాఁడే ప్రొద్దుకు బయనించెదరు?" అని యడిగె.

"బుధవార ముదయ మాఱుగంటలకు; శెట్టిగారిబండి నాబండి వెంట వచ్చు; తమ బండియు రావచ్చును."

"మంచిది; సంతోషము; ఏను సెలవు పుచ్చుకొనెద," అని, రెడ్డిగారు లేవగ, శెట్టిగారును లేచి సెలవు పుచ్చుకొనిరి.

"శెట్టిగారు, తమ కూఁతుండ్రఁ దప్పక బాలికా పాఠశాలకు బంపుడు," అని, లతాంగిచెప్పగ,

"మంచిది, అమ్మాయీ," అనుచుఁ జనెను. మారయ్యయు నమస్కరించి సెలవు పుచ్చుకొనెను.

అంగారకవారమునాఁడు లతాంగి తన పూజపెట్టియతోఁ దనకు గాబట్టు 'సూదులు, పటములు, గ్రంథములు, బట్టలు', వీటిని నొకపెట్టెలో బదిలపఱచి, పేటికకు బీగము వేసి, బీగము చెవిని గొంగున ముడివేసికొనెను. బుధవారమునాఁడు బండి కదలను రెండు గడియ లుండఁగఁ దన పెట్టియలతోఁ దనయున్న పేటికను బండిలో వైచె. బండి కదల నొక్కగడియ యుండగ, భద్రయ్యతన సుతుని బిలిచి, వానికి వలసిన వాటిని బండిలోఁ బెట్టి వచ్చెనాయని యడుగ, "నాయన! ఏను పంచల నెత్తినాను. 'ఈయంపంచేల? అన్నిపంచలేల? అని నాతల్లి యాక్షేపణచేసినందున నేనువేనిని నెత్తిపెట్ట లేదు," అనెను.

"నాతో ముందు చెప్పరాదా?"

"పంచల నెత్తిపెట్ట నెంతసేపు? ఇప్పుడు చెప్పినఁ జాలదా?"

"పుస్తకము లేవియు బనిలేవా?"

"క్రొత్తపుస్తకముల గొనవలెను, నాయన."

"ప్రాతపుస్తకములలో వలసినవిలేవా?"

"ఉన్నవి; అవి యెచ్చటనున్నవో! వెతకి వచ్చెద."

"నాయన! నాయన్నగారికి గావలసిన 'పుస్తకములు, బట్టలు, చొక్కాయలు,' మొదలగువాటిని నిన్నయొక పెట్టెయలోఁ బెట్టి, యాపెట్టె యను రెండుగడియలకుముందు బండిలో నుంచివచ్చితి."

"నీయాడుతోడుకుగల శ్రద్ధ నీకులేనట్లున్నది."

"నాచెల్లియ చేదివి యుద్యోగము చేయబోవుచున్నదో?"

"చేదివియుద్యోగముచేయబోవువాని ముందుజాగ్రత, 'బవిసి' యెంత మాత్రమున్నద! తెలియలేదా?"

"ఏనుశశిపురమునకువెళ్ళను; లతనుబోనిండు."

"ఓరినాయన! నీతండ్రిగారితో వితండవాదమేల? అతనితో వికటించుటేల? చలిదయన్నముగుడిచి బండియెక్కిపొమ్మను; ఓసిలత, వెండిగిన్నెలోఁ జెల్లపోసి కలిపినయన్నము నీవుతినిపొమ్మను; వెండితట్టలో బాలుమీగడవేసినయన్నమును నీయన్ననుదిని పొమ్మననుము; నీతండ్రిగారిని బిలిచి తట్టలోబెట్టియుండు ఫలాహారము నాహారముచేసి పొమ్మననుము," అనిసుబ్బమ్మ చెప్పె.

మూవురును మెసవినతరువాత దేవాలిచెంత నిలువబడియుండగ, రంగనాథుఁడు బండియెక్కఁబోయె.

"ఓరినాయన, లగ్నవేళరాలేదు; కాస్తకాచియుండుము," అని, తండ్రి చెప్పగ,

"వేళయేమి? గిళయేమి, నాయనా?"

"అట్లుచెప్పకరా, నాయన; వేళచేయుమంచి మంచివారుచేయలేరు."

ఈ యవసరంబున, ధనిష్టాపంచమి శుభ్రమైన భద్రియుగంబును రథచక్రాంగముల కశేషము నీసభస్నముతో శ్వేతవర్ణంబిచ్చిన శకటయుగము

నకుబంధించి, పయనమునకు సిద్ధమైయుండె. తత్క్షణమే, శోణపాండురపలాశ ధూసరవర్ణంబులతో నొఱయుచక్రయుగంబుతోఁగూడిన శకటంబు సమీపించె. బీతుగల చూపులతోఁ జూచుచుండిన యాబండి యాబోతులజోడు చక్రాంగములవలెఁ జౌవన్నియలుగల చర్మముఁదాల్చియుండె. సారథియో కెంజాయ వస్త్రముల నాపాదమస్తకమువరకు ధరించియుండె. శకటము మధ్యశ్యామలదేహుండైన వైశ్యబాలుండు కూర్చుండియుండె. తద్బాలుఁడు చేతులలోఁ బసిడికడియములును బుత్తడి గొలుసులును, వ్రేళ్లలో రత్నాల యుంగరములును, కర్ణములలో డాలుమీటు వజ్రాల పోగులును దొడుగుకొని, నడుమున, 'మధ్యవెలి, చేట్టుతోగరు'' ఛాయగలపంచను గట్టుకొని, పసరుఛాయ గుళాయ దలమీఁద నిహించి, లలాటమధ్యంబున 'నిరుగెడల దెల్ల మధ్యగుంకుమ' వర్ణముగల యూర్ధ్వరేఖలమూటితో వెలయుచుండె. ఈ బచ్చుపడుచువాఁడు బండివిడిచిదిగి, "ఓరి రంగ! ప్రొద్దెక్కుచున్నది; బండెక్కిపోదము," అనిచెప్ప, రంగనాథుఁడు, "ఓరిజీరు! మీబండిరాలేదని కాచుకొనియుంటిమి. రెడ్డిబండియునదిగో, వచ్చుచున్నది! అందఱు వెళ్ళుదము," అనినంతట, మొదట రంగనాథుఁడు, వెంట సేలతాంగి, వెనుక భద్రయ్య, యీమూవురును రథారూఢులైరి. శెట్టిపిన్నవాఁడు దనబండిమీఁద నారోహణంబొనర్చె. వెంటనే, పుల్లబసవండొకనిచే లాగబడిన చిన్నబండిని గ్రామకావలివాఁడు తోలుకొనివచ్చె. అందున దీర్ఘముఖుండై లోచొక్కాయఁదొడుగుకొని పొట్టితాటిచెట్టువలె శిరము బండి లోశిఖరముఁదాఁకుచుఁ గూర్చుండియుండిన నాగిరెడ్డియను పసివాఁడు, "ఓరి, రంగ! ఓరి, జీరు! నేనునువచ్చినాను," అని చెప్పెను. రంగనాథుఁడును జీరుశెట్టియు, మంచిది యని, తలనూఁచిరి.

శకటంబులు కదలనొకనిమిషముండగ, దేవళంబున గంటలమ్రోత వినఁబడె. బుగ్గలందుఁ బసుపుఁ బూసికొనినొసటఁ గుంకుమతిలకంబుఁ బెట్టుకొని దేవాలయంబునకుఁ బ్రదక్షిణమొనర్చి తిరిగినముదుసలి సుమంగలి కాలు ద్రొక్కె; వీధియంచున నొకమగగాలిగా డాఁడురేవు జిక్కించుకొని యొం

జ్రి పెట్టె. ఈశుభశకునములను గనియువినియు బండ్లనుఁ దోలునట్లు భద్రయ్య యాజ్ఞ సేయగ, రథసారథులు 'హేయ్,' 'హై' యని సారథేయంబుల నదలించి వాటిపైఁ గశంబులఁ బడవేసినంతట శకటంబులు గదలనారంభించె. రథత్రయంబుల వెంబడి 'సామిగాఁడు,' అనుభద్రయ్య బత్తెకాఁడు పోవుచుండె.

మంచిమధ్యాహ్నమున విశ్రమించినకాలమైన యైదుగడియలప్రొద్దు తప్ప మిగిలిన ప్రొద్దంతయు రథములు సత్పథవిపథములలోఁ గడచి, యొకకాంతారముఁ జొచ్చె. ఉభయపార్శ్వములఁగల కుంజంబులనుండి దూఁకుచుఁ బోయిన చారుకురంగములఁగని, లతాంగి, "నాయన! ఈచిన్ని జింకలెంతముద్దుగ నున్నవి! నాచేతనొక్కటి చిక్కిన నేను గొంపోవుదు," అని, నవ్వెను. కొంతదూరము కడచినపిదప సృగాలంబులఁజూచి, "నాయనా! నక్కమూతిఁ జూచినవారికదృష్టమనుచున్నారుగద? ఎన్నినక్కలు జొపట్టె! మనకెంతయదృష్టము!" అనుచుండగ, గులకరాళ్లునిండిన వ్రజంబున బండ్లు 'గడగడ' యని కదలు శబ్దములను శ్రవించి శశంబులు పరుగిడుటం గని, "నాయన! జెలుకులోఁ గుందేటి కెనలేదనుచున్నారు; అందుకు నిదర్శనముగఁ గుందేళ్లెంత జెడిసి వాయువేగమనోవేగములతోఁ బఱుగెత్తుచున్నవి," అని, చెప్పె. "ఒకకుందేటిఁబట్టి చూచిన దానిదేహము వణకుచు, డెంపకాయ 'పటపట' యని, కొట్టుకొనును," అని, తండ్రి చెప్పెను.

బండ్లువనమును దాఁటి కంటకభూమిమీఁదను శర్కరిలప్రదేశములలోను గడచి, దిశాంతంబున జటలతోఁగూడిన వటజటీవృక్షంబుల పంక్తిచే నిరుకెలంకులు శోభాయమానంబై వర్థిల్లుచుండిన సరణింజేరినంతట నందఱుమనంబున సంతృప్తిఁ జెందిరి. తత్పథమున రెండుమైళ్ళదూరముఁ జనినంతట రెయిమార్గముఁ బొడగాంచిరి. సమీపంబున బోవగ (రయిలుస్టేషన్) 'యినుపదారిస్థలము' చూపట్టె. అచ్చట బండ్లనునిలిపి, భద్రయ్య తన బత్తెకాని బిలిచి, రాత్రిపూఁటనిలిచి తెల్లవాఱఁగ బండిని నింటికి దోలుకొని

పొమ్మని యాజ్ఞాపించెను. బత్తెకాఁడు నిర్దేశముచేసిన ప్రకారముఁ దక్కిన సారథులతో నుదయమైనంతట శ్రీమంతపల్లెకు వెళ్ళెను.

భద్రయ్యమొదలగువారు 'ప్లాటీనఁ' తంతులయావరణము మధ్యనుండిన కవాటముఁ దెఱచి లోఁజొచ్చిన నొకదిక్కున నాలుఁగు చిన్ననిలయంబులు పొడకట్టె. అవిరైలు మార్గపు 'స్థలపతి,' 'తోడుస్థలపతి,' యీరెండుద్యోగస్థుల వసతులని యెఱుకపడె. పదిబారలకవతల దొడ్డకట్టడంబొకటి కంటికిఁ దోఁచె. అందు నాలుఁగు గదులుండె. వాటిలోఁ బెద్దగదినొక మేజముందఱ స్థలపతి కుర్చిపైఁగూర్చుండియుండె. అతని యెదుటనుండిన మేజమీఁద నచ్చువేసిన కాగితములు, పుస్తకములు, మశిబుడ్డి, కలములు-యువినిండియుండె. ప్రక్కనిగదిని జొడ దాని ద్వారబంధమునకు పైనుండిన గోడపై, యినుపబిళ్ళతగిలింపబడియుండె. ఆబిళ్ళమీఁద 'మొదటిరెండు తరగతుల ప్రయాణికులు కాచియుండు చోట'ని వ్రాయఁబడియుండె. ఆగదిలో రెండుపంజరములును మూఁడుకుర్చీలును షేజయొక్కటియు నమర్పబడియుండె. ప్రక్కనగదికిఁజేరినవాకిటిగోడపై, 'లోఁజొరరాదు,'' అని, దొడ్డ యక్షరములతోనుండిన పలకయొక్కటి తగిలింపబడియుండె. ఆగదిలో లెక్కపుస్తకములునునచ్చుకాగితములును విస్తరింపబడియుండె. ఎగువతట్టొక బ్రహ్మాండమైన కూటము కనంబడె. అందు మ్రానితోఁ జేసిన నాలుఁగుకాళ్ళబల్లలు నాలుగుండె. వాటిమీఁద రెండొకరు కూర్చుండియుండిరి. ఆ కూటములో నొకగోడమీఁద "మూఁడవతరగతివారు కాచియుండుస్థలము,'' అనివ్రాయఁబడియుండె. కూటమున మఱొకతట్టు, "ఫలములమ్మెడిచోటు'' అని వ్రాఁయబడి యుండిన పలక యొక్కటి కనులఁబడె. తమలపాకులు, బీడీలు, సిగరెట్లు, సోడాబుడ్డీలు, పలువిధములైన ఫలములు, వేయించిన సెనిగలు, పటాణిగింజలు, పాంచాలికలు - యీపణ్యంబు లచ్చటున విక్రయమునకై ప్రచేరింపబడియుండె. మఱొక దిక్కున దొడ్డ గవాక్షమును గవాక్షము దిగువఁ జెయిపట్టునంత రంధ్రముఁ జూచిరి. గవాక్షముపై మూఁడవ

తరగతి ప్రయాణికులు టిక్కెట్లు గొనుచోటు,'' అని, వ్రాయఁబడియుండె. ఈ కూటమున కెగువప్రక్క మూఁడు బారల దూరమునఁ బడసాల యొక్కటి యుండె. దానిద్వారబంధముపై 'స్వదేశుల భక్ష్యభోజనశాల,' యని యొక నల్లని వర్ణమిచ్చిన పలకమీఁదఁ దెల్లని వర్ణముతో వ్రాయఁబడి, యా పలక గోడకంటింపబడి యుండె, గదిలో నిరు మూఁడు మేజలును నాలుఁగు కాళ్ళబల్లలును నమర్పబడి యుండె. ఒక దిక్కున మధుర భక్ష్యములును, తీక్ష్ణపదార్థములును దట్టెలలో దొంతి పెట్టబడి యుండె. అగ్నిష్ఠంబున నొక బానలో దెల్లని నీళ్ళు కాఁగుచుండె; దానిని క్షీరమనిరి. ప్రక్కన నొక బోడుతపేలాలోఁ గషాయము కాఁగుచుండె; దానిని కాపి కషాయమనిరి. భద్రయ్యయు లతాంగియు వాటినెల్లఁ జూచిన పిదప మూఁడవ తరగతి కూటమునకు వెళ్ళి యొక మూల వైపఁబడి యుండిన బెంచిమీఁదఁ గూర్చుండిరి. రంగనాథుఁడు, చీరుశెట్టి; నాగిరెడ్డి - యీమువ్వురును ధనిష్టాపంచమిని వెంటబెట్టుకొని, భక్ష్యశాలకుఁ జని, తీపు పాకములలో దినుసుకు రెండేసి, క్రయమునకుఁ దీసి తినుచుఁ గొన్ని భక్ష్యముల ధ - పంచమి యొద్ద నిచ్చిరి. అతఁడు వాటిని దినుచు విక్రయికుఁడైన యయ్యవారితో, "స్వామీ! జాంగిరు, లడ్డు, మైసూర్ బాగ్ - యివి ఘృతముతోఁ జేయబడ్డవా? లేక, నూనెతోఁ జేయఁబడ్డవా?'' అని, యడుగ,

విక్రయికుండు, "అన్ని నేతివంటలు,'' అనెను.

''స్వామీ! ఏమినెయ్యి? మాయింట వెనుప నేతితో గాని గోఘృతముతోఁగాని భక్ష్యములం జేసిన 'గుమగుమ' యని వాసనతో నున్నవి; మీ పాకముల భుజియించిన నేతిరుచి రసనకుఁ దెలియలేదు; నాసికకు నేతి వాసన తగులలేదు.''

''తగరపెట్టియలలో వచ్చెడి నేతిని నుపయోగించెదము.''

''మైసూరుసీమలో నేదో యొకచోటను డిల్లీ కావల నొక్కచోటను గ్రొవ్వును తగరపెట్టెలలోనించి నెయ్యియని యమ్ముచున్నటుల వదంతి నా చెవులఁబడె.''

''అట్లు క్రొవ్వును నించుటను మేము చూడలేదు.''

''ఈ బూందినిగాని పకోడాలగాని చేత నలిపిన వచ్చెడి తైలమును నాలుకమీఁదఁ బెట్టిన నేతిరుచి లేకయు, ముక్కునందుఁ బెట్టిన నేతి వాసన లేకయు నొకవిధమైన యింపు కాని వాసన కొట్టుచున్నది; తగర డబ్బరలలో 'కడప' కావల కొన్నిచోట్లనుండి కుసుమనూనె మెండుగ వచ్చుచున్నదట; పెద్దనగరములలో నా నూనెతో పలాహారముల జేయు చేన్నారట; ఆ నూనె గబ్బుగొట్టుచున్నదయ.''

''మీ గ్రామమేది?''

''శ్రీమంతపల్లె.''

'' తాము పల్లెనుండి వచ్చినవారు, కాబోలు! తమ పల్లెలోఁ బరిమళమైన ఘృతము దొరకును. మావలెఁ దినుబండములను మిక్కుటముగఁ జేయువారికి నట్టి నేతిధారలు దొరకుట యరుదు. మా పిండివంటలను రైలిలాకావారిచే నియమింపబడ్డ శోధనకర్తలును విచారణకర్తలును బలుమార్లు శోధించి పోయెదరు. అట్టివారును నగరవాసులును మా భక్ష్యములను వంటకములను మెచ్చియుండెదరు.''

''శోధనకర్తలలోఁ గొందఱు తాము యథేష్టముగ భక్షించి, దాక్షిణ్యముచేత శ్లాఘనపత్రికనిచ్చి వేళ్ళవచ్చు; నగరవాసు లిట్టి భక్షణీయములఁ దిని యలవాటు; మేమును నగరమునకుఁ బోయెదము; రెండు నెలలు నగరవాసము చేసినంతట, మీచేఁ బచనము చేయఁబడ్డ భక్ష్య భోజ్యములను నిర్దోషమని తినిపోవుదుము. నేతి భక్ష్యములని పేరు గాని జిహ్వాఘ్రాణములకుఁ గించిత్తైనఁ దెలియలేదు.''

''పదార్థములతోఁ గలసిన నేతిని బిండిన నా సారసనముల కెట్లు తెలియు?''

“సరే! నా సారసనములకుఁ దెలియక మనసా తలఁచుకొనవలని నట్టున్నది.”

నవ్వుచు, “అటు గాదయ్యా! తగరడబ్బర నేతికి వాసనలేదను చున్నాను; దుర్వాసన లేకుండిన జాలుగద?”

“దుర్వాసన యననేమి? ఇంపుకాని నూనె గబ్బు కొట్టుచున్నది.”

“అలవాటు లేనందున దుర్గంధ మనియెదరు.”

“దుర్వాసన యలవాటుపడిన నదియె సువాసన.”

“తమతో నేను మాటాడలేను.”

“కాశీనీళ్ళుఁ గొంత చూతము; ఇచ్చెదరా?”

“దాని కెంత సొడ్డు చెప్పుదురో!” అనుచుఁ బానపాత్రములో గాశి నీళ్ళుఁ బోసి యిచ్చెను. ధ-పంచమి రెండు బొట్లు నోటం బోసికొని, చప్పరించి, చేవిచూచి, “ఎబ్బె! శీకాయనీళ్ళవలె నున్నదయా,” అనెను.

విక్రయికుఁడు నవ్వుచు, “ఘ్రాణతఁ గల్పింపక త్రాగరని చెప్పితిగద,” అనెను.

“మాయింటఁ గాశినీళ్ళ బాత్రలోఁ బోసి చేల్లార్చిన, శీకాయ నీళ్ళ వలె నిట్టి నురుఁగు కనఁబడదు.”

“ఎవరైన శీకాయనీళ్ళఁ గలుపుదురా?”

“కొందఱు కలుపుచున్నారని ‘గాలివార్త’ విని యుండెద. శీకాయ నీళ్ళవల్ల నంత చెడుగు లేదు; మలము ధారాళముగ బయటపడు; అయినను, శీకాయ నీళ్ళను గుసుమ నూనెయుఁ గుక్షిన బోయిన నెంత చెడుగు! ఎంతపిత్తము!”

మా భక్ష్యములను నింక మావలె నగరములలో నమ్మెడివారి భక్షణీయములను భుజియించినవారికిఁ బైత్యమా?”

(నవ్వుచు) “పైత్యముపట్టి వాటినిఁ దినుచున్నారో; లేక వాటిఁ దిని పైత్యము పట్టియుండెదరో నాకు దెలియదు.”

“తమతో వచ్చియుండు వారే దోషముఁ జెప్పక మౌనముగ నుండె దరు.”

“ఏను చెప్పుచుండుటచేత వారు తూష్ణీకులై యుండెదరు. మఱియు దుగ్గాణి యిచ్చికొన్నవాటిఁ బాఱపోయ మనసు లేక దొంగను దేలుకుట్టి నట్లేవారితో నేమియు జెప్పలేక యుండెదరు.”

“దుగ్గాణియిచ్చి కొన్నవారి కంతరుచిపని లేదు, తమవంటి పరాన్నులకు దండుగతిండితినియు నాలిక పొడుగును నోరెక్కువయు.”

“నేనా దండుగతిండి తినుచున్నాను? కొలువు గొలిచి తినుచున్నాను.”

“యజమానులువారి కిట్టిపొడుగు నాలుకయు హెచ్చునోరును లేవు.”

“కనినది కనినట్లనిన గంటుగదా? రంగనాథ! జీరు! లెండు, పదము,” అని నంతట బాలురందఱు దుకాణము విడిచి భద్రయ్యకూర్చుండి యుండిన బెంచికెడమపార్శ్వమునయుండిన బల్లమీఁదఁ గూర్చుండిరి. రంగనాథుఁడు తీపుపదార్థములలోఁ దాను మిగలబెట్టిన వాటిని లతాంగినద్దనియ్యగ, లత వాటిని నోట వేసికొని, “ఎబ్బె! ఏమి తైలపుగబ్బు కొట్టుచున్నది; వమన మునకు వచ్చునట్లున్నది,” అనుచు నోకరించుచు నోటనుండిన దాని గ్రింద నుమిసె. బాలురొకరి మొగము నొకరు జూచుకొనఁగ, ధ-పంచమి నవ్వెను.

ఎనిమిదిగంటలు కొట్టినంతట, భోజనశాలాధిపతి యుద్దఁజెని భోజన చీట్లుఁగొని, బాపనులకు ప్రత్యేకింపబడియుండు స్థలమున భద్రయ్య తన బిడ్డలతోను, రెండవగదిలో జీరుశెట్టియు, మూఁడవగదిలో నాగిరెడ్డియు ధనిష్టాపంచమియు భోజనము సేసిరి. వంటకములో లవమైన శిలాలింగములుండి యవి నోటఁ జిక్కిపండ్లు పులియగ నాలింగములను ప్రత్యేకింప లేక, నోటి యన్నమునాకు ముందఱయుమ్మిరి. రెండవసారి యన్నము వడ్డింపవచ్చి నపుడు, ధ-పంచమి, “స్వామీ! లఘుశిలాలింగములు బహ్వియుండుట చేతఁ బైయన్నములోఁ గొద్దిగవడ్డింపుడు,” అనెను. సాపడిన వెనుక, వారు మును గూర్చుండినచోటికిఁ జనుదెంచిన, యావత్తు బెంచీలమీఁద బ్రయాణి

ళులు నిండియుండిరి. దిగువ గూడాజనులు స్తోమమైయుండిరి. భద్రయ్య తన సుతతో దిగువ యొకచోటగూర్చుండె. వెంటనే రైలుబంటులు స్థలముకడవెళ్ళ దీపములను ముట్టించిరి. రైలుబండిరాబోవు హెచ్చరిక గంట నొకబంటుకొట్టినంతట గవాక్షము దగ్గఱ జనులు గుమికూడిరి. వారిలో నొకండు రంధ్రములోఁ జెయిఁజోఁచి, డబ్బువెట్టి, "అయ్యా! శశిపురము," అనెను. లోఁగలి నిలువఁ బడియుండిన రైలు గుమస్తా పైకము నెంచి చూచి దాని నొక యలమారిలో వైచి, బీరువలోఁ గట్టలుగఁ గట్టియుండిన యట్టచీట్లలో నొకటినిలాగి, యద్దాని నినుపదిమ్మెలో నొక్కిన నాదిమ్మె మాసమును దారీఖును నాచీటిన నొక్కె. ఆచీటిని రంధ్రములోఁ జెయిఁ జాఁచుకొని యుండిన వానిచేతఁబెట్టె నతండుచేతిని బయటతీసి, యాచీటిని జూడఁగ 'సాలెపల్లెనుండి శశిపురము,' అనియుఁ జీటిధరయు నచ్చువేయఁ బడియుండె. ఇట్లు ప్రయాణికుం డొక్కొక్కండు రంధ్రమున జెయిఁజాఁచి, క్రయమిచ్చి యతఁడు వెళ్ళవలసిన స్థలమునకునట్టి చీటిఁగొనుచుండె. ధ-పంచమి యొక్కొరునిఁగని, "అయ్యా, శశిపురమునకు టిక్కట్టు వెలయెంత?" అని యడుగఁ బ్రయాణికులబండికి రెండుంపాతిక రూపాయలని యతఁడు చెప్పె; ప్రక్కననుండిన వాఁడు, "రాఁబోవునది తపాలుబండి; దానికి రెండుమ్ముప్పాతికా వీసమరవీసం," అనెను.

ధ-పంచమి టిక్కట్లు ధరలోనేదో పితలాటకమున్నదని సంశయపడి, కిటికీ యొద్దనిలిచి, "అయ్యా, శశిపురమున కాఱు టిక్కట్లునిండు," అనెను.

రైలుగుమస్తా పైక మేడయని యడుగ, పదుమూఁడన్నర రూపాయ లిచ్చె.

"రాఁబోవునది తపాలుబండి; మిగత పైక మేడ?" అని, గుమస్తా యఱువగ, "అయ్యా, అర్ధరూపాయయిండు," అని, ధ-పంచమి చెప్పెను. రైలు గుమస్తా యర్ధరూపాయ రంధ్రముగుండా విసరివేసెను. దాని నెత్తికొని ధ-పంచమి నాలుఁగురూపాయ లిచ్చెను.

"ఓయి, టక్కులమారి! వీసంరూపాయ యెత్తోయ్," అని గుమస్తా యఱచినంతట, ధ-పంచమి మొలచుట్టును జేబులలోను వెతకు వానివలె నటించి, "చిల్లరలేదయ్యా! అనెను. గుమస్తా యయిదే టిక్కట్లనిచ్చి తక్కిన ప్రయాణికులయొద్దఁ గ్రయధనముఁ దీసికొని టిక్కట్ల నమ్ముచుండె. ధ-పంచమి కూఁతలు పెట్టియు నాఱవటిక్కట్టియ్యనందున, వీసంరూపాయ రంధ్రమునబెట్టె, యాఱవటిక్కట్టడిగినంతట, గుమస్తా టిక్కట్టును రంధ్రము ద్వారావిసరివేసెను. ధ-పంచమి తనకొక్కటిఁ బెట్టుకొని, భద్రయ్యచేత మూఁటినిచ్చి, నాగిరెడ్డిచేత నొకటిఁబెట్టి, జీరుచేతఁ గడపటి చీటి నిచ్చుచు,

"ఓరి, జీరు! రయిలుగుమస్తా చెడ్డపోకిరి! ఎంత సరకులఁ దీసినను మూల్యములో నీతండ్రి పైసాగూడఁ ద్రోయననుచున్నాఁడు; అలాగే టిక్కట్లమ్మెడి గుమస్తా. ఆఱుటిక్కట్లఁ గొనియుఁ బైసాగూడఁ దక్కువ తీయనన్నాఁడు. నీతండ్రి యెంతో మేలు! చెయుదురదకందయెనను నాలుకమకరందము. రయిలుగుమస్తాయొడ మంచినోటిమాటఁగూడా లేదు; ననుఁజూచి చిఱచిఱలాడుచున్నాఁడు," అనెను.

శెట్టి పిన్నవాఁడు నవ్వుచు టిక్కట్టుఁ దీసికొనెను. కొన్నినిమిషములకుఁ గూటాముయొక్క వాకిటి తలుపును నొకగుమస్తాతీసి, తలుపువద్ద నిలిచెను. జనులందఱు లోన జొనుచుండిరి. వారిచేతనుండిన టిక్కట్లను గుమస్తా శోధించి, మితముగఁ గత్తిరించి, త్రిప్పియిచ్చెను. జనులందఱు (ప్లాటుఫారం) దీర్ఘవేదికపై నటునిటుఁ దిరుగుచుండిరి. 'కణం', 'కణం' అని, గంటలు మ్రోగినంతట రైలుబండ్లు దృష్టికిఁ దోఁచె. రెండు నిమిషములలో 'భుగ్' 'భుగ్,' అని పొగయుచు రయిలు యింజను (యంత్రము) బండ్లనులాగుకొని దీర్ఘవేదిక చివరనిలిచె. 'సాలపల్లె,' 'సాలపల్లె', యని, యఱచుచు నొక భారవహుండు బండ్లు కడవఱకు వెళ్ళెను. సుమారిరువది విలువరులు పలువిధములైన ఫలములు, భక్ష్యములు, మానిబొమ్మలు మొదలగు వాటిని చేత

పెట్టెలలోఁ బెట్టుకొని, కూఁతలువెట్టియఱ్ఱచు రైలుబండ్లకుఁ బ్రక్కన వేగముగఁ బోవుచుండిరి. వారివేగమును లెక్కించిన గడియకునాలుఁగు మైళ్ళేర్పడును! అందఱు వేగముతో బండ్లనుండి దిగినవారును బండ్లలో నెక్కువారును వడిగఁ బోవుచు, దీర్ఘవేదిక క్రిక్కిఱించినందున వారొండొరులఁ ద్రోయుచును ముడుకులతోఁ ద్రోసి త్రోవచేసికొనుచును వెళ్ళుచుండిరి. ఒక బండినుండి పమంద్రుడుదిగిరి. ఆబండిలో భద్రయ్యయెక్కె; వెంటనే లతాంగియు, రంగనాథుఁడును, జీరుశెట్టియు, నాగిరెడ్డియు, ధనిష్టాపంచమియు నెక్కిరి. కదలని పాదములమీఁద స్థాపితమైన పృష్ఠముతోఁ గూడిన దీర్ఘ పీఠంబులలో నొక్కదానిపై నందఱుఁ గూర్చుండిరి. వారివెంబడె యవర్ణముంజేరిన ముగ్ధస్త్రీ యొక్కతె ద్వాదశశూర్పములను శిరముమీఁద వహించి, యొక శిశువుఁ జంకఁబెట్టుకొని లోఁజొచ్చె. పంచమకుల మహిళ యొక్కతె యీరారు సమ్మార్జనీలు గట్టిన మూటను కక్షంబున నణఁచికొని లోనవచ్చి కూరుచుండె. చర్మకారుండొకండు తనపాదుకయుగంబుల నొక దండచివర గుణముచే వ్రేలాడవేసి దండమును స్కంధముపైఁ బెట్టుకొని దగ్గఱఁ గూర్చుండె. చిబుకంబునఁ గేశవేశముతో, పరాయి, లుంగి, కిల్లు చెప్పులు,' వీటిని దొడుగుకొన్న ముండితుండొకండు హస్తంబున కంబళంబును నుపధానం బొక్కటియుఁ బట్టుకొని, యొకరినంటి యొకరు గూర్చుండి యుండిన జనపంక్తి మధ్యఁ దనగబ్బి పిఱుదులనదిమి, యిరుకెలంకుల గదలించి, చోటుఁ గలుగజేసికొని చేక్కగ గూర్చుండె. కొందఱు తంతువాయుంద్రు తంతుకట్టలను వాయదంతములను భుజముపై వహించి, బండిలోనెక్కి తమభారమును దిగువదించి కూర్చుండిరి.

రైలుయింజను కుయ్యుమని కూఁతవేయగ, రయిలెందుకు కూసెనని లతాంగియడిగె. రయిలు యింజను కదలబోవుచున్నదని ప్రయాణికులను హెచ్చరికచేయుటకు గూసెనని తండ్రి చెప్పె.

"నాయన! కొన్ని బండ్లలోమాత్రము దిగువయు పైనను శయ్యాసనము లున్నవి; ఏల?"

"మొదటి రెండుతరగతుల టిక్కట్లుగొన్న ప్రయాణికులు రాత్రి పూఁట శయనించుటకు శయ్యాసనములున్నవి."

"నాయన! అట్టి బండ్లలో దివ్యమైన జ్యోతీలును వ్యజనములును న్నవిగద? జ్యోతీ లేలాగున వెలుఁగుచున్నవి?

"అవి 'యెలెక్ట్రిక్' జ్యోతీలును వ్యజనములును."

"విద్యుచ్ఛక్తిచే దిరిగెడి వ్యజనములా? జ్యోతీలు నాలాటివా?"

"అవును."

"నాయనా! కొన్ని మొదటితరగతి బండ్లలోను గొన్ని రెండవతరగతి బండ్లలోను జ్యోతీలులేవు; ఎందుకు?

"ప్రయాణికులు నిదురవోవు సమయమున వాటిని నార్పి నిదురింతురు".

"నాయన, వాటిని నెట్లార్పుదురు?"

"బండిలో జొట్టుచుండు పలకలలో నొకదానిమీఁద రెండుగుబ్బలతుకబడియున్నవి; చూచితివా?"

"చూచినాను, నాయన,"

"ఒకటి జ్యోతికి సంబంధించినది; ఇంకొకటి వ్యజనమునకు సంబంధపడినది. గుబ్బమధ్య గుండీ యొకటియున్నది; ఆగుండీ తీఁగచే జ్యోతికి నంటింపబడియున్నది; గుండీని వ్రేలితో గ్రిందికి నదిమిన దీపము వెలుఁగు; పైకిద్రోసిన దీప మారిపోవు; వ్యజనమునకును నాలాగే".

"ఆతరగతిబండ్లలో నొక్కొక్కటిన లోగది యున్నది; ఎందుకు?"

"శంకల దీర్చుకొనుటకు; ఆగదిలో జ్యోతియు నున్నది; కాళ్ళు చేతులను శుద్ధిచేసికొన నీళ్ళగొట్టమును [illegible] నుటకు ము[illegible] మును నున్నవి".

నాయన ! ఆబండ్లలో మన మేల కూర్చుండరాదు ?''

"వాటిలో గూర్చుండువారును శయనించువారును టిక్కెట్టొక్కటికి మనమిచ్చినకాసుకు నాలుఁగంతలు రెండవతరగతివారును, యెనిమిదంతలు మొదటితరగతివారును నిచ్చియుండెదరు; అందుచేత వారి కన్నిసౌకర్యము లున్నవి.''

"నాయన ! మనకంటె నాలుఁగంతలును నెనిమిదంతలును నిచ్చినవారు ముప్పదిమంది కక్కువగనుండరు ; మూడవతరగతి ప్రయాణికులు వేవురైయుండుటచేత వారిచ్చినకాసు మొదటి రెండుతరగతులవారిచ్చినంతకుఁ బదంతలుండియు లాభముజెంద నిచ్చేటకును గష్టపడుటకును మనవంటి మూడవతరగతి ప్రయాణికులును సుఖసౌకర్యంబుల ననుభవించుటకు మొదటి రెండుతరగతుల ప్రయాణికులు కాఁబోలు ! ఈవక్రవిధిని నేమనదగు ?

"లోకమాలాగే యున్నది''. (నవ్వుచే)

"నాయన ! ఎందుచేత నింజను కదలుచున్నది''?

"నీటి యావిరిచేత''

"అదెట్లు ?''

"తవెలలో నన్నముడుకునపుడును నీరు కాఁగునపుడును పైమూఁత కేమికల్గుచున్నది? చూచియున్నావా ?''

పైమూఁత పైకిలేచిపడుచున్నది''.

"ఎందుచేతఁ బైమూఁత కంపమగుచున్నది''?

"నీటియావిరి తవెలనుండి పైకెగసిపోఁగలందుకు నడ్డపడియుండు పైమూఁతనుద్రోసి యెగసిపోవుచున్నది, నాయన.''

"ఇంజనను బాష్ప యంత్రమావిరిచేఁ గదలుచున్నది. ఇంజనులో నీళ్ళలొట్టి యొకటియున్నది! ఆనీళ్ళు 'కాఁగను కాఁగను' నీటియావిరి యొకగొట్టములోన బోవుచున్నది ; ఆగొట్టపు పైమూఁతను ముసలక

మనియెదరు. నీటి యావిరి గొట్టమువిడిచి పైకిఁ బోనీయక యడ్డపడియుండు 'ముసలక' మను పైమూఁతను గదలించుచున్నది. మన ముంజెయియు మోచెయియుఁ గీలుచేతఁ జేర్పబడియున్నవిగద ? ముంజెయి యాడిన దానితో మోచెయియు నాడును. తద్రీతిగ నొక యినుపదండపు రెండు చివరలలో నొకటి ముసలకమునకును నింకొకచివర యొక చక్రముతోను దృఢసన్నితమై యున్నవి ; కనుక, ముసలకము గదలినపుడు ముసలకముతో నంటింపబడిన దండము గంపమగుచున్నది ; దండముఁ గదలగ దండముతోఁ జేర్పబడ్డ చక్రమును గదలుచున్నది. ఇవ్విధంబున నింజను గదలుచున్నది''. లతాంగి తనచేత నొకపుస్తకము బట్టుకొని, "నాయన ! నాచెయిని దండమనుకొనెద ; నాచేత గట్టిగ బట్టియుండు పుస్తకమును జక్రమను కొనెద. నాముంజెయి యాడిన నాచేతబట్టియుండు పుస్తకము నాడుచున్నది. నా మోచెయిని ముసలక మనుకొనెద ; నా మోచెయి యాడిన మోచెయితోఁ గీలుచేత జేర్పబడ్డ నాముంజెయియు ముంజెయిన బట్టియుండు పుస్తకమును నాడుచున్నవి. (చేతిని నాడించిచూచి) తెలిసికొంటి, నాయనా,'' అనెను.

"బండిని నిలుపుటకు గొలుసును లాగుము ; అనావశ్యముగ లాగిననేఁ బదిరూపాయ లపరాధము విధింపబడును,'' అని బండిలో జొట్టునుండు పలకలలో నొకదానిమీఁద వ్రాయబడియుండె ; దానికి దిగువ జేనెడి యినుప గొలుసు కనఁబడె. వాటినిజూచి, లతాంగి,

"నాయన ! ఈగొలుసును లాగిన బండి యేలాగున గదలక నిలుచు ? బండిని నిలుపుటెందుకు ?'' అని యడిగెను.

నిరాటంకముగ బోవు చక్రముల కాటంకము గలుగజేసి యాఁక పెట్టుటకు (వాకువంబ్రేక్) 'శూన్యార్గళమ'ను సాధనమున్నది. ఆపత్కాలమున జెడియుటకు హేమ్యము గల్గినపుడు గొలుసును లాగిన జక్రముల కాటంకముగల్గు ; తోడుతో రైలుద్యోగస్థులు బండిని నిలిపి విచారించుటకు వత్తురు''.

"నాయన!! ముప్పదిరెండు ప్రయాణికు లీబండిలో నెక్కవచ్చునని బండి పలకమీఁద వ్రాయఁబడి యుండియు నేఁబదిమందికిఁ బై నెక్కి జనులు కష్టపడ నేల?"

"ఈవిషయమును రైలిలాకావారు గమనింపరు; మనవారికని బుద్ధి లేదు; ఒకఁ డెక్కినబండిలో నందఱు వెంబడి జనియెదరు"

ఇవ్విధంబున నిరువురి సంభాషణ ముగిసినతోడుతో ధ-పంచమియొక్క కువిందునిఁగని, "తాము నేఁత నేసెడివారా? ఎచ్చోటికి వెళ్ళెదరు?" అని, యడిగెను.

"జౌ; మేము సాలెవాండ్రము! వ్యాపారవిషయమై శశిపురమునకు వెళ్ళెదము"

"చుట్టుఁబట్టు సాలెవాండ్రు విశేషముగనుండెదరా? ఈస్థలమునకు సాలెపల్లెయను పేరేలకల్గె?"

"ఇచ్చోటికి నలుప్రక్కల నేడుమైళ్ళ దూరమువఱకు మావాండ్రుండెదరు; అందుచేత 'సాలపల్లె' యనిపేరు". ధ-పంచమి యొక చర్మకారుని జోచి, "తామేకులము? ఏవర్ణము జేరినవారు? ఎక్కడికి పోయెదరు?" అని, యడిగెను.

"ఏనాది యాంధ్రుఁడను; నాయన్నగారు శశిపురమున దుకాణముంచి యుండెదరు. అతనియొద్దఁ జనియెద."

"కొంచెమవతల జరిగి కూర్చుండుమయ్యా!" అని చెప్పి తానే యొక్క యడుగుజోటినంతట, "నీవిచ్చిన కాసు నేనియ్యలేదా?" అనుచు, ధ-పంచమికి దగ్గఱఁ గూర్చుండెను. ఇంకొక ప్రక్కన జీపురు కట్టలతో గూర్చుండి యుండినదానితో, "మీ వర్ణమేమి? ఏడవెళ్ళెదరు?" అని, యడుగ నామె, "ఏను ఆదిద్రావిడకుల ముంజేరినదానను; నా కొడుకు శశిపురములో కొలువునను న్నాడు; అతనియొద్దకు వెళ్ళెద," అనెను.

"ఏమి కొలువమ్మా!"

"మునిసిపలు నౌకరి; ఆరోగ్యరక్షణకై యేర్పడ్డ యంగములలో నొకదాన గొలువు కొలుచేసున్నాడు?

"ద్రావిడాంధ్రదేశమున నుండెదరా?"

"నాగరిక మెరుగు 'కానుకాను' ద్రావిడాంధ్రదేశమునను నాంధ్రులు ద్రావిడదేశమునను నుండుట యతిశయమా?"

ఇట్లనుచుండగ జీరుశెట్టి, 'చుట్టలు త్రాగకూడదు,' అని, బండిచుట్టుండు పలకలలో నొకదానిమీఁద వ్రాయఁబడియుండుటను బలముగ జదువగ నాలుగైదు ప్రయాణికులు నోట బీడీలు, సిగరెట్లు, చుట్టలు, వీటిని బెట్టుకొని పొగను ప్రక్కన గూర్చుండియుండిన ప్రయాణికుల ముఖముమీఁద 'గుప్పుగుప్పు'న నూదిరి. ధ-పంచమి వారిలో నొకమునిషితుని జోచి, "అయ్యా, సాహేబుగారు; తామొక మూలకు జరిగి చుట్టత్రాగ రాదా?" అని, యడిగెను.

సాహేబుగారు తననోటనుండిన చుట్టను బయటతీయక ధ-పంచమిని నావలఁ బొమ్మని చేయిసంజ్ఞ చేసె. గుప్పుగుప్పని వచ్చిన ధూమ్రపత్ర ధూమమును సహింపలేక సాహేబుగారి చెంతఁగూర్చుండియుండిన మూఁడు ప్రయాణికులు దమ స్థలము విడిచిలేచి కొంత యవతల జరిగి నిలువబడియుండిరి. వారిచే విడువబడ్డ స్థలమున సాహేబుగారు కంబలముఁబఱచి, యుపబర్హాము వైచి, నీలుగుచుఁదన కాళ్ళు నేతులుండిన పొడుగువఱకుఁ జెక్కగాఁ జాచుకొని పరుండి, చుట్టత్రాగుచు దిగువ నిక్షేపము చేసె. చుట్ట జీర్ణించియు ఇట్టట్టుఁగదలక యుండె. నిలబడి యుండిన వారు కొంతసేపు తాళి, "శివుడా, శివుడ!" అనుచు, దిగువ గూర్చుండబడిరి. జీరుశెట్టి తానుండినచోటికి ధ-పంచమిని సైగ చేసి పిలువగ, ధ-పంచమి తాఁగూర్చుండియుండిన స్థలమునకు రమ్మని శెట్టి పిన్నవానిబిలిచె. జీరువచ్చి, గుసగుసమాటాడుచు, "నిదురవోదునా? దొంగలు వత్తురా?" అని, యడిగెను.

"నిదురవోరాదు, నాయన; రైలుదొంగలు 'పక్కా' దొంగలని వినికిడి; ఏమరిన మనమూటలను మన దేహముపైయుండునగనట్లలను జోలుకనగ దీసికొని ప్రక్కనసుండు రైలుమార్గపు స్థలమున దిగిచేక్కగఁ బోవుదురు. వారిని గనిపట్ట సాధ్యపడదు," అని ధ-పంచమి రహస్యముగఁజెప్పె. పిన్నవాఁడు నవ్వుచే స్వస్థానమునకరిగి నిదురను భంగపఱచే నిమిత్తముఁ గనులను లుముచుఁ జిటికనస్యము ముక్కున వేసికొని తుమ్ముచేసుండె; రంగనాథుఁడు కూర్చుండినట్లే గుఱకకొనిరియు; లతాంగి తన తండ్రియూరంబుపైగరంబును గరంబుపైఁ దనశిరంబును బెట్టుకొని కూర్కెడె; అప్పుడప్పుడు తనుమించి నిదురవచ్చినపుడు శెట్టి పిన్నవాఁడు గ్రక్కున మేలుకాంచి యంగులీయకమును గర్ణవేష్టనమును నంటిచూచుకొనె; నాగిరెడ్డి నిదురమత్తుచే మూటలనుంచుటకై యేర్పడ్డ యూర్ధ్వ పీఠంబు నెక్కి యొకచేతిని దలగడగ నుంచుకొని గుఱకపెట్టె; పీఠంబునకు దిగువయుఁ బాదంబుల మధ్యయుఁ బండుకొని ధ-పంచమి గుఱుపొడిచె; భద్రయ్య కనుఱెప్పలను మూయుచుఁ దెఱచుచుఁ గూరుకుపాటుపడుచుఁ గుక్కనిదురవోయె. రాత్రియంతయు రైలుబండ్లినుపపట్టాలమీఁదఁ దీవ్రముగఁ బాఱుచు, పెక్కుస్థలములలో నిలిచి యుదయమై యేడు గంటలుకొట్టగ, మునువిడిచి వెళ్ళిన శశిపురమను నగరమునకు మరలెను. ప్రయాణికులు రమారమి వేయింటికి దిగగా, బండ్లన్నియు ఖాలియయ్యె. భద్రయ్య వగైరాలు బండివిడిచి దిగి 'తమగము'పై నిలిచియుండగ నాస్థలముఁజేరిన భారవహుండొకండు భద్రయ్యచేతనుండిన మూటను బెఱుకుకొని "పదండిబండికడ" అనెను. ధ - పంచమిచేతనుండినమంజూషంబును గర్మకరుండొక్కఁడు హఠాత్తున బట్టుకొనగ ధ-పంచమి గద్దించి పెట్టియును విడకగట్టిగఁ బట్టుకొనెను. కొన్ని భృతకులు ప్రయాణికుల మూటలను బలాత్కారముగఁ దీసికొని వెలుపటికి వెడలుచుండగ, వారివెంట మూటలసొంతగాండ్రు వెళ్ళుచుండిరి.

నిడుపు తిన్నెయొరగ నిలువంటి కళ్యముగల్గి హేషముచేయుచుఁ ద్రిపదములతో నిలిచియుండిన తురంగములకు బంధింపబడిన ద్విచక్ర రథములును జాతుష్చక్రవాజీ రథములును నిలిచియుండె; వాటిముందఱ స్వగమన రథములుండెను. 'ఎచ్చటికి వెళ్ళాలె,' యని, సారథు లడిగిరి. ధ-పంచమి లాయర్ జంబయ్యబంగళాయని చెప్పగ, లాయర్గారి బంగళా తెలియునని యొక్కొక్క సారథియుఁ జెప్పుచు, మూటలఁ జేతనుండి తీయను యత్నించె. భద్రయ్య భ్రమిసి యద్దె యెంతయనియు బంగళా యెంతదూరమున నున్నదనియు నడుగగా, యెంతిచ్చిన సమ్మతమని చెప్పి, సారథులు స్వగమన రథమునకు రెండు రూపాయలనియు నశ్వ రథంబున కొక్కరూపాయయనియుఁ జెప్పిరి. భారవహుం డొకండు రయిలు కట్టడమునకు వెలుపట జట్కాబండ్లును, యెద్దుబండ్లును, మనుష్యులచే లాగబడు రిక్షాబండ్లును నున్నట్లును నవి సామాన్యమైన యద్దెకు వచ్చుననియుఁ జెప్పగ నందఱు వెలుపటికి వెడలిరి. శెట్టి పిన్నవాఁడు వార్థుషికుఁడైన తన మేనమామ యింటికిని, నాగిరెడ్డి తన పెత్తండ్రింటికిని జనిరి. లతయు రంగనాథుఁడును భద్రయ్యయు నొక వృషభయానము నెక్కి ధ-పంచమిని వెంబడించుకొని చేనుచుండిరి.

ఆయెద్దుబండి పృథులమైన ఘంటాపథమున బథికులమధ్య బోవుచుండె. ధ-పంచమి సాంద్రమైన సౌధహర్మ్యంబులను గడువేడ్కతో వీక్షించుచుండగ, దవ్వున స్వగమన రథ మొక్కటి (మోటారు) యుచ్చండముతోఁ జలించుచు నెదుటవచ్చుచుండె. తద్రథంబును సంపూర్ణముగ దర్శించుటకుఁ గాంక్షఁ గల్గి, వృషభయానమునకు దక్షిణముగ రెండడుగు లొత్తగిల్లె. అట్టి యవసరంబున దనకు వెనుకప్రక్క శంఖధ్వని విని తిరిగి చూచునంతలో నన్యరథమొక్కటి తన తనువును దాఁకి తాఁకనట్లు, పూర్వముఖముగఁ బాఱెను. అప్పాటున దవ్వున వచ్చుచుండిన రథము ఱెప్పపాటు కాలములో సన్నివేశమై తన్ను దాఁటిపోయెను. బుద్ధి ఖమ్మరించి

నందున ధ-పంచమి కేదిక్కున బోవఁ దోపకుండగ గంటారావముతో నశ్వయానము సన్నికర్షణంబయ్యె. దాని జూచి యెదురుగ నొదుగువడిన దిక్కున జట్కాబండియు దానివెంట రిక్షా (మానవునిచే లాగబడు) బండియుఁ దారసిల్లె. ఇవ్విధంబున వివిధ విచిత్ర రథములు 'రబ్బరు' నేములతో శబ్దములేక వలపలదాపల వచ్చుచుఁ బోవుచు నుండగ సేవకుని హృది 'పటపట' యని కొట్టుకొనె. ఏదిక్కున నేలాటిరథము వచ్చునోయను భీతిచేత నలుదెసలును నిమిషనిమిషమును జూచుకొని వెళ్లుచుండె. కొంత సేపటికి బండి రాజపథమును విడిచి యన్యపథంబున దిరిగినంతట, ధ-పంచమి, తనమనంబును గొంతకుదురుపాటు చేసికొని, మిద్దెటిండ్ల విభవాతిశయములఁ జూడఁదొడంగెను.

బండి యిఱుకైన సందుబొందులలోఁ గడచి, తుదకు క్రైస్తవుల గుడి కెదుటనుండిన వీధిలో నొకమిద్దెటింటివద్ద నిలిచె. గృహద్వారముపై 'లాయర్ జంబయ్య,' అని వ్రాయబడియుండిన యొక నల్లపలక యింటి గోడమీఁద నొక చీలకుఁ దగిలింపబడియుండె. వాతాయనముల ముందఱ లామజ్జక తిరస్కరిణీలు వ్రేలాడుచుండె. వీధి వేదికమీఁదఁ గక్షివాండ్రు కూర్చుండి మాటాడుచుండిరి. భద్రయ్య బండివిడిచి దిగినంతట లాయర్గారి యింటియొద్ద నుండినవారిలో నొకఁడు భద్రయ్యకడ నరుదెంచి,

“స్వామి, దండములు; తామే గ్రామమునుండి వచ్చెదరు? జిల్లాకోర్టుపీలా? క్రిమినలపీలా? సివిలపీలా, స్వామి?” అనియడుగ, ధ-పంచమి వ్యాజ్యమేదియు లేనట్లును సొంతకార్యమై వచ్చినట్లును జెప్పె. అతండు 'చుచే' యని పెదవులతో ముచ్చుకొట్టి దండములువెట్టి మఱలెను.

కచేరిగదిలోనుండి యొకపొట్టి మనుజుండును స్థూలకలేబరుండును శిరమున శిరోరుహములు విరళమై పృష్ఠభాగమున మాత్రము గణనీయంబైన కేశములతోఁ గవాటముదాఁటి నిలువబడె. అతని వర్తుల వక్త్రంబును విపుల లలాటంబును వృత్తోదరంబును జూచి లాయరని కనుంగొని, భద్రయ్య

బద్ధాంజలిగలవాఁడై, “నమస్కారములు, స్వామీ,” అనెను. వామనుండు, “ఏనుజంబయ్యయను నామధేయుండను; తాము భద్రయ్యగారా?” అని, యడుగ, భద్రయ్య, “నన్నాలాగే పిలిచెదరు,” అనుచుఁ దనభుజముల పైకెత్తగ నాబాహుయుగంబును జంబయ్యతనచేతులఁ బట్టుకొని, “లోనవేంచేయుఁడు,” అని లోఁగలికి బిలుచుకొనివెళ్ళియొక పీటమీఁదఁ గూర్చుండ జేసె. రంగనాథుఁడు బండివిడిచి దిగివచ్చుచుండగ, “తమ పుత్రుఁడు గద” అని జంబయ్యయడుగ, “ఇతఁడు నానీమంతపుత్రుఁడు,” అనుచుండగ లతాంగిచేనుదెంచి తనతండ్రి చెంతఁగూర్చుండె. జంబయ్యలతాంగి చెక్కులనుస్పర్శించుచు, “ఈకుఱ్ఱది తమకూతుఁరా?” అని యడిగెను.

“ఔ; రంగనాథునితో జదువుకొనవచ్చె,” అని తండ్రిచెప్పగ, జంబయ్య లత చుబుకంబుఁ బట్టుకొని, “లోగలికి బొమ్మ; నీవలె నాకు చాపంచే కూతుండ్రుండెదరు,” అని నంతట లతాంగియింటిలోగలికిఁ జనియె. ఉభయులు కుశల ప్రశ్నలడుగుచుండగ, లతాంగి తనకు వదినెగారు కాఁబోవు దానియొద్దజని, 'చంపకవల్లీ,' యనిపిలిచి, మీరు నాకు వదినెగద?,” అని, నవ్వెను. చంపకవల్లి సిగ్గువడి తలనువంచుకొని తన కరముతో లతాంగి కరముంబట్టి దొడ్డికిఁ దోడ్కొనిపోయి ముఖముఁగడుగుకొన వెచ్చనీళ్ళిచ్చె. లతాంగి దంతకరచరణంబులఁ బరిశుభ్రముచేసికొనిన పిదప, చంపకవల్లి దానిని వంటింటికిఁదోతెచ్చి రెండురవదోసలఁ దినిపించి, లోటాలోఁ గాపి నీళ్ళుఁబోసి త్రాగనిచ్చె. అటువెనుక, “ఓసి, లత! నీతోవచ్చినవారికిఁ గాపిదోసల నిచ్చిరమ్మ,” అని, చంపక చెప్పగ, లతాంగి నవ్వుచు, “నీయజమానులు వారికిచ్చి రమ్మనెదవా?” అని, యడిగెను.

“మీయన్నగారికి,” అని, చంపక చెప్పుచుండగ, దానితోఁ బుట్టులు నలువురునువచ్చి లతాంగిఁజుట్టుకొని, యెంతవఱకుఁ జదువుకొని యున్నదని యడిగిరి. “పైసంవత్సరము సర్వకలాశాల ప్రవేశపరీక్షకుఁ బోవలసినదానను,” అని, లతాంగిచెప్పె. చంపకయప్పుడందఱుఁ దమగడ్డంబులఁబట్టుకొని యంత

వఱకుఁ జదువుకొనె నాయనుచుండగ, "నీవు స్త్రీకులమునకు రత్నభూషణ మగుతను!" అని, యొకతె యాశీర్వదించె. తోడుతో జంబయ్యగారి మొదటి కూఁతురు వెండికూజాలోఁ గాపినించి, రెండు పింగాణితట్టలలో దోసలఁబెట్టి, భద్రయ్యగారి యెదుటఁబెట్టి చనియె.

"తామును దమకుమారుండును దంతశుద్ధిచేసికొని పరగడుపుతో నుండక ఫలహారముచేసిన మంచిది," అని జంబయ్య చెప్పినంతటఁ బితాసుతులు తోఁటకువెళ్ళి, క్రమ్మఱి, దోసలఁబుచ్చుకొని, కాపి త్రాగిరి.

"మాకు బసయెచ్చోట?" అని, భద్రయ్యయడుగ",

"ఎదుటిల్లు మేము పూర్వముండిన యిల్లు; దానిని మొన్నటిదినమున దమకొఱకు ఖాళీచేయించితి," అని లాయర్గారు చెప్పిరి.

"వంటకు మనయిండ్లవారిలో నొకముదుసలి చిక్కినబాగు."

"ప్రతిదినమును మనయింటి కొకతిరిపకత్తె వచ్చెడిని; దానిని వంటలక్కగ నేర్పఱచెద."

"మంచిది."

"నాయింటఁ దామును దమబిడ్డలును రెండుదినములుండి తమకు గానేర్పడ్డ బసకువెళ్ళుడు."

"మంచిది, సంతోషము! తమమాట కడ్డము గలదా? తమప్రాయింటి తలుపుతీసియుండిన జూచివచ్చెద."

"చూచిరండు! మీరుతిరిగి వచ్చునంతలో నాకై కాచియుండు కక్షి వాండ్రతోఁ బలుకరించి, వారినిఁగ చేరికిఁబంపి, యేనుభోజనమునకు సిద్ధమైయుండెద," అనుచు, "ఎవరక్కడ? పీపాయీ?" అని, పిలిచినంతట, కంధరము లేక శిరకళేబరములు మాత్రముగల్గి, వాతదేహుండై యరపదిమణుగులు భారముఁగల యొక మొద్దుమనిషివచ్చి, "అయ్య, చిత్తం! ఇదిగో వచ్చితి," అని, నిలఁబడె. జంబయ్య యాగున్న యేనుఁగుఁ జూచి, "ఓరి, పీపాయీ! ఎదిరింటి తాళముతీసి (భద్రయ్యఁజూపుచు) యతనిదోడ్కొనిపోయి యిలుకడవఱకు

జూపించి, 'బీగముచెవిని నతనివద్ద యిచ్చిరమ్ము," అని, యాజ్ఞాపింపగ, పీపాయి, "చిత్తం ! బుద్ధి!" అనుచు, భద్రయ్యగారిఁజూచి తనరెండుచేతులఁ గొంతశ్రమతోఁ బైకెత్తిజేంటించి, "దండములుస్వామీ ! రెండు!" అనెను. తోడుతో భద్రయ్యలేచి, యెదుటింటికి వెళ్ళుచుండగ లతయు రంగనాథుఁడును వారివెంట సేవకుండును జనిరి.

"నాయనా! వీధితట్టు కుడిప్రక్కన నుండుగదిలో నేను చదువుకొందు; లతకూటాములోని యఱలోఁ జదువుకొననిండు."

"నాయనా ఈ యింటనఱలకు దక్కువలేదు; ఇలుకడవెళ్ళ మనస్వాధీనమే ! నాయన్నగారేగది బెట్టుకొన్నను సమ్మతము; నాకు బూజటిల్లు మాత్రము ప్రత్యేకముగ నుండవలెను."

"ఇంతవిశాలమైనయింట రెండు కాపురములుండఁదగు; అయినను, 'కొల్లకుఁ బోయిన బాలివారు కారాదు,' అన్నట్లు, రెండుకాపురముల నుంపను," అని, తండ్రిచెప్పె.

"నాయన! తోఁటలో బావియున్నది; ముంగిటనీళ్ళ గొట్టమున్నది; రంగనాథన్న! తామువెళ్ళిచూచిరండు."

"అంతస్తులు లేక యుండినాయన్ని విషయములలోఁ జాలసుకములున్నవి," అనుచు, భద్రయ్య ధ-పంచముని బిలిచి, యతనియొద్ద బీగముచెవిని నొసఁగి, పాతికాపరకసూపాయ నతని చేతఁబెట్టి, పూఁటకూళ్ళసత్రంబున గుడిచి, సత్వరముగ మరలు నట్లాజ్ఞాపించె.

తానభోనములైన తిరువాత, జంబయ్యవ్యాజ్యములఁ బరిశీలనముచేయు న్యాయస్థలమునకు మోటారురథమున బనివినియె. మధ్యాహ్నము సుమా రొకటిన్నరగంటలకు భద్రయ్యలతా రంగనాథులఁ దోడ్కొనివెళ్ళి, లతాంగిని స్త్రీలపాఠశాలయందును, రంగనాథుని బురుషులపాఠశాలయందును జేర్చి, సేవకుని, స్త్రీలపాఠశాలకడనునిలిపి, బడివిడిచినంతట నిరువురిని వెంటఁ బెట్టుకొని రమ్మని యాజ్ఞాపించి, మఱలె. రెండుగంటల యవకాశముండినం

దున, ధ-పంచమి నాలుఁగు వీధులకుఁజేని, చూడఁదగిన రాజాంగకచ్చేరీలును న్యాయవిచారణ స్థలములును విపణివీధులనుజూచి పాఠశాలకుఁ గ్రమ్మఱి, బడివిడిచిన తోడుతో లతారంగనాథులను లాయర్గారిబంళాకుఁ దోడ్కొని వచ్చె.

దీపములు ముట్టించువేళకు జంబయ్యయువచ్చి చేరినంతట, గున్నయ్యే నుఁగు నాలుఁగు కుర్చీలను గృహప్రతీహారము ముందఱవైచె. వాటిలో దీర్ఘబాహువులతోఁ గూడిన యొక కూర్చిమీఁద వకీలుగారు కూర్చుండి, తనపాదములను గూర్చి భుజముల మీఁదఁ జాఁచుకొని యుండఁగాఁ గరచరణ యుగంబుల నిరువురు కింకరులు సంవాహనము చేసిరి. పీపాయి యొక తాల వృంతముఁ జేతఁ బట్టుకొని, విసరుచుండె. దొడ్డవారివలెఁ గనఁబడిన యిరువురు వకీలుగారి కెదుటఁ గూర్చుండి, మఱునాఁడు జరుగవలసిన వ్యవహార విషయములఁ గూర్చి మాటాడుచుండిరి. భద్రయ్య, జంబయ్యగారి ప్రక్కన నొక కుర్చిమీఁదఁ గూర్చుండె. గడియ సేపటికి దొడ్డవారు సెలవుపుచ్చుకొని చనిరి. జంబయ్య తనచేతి గడియారపు బీగపు గుబ్బఁ ద్రిప్పుచు, "భద్రయ్యగారు! తమ గోత్రం బేమి?" అని, యడిగె. "శ్రీవత్స గోత్రము."

"సంతోషము; మాయది భారద్వాజ గోత్రము. లతమ్మకు వరుండు కుదిరెనా? లేదా? రంగనాథుని పెండ్లి యెప్పుడు జరుపవచ్చు? జాతకభావములఁ జూడఁ గోరికయుండిన నిచ్చట వ్యాపకుండైన జ్యోతిషికుండున్నాఁడు. అతనిని రప్పించెద."

"జ్యోస్యులక్కఱలేదు; పది పొంతనములలో నాలుఁగు పొంతనములుత్కృష్టముగనున్నవి; రెండుమధ్యమమై తక్కినవి పర్యాయముగ నున్నవి. పొంతనముల గుఱించి చింతలేదు".

లతకు వరుండు కుదిరిన వెంటనే, జాబు వ్రాసెద, ఆటు వెనుక నాకుమారుని వివాహముహూర్త దినమును నిశ్చయించుకొనుదము".

తమకైన దమభార్యకైన నభ్యంతరముండు నేని, తెలియఁ జెప్పుడు."

"మాకేలాటి యభ్యంతరమును లేదు."

"తమతల్లిగారితో నాలోచించితిరా?"

"తమకుటుంబముతో సంబంధము చేసికొనుటలో మాకెల్లరకు సమ్మతము."

నవ్వుచు, "తామొక్కవారమువఱకు మాయింటనుండి యటుతరువాత వెళ్ళవలెను; ముందు పోనియ్యను."

"లతకు వరుని వెతకుటకొఱకు త్వరలోఁ బోవలసినవాఁడను. వరుండీవరకుఁ గుదిరియుండిన దమయింట రెండువారములుండ మనినా నుండి పోవుదు."

"ముహూర్తదినములు కొద్దిగనుండుటచేత, తాము త్వరపడుండు."

"రేపటికే మాగ్రామమునకు మఱల నిశ్చయించియుండెద; రెండు వారములలోఁ దమకు జాబందనిచ్చెద."

"అట్లు చేసిన దమకు కోటినమస్కారములు."

"నేటిరాత్రికే తొమ్మిదిన్నర గంటలకు మాబసకుఁ గాపురము పోవుటకు మంచివేళఁజూచియుండెద."

"భోజనానంతరము వెళ్ళుఁడు."

"తమయింటి కద్దెయెంత?"

"ముందుండినవారు నెలకుపదునేను రూపాయలిచ్చుచుండిరి. తాము (నవ్వుచు) విద్యాంసులు గాఁబోవుటచేత నీరైదు రూపాయలిచ్చిన జాలు."

"తమకు పదివేల నమస్కారములు."

"భద్రయ్యగారు! తమకు భూములెంతమాత్రమున్నవి? నాకు నిర్నిమిత్తమైన విషయము గూర్చియడిగెదనని కోపము చేయకుఁడు."

"క్రోధమేల? తాముతమపుత్రిక నిచ్చుటంబట్టి నాయాస్తిపాస్తుల రమారమిగఁ దెలిసికొనవలసినవారుగద! నాకు నలువదియేకరాల మడియుఁ

నిఖుషావంచ యేకరాల టెంకాయతోఁటయు మామిడివనమును, ముప్పది యేకరాల చేలును నున్నవి. అన్నిటికి సంవత్సర మొక్కటికి నాలుఁగువందలయేఁబది రూపాయలుశిస్తు సర్కారుకుఁ జెల్లించెద. రెండు దొడ్డమిద్దెటిండ్లున్నవి. ఇవియన్నియు నాపిత్రార్జితము. నాకొక్క కొమరుండును నొక్క కూఁతురును. తమయైశ్వర్యముగురించి పరులుచెప్పఁగవినియుండెద. తమకభ్యంతరము లేనిచోఁ దమసంపదలఁ దాముచెప్పిన నాలించి యానందించుటకు సిద్ధముగ నున్నవాఁడను."

"భద్రయ్యగారు! నేనొక గొప్పవకీలుగ నుండినా దమకుఁగల భూతిలో నర్థమైననులేదు. ప్రతివత్సరమును నాలుఁగైదువందల రూపాయ వెచ్చించి చేట్టపుస్తకములఁ గొనవలసియున్నది. గుమస్తా, నౌకర్లు, గుఱ్ఱపు బండి, మోటారురథము, మంచియుడుపులు, చేలసంఘములఁ జేరి యుండుట, యిటువంటి పటాటోపములు లేక వకీలుపేరు ప్రకాశమునకురాదు. వకీలుకు లోకులందఱు గావలసినవారు. వకీలుద్యోగముఁ జేయఁగోరువారికేలాటి శాస్త్రజ్ఞానముఁ బనికి రావనదరముకాదు. అన్నిపుస్తకములఁ దీసి చేదువుకొనవలసినవారై యుండుటచేత, నెలనెలకు వ్యయమెక్కువగ నుండుటతో నాకుటుంబమును గొప్పదిగ నున్నది. నాకు కూఁతుండ్రైదుగురు. నా జ్యేష్ఠపుత్రికమగండు నాగృహాధికారి. అతఁడు నాయింటనుండి గృహకృత్యంబులఁ జూచుకొనుచున్నాఁడు. రెండవ జామాత యింటనేయున్నాఁడు. వాని కుద్యోగమేదియుఁ జాలకాలమువఱకుఁజిక్కక, రెండు నెలల నాటినుండి నెలకు నలువదియేను రూపాయల జీతమునకు వర్తకుల సాంఘికులయొద్ద నుత్తరప్రత్యుత్తరలేఖరిగ నున్నాఁడు. తృతీయజామాతకుఁ గొద్దిగభూస్థితి యున్నది. అందుచేత నతనికిజీవనము. నాల్గవయల్లుండిచ్చోటఁ జదువుకొనుచున్నాఁడు. నాకడపటిబిడ్డను దమసుపుత్రునికి నియ్యనుద్దేశించి యున్నాఁడను. నాకుటుంబము గొప్పదైయుండుటచేత నెంతసంపాదించినా జాలచాలకయున్నయది నాకడపటి బిడ్డయందు నాకును నాభార్యకును జాల

వాంఛ. దానిని నెమ్మదిఁగలచోట నియ్యవలెనని మాయభిప్రాయము. దైవానుగ్రహ మెటులో!"

"తాము వచించినమాటలను విని సంతసము గాంచితి. కృపణులు కఠినచిత్తము గలవారై, సదా ధనమును గూడబెట్టుటయందే చింతగల్గి, యాత్మరక్షణయు నాత్మసౌకర్యములంగూడా సడ్డచేయక, 'బంధుజనుల కాశ్రయంబొసంగుట, పరులకు సహాయ్యముఁజేయుట,' యిత్యాదిసుగుణగణంబులు లేకయుందురు. వారికిఁ గుటుంబాభివృద్ధియందు మనోరథంబుండదు. తమవంటి హృదయాళులకును గుటుంబవ్యాపృతులకును నేవేటఁ గుటుంబాభివృద్ధియు మనస్సంతుష్టియుఁగల్గు. కనుక, తమకు సంపాదనలోఁ దక్కువ లేకుండుటతోఁ గుటుంబ వృద్ధియందుఁ దక్కువ యుండదు. 'చల్లడిబావులలో నే యూటవచ్చు' నన్నట్లు, తాముతమను నమ్మియుండు వారికిని దక్కినవారికిని ద్రవ్యమిచ్చి సాహాయ్యము 'జేయను చేయను', తమ చేతికి దుగ్గాణి వచ్చుచుండు".

ఈయవసరంబున బరిచారకుఁడు వచ్చి, "ఎనిమిదిగంటలు కొట్టె; విస్తళ్ళ వేసివచ్చితి; భోజనమునకు దయచేయుఁడు," అనినంతట నందఱు లేచి సంధ్యాదికాల్యంబుల సలిపి బోనము సేసిరి. లతాంగి మగవారిప్రక్కన గూర్చుండి భుజియించె.

తమ్ములముగ్రిహించుచుండఁగఁ దొమ్మిది గంటలుకొట్టె. భద్రయ్య సెలవుపుచ్చుకొని, లతారంగనాథులఁ బిలుచుకొని, యెదిరింటికిఁజని, కాంతకాపికాఁచితాగి, పాన్పులఁ బఱచిపరుండిరి. బల్లుపఁ దెల్లవాఱఁగ ముదుసలి వచ్చి వంటచేయఁదొడఁగె. ఆమెకు భోజనముగాక నెలకు పదిరూపాయలు జీతమ్మని యేర్పాటు చేయఁబడెను.

రెండవదినమురాత్రి యేడుగంటలకు భద్రయ్య జంబయ్యగారియొద్ద సెలవు పుచ్చుకొనుచు,

"నాబిడ్డలను దమబిడ్డలవలె విచారించే భారము దమయది; సెలవిచ్చిన వెళ్ళివచ్చెద," అని చెప్పగ,

"మంచిది, వెళ్ళిరండు; త్వరలో జాబు వ్రాయుఁడు; బిడ్డల విషయమును గూర్చి చింతపడఁ బనిలేదు; నేనకచేరికి వెళ్ళియుండువేళలో వారుబడిలోనుందురు; తక్కినవేళలో నావీక్షణమున నుందురు; మంచిది, నమస్కారములు," అని లాయర్గారు వచించిరి.

తండ్రి తనయునికి బుద్ధిమతులఁజెప్పి, తనయకు ముద్దువెట్టి, పయనమగు సమయంబున,

"నాయన! వెళ్ళివచ్చెదరా? నాతల్లిగారికి నానమస్కారముల జెప్పి, నేనచ్చోటనే నుండునట్లు తలఁచి నెమ్మదిగ నుండుమని చెపుడు. రంగనాథన్నతో నను విడిచి బయట పోవలదని చెప్పిపొండు, తాము సమయపడినపుడెల్ల వచ్చిపొండు," అని, లతాంగి చెప్పెను.

"మఱల మీరెపుడు శ్రీమంతపల్లెకు రాఁబోయెదరు?"

"నాయనా! నవరాత్రి పండుగకు వీల్పడినవచ్చెదము; మార్గశిరమాసాంతమున క్రైస్తవుల పండుగకు మాకు సెలవుదినములు వచ్చుటంజేసి, మేమువెళ్ళి మళ్ళుటకు వీల్పడు," అని, లతాంగి చెప్పెను.

"ధ-పంచమిని నెపుడు పనిపెదరు!"

"ఒక్కవారములోఁ బంపెదము, నాయన!"

"ఓరి, నాయన! నీచెల్లియను నొంటిగవిడిచి బయట పోకుము."

"నా చెల్లెతోఁ జెప్పిపొండు."

"ముతాల్! ఏమని నీచెల్లెతోఁ జెప్పుమనెదవు?"

"సరే! తాము వెళ్ళిరండు."

"ఇదిగో! నమస్కరించెద, నాయన!" అనుచు, లతాంగి చేగిళ్ళి నిలఁబడె. తండ్రి బిడ్డలను వదలిపోను మనంబులేక కొంతసే పూరక నిలిచియుండి, కూఁతురిచేతులఁ దనకనులమీఁదఁ బెట్టుకొని, దాని గడ్డము బట్టు

కొని, "మీరిరువురు మతితోను వివేకముతోను నుండెదరా? నేనువెళ్ళి వచ్చెద," అనిచెప్పి, వీధిముందఱ నిలిచియుండిన జంబయ్యగారి మోటారు రథమెక్కి, సాలెపల్లెకు టిక్కట్టు గొని, రైలెక్కి, మఱుసటిదిన ముదయం బేడుగంటలకు సాలెపల్లెలోదిగి, బారెఁడు ప్రొద్దుండగ శ్రీమంతపల్లెఁ జేరెను.

10-వ అధ్యాయము.

బిడ్డలనుగురించి భార్యాభర్తల భాషణము.

"బిడ్డలు సుఖముగ నుండెదరా? వారిని బాఠశాలలోఁ జేర్చితిరా? బువ్వకెచ్చోట నేర్పాటు చేసివచ్చితిరి? వారికి బసయేడ?" అని, సుబ్బమ్మయడిగెను.

ఇరువురుఁ బాఠశాలలఁ జేరిరి; లత స్త్రీలుమాత్రము జదువు పాఠశాలఁ జేరె."

"అబ్బ! ఈమాటను విని నాకొఱఁతతీరినది. స్త్రీపురుషులతోఁ జదువుకొను చున్నదనుమాట యింకలేదు గద?"

"జంబయ్య వాసముచేయు బంగళా కెదుటిల్లు జంబయ్య పూర్వముండిన యిల్లట. నెలకు పదిరూపాయ లద్దెయనిమాటాడి, యచ్చోట మనబిడ్డలను విడిచివచ్చితి. వంటకొఱకు ముదుసలిదొరకె. ఇల్లు విశాలమైయున్నది. ముంగిట నీళ్ళ గొట్టమున్నది."

"బిడ్డలులేక తామును లేక యిల్లు 'బీసు' మనియుండె, నాలుఁగు దినములు నాలుఁగేండ్ల వనవాసమువలెఁ దోఁచె. బిడ్డలు లేక యీయింటనే నెట్లుందు?

"లత తనతల్లిగారికి దన నమస్కారములఁ జెప్పి, తానచ్చోటనే నుండునట్లు తలఁచి, నెమ్మదిగ నుండుమని చెప్పిపంపె."

నవ్వుచు! "లతముచ్చేటల ముద్దుకుఁ దక్కువలేదు, జాబు వ్రాయుమని చెప్పివచ్చితిరా? వారికి జాబువ్రాయవలెనన్న వైవిలాసమేమి?"

"మాలపేట, చేఁపలవీధి, కవాట సంఖ్య ముప్పదిమూఁడు."

"అయ్యో దైవమ! ఇదేమికర్మము! మాలపేటయట! చేఁపలవీధియట! వారిని మాలవారితోను జెంబడివారితోను జేర్చుటకా యింతప్రయాసపడి యింత ధనవ్యయము చేసికొని వెళ్ళితిరి? బ్రాహ్మణులమధ్యఁ బెట్టరాదా? ఈ విధికర్మములకే మందునే దైవమా? మనమిరువుర మిప్పుడే వెళ్ళి వారిని బిలుచుకొనివచ్చెదము; ననువలదన్న దామైన నిప్పుడే వెళ్ళి వేఱు చోటఁ బెట్టిరండు."

నగరములో బ్రాహ్మణ యగ్రహారమని ప్రత్యేకించి యుండుట దుర్లభము." (నవ్వుచు)

"అగ్రహారము లేకుండినా, మాలపేటలోఁ జేపలమ్మెడివారి మధ్య నీచుగబ్బు నెట్లుసహించుకొని యుందురు? తాము నామాటలనువిని నవ్వుచున్నారు; నాకడుపులో నగ్గి ముట్టించినట్లున్నది."

మఱింత నవ్వుచు, "అందుకుఁగాదే! నీ వెందుకు తొందరపడుచున్నావు? ఆ వీధిలోఁ జెంబడి వారులేరు. వీధికొనలోఁ గ్రైస్తవుల గుడి యున్నది; ఆ చిన్నగుడిని నాంగ్లేయభాషలో 'చేపల్' అనుదురు; ఆంగ్లేయపదమును దెనుఁగున భాషాంతరముచేయక, యింగ్లీషుపదమునెత్తి తెనుఁగున వ్రాసియుండెదరు." "ఆవీధిలోఁ జేపలమ్మెదరా? లేదా?"

"లేదు."

"మాలపేటయని పేరేల?"

నవ్వుచు, "ఆ నామము నాలాగే. 'మాలక్' అను పేరుఁగల దొర యొకానొక కాలమున రాజాంగములోఁ గొలువుకొలుచేయుచుండెనట. ఇట్టి బీటలుగనుండినచోట జనులు గృహనిర్మాణము చేసికొనుటకు ననుమతి నిచ్చిరట. ఆ స్థలమునకు దొరవారి 'పేరు బెట్టినారదున గొంతకాలమునకు

మాలక్ అనుపదము వికృతిజెంది, 'మాల'యని వాడబడుచున్నది. ఆ పేటలో దొడ్డవారును గులీనులును వాసము చేసెదరు. కంటికిఁ దోఁచినంతదూరము పంచమ వర్ణముం జేరినవాఁ డొక్కండైన గృహనిర్మాణము చేసికొని యుండలేదు."

"దివ్యనామంబులు వికారరూపములఁ బొందిపరగుట పేటవాసుల కపకీర్తిగద!"

"'చేపల్' యనుపద మాంగ్లేయ పదమైన దేవాలయమను దివ్యార్థము నిచ్చుచున్నది; ఆంధ్రపదమైన మత్స్యమని యర్థమగుచున్నది. భాషాంతరముచేయని దోషము నగరాధికారులఁజెందిన యది. దేవాలయమను దివ్యనామము నపవిత్రముగ వ్రాసినవారు దురిత ప్రాప్తులగుదురు."

"వకీలు మొదలగు దొడ్డవారచ్చట నుండుటచేత వారి యునికిపట్టు కట్టి వికారనామంబులుండుట వారికిఁ దోఁపకపోయెనా? ధర్మాత్ముఁడైన దొరవారి నామముఁ జెడఁగొట్టుటకా 'మాలపేట'యని వాడుకొనియెదరు! ఎంత కృతఘ్నత! ఇట్టి విపరీతార్థముల నిచ్చెడి పొరపాటులను దిద్దించుట నగరవాసులకు శ్రేయఃకరము గాదా?"

"ఏమే! 'మల్లెను ఉల్లనిన మల్లెవాసన లేకపోవునా? తద్రీతిగ దేవాలయమున కెట్టి యాహ్వాయము నిచ్చినను దేవాలయము మహిమబోదు."

"సుకృతనామములకు దురాహ్వాయంబుల నిచ్చుట నగరవాసులకును నగరాధికారులకును నెంతమాత్రము దగదు?"

"మరల నేను బిడ్డలయొద్దఁ జేనునపుడు లాయర్గారితోఁ బ్రస్తావము చేసెద. లతకు వరుని విషయమై పెక్కుచోట్లకు జాబువ్రాసి పంపి, శశిపురమునకు వెళ్ళితి. ఒక్కజాబుకైన జవాబువచ్చెనా?"

"లేదు; మన చిన్నదాని పెండ్లినగురించి వకీలుగారేమి చెప్పిరి?"

"త్వరపడవలెనని చెప్పిరి. ఒక్క పత్రములో జాబు వ్రాయునట్లు చెప్పి వచ్చితి.

"రెండువారములలో పెండ్లి కుదురునని తమకు దృఢ నమ్మకము గలదా? వరుని వెతక నెపుడు పయనమయ్యెదరు? సరియైన వరుండు చిక్కకున్న దుదకొక గోఁచిబాపనునకిచ్చి బొట్టుకట్టకుండిన నామనము నెమ్మది పడదు."

"ఒక్క వారములో ధ-పంచమి తిరిగివచ్చు. వాఁడు వచ్చిన మూఁడవ, లేక, నాల్గవ దినము నేను గ్రామములకు వెళ్ళి, యేవాఁడైన నొకయొంటిజెందెగాని బిలుచుకొనివచ్చెద."

"అట్లుచేయుట నాకు సమ్మతము. ఉద్యోగ సద్యోగములఁ జేయకున్నను మనయింటఁ గుడిచికట్టి యుండఁగలఁడు. తాము మును జెప్పినట్లు లతయు మనకొక మగబిడ్డ యనఁకొనుదము. లతకు పెండ్లియైనపిదప మన చిన్నవాని పెండ్లిని నిశ్చయింపవలెనని నా కోరిక; భగవంతుని యాజ్ఞ యెట్టులో, తెలియదు."

"జంబయ్య గొప్ప ధనవంతుఁడనుకొంటిమిగద? అపరిమితమైన ద్రవ్యమార్జించియు గొప్పకుటుంబిగ నుండుటంజేసి భూస్థితి కొద్దిగ నున్నదట. రొక్కము దక్కువగానే యున్నదట. నాలుఁగు జామాతలలో మూవురు తనయింట నుండెదరట. అన్ని యల్లుండ్రి నింటఁబెట్టుకొని యేలాగున నిర్వహించు? ధ-పంచమి చెప్పిన లోకోక్తి జంబయ్యగారిచే సిద్ధాంతమగుచున్నది. ద్రవిణమున జంబయ్యకు మించిన వారెవరైన మన రంగానాధునికిఁ బిల్ల నిచ్చెదరన్న నంగీకరింపవచ్చునని నాయభిప్రాయము. కనుక, రంగనాధుని వివాహమునకు త్వరలేదు.

"వకీలుగారితోఁ దామేమి చెప్పివచ్చితిరి?"

"పెండ్లి చేసికొనుట కభ్యంతరము లేదన్నాను."

"ముందుజాబునగూడా యాలాగే వ్రాసి, సముఖమున సమ్మతమని చెప్పి వచ్చినందున మనమాడి తప్పరాదు. ఆ బ్రాహ్మణుఁడు నిక్కపటివలెఁ దెలియవచ్చుచున్నది; అతనివలె నందఱుఁ దమ వృత్తాంతములను బుట్టు

పూర్వోత్తరములను గుట్టువిడిచి చెప్పరు. మనపిల్లను నిచ్చునపుడు తండ్రికొక్క కుమారుఁడై యుండువానిఁ గనిపట్టి యిచ్చిన మేలు; పిల్లను దీసికొనునపుడు పెద్ద కుటుంబములోని పిల్లను బరిగ్రహింపవలెను."

"మంచిది! నీ ప్రియానుసారము వర్తించుకొనియెద."

11–వ అధ్యాయము.

లతా చంపకల సంవాదము: శశిపురములోని విశేషముల దర్శించియు వీరునిదర్శించియుఁ దిరుగుట.

చంపకవల్లి ప్రతివాసరము నపరాహ్ణంబున వెండిగిండిబిందుగఁ గావియుఁదట్టలలో రవదోసెలు మొదలగు ఫలహారములఁ దెచ్చి లతాంగియొద్ద నిచ్చు. వాటిని లతాంగియుఁ దానియన్నయు భుజించినపిదప, యిరువు రొక గడియవరకు మాటాడుచుందురు. ఒక్క భానువారమునాఁడు వారిరువురును సంభాషించుచు, "నీ వెందాక చదువుకొంటివి?" అన, లతాంగి యడుగ "బాలికాపాఠశాలలో నైదవ తరగతివరకుఁ జదువుకొంటి, 'అని' చంపక చెప్పె.

"అందుమీఁదఁ జదువును జాలించుకో నేల?"

"నాకు జదువఁ బ్రియముండియు నాతల్లిదండ్రులు నను బడినుండి నిలిపివేసిరి."

"నీతండ్రిగారు విద్యయొక్క ఫలమును మహిమయు నెఱింగినవారయ్యు నినుఁ జదువునుండి నిలిపిన విషయము జ్ఞానవంతు లొప్పఁదగినది కాదు."

"ఏనుపదిదానను; నాయప్ప యమ్మలకు లోబడ్డదానను; చదువుకొన నాకు మనంబున్నను నేనేమి చేయఁగలను?"

"పైఁజదువు నెందుకొఱకు నిలిపిరి?"

"నాకు వివాహముఁ జేయఁగోరి."

"ఇంత పసితనంబున వివాహంబేల?"

"ఏను కోరలేదు; నా తల్లిదండ్రులమాట కడ్డము చెప్పలేక యూరకుండెద."

"బాల్యవివాహమువలని యోగుబాగుల వివేచింప యోగ్యతఁగలవారు నిటుల నడుచుకొన్న విద్యావిహీను లెట్లు నడుచుకొందురు?"

"నా తండ్రిగారు విద్య పురుషులకు మాత్ర మావశ్యకమని చెప్పెదరు; నాయభిప్రాయము నాలాగే."

"స్త్రీజన్మమెత్తినవారికిఁ బెండ్లియొక్కటే యావశ్యకమా? విద్యపనిలేదా? శాస్త్రజ్ఞానము వలదా?"

స్త్రీలు చదివి కలెక్టరుద్యోగమునకుఁ బోదురా? పోలీసుద్యోగము జేతురా? వకీలుద్యోగము జేయుదురా?"

"లోకమున బోలీసుద్యోగము దప్ప తక్కిన యుద్యోగములు లేవ? వాటిలో స్త్రీల కర్హమైనవి లేవ? శాస్త్రజ్ఞానము స్త్రీలకు నిషేధమా? అమెరికా సీమలోను నింకఁ గొన్ని సీమలలోను స్త్రీలు కీర్తితో వకీలుద్యోగము చేయుచుండలేదా?

"నిషేధమని చెప్పలేను! నిష్ఫలమనియుఁ బనికిరావనియుఁ జెప్పుచున్నాను."

"స్త్రీల కుచితమును అగత్యమునునైన శాస్త్రజ్ఞానముల నన్నిటిని నేను గ్రంథముల మూలముగాని, శాస్త్రజ్ఞుల మూలముగాని తెలిసికొన్న దానను గాను; అయినను, వివరించి చెప్పకపోయినా నాకుఁ దెలిసినంత దృష్టాంతములోఁ జెప్పెద నాలింపుము.—

స్త్రీలకును పురుషులకును దేహతత్వములోఁ గొన్ని భేదము లున్నవి. శాస్త్రము జదువకయు, దేహములోగల యంత్రియరచనల నిర్మాణములను వాటి స్థానకర్మలను దెలిసికొనకయుండుట మరిగల స్త్రీలను మంత్రసానులుగఁ బెట్టు

కొని యుండెదము. చదువుకొన్న స్త్రీలు లేనందున బ్రసవకాలమున విధిలేక పురుషవైద్యుల సహాయతఁ గోరెదము. ఇట్లు చేయుట స్త్రీలకు సమ్మతమా; స్త్రీలవక్షప్రదేశమున వ్రణముండిన దానిని శస్త్రముచే గీచి మందు వేయుటకుఁ బురుషవైద్యులంగాని చేయించుటనుచితము. స్త్రీశస్త్రవైద్యులు లేనందున విధిలేక, పురుషవైద్యుల రప్పించుకొనెదము. అమెరికా సీమలో "డాక్టరు ఎలిజబెత్ బ్లాకువెల్ దొరసానమ్మగారు, 'మిస్ డేవిస్ కాలీ' దొరసానమ్మగారు, డాక్టరు 'ఎలిజబెత్ గారెట్' దొరసానమ్మగారు యిట్టి వారుండుటచేత నాసీమలోనుండు స్త్రీలకెల్లరకు నెంతోసౌఖ్యము! ఎంత గౌరవము! ఎంతప్రయోజనము! మనదేశములో తిరువనందపురములో సిరియక్ క్రైస్తవులఁజేరిన యొక నారీమణి రాజాంగములో వైద్యశాఖకు దొడ్డామెగా నియమింపఁబడియున్నది. మనము చదువుకొనియట్టిస్థితియుఁ గీర్తియు నేల పొందరాదు?

"మన తాత ముత్తాతల కాలములో స్త్రీలు చదువుకొనిరా?"

"మన పెద్దలకాలములో రయిలుబండ్లు (మోటారు) స్వగమనరథములు (ఏర్ షిప్స్) గగనమార్గపునావలు, పడ్లుదంచుయంత్రము, నేతలు నేయు యంత్రము, ముద్రాక్షరయంత్రము, తంతిసమాచారములు, మనమాటలను బాటలను ద్రిప్పిచెప్పెడి యంత్రములు, యీలాటియంత్రములును నింకాపలువిధములైన యద్భుతయంత్రములును లేవు. వివిధశాస్త్రములలో జ్ఞానమభివృద్ధియై పైఁజెప్పిన యంత్రములఁ గనిపట్టిరి. నాగరికత పెంపు నొందనొందను, పురాతన యాచారములు జీర్ణించుచు నవీనములైనవాటికి స్థానము గల్గు; కనుక, లోకములో జరిగెడి కాలవర్తమానముల ననుసరించి, వాటికనుగుణముగఁ బ్రవర్తించుకొనవలసినవారమై యుండెదము. ప్రస్తుతము పెంచి చెప్పఁ బనిలేదు."

"ఏనడిగినందుకు కోపము చేయకుము."

"కోపమేల? నీవు వకీలుబిడ్డవు; మంచి ప్రశ్న వేసితివి."

"నాకుఁ దెలియని విషయముం దెలియఁ జెప్పినందుకు వందన మాచరించెద."

లత మందస్మితంబుతో చంపకవల్లిని బరిరంభము చేసి "నావదినె గారడిగినందుకు నేను కోపింతునా?" అనుచు, చంపక చెంపమీఁదఁ దన యధరంబునదిమె.

చంపకవల్లి హార్మోనియా పెట్టెవాద్యము వాయించి లతాంగిని మెప్పింప నిచ్ఛగల్గి లతను పెట్టెవాద్యము వాయింపఁ దెలియునాయని యడిగి యాదినము సెలవుదినమైనందున దానుపెట్టెను దెచ్చి వాయించెనట్లు చెప్పి, యింటికి వెళ్ళె. కొంతసేపటికి వాద్యపెట్టియఁ దెచ్చి, యింగ్లీషుమెట్లలో రెంటి నిన్ని, రెండు హిందూస్థానిమెట్లును వాయించి, నోటరెండు పాటలఁ బాడగ, లతాంగి నవ్వుచు వినుచుండె. అటువెనుక రెండు నలుఁగుపాటలును వేడుకపాటలును బాడి, తిరుగ లతాంగిని పెట్టెవాయింప దెలియునాయని యడిగె. లతాంగి తనకు తెలియదని చెప్పగ,

"నీకు సంగీతజ్ఞానమున్నదా?" అని, చంపక యడిగెను.

"గీతలోఁ గొంతమట్టుకు జ్ఞానమున్నది"

"ఈ కాలమున బాటలు బాడని స్త్రీలుండెదరా?"

"నీపాట లుల్లాసార్థమైన పాటలు."

"సరస్వతీదేవి వీణాగానము చేసి దేవతలఁ జొక్కఁబెట్టెనటె!"

"సరస్వతీదేవి భగవన్నామ గానము చేయఁగ దేవతలు చొక్కిరి; నీపాట లుల్లాసార్థము."

"ఉల్లాసార్థము బాటలఁ బాడరాదా?"

"పాడఁగూడదనలేను; అన్నిట సమృద్ధి బొందినవారును ద్రవిణంబున బొల్లెడివారును గాలహరణము చేయఁ బాటలఁ బాడమని, వినుచు వేడ్కఁ గాంతురు; వివాహాది యుత్సవకాలములలో వేడుకార్థమై పాడు

దురు; రోమన్ రాజ్యమున బ్రజలక్షేమమునే ప్రొద్దుకుఁ బాడుచుండగ రాజ్యము చెడిచేటు గాంచెనట."

"ఏపాటఁ బాడిన నీకుప్రీతి?"

"మంగళము బాడిన బ్రీతిగ వినియెద."

"అహా! నాపాటలు పనికిరానివి? నాపాటలను వినసహింపక మంగళము బాడమనెదవా?"

"ఈవఱకు శ్రమఁదీసికొని యనేకపాటలఁ బాడినందున మంగళముఁ బాడమన్నానుకాని, నీపాటలయందుఁ బ్రీతి లేనందునగాదు."

"మంచిది! ఓసిలత! ఇంతపసితనమునఁ బూజలేల? పూజా ప్రార్థనల వల్లఁ బ్రయోజనమేమి?"

"పూజకుఁ బసితనమనియు ముసలితనమనియుఁ గలదా? పూజలుఁగల కాలముఁ జేయవలసిన వారము. చిన్ననాటి యలవాటులే, చిన్ననాటి గొనములే, 'పెద్దపెరిఁగి' నపుడు విజృంభించియుండు. లేఁతచెట్ల వక్రముఁ ద్రిప్ప వచ్చుగాని గొప్పవృక్షములైన వెనుక వాటివంకర డొంకరలఁ ద్రిప్ప నలవి కాదు. ఏదైనను నేఁడుచిన్నది; అదియె రేపు పెద్దది. పూజాప్రార్థనల ప్రయోజనముల నన్నిటిని బ్రకృతము చెప్పఁబనిలేదు; కొన్నిటిని సంగ్రహముగఁ దెల్పెద; ఆలింపుము:—

బుద్ధిని నిట్టట్టు పోనియ్యక యొక్క దానియందు నాటించుట. అట్లు చేయుటచేత ననేకసత్కార్య సద్విషయములకు నను గుణమైయుండు. చిత్తంబును భగవంతుని పాదపద్మముల మీఁదనుంచి తదేకధ్యానముగ, తెలిసియో తెలియకయో నిన్నమొన్న చేసిన పాపకార్యభావములను మన్నించి సుకృత కర్జంబులలో బుద్ధిని బోనిచ్చునట్లు ప్రార్థించి స్వాంతమునకు విరోధములేక వర్తించు మనుజుఁడే సర్వేశ్వరునికి సమ్మతమైన బిడ్డయు లోకులు చూచి యనుకరింపఁదగిన ప్రజయునగు."

"నీవు చెప్పినవన్నియు నిజమే; రెండేండ్లకుముందు నాకు పెండ్లిచేయఁదలఁచి, నాతల్లిదండ్రులు నను బడినుండి నిలిపిరి; ఇంటనాడుచుఁ బాడుచు నుండినందున విద్యయందాసక్తియుఁ దప్పె. ఇఁక నను బడికిఁబంపరు. ఏనేమి చేయఁగలను?"

"ఇంటనుండిన నాటలమీఁద బుద్ధిపోవునని బడికిఁబంపెదరు. నీవు పసిదానవై చదువుకొనుప్రాయమున నుండెదవు. విద్యయందుఁ బ్రియముండిన బడికిఁ బోనక్కఱలేదు. ఇంటఁగూడా చదువుకొనవచ్చు."

"ఈవఱకు నాలుగైదుకథపుస్తకములఁ జదివితి. ఏపుస్తకములఁ జదువవలెనో తెలియలేదు; నీవలెజ్ఞానమేలాగున గల్గు?"

"పుస్తకములందుఁ జెప్పఁబడియుండువాటిని వల్లించినమాత్రము చాలదు. అర్థమెఱింగిచదువవలెను. అర్థములేనిచదువువ్యర్థము. అర్థముఁదెలిసికొనక చదివిన చదువుకును మనమాటలఁ ద్రిప్పిచెప్పెడి 'గ్రామఫోను' యంత్రమునకును భేదములేదు. చిలుకలవలెఁజెప్పియిచ్చినమాటలఁ ద్రిప్పిచెప్పుటలో ఫలములేదు. అర్థముతోఁ జదువుకొనుటంగాక, గ్రంథకర్తలు దమగ్రంథములలో వెలుపలించెడి యభిప్రాయములను భావములను యోచించి, సరితప్పుల వివేచింపవలెను. లోకములోనుండు కోటానఁగోటిజీవరాసులలో మానవునికే యొప్పుతప్పుల వ్యత్యసించు శక్తిగలదు. యోచనాశక్తియు మానవునికే ప్రభూతంబై తక్కిన జీవరాసులలో నల్పిష్ఠంబై యున్నయది. జ్ఞానముఁ దెచ్చుకొనుటకు గ్రంథములుమాత్రముజాలవు. శ్రోత్రనేత్రజ్ఞానములు గలవు. కనులారఁజూచియుఁ జెవులారవినియు నెన్నియో విషయములఁ దెలిసికొననగు. వినికనిన విషయములకును బుద్ధిసాహాయ్యములేక జ్ఞానమభివృద్ధిఁజెందదు. దేశసంచారముచేతను, లోకవర్తమానపత్రికలఁ జదువుటచేతను లోకజ్ఞానము ఘంపార్చు. కనుక నీకు జ్ఞానము దెచ్చుకొనఁ గచ్చుండిన, గ్రంథములును బత్రికలును రప్పించిచదివి, వాటిని దెలియని విషయములఁ దెలసినవారి నడిగి తెలిసికొనుము."

ఇట్లిరువురు ముచ్చటించుచుండఁగఁ దనగదినుండి వినుచుండిన రంగనాథుఁడు కనలి,

"ఓసి, లత! ఎంతసేపుగ గొణగొణలాడుచున్నావు? ఎదిరింటిపడుచు వచ్చి రెండుగడియలయ్యె. వారుకోపముచేయరా?" అనగ, చంపకవల్లి లేచి తన యింటికిఁ జనియె.

సాయంబున ధనిష్ఠాపంచమియు రంగనాథుఁడును నగరవైభవంబుల గాంచి వచ్చుటకు నిచ్ఛగల్గి, అత్తాంగి యనుమతింగోరిరి. లతసమ్మతించినంతట నిరువురు నిలువిడిచి వెడలుసమయంబున, రంగనాథుఁడు,

"ఓసి, లత! నగరములోనవెళ్ళి దీపములతో మళ్ళెదను; వంటచేసెడి యవ్వ యింటనున్నది; వేఱుతోడు గావలెనన్న నెదిరింటనుండు నీనెయ్యురాలిఁ బిలుచుకొని మాటాడుచుండుము," అని, వెలువడె.

ఇరుగురును రెండు సందుబొందులలోను నిఱుకుత్రోవలలోను జని రాజబాటఁజేరి, మండివీథిఁ బ్రవేశించిరి. చిన్నగుట్టలవలెఁ బ్రోగుచేయబడియుండిన నవధాన్యములును బెక్కురకముల బియ్యపుతట్టలును, మరీచముమొదలగు సాంబారుసంబంధమైన సరకులును జాజికాయ పెట్టియలలోఁ గుంచిగఁబోసి యుండుటను జూచుచు నొకయంగడియొద్ద నిలిచిరి. ఆయంగడి గోడమీఁద, 'ఇచ్చట స్వచ్ఛమైన ఘృతమమ్మబడును,' అని వ్రాయబడి యుండె. రవంతమాదిరి జూపుఁడని ధ-పంచమి యడుగ నా యంగడివాఁడొక మిరెపకాయకొనను నేతిననద్దిఁ యాకొనను ధ-పంచమి మీఁజెయిమీఁదఁబూచె. చెయిని వాసనచూచి, రయిలుమార్గమున నమ్మెడి భక్ష్యముల నేతివాసన వచ్చునట్లు ధ-పంచమి చెప్పగ నంగడివాఁడు రైలిలాకావారును దనయంగడిని గొనునట్లుచెప్పె. దానికి మేలైన ఘృతముండిన దానిమాదిరిఁ జూపుమని ధ-పంచమి యడుగగ నంగడివాఁడు."

"దీనికి మేలైన ఘృతమెచ్చటను జిక్కదు," అనెను.

"ఇంతవేండ్రమైనకాలములో ద్రవముకాని పదార్థమువలె ఘృతము గట్టిగ నున్నది; ఏల?

"మంచిఘృతమాలాగే యుండు; నూనెగల్పియుండినగఱఁగియుండు"

ఇరువురును మరలివచ్చునట్లు చెప్పికొంతదూరము జనిరి. అచట నువ్వులఁజల్లిన నొకగింజ యైనఁ గ్రిందఁ బడఁగూడనియంత జనస్తోమముండెను.

"రంగనాధ! ఈజన సంకులంబున మనము వేఱుపడినచో నొకరినొకరుఁ గనిపట్ట వల్లపడదు; నారెండవచేతి కరశాఖంబులమధ్య నీకుడిచెయి వ్రేళ్లం గ్రుచ్చుకొనుము," అని-ధ-పంచమి చెప్పగ నిరువురువ్రేళ్ళ గ్రుచ్చుకొని చనుచుండగ నిరుపంకలందు బంగారు వెండినగల నమ్మెడి దుకాణము లగపడె. జనుల పదుపుమధ్య వెళ్లి, యొకయంగడి చెంత నిలిచిరి. అయ్యెడ నొక దొడ్డమనిషివలె సరిగతలపాగఁ గట్టుకొని నలుదెసలఁ జూచుకొనుచు నల్లన నొక నగలంగడి యొద్దనిలిచె. ఆ యంగడి దలారులలో నొకండు దొడ్డమనిషినియేమి తెచ్చెనని యడుగ దొడ్డాయన తనమొలనుండిన చిన్నసంచిని బయటతీసి దలారి చేతఁబెట్టె. అతండా సంచివిప్పియందుండిన కెంపులతో జెక్కిన చెవికమ్మజేతఁ జూచి,

"ఈలాటి నగల నిపుడు కోరువారును గొనువారును లేరు. ఎఱ్ఱనిరాళ్లు 'శీయ్యముల' వలెఁ గనఁబడుచున్నవి. అవి కెంపులని యేర్పడినా మేలైన విశావు, "అని త్రాసులో నాకమ్మను దూఁచి, బంగారు నాలుఁగువన్నియలకుపైనుండదు; తూనిక మూఁడువరహాలయెత్తు, "అనుచు మచ్చుచూచుటకై శాణముమీఁద బంగారుచింతాకు ఘనమఱుగుదాఁకరాచెను.

"తాచినది చాలునయ్య! నగయఱిగిపోవుచున్నది," అని, దొడ్డాయన చెప్పఁగ, దలారియతని ముఖముజూచుచుఁ దనఖలముకొద్దియఱుగఁ దీసె. దొడ్డాయన దలారి చేతుల నంటబట్టి, "తాచినది చాలు," అనియెను,

"ఈపురాతననగ బాపనులు పెట్టుకొనునగవలె నున్నది. తాతిదెబ్బ తగిలినట్టున్నది. ఎవ్వండైన రాతితోఁ గొట్టిరత్నాలను లేపఁ జూచెనా?" అని దలారియడుగ,

"బిడ్డలు నలగఁ గొట్టె యుందురయ్య," అని, దొడ్డాయన సమాధానము చెప్పెను.

"రాళ్ళతూనిక యరవరహాయెత్తుపోను బంగారు రెండున్నరవరహాల యెత్తు; వరహాయెత్తు బంగారు నాలుఁగు రూపాయలు వంతున నిచ్చెదరా?" మాగ్రామమున నగసాలెవాఁడు తూఁచియైదువరహాలయెత్తుండునట్లును మదింపుపదివరహాలకు లోపములేనట్లును జెప్పెనయ్య."

"ఈపురాతననగ తాతిదెబ్బతగిలి యుండుటంగాక బాపనులుపెట్టుకొను నగగా నుండుటంజేసి సంశయము తగులుచున్నది; అదిగో! ఆబంట్రోతుచేత నీనగ నిచ్చెద అతఁడు కొనవచ్చునని న నేఁగొనుట కభ్యంతరము లేదు."

"బంట్రోతేల? గింట్రోతేల? అతఁడు నను నెఱుంగడు; నేనతని నెఱుంగను; ఇచ్చేమూల్యము నిచ్చిన నేను వెళ్ళెద," అని దొడ్డాయన హ్రస్వస్వరముతోఁ బల్కెను. దలారి యంగడి శెట్టియొద్దఁ బదిరూపాయలుఁ దీసికొని తొమ్మిది రూపాయలు దొడ్డాయన చేతఁ బెట్టి, యొక్క రూపాయుఁ దననడుమున జెక్కుకొనె.

"నీవునడుమున జెక్కుకొన్న రూపాయ నిచ్చివేయుమయ్య," అని నగసొంతగాడడుగ,

"ఊరక పొమ్మన్న! నాకొక్క రూపాయతఱుగుమామూలు తెలియదా?" అని, దలారి యఱచెను.

తుదకర్ధరూపాయైన నిమ్మని దొడ్డాయన ప్రార్థించుచుండ, దలారి వేఱొక క్రయికులనొద్దను గ్రయికులనొద్దను బేరము చేయుచుండె. దొడ్డాయన తొమ్మిది రూపాయలకు పైఁబైసాగుగూడా దీయక వెళ్ళెను.

ఈబేరమును గుట్టిగఁ జూచుచుండిన ధ-పంచమి యంగడికి సమీపమున బోయినిలిచినంతట నేమి కావలెనని దలారులలో నొకండడిగె. ధ-పంచమి రంగనాధునిఁ జూపి, యతని యప్పుకుఁ జెవికమ్మనలు పది రూపాయల మదింపులోఁగావలెనని. దలారిదొడ్డాయన యమ్మిన కమ్మను జూప, ధ-పంచమి

కొంతసేపు దానిని శోధించేవటుల నటించి, కమ్మయు నున్నానయును మూల్యము నెంతయని యడిగెను.

"ఇదిమంచి పాగున్న; మేలుబంగారు; ప్రాంత కెంపులు; వాడుకొన్నను గదొరకుట దుర్లభము; బాసనులకుఁ దగినయది; పదికెంపుల మతింపు పదిరూపాయలు; కెంపులకును ముత్తికికిని దొరిపుడగవరహాయెత్తుపోను, మిగిలిన నాలుఁగున్నర వరహాల యెత్తుబంగారమునకుఁగ్రియమును ముప్పది రూపాయలు" అని,దలారి చెప్పె.

"నలువది రూపాయలకుఁ దక్కువకియ్యరా?"

"ఎంత తక్కువగాఁ గావలెనయ్యా?"

"బంగారెన్ని వన్నియలు?"

"తొమ్మిది వన్నెలు; తక్కువయైన గట్టియిచ్చెదము."

"మేము రెండంగళ్ళకు వెళ్ళి చూచివచ్చెదము."

"మాయూసామినిఁనగతోఁ బంపెదము; చూచిరండు"

"వలదు; మేమె వచ్చెదము," అని యిరువురును సరాపుఁగళ్ళను దాఁటి బట్టలంగళ్ళకడఁ జేరిరి. ఇర్వంకలనొక్కొకయంగడి మోరిల నిద్దఱుతఱుగరులు నిలిచియుండి, బాట వెంబడిఁ బోవుచుండిన వారి చేతులను లాగి, యేమికావలెనని యడిగి, సరసమైన వెలలో మంచిబట్టలుండుట్లు చెప్పిరి.

"పంచలాఁకోకలా, చీట్టిగుడ్డలా? ఏమికావలెను?" అనియొక తఱుగరి ధ-పంచమిని యడుగ నతఁడు రంగనాధునిఁ జూపి యతనికిఁ బదిరూపాయల మతింపులోపరిగ పంచకావలెనని చెప్పె.

"ఏమోస్తరు?

"ఏ మోస్తరైనను సరే; మంచిమోస్తరుగ నుండవలెను."

తఱుగరి నాలుఁగు దినుసుల నెత్తి యొక్కొకపంచను ధ-పంచమి భుజముమీఁద వ్రేలాడవేసి,

"శేష్! ఎంత బాగునుండెదవు! చూచుకొనుము; పంచయొకటికి పది రూపాయలు వెల," అనెను.

"ఈ పంచలమీఁద ధర వ్రాయలేదే?"

"ధర వ్రాసియుండిన వ్రాసిన ధరనిత్తురా?"

"ధర వ్రాసియుండు పంచలఁ జూపుమయ్యా!"

దలారి రెండుదినుసులఁ జూపగా, త్రోపుడెంతయని ధ-పంచమి యడిగెను.

"త్రోపుడు గిపుడు లేదు; పట్టుబడి వ్రాసియున్నది."

"త్రోపుడు లేనివిలాసము గలదా?"

"లాభమీయకున్నను వ్రాసియుండు ధరకుఁ గొనిపొమ్ము"

"నాలుఁగు రూపాయలు తగ్గించిన గొనియెద."

"బేరమే కాలేదు; మాయబ్బతోడు నష్టమునకే నిచ్చెద. ఒక్కరూపాయ తక్కువచేసికొనిపొమ్ము."

"అక్కఱలేదు"

"సరే! రెండు రూపాయలు తక్కువగాఁ గొనిపొమ్ము."

"అక్కఱలేదు."

"అయ్యారె! మూఁడు రూపాయలు తక్కువ చేసి తోలఁచుకొనిపొమ్ము; మీవంటివారి యొద్ద బేరము చేసిన, మాకొంపమునిఁగి మేము వేవలసినవారి నోట మన్నుగొట్టవలె," అనుచే, ధ-పంచమి భుజముమీఁదఁ బంచ వేసె. ధ-పంచమి యక్కఱలేదని వాపసిచ్చినపుడు,

"కొవుకొనుటకు రాలేదోయ్! ఏమరియుండిన దోచుకొని వెళ్ళవచ్చినావు, కాఁబోలు!" అని, కోపించి దలారి, యాపంచను నంగడిలోన విసరి వేసెను.

బట్టలంగళ్ళను దాటి, మార్వాడి యంగడిచెంత నిరువురుఁ గొంత సేపు నిలిచి చూచుచుండిరి. ప్రతియంగడిన నొకమార్వాడి వ్యాపారి యొక

పెద్ద యినుపపెట్టెయయు ద్రాసును సంచినిండుగ రూపాయలును బెట్టుకొని కూర్చుండియుండె. ప్రాఁతబట్టలు, క్రొత్తబట్టలు, వివిధములైన నగలు, పురాతన పాత్రసామానులు, నూతనపాత్రములు వీటిని గొంపలు కుదువపెట్టి, నెలకు రూపాయయొక్కటికి నర్ధణా మొదలు రెండణాలవఱకు, వారివారి యవసరమునకుఁ దగినట్టు వడ్డి నిచ్చునట్లొప్పుకొని యప్పుతీయుచుండిరి. రెండువారములలోఁ గొందఱును, రెండునెలలలోఁ గొందఱును దమసొమ్మును విడిపింపని పక్షమున సొమ్మునకును దమకును సంబంధములేదని లిఖితమూలముగ నొడంబడిరి. ఇరువురు నూరురూపాయలకు నొకబాండు వ్రాసియిచ్చి, నెలయొక్కటికి రూపాయలు నూటికి మూఁడున్నర రూపాయలు వడ్డిచ్చునట్లును, పదినెలలలో బాండుమొత్తమును పైసలా చేయునట్లును నొప్పుకొని, సంతకముచేసి, పదినెలల వడ్డికిగాను ముప్పదియైదు రూపాయలు ద్రోపుడుచేసి, మిగిలిన యఱువదియైదు రూపాయలు బుచ్చుకొనిరి.

ధ-పంచమి సంతకము చేసినవారిలో నొకని బిలిచి, తనకు ముప్పది నెలల గడువునకుఁ బదిపదిరూపాయలు గావలసియుండి, బాండు వ్రాసియిచ్చినయెడల ద్రోపుడుపోను తనచేతి కెంతవచ్చునని యడుగగ నప్పుతీసినవాఁడు నవ్వుచు బదులాడక జెరిగెను. అటువెనుక, యిరువురును సందెయంగళ్ళ కడఁజేరిరి. అచ్చోట, ప్రాఁతబట్టలు, పురాతనమైన చొక్కాయలు, ప్రాఁతపాయపోసులు, జీర్ణించిన లోహపుసామానులు, మాసినకాగితములు, సజవర్ణరూపములులేని పలువిధంబులైన వస్తుచయంబులు— యివి నేలమీఁదఁ బఱుపబడి యుండె 'కత్తెరలు. చేతిచొకములు, కమ్మకాగితముల్లు, యింకననేక విధములైన వస్తువులు,' వీటిఁ గొంపలు చేతఁబెట్టుకొని యమ్ముచుండిరి.

ఈ యంగళ్ళను దాఁటి ముప్పదిబారల కవతల జనుల పౌజే కంటి కగపడె. అచ్చోట నొక యేకాంత గృహముఁగాంచిరి. దాని కుడ్యంబులలో నొకదాని మీఁద నొక పలక తగిలింపఁబడియుండె. ఆ పలకమీఁద 'మదిరాగృహము,' అని, వ్రాయఁబడి యుండెను. ఇంకొక గోడమీఁద "శిర

మును సురలోక మొందనిచ్చు సురాపానము," అని, వ్రాయఁబడి యుండెను. మూఁడవ గోడమీఁద, "దయచేసి కొంత దాహము పుచ్చుకొనుఁడు," అని, వ్రాయఁబడియుండె. ఆ గృహమును సమీపించుట కిరువురును శంకించుచుండగ నంగడివాఁడు, "మఱుఁగుచోటున్నది, లోనబోవచ్చు," అనెను.

ఇరువురు నవ్వుచు నంగడిదాఁటి రెండు, లేక, మూఁడు బారల దూరము గడచినంతట నొక మ్రానిక్రింద నొకండు సురలో మునిఁగి భూలోకమును మఱచి దిగంబరుఁడై పండియుండె. బాటయంచున నిద్దఱు మత్తులై గుడ్డగోచులను వదలి హాయిగఁ బరుండియుండిరి. కొందఱు మఱుమఱచి మఱవక యస్ఫుటమైన మాటల నాడుచుఁ ద్రిందఁబడుచు లేచుచు బాట వెంబడిఁ బోవుచుండిరి. ధ-పంచమి, యిరాపానము చేయఁ బోవుచుండిన వారిలో నొక్కవాని బిలిచి,

"ఇట్టియంగళ్ళెన్ని యున్నవి?" అని, యడుగ నతండు నలుదెసల నాలుఁగంగళ్ళున్నవి యనెను.

"ఒక్కొక యంగడిన దినమొక్కటికి మద్య మెన్ని రూపాయల కమ్మును"?

"వేయిరూపాయలకుఁ దక్కువలేదు."

"సర్కారు శిస్తెంత?"

"నెల యొక్కటికిపదునాలుఁగువేల రూపాయలు."

"కల్లంగడి యుండుటచేత మీరు త్రాగుచున్నారా? లేక, మీరు త్రాగుటచేత కల్లంగళ్ళేర్పడ్డవా?"

"ఒకటికొకటి కారణమే! అని నవ్వుచు వడిగ నంగడిలోన జనియెను. ఈ సమయంబున గనుమబ్బు కావచ్చినందున నింటికి మళ్ళనారంభించి, ప్రత్యేకమైన మార్గమున బోవుచుండిరి. దారిత శిలాశకలంబులు మృత్స్నతో సమ్మేళనమై పటుత్వ మొందియుండిన సుపథంబుమీఁద,

ధ-పంచమి తన పాదమును దాడనముచేసి, "రంగనాథ! ఈ బాట యెంత గట్టిగ నున్నది! చూచితివా?" అని యడిగెను.

"చూచినాను; నేలమీఁద కడపటిఱాఁ దారు పోసియున్నది; ఎందుకు?"

"నేలనున్నట్లుండిన రథములు శబ్దము లేక నడ్డుపాటు లేకయు సులభముగ పాఱును."

"కండ్లు మంటలెత్తుచున్నవి." (కండ్లు నలుముచు) "కండ్లమంటతోఁ బాదములందు బొబ్బలు లేచుచున్నవి. ఏదీ, రంగనాథా! నీకాళ్ళు జూతము."

(రంగనాథుఁడు పాదములఁ జూప) "అయ్యారే! ఎన్ని చిన్న బొబ్బలు లేచియున్నవి! చూచితివా?"

"ఓరి, పంచమి! తారు పోసియున్నందున నీళ్ళు పడినచోట్ల నెల్లఁ గాళ్ళు జాఱుచున్నవి."

ఇటు భాషించుచుఁ జనుచుండఁగా, ప్రయాణికులు లేక యుత్తరిగఁ బోవుచుండిన జట్కాబండ్ల సారథు లిరువురిని సంబోధించి, "ఏడ పోయెదరు? మా బండిలోఁ గూర్చుండుఁడు; వలసినచోటికి గొంపోయెదము; మీకు తోఁచెడి యద్దె యిచ్చిన జాలు," అనిరి.

తమకు బండి యక్కఱలేదని వడిగ గమనము చేయుచుండగ నొక దిక్కున 'దొప్పు,' 'దొప్పు'ని వడ్లుదంచు శబ్దమును విని యచ్చోట నిలిచిరి. వడ్లు దంచు యంత్రముఁ జూచి, "ఈ యంత్రములు మనదేశమున మిక్కుటమైనంతట బియ్యపువెల ప్రియమై బీదసాదల నోట మన్నుపడె," అని, ధ-పంచమి చెప్పఁగ, యంత్రశాల పొంతనుండిన యంత్రశాలాధికారి, యీ యంత్రము లేర్పడి వెల లగ్గువయయ్యె యనెను.

ధ-పం-ఇవి యేర్పడి పదియేండ్లాయె; ఈ పదిసంవత్సరములుగా వెలలు ప్రియమైయున్నవి.

యంత్ర-తాము చెప్పెడి మాటలు 'కాకతాళన్యాయము'వలె నున్నది; ఈ యంత్రములు వచ్చుటకును వెలలు ప్రియమగుటకును సంబంధము లేదు. వర్షము లేనందున ధరలు హెచ్చెను.

"అటు గాదయ్యా! తమవంటి యంత్రాధీను లపరిమితమైన ద్రవ్యము నప్పుదెచ్చి రైతులకడ నేగి, రూపాయకు రెండుతూముల వడ్లని హెచ్చు ధరలో నొప్పందము చేసికొని, సంచకరమిచ్చి, రైతులు కోఁతకోసిన ధాన్యము కళ్ళమున నుండునపుడే, యంత్రాధీను లొప్పందము చేసినప్రకారము ధాన్యమంతయుఁ గొని, యంత్రముల మూలముగ దంపించుచున్నారు; అట్లు దంపబడిన బియ్యమును గోతములలో వేసి రయిలుమార్గమున బంపిన, గోనెసంచి యొక్కటికి రెండేసి శేర్లంతర్ధానమగుచున్నవి. ఇన్ని నష్టములును జిల్లరగఁ గొను బీదసాదల తలమీఁదఁ బడుచున్నవి."

"వడ్లను జేత దంచిన మూల్యమధికమగునని నావంటి యంత్రాధీనులు యంత్రముచే దంపించి బియ్యము లేనిచోట్ల కెగుమతిచేసి ధరల నెక్కడ నొక్కటే చేసెదరు."

"మూల్యమునకు దంచిన మేలు; ద్రవ్య మత్తుచేత వెలలను హెచ్చించెదరు. పైగా, యంత్రముచే దంపబడిన బియ్య మారోగ్యమునకు హితకరము గాదని కొంద అనుచున్నారు."

"తాము యంత్రమువలని లాభమును ప్రయోజనకరమును దెలిసికొనలేదు."

"యంత్రాధీనులకు లాభమే; బీదసాదలకుఁ గష్టమే; నష్టమే;" అనుచు, రంగనాథునితో నింటికి వడిగఁ జనియెను.

నగరములోనవెళ్ళిన రంగనాథుఁడు తిరిగి రాలేదని లతాంగి వీధివాకిట నిలిచి, యిరువురిని నెదురుచూచుచుండఁగఁ గొంతసేపటికి నిద్దఱును వచ్చిచేరిరి. మఱునాటి పగలు మూఁడుగంటలకు రంగనాథుఁడు, తన చెల్లియతో మాటాడుచుండగ సేవకుఁడు వచ్చి, "అమ్మా! మన వీరునిజూచి

మాటాడివచ్చెద; మన గ్రామమును విడిచినవెనుక యతం డేలాగున్నాఁడో తెలియదు; పాదిరి మందిరమునకు వెళ్ళి రెండు గడియలలోఁ దిరిగివచ్చెద," అని చెప్పఁగ, రంగనాథుఁడు తానును గూడా వెళ్ళి మరలునట్లు చెప్పె. ముందు దిన మాలసించి చీఁకటి కమ్మినపిదప వచ్చినట్లు రాక, గడియ ప్రొద్దుండఁగ రండని, లతాంగి చెప్పిపంపె. ఇరువురును మూఁడుమైళ్ళదూరము నడచిపోయి నగరద్వారమున కావల, మందిరంబుఁ గనిపట్టి, లోఁజని, దొర వారి యుగ్రాణపు నౌకరిని వీరుఁ డెక్కడ యని యడుగఁ దోఁటలో నుండు నట్లు నౌకరి చెప్పెను. తోఁటలోన వెళ్ళుచుండఁగ, వీరుఁడు వారి కెదురు పడి, చేమోడ్పు చేసి, "చిన్న యజమానులు వారికి దండములు; పంచమి అయ్యగార్కి దండములు," అనెను.

"వీరా! సుఖమా?" అని, రంగనాథుఁ డడిగెను.

"సుఖముగ నుండెదను, స్వామీ! అయ్యగారు సుఖమా? మన తల్లి గారు సుఖమా? బిడ్డ, లతమ్మ సుఖమా?"

"అందఱు కుశలముగ నున్నారు."

"ఓరి, వీర! నీవును నీ భార్యాబిడ్డలును సుఖమా? అత్తి యెక్కడ?" అని, ధ-పంచమి యడిగెను.

"అందఱుఁ దమధర్మాన కుశలముగనుండెదరు; అత్తి దొరసానమ్మ గారితో అమెరికాసీమకు వెళ్లియున్నాడు. ఇంగ్లీషు చక్కఁగ మాటాడను జదువను నేర్చి యొక్క సంవత్సరముతాలి తిరిగివచ్చె."

"నీ పెద్దకూఁతు రెక్కడ?

"దానిని దొరవారి రెండవ (బట్లరు) యుగ్రాణనౌకరికిఁ గట్టియిచ్చి నాను; దానికొక మగబిడ్డ."

"మనపల్లె విడిచివచ్చినపిదప, నీకు సౌఖ్యముగద?" అని, రంగనాథుఁ డడిగెను.

"తమతండ్రిగారి సొత్తును దిని పెరిఁగినవాఁడను; వారిఋణముతీరి యిచ్చేట పాదిరి దొరగారి ఋణమునకు వచ్చితి. ఆనాటిమొదలు సుఖముగ నుండెదను. అమ్మగారు మాదోవకు రాగిసెజ్జల నియ్యకుండిన మేము దోవఁబోమడిసి, మడిసినచోటఁ బచ్చికపడి యుండు."

"వీర! నీవువచ్చిన వేళ మంచివేళ," అని, ధ-పంచమి చెప్పఁగ, "తమ ధర్మానవచ్చినానయ్యా! తాము ముట్టించిన దీపమే. రంగనాథయ్యా, తాము చేదువుకొనవచ్చితిరా?"

"ఔ; నాచెల్లియలతయుఁ జదువుకొనవచ్చియున్నది."

"లతమ్మగారు వచ్చియుండెనరా? సంతోషము; బసయేడ?"

"లాయర్ జంబయ్యయింట."

"అతఁడు చాలాగొప్పవకీలు; మాదొరవారతనిచే రెండు వ్యాజ్యములను జయించిరి; మీరింతక్షేమముతో నన్నుఁజూడవచ్చినందుకు నేనేమి యీఁగలను. ఈలేఁత టెంకాయల యెడనీటితో గొంతదాహము పుచ్చుకొనుఁడు," అని, రెండు టెంకాయల నొసంగెను. దాహముపుచ్చుకొన్నపిదప నిరువురిని బంగళాలోఁగలికి దోడ్కొనిపోయి కడవెళ్ళఁజూపి, "దొరగారు గుడికి వెళ్ళి యుండెదరు; మీరు వచ్చిపోయిన సమాచారము విని చాల సంతోషపడుదురు," అనెను. కొంతసేపువఱకు భాషించి రంగనాథుఁడు లేచుచు, "ఓరి పంచమి! కనుచీఁకటి కావచ్చె; లెమ్మ; పదము," అనినంతట నిరువురికిని వీరుఁడు మ్రొక్కి, "జ్ఞాపకముంపుము; అమ్మగార్కి నాదండములు జెపుడు; ఏనుప్రతిభానువారమున దమనులతమ్మగారిని దర్శించివత్తు," అని చెప్పి, యిరువురు దృష్టిగోచరమగు పర్యంతము నిలువబడియుండె. రంగనాథుఁడును సేవకుఁడును క్షిప్రగమనులై దీపములు ముట్టించుటకు గడియ యుండఁగ నిలుఁజేరిరి.

అటువెనుక ధ-పంచమియు పీపాయియు గూరిమి సేయుచుఁ దమతమ యజమానులఁబుట్టుపూర్వోత్తరములును స్థితిమతులును నౌకరికొకరుఁ జెప్పు

కొనిరి. ధ. పంచమి పల్లెవాసముజేయువారి సౌకర్యములఁ దెలుప నగరవాసుల వైభవములను పీపాయి తెలియఁజెప్పె. ఇట్లిరువురును మంచి నెయ్యులైరి.

నాల్గవనాఁడు, ధ-పంచమి శ్రీమంతపల్లెకు మఱలుటకు జంబయ్యగారియొద్ద సెలవుపుచ్చుకొనగ, లాయర్గారు ధ-పంచమి చేత నొకరూపాయి బెట్టి, బిడ్డలు సుఖముగనుండెదరనియు, లత పెండ్లివిషయమై త్వరపడువట్లును భద్రయ్యగారితోఁ జెప్పుమని చెప్పె. ధ-పంచమి రూపాయను ముదముతోఁ దీసికొని, దండములు సమర్పించి, లతారంగనాథులకడఁ జని వారిని వివేకముతో నుండుడని చెప్పి, తుదకు పీపాయియొద్ద సెలవుపుచ్చుకొని రైలుమార్గంబున శ్రీమంతపల్లెకుఁ బనివినియెను.

—•••—

12 వ, అధ్యాయము,

ధ- పంచమి నగరవైభవముల దెల్పుటయు, సుబ్బమ్మయొక్క తె మాత్రము దుఃఖాక్రాంతయై యుండుటయు; అత్తగోడండ్రకును మామసుతులకును వాదము.

“ఓరి, ధనిష్ఠాపంచమి! బిడ్డలు సుఖమా? నిత్యము బడికి వెళ్లెదరా?” అని సుబ్బమ్మ యడిగెను.

“నెమ్మదిగనుండెదరు, తల్లీ! బడికి నిత్యము వెళ్ళి చదువుకొనుచున్నారు.”

“నీవు బిడ్డలఁజూచి వచ్చుటకు నెడపడపవెళ్లవలెను.”

“పిల్లగాండ్రకొఱకుఁ బోవలసినవాఁడనుగాని, వెళ్లుటకు నాకై ప్రియము లేదు, తల్లీ!”

“ఏలరా?”

“నగరమున నేవానికిని జీవనోపాయము దొరకదు. ఎట్టివస్తువులైన నెంత మాత్రమైన నేవేళనైన దొరకుట కభ్యంతరము లేదు; అయినను నగరమునగల కొన్ని విశేషములను సంగ్రహించి విన్నవించెద; ఆలింపుము, తల్లీ!

ఒక్కమాటతోఁ జెప్పవలెనన్న నగరవాసము నరకవాసమే. ఏవలను బోయిన గంటను నొడలిమీఁదను బంచలమీఁదను దుమ్ము కమ్ముకొనుచున్నది. బహిర్భూమికకు దగిన ‘దొడ్డి, తోఁట, వంక,’ యిట్టివి లేవు. శంక దీర్చుకొనుటకొక యిరుకటమైన గదికి వెలుపట నానచెడి కాచియుండి, యొకఁడు లోనబోయి వచ్చిన వెనుక మఱొకఁడు బోవలెను. సందుగొందులలో నిండ్లువట్టమై క్రిక్కిరిసియుండుటచేతను, జెలదారి తూము వీధిగోడను నంటియూనుకొని యుండుటచేతను వీధిని నిర్మలమైన గాలి చిక్కదు. ప్రతివీధిలో బాఱవేయఁబడ్డ ‘సిగరెట్లు, చుట్టలు,’ వీటి ముక్కలును సముచ్చయము చేసిన నాలుఁగు గంపలు నిండును. పొగాకువ్యాపారము విజృంభించియుండు నట్లు తెలియవచ్చుచున్నది. అన్నిజాతివాండ్రును నిరుగుపొరుగున వాసము చేసెదరు. జాతివర్ణభేదములులేక ‘తురక, మాల, మంగల,’ యందఱొక్కటై కాపి మందిరమున వరుసగఁ బ్రక్కన గూర్చుండి ఫలాహారములమెక్కి-యొకఁడు త్రాగినగిన్నెలో నింకొకఁడు త్రాగుచున్నాఁడు. పానపాత్రములను నీటిలో శుద్ధిచేయురీతి పరమశివునికే ప్రీతి. బాపనపిన్నవాండ్రకును దక్కిన పిన్నవాండ్రకును నాపితులక్కఱలేదు; వారు సొంతమున మంగలకత్తులను క్రయమునకుఁ దీసి, యింకొకరికి గొఱగక తామే ముఖక్షౌరముఁ జేసికొనియెదరు. బ్రాహ్మణులలో ముప్పాతిక పాలిటివారికిఁ దలలో జొట్టుదొరకదు. అన్నిజాతి వాండ్రొక్కటే రీతిగఁ దలవెండ్రుకలఁ గత్తిరించుకొని యుండెదరు. కొందఱు తప్పఁ దక్కినవారి నెత్తిన బొట్టు కనఁబడదు. చొక్కాయజేబులో సిగరెట్, లేక, బీడీ, లేని పిన్నవాని గనుట దుర్లభము. తామసవేళలో ‘మిఠాయియంగళ్ళు, నస్యమంగళ్ళు, సిగరెట్టంగళ్ళు, కాపీ భక్ష్యముల భవనములు, మనస్థానములు’ ద్యూతగృహములు, నాటకశాలలు, లాసికావాసములు’—యీ స్థలములందలి నరవరుల నుల్లాసకేళికల నంతింతయని చెప్పఁదరముకాదు. వీర్లకను గుణముగ నిశీథియందును రథవ్రజములు చెప్పుడుచేయుచు శంఖనాదంబుతోఁ దిరుగాడుచున్నవి. రాత్రిపూఁట వీధి

తిన్నెక్రేఁబరుండిన జిలదారి గబ్బుకొట్టుచున్నది; చీఁకటి యీఁగలు పోడు చేచున్నవి. లోనఁ బోయిన గాలి లేక, నల్లులు పెలుకుచున్నవి. నా పంచెలోఁ గొన్ని యంటుకొని యుండినా యుండు," అని తన యుత్తరీయమును విధూననముచేసె. "రాజపథమున నొకండు వెళ్ళినచో నిరుకెలంకులను నిమిషమాత్రమున విచిత్రమైన రథవ్రజంబులు మన దేహము నంటియంటక వడిగఁ బోవుచున్నవి. రాజమార్గంబున నడచిపోయెడివారికి 'నిత్యగండమును పూర్ణాయుస్సును'. నేలమీఁద దారఁబోసి యుండుటచేతఁ గండ్లు మంటలెత్తుటతో బాదములందు బొబ్బలు లేచుచున్నవి. సందెయఁగళ్ళకు వెళ్ళిన కొంత యేమరియుండిన మన పైనుండు బట్టలును జోక్కాయలును, జేబునందుండు వస్తువులును, మన స్వాధీనముఁ దప్పకనుండుట నిశ్చయము. ఇవియన్నియు నగర వైభవములని పీపాయి తెలిపెను, తల్లీ."

'పీపాయి, యెవ్వరు?"

"లాయర్గారి నౌకరి; మహాతామసి."

"జనసమూహమునుండుచోట నీవు చెప్పినట్లుండు; నీవు చెప్పినవాటిలోఁ గొన్నిటిని వైభవములనందగు. నగరవాసులకుఁ బల్లెవాసమును, పల్లెవాసులకు నగరవాసమును సరిపడదు; వాసమున కలవాటే ప్రధానము."

ఇట్లు భాషించుచుండగ, భద్రయ్యవచ్చి, బిడ్డలు సుఖమాయని యడిగెను. ఇరువురు నెమ్మదిగ నుండునట్లు సేవకుండు చెప్పి వీధికివెళ్ళెను. భద్రయ్య సంధ్యవార్చుచుండగ, సుబ్బమ్మ వీధికిఁజేని, చంపకవల్లి చూపునకు లక్షణముగనున్నదాయనియు మంచి గుణశాలియాయనియు నడిగెను. "సంసారమునకుఁ దగినబిడ్డ; దొడ్డవంశమున బుట్టినందున దొడ్డబుద్ధియు దొడ్డయోచనలఁగలయది; పసితనముచేత నాటవాటల యందాసక్తి మెండుగనుండియు, తల్లిదండ్రులకుఁ లోఁబడి నడుచుకొనుచున్నది; మన లతమ్మయందధిక ప్రీతియుఁ బ్రియమును గలయది; మన లతమ్మవలె దనకు గొప్ప చేదువును జ్ఞానాభివృద్ధియు లేదను కొఱంత యొక్కటిపగనున్నది," అని, సేవకుఁడు చెప్పెను.

"ఓరి, పంచమి! చంపక హార్మోనియాపెట్టె వాయింపఁగఁ జూచితివా?"

"చూచితి, తల్లీ! ఎంత మనోహరముగ వాయించె! దానిచేతి లాఘవము నేమందు! ఒకనాఁడు చంపకమ్మ పెట్టెవాద్యము వాయించినంతట లతమ్మకును చంపకమ్మకును దగవులు తగిలె."

"తగవులేటికి?"

"బత్తివిషయమైన పాటలను బత్తితోఁ బాడవలెననియు వేడుకార్థమైన పాటలలో సార్థకత లేదనియు స్త్రీలకు విద్యావశ్యకమనియు లతమ్మ వాదించుచుండగ రంగనాథుఁడు కోపించె; వెంటనే చంపకమ్మ తన యింటికి జనియె."

"ఆయింటి యాఁడువాండ్రు చదువుకొనినా చదువుకొనక యుండినా, బత్తిపాటలఁబాడినా బత్తిలేని పాటలఁ బాడినా, దీనికేమివచ్చె. దీనికి మాటల పనట మేల? ఆ మాటలఁ జెప్ప నేల? దానితోఁ దగవులఁ బెట్టుకొ నేల? తుదకు లత యధికప్రసంగియని పేరువహించె."

"తల్లీ! మన లతమ్మయతి నయమైన గొనములఁ గలయది; ఎట్టివానిని దన మాటలతో మెప్పించుగాని నొప్పింపదు; వాదము ముగిసినంతట నొకరి నొకరు గట్టుకొని ముద్దు పెట్టుకొనిరి."

సుబ్బమ్మ నవ్వుచు "లతమాటలలో దిట్ట, చేతలలో జాణ," అనుచు, నింటిలో జనియెను.

ఇందువారమున రాహుకాలము గతించిన పిదప, భద్రయ్య లతకు వరుని బరికించి నిశ్చయించి వచ్చుటకుఁ బయనపడుచు, వీధిగుమ్మమున మంచి శకునములకుఁ గాచియుండె. సేవకుని బిలిచి వీధియందు మంచి శకునములు కనిపించు సమయమును దెలుపునట్లు శాసనంబుచేసె. గడియసేపటికొక జవరాలు తూర్పుముఖముగఁజను దెంచుచుండె. ఈ సమాచారమును సేవకుండయ్యగారి చెవులం బడవేసినంత భద్రయ్యలేచి, తాను తూర్పు

వైపున బోవలసినవాఁడయ్యు శకునమునకుగాను దక్షిణదెసఁబోయి గ్రైదు·వరాలెదుటఁ జనుచు, రెండవ వీధిని గొంతమసలి తాను పోవలసిన మార్గమున బోయెను! సేఁకుండు నవ్వుచు నింటిలోని రాఁగా, "ఎందుకురా, నవ్వుకొనుచు వచ్చుచున్నావు?" అని, సుబ్బమ్మ యడిగెను.

"ఎందుకులేదు, తల్లీ! మన యజమానులువారు తూర్పుదెస బోవలసినవారయ్యు శకునమునకై దక్షిణ దిక్కున జని, రెండవ వీధిని గ్రుప్పుకొని, పోవలసిన దిక్కున బోయిరి; శకునముఁ జూచి పయనమగుట మేలా? లేక, పయనమైనపుఁడు మంచి శకునములఁ గనుట మేలా? ఏది మేలని తెలియక నవ్వితి. తల్లీ;"

"ముందు బయలుదేరినపుఁడు దుశ్శకునముల గాంచి పడినలంపటలఁదలఁచి మంచి శకునములకుఁ గాచుకొని యుండి వెళ్ళిరి. అందువలన బాధకంబేమి?

"బాధకములేదు, తల్లీ! యజమానులువారి యశనములోనకూడిన జాలు."

మఱునాటిసాయంబున భద్రయ్యగారిల్లిగారు సేఁకుఁబిలిచి, "నీవు శశిపురమునకు వెళ్లివచ్చినావట నే నామనుమఁడును మనుమరాలును సుఖమా?" అని, యడిగిరి

"సుఖముగనుండెదరు, అవ్వగారు!"

"నాకు దృష్టితక్కువ; చెవులు చెక్కఁగవినవు. ఏను వెళ్లి వారిఁ జూచి రాఁబోయెదనా? వారిక్షేమమును నీవుచెప్పినగద్దు. అదిగో (పాకశాలతట్టు చేతిని జూపుచు) అదియిష్టముండి చెప్పిన గద్దు; నాకెవ్వరు చెప్పఁబోయెదరు?"

"తమ మనుమండును మనుమరాలును పయనమైనపుడు నాతల్లిగారు తమతోఁ జెప్పలేదా?"

"ఏమోచెప్పె! వారువెళ్ళగనేను చూచినానా? వారునాతోఁ జెప్పి వెళ్లిరా? లతకు వరునివెతకుటకు నాకుమారుఁడుచేట్టాలకడను వెళ్లినాడటనె."

"తమతోఁ జెప్పియే, కద, వెళ్లిరి!"

"వెళ్ళగఁ జూచినానా? (బాసనముం జూపుచు) ఆమె తనభర్త వెళ్లినట్టు నాతోఁ జెప్పలేదు; ముందువెళ్ళియెంతో కష్టపడివచ్చె. ఈసారియైన నతనియతనము చేకూడివచ్చునో, లేక, రాదో! నాకొడుకుకష్టపడుచున్నాడు; బమ్మదానినెత్తిన నేమి వ్రాసియున్నాఁడో!"

"అంతటికిఁ బెద్దవారైయుండి, తామీలాగునఁ జెప్పరాదు, అవ్వగారు!"

"పెద్ద! ఎందునబెద్ద? వయసునబెద్ద; పగటిపూఁట రెండుమెతుకులనేసిన వాటినిదిని యొకమూలఁబడియుండు పెద్ద; రాత్రిపూఁట (పుడిసిలిఁ జూపుచు) యంతపలహారము చేసి మూలఁబడియుండు పెద్ద. నాతో నేదియునది యోచింపదు; ఇంకెంతకాల మీభూమిమీఁదనుండ ఋణమున్నదో యందాఁకనుండి కండ్లుమూసికొనియెద; నాకోడలు నన్నేదియు నడుగకున్న జింతలేదు; నెమ్మదిగ నందఱుండిన జాలు."

"తమకుమారుఁడు తమతో నాలోచించి పోలేదనియాయాసమా?"

"నాకొడుకు నామాటలనా వినఁడు; అదిగో, నాకోడలు నామాటలఁ జెవిలోఁ గూడవేసికొనదు. నాయన్నమనుమండొకఁడు పెండ్లివయస్సునను న్నాఁడు, మనలతనునతనికిచ్చి పెండ్లిచేసికొనవచ్చు; వానికి నీరివలె భూస్థితియు ద్రవ్యమును లేవట; కనుక, వానిని నాకోడలొల్లదు."

"బుచ్చికుండువాని గనిపట్టి యతనికి మీ మనుమరాలి నీయవలెగద?"

"మగవారేలాగైన సంపాదించి, తాముతిని, తమ భార్యలకుఁ బెట్టలేరా? అన్ని సొత్తులను నాపురుషుఁడే సంపాదించె; నాకొడుకేదైనను

సంపాదించెనా? ఇష్టముండిన నాపెనిమిటి సొత్తులోఁ గొంచియమిచ్చి పెండ్లిచేయరాదా?"

"మన లతను గడుపేదకిచ్చి యది కష్టపడిన దానికష్టములఁజూచి మనము సయింతుమా? సంబంధముచేయుటలోఁ జాల యిబ్బందులున్నవి; గొప్పవంశముఁ జేరినవారితో సంబంధముచేసిన, వారికిఁ దగినట్లు మర్యాద చేయవలసి ధనము మిక్కుటముగ వ్యయమగు; బీదలతో సంబంధముచేసిన, వారు మన సహాయమును సదా కోరుచుందురు; కనుక, సరివారితో సంబంధముచేయుటమంచిది."

"బీదలకే కన్యాదానముచేయవలెను; దానిఫలము నీవెఱుఁగుదువా! నాయభిప్రాయమును జెవిన వేసికొనువారులేరు; నాకొడుకొకవేళ వేసికొనినా (మహానసముఁ జూపుచు) యదిగో, నా కోడలు నను దృణమువలెఁ దలఁచి నా మాటల వినవలదని బోధించు." సేవకునియెడ జరిగిన సంభాషణశేషమును వినుచుండిన సుబ్బమ్మ, తన యత్తగారి కడపటిమాటల వినినంతట, "అత్త! ఏను మిమ్ము నెప్పుడైన దృణీకరించితినా? తాము చెప్పుచుండిన మాటలు దమ కుమారుని చెవులఁబడియుఁ బడనట్లుండిరి; తమ మాటలను విని లత బావిలో దూఁకునట్లు చెప్పలేదా?"

(నవ్వుచు) "అదియొక శూర్పనఖ; దాని కేలాటి మగఁడు వచ్చునో!"

"అది యెందుకు శూర్పనఖ? ఏను శూర్పనఖ."

"సరే; అట్టే పెట్టుకొనుము."

"ఱేపు తమ కుమారుఁడు తిరిగివచ్చిన పిమ్మట నామామగారి యాస్తిలో సగమిచ్చి తమ యన్నగారి మనుమనికి నిశ్చయించిన నాకుసమ్మతము. ఏ వాఁడైన నొకరియింటి జెందెగాని బిలిచిరమ్మని చెప్పిన నాకు, తమ యన్నగారి మనుమండు సమ్మతపడఁడా?"

(నవ్వుచు) "వెళ్ళినవాఁడుఁ దిరిగివచ్చిన నేమనుచున్నాఁడో!"

"అవ్వగారు; తమ యన్నగారి మనుమఁడేమి చేయుచున్నాఁడు?" అని, సేవకుఁడడిగెను.

"వారి మొక్క యింటఁ గూడుకుడిచి యాచకముచేసి బడికిజీతమును సంపాదించి చదువుకొనుచున్నాఁడు."

"ఇట్టి బ్రతుకు లతనున్న చెవులఁబడిన నోటివిూఁదను దలమీఁదను మోదుకొని ప్రాణమును విడిచెదనని చెప్పదా?"

"అందుచేతనే నా పురుషుఁడు సంపాదించిపెట్టియుండు స్థితిలో సగమా చిన్నవాని పేరిట దానశాసనము వ్రాసి కన్యాదానముతో భూదానముఁ జేయుమనుచున్నాను; ఈ రెండుదానములఁ జేసిన జెప్పి చేయించిన వారికిని జేసెడి నా కుమారునికిని బుణ్యలోకమే ప్రాప్తంబగు."

"భూస్థితిని నాకూతురిమీఁద వ్రాసిపెట్టవలెగాని దాని మగనిపై వ్రాయఁగూడదు," అని, సుబ్బమ్మ చెప్పెను. రెండుచేతులఁ జెప్పటించుచు, "అదిగో! చూచితివా? నా బంధుగుల గబ్బి సుమంతైన సరిపడదు. వారికొక్క గింజైన నియ్యరాదు."

"స్థితిని వ్రాసిపెట్టినవెనక యతఁడు రెండవపెండ్లి జేసికొని నా కూఁతును గాపాడకుండిన దాముండి కాపాడఁబోయెదరా?"

"దానిమాటలను వింటివా? ఓరి, పంచమి! బాగుగఁ జెవియుమ్మ! నాయన్నమనుమండట్టి దుర్జనుఁడా? నా కొడుకుమీఁద స్థితియుండియు దీనినిగాపాడుచు దీని మాటల నుపదేశములను దలమీఁద వహించుచు నడచుకొనుచుండలేదా?"

"నాకొక్క కూఁతురు; దాని తలవ్రాఁతెట్టిదో! ఏదియో! అది యొకవేళ మనయింట నుండవలసిన విధి యేర్పడిన మనసొత్తులు మనకు మరల లభియించునా"

"ఓరి, పంచమి! దాని యవలక్షణమైన మాటలం జెవిని బెట్టుము! నాయన్న మనుమనిమీఁద నెంతదురద! ఎంతకంటు!"

"తల్లీ! అశుభవార్తలేల? మన లతమ్మకే తక్కువయురాదు."

అత్తగోడంద్రవాద మీలాగున దుద ముట్టినంతటఁ గోడలు కంటి నిండు నీటఁ బెట్టుకొని విచారపడుచుండెను.

రెండవవారము ప్రారంభమున బళ్ళిమోత్తర కకుభంబున శ్వేతజీమూతము లంకురించి నలుదెసలను వ్యాపించుచుండగ, భాస్కరమండలంబు తిరోధానంబయ్యె. అంతట నభ్రంబున ద్వాదశ వర్ణంబులతో శక్రధనుస్సుదయం బయ్యె. కొంతసేపటికిఁ జంచలాన్విత స్తనితంబులతో నీలమేఘమాలలు మేదురంబై ధారాసంపాతలచేఁ దర్షకొనియుండు రసాతలమును తర్పణము చేయుచుండగ, మారుతుండు ముమ్మరముతోఁ బ్రవేశించి వృక్షమూల శాఖములను భిన్నంబుచేసి జలధరంబులఁ జెదరగొట్టెఁ. బటాపంచలైన బలాహకపంక్తులు పర్వతశిఖరంబులఁ నాశ్రయించె. ఊరువంకలాకకులై, 'అమృతవాహిని' పూర్ణంబుగఁ బుష్కరంబుతోఁ బ్రవహింపగ, క్షేత్రాజీవులు దమతమ క్షేత్రములకుఁ దోతముతో ధారేయంబులఁ దోలుకొని కోటీశలాంగంబులఁ గొంపోయి, మళ్ళఁ బదిచాళ్ళు దున్ని, పెంటపలాశలంబులచేత సత్తువచేసి, విత్తనంబుల వెదజల్లిరి. వరుణదేవుని కరుణచేత వసుధమీఁద సస్యఘాసంబులుగల్గి వాటిని భుజియించి చతుష్పాద జీవంబులు నాలుఁగుకాళ్ళ దాటుపాటె; తృణములం దుదయించిన శలభాది క్రిమికీటంబులను భుజించి ఘటకాదిఖగములు వృక్షశాఖలమీఁద వినోదమైన నినాదము చేసె. అట్టి వికిరవారముల కిరవైన యారామగృహారామ మహీరుహంబులకు వృష్టివలన దుష్టిగల్గి శాఖంబులపై నభినవ పల్లవంబు లంకురించె. ఇటువలె సమస్త జీవరాసులు నుత్సాహముతోను సంభ్రమముతోను నుండగ, సుబ్బమ్మమాత్రము దన భర్తరాకుండునను దన ముద్దుకొమరితెకుఁ బతిచిక్కనందునను దుఃఖాక్రాంతయై యుండెను.

మాసాంతంబున భద్రయ్యవిచ్చేసి తనయాగమము లక్షేమను గచ్చేవిచ్చెరయ్యనుచు, సంతప్తహృదయుండై నెత్తిమీఁదఁజేతిఁ బెట్టుకొని

కూర్చుండి యుండెను. సుబ్బమ్మ యమ్మాళించుచు దనయత్తగారు ప్రస్తావించి యలిగినవృత్తాంతమును విజ్ఞాపించెను.

"పెండ్లివలననుచుండు మనలకుఁ దిరిపమెత్తి బ్రతికెడి నాబావగారి కుమారుఁడు వరుఁడన్నసమ్మతపదు నా?" అని, భద్రయ్య యడిగెను.

"తమకళ్ళిమలన్న పీసరవోయినందున దన మేనమామ మనుమని నంగీకరింపవలసినవారమై యుండెదము."

"ఏనుచూచివచ్చిన రెండు, లేకమూఁడుపిల్లకాయలకుఁ బెండ్లియైనట్టున్నది; మనపిల్ల యింగ్లీషు చేదువుకొనుటచేతఁ బెండ్లిచేసికొనుటకు శంకించునటుల పరస్పరముగా మాటాడుకొన్నట్లు వింటెని. ఈమాసంబున ముహూర్తదినములు లేనందున బ్రతికియుండిన, శ్రావణమాసమున నూతనయతనములఁజేసి చూచెదను. లాయర్గారికీ సంగతిఁ దెలిపించి రంగనాథుని పెండ్లి రాఁగల వత్సరమున జరుపవచ్చునని వ్రాసెద. కాలమున వర్షముపడి సుభిక్షమైయున్నయది. అందుగురించియైన దృప్తిచెంది యుండెదము," అని, తల్లి చెంతఁ జని, దానికోడలేమి చెప్పెనని యడిగెను.

"భద్రా! వరుండు కుదిరెనా? లేదా?"

"లేదమ్మ! నేనుద్యమించినవి సమకూడలేదు."

"నీ మేనమామ మనుమండు చెక్కఁగఁ జదువుకొని పరీక్షల నిచ్చుచున్నాడు; ముందునీతోఁ బ్రస్తావించి యుండెద. నీకూఁతు నతనికేల నియ్యరాదు?"

"నీయన్న మనుమనికిఁ జదువున గొఱఁతలేదు; వివాహమునకు, 'స్వజాతి, భిన్నగోత్రం, అన్యరక్తం,' యివి యుండవలెనని లోకులు వాడుకొనియెదరు. క్రొత్తనెత్తుటితో సంబధముచేసిన గుటుంబ వృద్ధియగుటతో జ్ఞానసమృద్ధియుఁ గల్గునట; అందుచేతఁ గొంత సంకోచించెదను."

"అతనికి స్థితిలేదని సంకోచించెదవని తోఁచుచున్నది."

"అమ్మా! లత తనకు పెండ్లి యక్కఱలేదనుచున్నందున నేలాటి స్థితియులేక యాచక వృత్తినుండు పిల్లగాని దాసికేలాగున మనసొప్పి యిచ్చి పెండ్లిచేయుదు?"

"భద్రా! నీవేమి సంపాదించి పెట్టితివి? నీతండ్రిస్థితిలోఁ గొంతనిచ్చి పెండ్లిచేయరాదా?"

"స్థితినిచ్చుట కభ్యంతరములేదు; ఆఁడుబిడ్డయైననేమి! అది మనకడుపులోఁ బుట్టలేదా? నెత్తురు సంబంధముఁగలచోటఁ బిల్లనిచ్చి పెండ్లిచేయుట యనుచిత మనెదరు."

"మన సమీపబంధుగులలో నిచ్చి పుచ్చుకొన్న మనసంసారపుగుట్టు బయటపడక మనకుటుంబమున హెచ్చుతక్కువ లుండునేని వాటిని సరిచేసికొని యన్యోన్యముగ నుందురు."

"ఒక నెత్తుటితో సంబంధము చేసికొనిన కుటుంబవృద్ధికి విరుద్ధము గల్గుట గాక మనకుటుంబస్థుల న్యూనతలు నిత్యత్వముఁ బొందునని లోకులు వక్కాణించెదరు."

"మన పెద్దలీవఱకు మన రక్తముతో సంబంధము చేసికొనుచు రాలేదా?"

"తమస్థితి యన్యరక్తముం జేరినవారికి లభియింపగూడదని యాలాగున జేయుచు వచ్చెదరు."

"నీవేల చేయవు?"

"ఏను ద్రవ్యలోలుఁడను గాను; నేనిచ్చు ద్రవ్యమును స్థితియు నా పరంపరకే, నా యుత్తరాధికారులకే రావలెనని నామదినలేదు."

"సొత్తులను లత పేరట వ్రాసిపెట్టవలెగాని దానిపురుషుని పేరిట వ్రాసి పెట్టరాదని నీభార్య చెప్పె."

"సొత్తులు మరల మనకు రావలెనను భావముతోఁ జెప్పినమాటలు గావు; లతను నుపేక్షయు నుదాసీనయు జేసిన నదియేలాగున బ్రతుకునని చెప్పిన మాటలు, కాఁబోలు."

"నీవు చెప్పినంతే చెప్పి చాలించియుండిన చింతలేదు. తలవ్రాఁత యుండి లత మనయింట నుండవలసిన విధియేర్పడిన, మనసొత్తులు మనకు లభియించునా? నీవు మనియుండి కాపాడఁ బోయెదవా? అని, యడిగెను."

"దానిమాటలఁ గొంత యోచింపఁ బనిలేదా?

(కోపముతో) "ఆలుమగండ్రద్దముసరే! ఏకవ్రతము నేకాభిప్రాయముఁ గొన్నవారే!

"కోపమేల?"

"నాయన్న మనుమం డుదాసీనము చేయునని మీరిరువు రెందుకు సంశయించుచున్నారు? నీవు నన్నుగాని నామాటలఁగాని లక్ష్యపెట్టవు. నీ భార్యమాటలను శిరస్సుమీద వహించి నడుచుకొనలేదా? నాయన్న మనుమం డంతటి దుర్జనుఁడా? వాఁడు చావవలెను; మీరెచ్చెడి సొత్తులు మఱల మీకు రావలెను; ఈలాటి దుర్బుద్ధిఁగల్గినవారి సొత్తు లక్కఱలేదు; సంబంధము నక్కఱలేదు. నీకూఁతు నతని కీయనందున పెండ్లిలేక యుండఁబోయెదడా? చూతము."

"అమ్మా! నీవు కోపగిల్లవలదు; మనస్తాప పడఁబోకుము. నీయిష్టానుసారము నా బావగారి కుమారునికే లతనిచ్చెద. నాపిత్రార్జితమున నర్థభాగమును లత పేరిట దానపత్రము వ్రాసెద; శ్రావణమాసము పుట్టినతోడుతో నామనోభిష్టమును నీకోరికయు నాబావగారికిఁ దెలిపెద."

---

13 వ, అధ్యాయము.

లత జంబయ్యల వాదము; రంగనాథుఁడు గృహస్థుఁడగుట.

లాయర్ జంబయ్యగారు తనకడపటి కూఁతు నుద్వాహసన్నాహములను బూర్వమే నాయత్తపఱచి భద్రయ్యగారి జాబును నిరీక్షించుచుం

డెను. మాసాంతమున నొక్కముహూర్తమే యున్నట్లు భద్రయ్యగారితో సమక్షమున విజ్ఞాపించియు నతఁడు జాబు వ్రాయకుండినందున నాయాసపడుచుండెను. ముహూర్తదినము రెండుదినములుండగ, రంగనాథుని బిలిచి, "నీతండ్రిగారు జాబు వ్రాయకపోయిరి. నేనిప్పుడే వివాహము జేరుపకుండిన రెండువేల రూపాయలనిచ్చి కొనియుండు సామగ్రులు వ్యర్థమగు. చంపకను నీకిచ్చి పెండ్లిచేయుటతనికి సమ్మతమని నీతండ్రిగారు సముఖమున జెప్పివెళ్ళిరి. మూఁడవనాఁడుదక్క వేఱు ముహూర్తదినములు లేనందున నీతండ్రిగారు వచ్చినా, రాకుండినా ముహూర్తమును జరుప నిశ్చయించితి," అనగ, రంగనాథుఁడు తలను వంచుకొని యూరక నిలువబడి యుండెను. పక్కననుండిన లతాంగి, "తాము బాగుగఁ జదివి న్యాయములఁ బరిశీలించెడివారై యుండి మాకుఁ దల్లిదండ్రులుండగ వారికిఁ దెలియఁజేయక, తాము పెండ్లిజరిగించుట యుక్తముగాదు," అనెను.

"మఱి? వేఱేముహూర్తములేదే!"

"నా యన్నగారికి యుక్తవయస్సు వచ్చియుండిన జింతలేదు; వ్యవహారదశరాకమునుపు, తనంత పెండ్లిచేసికొనదగునా? అట్లుచేసికొనుట చట్టన్యాయములకు బద్ధమో, లేక, విరుద్ధమో, నాకు తెలియదు; చట్టము లోకతట్టుండినను లోకసమ్మతమై యుండవలదా?"

"నీవు వయస్సున జిన్నదైనను బుద్ధిన బెద్దదైయుండు విషయము నాకుఁ జాలసంతోషకరముగ నున్నది; నేనిపుడు పెండ్లి జరుపకుండిన భరింపలేని నష్టము సంభవించెల్లు. మాతోసంబంధము చేసికొనుటకు నీతల్లికిని దండ్రికిని సమ్మతమని నీయప్పగారు మనవియెనుట చెప్పియుండు విషయము నీకుఁ దెలియనిది కాదు. వివాహమహోత్సవమును వారు చెంతనుండిచూచి యానందపడవలసిన వారనుటకు సందియములేదు. నీ తండ్రిగారి మాటలనమ్మి చంపకకు వేఱొక్కడను బతిని వెతకినవాఁడనుగాను. దానికి పెండ్లిచేయవలసిన

యుక్తమైనప్రాయము వచ్చియుండుటచేత ముహూర్తమును త్రోసిపెట్టలేక యీపటి ముహూర్తమున పెండ్లిని జరుపవలసినవాఁడను."

"పెండ్లియనిన నొక్కదినముతోఁ బోయెడివిషయము గాదు; కలకాలము వారేకీభవించి యుండవలసిన విషయముగనున్నయది; పెండియు నిరువురికి నుత్తరవాదమేర్పడుచున్నది. లోకమున నవసరపడి పెండ్లిచేసికొని పిదప యొకరికొకరు సరిపడక నెత్తిన జేయిఁబెట్టుకొని చింతపడువారెందఱో యుండెదరు. అవసరపడనేల? వెంటనే జింతలఁ బెట్టుకొననేల? ఆత్రపడనేల? ఆర్తిపడనేల? భార్యాభర్తలొకరియెడనొకరు నడుచుకొనవలసిన ధర్మవిధిక్రమములగణనీయంబై యున్నవి. పెండ్లియనిన భార్యాభర్తల మీఁద గొప్పమూట నెక్కించుటవలె జవాబుదారితన మెక్కువ యగుచున్నది. తమవంటి యనుభవశాలులును వివేకులుగూడా విచారించి చేయవలసిన కార్యమైయుండగ, మాక్షేమలాభములఁ గోరుచు మాకు బుద్ధిమతులఁ జెప్పి మమ్ముఁబోషించుచువచ్చిన మాతల్లిదండ్రులులేక నాయన్నగారికి నెంత మాత్రముఁ బెండ్లిచేయఁగూడదు"

"నీవివేకముఁ జాలమెచ్చుకొనియెద; నీతండ్రిమాటలను విని విప్రలబ్ధుండైతి."

"నావివాహమును నిశ్చయించినవెనుక నాయన్నగారి వివాహముహూర్తమును నిశ్చయముచేయవలెనని చెప్పిరి గద?"

"ఔ."

"అట్లుండగ మిమ్మునెటుల నమ్మించి మోసపుచ్చిరి?"

"నాకూఁతురు పుష్పవతియైనపిదప నెవ్వండైన వివాహముచేసికొనునా? అది కులమునుండి నిగ్రహము కాదా?"

"ఏదుకుచేసికొనరాదు? ఋతుమైనకన్యను కులమునుండి నిగ్రహించుటకు నేశాస్త్రమున నేవిధియేర్పడి యున్నది?"

"శాస్త్రవిధియుండినా లేకుండినా యాచారవిధిననుసరింపవలదా?"

"మనతాతముత్తాతల కాలములో నాచరించివచ్చిన యాచారములలో నెన్నిటినో యున్నాళ్లముగా వర్జించియుండగ నీదురాచారము నేల యనుసరించుచే రావలెను? అడిగెడువారు లేనందుననా? లేక, యడుగవలసిన వారు నావలెఁ బసివారై యుండుటచేతనా?"

"ఏను జవాబుచెప్పలేను; నీతండ్రిగారు పెండ్లికొడంబడినందునను, నాకపరిమితమైన నష్టము లభియింపకుండుటకును, చంపకమంచిప్రాయమున నుండుటచేతను, నేను మూఁడవనాఁడే సుముహూర్తమున బెండ్లిజరుప నిశ్చయించితి. నీతండ్రిగారికి నేటికే తపాలుద్వారా వివాహముహూర్త పత్రికఁ బంపెద; నీవు చింతపడకయు నలుగకయుఁ బ్రక్కననుండి నీతల్లి దండ్రులకు బదులుగ నానందముఁ బొందుము."

"'దైవాధీనం జగత్సర్వం', అన్నట్లు భగవదాజ్ఞ యాలాగుండిన నాలాగే జరుగు. నేనేదో తెలిసితెలియక మీమనంబును నొప్పించియుండిన మాకుఁ దత్కాలమున బితృసన్నిభులైయుండు తాము, క్షమింపగోరి యొఱఁ గెద."

"నీమాటలకు మెచ్చుకొంటిగాని నొచ్చుకొనలేదు." ఈముచ్చటలను వినుచుండిన జంబయ్యగారి మొదటినాలుఁగు కూతుండ్రు తమ ముక్కుమీఁద వెట్టినవ్రేలిని గ్రిందికి దీయకయుండిరి. వారితల్లినవ్వుచు సమీపించి, "తాము వకీలుద్యోగముచేయుచు నెంతోవాదముచేసి న్యాయాధిపతులను మెప్పించి యొప్పుఁజేయుచున్నారు; తుదకు పసిదియైన లతమ్మకు సరియైన జవాబు నీఁజాలకపోతిరి," అని, నవ్వెను.

"లతమ్మ బిడ్డయైనను ప్రాజ్ఞ గద? అద్ది చెప్పిన యంశములలో నొక్కటైనా న్యాయవిరుద్ధముగాదు. దానిమాటలు శ్లాఘనీయములుగాని నిరసింప దగినవి కావు," అనుచు, జంబయ్య గుమస్తాను బిలిచి యచ్చుకూటమునకు వెళ్లి ముహూర్తపత్రికల నచ్చువేయించి తెమ్మని యాజ్ఞాపించె. మఱియుఁ

దనయింటి ముందటఁ బందిలివేయించి, తోరణంబులఁ గట్టించి, పందిటిని జాలరులతో నలంకరింపఁజేసెను.

మఱుసటి దినము ముహూర్త పత్రికలలో నొక్కటిని భద్రయ్యగారి పైవిలాసమునకును గొన్నిటిని సమీప బంధువులకును దపాలుద్వారా పంపి, మిగిలిన వాటిని బురములోఁగల మిత్రవర్గములకుఁ బంపెను. పెండ్లిసమాచారము బహు బంధుజనులకు దెలియకుండినందున బంధువర్గమును బ్రాహ్మణ్యమును దక్కువగా యుండినను మిత్రవర్గ మగణనీయంబై యుండెను.

ఉదయంబున లగ్నవేళకు బూర్వము వధూవరులకు విశేషనాభ్యఁజనము లైనంతట ముద్దుగుమ్మలు చంపకవల్లికి భూషణంబులఁ దొడుగ నారంభించిరి. చంపకవల్లి మస్తకంబున జూడామణితోను, లలాటంబున లలాటికతోను, కంధరంబున మౌక్తిక విద్రుమ సరంబులతోను గనకగ్రైవేయకంబుతోను హేమలంబనములతోను, కరంబులందు విచిత్రమైన కటకాది కర్బుర భూషణంబులతోను, కటిప్రదేశమున గాంచనకాంచితోను, ఘుటికాయుగంబులందు శ్వేతహంసకంబులతోను గింకిణీయుత మంజీరంబులతోను నలంకరింపబడి, దామాదులచే మండితంబైన ధమ్మిల్లంబుతోను, కాశీకౌశేయంబును 'చీనా' పట్టు చోలంబును ధరించి, వస్త్రభూషణంబుల మర్మర శింజితములతో నవనత వదనయై, మంగళవాద్యంబులు ఘోషించుచుండగ మందగమనంబున జనుదెంచి, పరిణయ పీఠంబుమీఁదఁ గటంబున రంగనాథునికిఁ బ్రక్కన గూర్చుండె. రంగనాథుఁడు సిగలోఁ బువ్వముఁ జొట్టుకొని మెడనిండు బూలసరములఁ దగిలించుకొని, నూతన వస్త్రధారుండై శాస్త్రోక్తంబుగ నగ్నిహోత్రుని సాక్ష్యంబుకొని, చంపకవల్లిని బరిణయము చేసికొని, మంగళ సూత్రధారిణిగఁ జేసెను.

పరిణయోత్సవమున రజతకలశములును, పాన భోజన పాత్రలును, స్నానాదులకువలసిన తామ్రమణికమును, పాకాదులకు రీతి పాత్రలును శ్వశురుండు ప్రతిపాదనముగ నిచ్చెను. వివాహమహోత్సవంబును దర్శింప వచ్చియుఁ

డిన జంబయ్యగారి కక్షివాండ్రు నాలుగు వందల రూపాయలును నేబది పట్టుకోకలునుఁ బదిదోవతి జతలును జదివించిరి.

భోజన కాలమున భక్తంబున కనుగుణముగ సూపమును, సుకర్దక ప్రణీతంబై ప్రశస్తంబైన మోదక ఫలసాంబారును, రసగంధములతోఁ బ్రశస్తంబు చేసిన రసమును, చాతుర్విధ తేమనములును శాకపాకములును, ద్రాక్ష చంద్ర బాలకుంకుమాది వస్తువులచే భావితంబైన పరమాన్నమును ఘృతంబునఁ బక్వము చేయఁబడి వాసితంబైన మధురభక్ష్యములును, పనసరసాల దాడిమ కదలీ కమలా చీనీ ఫలములును దండిగ వడ్డింపబడగ నట్టి మృష్టాన్నమును యథేప్సితముగ బ్రాహ్మణులు భుజియించి, వారిచేఁ బాఱవేయబడ్డ భక్ష్యాదులను వీధికి వెలుపటఁ గాచియుండిన యుచ్ఛిష్టభోక్తలు గుక్షి నిండుగ భక్షించి సంతృప్తులైరి.

సాయంత్రమున సమాలంభ కాలమున వేడుకార్థమై పెండ్లికూఁతు రలిగిపోయినంతట ముగుదలొక్కటిచేరి రంగనాథుఁడు పాటపాడి పెండ్లికూఁతురికి దమలమిచ్చి నలుగుకుఁ బిలువవలెననిరి. అతనికి పాటరాదని చెప్పియుఁ జెలియలు చెవినవేసికొనక రంగనాథునికి బదులుగ లతాంగియైనా పాడవలెనని చెప్పిరి. లతాంగి తనకే పాటయు రాదని చెప్పియు వినకతుద కొక సీసపద్యంబైన జెప్పవలెనని పడఁతులు పంతముపట్టిరి. లతాంగి తనకు భంగపడువేళ వచ్చెనని మదిన దలపోయుచు, "ఏపాటను నేను నేర్చిన దాననుగాను, నాకు కవిత్వమును రాదు; అయినను నేను పూజించుచుండు శ్రీరాములువారి పాదపద్మముల మీఁద భారమువేసి నాకుఁ దోఁచినట్లొక సీసపద్యముఁ జెప్పెద. నను మరల పాడుమనితొందర పెట్టకుఁడీ, తల్లులార!" అనుచు నందఱిని మ్రొక్కి దిగువవ్రాసినట్లు సీసపద్యముఁ జెప్పె.

సీ. తీర్థయాత్రేల? క్షేత్రియవాసమేల? శ్రీరామచంద్రుని పాదరంజకులకు
గుడిగోపురములేల? గురురాజవరులేల? సీతాపతిని మ్రొక్కు శిరవహులకు
దానధర్మములేల? తపమేల? జపమేల? దాశరథిన్మ్రొక్కు ధార్మికులకు
నిత్యవ్రతంబేల? నియమనిష్టలునేల దశకంఠసంహారి దాసులకును

తే. తొలియుఁ జేసిన పాపము దొలఁగిపోవు
మెండుగ యణిమాదులఁ జెంది మేలుగాంత్రు
పుత్రపౌత్రకలిమిఁ జేరుఁ బుష్కలముగ
రామనామ మహిమల నారయుదరంబె.

శైలియుఁ బాకమును శ్లాఘ్యమని చెప్పలేకుండినను శ్రీరాములయందు భక్తిగలందుకు నందఱు సంతసించిరి.

రాత్రిపూఁట బంధుమిత్ర వర్గంబులు విందు భోజనము చేసిన తరువాత, జంబయ్యగారి స్వగమనరథమును జంపకజాజిమల్లె మల్లెలతో నలంకరించి, యారథంబున బుష్పదామాభిశోభితులై యుండిన వధూవరులఁ గూర్చుండఁబెట్టి డమరుపటహంబులు శబ్దించుచుండఁగ, వెండినాగస్వరాది ముఖవాద్యముల క్వణముతోను, 'మతాబు' 'బిరుసు' మొదలగు బాణవేడుకలతోను నూరేగింపు పోవుచుండగ నర్తకి యొకతుకనర్తనము చేయుచు భరతనాట్యము సలిపె. లతాంగి లాసికా లాస్యములఁగని స్త్రీల నిట్టి దుర్వృత్తిన బ్రోత్సాహపఱచు పురుషులను మనమున దిరస్కరించుచుండె నాట్యకర్త యంగవిక్షేపము చేసి, హస్తవిన్యాసముల చేతను జెయికనుల సంజ్ఞలచేతను, దెలుపుచుండిన యర్థభావములను నెఱుఁగుకొని సహింపక లజ్జపడి, తలనొప్పియని సాకుచెప్పి, తనయింటికి మరలి, శయ్యపైగూర్చుండి, మందాక్షము లేక భరతనాట్యము చేయుట స్త్రీజాతికిఁ గళంకమనియు స్త్రీకులమున కపవాదమనియు శోకముతోఁ దలపోయుచుండె.

అయిదు గడియలకంత నూరేగింపు మరలి వచ్చినంతట, లతాంగి యొద్దకు జంబయ్య భార్యాసమేతుండై వచ్చి తలనొప్పి యేలాగున్నదని విచారించుచుండగ, జంబయ్య భార్య తాను తెచ్చిన 'అమృతాంజనము' లోఁ గొంత లతాంగి కణతమీఁద రుద్దెను. "ఇదేమి విధివశము?" అని, లతాంగి మనసున దలఁచి, తలనొప్పి తీసిపోయెననుచు స్మితముఖియై వియ్యంకులతోఁ బెండ్లి యింటికి జనియె. ఉదయమున క్రొత్తమాసము పుట్టుచున్నదను భావముచేత

దెల్లవాఱుటకు మునుపు జాయాపతులకు నాగవల్లియుఁ గంకణవిసర్జనమును జరిగెను.

వివాహంబైన రెండువారముల వఱకు లతయు రంగనాథుఁడును జంబయ్యయింటనుండి, మూఁడవ వారమున మూఁడవనాటి యుదయంబున దాము వాసముచేయ నుంచిన చోటికిఁ జనిరి. రంగనాథుఁడు తన యప్పయమ్మలు లేక పెండ్లి చేసికొనినందుకు సిగ్గుపడి తండ్రికి జాబు వ్రాయుటను వదలుకొనెను. ఆనాటినుండి యతనికి విద్యయందాసక్తియును, దగ్గుచువచ్చెను. లతాంగి, పెండ్లికిఁ బూర్వమునను బెండ్లిసమయమునను జరిగిన వృత్తాంతములను దనయాక్షేపణల సహితముగ వ్రాసి, తండ్రికిఁ బంపి, యటుపిమ్మటఁ గూడా జాబులు వ్రాయుచునుండెను.

---

14 వ, అధ్యాయము.

రంగనాథుని పెండ్లిసమాచారముఁ దెలిసి, భద్రయ్య కోపతాపములు బడుట; లతాంగిని శ్రీకృష్ణమూర్తి కిచ్చునట్లు తీర్మానించి శశిపురమునకు వెళ్ళుట.

“ఓసి, సుబ్బి! ఈ పెండ్లిజాబుఁ జూచితివే? నిన్నటిరోజున మనరంగనాథునికిఁ బెండ్లియట! నేఁడు ముహూర్తజాబు వచ్చె; లాయర్ జంబయ్య యెంతటి కొడ్డమనిషి! కనుగొంటివా?”

సుబ్బమ్మ చెప్పటించుచు, “ఇదేమివింత! మన మిరువురమును లేక మన యనుమతియు లేక యేలాగున నతఁడు పెండ్లిచేసె?”

“బిడ్డల నతనివశమున నొప్పగించి వచ్చినందుకు నాకు మంచిప్రాయశ్చిత్తముచేసె! నన్నిట్లగౌరవించినందుకుఁ బ్రతిశాంతిఁ జేయక విడలను.”

“మన చిన్నవాఁడెట్లు సమ్మతించె? మహాచమత్కారిణియైన లత యొట్టూరకుండె?

“పసివాండ్రేమి చేయఁగలరు? పెద్దయని పేరొందిన జంబయ్య మన చిన్నవాని నిచ్చి పీటపైఁగూర్చుండఁబెట్టిన నతండైన లతయైన నేమి చేయఁగలరు?”

“మనకొక్క కొడుకు; వానికిఁ బెండ్లియైనందుకుఁ జింతపడనేల! సంతోషపడుదము.”

“రంగనాథునికి వ్యవహారదశ రాకయు నాయనుమతిలేకయుఁ జేసిన పెండ్లి చట్టప్రకారము చెల్లదని నేటికి లిఖితమూలముగఁ దెలిపించి వస్తుమునకు వ్యాజ్యముచేయ సిద్ధముగ నున్నట్లు లాయర్గారికి జాబువ్రాసి పంపెద.”

“దయచేసి యాలాగున వ్రాయకుఁడు! చంపకతోఁ గాపురము చేయక మఱియెవ్వరితో మనచిన్నవాఁడు కాపురముచేయుదుఁడు?”

“ఇంకొక పిల్లఁగట్టియిచ్చెద.”

“లోకమున నొక్కభార్యనుభరింపలేకుండెదరు; ఇరువురినెట్లు సమర్థింపఁగును? ఇద్దఱు పెండ్లములమధ్య మనచిన్నవాఁడు పరిభవముఁ బడనేల?

“ఇరువురెందుకు? చంపకను బొత్తిగవదలుకొనవలసినవాఁడే.”

“కటకట! ఆపాపము మనకేల? చంపకయు నొకబిడ్డే, కద? అది చేసిన యపరాధమేమి?”

“తల్లిదండ్రులు చేసిన సుకృత దుష్కృతముల ఫలములను బిడ్డలు గొంతమట్టుకు జెంపవలసినవారే.”

“చంపకతల్లినిఁ బరిత్యజించిన లాయర్గారికిఁ బుత్రికాశోకముఁ గల్గి యతని వెతలునుశోకమును మనబిడ్డల బాధింపవా?”

“ఆయన చేసిన యకృత్యము నీకు సమ్మతమా?”

“సమ్మతమని యెవతె చెప్పును? ప్రాప్తమును విధియును నుండినందున నాలాగున జరిగెను. ప్రథమమున మనకాలము దుష్కాలముగనున్నయది; మనలతకు బెండ్లినిశ్చయము గాకపోయినను మనసుతుని పెండ్లియైనఁ జూచి యానందించే భాగ్యము నిచ్చిపెట్టుకొనక పోతిమి. చంపకవల్లి యిది

మొదలు మనసొమ్మే. వారిరువురి నొకనాఁడు దోడ్కొనివచ్చిన, మన యింటఁ బందుగఁజేసి, నలుఁగుపెట్టించి, దానియైన మనకనులారఁ జూచి యానందపడుదుము."

"వకీలుగనుండి యెంతసాహసమైనపనిఁజేసె; చూచితివా?"

"వకీలైయుండుటచేతనే మీఁరువురులేక తెగువతోఁ బెండ్లిచేసిరి, చాలు!" అని, సేవకుండు చెప్పెను.

"లతనుగుఱించి మనముపడు మనోవేదనలవలె, చంపకనుగుఱించి వకీలుగారెంతచింతగల్గియుండిరో! అతని వశమున వరుండుండినందున గట్టములేక పెండ్లిచేసె. ఒంటి జెందెగాఁడెవ్వండైన నగపడిన నతనికి లతను నిచ్చి పెండ్లిచేయసిద్ధమైయుండిన మనకు, మనస్వాధీనమున నొకవరుండుండిన మనము నాలాగే చేసియుందుము. మనదురదృష్టముచేత మనస్వాధీనమున నొకవరుండు లేకపోయె," అని, నవ్వెను.

"ఆవకీలెంతటి మహానుభావుఁడు! ముహూర్తపత్రికఁదక్క వేఱుజాబు వ్రాయఁడు."

"ఔను, లేక, మఱునాఁడు, మన బిడ్డలయొద్దనుండియు నతనియొద్ద నుండియుఁ దప్పక జాబులువచ్చెను. తాము చింతపడవలదు," అనుచుండగ బల్లిపల్కెను.

"అదిగో! అగ్నిమూలలో బల్లిపల్కుచున్నది. బంధులాభము గల్గెనని సూచన దెలియఁజేయుచున్నది. పెండ్లి నిశ్చయముగ జరిగిపోయెననియుఁ గోడలు వచ్చినది బంధులాభమనియు బల్లిశకునవాక్కిచ్చుచున్నది," అని, నవ్వుచు, "ఈశుభసమాచారము నేటికి తెలిసినందున మన యింటి వాకిటిముందఱ దోరణములఁగట్టి శుభాంకముగ ముగ్గువెట్టవలెను," అనుచు, సుబ్బమ్మ వీధికిఁజని గోమయముతో వీధిని శుద్ధపఱచి ముగ్గులువెట్టెను. ధ-పంచమి మామిడిగుత్తులఁదెచ్చి తోరణంబులచే వీధినలంకరించెను. భద్రయ్య తన తల్లిచెంతఁజని, ప్రక్కనగూర్చుండి, "అమ్మా! నీమనుమడు, రంగనాధునికి

నిన్నటిదినమున శశిపురమున లాయర్ జంబయ్యగారి కూఁతునునిచ్చి పెండ్లి జరిగెనట! నేఁడు ముహూర్తజాబువచ్చెను," అనగ నతనితల్లి చేతులఁడట్టుచు, "ఇది కలికాలము; తల్లిదండ్రులుండియు వారును లేకవారి యనుమతియు లేక పెండ్లిజరిగెను. నీవైన నీభార్యయైన పెండ్లిఁ జూచుటకిచ్చిపెట్టుకొనలేదు. నామాటలఁ ద్రోయకుండిన మీకీయిచ్చకు వచ్చియుండదు. లాయర్గారి బిడ్డపెండ్లి కీడైయుండియుండు; అందుచేతఁ ద్వరపడి పెండ్లిచేసి మానముఁ గాపాడుకొనెను. పెద్దలమాటల విననివారికి బన్నమేప్రాప్తంబగు; నీవు లతపెండ్లికి జాగుచేసిన నది రెండునెలలలో సమర్తాడి దానినెవ్వఁడుఁ బెండ్లి చేసికొనక నలుఁగురు నినుఁజీకొట్టుదురు; అపుడు నీకీర్తియు నీతండ్రికీర్తియు సంద్రములోఁ గల్పిన యింగువవలె వమ్మైవోవును."

"నాయనుజ్ఞయు సమ్మతియులేక పెండ్లిచేసినందున పెండ్లిని రద్దుసేయ దావాచేయ బోయెదనమ్మా."

"అయిన పెండ్లియైనదే; దానినేలాగున రద్దుచేయుదువు? నీవుగాని న్యాయాధిపతులుగాని పెండ్లిరద్దని తీర్మానించిన మాత్రము నగ్నిసాక్షిగఁ జేసికొన్న పెండ్లి రద్దుకానేరదు; అయినను, మనరంగనాధుని చంపకతోఁ గాపురము చేయకుండునట్లు చేయనగు; మనమట్టి కలుషంబునకు లోఁబడనేల? దంపతులను వేఱుపఱచిన లోకనిందకును చంపక తల్లిదండ్రుల శాపమునకును బాత్రులగుదుము; అట్టి యప్రతిష్ఠమనకేల? పెండ్లిఖర్చులులేక నీయింటికిఁ గోడలువచ్చినందుకు సంతోషపడుము. లతకు నాలాగైన మేలు. ఏవిధమైనా లతమెడలో దారమెక్కిన చాలు."

"అమ్మా! నీకు కొదవవలదు; నీమాటల నవమదించునట్లు తలపవలదు. శుభకార్యములు భగవదాజ్ఞ ప్రకారమును పెద్దల మనోభీష్టమువలెను జరుగును; నామేనమామ మనుమండైన చిరంజీవి కృష్ణమూర్తికే లతను నిచ్చి పెండ్లిచేసెద."

(నవ్వుచు) "కృష్ణమూర్తి కేమి సొట్ట? కృష్ణవిగ్రహమువలె నున్నాఁడు."

(నవ్వుచు) "అలాగే చేసెదనమ్మ!"

ఈసంభాషణము జరిగిన నాల్గవనాఁడు జంబయ్యయొద్ద నుండియు లతాంగియొద్ద నుండియు జాబులువచ్చెను. ప్రథమమునలత జాబును జదువనారంభించెను. అపుడు, సుబ్బమ్మ యెదుటవచ్చి నిలబడెను. లత చేసిన యాక్షేపణలను సంతోషముతోఁ జదివెను. అటుపిమ్మట జంబయ్యగారి జాబును జదువనారంభించెను.

"అతి వివేకియైన తమ ముద్దుకూఁతురు, లతమ్మ చేసిన యాక్షేపణలకుఁ దగిన సమాధానముఁ జెప్పలేకపోతిని. అట్టి వివేకికిఁ దండ్రిగారైన తమవంటి ప్రజ్ఞావంతుల కేమిసమాధానముఁ జెప్పఁగలను? భగవంతుని కారోపించు 'క్షమ,' 'శాంతి' యిత్యాది సుగుణగణంబులు దమయందుఁ బెంపారుచుండుట నావంటి సేవకును నక్కినవారికిని దెల్లంబు. తమయనుజ్ఞలేక పెండ్లిచేసినందుకుఁ దమవంటి మహనీయులు దమయథాగుణములతో నను మన్నించి కాపాడుదురని తమపాదాబ్జంబులకు నెఱఁగెదను," అని, దిగువనుండిన ప్రార్థనను బలముగాఁ జదివినపుడు ధ-పంచమి పండ్లు నిగిలించెను; సుబ్బమ్మ సమాళించెను; భద్రయ్యగారి కోపతాపంబులు ద్విగుణంబయ్యెను.

శ్రావణ మాసంబున లత పరునింగూర్చి రెండుచోట్లనుండి బదులుకాగితములు వచ్చెను. భద్రయ్యతనసతిని బిలిచి రెండు బదులుజాబులు వచ్చినట్లు చెప్పి, మొదటిజాబునుండి దిగువఁజెప్పెడి సమాచారముల జదివెను.

"పిల్ల యింగ్లీషు జదువుకొనుటచేత మాయభిప్రాయము తక్కువగ నుండినను నాలుఁగువేల రూపాయలిచ్చి యుభయుల పెండ్లి సెలవులఁ దామే భరించిన గొంతయాలోచింపనగును; వెంటనే బదులు వ్రాయకుండిన దమకు సమ్మతము లేదను కొనెదను."

"పిల్లను శశిపురమునుండి రప్పించి మీ యింటఁబెట్టుకొని పెండ్లికి పిమ్మటఁగూడా చదువును జాలించి, పెండ్లిసెలవులకును జదువు సెలవులకు

ను మూఁడువేల రూపాయలిచ్చి యల్లుని చెవులకు రవయంటి పోగులను జేతికిబంగారు గాజులు గొలుసులును, వ్రేళ్లకు రవయుంగరములుబెట్టి వెండిపంచపాత్ర, వెండిచెంబు, వెండితట్టలు, వీటిని నిచ్చి పెండ్లిచేసికొనుట కిష్టంబైన నొక్కవారములోఁ దెలిపించిన, నేను తమయింటికివచ్చి లగ్నపత్రిక దీసికొనుదును," అని, రెండవ జాబునుండి భద్రయ్య చదివెను.

"ఏమె, సుబ్బి! రెండు జాబుల జదువ విన్నావుగద, నీయభిప్రాయమేమి?"

"సంపకకైన తెలుంగున మనలత పెండ్లి నొకదినమున ముగింతము."

"అట్లు కారాదట. వాడుకపద్ధతికి నాలుఁగు దినముల పెండ్లియు నైదవనాటి విందును జేయవలెనట. ద్రావిడ దేశమున విత్తమున మిత్తుకొన్న వారిలోఁ గొందఱు విశేష ద్రవ్యమును ఖర్చుచేసి, బహువిధదానములనిచ్చి యల్లుండ్రను గొనుచుండువారని వదంతివిని యుండెదను; జామాత యెంత గొప్ప పరీక్షలనిచ్చి యున్నాఁడో యంతకంత ద్రవ్యముఁబోసి వరులను గొనుచున్నారట; అట్టి దుర్వాడుకలచేత వేలకొలఁది వంశస్థులు, తాముఁ దమ పెద్దలు గడియించి పెట్టిన ద్రవ్యమునంతయుఁ బోగొట్టుకొని యాచక వృత్తి ననుసరించెదరట! కొందఱు పెండ్లికనంతరము బ్రతుకలేక మెడకు నురి వేసికొని మడిసిరట! విపరీతకాలమునకే యిట్టి స్వవినాశ దురాచారములును దుర్వాడుకలును మనయాంధ్రదేశమున గూడా యంటురోగములవలె నంటుచువచ్చుచున్నవి. ఒక్క జామాతను సంపాదించుటకు గంపెడు కాసులు గావలెనన్న నాలుఁగైదు కూతుండ్రఁగన్నవారు నాలుఁగు వివాహముల జరిపిన పిమ్మట వారికొంపలే స్థితినుండు! స్త్రీప్రజలవల్ల నెన్ని సంగడములు దుర్దశలఁ బొందియుఁ బొందుచు నున్నవో గణనకుఁ దెలియదు. ఇట్టి దురవస్థలనుండి తప్పించుమార్గముఁ గనిపట్టు ధర్మాత్ములేవారునులేర?"

"ఒక్క వింత సమాచారము, బాబు! మనవిచేసెద, చిత్తగింపుడు," అని, ధ-పంచమి చెప్పెను.

"ఏమి సమాచారము"? అని భద్రయ్య యడిగెను,"

"ఒక్క బీద బాపనుండు, తన కొమరితెకు వరుండెక్కడఁ జిక్కక మిఠాయి యంగడిలోఁ బరిచర్యచేయుచుండిన బాలునిగని తనకూఁతుఁ బెండ్లిచేసికొనుమని యడిగినందుకు, పరిచారకుండు నాలుఁగు వందల రూపాయల నడిగెనట. పరిచారకునికిఁ గూడా డబ్బియ్యవలసిన కాలము వచ్చెనని తండ్రి చింతించుచుండగ నతని కూఁతురు, తనవల్లఁ దనతండ్రికిఁ గష్టనష్టములును బన్నములును గల్గెనని వగచుచుఁ బ్రాణము విడిచెనట."

"ఈ సమాచారము నెవ్వరు చెప్పిరి?"

"వార్తా పత్రికలలోఁ బ్రచురము చేయబడినదట, బాబు!"

"పెండ్లికాని పడుచుల విషయమై వారి తల్లిదండ్రులు లొందు విచార వ్యాకులములకుఁ బరిమాణములేదు. రోగములంటుచున్నవి గాని యారోగ్యము లంటుచున్నవా? మనుష్యయత్నము లేక కలుపు మొక్కలును గంటకములును జనియించి వర్ధిల్లుచున్నవి. మంచి సమాచారములకుముందుఁ జెడ్డసమాచారములు చెవికందుచున్నవి; దురాచారములు నట్టే సత్వరముగ వ్యాపించుచున్నవి. జామాతలఁ బణ్యమువలె విక్రయించు దుర్వర్తనమును దుర్వాదుకను నిర్మూలముచేయుటకుఁ దగిన యుపాయంబు నన్వేషింపవలసిన ధర్మము లోకులను రాజాంగమును జెందినయది," అని, భద్రయ్య చెప్పెను.

"తండ్రి సొత్తులలో సుతులకు భాగమున్నట్లు సుతలకును భాగమేర్పడిన వనయుల వివాహమునకుఁ బడెడి బాధలు చాలుమట్టుకుఁ దగ్గుననితోఁచెడిని," అని సుబ్బమ్మచెప్పె.

"పురుష సంతతికిని దౌహిత్రులకును మాత్రము నాస్తిలో బాధ్యతయని మన్వంతరముగా నేర్పడియుండు శాస్త్రవిధికిని నాచారమునకును విరుద్ధముగ దుహితలకును బాధ్యతఁ గల్పించెడి విధియు నాచారమును జన్మించుట సాధ్యముకాదు"

"మహమ్మదీయులలోఁ దండ్రిసొత్తులలో దుహితలకును బాధ్యత లేదా?"

"స్త్రీవిద్య బలపడిన నట్టి బాధ్యతను స్త్రీలు కష్టపడి సపాదించుకొనఁగలరు. మఱియు స్త్రీల వివాహము కొఱకుఁ బడెడి యవస్థలు జాలుమట్టుకుఁ దగ్గును. మనకు వచ్చియుండు రెండుజాబులకు నేలాటి జవాబు వ్రాయవలెనని నీయభిప్రాయము?"

"అంత విత్తమిచ్చి యన్యరక్తముతో సంబంధముచేసికొనుటకంటె మన నెత్తురు సంబంధమైన శ్రీ కృష్ణమూర్తులకే మనలతనునిచ్చి పెండ్లి చేయుట యుక్తము."

"అదిగో! చూచితిరా? ఈ బుద్ధి యుండేల లేదు? నను జేరిన వారికి నీవత్తైన నియ్యరాదనుదుర్బుద్ధియే మిమ్ము నీవఱకుఁ జెఱపుచువచ్చె!" అని, యవ్వగారు చెప్పిరి.

"అమ్మా! నీ మనసున నాయాసమేల? నీయభిప్రాయము ననుసరించి నామనఃపూర్వకముగా చిరంజీవి కృష్ణమూర్తికే మనబిడ్డను నియ్య నిశ్చయించితి. అన్యస్థలముల నింకఁ గలలోనైన దలవనని ధృఢముగఁ బల్కెద. నా మేనమామకు నేటికే జాబు వ్రాసి, పెండ్లిని నిశ్చయించుకొని, పుష్యమాసంబున ముహూర్తముఁ బెట్టుకొని యెద."

"నిశ్చయించినవెనుక పెండ్లిని నెపుడు జేరిపినాజెరుపుము," అని, భద్రయ్యతల్లి చెప్పెను.

కొన్నాళ్ళకుఁ బిమ్మట బీరశెట్టివచ్చి, "స్వామీ! దండములు," అనెను. శెట్టిగారు చోఁపమీఁద దయసేయుచుండగ రామిరెడ్డిగారును నరుదెంచి, నమస్కరించి, శెట్టిగారి ప్రక్కనఁగూర్చుండెను. "మనరంగనాథునికిఁ బెండ్లియైనట్లు నాసుతుఁడు జీరువ్రాసె; అదియెంతమాత్రము నిజమని యడిగి తెలిసికొనవచ్చితి," అని శెట్టిచెప్పెను. ఆశుభవార్తవిని తానును విచారించుటకు వచ్చినట్లు రెడ్డిగారు చెప్పిరి. "పెండ్లిజరిగినది నిజమే."

శెట్టి—"తమకు ఖర్చులు బెట్టక వకీలుగారు పెండ్లిచేసిరి."

(నవ్వుచు) "శెట్టిగారు! తమతనయుఁడు చదువుకొనుచున్నాఁడా? తప్పక జాబు వ్రాయుచున్నాఁడా?"

"శెట్టి పిన్నవాండ్రకు చదువుమీఁద నంతగ నక్కఱలేదు; పనికిరాని లెక్కలఁ జెప్పించుచున్నారనియు నట్టి లెక్కలఁ గష్టపడి నేర్చుకొనుటకంటె వడ్డిలెక్కల నేర్చిన లాభమనియు, వేనవేలుగ రూపాయలను సెలవుచేసి చదువుటకు బదు లారూపాయలతో వడ్డివ్యాపారముఁ జేసిన ద్రవ్యము సులభముగ నార్జింపవచ్చుననియు, వడ్డివ్యాపారమునకు మించిన వ్యాపారములేదనియు మొన్నటిజాబులో వ్రాసెను. అతఁడు చదువుకొనఁబోవుచున్నాడో, లేక, మధ్యబడి వదలి రాఁబోవుచున్నాడో, తెలియదు."

లెక్కలవల్లఁ బ్రయోజనములేదని చెప్పఁగూడదు. గణితశాస్త్రము పెక్కు యంత్రసాధనముల కావశ్యకము. తాము లక్ష్మీకటాక్షముం గలవారు; తమసుతుండు చదివినా, చదువకుండినా జింతలేదు. కొందఱివలెఁ జదివి యుద్యోగము సంపాదించియే బ్రతుకవలసిన విధిలేదు," అని, రెడ్డిగారిం జూచి, "తమకుమారుఁడు బాగుగఁ జదువుకొనుచున్నాఁడా?" అని, యడిగెను.

"నేటి కేడుదినములుగ జాబేదియు రాలేదు. ఇంతకుముందు వచ్చిన జాబులో నచేటి పాఠములు కష్టమైయుండునట్లు వ్రాసెను. తాము వచించినట్లు శెట్టివాండ్రకు లక్ష్మీకటాక్షమున్నది; తమవర్ణముం జేరినవారికి సరస్వతీకటాక్షమున్నయది; మాకు రెండుకటాక్షములును లేశమైయున్నవి."

"మీకులముఁ జేరినవారిలోఁ బెక్కండ్రు గొప్పపరీక్షలనిచ్చి ప్రబలమైన యుద్యోగములం దుండెదరు; కొందఱు వ్యాపారముచేసి ధనాఢ్యులై యుండెదరు; కనుక, మీవారికి రెండుకటాక్షములు సామాన్యమనిన నది నిజము కాదు." ఇటువలె భాషించుచుండగ నొకగుఱ్ఱపుబండి వచ్చినిలిచె. అందునుండి నాగిరెడ్డి దిగివచ్చెను.

"ఏమిర నాయన! ఎందుకువచ్చితివి? ఒళ్లేమి?" అని రెడ్డిగారడిగిన, నాగిరెడ్డి బదులాడక బెదరిన వానివలె మాతిగండ్ల నిట్టట్టు త్రిప్పుచుండెను."

"భయంపడవలదుర! ఏమి సమాచారము?"

"పితృవర్గములోని గుణాతిశయములు బరంపరగ వచ్చునట; తనయుండు దండ్రిని బోలునట!" అని చెప్పి, దిగువ జూచుచుండెను.

"సమాచారమేమి? చెపుము!"

"ఒకనాఁడు తాము నాతల్లిగారితోఁ జెప్పుచుండిన వృత్తాంతమును విన్నాను."

"ఏమాట విన్నావు?"

"బాల్యమున దాము బడిలోఁ జదువుకొనుచుండినపుడు తాము చుట్ట త్రాగినట్టును బోధకుండు విచారించినపుడు చుట్ట త్రాగలేదని తాము బదులొనర్చినట్టును, అందుమీఁద నుపాధ్యాయుండు చుట్ట త్రాగినది మొదటి తప్పనియు త్రాగలేదని బదులాడినయది రెండవ తప్పనియు నా రెండు తప్పులకుఁ దమను బడినుండి నివర్తించినట్లు, చెప్పుచుండగ వీనిచ్చితి." (హుంకరించుచు) "ఏమి చెప్పఁ బోయెదవు?"

"ఏను బడిలోఁ జుట్టగాల్చితి. ఉపాధ్యాయుం డడిగినపుడు చుట్టగాల్పలేదంటి. చుట్టగాల్చినది మొదటి తప్పనియు గాల్పలేదని బొంకినది రెండవ తప్పనియు నీ రెండు తప్పులకుగాను నా నామమును విద్యార్థుల నామపట్టి నుండి తీసివేసి నను నింటికిఁ బొమ్మనిరి."

"నాతో మేలమాడెదవా? నీవంటి పుత్రునివల్ల నాకు మంచిసన్మానముగల్గు. మంచిది! ముల్లుకోల నెత్తికొని యెనుమువెంటబొమ్ము," అని, రెడ్డిగారు సెలవుపుచ్చుకొని సరగున నింటికిఁజనిరి. వెంటనేఁ నాగిరెడ్డి తనజేబులోనుండిన కట్టచుట్టలలో నొక్కటిఁ దీసికొని, నోటఁబెట్టుకొని, యగ్గిముట్టించి, గుప్పని పొగనుమియుచు నింటికిఁ జనియెను.

"స్వామీ! బహుకాలమాయె; బాకీని ఫైసలా చేసినబాగు; తమకు బదివేల దండములు," అని, శెట్టిచెప్పఁగ, "శెట్టిగారు! ఇంటనుండు వడ్లలో రెండుబండ్లవడ్లఁబంపెద. మార్గశీర్షమాసమున గోఁతలైన తోడుతోమిగిలిన బాకీకి వడ్లు గొలిచెద," అని, భద్రయ్యచెప్పెను.

"తమకు బదివేల దండములు స్వామి; రెండుబండ్లవడ్లకు నూటయెనుబది రూపాయలు గాలక్రయమగుచున్నది. ఆమొత్తమును దమపేరిట రోజువర్గులలో జమవ్రాసెద; మిగిలినబాకిని దాముచెప్పినట్టు మూఁడునెలలో నిచ్చివేయుఁడు; బాకీఁ దీర్చివేయుఁడు," అనుచువెళ్లెను.

"ఓసి సుబ్బి! రేపు నా మేనమామగ్రామమునకు వెళ్లి, పెండ్లిని నిశ్చయముచేసికొని, శశిపురమునకుఁ జేసి, బిడ్డలఁ జూచివచ్చెదను."

"తాము వచ్చునపుడు చంపకను దోడ్కొని వచ్చిన దానికి మనశక్తి కొలఁది పండువచేసి, పట్టుకోకయు అవికయు దీసియిచ్చి పంపుదము. దంపతులు నలుఁగువెట్టఁగఁ జూడవలెనని యాశయున్నందున మనసుతుండును రెండుదినములకు సెలవుపుచ్చుకొని వచ్చినమంచిది. చంపకమాత్రము మనయింట నొకనెలయుండిన నాయాశతీరు".

"కోడలితోఁగాపురము నేయ నాశయున్నదా? మంచిది; నీయిష్టానుసారము బిలుచుకొనివచ్చెద."

మఱునాఁడు భద్రయ్యపయనమై యింటికడప దాఁటుచుండఁగ దేవళంబుననుండి దేవదాసియు, శిరముమీఁదఁ జెల్లకుండతో గొల్లభామయుఁ బాలుపడిరి. ఇంతకుముందుఁగనులఁబడని మంగళసూచనలఁ గాంచినందుకు సంతసించుచుఁ జనియెను. ధ-పంచమి నవ్వుచు నింటిలోగిలికివచ్చి, "తల్లీ! నేఁడు మనయజమానులువారు కడప దాఁటుచుండఁగ దేవదాసియుఁ బెరుగుకుండతో గొల్లభామయు నెదురుపడిరి," అనెను.

"మగఁడొకతట్టుండఁగ మనమొకతట్టువెతకఁబోయిన శుభలక్షణము లగపడలేదు; లతకు శ్రీకృష్ణమూర్తుల చేతులార బొట్టుకట్టవలసి యుండఁగఁ

దక్కినవారి నుద్దేశించివెళ్లినందున మంగళచిహ్న మొక్కటైన జూపడ లేదు."

"మనలతమ్మ యెంతవివేకి! ఎట్టి ధీమతి! మనయాస్తిలో సగమిచ్చుటచేతనే వాఁడు వలదనఁడు," అని, సేవకుండు చెప్పెను. ఇట్లిరువురును భాషించుచుండఁగ ముసలి ధ-పంచమిని బిలిచి తనకుమారుం డేడబోయె నని యడిగెను.

"అవ్వగారు తమయన్నగారి గ్రామంబైన 'చెల్లపల్లె'కు వెళ్లిరి. తమ యభీష్టంబుపూర్తియయ్యెడిని," అని చెప్పఁగ, "ఈ బుద్ధి మునుండేల లేకపోయె? జ్యేష్ఠమాసంబున యత్నించియుండిన పెండ్లియై మూఁడు నెలలైయుండు; ఈవఱకుఁ గంకణప్రాప్తివేళ రానందున నాకుమారుని కీవఱకుఁ మంచిబుద్ధితోఁచకుండెను," అనుచుండఁగ గంటారావము వినఁబడెను. "అదిగో! పెండ్లిమాటనాడుచుండఁగ గంటశబ్దము వినుచున్నాము," అని, యవ్వగారు చెప్పఁగ, "నాయజమానులువారు కడప దాఁటుచుండఁగ దివ్యమైన సకునములఁ గాంచిరి," అని, సేవకుండుచెప్పెను.

"తగిలినకాలికే దెబ్బలన్ని; చెడినకులమునకే చేటులన్ని" అన్నట్టు, మంచివివచ్చినా, లేక, చెడ్డవివచ్చినా పైపైవచ్చు; ఈవఱకు జెడ్డశకునములు చూపడె. ఇఁగమంచి సమాచారములను వినుదుము," అని, యవ్వగారు చెప్పిరి.

"అత్త! తమకుమారుఁడు చల్లపల్లెకు వెళ్లిరి; పెండ్లిని నిశ్చయించుకొని, శశిపురమునకుఁబోయి చంపకను దోడ్కొని వచ్చునట్లు చెప్పివెళ్లిరి."

"చంపకవచ్చునా? దాని జూచియైన సంతోషపడెదను. లతపెండ్లి ని నేను చూతునో, లేక, చూడనో"

"అత్త! ఎందుకాలాగున జెప్పుచున్నారు? తమవంటి పెద్దలుండి యనుగ్రహించి, యాశీర్వదించినవారికి క్షేమకరము."

"పెండ్లియగుదాఁక నేనుండఁబోయెదనా? చూచుకొనుదను."

15–వ అధ్యాయము.

చంపకవల్లి మామగారితో శ్రీమంతపల్లెకువచ్చి మరలుట; లతయురంగనాథుఁడును జనవరిసెలవుదినములలో వచ్చిపోవుటయు, లతపరీక్షలనిచ్చుటయు; లతపరిణయము.

సింహామాసాంత్యంబునకు నీరైదు దినములుండగ భద్రయ్యానల్లపల్లెకు వెళ్లి, లతాంగిని చిరంజీవికృష్ణమూర్తికిచ్చి పెండ్లిసేయనిశ్చయించి, శశిపురముఁ జేరెను. అతనిరాకఁగని జంబయ్యాగారులేచి, భద్రయ్యాగారి కెదురుగ వెళ్ళి,

“నేను చేసినయపచారమును మన్నింపుడు,” అనుచు భద్రయ్యాగారి కాళ్ళంబడెను.

“లెండు, స్వామీ! లెండు! తామేలాటి యపచారముఁ జేయలేదు; నాకు మంచిఁజేసితిరి. పెండ్లిని నేను చూడ నదృష్టము లేకపోయె గాని పెండ్లి యతివిమర్శగ జరిగినట్లు తెలిసికొని సంతసముగాంచితి; లెండు,” అని, భద్రయ్య చెప్పినంతట, జంబయ్యలేచి, “తమ భార్యకుశలమా? లతమ్మకు వరుండు కుదిరెనా?” అని యడుగ, “నిన్నటి దినమే వరుండు కుదిరెను; నా సొత్తులలో సగము లత పేరిట వ్రాసిపెట్టి నా మేనమామ మనుమనికిచ్చునటుల నిశ్చయించి వచ్చితి,” అని, భద్రయ్య చెప్పెను.

“చాల సంతోషము! అదియుఁ దమకొక మంచిబిడ్డయను కొనుఁడు. అహో! లతమ్మ యెంత వివేకముతోను నెంత బుద్ధికుశలతతోను పెండ్లి జేరుపఁగూడదని నాతో వాదముపెట్టుకొని నుచ్చేటించె. దానికిఁ దగిన ప్రత్యుత్తరమియ్య నాకు వల్లపడకపోయె. తమ బిడ్డలు దామును నాయింట రెండు దినములుండి చారన్నము గుడిచి, యటువెనుక తమ బిడ్డలుండుచోటికిఁ బొండు.”

చంపకవల్లి తలను వంచుకొని, చిఱు నగవుతో వచ్చి మామగారికి నమస్కారము చేసెను. రంగనాథుఁడు సిగ్గుపడి యిట్టట్టు దిరుగుచుండగ, జంబయ్య యతనిబిలిచి, “నీతండ్రిగారు వివాహకాలమున లేనందున నిప్పుడైన నాయన కాళ్లంబడుము,” అని నంతటఁ, దండ్రికి నమస్కరించెను. వెంటనే లతాంగివచ్చి, మొదట తండ్రిగారిపాదములును, వెనుక జంబయ్యగారి పాదములును, కడగ రంగనాథుని పాదములును సేవించి, తండ్రిచెంత గూర్చుండెను. తండ్రి తనయను దనచేతితో మెడఁబట్టుకొని, దాని మోముతోఁ దనమోమునణచికొని ముద్దుపెట్టి, సుఖముగఁ జదువుకొనుచున్నదా యని యడిగెను. లతాంగి జ్ఞానసూచకంబులైన నేత్రములతోఁ గూడిన తన ముద్దుమోమును బంకించెను.

స్నానాంతరము, విందుబోజనముచేసిన తరువాత, భద్రయ్య సౌభాగ్యవతి చంపకవల్లిని శ్రీమంతపల్లెకుఁ బిలుచుకొనిపోయి రెండువారము లుండుట కనుగ్రహింపవలెనని యడిగెను. “తమ బిడ్డైన పిదప నన్నడుగఁ బనిలేదు; తాము వలసినపుడు తమ కోడలి బిలుచుకొనిపొండు; తమకుఁ బ్రీతిగలయపుడు పిలుచుకొనిరండు. రంగనాథుని చేదువు చెడకుండుటకు నతని వదలివెళ్ళిన బాగు.”

“బిడ్డలు నలుఁగువెట్టఁ జూడవలెనని రంగనాథుని తల్లి కభిలాష; దాని మనోరథంబుఁ బూర్తిచేయ నిరువురిని దోడ్కొని చేని, రంగనాథుని, మాత్రము రేపటి సాయంత్రమున బంపెదను.”

“తల్లి కాలాటి ప్రియముండుట సహజము; తమ మాటకడ్డముఁ జెప్పఁగలనా? లతమ్మ యిచ్చేట నుండునా? లేక, తమతో వచ్చునా?”

“ఏమె, లత?”

“నాయన; నాకు నలుఁగు ‘గిలుఁగు’, జూడవలెనని కాంక్షలేదు; నా తల్లిగారిం జూచి రానపేక్షయున్నది! అందుచేతఁ దమవెంటవచ్చి నాయన్నగారితో మరలెద.”

"మూవురుగ వచ్చితిమి; నలువురుగ వెళ్ళెదము; అని భద్రయ్య నొడువగ, జంబయ్య రెండు వత్సరములలో నైదుగురుగ వెళ్ళవచ్చునని నవ్వెను.

గురువారమునాటి సాయంత్రమున రెండవవిందుఁ గుడిచి, భద్రయ్య తన బిడ్డలతోఁ గోడలిని బిలుచుకొని రైలెక్కి మఱునాఁడు శ్రీమంతపల్లె జేరె.

బిడ్డలను గోడలిని గనినంతట సుబ్బమ్మ నివాళించి, చంపకవల్లినిలోఁ గలికిఁ దోడ్కొని చని, కౌగిలించి ముద్దుపెట్టినంతట, చంపక యత్తగారి పాదపద్మములకు మ్రొక్కెను.

"ఏమె, లత ? నగరవాసమెట్లున్నది ? పెండ్లి బాగుగ జరిగెనా!" అని, సుబ్బమ్మ యడిగెను.

క. నగరమన నయోధ్యయఁదగు
జగమున గల్యాణంబన జనుసీతకిలన్
నగబట్టలర్థ పెండ్లి తి
రిగెదరుడుగక పురస్థులు రేయింబవలున్.

అని, లంతాగి బదులాడెను. తోడుతోడ, సుబ్బమ్మ మంగళపాఠకులను రప్పించి, యిరుగుపొరుగు మగువలఁ బసుపుకుంకుమకు రమ్మని పిలిచి వచ్చె. అందఱు వచ్చినంతట దంపతులు నలుఁగువెట్టిరి. సుబ్బమ్మ యావిలేపనముఁ గాంచి ముదముగాంచుచు, వచ్చిన ముత్తయిదువలకుఁ జందనమును దాంబూలమును నిచ్చి, మఱునాఁడు విందుబోనము బెట్టెను. పురోహితులను రప్పించి కాశిపట్టుకోకయు 'చీనా' పట్టురవికయు చంపకకుఁ జదివించె.

భానువారమునాటి యుదయంబున, పదిగంటలకు లతయు రంగనాథుఁడును ధ-పంచమి వెంటఁబెట్టుకొని శశిపురమునకుఁ బోయిరి.

అటువెనుక, సుబ్బమ్మ బీరువఁదెఱచి, యందుండిన పాంచాలికలను బయటతీసి, చంపకయొద్దనిచ్చి, వాటిలో వలసినవాటిని బెట్టుకొని యాడుకొనుమని చెప్పె. పొరుగుననుండిన పసిపిల్లల రప్పించి, చిఱుతిండినిచ్చి, చంపకతో నాడుకొనజేసె. తన కెన్ని పనులుండినా చంపక యాడుకొనుచుండిన చోటికి నిమిషనిమిషము జని, దాని యాటపాటలంగని యెలమిఁ జెందుచుండె. చంపకను నొకనాఁడు హార్మోనియా పెట్టెను వాయింపుమని చెప్పి, యది వాయించుచుండగఁ గడువేడ్కతో వినుచుండె. చంపక శయనించువేళలఁ దనదేహము నద్దాని దేహమునంటి యుండునటుల నిదురసేసె.

ఇట్లు రెండువారములవఱకుఁ దనకూఁతురియందుండు వాత్సల్యమునకు నినుమడి ప్రియంబుతోను గారాబంబుతోను గోడలి నాదరించెను. శశిపురమునకు మఱలు దినమున గోడలికి నభ్యంగము చేయించి, నొసటఁ గుంకుమ జవ్వాది తిలకంబులనిడి, కౌగిలించి, ముద్దువెట్టి, జనవరి సెలవు దినములలో లత వెంట రమ్మనిచెప్పె. ఆలాగే వచ్చునటుల చంపక చెప్పెను. పయనమగునపుడు, మధురభక్ష్యములను చంపక పెట్టియలోనుంచి, వెండి కూజానిండుగ నీళ్ళనించి తనపతియొద్ద నొసంగెను. చంపక తనయత్తగారి పాదములకు సేవించి, మామగారి వెంటఁ దనపుట్టింటికిఁ జనియెను.

ధనుర్మాసమధ్యంబున క్రైస్తవుల పండుగకు సెలవుదినములు వచ్చెను. అపుడు లతయు రంగనాథుఁడును చంపక సహితులై శ్రీమంతపల్లెకుఁ జనుటకు రైలెక్కిరి; అదేబండిలో జీరుశెట్టియుఁ గూర్చుండెను.

"రంగనాథ! ఏను చదువును జాలించితి; వడ్డిలెక్కలలోనుండు సారస్యము తక్కినలెక్కలలో లేదు. వడ్డి వ్యాపారమునకు సాటియుఁ గలదా ? ముప్పదివేల రూపాయలఁ బెట్టుకొని శశిపురమున వృద్ధాజీవుఁడుగ నుండబోయెద," అనెను.

"జీరు ! నాకెప్పుడైన రొక్కము గావలసియుండిన నీయొద్దఁ దెచ్చుకొందు"

"వడ్డికియ్య నభ్యంతరమేమి?"

"వడ్డి యెట్లు?

"అవసరమునకుఁ దగినయట్లు."

"బాండు మీఁదవడ్డి యెట్లు?"

"నగల కుదువపై రూకలిత్తుగాని తాకట్టులేక యియ్యను; నీవు దొడ్డ వకీలుగారి యల్లుడగుటంబట్టియు నాతోఁ జనువుకొన్నందునను నీకుమాత్రము 'నోటుబాండు' మీఁదనిత్తు."

"నగలమీఁద వడ్డి యెట్లు?"

"ఆవిషయము నీకు దెలియనేల?"

"నను గుర్తెఱిఁగినవారు నగలమీఁద నప్పడిగిన నీయొద్దకు బంపుదు."

"వెండిసొమ్ములఁ దెచ్చిన నూరురూపాయల యెత్తుఁగల వెండి సొమ్మును నలుఁబదిరూపాయలకు మదింపుచేసి, యాసొత్తుమీఁద నిరువది రూపాయలిత్తు; వారమొక్కటికి రూపాయయొక్కటికి రెండుపైసాలువడ్డి; దినములు లెక్కవెట్టుట శ్రమయైనందున దినముల గణియింపను; కనుక, కుదువ సోమవారమున బెట్టినా, శనివారమున బెట్టినా, భానువారము నాటి సాయమున బెట్టినా, లెక్క కొక్క వారమని గణియింతు. బంగారు సొమ్ములుగానుండిన, మేలు బంగారు, వరహా యెత్తుకు మదింపు రూపాయ లైదు వంతున లెక్కసేసి, మదింపు రూపాయలకు సగమిత్తును. నెలయొక్కటికి రూపాయ యొక్కటికి రెండుపైసాలకుఁ దక్కువగ వడ్డిదీయను. కుదువ నెల మొదట బెట్టినా నెల మధ్యఁబెట్టినా కడలోఁబెట్టినా లెక్క కొక్క మాసమని లెక్కింతు; రెండు నెలలలోఁ గుదువనగను విడిపింపని పక్షమున నగకును సొంతగాండ్రకును సంబంధములేదని వరత్తు వ్రాసికొందు; రాళ్ళ నగలమీఁదఁ బైసాకూడ నియ్యను."

"కొందఱు వడ్డివ్యాపారమును ముండమోపి వ్యాపారమనియెదరు; రూపాయల బిల్లలు పెట్టఁజేయుట మగవారికి సరికాదనియెదరు."

'వడ్డివలని లాభంబు నీ వేమి యెఱుఁగుదువు? నెలకు రూపాయలు నూటికి వడ్డి రూపాయ యొక్కటివంతున నూరురూపాయ లరువదియాఱు వత్సరములలో మిశ్రవడ్డితో లక్షా రెండువేల నాలుఁగునందల రూపాయలగుచున్నవి; నూరురూపాయలకు మూఁడు, లేక, నాలుఁగువంతున వడ్డి తీసిన లాభ మెంతవచ్చు!"

ఇటువోలె సంభాషించినవెనుక, యిరువురును గొంతసేపు నిదుర మత్తుగనుండి కూర్చుండియే కనులపై ఱెప్పబడవేసిరి. తెల్లవాఱగ నందఱికి మెలకువయైనపుడు రయిలుబండ్లు సాలెపల్లెలో నిలిచె. అందఱు దిగి రెండు గడియల ప్రొద్దుండగ నేవేళ సద్దుడుగని నగరవాసమునుండి సందడిలేక నెమ్మదియై పరిశుద్ధమైన వాయువుతోఁగూడిన జన్మభూమికి నతి యుత్సాహముతో వచ్చిచేరిరి.

రెండు వారములవరకుఁ బ్రతిదినమును, ప్రాతఃకాలమున బడక విడిచి లేచినంతట రంగనాథుఁడు, లతాంగి, చంపకవల్లి--యీ మూవురును దరంగిణికిఁ జని తేటగ మోకాలిలోతుకుఁ బాఱుచుండిన యుదకంబున స్నానము సేయుచు, ప్రతి సాయమును నుపవనంబునకును జిన్ని గుట్టలకడను జని దేహమున కారోగ్యమైన పిల్లవాయువుల ననుభవించుచు నింటికిఁ జనుచుండిరి.

సంక్రాంతి పండుగకు మూఁడవనాఁడు గ్రామదేవత ముంగల జరిగిన యుత్సవక్రీడా విలాసంబులఁ గాంచి యానంద భరితులైరి. పండువకు నాల్గవనాఁడు, భద్రయ్య తన సొత్తులలో సగమును లతాంగిపేరిట దాన పత్రము వ్రాసి, 'రిజిస్టరు' కచేరిలో 'రిజిస్టరు' చేయించి, తిరిగి వచ్చుచుండగ, "మనలతమ్మగారికి నలువదివేల రూపాయల యాస్తి లభియించినందున దాని పెండ్లిచేసికొన ననేకులు పోటిసేతురు," అని, ధ-పంచమి చెప్పగ, తానెంతమాత్ర మాడితప్పఁడనియు లతాంగిని శ్రీ కృష్ణమూర్తికే

యిత్తుడనియు, భద్రయ్య చెప్పెను. దానశాసనంబైన రెండవనాఁడు, రంగనాథుఁడు లతాచంపకలతో శశిపురమునకు మరలెను.

మఱుసంవత్సరము, పరీక్ష జరిగినందులో రంగనాథుఁడు తప్పిపోయినందున మఱియొక సంవత్సరము నదే తరగతిలోఁ జదువుకొనెను. పుష్య మాసంబునందును, జ్యేష్ఠ వైశాఖమాసంబులయందును కృష్ణమూర్తికిని నతని తల్లికిని నతని తండ్రికిని వరుసగ జ్వరబాధగల్గినందున లత పెండ్లికి ప్రతిబంధకములు గల్గెను. మూఁడవ సంవత్సరము లతయు రంగనాథుఁడును 'ప్రవేశపరీక్ష'కుఁ గూర్చుండి, యిద్దఱు దేఱిరి. రాజధానిలోఁ బ్రవేశపరీక్షకుఁ గూర్చుండిన బాలురును బాలికలును జేరి, పండ్రెండువేలు. వారిలోఁ బ్రథమ తరగతిని నెగ్గినవారి సంఖ్య త్రిశతములు. రెండవ తరగతిని నెగ్గినవారి సంఖ్య రెండు సహస్రములు. ప్రథమతరగతిలోఁ బరీక్షనిచ్చినవారి నామపట్టీలో లతాంగినామము ప్రశస్తంబైన ప్రథమస్థానముం బడసె. ఈపరీక్షనిచ్చిన వెనుక, యిరువదినాలుఁగు రూపాయల పరీక్షయనెడి విజ్ఞానశాస్త్రిప్రథమ పరీక్షకు నిరువురు రెండేండ్లు చేదివి, యాపరీక్షలో నిరువురు జయము నొందిరి. ఈపరీక్షలోను రంగనాథుఁడు రెండవతరగతిలోను లతాంగి ప్రథమతరగతిలోను బరీక్షనిచ్చి, లతాంగి ప్రథమస్థానమునందెను. ఈ రెండు సంవత్సరములందును, విఘ్నేశ్వరుని పెండ్లికి వేయివిఘ్నములన్నట్లు, 'జంబయ్యతల్లి, భద్రయ్యతల్లి, కృష్ణమూర్తితాతయునవ్వయు' వీరువరుసగఁ బెండ్లినెలలయందుఁ గైవల్యము నొందినందున, లతాకృష్ణమూర్తుల వివాహమునకుఁ బ్రత్యూహంబులుకల్గెను. పైగనినప్రథమపరీక్ష నిచ్చినవెనుక, రెండు సంవత్సరముల చదువైన ముప్పదియాఱు రూపాయలుగట్టి పోవలసినపరీక్షయైన విజ్ఞానశాస్త్రి పరీక్షకు, అనగా, పట్టపుపరీక్షకుఁ జదువనారంభించిరి.

ఈవత్సరప్రారంభంబున కృష్ణమూర్తితండ్రి, తనకుమారుండు పరీక్షలో దేఱి యుద్యోగమునకు నుద్యమించుచుండునట్లును, పదుచేలుగల తండ్రులు రొక్కముగ మూఁడువేల రూపాయలిచ్చి తమకూఁతును కృష్ణమూర్తికిచ్చె

నట్లు జాబువ్రాసియుండునట్లును, నాలుఁగేండ్లకునుఁ ముందుఁ దాఁజేసి యుండు వాగ్దత్తముననుసరించి తాళిమికొనియుండినట్లును, లతమ్మకుఁ బెండ్లివయస్సుకు మించినవయస్సు వచ్చియుండుటచేత దానినేనాఁడైన బెండ్లిచేసికొనని పక్షమున దనమనస్సునకును బాధగల్గుననియు, పూర్వబాంధవ్యముంబట్టి తిక్కన చోట్లనుండి కన్యలువచ్చినను వలదనుచుండినట్లును, తోడనే వివాహముహూర్తమును నిశ్చయించి వివాహముచేయునియెడల, రెండువారములలో కృష్ణమూర్తికి నన్యస్థలములలోఁ గన్యఁదీసికొనుటకు సిద్ధమైయుండునట్లును, భద్రయ్యకు జాబువ్రాసెను.

భద్రయ్య యాజాబుఁ జదివినతోడుతోఁ దన పత్నినిబిలిచి జాబులోని సమాచారముల దెలిపించి, కొంతసేపాలోచించి, వివాహముహూర్తంబును రెండువారములలో నిశ్చయించునట్లును 'తనభార్య! ప్రార్థనచేసికొని యుండుటచేతఁ బెండ్లిని తిరుమలక్షేత్రమున జరుపవలెననియుఁ బ్రతివచనము వ్రాసిపంపెను.

రెండవనాఁడు పురోహితులను రప్పించి ముహూర్తదినమును నిశ్చయించెను. ముహూర్తపత్రిక యొకటివ్రాసియే నూరుప్రతులు నచ్చువేయు నచ్చుకూటమునకుఁ బంపి, కృష్ణమూర్తి తండ్రిగారైన నారాయణమూర్తిగారికి, 'జ్యేష్ఠమాసము, సప్తమితిథి, శుక్రవారము. హస్తా నక్షత్రముగూడిన శుభదినంబున, కటకలగ్నమందు, సౌభాగ్యవతి లతాంగిని, చిరంజీవి శ్రీకృష్ణమూర్తికి కన్యాదానమిచ్చి, యేడుకొండలాయన సన్నిధానంబున వివాహము జరుపఁ బెద్దలు నిశ్చయించి యుండునట్లు, చెయిజాబు వ్రాసిపంపెను. రెండుదినములలో ముహూర్తపత్రిక లచ్చువేయబడి తనచేతికి నందినంతట, నిశ్చైవబంధు మిత్రవర్గంబులకుఁ బత్రికలఁ బంపెను.

పెండ్లిజాబుఁ జూచినంతట జంబయ్యయు, చంపకాదులును బెల్లుగ సొంపుగాంచిరి.

ఆజోబును లతాంగి చూచినంతట దాని మోము విన్నఁబోయె, మనము కళవళించె. మఱియు నాజోబుచేత దాని మనమున రమ్యముకాని చిత్తవృత్తి జనియించి, మనోహరమైన దానిముఖకళలు వాడవాడఁగెను. జంబయ్య లతాంగిని బిలిచి, "పెండ్లియనిన గన్యల వదనము వికసించి విలాసాన్వితముగ నుండవలసియుండగ, నీముఖకాంతి నానాటికి సగ్గుచు, కంటి నల్లగ్రుడ్లు తెల్లపాఱుచు, మనోవేదనలఁ బడునట్లు తెలియవచ్చుచున్నది; ఏల?" అని, యడిగెను, లతాంగి యూరకుండెను.

"ఇఁకను విద్యగఱచుటకు విఘ్నము వచ్చునను మనోవ్యాకులముచేతఁ గృశించుచుండెదవా?" అని యడుగ, లతాంగి కంటినిండు నీటిం బెట్టుకొని సహజముకాని నవ్వుతో,

"చదువుఁ జాలించిన తరువాత పెండ్లిని నిశ్చయింపవచ్చును. ఎందుకోయవసరపడి నాతండ్రిగారు నాతో నొకమాటఁ జెప్పకను నన్నాలోచింపకను బెండ్లిని నిశ్చయించిరి. తల్లిదండ్రుల మాటను జవదాట గూడదను విషయము నాయెదఁ గొంత బాధచేయుచున్నది; జ్ఞానముతో బదులాడుటకుఁగూడ తోఁపక యున్నది," అనిచెప్పి, తన ముఖమును వెనుకఁ ద్రిప్పుకొని ముక్కుఁజీదెను. శోకసూచకములైన 'మాటలు, నాదము'—వీటిని వినియు, గనియుఁ బశ్చాత్తాపమొంది,

"అమ్మా! నీ చదువుకై రవంతయైనఁ జింతపడకుము; ఎంతవఱకు జదువుకొనవలెననినా నంతవఱకుఁజదివించుటకు నేను సిద్ధముగనుండెద. వివాహము జరుగుటచేత నీ చదువును నిలుపవలసి వచ్చునని కలలోనైన నెంచవలదు. నీ చదువు కాటంకము లేకుండు కొఱకు నీ తండ్రిగారు తన స్థితిలో నీ కర్థమిచ్చి నిను దన మేనమామ మన్మనికిచ్చి పెండ్లిసేయఁ బోరొందరు; నీవు క్లేశ పడవలదు; రేపుమాపున నీతండ్రిగారు వత్తురు; వచ్చి నీవదనముఁ గనిన నతనికెంతో ఖేదముగల్గు; విచారము విడిచి యెప్పటివలె సంతోషముగ నుండుము," అని జంబయ్య చెప్పెను.

"బాల్యమున బెండ్లిచేయవలెనను నిర్బంధము మహాక్రూరమైనయది; ఈనిర్బంధముఁ దొలఁగించిన మనవారెంతో మేలుఁగాంతురు. రెండు లేక మూఁడునందల యేండ్లకు ముందుండిన రాజాంగములో బాల్యవివాహమావశ్యకమై యుండె యుండవచ్చు; ఇటీవల నట్టి యాచారములను నిరంతరము చేయుటకు హేతువ్యంబు గనంబడదు. వివాహమనిన బొట్టు కట్టువారును గట్టుకొన్నవారును స్వతంత్రహీనులై కట్టునఁ జిక్కుకొనవలసి యుండెదరు. నా మెడపై దారమెక్కినంతట నా స్వేచ్ఛా స్వాతంత్ర్యములకు విఘాతము వచ్చునను విచార మెక్కువ గనున్నది. అలఁనాడు నా నొసట వ్రాసిన బమ్మ నేఁడు దిద్దబోవుచున్నాఁడా? నా విధికై వనటఁ జెందెద. నా మనోభావములు నా తల్లిదండ్రుల చెవులఁ బడినవారు సంకటపడుదురు; కనుక, నా మనోవ్యథలు వారి చెవుల నందునట్లు చేయకుఁడు."

"ఏనుచెప్పి వారి మనమును నొప్పింపను; నీవు నీమనమును సరిచేసికొనని పక్షమున నీముఖమే వారికి ముకురమువలె నీ హృదయాంతరంగమును గనిపించు. నిను వివాహము జేసికొనఁబోవు పురుషోత్తముండు నీవలెఁ జదువరియైనందున మీరు కలసి మెలసి, పొందును నొద్దికయు గల్గి, పరస్పరభావంబులఁ దెలిసికొని వాటి ననుసరించి ప్రవర్తించుకొందురనుటకు సందియమొకింతయైన గలదా? ఇరువురు మూఢులైనగాని, యిరువురు విద్వాంసులైనఁగాని బాధకముండదు. మీ యిరువురికిఁ బూర్వ బాంధవ్యముండుటచేతను నీవలె నతండు సంపూర్ణముగఁ జదువుకొని యుండుటచేతను నీ స్వాతంత్ర్యమునకు భంగము సంభవముగునని తలఁచుటకుఁ గారణంబు గనంబడదు."

ఈ మాటలను వినినంతట లతాంగి లోచనము లెప్పటివలె విశాలించి కాకుద కపోలంబుకు యథావర్ణమువచ్చి రదనచ్ఛదములు 'గోజా' రంగుఁ దాల్చె; జంబయ్య మనస్సు సంతుష్టిజెందె.

లతాంగి పరిణయము.

వివాహ మహోత్సవంబునకు మూఁడు దివసంబులుండఁగ భద్రయ్య భార్యా భృత్య సమేతుఁడై శశిపురముఁ జేరెను. రెండవనాఁడు భద్రయ్య కుటుంబస్థులును జంబయ్యగారి కుటుంబస్థులును మేళతాళముల సహితము శైలముఁ జని, ముహూర్తదినమునకు ముందు దినము 'తిరుమల' క్షేత్రమున నడుగు వెట్టిరి; కృష్ణమూర్తియు నతని తల్లిదండ్రులును వచ్చి చేరిరి. అందఱుఁ గొండపైఁ జని, శుక్రవారమునాటి యుదయమున, కటకలగ్నమందు, శీతల వేళలో, కల్పద్రుమంబుల పుష్పవృష్టియో, లేక, యభ్రవాహనుని దీవనఁ బ్రాలేయమో నంబరవీధినుండి గణనీయంబైన యంబుకణంబులు పరకుసుమములవలె దంపతులపైఁ బడుచుండఁగ, మహీమండలమున నాసేతు హిమాచల పర్యంతముఁగల భిన్నవర్ణస్థుల శేషము నాకర్షించు మహిమగల తిరుమల నిలయులైన శ్రీ వేంకటేశుల సన్నిధానంబున నగ్రజన్ముల మంత్ర ఘోషంబుతోను స్వస్తి వచనంబులతోను మంగళ వాద్యంబులతోను శ్రీలతాంగి కృష్ణమూర్తుల పరిణయమహోత్సవము సుశోభితంబై మహోల్లాసముతో జరిగెను.

శ్రీవేంకటాచలపతి పాద పద్మముల మీఁదను జటాధారుల చరణంబుల మీఁదను భద్రయ్య వర్షించిన సువర్ణపుష్పవర్షముచేత నందఱు దనిసిరి. రాజభోజనముచేసి, కొంతమట్టుకు విశ్రాంతి జెంది, యిరులుకమ్మ నిరుగడియలుండఁగ వివాహమునకు విజయముచేసినవారు దేవాలయ ప్రాకారములకుఁ బ్రదక్షిణ మొనర్చి, దేవుని దర్శించి, పత్రపుష్ప ఫలంబులును బాద కానుకయు నీరాంజనమును సమర్పించి ప్రార్థించిన పిమ్మట వసనిలయములఁ జేరిరి. ఉదయమైనంతట రయిలు మార్గమున గొందఱును బాటమార్గమున గొందఱును, తమ గ్రామములకుఁ జనిరి.

కృష్ణమూర్తి బాలురకు బోధచేయవలసిన పద్ధతిఁ గఱపి యట్టి పద్ధతి నభ్యసించు బోధనాభ్యసనకళాశాలంజేరెను. లతాంగి, తన తండ్రివల్ల

వివాహకాలమున లబ్ధంబైన వస్త్రభూషణాదులను దనతల్లియొద్ద నొసఁగి, యథాప్రకారముఁ దాను మునుఁదొడుగుకొని యుండిన నెల్లాగుడ్డతో బడికి వెళ్ళెను. తనకు వివాహమైన సంగతిని దన సహవిద్యార్థులకు లజ్జచే గూఢము వెట్టఁగోరి తన మంగళ సూత్రమును నఱచొక్కాయలో మఱుఁగుపఱచెను. ఒక్క వారమువరకుఁ బాఠశాలకేల రాలేదని సహపాఠకులడిగినందుకు, తిరుమల దేవునికిఁ బ్రార్థన జెల్లంపవలసియుండి, ప్రార్థన జెల్లించివచ్చినట్లు చెప్పెను.

రెండు సంవత్సరముల చేదువు ముగిసినవెనుక, లతయు రంగనాథుఁడును బట్టపు పరీక్షకుఁ గూర్చుండిరి. లతాంగి, పరీక్షయందు వేయి యంకెలకు నేడువందల చౌవంచే యంకెలు సంపాదించి యుత్తమ తరగతిలోఁ బ్రథమస్థానము బడసి ప్రతిష్ఠ జెందెను. రంగనాథుని నామము మధ్య తరగతిని గూడఁ బడక, మధ్యతరగతిని దేఱినవారి నామపట్టిక పాదమునకుఁ బ్రథమస్థానము నొందెను.

కృష్ణమూర్తి విద్యాభ్యాస పరీక్షలో నెగ్గినతోడనే, తాను మును జదువుకొనిన పాఠశాలలో నెల యొక్కటికిఁ బదిపదిరూపాయల జీతమునకు నుపాధ్యాయుండుగ నియమింపబడెను. రంగనాథునికే యుద్యోగముఁ జిక్కక, తనమామగారియింట నూరకుండె. రాజాంగ సంబంధమైన పెక్కంగములలో నుద్యోగమునకు నుద్యమించియు, రాజాంగ సంబంధమైన కొలువు ప్రాప్తంబు కానందున, 'ఆశులేఖనము,' 'ఆశులిపిశాస్త్రము,' యీశాస్త్రములను రంగనాథుఁడు రెండుభాషలలో నభ్యసించుచుఁ గొన్నిమాసములలో 'శబ్దసంకేతన శాస్త్రము'న ప్రవీణుండయ్యెను.

16 వ. అధ్యాయము.

శశిపురమున బిరుదు లిచ్చుటకు సర్వకలాశాల గోష్ఠి.

పరీక్షయందుఁ దేఱినవారికి బిరుదు సన్నదుల నిచ్చుటకు సర్వకలాశాల సభ్యు లొక బ్రహ్మాండమైన యాలయమున గూడిరి. ఆశాలయందు, తూర్పుభాగమున త్రిశతసంఖ్యగల యాసనంబులు వర్తులముగ నమర్పబడియుండెను. వాటిమధ్య నొక యున్నత స్థలంబున మెత్తలు గుట్టిన దివ్యాసనంబుల రెంటిని నమర్చియుండిరి; ఆ భద్రాసనముల ముందట నొకచేలువ జాతి బల్లయుండె. ఆబల్లమీఁదఁ జిత్తరువులతోను బూలపని నల్లికలతోను గూడిన పట్టువస్త్రము గప్పబడియుండెను. ఆవస్త్రముమీఁద నొకతట్టు చిన్నగాజు కుండలుండెను. వాటిలోఁ గాగితములతోఁ జేసిన పన్నీరుచెట్లును, చెట్లనిండు పాటలవర్ణముఁగల కాగితపు పన్నీరుపూవులును శోభించుచుండెను. పుత్తడిరంగిచ్చిన దారుపేట్టములలో బిగపడిన యాఱడుగులుఁగల దర్పణములు బళ్ళిమోత్తర కుడ్యంబులమీఁద నతుకబడియుండెను. తూర్పుదిక్కున గల గోడమీఁద మకుటధారులైన చక్రవర్తి, చక్రవర్తిని, యీమహనీయుల పటములు తగిలింపబడియుండెను. పటలంబునుండి వ్రేలాడుచుండిన యినుప కంబీలకడ వ్యజనములు విద్యుచ్ఛక్తిచేఁ జలించుచుండెను. వ్రట్టముగ నమర్చియుండిన యాసనములందు సర్వకలాశాలఁజేరిన కోవిదులును, రాజాంగ సంబంధమైన కర్మసచివులు, ప్రధానులు, ప్రాడ్వివాకులు, తక్కిన యంగాధ్యక్షులు, ధనాఢ్యులు—వీరు చేనుదెంచి కూర్చుండిరి. వీరికభిముఖంబున నుండిన యాసనములందు సర్వకలాశాల పరీక్షలయందుఁ దేఱి బిరుదులఁ బొందవచ్చినవారు చీలమండవరకు వ్రేలాడుచుండిన మేఘవర్ణముఁగల దేహాచ్ఛదములతోను ధవలమైన శిరోవేష్టంబులతోను గూర్చుండిరి. వారికి సదేశమున బిరుదులు బడయవచ్చిన బాలికలాపాదమస్తకమువరకు ధాత కౌశేయంబుల నాచ్ఛాదించి కూర్చుండిరి.

ప్రొద్దుగ్రుంకుటకు తొమ్మిదిగడియలుండగ రాజధాని కధికారియు సర్వకలాశాల కధ్యక్షుండునునైన ప్రభువు కృపాణపాణులైన యంగరక్షకుల నిద్దఱిని బురోగములుగఁ బెట్టుకొని గంభీరదృష్టితో వేంచేసినంతట మహాకూటములోఁ గూర్చుండినవారెల్లరు లేచి నిలిచిరి. వెంటనే జేత వెండి బెత్తముఁ బట్టియుండిన రెండు భృత్యులతో న్యాయాధ్యక్షపరుండును సర్వకలాశాల యుపాధ్యక్షుండునునైన ప్రభువు విజయముచేసెను. ఈరెండు ప్రభువులును భద్రాసనాసీనులై నంతట నిలువబడియుండిన వారెల్లరు గూర్చుండిరి. సర్వకలాశాల లేఖరియేతెంచి ప్రభువులకడను నిలువబడి, తనకరంబున బట్టియుండిన పట్టిలోనుండిన నామంబుల నొక్కటొక్కటిగఁ జదువగఁ బిలువఁబడిన నామముఁగలవాఁరు, లేక, కలయది, ప్రభువుల ముందఱవచ్చి సలాముచేసి నిలఁబడె. రాజధాని కధ్యక్షుండు తనయెదుట నుంపబడియుండిన సన్నదులలో నొకటిఁ దీసికొని యతనిచేత నిచ్చినంతట, సన్నదును నగవుముఖంబుతోఁ బుచ్చుకొని, వందన మాచరించి స్వస్థానమునకుఁ జనియెను. ప్రథమమున విజ్ఞాన శాస్త్రప్రవీణులు (ఎం. ఏ), వెంటనే విజ్ఞానశాస్త్రజ్ఞులు (బి. ఏ), చేట్టశాస్త్ర ప్రవీణులు (ఎం-ఎల్), చేట్టశాస్త్రజ్ఞులు (బి-యెల్), వైద్యశాస్త్ర ప్రవీణులు, వైద్యశాస్త్రజ్ఞులు, వాస్తుశాస్త్రజ్ఞులు మొదలగువారి నామములు వరుసక్రమముగఁ బిలువబడెను. అందఱు నొకరివెనుక నొకరు సన్నదుఁ దీసికొనిరి. విజ్ఞాన శాస్త్రజ్ఞుల నామములు బిలువబడినపుడు, ప్రథమస్థానమున నుండిన లతాంగి పేరు పిలువఁబడెను. లతాంగి యధ్యక్షుల ముందఱఁ జిఱునగవుతో నిలువబడగ నధ్యక్షుండు, "బ్రాహ్మణకులముఁ జేరిన స్త్రీ యింతవఱకుఁ జదువుకొనిన విషయ మాశ్చర్యకరముగ నున్నది! ఏమి చేయఁబోయెదవు?" అని యడిగె నందుకు, మగవారికి సమానముగ స్త్రీలకును విద్యాస్వతంత్రములు లభియించుటకుఁ బాటుపడి తగిన యుపాయంబులఁ దడవ నుద్దేశించి యుండునట్లు లతాంగి ధీరనాదంబుతోఁ బల్కగ నధ్యక్షుండు చాల సంతోషపడి, తన

స్థానము విడిచిలేచి, లతాంగి చెయిఁబట్టి యాడించుచు, "నీయుద్దేశం బీద్దేశంబునకు శ్రేయఃకరము," అని చెప్పినంతట, గోష్ఠియందుండిన వారెల్లరుఁ దమకరముల ఘోషించిరి. లతాంగి నవ్వుచుఁ దన స్థానమునకుఁ జనియెను. సన్నచులనిచ్చి ముగిసినంతటఁ జట్టముల మంత్రిలేచి బిరుదులఁ బుచ్చుకొన్న వారిని సంబోధించి రెండుగడియలవరకుఁ బ్రసంగముచేసిరి. ఆ ప్రసంగములోని ముఖ్యాంశములను మాత్ర మిచ్చటున వ్రాయఁబూనెదము:—

"మీరీవఱకు విద్యార్థులైయుండి, యిఁక లౌకిక వ్యవహారములందుఁ బ్రవేశింపఁబోయెదరు. మీలోఁ గొందఱు 'లాయర్' వృత్తియు గొందఱు చికిత్సకుల వృత్తియు ననుసరింతురు; కొందఱుపాధ్యాయులుగను సర్కారుద్యోగస్థులుగనునుందురు; మఱికొందఱు 'వంతెనలు కాలువలు, చెఱువు కట్టలు, కచ్చేరి బంగళాలు,' యిత్యాది దేశహితమైన నిర్మాణములకు సంబంధించిన వృత్తియందుందురు. ఇట్లు నానావిధములైన వృత్తులయందు వర్తింపఁబోవుచున్నారనుటకు సందియములేదు. మీరు విద్దెను సంపాదించినది సర్కారుద్యోగము సంపాదించుటకనిగాని ద్రవ్యమార్జించుటకే యనిగాని కించిత్తైన నెంచుకొనకుఁడు. మీలోఁ గొందఱున్నత దశకు రాఁగలరు; కొందఱు సామాన్యదశలో నుండఁగలరు; కొందఱు మితము లేని విత్తము నార్జింపఁగలరు; కొందఱు సామాన్య విభవముతో నుందురు. 'తన సంపదకుఁ దానేస్థపతి' యన్నట్లు, వారివారికిఁ గల విధి, శక్తి, బుద్ధి, వివేకము-వీటి కొలఁదిని ధన మార్జించిపెట్టుదురు. నీతిమార్గములందు సత్యముతో లోకహితముగఁ బ్రవర్తించుటయే ప్రతివాని స్వధర్మము. మీరు పొందియుండు విద్యాజ్ఞానములవల్ల మీకును మనదేశస్థులకును రాజాంగమునకును హితముఁ జేఁగలయట్లు ప్రవర్తింపుదురేని విద్య నేర్చిన మీకును విద్యగఱపిన వారికిని మిమ్ముఁ గన్న తల్లిదండ్రులకును మన దేశమునకును మంచికీర్తిగల్గు. నేటిబిడ్డలే రేపటి ప్రజలు; నేటి పసివాండ్రే మన దేశమునకు నుత్తరకాలమునకుఁ గావలసిన పరిపణమువంటివారు. మీరు మాకు వెనుక నిర్దేశంబున మనిఁయుండఁ బోవు

వారైనందున క్షేమలాభములు లభించినను దుర్దశలు లబ్ధంబైనను వాటికి మీరే చాలమట్టుకు గారణభూతులై యుండఁగలరు. తన సంపదకు దానే స్థపతియని యొకనికిఁ జెప్పినమాట పలుతెగలు జేరియుండు మన దేశమును గూడా జెందు. మేలుగాంచినను మీ చేతలవల్లనే; లేక, కీడుగాంచినను మీ యవివేకమువల్లనే. మీచిత్తచేతల ననుసరించి మీ భాగ్యము. ఒక్క విషయము నందఱు గమనించుటావశ్యకము. 'కృషి,' 'పాటు.' వీటిని నల్పవృత్తియని భావింపకుఁడు; వాటివల్లనే దేశాభివృద్ధియు ద్రవ్య సమృద్ధియుఁ గల్గును. మీ రన్యదేశస్థులను బాగుగ గమనించిన నీవిషయంబు స్పష్టంబగు"

ప్రసంగము ముగిసిన వెనుక, సభలోనుండిన వారందఱు కరఘోషము చేసిరి. తోడ్తో, యింగ్లీషు 'బ్యాండు' వాఁగుచుండగ నధ్యక్షుండును నుపాధ్యక్షుండును లేచి, వెలుపటికిఁ జని, స్వగమన రథముల నెక్కి సదనములకుఁ జనిరి. తక్కినవారునులేచి, కొందఱు స్వగమన రథములలోను, కొందఱ శ్వయానములలోను నింటికిఁ జనిరి.

ఒక యశ్వరథంబున జంబయ్యయు రంగనాథుఁడును, చంపకయు నింకొక రథంబున భద్రియ్యయు లతాంగియు కృష్ణమూర్తియుఁ జని, మాలపేట, చేపలవీధిలోఁ దమతమ యిండ్లకుఁ జనిరి. రెండు దినములకు బిమ్మట భద్రయ్య శ్రీమంతపల్లెకు వెళ్ళెను.

17–వ అధ్యాయము.

లతాంగి సమాజస్థాపనచేయుట.

లతాంగి తనతోఁ జదువుకొనిన సఖులచెంతఁ జని, విద్య, స్వాతంత్రము—యీరెండు విషయములందుఁ బురుషులకు స్త్రీలు చాల వెనుబడియుండుటచేత నట్టి యపేక్షింపఁగూడని తారతమ్యములను సరిచేయు నుద్దేశంబుతో నొక స్త్రీసమాజము స్థాపింపవలెనని తనకుఁ గల యభిప్రాయ

మును నెఱుకపడఁజేసిన నందఱు సమాజస్థాపన కొడంబడిరి. తనయింటఁ దాను దనపురుషుఁడునుమాత్రము నుండుటచేతఁ దనయింట నలసినంత చోటున్నదనియు, ప్రథమమున దనయింట నట్టి సమాజమును స్థాపింపవచ్చు ననియు విన్నవించె! ఎల్లరీయకొనిరి. మఱుసటి భృగువారమున సంధ్యాకాలమునకు ముందు సమాజ మేర్పఱచునటు లొప్పుకొని, యానాఁడు రెండు గడియల ప్రొద్దుండగ సఖులందఱు లతాంగియింటికిఁ జనుదెంచిరి. లతాంగి తాను నివసించు వీథిలోనుండిన వారిచెంతఁజని, తనయింట స్త్రీసమాజ స్థాపనముగాఁబోవు విషయమును దెలియపఱచి స్త్రీలనందఱిని రమ్మని పిలిచి వచ్చె. ఆ వీధిలోగల నైదు స్త్రీలును సఖులతో సుమారిరువదింటికిని జనుదెంచిరి. లతాంగి తన చేతులను జోడించుకొనియొక్కొక్కరికి వెంకణాలు చేసి, యొక్కొక్కరి చెయిబట్టి వీథి తట్టుండిన దక్షిణపు గదిలోఁ దాను మును వైచియుంచిన బల్లలమీఁదఁ గూర్చుండఁబెట్టె. అందఱు గూర్చుండిన తర్వాత, లతాంగిలేచి,

"అప్పజెల్లెండ్రారా! నేఁడు మనము చేయ నుద్దేశించియుండు కార్యములను వివేచించి యాలోచనచేయుటకు శ్రీమతి బాలాంబగారిని నగ్రాసనాధిపతి రాలుగ నియమించ్చుకొనవచ్చునని నాయభిప్రాయము," అని నంతట 'మంగళాంబ'లేచి, తాను లతాంగి యభిప్రాయమున గలియునట్లు చెప్పెను.

తోడనే, బాలాంబగారందఱికి మునువఱ వైపబడియుండిన కూర్చి మీఁదఁ గూర్చుండెను. లతాంగిలేచి. "సోదరీమణులారా! స్త్రీలు పశువుల వలెఁ బ్రజావృద్ధికి మాత్ర మేర్పడినట్లును, పురుషులకు గల స్వాతంత్ర్యము నొంద లగు యోగ్యతాంశముల కనర్హులనియు నెన్నబడి పనికత్తెలవలె వాడబడు టెంతమాత్ర మభినీతముగాదు. మన గణ్యతను హెచ్చించి స్వతంత్ర్యము సంపాదించుటకై యొక స్త్రీసమాజము నేర్పఱచు టత్యావశ్యకమై యుండెడిని. ఇచ్చోట నట్లు స్థాపించుటగాక, మన యెత్తికోలువల్లఁ దక్కిన స్త్రీలను బురికొలిపి, యచ్చోటచ్చోట శాఖా సమాజములను జనియింపఁజేసి, స్త్రీ

లంద ఱేకమత్యముగఁ దమకుఁ గల కొఱతలఁ బురుషుల మనములందును వీను లయందును నొక్కని యెడనే వారపేక్షింపని మన ప్రస్తుతస్థితియే మన కెన్నటికి శాశ్వతమగు; కాఁబట్టి స్త్రీ సమాజమొక్కటి స్థాపనకావలయు నని నామతము. వాచా యొక్కటియు మనసా యొక్కటియు లేక, మీలో నెవ్వరికైన నన్యమతముండిన దానిని వెలిపుత్తురని నమ్ముచున్నదానను," అని చెప్పి కూర్చుండెను. జవరాలందఱు నొకరి మొగము నొకరు దిలకించి శిరములను దిగువ వంచుకొనిరి.

'మౌనం అంగీకార లక్షణం,' అని యెఱుకపడుచున్నది, గణ్యత నొల్లదని యెవరు చెప్పుదురు?" అని, యగ్రాసనాధపతిరాలు చెప్పెను. లతాంగి తిరుగలేచి, సమాజమునకుఁ బటాటోపమైన నామంబిడక, 'వనితా సమాజము' అని పేరుండఁదగునని చెప్పినంతటఁ దక్కినవారు సమ్మతపడిరి. పూర్వమే సిద్ధపఱుపఁబడిన 'వనితాసమాజము' అని వ్రాయఁబడిన పలకను లతాంగి చూపింపగ దాని నందఱుఁగని దొడ్డయక్షరములతో నీటుగ వ్రాయబడినట్టు మెచ్చుకొనిరి. లతాంగి మరలలేచి, సమాజమును బోషించుటకు ద్రవ్యములేక సరిపడదు; నాతండ్రిగారు నాకు దానముచేసియుండు సొత్తుల నుండి వచ్చిన రాబడిలో మూఁడువేల రూపాయలు నాచేతనున్నవి; ఆమొత్తమును నీసమాజమునకు మూలధనముగ 'సంచితకోశి' (సేవింగ్స బ్యాంకు)లో నుంచెద." (స్త్రీలందఱు లేచి కరఘోషము చేసిరి). లతాంగి తాను మున్ను జెప్పిన మాటలను నంటిచెప్పుచు, "నాతండ్రివల్ల నే బొందియుండు సొత్తుల నుండి ప్రతి వత్సరమును నాకు లభియింపఁగల వరుమానమున బదింట నొక భాగమును నీ సమాజమున కిచ్చునట్లు తీర్మానించితి," అని చెప్పగ, స్త్రీలందఱు సుమా రైదునిమిషములవఱకు కరములఘోషించిరి. చెప్పుడణఁగిన వెంటనే లతాంగి మునుమాటల నంటిచెప్పుచు నోటిమాటల నెంతన్నను లోకులు 'సరి'యనుదురు; దుగ్గాణి నడిగినచోఁ బెక్కండ్రు వెనుదీయుదురు. ఏను మొదలుపెట్టు ధనము ప్రస్తుతపు పనులకుఁ జాలినదైయుండియు, మన

సమాజముఁ జెంపొందుచే వచ్చిన మూలధనము వ్యయమై, పిదప సమాజమును రక్షింపఁజాలము. అందుచేత సామాజినీ లొక్కొక్కరు మాసమొక్కటికి రూపాయయొకటి చేందా యిచ్చునట్లేర్పాటుచేసిన, మన సమాజము చిరకాలము బ్రదిముగలిగియుండు. ద్రవస్తు లేవారైన బహుమానమిత్తురేని సామాజినీలద్దాని వందనముతోఁ బుచ్చుకొన సిద్ధముగ నుందురు. నెలనెలకు చేందా యిచ్చిన మాత్రమే మన కూటము సనాతనముగ నుండఁగలదు. ఒకవేళ రూపాయయొకటి నిచ్చుటకు మనంబుగాని, లేక, శక్తిగాని లేనివారు, రెండవతరగతియని యేర్పఱచి, యాతరగతికి మాసచేందా యర్ధరూపాయయని నియమించుకోఁదగు. ఈ విషయముల గుఱించి మీ యభిప్రాయముల వెలువరింతురని నమ్ముచున్నదానను," అనిచెప్పి కూర్చుండెను.

కుంతలాంబయును కొమరాలులేచి మాసమొక్క రూపాయ యెక్కువగాదనియు నంతగూడ నియ్యఁగూడని యశక్తులేవారైన సమాజము జేరెడి కాలమున రెండవతరగతి నేర్పఱచు కొనఁదగునని చెప్పెను.

"భిన్నాభిప్రాయము లుండువారు చేతులఁ బైకెత్తుఁడు," అని యగ్రాసనాధిపతిరాలు చెప్పగ నందఱు నూరకుండిరి. "సర్వత్ర సమ్మతం," అనుచు బాలాంబ నవ్వెను.

అచ్చో జేనుదెంచినవా రశేషమును సమాజముఁ జేరనొడంబడి వారివారి నామముల నొక పుత్తమున వ్రాయించి, నామమెదుట సంతకముచేసి, వనితా సమాజమును గుఱించు పలకను వీధిగోడ కతికించిరి. అటువెనుక, లతాంగిని సమాజమున కధ్యక్షురాలుగను, బాలాంబగారిని గార్యదర్శినిగను, కుంతలాంబగారిని బొక్కసదారిగను, నలువురిని గార్యనిర్వాహ సభ్యాణులుగను నేమించుకొనిరి. పక్షమున నొక్కతూరి సమాజ కార్యవహినీలును, మాసమున కొక్కతేప సామాజనీలును గూటము కూడవలెనని నిర్ధారణచేసి, సమాజముఁ జేరినవారు రెండవతడవ కూటము కూడుటకుమునుపు వారివారి స్నేహరాకత్తెలను సమాజముఁ జేరునట్లుఁ దాఱుచే నటుల వాగ్దానము చేసిరి.

చేందాలు చేరినపిమ్మట వర్తమానపత్రిక యొక్కటియు వార్తాపత్రిక పుస్తక మొక్కటియు రప్పింపబడి సామాజినీలకు జదువనంపవచ్చునని లతాంగి చెప్పగ నందఱు నియ్యకొనిరి. సమాజము స్థాపనంబైన సమాచారముఁ బ్రచురించునటుల నొకదినచరియ పత్రికాధికారికి వ్రాసిపంపమని స్త్రీలందఱు లతాంగిని వేడుకొనగ నది సమ్మతించె. అటుపిమ్మట నొకరికొకరు వందనము లొనరించిరి. పిదప నెల్లరును లతాంగికి వందన మాచరించి తమ యిండ్లకు వెళ్ళిరి.

మఱుసటిదినము, లతాంగి యిరువదినాలుఁగు రూపాయల నొక యాంధ్రపత్రికాధికారికి నాజ్ఞాపెకము (మణియార్డరు) బంపుచు, వనితా సమాజ కార్యదర్శిని యైన శ్రీమతి బాలాంబగారిపేరిట దినచరియ పత్రికయొక్కటిఁబనుపుఁడని వ్రాసి పంపెను. ఇంకొకజాబున సమాజమున జరిగిన వృత్తాంతములును దీర్మానములును వ్రాయుచు, క్రైస్తవులగుడియని యర్థమునిచ్చు 'చేపెల్' అను, యింగ్లీషుపదమును భాషాంతరముచేయక, 'చేపలవీధి' యని (బోర్డు) పలక వేయబడియుండుటయు, "మాలింస్ పేట" యని దొరవారి నామమున నుండవలసిన పేటను 'మాలపేట' యని వాడఁబడుటయు నగరవాసులకును స్థానికస్వపరిపాలనసభఁ' జేరినవారికిని సిగ్గుఁ దేఁదగిన విషయముగ నుండునట్లును వ్రాసి, ప్రచురమునకుఁ బంపెను.

అట్లు వ్రాసిపంపిన రెండవనాఁడు, "శ్రీమతి బాలాంబగారు, వనితా సమాజ కార్యదర్శిని," అను చిరునామము ముద్రింపబడిన యాంధ్రపత్రికను దపాలు బంటు తెచ్చి బాలాంబగారి చేతనిచ్చెను. ఆపత్రికను విప్పిచూడగ నొకదొంతిలోఁ బెద్దయక్షరములతో "వనితా సమాజము," అను శీర్షిక ముద్రింపబడియుండెను. దానికిదిగువ సమాజముంగూర్చి ప్రముఖకర్త భాషణ వాక్యములును లతాంగి దాతృత్వమునుగుఱించి శ్లాఘనవచనములును బ్రచురింపబడియుండె. ఇంకొక దొంతిలో సమాజము స్థాపనమైయుండు దేవాలయ వీధికి 'చేపలవీధి'యని దుర్నామము బెట్టినందుకును, 'మాలింస్ ! అను దొర

వారి నామమున వాడుకొనవలసిన పేటను 'మాలపేట'యని మునిసిపల్ కచేరి పుస్తకమున లిఖించియుండుటయును దనతిరస్కారవచనములు బ్రచురింపబడియుండెను.

పత్రికయందుఁ బ్రకటింపబడిన వనితా సమాజ వృత్తాంతములను బాలాంబగారు చేదివి తనతల్లిదండ్రులకును నప్పజెల్లెండ్రకును జదివి వినిపించి పత్రికను బక్కన సామాజినీలకుఁ జదువఁబంపెను.

ఈలాగున వనితా సమాజస్థాపనమును సామాజినీల నిర్ణయోద్దేశములును బెక్కుమందికి బాహాటమాయెను. చేపల వీధియని పలక వేయబడినందుకును మాలపేట యని మునిసిపల్కచేరిలో లిఖియింపబడి యుండుటకును లభ్యంబైన తిరస్కారవచనములను మునిసిపల్సభానాయకుఁడు చేదివి లజ్జపడి, తన సిబ్బందుల మూలముగా 'చేపలవీధి' యని వ్రాయఁబడిన పలకను దొలగించి, 'ఆలయవీధి' యని వ్రాయఁడిన పలకనువీధిచివరనుండిన యింటి వీధి గోడకు దగిలింపఁజేసి, మునిసిపలుకచేరి సంబంధమైన వీధులనామపట్టీయందు 'మాల పేట' యని వ్రాయబడియుండిన దానిని 'మాలింస్ పేట' యని దిద్దించెను.

పేటవీధులపేర్లు మారిన కారణంబుఁ దెలిసికొనిన జంబయ్యలతాంగి యొద్దకు నరుదెంచి,

"ఏను బహుకాలముగ నీవీధిలోఁ గాపురముచేసెదను; నావలె నిరువదిమందికిఁ బైఁబడి కులీనులు కాపురముచేసెదరు. మాపేట మాలపేట యని వాడఁబడుటయు మావీధి చేపలవీధియని పిలువబడుటయు, చేఁపలవీధి యను నామపలకను నిత్యముగనుటయు మాకు దలవంపులైయుండె. నీవు పసిదానవయ్యు నీవివేకముచేత పేటవీధుల దుర్నామములు మాఱి, మేముపడుచుండిన మానభంగము నేటితో నివారణమయ్యె. నీవు స్థాపించిన సమాజముఁ గూర్చి చంపక చెప్పగను బత్రికలఁజదువగను దెలిసికొని సంతసముగాంచితి. నీ యౌదార్య గుణము నేమని వర్ణింతు? పేటవీధుల నామములు మారుటకొఱకు నీవు చేసిన యతనము జేకూడెను; నీవు పుట్టించి బిడ్డగనుండు సమా

జము నానాటికి వృద్ధిబొంది నీయతనములన్నియు సమకూడుగాక! నీవు స్త్రీకులోద్ధారకి యగుతను! అని, సర్వేశ్వరుని బ్రార్థించెద," అనెను.

లతాంగి రెండు చేతులను జోడించుకొని శిరమునువంచుకొని, "తమ యనుగ్రహమునకును బ్రార్థనకును వేయి నమస్కారములు," అనెను.

శ్రీమంతపల్లెలో బాలికా ప్రథమ పాఠశాలకుఁ జేరిన క్రీస్తవయుపాధ్యాయుగాలు వర్తమానపత్రికలోఁ బ్రచురింపబడియుండిన లతాంగి నామమును వనితా సమాజ స్థాపనమును జదివి, పత్రికతో భద్రయ్య కడ నరుదెంచి, పత్రికను జదివి వినిపించినంతట భార్యాభర్తలు ముదము గాంచిరి.

పదునేనవదినమున సమాజకార్యనిర్వాహిణీలు గూడినపుడు సమాజమేర్పడిన సంగతిని నొక్కతేప పత్రికలోఁ జాటించినందుకు సమాజస్థాపన రాజధానికడకు వెల్లడియైనందుకును, పేటవీధుల నామములు మారినందుకును నొకరినొకరు నభినందించుచు నెడతెగని యతనములవల్లఁ దమ కార్యోద్దేశములు భిన్నములేక సిద్ధించునని దృఢనమ్మికఁ గలవారైరి.

రెండవమాసప్రారంభమున వనితాసమాజ సభ్యాణులు కూటము కూడిన సమయంబున నొక్కొకతె యొకచెలికత్తెను దోడ్కొనివచ్చి సంఘమున జేర్చినందున సంఘపుసంఖ్య యిమ్మడించెను. నలువదిమందికొక పత్రిక చాలదని రెండు పత్రికల రప్పింపఁ దీర్మానించిరి. సమాజముజేరినవారు సంధించిన సమాచారమును వారిసంఖ్య యినుమడించినదియుఁబత్రికలకు వ్రాయఁబడి ప్రచురింపబడె. నాల్గవనెల సమాజపు సంఖ్యాబల మఱువదికి నతిక్రమించినందున లతాంగి యిలుచాలదని, సుమారు రెండువందల జనులకు వసతినీఁగల ప్రక్కనియింటిని నెల యొక్కటికి నద్దె యిరువది రూపాయలని యొప్పుకొని యాస్థలమునకు సమాజమును జలనము చేయించి, సమాజనిలయము మారిన సంగతిని బత్రికాధికారికి లతాంగి తెలియఁజేసె. నూతనమైన స్త్రీలు సంఘముఁజేరుచుండినందున సంవత్సరముగాకమునుపే సంఘముఁజేరినవారి సంఖ్యాబలము నూటదోఁబదినందెను.

పదునొకటవ మాసమునఁ బదునేనవ తారీఖున భానువారము నాటి మధ్యాహ్నము రెండు గంటలు మొదలైదుగంటలవరకు సమాజ స్థాపనానంతరము సామాజినీల ప్రథమోద్దేశమెంతమట్టుకు నెరవేరెనో దాని బరిష్కరించుటకును, అటు వెనుక చేయవలసిన కార్యములను నిశ్చయించుటకును, స్వేచ్ఛగ సంభాషించుటకును మహాకూటము కూడఁబోయెదరని ప్రకటనలు ముద్రింపబడి సామాజినీలకుఁ బనుపఁబడెను. ఈసమాచార మాంధ్ర పత్రికయం దొక ప్రముఖమైన స్థలమున గొప్ప ముద్రాక్షరములతో నాలుఁగు దినములకు ముందుగఁ జాటింపబడెను.

భానువారమునాఁడు గంటయొక్కటి కొట్టగ సామాజినీలు రాఁదొడఁగిరి. రెండుగంటలయినపుడు నూటముప్పదియైదుమంది చేరిరి. లతాంగి లేచి కార్యదర్శినియైన శ్రీమతి బాలాంబగారిని నగ్రాసనాధిపతిరాలుగ నియమించుకొనవచ్చునని ప్రస్తావనచేయగ మంగళాంబలేచి యామోదించినట్లు చెప్పెను. అంతట బాలాంబగారు తనయెదుటనుంచిన శయ్యాసనము నందుకొనఁగ సభ్యాణులు కరశబ్దముచేసిరి. అగ్రాసనాధిపతిరాలులేచి, "మనము కూటము కూడినందుకు, హేతువులను సంగ్రహముగ విజ్ఞాపించుటకు శ్రీమతి లతమ్మ గారిని గోరెదను," అని చెప్పి కూర్చుండెను. లతాంగి లేచినంతట సభ్యాణు లేకీభవించి కరఘోషము జేసిరి. లతాంగి చెప్పుచు వచ్చిన యంశములలోఁ బ్రధానములైన వాటిని మాత్ర మిచ్చోట వ్రాసెదము.

"నాప్రియమైన యప్పజెల్లెండ్రార! మన సమాజము మాసమాసముఁ గూడినపుడు సభ్యాణుల సంఖ్యలో మూఁడిట నొక భాగమే విచ్చేసిరి. ప్రకటనలను గౌరవించి నూటయేఁబది సభ్యాణులలో నూటముప్పది మంది చేనుదెంచిన విషయము, చాలప్రోత్సాహకరముగ నున్నది. సమాజ విషయములందు శ్రద్ధతీసికొని ప్రకటనలను గౌరవించి వచ్చిన మీ కెల్లరకుఁ బ్రారంభమున వందనమాచరించెదను," అని శిరమును వంచెను. "ఈ సమాజమేర్పడి నేటికి పదునొక్కటి మాసములగుచున్నవి. ఒక్కనెల కడచినంతట

సమాజమునకుఁ బుట్టిన నాటి యుత్సవముఁ జేయవలసినవారమై యుండెదము. (ఉత్సాహధ్వని). ఈసమాజమేర్పడిన మాసమున సామాజినీలసంఖ్య యిరువదియైదు. ఈ సంఖ్య నానాటికి వృద్ధిబొందుచు బ్రస్తుతముండు బలీయమైన సంఖ్యనందినందుకుఁ గారణభూతు లాది సామాజినీలు. వారి ప్రేరణచేత దక్కినవారు చేరిరి. అందుచేత నామనః పూర్వకమైన వందనముల నాది సామాజినీలకును వారు పురికొలిపి వచ్చిన వారికిని సమర్పించెదను. మనమేలాటి యుద్దేశములకొని యీసమాజ మేర్పఱచితిమో యది మీకెల్లరకుఁ దెల్లంబైన విషయము. ఈ పదునొకటి మాసములలో మన యుద్దేశమెంత మాత్రము నెఱవేఱెను? ఇఁక మన మేమి చేయవలెను? ఈవిషయముల గొంత యాలోచింతము. ఈ సమాజ మేర్పడకయుండిన బ్రకృతము మన కూటమును నలంకరించియుండు వారందఱు దమ తమ యిండ్లలో 'బలము డిగితెంపులేక కుందుచుండు పంజరపు చిలుకల' వలె నుండియుందురు. మన రాజ్యమం దొకండు న్యాయాధికారియెదుట జరుగు విచారణలో నేరస్థుఁడని యేర్పడిన మాత్రము నట్టి వాని జెఱసాలెలోనుంచి పనితీయుచున్నారు. నీచవృత్తియందుఁ బ్రవర్తించు స్త్రీలు దక్క తక్కిన స్త్రీలను విచారణలేకయు నేరము మోపకయు గృహమను బందిగమందుఁ బెట్టి పని తీయుచున్నారు. స్త్రీలకిట్టి దురవస్థలేలకల్గె? పురుషులవలె స్త్రీలును జదువుకొనియుండిన నిట్టి నిర్బంధములందుఁ జిక్కుకొనక యుందురు. అట్టి నిర్బంధమను రోగమును దొలఁగింపగూడిన యౌషధము విద్దెయొక్కటే. మనము చేదువరులైనందున మనలనట్టి నిర్బంధమునబెట్ట వీలులేకయున్నది. విద్యవల్ల గణ్యత హెచ్చు; గణ్యత హెచ్చిన నిర్బంధములు తొలఁగిపోవు; నిర్బంధములు తఱఁగినస్వతంత్ర మెక్కువయగు. 'ద్రవ్యమువలన గణ్యత' యని యొక నారీమణి కంఠనాదము నావీనులఁబడె; అందుకు జాల సంతసించెదను. అభిప్రాయభేదములుండిన వాటినిబయటపెట్టి సంవాదముచేత సరియైన యభిప్రాయముఁ దెచ్చుకొననగును. ద్రవ్యమువలన గణ్యత గల్గుట నిజమే.

ద్రవ్యమునకు గణ్యతగాని దాని బడసిన వారికి గణ్యతలేదు; ధనముడిగిన గణ్యతయుడుగు. ధనమువలని గణ్యత నశ్వరము; విద్యాజ్ఞానముల వలని గణ్యతి యనశ్వరము. విద్యావంతుని మరణానంతరమును నతనికుండిన గణ్యత నశింపదు. ద్రవ్యమువలని గణ్యత మనకు సంబంధపడని యన్యవస్తు ప్రకాశము; విద్యాజ్ఞానములవలన గల్గుగణ్యతలోప్రకాశము. ఎంత ద్రవ్యముండినను విద్యాజ్ఞానములఁ బడయని స్త్రీకిఁ దనకుండఁగల బందికానా తొలఁగదు." (ఇదుగో! ఇదుగో! అని శబ్దములు పుట్టెను.)

"ఈ సమాజ మేర్పడినందున మన గృహమును చెఱసాలను విడిచి కొంతవఱకు నెమ్మదిగ నుండ నైతిమి. ఇట్టి సమాజముల మూలముగాఁ బదుండ్రతో సంభాషించి యభిప్రాయముల నిచ్చి పుచ్చుకొనుటకు హేవ్యంబు గల్గుచున్నయది. ఈసమాజము శిశుప్రాయమున నుండుటచేతఁ గొద్ది ఫలములే యనుభవించితిమి. దీనిని గారాబముతోఁ బెంచి యిది యొక గొప్ప వృక్షమై నంతట ఫలములను మెండుగఁ గాంతుము. ఈసమాజము శాఖలులేని తాళవృక్షమువలె బెరుగక పెక్కుశాఖలతోఁ గూడిన ఫలవృక్షమువలె బెరిగిన ఫలములు పుష్కలమగు. కాఁబట్టి పెక్కుచోట్ల సహోదర సమాజముల నేర్పఱచిన వాటియందును ఫలముగల్గి యనుభవింపుదుము. ఈకారణముం బట్టి శాఖాసమాజముల స్థాపింపవలసిన ధర్మము మనలఁ జెందినయది. ఈ సభలో నెందఱో జ్ఞానవంతులును వాక్పతులును నుండగ నను బ్రత్యేకించి మాటాడఁ జేసినందుకును, నను గౌరవించినందుకును, నాసామాన్యమైన మాటలను శాంతముతో వినిచ్చినందుకును జేమోడ్పు చేసెదను," అని, శిరమును వంచి కూర్చుండెను. సభయందుండినవారు రెండు నిమిషములవరకు హస్తారావము చేసి నిలిపిరి.

అగ్రాసనాధిపతి రాలులేచి, "శ్రీమతి లతమ్మగారు చెప్పిన యంశములకై మనము విశ్వాస బద్ధులమై యుండెదము. ఆమె చెప్పిన యంశముల లోఁగల సారమును జక్రాంగములవలె గ్రహించి విప్పియుండిన దాని నమ్ము-

దురని నమ్ముచున్నదానను. నను గౌరవించి యగ్రాసనాధిపతిరాలుగఁ గోరుకొన్నందుకు వందన మొనరించెదను," అని, కూర్చుండెను.

అటుపిమ్మట స్త్రీలందఱుఁ దమకిష్టమైనచోట నిష్టమైనవారితో సంభాషింపఁ దొడఁగిరి. లతాంగి కూర్చుండిన స్థలముఁ జేట్టుకొని పదుండ్రు కూర్చుండి యద్దానితో ముచ్చటలాడిరి. వారిలో నొక్కతి,

"ఓసిలత, వివాహముచేసికొని మగనిక్రింద నుండబోవు స్త్రీకి విద్యయేల?" అని యడిగెను.

లత—మగనికి ప్రీతిగను మగని యభిప్రాయముల కనుగుణముగను వర్తించుకొను సమర్థత చేదువుకొనిన పెండ్లమునకు నెక్కువగనుండు; మఱియు జదువుకొనిన స్త్రీ తనమగఁడు దనను మనోజ్ఞమైన సంగడికత్తె యనదగునటుల నడుచుకొను; పురుషుఁడు జదువరియై భార్య మూఢురాలై యుండిన నిరువు రెట్లు పొసఁగి పొందుగల్గి యుండగలరు?

ఇంకొకతుక, "ఇరువురు మూఢులైయుండిన?" అని యడిగె.

లత—(నవ్వుచు) బట్టలు దొడుగుటచేత నట్టివారు చతుష్పాద జంతువులకు నొకింత మేలు.

మఱొకతె-మనము చేదువుకొనిన జదువని పురుషు లేమిచేయుదురు?

లత---మనము జదువుకొన్న బురుషులు జదువుకొనవలసిన విధి యేర్పడును.

"పురుషుని మెప్పించుటకు జదువుకొనవలె ననుచున్నావా," అని యొకరిత యడిగెను.

లత- పురుషుని మెప్పించుటకు మాత్రముగాదు; బిడ్డలు తల్లిని ననుకరించుట స్వభావము; బిడ్డలకు ప్రథమశిక్ష తల్లియొద్ద గద్దెడిని. చేదువుకొనియుండు తల్లి తన బిడ్డలను మంచి యభ్యాసములందుఁ దెచ్చు. బిడ్డల మేలుకొఱకుఁ దల్లి చేదువుకొనియుండిన మంచి. వెండియు జదువరియైన యిల్లాలు గృహకృత్యములఁ దెలివితో నిర్వహించు.

ఒండొకతె- స్త్రీలకు మగవారివలెఁ జదువు వచ్చునా ?

లత- స్త్రీలలో గొందఱు మగవాండ్రకు సరిగా చదివియుండలేదా ? సర్వేశ్వరుఁడు స్త్రీలకును మగవాండ్రకును సమానమైన బుద్ధి నిచ్చియుండగ స్త్రీలుమాత్రము బుద్ధియను కరవాలముఁ దుప్పుపట్టఁ జేయనేల ? పురుషులకు లౌకిక వ్యవహారములు మెండుగ నుండుటంబట్టి పురుషులకంటె స్త్రీలకు జ్ఞాపకశక్తి యెక్కువయని యనుభవ సిద్ధాంతమున్నది.

"విశేషమైన ద్రవ్యము వ్యయముచేసి చదివి పరీక్షల నిచ్చుశక్తి స్త్రీలకుఁ గలదా ?"

లత-అందఱు బరీక్షల నియ్యఁబనిలేదు; ఱొక్కము మెక్కువగ వెచ్చము చేయ నక్కఱలేదు; సామాన్యమైన చదువు పెక్కండ్రకు జాలు; ద్రవ్య శక్తిగలవారును ద్రవ్య సాహాయ్యముండువారును గొన్ని శాస్త్రముల నేర్చిన మేలు.

సరసనుండినయొకతె. ఏమిశాస్త్రము? పాకశాస్త్రమా ? (నవ్వుచే)

లత- స్త్రీలకు పాకశాస్త్రము విషేధముగాదు ; శస్త్ర వైద్య శాస్త్రము, వైద్యశాస్త్రము, స్త్రీలయొక్క యంగేంద్రియ ధర్మక్రమములు, స్త్రీలదేహతత్వశాస్త్రము, పిండోత్పత్తియు వృద్ధియు,జనసంభవము-యీలాటి శాస్త్రములు బాగుగఁ దెలిసియుండిన మన స్త్రీజాతి కెంతో ప్రయోజనకరమై యుండును.

మఱొకతె- స్త్రీలందఱు జదివిన, వారు చెడిపోకుందురా ?

లత-చదువువల్లఁ జెడిపోవుటయుఁ గలదా ? స్త్రీలు ప్రజావృద్ధికి మాత్రమా ? ప్రజోవృద్ధికినినెట్టి ప్రజలు పుట్టవలెను ? బలధీరపరాక్రమములు గల వారుగాను దేశాభివృద్ధి కనుగుణవర్తనులుగాను సుధీవరులుగాను బుట్ట వలెను; అట్టిప్రజ నుద్భవించుటకు విద్యాస్వతంత్రము లావశ్యకము.

ఇత్తెఱంగున విద్యనుగుఱించి ప్రశ్నోత్తరములు జరిగినతరువాత లతాంగి యొండొక జోగాకు జరిగి కూర్చుండె. అయ్యెడ నన్యస్త్రీలు పది

మంది చేనుదెంచి దాఁదాపున గూర్చుండిరి. వారిలో నొకర్తె కాశీ పట్టు చీర ధరించియుండె. లతాంగి దాని కూర్పాసకముఁబట్టి చూచి దాని నెయ్యది కుట్టెనని యడిగెను.

"వాడుకగఁ గుట్టు మంగోజిరావు సరియైన కొలత దెలిసికొనక కుట్టి నందున, చంకను వెన్నునను బట్టుచున్నది," అని, యయ్యది చెప్పెను.

లత-కొలత నెవరిచ్చిరి ?

"నేనే యిచ్చితి."

"నీకొలత నీవేలాగున నీఁగలవు ?"

"విధిలేక నేనే యిచ్చితి."

"కత్తిరించి కుట్టువిద్యను స్త్రీలు నేర్చి సేవనవృత్తిని నుండిన వారు సరియైన కొలతనెత్తి కుట్టుదురు ; ఇట్లు చంకయు వీపునుఁ జోలిచోలక కత్తిరించి యుండరు."

"అవును."

జల్తారుచీర ధరించినదాని చెర్వ నొక ముగ్ధస్త్రీ నిలువబడియుండె; లతాంగి దానిఁ గూర్చుండుమని చెప్పియు గూర్చుండక నిలబడియుండినందున, "నీవెవ్వతె ?" అని, యడిగెను.

"ఎయ్యది చెప్పినా యద్ది కూర్చుండదు ; అదియొక వారాంగన యొద్దనున్నది; నాకు దోడుగఁ బిలుచుకొనివచ్చితి, అని, జల్తారుచీర ధరించిన భాగ్యశాలిచెప్పగ, లతాంగి యులికిపడుచు 'వారాంగనకుంబలియా ? శంబలియన్న గులముఁగూల్చు గొడ్డటికాఁడ,'' అని చెప్పి, జల్తారు చీరధరించిన యొయ్యారితో సమాజముఁజేరిన పనికత్తెలలో నొకదాని దోడుగఁ బనుపునట్లు చెప్పి, కుంటెనకత్తెను బహిర్ద్వారమునకు బిలుచుకొనిపోయి, కనలిన కనులతో,

"నీచవృత్తిననుండు నీవు మాసమాజమునకు రాఁగూడదు; మాయెదుట నిలబడనుగూడదు," అనియె. కుంటనకత్తె తనముఖమును గోడతట్టు త్రిప్పు

కొని, "ఈపూఁట మొదలు మీసమాజమున గొలువుకత్తెగ యుండెదనమ్మ," అని, దీనస్వరముతో వినిపించె.

"కాళ్లుసేతులు చిక్కఁగనుండగ చాటువడి జీవింపక, యిట్టి నిందాస్పదమైన వృత్తిని బూనుకొనేల ?"

మీకు దండములు! ఏదైన నొకకొలువులో బెట్టిన మీఁకు బున్నెము"

"అల్పవృత్తినినుండు దానిని మేము కొలువున నుంచుకొనము; నీవు తోడుతో నీసమాజశాలను విడిచి వీధికి వెళ్ళుము."

"మీ కాళ్ళకడను బడెదనమ్మ! మీసమాజమున సామాజనీలకు బత్రికల నిచ్చివచ్చుటకు నింకొకపనికత్తెను నియమింప బోవుదురటులవింటి; నను నియమించిన దమపాదములకు మ్రొక్కెద."

"అదిగో, కార్యదర్శిని యైన బాలాంబగారి యింటికి జని, యామెను బ్రార్థింపుము; ఆమె యొప్పుకొనిన మేలు; ఇపుడే బయటవెళ్ళుము," అని నంతట గుంటనకత్తె చిన్నముఖంబుతో వీధికరిగి యచ్చట గాచుకొని యుండెను.

పైఁజెప్పిన సమాచారములను గమనించుచుండిన స్త్రీలు గుసగుసలాడిరి. కొంతసేపునకు స్త్రీలు పలుచోట్ల గుంపుకూడి గృహకృత్యములఁ గూర్చియు గొందఱు సమాజవిషయముల గూర్చియు వారివారికిఁ దోఁచిన విషయంబులగురించి మాటాడుచుండి, గంటలైదు కొట్టినంతట నొక్కొక్కరు లతాంగి యొద్దను బాలాంబగారి యొద్దను జని, కొందఱు దండములు సమర్పించియు గొందఱు నమస్కారములని చెప్పియు సమాజమందిరము విడిచి తమతమ యిండ్లకుఁజనిరి. అటువెనుక బాలాంబగారు లతచేయిఁ బట్టి యాడించి, దండములువెట్టి, యింటికి మరలెను.

సమాజమునకు బండ్రెండు మాసములు పూర్తియై రెండవసంవత్సరము బుట్టగఁ బగలునాలుఁగు గంటలకు సామాజినీలు కూటముకూడిరి. సమాజశాలకు దోరణంబుల గట్టించి, కాపి ఫలాహారములఁ దెప్పించి, తృప్తిగవాటి

భుజియించి, వేడుకగా సంభాషించుచు సమాజ జన్మదినోత్సవమును సలిపి, యీ సమాచారముఁ బత్రిక లేఖకునికిఁ దెలియఁజేసిరి.

రెండవ వత్సరమున సామాజినీల సంఖ్య నానాటికిఁ బెరుగుచు వచ్చినందున, వర్తమానపత్రికలును బక్షపత్రికలును మాసపత్రికలును రప్పింపబడెను. రెండవ జన్మోత్సవమును జరుపుటకుఁ బూర్వమే నగరమున జేవంచే చిన్నసంఘములు ఉదయించి, యీసంఘముల యధ్యక్షురాండ్రును గార్యదర్శినీలును దమ సంఘములలో జరిగెడి వృత్తాంతములను మాతృసమాజమునకుఁ దెలియపఱచుచు, తుదజెప్పబడిన సమాజ వృత్తాంతముల నెఱుంగుకొనుచును మాతృసమాజ మహాకూటమునకు వెళ్ళుచును నుండిరి. సంవత్సరాంతంబున నొక మహాకూటము కూడెను. అపుడు వచ్చుబడి మొత్తమునుండి వార్తాపత్రికల రప్పించుటకుఁ బరకభాగమనియు సిబ్బందియుపకరణములు మొదలగువాటికిఁ బాతిక భాగమనియు సంఘోద్దేశంబులను బ్రకటనల మూలముగాను బ్రసంగముల మూలముగాను, యుక్తంబైన యితరమార్గంబుల మూలముగాను వ్యాపింపఁజేయు నిమిత్తముఁ బాతిక భాగమనియు, మిగిలిన పాతికా పరకభాగమును భవిష్యదుపయోగంబులకు మూల ధనముగ నుంచుకొనవలెననియు నిర్ధారణ చేసిరి; వెండియు, సంఘముఁ జేరిన వారిలోఁ గొందఱు శాఖానగరములకును గ్రామములకును వెళ్ళి యుపన్యసించి శశిపురమున నుండు 'వనితాసమాజము' నకనుగుణమైన చిన్న సమాజములను స్థాపించి రావలెననియుఁ దీర్మానించిరి.

మూఁడవ సంవత్సర ప్రారంభమున జన్మవాసరోత్సవంబును మంచి వైభవముతో సలిపిరి. ఆయుత్సవకాలమున బురుషులలో పెద్దవారనేకులు విచ్చేసిరి. అపుడు, స్త్రీవిద్యాలయంబులను, వాటిఁజేరిన యుపాధ్యాయినీలను బరిశీలనచేయు పరిశీలనకర్త్రియైన 'మిస్ రోజ్' అను నామంబున బరగు దొరసానమ్మగా రగ్రాసనమును వహించిరి. శ్రీమతి బాలాంబగారు సమాజ సంబంధమై రెండవసంవత్సరమున నడచిన వృత్తాంతముల జదువుచు,

"ఈ సంవత్సరమున నేఁబది స్త్రీరత్నములు మాసమాజంబుఁ జేరి యలంకరించిరి. మాస వర్తమానపత్రికలును బత్తుపత్రికలును వారపత్రికలును రప్పింపబడెను. సమాజమునకు మాస చెందాలవల్ల సంవత్సరపు వరుమానము రెండువేల నన్నూరు రూపాయలు; పత్రికలకుగాను సెలవైన రూపాయలు మూఁడువందలు; సిబ్బందీలకు మూఁడువందలు; ఉపకరణములకు మూఁడువందలు; సమాజ నిలయమునకు నద్దెకుగాను రెండువందల నలుఁబదిరూపాయలు; ప్రకటనలకు నూటయేఁబది; ఇతర సెలవులు యేనూటపది; పోనుమిగిలిన మొత్త మాఱువందల రూపాయలు. ఈధనము మూలధనముతోఁ జేర్పబడెను. ఈసమాజముఁ జేరినవారి యత్నములచేత నగరమున నైదు చిన్నసంఘము లేర్పడెను. వాటిలో నూటయేఁబది స్త్రీలు చేరియుండెదరు. యావత్తు సమాజములఁ జేరియుండువారి సంఖ్య మూఁడువందలయేఁబది; చిన్న సమాజములకు మాత 'వనితాసమాజము'; వనితాసమాజమునకు మాత శ్రీమతి లతాంగియమ్మగారు. (కరఘోషములు) సమాజముల కవయవముల నేర్పఱచుటకును వాటికిఁ జీవముఁగల్పించుటకును శ్రీమతి లతమ్మగారికేఁ దగును,'' అనిచెప్పి, కూర్చుండెను. రెండు నిమిషములవఱకుఁ గరఘోషంబులుగల్గి నిలిచెను. అంతట దొరసానమ్మగారు లేచిరి. మరల కరఘోషములుగల్గె. దొరసానమ్మ చెప్పుచు వచ్చినయంశముల సంగ్రహముగ దిగువజెప్పెదము.

"నాప్రియమైన చెల్లెండ్రార! ఘనులారా! ఏనీదేశంబునకు విచ్చేసి యాఱై దేండ్లయ్యె; నేను నాసీమలో నుండినపుడును నిద్దేశమునకు వేంచేసిన నాలుగేండ్లవఱకును నిద్దేశ స్త్రీలు విద్యామహిమ నెఱిఁగినవారని తలఁచిన దాననుగాను. ఈదేశముననుండు పురుషులు స్త్రీలకు విద్యానిషిద్ధమని భావించి స్త్రీలను విద్యనుండి బహిష్కరించి యుండెదరని తలఁచియుంటి. నాసీమలోను నింకనితర సీమలలోను స్త్రీలసంఖ్యలో నాల్గింటమూఁడు పాళ్ళకధికమైనవారు చదివియుండగ, బుద్ధియందును జ్ఞానమందును లోపములేని హిందూ స్త్రీలలో నూటికి బదియేనకుఁ బైఁబడినవారు విద్యాహీనులైయుం

డుటఁ! దలపోసినామనము చాలతపించుచుండెను. చదువుగల స్త్రీకిని జదువు లేని స్త్రీకిని దారతమ్యము లనేకములున్నవి. మీముఖవైఖరి, మీరునీటుగఁ గోకలఁ దొడుగుకొని యుండుతెఱంగు, మీదృష్టి, మీవిన్నాణమైన మాటలు, చెలువైనచేతలు, సౌజన్యమైన నడతలు—వీటిఁగనినమాత్రము మీరుచదువుకొనిన వారని పట్టపగలువలె స్పష్టముగనున్నయది. ఈదేశమున నాగరికత పూర్వమునుండి ప్రబలమైయుండియు, ద్విశతవర్షములుగ స్త్రీవిద్యలేనం దున నాగరికతకు శోభమును బరిమళమును లేకపోయెను. ఎట్టిదేశమునకును జదివిన స్త్రీలవల్ల సగముశోభము; కృషి, పాటులు, వీటివల్ల సగముశోభము. ఈరెండును లేనిదేశము నిశ్శోభితమైనయది. పురుషులవల్ల శోభము లేదనలేను; వారికి స్వప్రకాశము తక్కువ. స్త్రీలు లేక, వారుప్రకాశింపఁ జాలరు. చదువుకొనిన యిందియా స్త్రీలలో మున్నూటికిపైఁబడి నాయెదుట నేఁ డుండుటంగాంచి నామనంబును దేహంబును నెంతోయుబ్బుచున్నవి. ఇట్టి సుదినమును నేనెన్నఁడును మఱవజాల. ఇందఱు స్త్రీలొక్కచోటఁ గూడి, స్వేచ్ఛగ సంభాషించి, కలుపుగోలుతనమునొందియుండుటకుఁగల ప్రతిష్ఠ, ప్రాజ్ఞయు ధీమతియునైన లతాంగిని జెందు. (ఇదుగో! ఇదుగో అనుశబ్దములు) మీసమాజమువలని సద్యః ఫలములు లేశమైయుండినను, మీ సమాజము దినేదినే విజృంభించి యసంఖ్యాతమైన యుత్తరఫలముల నిచ్చుగాక! నను గౌరవించి యగ్రాసనాధిపత్యము వహింపఁజేసి నందుకు వందనము లొనరించెదను.'' (కరఘోషములు)

శ్రీమతి బాలాంబగారులేచి ''మిస్ రోజ్'' కేజేయీభవ!'' అని యరచినంతట జనులుత్సాహ ధ్వనిచేసిరి. మరలలేచి ''లతమ్మకే జేక్'' అని చెప్పినంతట నందఱు దొరసానమ్మ సహాయుత్సాహ ధ్వని వినిపించిరి.

---

18 వ, అధ్యాయము.

లతాంగి గుణాతిశయముల సంగ్రహమును లతాంగికీర్తియు.

లతమ్మకు మంచి యౌవనకాలము వచ్చినందున నామెరూపలావణ్యములందు మించుచు నాచారములును మంచిగొనములును జెల్లుకొనుచువచ్చెను; తలయందు నిగనిగమను నల్లనినెఱులు పిఱుఁదులనందుదాఁక జెరిగివచ్చె; నెత్తిపైయుండు మురువైనయుంగురులఁగనిన బిల్లవాయువులుదాఁగి క్రీడావిహారముఁ జేయఁ బ్రేముడించుపట్టులవలెఁ జూపడె; నొసలు విశాలమైనెలకూన నెలకొన్ననెలవువలె డాలుమీఱె; నిడువకన్నుల నడిగ్రుడ్లు నల్లమరునల్లెలవలె విలసించుచుండె; ఉదిరివన్నియను వెక్కిరించు చికిలిఁగలచెక్కులును తెలుపైన చిన్నచెవులును 'రోజా' ననలమేనితోఁ దనరు తియ్యనికెమ్మోవియును మొల్లమొగ్గలఁ బరిహసించుదంతములును—యీలాటిరుచిర లక్షణాన్వితమైన వక్త్రంబును లక్షించి వర్ణింపనివారుఁగలరే? నాతెఱలు దెఱవకుండియు మోముఁజూచిన నవ్వుచుండు ముఖమువలెఁ గనఁబడు. పైమోవిక్రిమోవిని నంటియుండుటఁ గాంచిన దృఢసంకల్పము గలయది యనితోఁచు. ఎత్తిపొడుచు ముక్కునుగనిన గోపగౌనముతోఁగూడిన వాడియైనబుద్ధిని సూచించు. దృష్టిదయారసముఁ దెలివియుఁ దోఁతెంచు. నిష్కళంకమైనచూపులు, నిర్మలమైన హృదయము, దోషరహితవచనములు, డాంబికములేని సామాన్యమైనయుడుపులును నడతలును, నగనట్రిలయందుపేక్ష, గౌరవముతోను మర్యాదతోను బ్రవర్తించుకొను పద్ధతులు, దొడ్డయోచనలు—యివియులతాంగి బ్రత్యేకించి చూపుగుణరత్నములు. పుష్పముల జేతనంటదుగాని 'రోజా' కుసుమములకుమాత్రము పక్షపాతముఁ జూపు; వెలిపట్టుజల్తారు చీఱలఁ బాఱవేసి నూలుచీరలమొలఁగట్టు; రంగుబట్టలఁగనిన నసూయపడి తెల్లని కోకలఁదెంపుగఁ బొడుగు. జవ్వాదిఁ దిరస్కరించి నొసటఁ గుంకుమ బొట్టిడు. లతాంగి గదినిఁజూచిన నెంతోపరిశుద్ధమైయుండు. మేజపై

పుస్తకములు మాసిపోకయు దుమ్ముపడయకయు నుండుటతోఁ గంటికి రమ్యముగ వరుసక్రమముగఁ జేర్పబడియుండు. పురుషునియందుఁ దన యంతరంగమున నధికప్రీతిగల్గియు నద్దాని వెలుపరింపదు. మగనిమనోభావములను మున్నుగదెలిసికొని వాటికనుగుణముగవర్తించుకొను. జాయాపతుల యన్యోన్యమును వారు ముచ్చటించుటయు లాతివారుజూచిన బ్రాణస్నేహితులనుకొందురే కాని దంపతులని సులభముగనెఱుఁగఁజాలరు. గృహకృత్యములందు నెంతమితముగ వ్యయముచేయఁదగునో యంతకొద్దిగ సెలవుచేసి యెంతఫలములఁ బొందనగునో యంతఫలమును గలుగఁజేసికొను. ఒకఁడు లోకములోనుండు కోటానఁగోటి వస్తువిషయములలోఁ దనజీవసార్థమునకు నగత్యమైనవాటిని నెంతతగ్గించుకొనుచున్నాఁడో యంతకంత నెమ్మదినెక్కువచేసికొనుచున్నాఁడను జనవాక్యమున కనుసరణగ లతాంగియు దానిపురుషుండును వారికక్కఱయైనవస్తువులఁ దగ్గించుకొన్నందున నెమ్మదినమించినవారైరి. లతాంగి తల్లిదండ్రుల యందధికప్రీతియుఁ బ్రియమునుగలయది. రాజభక్తి నమించినయది, దైవభక్తికి బరిమాణములేదు. ప్రతిదినమున రెండుపూఁటలు స్నానపూజలఁజేయనియెడల దానిమనము నెమ్మదిఁజెందదు. నిదురవోవుటకు ముందును నిదురవిడిచిలేచినపుడును శ్రీరాములపాదపద్మములమీఁద దన బుద్ధిని నాటించి యరగడియవరకుఁ దదేకధ్యానముగనుండుటఁ దప్పదు.

ఒకనాఁడు దంపతులు సమాజవిషయములను మాటాడుచు స్త్రీవిద్యాభ్యాసముగూర్చి చర్చించుచుండిరి. స్త్రీలవిద్యగూర్చి వార్తాపత్రికల మూలముగా మొఱవెట్టి యాపత్రికలఁజదువు లోకులయవధానమును బల్మరు నొక్కనిచో స్త్రీవిద్యయభివృద్ధిఁ బొందదని యాలుమగండ్రేకమతముఁ గలవారై, యప్పటినుండి యాంధ్రపత్రిక కొక్కటికి నన్యభాషాపత్రికకును బ్రతివారము వ్యాసమువ్రాసి యద్దాని బ్రచురముచేయఁ బనుపుచుండిరి. లతాంగి తాను వ్రాసినదానిని దనమగనికిఁజూప నతండతనికిఁ దోఁచినవిషయములఁ జేర్చి తద్రీతిగఁ బురుషుండు వ్రాసినవ్యాసమును సతిచేత నిచ్చిన, దాని బుద్ధికి

స్ఫురించిన విషయములగూర్చి. ఇట్లిరువురు నేకీభవించి వ్యాసములోని పదప్రయోగభావాదులను సవరించి మఱింత బాగుచేసియుఁ దేటులుఁ దెచ్చియుఁ బ్రచురము చేయుటకు వర్తమానపత్రికలకుఁ బంపుచుండిరి.

ఒకనాఁడు నగరమహాజనసభలోఁ గూటముకూడెను. ఆకూటమును దంపతులిరువురుఁ దమదర్శనముచేత నలంకరించిరి. లతాంగిగాక యింకఁ గొన్నిసకియ లేతెంచియుండిరి. ప్రసంగకరుఁడు తొలుత నువిదలను గౌరవించుటకు, దొరసానులార! ఘనులార! అని సంబోధించి, "కాంతామణులు వేంచేసి తమకూటమును మండన మొనరించిన విషయము ప్రోత్సాహకరమైయుండునట్లు చెప్పి, పంచమకులస్థుల బహిష్కారముగూర్చి ప్రసంగము చేసెను. రెండుగడియల కాలమువరకు నుపన్యసించుచు,

"మనలను సృష్టించినట్లు సర్వేశ్వరుండు పంచమకులస్థులను సృజించి యతనియందఱు లోకుల శేవ మొక్కటైయుండగ సృష్టికర్త బిడ్డలుగను మన దేశస్థులుగను నుండు యిన్నూటతొంబది లక్షల సంఖ్యగల పంచమకులముఁ జేరినవారిని మనతోఁగలుపుకోలుతనము నొందనీయక బహిష్కరించియుండుట మనకు శ్రేయఃకరముగాదు; వెండియు మనము దురితప్రాప్తులు కాఁగలము," అని ప్రసంగమును ముగించెను. అందఱు కరఘోషములు చేసిరి.

సభికులలో నలువురు ప్రసంగము చేసినవాని యభిప్రాయమునకు బ్రాపుగ మాటాడి కూర్చుండిరి. అగ్రాసనాధిపతి లేచి తన్ను గౌరవించినందుకు వందన మొనరించెను. తుదకు ఘనుండొకండు లేచి, "వర్తమానపత్రికలు వెలిపుచ్చు వనితాసమాజమాతయైన లతాంగి మనకూటమును ననుగ్రహించినందుకు నామె నామముఁ జెప్పి మూఁడు తడవలుత్సాహ ధ్వనిఁ జేయుఁడు," అనిన దోడుతో,

'వనితాసమాజమాతకే జేయీభవ,' యని మూఁడు తడవలు ధ్వానము చేసిరి. కూటము కలసిపోయినంతట బహిర్ద్వారమున గుంపు దట్టమైయుండి

నందున నా గుంపు పలుచేనగుదాఁక లతయు కృష్ణమూర్తియుఁ గొన్ని ముద్దుగుమ్మలును నొకచోట నిలువబడియుండగ సభికులనేకులు లతాంగిచెంతఁ జేని సంభాషించుచుఁ బరిచయముఁ జేసికొనుచునుండిరి. తుదకు, లతాంగి శ్లాఘనీయమైన ప్రవర్తనలకును యత్నములకును దమ మెప్పుదలఁ దెలియఁజేసి, హాసవదనంబులతో జోత మొనరించి, స్వగృహగమనులైరి. జనసంకీర్ణము పేలవమైనంతట లతాంగియు కృష్ణమూర్తియు సంతుష్టమానసులై తమ గేహమునకుఁ జనిరి.

అటువెనుక జరిగిన నగర మహాకూటములలో నొక్కొక్క దానికిని దంపతులును వనితా సమాజముఁ జేరిన స్త్రీలలోఁ గొందఱును జనుచుండిరి. కొంతకాలములో లతాంగి ఖ్యాతియష్ట దిక్కులయందును వ్యాపింపగ బరిచయముఁగలవారి సంఖ్యనానాటికి బెంపొందుచు ననుదినమును దానిగృహమునకుఁ బెక్కండ్రు దొడ్డమనుష్యులు సందర్శనమునకును సంభాషణకును రాఁదొడగిరి. దర్శనమునకు నిల్పడుకాలము దెలిపించుటకు వీధిగోడ కొక పలకదగిలించి, యందున, "ఆలోకనార్థుల యెఱుకకు:—ఉ. $7\frac{1}{2}$ మొ. 9 వరకు; సా. $4\frac{1}{2}$ మొ. 6 వరకు," అని వ్రాయించెను. పెక్కుశాఖానగరములనుండి వనితా సమాజవిషయములగూర్చి యుత్తరప్రత్యుత్తరములు ఘనమగుచుండె. దవీయస్థలములనుండి 'వనితా సమాజమాత'. యని పైవిలాసము వ్రాయఁబడివచ్చిన ప్రతిజాబునను లతాంగి తమ గ్రామమునకు దయసేయవలెననియు నచట నుపన్యసించి శాఖా సమాజ మొకటిని స్థాపించిపోవలెననియు బ్రార్థనయుండెను. అట్టి జాబులఁ దన పెనిమిటికిఁ జూపగ నిరువురు గొంత యాలోచించి, శ్రీమంతపల్లెలో వార్ధక్యము నొందియుండు మహా విశ్వాసపరుండును జతురవంతుఁడును నైన ధ-పంచమిని రప్పించి లతాంగి వాని వెంటబెట్టుకొని ప్రార్థించినవారి స్థలములకుఁ జనఁదగునని నిశ్చయించి, భద్రయ్యగారికి జాబువ్రాసి పంపుచు నాజాబును జూచిన తత్క్షణమే ధ-పంచమిని బంపునట్లు వ్రాసిరి. లతాంగి రావలెనను ప్రార్థ

గల జాబులకు వీలుపడిన దాను వచ్చునట్లును వీలుపడనిచో సమాజకార్యదర్శినియైన శ్రీమతి బాలాంబగారు వచ్చునట్లును, శశిపురము విడిచి బయలుదేఱుట శౌకవారముండగ వెడలఁబడు సమాచారముఁ దెలియఁ జేయునట్లును ప్రత్యుత్తరము వ్రాసిపంపెను.

భద్రయ్యగారికి జాబందినతోడనే భార్యాసమేతుఁడై భృత్యుని బిలుచుకొని శశిపురమున రయిలుమార్గపు స్థలమునందెను. అచ్చట నొక జట్కాబండి సారథి, "తాము లాయర్ జంబయ్యగారి వియ్యంకులా ?" అని, యడిగెను. భద్రయ్య యచ్చెరువొంది సారథితన్నెట్లు తెలిసికొనెనని యడిగెను.

"స్వామీ! తమ కుమారుని గూడా యెఱుఁగుదు"

"నాకుమారుని నీవెట్లెఱుఁగుదువు?"

"స్వామీ! తమకుమారుఁడు నాబండితప్ప వేఱుబండిలో నెక్కఁడు; రైలెక్కబోయినా, రయిలునుండి దిగివచ్చినా నగరమున నెచ్చటికి వెళ్ళవలసివచ్చినా నాబండితప్ప తక్కిన జండ్లలో నెక్కఁడు."

"అద్దె యెంత?"

"తామెంత దయచేసినా, సరి," అనుచు 'గుడ్డగూడుసు'ను 'ట్రంకు' పెట్టియను దీసి తన బండిలోఁ బెట్టెను. జాయాపతులా బండిలోఁ గూర్చుండి సేవకుని నండివానిప్రక్కన గూర్చుండఁజేసిరి. ఆలయవీథిన జంబయ్యగారి బంగళాకెదుట రథమునిలిచె. సారథిచేత భద్రయ్య యర్థరూపాయఁ బెట్టె. రథికుండా యర్థరూపాయను నేలమీఁదఁ వేసి,

"తమకుమారుఁ డెపుడువచ్చినా రూపాయకు దక్కువగ నియ్యఁడు. అతని తండ్రియు ప్రభువులునునైన తాము వచ్చినందున రెండు రూపాయలకుఁ దక్కువగఁ దీసికొనను."

"ఏనుబండి యెక్కుటకు ముందద్దె యెంత యని యడిగినందుకు నెంత యిచ్చినా సరియనిచెప్పి, యిపుడు తగవును రచ్చేలును బెట్టుకొనుట సరి కాదు".

సారథి పెద్దకూఁతలుపెట్టి యఱచుచు, "సంపాదింపని పసివారే యొక్కరూపాయనిచ్చియుండగ సంపాదించెడి ప్రభువులయొద్దఁ దుదకు రెండురూపాయలైనా తీయకవదలను," అనెను.

"సాహేబుగారు, నాకుమారుఁడీపఱకు పైసాయైన సంపాదించి యెఱుఁగడు; అందుచేత ద్రవ్యమార్జించు కష్టముల నెఱుంగడు; నాకును సంపాదించు తండ్రియుండిన నొకటికి రెండుగ నీయగలను; ఇదుగో, యీ పాతికరూపాయగూడా దీసికొని వెళ్ళుము."

"నాకద్దెవద్దుస్వామీ! ఈ ముప్పాతికరూపాయ దమవద్దనే యుంచుకొనఁడు; నావంటి బీదవాని కడుపుమీఁదగొట్టి మీరే మహారాజులుగ నుండుఁడు," అని, తన బొజ్జమీఁద మోదుకొని, వీధిమధ్య నిలిచి కూఁతలు వెట్టెను.

ఆ కూఁతలను విని జంబయ్యగారు వచ్చినంతట నతనితో రథికుండు,

"మహాప్రభూ! తమ యల్లుండ్రలోనేవారు నాబండిని వెళ్ళినా, రెండువీథులను మాత్రము దాఁటిపోవలసినా రెండు రూపాయలిత్తురు; తమ వియ్యంకులను రయిలు కడనుండి యెక్కించుకొనివచ్చితి. అందుకు దాము నడుచునపుడు దమపాదమునంటి రాలిపోవు దుమ్ము వెలఁజేయని యర్థరూపాయ నాచేతఁబెట్టిరి. తనయునికిఁగల పశ్చాత్తాపము తండ్రికి లేక పోయె, బాబుగారు."

జంబయ్య మధ్యస్థముచేసి యింకొక పాతికరూపాయఁ గొలఁచేనట్లు చెప్పినందుమీఁద, సారథియొక్క రూపాయదీసికొనియుఁ దనివిలేక సణుగుచు వెళ్ళెను.

వియ్యంకులిరువురు నౌకరికొకరు గుశల ప్రశ్నలఁజేసిన తరువాత, తమతమ యిండ్లకుఁ జనిరి

లతాంగి తనతల్లిదండ్రులఁ గనినంతట నాహ్లాదముతో నిరువురిని నమస్కరించి, లోఁబిలుచుకొనివెళ్ళి వలసిన యుపచరణలఁజేసి, తనతల్లి దేహము తనదేహము నంటునట్లు కూర్చుండి, తల్లికి మనస్సంతుష్టి యగుదాఁక మాటాడుచుండె. కొంతసేపుతాళి ధ-పంచమిని బిలిచి యతనిని రప్పించిన కారణముఁ దెలిపి, ప్రతివాసరము దెల్లవాఱి రెండు గడియలును సాయమున రెండుగడియలును వీధి తిన్నెమీఁద గూర్చుండి యాలోకనార్థమై వచ్చెడి వారు దమ నామము వ్రాయఁబడిన చీటిని నిచ్చిన దాని దనయొద్దఁదెచ్చి యిమ్మని యాజ్ఞాపింపగ, సేవకుండు తనకంతకంటె మించిన సంతోషకరమైన పనిలేదనుకొనుచు, "ఆలాగే, తల్లి," అనెను.

---

19 వ, అధ్యాయము.

భద్రయ్య కూతునింటఁ గొన్నాళ్లుండి మరలుట.

ఒక భానువారమునాఁడు వేడుకగా గాలహరణము చేయుటకొఱకు దనవియ్యంకునితోను రెండుఘనులతోడను 'బ్రిజ్' యనెడి చీట్లాటనాడుచుండెను. అట్టియవసరమున జటఘనక్రియములను వల్లించిన వేదవిదుండొకరుఁడు యాచకార్థమైవచ్చి జంబయ్య బంగాళా యరుగుమీఁద గూర్చుండియుండె. అచ్చేటున ధ-పంచమియు, 'పీపాయి'యు మాటాడుచుండిరి. ఇరువురును వేదవిదునిగని దండకులుపెట్టి,

"ఎచ్చటనుండివచ్చితిరి? తమకేదైన వ్యాజ్యమున్నదా?" అని, పీపాయి యడిగెను.

"తగవుఁదీర్చుకొనుటకు వచ్చినాఁడను," అని, వేదవిదుండు చెప్పగ, "కొంతకాచియుండిన మంచిసమయము గనుపెట్టియుండి చెప్పెదము," అని యిరువురు జెప్పిరి.

"ప్రభువులిపుడేమి చేసెదరు?"

"దొడ్డవారితో బందెములిడి చీట్లాడుచున్నారు. తామిపుడు లోగిలికిఁబోయిన దమవ్యాజ్యము జెవినవేసికొనరు", అని పీపాయి చెప్పెను.

"ఇదియమంచిసమయము," అనివేదవిదుండు చెప్పె.

పీ-ఇపుడు తమతో మాటాడ సావకాశముండదు; వేతనము దెచ్చితిరా ?

వే—నాయొద్ద దివ్యమైన వేతనమున్నది.

ధ-పంచమి-'కేసు' కట్టలేక దుగ్గాణిసంచియులేక వేతనమున నెట్టిది ?

వే—ఏనుచేదివిన వేదములే వేతనము.

ధ. పం—(నవ్వుచు) పొట్టఁబట్టితగవా ?

వే—అవును.

ధ. పం—అదుగో, మూఁడవయింట నపారమైన సంపాదనచేసెడి గొప్పవకీలుగారుండెదరు; అచ్చటుకు వెళ్ళిరండు.

వే—అబ్బ! అతఁడా? గొప్పకృపణుఁడట! యాచకులను బ్రహరించెదడట! అట్టివానియొద్ద నేనెట్లు పోదు? "తమకు ప్రాప్తంబగు లాభమున నెంతయిత్తురు? చెప్పినలోగలికి విడిచెద" అని పీపాయి చెప్పెను.

"మూఁడవయింటిపంతులు వారికడఁబోక యిచ్చోటులోఁ బోఁగూడదు; ప్రహారములు లభియించిన మాకు చాలకష్టములేదు. దొక్కము ప్రాప్తంబైన నెంతయిచ్చెదరు? చెప్పివెళ్ళుఁడు," అని, ధ. పంచమి చెప్పెను.

"మిమ్ము నేమఱవను," అనుచు వేదవిదుఁడులోఁజని ప్యాకియాడుచుండినవారి ముంగలఁ దనచేతులను జోడించుకొని, నమస్కరించి, యొక బల్లమీఁదఁ గూర్చుండి, చేతనక్షతలుఁ బెట్టుకొని,

"ఓం సంజ్ఞానం విజ్ఞానం"—అని ప్రారంభింపఁగ, దొడ్డవారిలో నొకండు కోపించి, ఓయిశాస్త్రులు! శివపూజలో భల్లూకముదూరినట్టు, మంచియాటసమయమున జొఁఱబడివచ్చితిరి," అనియెను.

"ఏనుచతుర్వేద పారంగతుఁడను; ననుఘనపాటియందురు; దారిద్ర్యం బను రిపుబాధనోర్వలేక వనీనపకధనీకరులనియు దానశౌండవులనియుఁ దమ ఖ్యాతిని శ్రవించివచ్చిన వాఁడను."

"ఇది సమయముగాదు," అని, జంబయ్య చెప్పుచుండఁగ, ధ-పంచమి వచ్చి, "దేవరవార్లకొక్కమనవి; మూఁడవయింటి దొడ్డవకీలుగారైన ప్రభాకరపంతులు వారికడ నేగి యాచకధనముఁదేకలోఁ బోఁగూడదని చెప్పియు నామాటలను లక్ష్యముంపక లోపల వచ్చిరి," అనెను.

దొడ్డవారెల్లరు నవ్వుచుండఁగ వారిలో నొకరుఁడు,

"ఓయి ఘనపాటి! ప్రభాకరపంతులు వారికడను వెళ్ళిరాక మేము కాసుగూడా వదిలిపెట్టము; పోయిరండు," అని చెప్పెను.

"అతని భృత్యుఁడు దుర్మార్గుడట నే! మార్గణులను మెడఁబట్టిత్రోసె నట నే! నన్నచ్చటికి బొమ్మనుట ధర్మమా?"

"మాయనుజీవులెట్లు తమనులోనవిడిచిరి? వారికిలంచముగట్టి వచ్చితిరా? వారికపరాధము విధియించెద," అని లాయర్గారు కోపము సేయఁగ,

"నావల్ల తమనౌకరి కపరాధమేల? వారియాజ్ఞనుమీఱి యేనులోఁ జొచ్చితి. కటకట! ఇదేమిశోధనవేళ! మీయాజ్ఞను నుల్లంఘనము సేయలేక నావెన్నున బోటులుపడినాఁ బడుకొనివచ్చెద. మీరునను నుత్తచేతులతోఁ బంపకుఁడు; ఇంతియ నాప్రార్థన," అంచు, వేదవిదుండు వీధికివెళ్ళి, క్షుద్బాధపడుట గాక దెబ్బలు బడవలసిన కాలమువచ్చెనని చింతించుచుఁ గొంతసేపాలోచించి, ధైర్యముఁ దెచ్చుకొని, ప్రభాకరపంతులువారి వీధివాకిటఁబోయి, ద్వారపాలకుని బిలిచి, శాసనంబిడుకంఠనాదంబుతో, "మా

వద్ధకులున్నారా? ఏమిచేసెదరు?" అని, యడిగెను. ద్వారపాలకుఁడు బమ్మెరపడి, "తమ్మునేనెప్పుడు చూచియుండలేదు, స్వామీ! యజమానులు వారు మిద్దెమీఁద వర్తమానపత్రికఁ జదువుకొనుచున్నారు," అనియెను. వేదవిదుండు తెగువతో సోపానములనెక్కి మిద్దెమీఁదికివెళ్ళి, పత్రికఁజదువుచుండిన ప్రభాకరపంతులు వారియెదుట నిలఁబడి, "నమస్కారములు; ఏను మీవద్ధకుఁడను; బహుకాలముగ మిమ్ముఁజూడ నపేక్షయుండియు నవసరంబులేక పోయెను," అనెను.

పంతులు తనచేతనుండిన పత్రికను మేజమీఁదఁ బారవేసి, తనచేతిని నెత్తిమీఁదఁ బెట్టుకొని తనలోఁదాను, "నాకు తోడియల్లుండెవ్వఁడు? నా భార్యకు సవతితల్లికూఁతుని మగఁడు బహుకాలమునకు బూర్వమే కాశీయాత్రకువెళ్ళి తిరిగి రాలేదనుచుండిరి; అతఁడు కాఁబోలు," అనితలఁచి,

"తామెచ్చోటునుండి వచ్చితిరి?" అని యడిగెను.

"ఏనెటుల వద్ధకుండని తెలిసికొంటిరా?"

"తాము చెప్పిన దెలిసికొనియెద."

"పెద్దామె నా భార్య; చిన్నామె తమయిల్లాలు."

పంతులు తనభార్యకు మాఱుతల్లి కూఁతురుమగఁడే యనుకొని, "పెద్దామెనామంబేమి?" అని, యడిగెను.

"తమచెయింబట్టిన చిన్నమ్మపేరు శ్రీదేవి, నాచెయింబట్టిన యది పెద్దమ్మ, మూదేవి."

పంతులుగారు కోపముతోఁ గూడిన నవ్వుతో,

"తాము యాచకార్థమై వచ్చినవారా? నాసేవకుండే లాగున దమను పైకిబోనిచ్చె?" అని యడిగెను.

"నావద్ధకుండేమిచేసెదరని యడుగఁ దమ సేవకుండుబమ్మెరచెందె; అపుడు నేను సరసర వచ్చితి."

''నా సేవకుఁ డీవరకు నెట్టి యాచకుని లోఁగలికి విడిచిన వాఁడుగాఁడు; నేనే వానికిఁ బైసాగూడ యిచ్చినవాఁడనుగాను. తమ బుద్ధిచాతుర్యము చేత నా సేవకుని నేమరించి వచ్చితిరి; దేవుఁడిచ్చిన కాళ్ళు సేతులు బాగుగ నుండగ బనిపాటులఁ జేయక రిక్తవేసమున బ్రతికెడి వారిఁజూడ నాకసహ్యము. అయినను దమ చతురోక్తులకుఁగాను పాతికరూపాయ నిచ్చెద,'' అని పావులానతని చేతఁ బెట్టి ''పొండు శాస్త్రులు; నమస్కారములు,'' అని చెప్పెను.

వేదవిదుండా పావులాను ముదముతోఁ గైకొని, పత్రం, పుష్పం, ఫలం, తోయం' అన్నట్టు నీపాతిక రూపాయకే నేను తనివినొందితి; కృప నుంపుడు,'' అనుచు వారోహణంబుల నవరోహణము చేయు తరుణంబున, ప్రభాకరపంతులు, ''ఓయి శాస్త్రులు,'' అని పిలిచి,

''కృపనుంపుడని చెప్పుచు బోయెదరు; మరల తాము దమ శిరమును నాయెదుటఁ జూపకుఁడు; నా సేవకుఁడు తమకుఁ దగిన శాంతిఁ జేయక వదలడు; భద్రం; దిగిపొండు,'' అనెను. ''అబ్బ; ఇంత లుబ్ధత్వమా? కృపణులయొద్దనే లక్ష్మీవాసము చేయుచున్నది; ఇట్టి విధి నేమనఁదగు,'' అని తల పోయుచు, వేదవిదుఁడు మెల్లఁగ మెట్లనుదిగి, వీధికి వెళ్ళి, జంబయ్యగారి బంగళాలోఁ జేరియెను. ఆడుచుండినవారు తమ యాటను నిలిపి లాభలోభములను లెక్కపెట్టుకొనుచుండిరి. వేదవిదుఁడు తాఁదెచ్చిన పాతికరూపాయను వారికిఁ జూపగ వారిలో నొరువుఁడు, ''ఓయి శాస్త్రులు; తాము ఘనపాఠి యనుకొనుచున్నారు; తమకు బొంకులేల? మామాటలు విని ప్రహారమేల భయించెనని నిక్కము వక్కాణించి మాయొద్ద రెండురూకలఁ దీసికొని వెళ్ళరాదా? పాతికరూపాయఁ దెచ్చినట్టు తప్పుకూఁతలేల,'' అనెను. వేదవిదుఁడు తానేలాగున పంతులువారి సమీపించి యేమాటలఁజెప్పి పావులా సంపాదించెనో యావిషయములను సవిస్తరముగఁ జెప్పినంతట నందఱు పక్కున నవ్విరి. పందెములో లాభమునొందిన వారైన వియ్యంకులిరువురుఁ

జేరియొకరూపాయ బాపనునికిచ్చిరి. బ్రాహ్మణోత్తముఁడు ''పురుషసూక్తమున గొంతభాగమును జటఘన క్రమములతోఁ జెప్పి, దీవనఁ బాలిచ్చి, నమస్కరించి ముదముతో వెళ్ళెను. వీధివాకిట పీపాయి విప్రవరుని నడ్డగించి నిలువబడగ నతని చేత పంతులిచ్చిన పాతికరూపాయను బెట్టి యాశీర్వదించి వెళ్ళెను.

భద్రయ్య తనయింటికి మరలగ నతనిభార్య చీట్లాట ముగిసెనా యని యడిగెను.

''నాకు లాభము వచ్చెను; ఈవరకేమి చేయుచుంటివి? నీకూఁతురితో మాటాడుచుంటివా?''

''ఆలుమగండ్రిరువురు ముచ్చటింపగ వినుచు సంతసించుచుంటి; లతయుఁ బెండ్లిచేసికొని దానిమగనితోఁ గాపురము చేయునని తలఁచినదానను గాను. వారిరువురి యన్యోన్య ప్రియములఁగని నామనంబుప్పొంగె.''

''నీకూఁతుకడ నెన్నాళ్ళుండినా నీయాశతీరదు; మనము గ్రామము విడిచి చాలుదినములాయె. పైరుపంటలేమాయెనో; ఇల్లేమాయెనో; బత్తెకాడు మనయింటఁ బండుకొనుచున్నాడో, లేక, లేదో; నేటికైన రేపైన మనము తిరిగి పోవలసినవారము.''

''తాము వకీలుగారితోఁ జెప్పి మనచిన్నవాని నొకయుద్యోగమున బెట్టిన నామనసు నెమ్మదిజెందు''.

''ఎన్నియోతడవలు చెప్పియు నతఁడు జవాబియ్యఁడు; ఏనేమి చేయఁగలను?''

''మనచిన్నవాఁడు కొలువునఁగుదురగఁ జూచి వెళ్ళుటకు గాచియుండెదమని చెప్పిన నతఁడు కొంతశ్రద్ధ తీసికొనును''.

''నీకోడలు నీయెడ దృష్టికరముగ నడుచుకొనుచున్నదా?''

''దానియందు నా కతృప్తిలేదు; దానితో నాకేమిపని? దానిబిడ్డల రెంట్సి నేవేళఁ బెట్టుకొని యుండెద; ఆబిడ్డలతోఁ బ్రొద్దుపోవుచున్నది; తమ

వెంట నేను శ్రీమంతపల్లెకువచ్చినా బిడ్డలజ్ఞాపకమే యుండు. చిన్నవానికొక యుద్యోగము లభియించినవానియింటఁ గొన్నాళ్ళుందు.''

''నీకోడలు గట్టిదా?''

''దానివరకు నదిగట్టిదే; పరులసొత్తుకాశపడదు; తన సొమ్ముల నితరులు దాఁకనియ్యదు; తనయుప్పలగూడా తాఁకనీయదు; తనపురుషుని దన మాట కడ్డము చెప్పనియ్యదు''

''తల్లీ! లాయర్గారింట, 'అయ్యాఆతపత్రం, అమ్మాయీతపత్రం,' అనుచున్నారు,'' అని, సేవకుఁడు చెప్పెను.

''ఏమి, వెఱ్ఱి కూఁతలఁగూసెదవు? ఆతపత్రమేమి? ఈతపత్రమేమి?''

''తల్లీ! ఈతాకుకొనలో ముల్లుండుటచేత బరులదగ్గఱ రానీయదట; గొడుగు బయటికి దీసికొని వెళ్ళునపుడు తెఱవబడియు విస్తరింపబడియు వహించినవారికి గౌరవమును రక్షకమునునిచ్చు; అట్టిగొడుగింటికిఁ దేఁబడిన ముడుచుకొని యొకమూలలోఁ జీలమీఁద వ్రేలాడుచున్నది. ఆలాగున మనరంగనాథుఁడు'' అని ముగించునంతలో;

''నోరుమూసికొని వీధికి వెళ్ళుము,'' అని సుబ్బమ్మ కోపపడెను.

''ఈమాటలనవచ్చు; ఈమాటలనరాదు; అని మనపంచమికి తెలియ లేదు,'' అని, భద్రయ్య చెప్పె.

''ఈమాటలను మనవియ్యంకులువినిన వారిమనమున సంకటముగల్గు,'' అని, సుబ్బమ్మ చెప్పె.

భ. వివేకములేనివానితో నేమిచేయఁగలము?

సు. వకీలుగారి యిల్లాలు నను భోజనమునకు రమ్మని పిలిచిపోయె.

''చీట్లాడుచుండగ వియ్యంకుఁడు నను బిలిచె; ఇద్దఱుపదము,'' అను చుండగ జంబయ్యగారువచ్చి యందఱిని భోజనమునకు బిలుచుకొనిపోయెను.

భోజనకాలమున భద్రయ్యతనకుమారునితో, ''కొలువులేక యెన్నాళ్లూరకుందువు? ఏమిచేయనుద్దేశించి యుండెదవు?'' అని, యడిగెను.

''సర్కారుకొలువు వెచ్చోటజిక్కలేదు; ఆంగ్లేయవర్తమాన పత్రికకు వృత్తాంతలేఖరియను కొలువుకు నుద్యమించియుండెద.''

''నీకేయుద్యోగమును దొరకకుండుటచేత నేనును నీతల్లియు నిచ్చోటు నుండవలసినవారము; గ్రామమున బైరుపంటలు చెడి యీసంవత్సరమున నష్టముగల్గు.''

''నాలుఁగుదినముల కొక్కతడవ పత్రికాధికారి కచేరికి వెళ్ళుచుండిన నధికారికి జ్ఞాపకముండు,'' అని జంబయ్య చెప్పెను.

''రెండు బిడ్డలకు దండ్రియయ్యు సంపాదింపవలెనను విచారముండునట్లు తెలియలేదు; నీసెలవులకు బ్రతిమాసము నేఁబదిరూపాయలంపుచు నేను కష్టపడుచుండు విషయము నీమనసున దగలలేదు. ఎన్నాళ్లు నీమామగారియింటను నాయల్లుని యింటను భుజియించుచుండవలెను?''

''నాయన! ఇఁగరూపాయలు బంపఁబనిలేదు; తమసెలవులుపోను మిగులురూపాయలఁ దమకుఁ గావలసినవారికిఁ బంపుడు; నాకొఱకు గాచియుండఁ బనిలేదు.''

''నాకుగావలసినవారు నీవుగాక మఱియెవ్వరు? ముఁతాళ్!''

''బాల్యముజెల్లిన పుత్రునియెడ మిత్రునివలె నడచుకొనవలెనని లోకులనుకొందురు,'' అని జంబయ్య చెప్పగ, ''నాసుతుని నేను దూషించితినా? అవహేళనము చేసితినా? నాకష్టసుఖముల జెప్పుకొంటి,'' అని భద్రయ్య చెప్పెను.

''అయ్యోపాపము! నాయల్లునిమీఁద దోషములేదు; అతను పోని తావులేదు; వేడుకొనబడని దొడ్డవారును లేరు; సర్వప్రయత్నములఁ జేసియు గూడివచ్చువేళ రాలేదు.''

''ఏను ఱేపు మాగ్రామమునకు వెళ్ళ నానతినిండు.''

''తమకుమారునిపైయుండు కోపముచేత వెళ్ళవలెనా?''

"కోపమేల స్వామీ! సర్వప్రయత్నములఁ జేసినట్లు తమవాచా చెప్పినదే చాలు; గ్రామమునకు తిరిగిపోవలెనని మొన్నటిరోజున మనవిచేసియుండలేదా?"

"రెండుదినములు నాయింటను రెండుదినములు దమయల్లునియింటను నుండి వెళ్ళిన నాకు సమ్మతము."

"మంచిది; ఆలాగే."

మూఁడవనాటి యుదయంబున రంగనాధునిగొలువుకురమ్మని పత్రికాధికారియొద్దనుండి జాబువచ్చె; దానిజూచి యతనితల్లిదండ్రులు సంతసించిరి. మఱుసటిదినమున భద్రయ్య భార్యాసమేతుఁడై తనగ్రామమునకు మరలెను.

---

20 వ, అధ్యాయము.

బాలాంబగారి పూర్వచరిత్ర సంగ్రహమును, లతాంగి కేశవపురమున నుపన్యసించుటయు.

ఈగ్రంథముఁ జదివెడివారికి శ్రీమతి బాలాంబగారిని బరిచయ పఱచితిమిగాని, యామె యెవ్వరని తెలియఁజెప్పలేదు. కనుక నామె పూర్వచరిత్రమును సంక్షేపించి చెప్పెదము.

శ్రీమతి బాలాంబగారు గుప్తవర్ణముఁ జేరినయామె. ఆమెతల్లిదండ్రులు సామాన్యస్థితినుండి, తమకొక్కముద్దు కూఁతురైన బాలాంబను గారాబముతోఁ బెంచిచదివించిరి. ఆమె శశిపురమున లతాంగితో సర్వకలాశాల ప్రవేశపరీక్షకుఁ గూర్చుండెను. బాలాంబకుఁ బైపైఁజదువ నాసక్తియుండియు, పరీక్ష నిచ్చినవెంటనే వివాహంబై, వివాహముచేసికొనిన పురుషుండు మైకొనియు నామె మామగారు పైజదువుకూడదని నిర్బంధము చేసినందున జదువును విధిలేక చాలించి, కనుగందుచుండెను. ఆమెపురుషు

నికి మునిసిపల్కచ్చేరిలో నుద్యోగము. ఆమెముఖమును దక్కిన యంగములఁ జూచిన గఱిగించిపోసిన విగ్రహమువలె నుండును; మంచి స్నేహపాత్రి; లతాంగి స్త్రీసమాజము నియమింప నుద్దేశముకొని యుండుట నెఱింగి, తనవల్ల ద్రవ్యసాహాయ్యము లేకుండినా పాటుపడనిశ్చయించి, తనకుఁ దీరుపాటుండునప్పుడెల్ల లతాంగియొద్దకుఁ జని సమాజ సంబంధమైన కర్జంబుల నుత్సాహముతోఁ జేయుచుండెను. ఒకనాఁడు బాలాంబగారు లతాంగిని సంధించి, శశిపురమున స్థాపితమైన వనితాసమాజమునకు మద్దతుగ శాఖానగరములలో సమాజములేర్పడని చోఁదమ యుద్దేశములు నెఱవేరవనియుఁ బూర్వమేఁ గొన్నిస్థలములనుండి యాహ్వానపత్రికలు వచ్చియుండుటచేత నట్లు వచ్చియుండు స్థలములలో శ్రీమతి కనకమ్మగారుండు కేశవపురమునకుఁ దొలుతఁ బోవచ్చెననియు, పెద్దపల్లెటూర్లకు వెళ్ళి తమనిర్ణయోద్దేశములను వెల్లడించి సాధ్యమైనచోట్ల సమాజముల నేర్పఱచి రావలెననియు నిశ్చయించిరి. ఇరువురు దమయభిప్రాయమును దమభర్తలకు విన్నవించి కేశవపురమునకు వెళ్ళఁదమ భర్తలయనుమతిఁ జెందిరి. పయనంబగుట కారురోజులుండగఁ దమనిర్ణయోద్దేశమును శ్రీమతి కనకమ్మగారికి వ్రాసిపంపిరి.

'పూజపెట్టె, కాగితములు, ఊటకలము, ముకురము, కంకతిక, కుంకుమభరణి, తెల్లనిపలువ, అఱచేట్ట,' వీటింజేర్చిపెట్టిన పెట్టియ యొకటియు, హస్తవహనీయమైన మడతమంచేముఁగల సంచియొక్కటియు, రెండుపధానములతోఁ బలుచేనిమెత్తను జముకాణమున జుట్టి దారముతోఁ గట్టపడిన మూటయొక్కటియు, యీమూఁడుమూటలతోఁ జేతఁగంచుకూజాఁబట్టుకొని, జేబులో మడిచివేసికొనఁదగిన మృదువైన పాదరక్షలఁ దొడుగుకొని లతాంగి పయనమయ్యెను. బాలాంబగారు జినపనార పాపోసులదొడుగుకొని, చేతనొక కూజాబట్టుకొని, బట్టను తలిమముతో జెట్టికట్టిన మూటతో వెలువడెను. ఇరువురును ధ-పంచమిని వెంటబెట్టుకొని రయిలు కడఁజని, స్త్రీలకు బ్రత్యేకముగనుండు బండిలో నెక్కనంతటఁ బ్రక్కనుండిన బండిలో ధ-

పంచమి కూర్చుండెను. రైలుబండ్లు రాత్రియంతయు నినుపపట్టాలమీఁదఁ బాఱి యుదయమున కేశవపురమున నిలిచెను. తమగము (ప్లాట్‌ఫారం) మీఁద నలువురితో కనకమ్మ కాచుకొనియుండెను. లతాంగి బండివిడిచి దిగినతోడనే, కాచియుండినవారు లతాంగికిని బాలాంబగారికిని జేమోడ్పు చేసి, చేతులఁబట్టి యాడించిరి. మాకుఁ బసయెచ్చట? ఎంతదూరమునను న్నది?’’ అని, లతాంగి యడుగ, పిలిచిన వినబడు నంతదూరమున నుండు నట్లు కనకమ్మచెప్పె.

‘‘రాత్రియంతయు రైలుబండిలోఁ బడవేసినకాళ్ళు పడవేసి నట్లుండి నందున, కాళ్ళు బిరుసై తిమురుపట్టినట్లున్నవి; కనుక నడచిపోయినబాగు,’’ అని లతాంగి చెప్పినందున వారికిగాను వచ్చియుండిన యశ్వయానమున మూట ముడుపులఁబెట్టి, ధ-పంచమిని నందున రమ్మనిచెప్పి, యందఱు నడచి పోయిరి. కొంత నేవటికి మామిడియాకుతోరణముల గట్టి యశోకపర్ణములతో జొట్టబడియుండిన ద్వార స్తంబములు గల పందిలికడను నిలిచిరి. ఆద్వార స్తంబముల శిఖరములకు బంధింపబడిన వెదురుబ్రద్దల కమానును గప్పియుండిన కాగితముమీఁద ‘కాకిబంగారు’ రేకుల నక్షరరూపముగ గత్రించి యంటింపబడి యుండెను. ‘‘దయచేయుడు! తమరాకను నాహ్లాదముతో నెదురు చూచుచుండి నేఁడు గృతార్థులైతిమి,’’ అనియుండిన యక్షరములజేదివి’ లతాంగి ముదముతోఁ బందిలిలోఁ గాజేని పైకప్పుఁజోడగ నదిజాలరులతోఁ గూడిన రవసిల్లాతో రమణీయముగ శృంగారింపబడి యుండెను. మధ్య నొకవర్తులమైన చేలువజాతి మేజయు దానిముందఱ దీర్ఘ బాహువులతోఁ గూడిన రెండుకూర్చీలును నిరుప్రక్కల నాలుఁగుకాళ్ళ బల్లలును నమర్పబడి యుండెను. కూర్చీలమీఁద లతాంగియు బాలాంబగారును గూర్చుండిరి. కనకమ్మగారును దర్శనార్థమై వచ్చినవారును బల్లలమీఁదఁ గూర్చుండి యుండగ, పందిలిలోగిటను వెలుపటను వేడుకార్థమైవచ్చినవారు నిలువఁబడి యుండిరి. వచ్చిన వారికెల్లరకు లతాంగి దండములుసమర్పించి కూర్చుండు

డనెను. రెండుగడియలకు బిమ్మట లతాంగి స్నానపూజలకు లేచుచు వచ్చి యుండినవారిని సాయము కూటముకూడు సమయమున రమ్మని చెప్పినంతట నందఱు వల్లెయని వెళ్ళిరి.

లతాంగియుబాలాంబయు నోగిర మొనర్చి కొంతయూరటజెంది కూర్చుండి మాటాడుచుండిరి; అపుడు కనకమ్మవచ్చెను. ‘‘ఏడకూటము కూడబోవుదరు? ఎచ్చోసమాజము స్థాపింపనుద్దేశించి యుండెదరు,’’ అని లతాంగి యడుగ కనకమ్మగారు, భజనమందిరమునకు గట్టబడిన నాల్గవయింటిలో సమాజస్థాపన జేయునట్లును నామందిరమున నుండు కూటము విశాలమై నూటయేఁబదిమంది కూర్చుండగలస్థలముగల యట్లును, కూటముతోఁజేరిన పంచపాళిలో నేఁబదిమంది గూర్చుండగలరనియుఁ దెలిపించెను.

సాయంత్రము సుమారేఁ బదిస్త్రీలును నూరుపురుషులును మందిరమునఁ గూడిరి. కేశవపురమున కేడుమైళ్ళదూరమున బురుషుల మహాకూటము ముందుదినమున గూడినందున నచ్చోవచ్చియుండిన రంగనాథుఁడు కేశవపురమున స్త్రీలుకూటముకూడ బోవుచున్నారని ప్రకటనవల్ల నెఱింగి సాయంత్రము నాలుఁగుగంటలకు లతాంగి దిగియుండినచోటి కరుగుదెంచి తానేలాగున రానాయెనో యాసంగతిని దనచెల్లియకు సవిస్తరముగఁజెప్పె. ఇంచుకఫలాహారము దీసికొన్న వెనుక మూవురును మందిరమునకు వెళ్లిరి. లతాంగి రాకఁగని కనకమ్మగారు మువ్వురికిఁ బ్రవేశపెట్టుటకు నాలుఁగడుగులు ముందరజేని, వారికరములఁబట్టి లోన బిలుచుకొనివచ్చి కూర్చుండఁజేసెను. కనకమ్మలేచి మునిసిపల్సభానాయకునిన గ్రాసనాధిపతిగ గోరగనతండు తాఁ గూర్చుండినచోటువిడిచి యగ్రాసనంబు కడనరుదెంచి, ‘‘శ్రీమతి లతాంగి యమ్మగారి నామమును గీర్తియు మనకెల్లరకు దెలిసిన విషయము; మన నగరమందున్న స్త్రీల పాఠశాలకుఁ బ్రధమోపాధ్యాయినియైన శ్రీమతి కనకమ్మగారును మఱియు గొందఱును శ్రీమతి లతాంగియమ్మగారిని రమ్మని ప్రార్థించినందుమీఁద నామె విజయముచేసి యుండెదరు. ఆమె చెప్పఁ

బోయెడి విషయములను మనము ప్రీతియుతో నవధరించి సంతోషింపగల వారము,'' అని చెప్పి, కూర్చుండెను.

లతాంగి లేచినంతటఁ గరఘోషంబులు వినబడెను. ఆమె యుపన్యసించిన విషయములలోఁ బ్రధానమైన వాటిని మాత్ర మిచ్చో వ్రాసెదము.

''అగ్రాసనాధిపతిగార! అప్పజెల్లెండ్రార! ఘనులార! జ్ఞానమును సూచించే ముఖములఁ బడసి యీమహాసభ నలంకరించియుండు మీకభిముఖముగ నిలిచి ప్రసంగము చేయుటకు నేనెంత భాగ్యంబు జేసితో! మీముఖ ప్రసన్నత నాకెంతో యాహ్లాదకరముగను బ్రోత్సాహకరముగను నున్నయది. ప్రధాననగరమైన శశిపురమున నివసించే స్త్రీలసంఖ్య యీనగరమునవాసించే స్త్రీలసంఖ్యకుఁ దొమ్మిది పాళ్ళధికమై యున్నయది. ఈట స్త్రీ సమాజమేర్పడక మునుపు, స్త్రీలందఱుఁ దమతమ యిండ్ల లోపద్దులలో జలనము చేయుచుండిరి. గర్భాగారము, కూటము, బానసము—యివియే వారు విహరించి విశ్రమించే స్థలములు పురుషులు ప్రతిదినము నుద్యోగార్థమై బహిర్గమనులై సందెజామున నింటికి మరలివచ్చియు సుహృదులతో సంభాషించుచుందురు. స్త్రీలు చదువుకొన్నవారై యింపుగ మాటాడను రమ్యముగ నడచుకొనను దెలిసినవారై యుండిన బురుషులు తమయింటి యాఁడువాండ్రతో మాటాడ బ్రియమును మనోరథమును గల్గియుందురు. ఇంటి యంగనలు విద్యావిహీనులై యుండుటవలన బురుషులు గర్భాగారమునకు జనుదెంచే పర్యంతము దమయింటి కాంతామణులతో సంభాషించుట కవకాశమును నుత్సాహమును లేకయుండెదరు. ఈ కారణముంబట్టి స్త్రీలకు ముఖ్యమైన సహవాస సాంగత్యములు వారి గృహకుడ్యములును స్తంభములును. స్త్రీలకు చదువులేమిడిచే బహునిర్బంధము లేర్పడియున్నవి. నిర్బంధములలోఁ జిక్కుకొనియుండు స్త్రీలబుద్ధియు దేహములును జిక్కియుండుటక్కజంబె! అట్టి స్త్రీల కుద్భవించే పురుషప్రజలు బలధైర్యశౌర్య వీర్యములఁ బొందియుండఁగలరా? బలమును ధైర్యాది గుణములు లేని పురుషుల

గణనీయంబై యుండిన నద్దేశము భావుకమై యుండునా? (ఇదుగోయను శబ్దములు)—నింగికి జొక్కు నెంతమాత్రమో యంతమాత్రము వసుమతికి మన నివాసము. అట్లణీయమైన గృహమే భూలోకమనితలఁచియుండు స్త్రీలు స్వార్థతత్పరులై యుండుటతో వారిబుద్ధి కనిష్ఠంబై యెంత పేదతనంబు నొందియుండు! నలుపురిజూచియు నలువురితో సంభాషించియు మనమెంతో నేర్చుకొనవలసినవారమై యుండెదము. ఒకరియెడ నొకరును లోకులవద్దను నడుచుకొనవలసిన ధర్మమును విధిక్రమములును బహులమై వాటికి మనము బద్ధులమైయుండగ నిల్లేగతియని యుండు స్త్రీలకు లోకజ్ఞానమును విధిక్రమజ్ఞానమును నెట్లుదయించే? ఇల్లుగాచియుండు స్త్రీలు సంభాషించే పద్ధతుల నెట్లెఱుంగుదురు? నలుగురితో మెలఁగిన, నలుగురియొద్ద మెదిగిన నాత్మసంభరిత్వము హరించి, లోకజ్ఞానానుభవములును జ్ఞానదృష్టియు విస్తరించును; మఱియు మనయందుఁ జిన్ననాటినుండియుండు దుర్భ్రమలను మూఢనమ్మికలను విదిలించుకొననగును. గృహకృత్యములఁ జూచుకొనుటతో గొంతసేపు యిల్లువిడిచి బయటికేగి పరిశుద్ధమైన వాయువును గ్రహించివచ్చిన దేహమున కెంత యారోగ్యము! కుటుంబమునగల హవ్యాసములఁ గొంతసేపు మఱచి స్నేహమును బరిచయమును గలవారి వదనముల గనిన నెంత మనోత్సాహము నెమ్మదిగ వారితో సంభాషించిన నెంత తెంపు! అట్టి యుత్సాహము చేతను దెంపుచేతను దేహమెంత పూరించును; 'నవ్వికండ పెంచే' అన్నట్లు, యింట గఱఁగిపోయిన కండ మిత్రుల ప్రోత్సాహముచేతను వారి యుత్సాహకరములైన సుప్రలాప సంలాపములచేతను బెరిగినచ్చును. దేహశక్తియు జ్ఞానాభివృద్ధియుఁ గల స్త్రీలగర్భములో నుదయించే బిడ్డలు పెద్దవారైనపుడు దేశభూషణులై యన్యదేశస్థులు గణ్యతబెట్టి గౌరవించుటకుఁ బాత్రులునునై దేశాభివృద్ధికి నాస్పదులునై యుందురు. (ఇదుగో యనుశబ్దములు). లోకులమనోభావంబులను జిత్తవృత్తులను నెఱిఁగెడి యింద్రియములు స్త్రీలకు బురుషులకంటె వాడిగ్యైనవి యని

లోకులు వాడుకొనియెదరు. బాలురకు విద్యగఱపుటయందుఁ బురుషుల కంటె స్త్రీలకు గుశలత యెక్కువయని 'అమెరికా,' 'ఐరోపియా'—యీ ఖండములలో నివసించేవారి యనుభవసిద్ధాంత మేర్పడియున్నది. ఆ రెండు ఖండములలో బాలురకు నెనిమిది, లేక, తొమ్మిది వత్సరములవయస్సువరకు స్త్రీలే విద్యగఱపవలెనని నిర్ధారణచేసి, బాలుర పాఠశాలలో స్త్రీలనే బోధకత్తెలుగ నేర్పఱచియుండెదరు. బోధించుటకు స్త్రీలే యుండవలెనను టకు క్రీ, శ, 1854 వ, సంవత్సరమున అమెరికా ఖండములో విద్యాధ్యక్షులై యుండిన 'హెన్రీబెర్నార్డు' దొరగారు నొక్కిచెప్పిన కారణములేవి యనిన.—

(1) బాలురకు స్త్రీలయందుఁ బ్రీతియుఁ బక్షమును నెక్కువగనుండుట సహజము. (2) స్త్రీలు బిడ్డలయందు స్వభావముగ వాంఛగల్గియుండుట. (3) స్త్రీలకు శాంతగుణము మెండు. (4) తల్లి బిడ్డలతో మాటాడునట్లు చేల్లని మాటలతోను నింపైనమాటలతోను బిడ్డలను మెప్పించు గుణము. (5) సంభాషణము చేయురీతినబోధించి బాలురను సరియైనదోవకు దెప్పించుకుశలత. (6) బిడ్డలమనస్సుననుండుదానిని సూక్ష్మముగఁ గనుంగొనుశక్తి. (7) బిడ్డలకుదగిన యట్లు బోధపఱచుసామర్థ్యము. ఈలాటి కారణములంబట్టి, యింగ్లాండు దేశములోఁ బ్రతివత్సరమును బాలురపాఠశాలలనుండి పురుషబోధకులఁదీసి వేసి యుపాధ్యాయినీలసంఖ్యను వృద్ధిపఱచుచున్నారట. స్త్రీవిద్య రాజ్యంబునకొక గొప్పశక్తి. స్త్రీలవిద్యా స్వతంత్రములు దేశయోగక్షేమము లకు మూలాధారములు; కనుక, మీరెల్లరు దీర్ఘాలోచనచేసి స్త్రీల విద్యాస్వ తంత్రములఁ బ్రోత్సాహపఱచు విషయములలో శ్రద్ధతీసికొని మీవల్లైనంత పాటుపడుదురని నమ్ముచున్నదానను.

నారీరత్నములార! మీరందరు జేరి యొక స్త్రీసమాజం జేర్పఱచి వార్తాపత్రికలఁ జదువుచువచ్చిన నీభూమండలంబున బ్రస్తుతము జరుగువృ త్తాంతముల నెఱుంగుకొనుటచేత లోకజ్ఞానానుభవములభివృద్ధియగుట గాక,

తక్కినదేశములలోని స్త్రీలకు మనమెంతదూరము వెనుకబడియుండెదమని తెలిసికొనఁ గలవారమైయుందుము. మీరనుదినముఁగూడి సంభాషించుట చేత నైకమత్యమును గొలుపుకోలుతనమును నొందఁగలరు. ఇట్లొక్కొక్క నగరమునను, ప్రతినగరమందును వల్లపడకపోయినను బెక్కునగరములందై నను, నారీమణులకు జ్ఞానోదయంబును నైకమత్యమును గల్గునేని, మనకుఁ బ్రస్తుతముగల నిరపేక్షణీయమైన దశమాఱి, తక్కినదేశస్థుల మదింపులోను భావములోను నున్నతస్థితింబడయుట సిద్ధము; కనుక, యీనగరమున వాసము చేయు సోదరీమణులార! సమాజస్థాపనచేతను బరస్పర సంభాషణలచేతను విద్యాజ్ఞానంబుల యభివృద్ధిచేతను బొందఁగల ఫలములఁబడసి మేలుగాంచి, మనదేశమునకు మేలుదెత్తురుగాక! అని, సర్వేశ్వరుని బ్రార్థించెదను.'' (ఉచ్చైర్ఘుష్టంబులు). ననురప్పించినందుకు నీనగరవాసులకును శ్రీమతికన కమ్మగారికిని నాజోతములు (శిరమునువంచుచు). భూలోకవర్తమానముల నానాటికిఁ దెలిపించి లోకజ్ఞానము నభివృద్ధిపఱచుచు నానామమును వెల్లడిం చిన వార్తాపత్రికల యధికారులకు నాచేకూర్పు. (చేతులను గూర్చుచు) ఇట్టిపత్రికలను వేనవేలుగ రెండుగడియలలో ముద్రించెడి యంత్రములనుదొలు త దొరతనముచేసెడివారిదేశమున బ్రవేశపెట్టిన 'కాక్స్టర్' 'జాన్ వాల్టర్' యీదొరలనామమును జ్ఞాపకమున నుంచుకొనుటయందు మనకుగల యుత్సాహమును దెలుపఁగలవారము. (ఉత్సాహధ్వని). స్వేచ్ఛగ గమనము నేయుటకును బహిరంగముగఁ బ్రసంగముచేసి సంభాషించుటకును మనకు స్వతంత్రము నిచ్చియుండు మనల నేలువారికి నామనఃపూర్వకమైన వందన ములను సమర్పించెదను. (కరఘోషములునుత్సాహధ్వనులును). నాకుడిచేయి వలె నాతోబాటు వడుచువచ్చెడి శ్రీమతి బాలాంబగారికి నావందనములు. (కరఘోషములు).

ఇట్లు లతాంగి యుపన్యాసము ముగిసినంతట నగ్రాసనాధిపతి లేచి, "శ్రీమతి లతాంగియమ్మగారు బహుదూరమునుండి రయిలుమార్గమున

శ్రమపడి విచ్చేసి, స్త్రీవిద్యాస్వతంత్రముల గూర్చి యీనగరవాసులైన తన యప్పచెల్లెండ్ర మేలుఁగోరి, ప్రసంగము చేసిరి. ఆమె వచనములు శ్రవించి మన మెల్లర మానందభరితులై యున్నవారము. అందుకు మనము విశ్వాస బద్ధులమైయున్నవారము. ఆమెకు గుడిచెయిగనుండు శ్రీమతి బాలాంబగారికి నగరవాసులకుగాను నేను వందన మొనరించెదను. శ్రీమతుల మనస్సంతుష్టి కొఱకును మా మేలుకొఱకును నిప్పుడే స్త్రీసమాజము నేర్పఱచునటుల శ్రీమతి కనకమ్మగారు శాసనంబు బనిపినందున (కనకమ్మనవ్వుచే) నామెయాజ్ఞకులోఁబడిన వాఁడనై, యిష్టముఁగల స్త్రీరత్నములు నీపాత్రమున (మేజమీఁదనుండిన పుస్తమునుజూపుచే) తమనామమునుంజెప్పి వ్రాయించియు సంతకముచేసియు శ్రీమతి లతాంగి యమ్మచేతులార సమాజముఁ బ్రతిష్ఠ జేయించి వెళ్ళుదురని ప్రార్థించుచున్నాఁడను," అని, చెప్పికూర్చుండెను. లతాంగి కనకమ్మతో నాలోచించి, సమాజమునకు 'సకియల కూటువ' యని నామం బిడవలెనెడి యభిప్రాయము గనుంగొని, లేచి, "నారీమణులార! ఘనులార! నేటిసుదినంబున నీపురమున "సకియలకూటువ" యను స్త్రీసమాజము ప్రతిష్ఠింపబడెనని చాటించెద," అనుచు నొకపుస్తకమున "సకియలకూటువ" అని మొగదలలో వ్రాసెను. వెంటనే కరఘోషములు కల్గి నిలిచెను. తోడుతో ముప్పది స్త్రీలు తమనామములఁజెప్పి యాపుస్తకమున వ్రాయించి సంతకముచేసిరి. గడియసేపు స్త్రీలుమాత్రము నిలిచి లతాంగితోను బాలాంబతోను సంభాషించి, తమనెలవులకుఁ గృతగమనులైరి.

మునిసిపలు సభానాయకుఁడును శ్రీమతి కనకమ్మగారును పాఠశాలలలోఁగల బాలురకును బాలికలకును మంచి మతులబోధపఱచి వెళ్ళవలెనని లతాంగిని బ్రార్థించినందుమీఁద, మఱుసటిదినమున సాయము నాలుఁగుగంటలకు మునిసిపలుబడియందు గూడిన పడుచువాండ్రకును బడుచులకును దిగువఁ జెప్పెడి రీతినమతుల బోధపఱచె.

"బాలురారా! బాలికలారా! మీకుబుద్ధిమతులఁ జెప్పివెళ్ళవలెనని నగరాధికారి తెలిపించినందున నాకుఁ దోఁచినవాటిని జెప్పెద; అవధరింపుడు.

ఆరోగ్యమైన దేహమును బుద్ధియుఁ బడసిన నరుండు పనివాటులులేక మనుటవద్యము. 'ఉద్యోగం పురుషలక్షణం' అన్నట్టు ఋణగ్రస్తుఁడుగాక మనుగడకు వలసినసొత్తులెంత మట్టుకున్నను వృత్తిలేక బద్ధకుఁడుగా నుండువాని బ్రతుకురిత్త. ఒడలువంగి పాటుపడ వలవికాని యలసుండు మన్నుటకు సత్తిలేకుండియు బిడ్డలకు జనకుండగునేని యతండన్యుల కష్టార్జితమునకు దోఁపరియనఁదగు. మనుగడ ప్రారంభమున నీసమ్మిక మీమనంబున దృఢముగా నాటుకొనఁజేయుఁడు. మీజీవితకాలమున నెమ్మదిగ నుండఁగోరిన, 'స్వశక్తి, స్వబుద్ధి, స్వయంకృషి,' వీటినే నమ్మియుండుడు. సంతుష్టి స్వతంత్రమువల్లనే గల్గు. మీరు మీకార్యసిద్ధికి బరులనుగ్రహింపవలెననిగాని, పక్షపాతము జూపవలెననిగాని, లేక, శ్రద్ధతీసికొనవలెననిగాని తలఁచిన నెమ్మది జెందఁజాలరు. అన్యుల దయయు గటాక్షము నాశ్రయించిన, మీరు వారికడిమె యగుదురు. ఇతరులనగ్గించి యొకఁడెన్నాళ్ళవరకు బ్రతుకనగు? మీవలె మఱియుఁ గొందఱు వారినిస్తోత్రము చేయఁదొడఁగుదురు; కొంతకాలములో గొండాడుటలో మిము మించిపోవుటగాక మీకు వైరులుగ నేర్పడుదురు; కనుక, చపలచిత్తులనమ్మి మీరేలాగున నెంతకాలము బ్రతుకఁగలరు? మీరెంత వివేకులైనను, వారువపరినా, వెఱ్ఱికూతలగూసినా, దురాలోచనలఁ జేసినా సరియని తలనూఁచేవలసిన వారుగాని వారి కృత్యములకైనా మాటలకైనా యడ్డముచెప్పవల్లపడదు. ఇట్టిబ్రతుకుగలవారికి నెమ్మది యుఁగలదా?

మంచిది, స్వతంత్రమును సంపాదించుమార్గమెద్ది?

లఘుజీవనము, అనగా, అగ్గువలో బ్రతుకుట. అక్కఱలకొలదిని నెమ్మది; అక్కఱలు తక్కువవైన నెమ్మది యెక్కువయగు. తృష్ణకు తుష్టి

లేదు; ఆశలు లేశమైన శోకక్లేశంబులు లేశమగును. అగత్యములధికముగ గల వాని కల్పసంతుష్టి. ఈ వాక్యములు మీ మదినఁబాదుకొన్న మీ యోగక్షేమము లక్షయమగు. బట్టలు, తిండి, పానము—యివి పైఁజెప్పిన నీతి విధుల జేరియున్నవి.

ఒకఁడెంత ఘనుఁడైనా ధనవంతుఁడైనా, యెట్టి జ్ఞానవంతుఁడైనా, యెటువంటి ప్రతిభయైనా, యేలాటి నేర్పరియైనా వివేకమును మితవ్యయమును లేనిచోఁ జిక్కబడదు. జగమును మెప్పించే జ్ఞానముతోఁగూడియు, సాటిలేని చమత్కారముగల్గియు, లోకులు గౌరవింపదగిన గొనములబొందియు, నిజముకాని, అనగా, మనఃకల్పితమైన కొఱఁతలఁ దీర్చుటకై, మితమునకు మించిన ఖర్చులఁ బెట్టుకొన్నందున బికారులై చిన్నఁబనమునొంది చీవాట్లుపడుచు ఖేదించుచుండు గర్వ్యుల నెందఱినో కనియుం వినియునుండెదము. అరుదైన జ్ఞానముఁ బడసినవాఁడు కొలఁది లేక వెచ్చింప నిచ్చగలవాఁడగునేని ధనాఢ్యుని నండగొనవలసినవాఁడై యతని దాక్షిణ్యమునకు లోబడవలసి, తనజ్ఞానము స్వకీయలాభమునకైన దన దేశాభివృద్ధికైన నొదవక భాగ్యవంతుని మూఢత్వమునకును మేలుకునే ప్రయోగింపబడును.

బట్టలలో దూఁబఱదిండెగ నుండకుఁడు. మురికిలేనిబట్టల దొడుగవలెగాని పట్టంచేదోవతులైనా సరిగ పంచలైన నక్కఱలేదు. ఈవిషయమునెల్లరును, ముఖ్యముగా బాలురు గమనించుటకుఁ దగినయది. ఒకఁడు వస్త్రమునకు విపరీతమైన సెలవుల బెట్టుకొనుట కాదిమూల మతని మమతయే; ఇది తక్కిన మమతలలో మిక్కిలి తిరస్కరింపఁదగినయది. అంగముఁ గప్పుకొనుట మానమును రక్షించుటకుగాని భూషణార్థముగాదు. అహంకారముచేత నే మానవుండు దేహాలంకారముఁ జేసికొను. ఉత్సవాదులకును నాటకశాలలకును నొకండు వెలువడునపుడు పరులు తన్ను మెచ్చుకొనంగోరి వెలపొడుగైన వస్త్రముల ధరించి వెళ్ళుచున్నాఁడు. వీధివెంబడి వెళ్ళునపుడు జనులొక్కొక్కరుఁదను జూతురనియుఁ దనమంచి యుడుపులంగని యధికమర్యాద

యు గౌరవముఁ బెట్టుదురని తలంపుకొని దేహచ్ఛదమునకై విశేషద్రవ్యమును వినియోగము చేయుచున్నాఁడు. ఇట్టి పొరపాటైన యభిప్రాయముఁ గలవాఁడు మూఢుఁడనందగు. తెలివిగలవారు నినుజూచియైనా నీయుడుపుల జూచియైనా యేమియు నెంచుకొనరు; నీవలె మమతకొన్నవారు వారి నేమరింప యత్నించెదవని నిను దూషింతురు; నీవలె మమతకొనియు నీవలె బట్టలఁదీసి తొడుగుకొన శక్తిలేనివారు నినుఁజూచి చూపోపమిచేత దూఱుదురు; ధనికులు నిను మతింపరు; ద్రవ్యముఁగలవారుఁగూడా డంబముఁగల వస్త్రములఁగొని రూకల వ్యర్థము చేయుటకుఁ గారణమగపడదు. వెలుపటి శృంగారముచేత హితమైనా గుణమైనా కనుంగొనలేము. లోకులు నీయోగ్యతాంశములంబట్టియు నీవెంతటి ప్రయోజనకరుండని తెలిసికొనియు నినుమతింతురు. కొన్ని స్త్రీలకు మాత్రము డాంబికమైన యుడుపులకుఁ బక్షపాతమున్నను మగవారియందా డాంబికముండిన దూషింతురేకాని భూషింపరు. నీ మంచిబట్టలజూచి స్త్రీలు ప్రియంపడుదురని భావించుకొనుట పొరపాటు. స్త్రీలకు సూక్ష్మబుద్ధిగలదు; వారి నేమరించుట కష్టసాధ్యము. నీవు చింపియలఁ దొడుగుకొనియుండినా మాసినపుట్టములఁ గట్టియుండినా నీనిజరూపగుణంబులఁ గనుంగొన వారికి శక్తికలదు. మీరు ధరించువస్త్రము లెంత తక్కువవెలలో నుండినా జింతలేదు; చింపియలమాత్రముఁ దొడుగకుడు. శుభ్రము జూడవలెగాని మెఱుఁగుజూడఁ బనిలేదు. దీర్ఘకాలమునకు వచ్చునాయని చూడవలెగాని నాజూకైన నేతను లక్ష్యముంపవలదు. ఎక్కువ వెలఁగల బట్టలఁ దొడుగుకొన్నందున మిముఁ దెలివిపరులు గౌరవించి ప్రియంపడుదురని తలంతురేని మీవంటి మూఢులేవ్వరునులేరు. శీతోష్ణస్థితికిఁదగిన సామాన్య యుడుపులను వృత్తికిఁదగిన పాదరక్షలును దొడుగుకొనుఁడు.

ఆహారము:—మితభోజనుఁడు నిరోగియై చిరంజీవిగనుండు; తిండిపోతు తెగులుఁదెచ్చుకొని పనికిరాని సోమరియగు. బాలురను బొత్తిగఁ జెడ

గొట్టు తిండిపోతుతనముఁ బెద్దలును నిరసింపఁదగినయది. మితముమించిన నమృతమును విషమగును. ఆఁకలి కొలఁదియు వారివారి రుచిననుసరించియు భుజించుటలో దోషములేదు; భోజన విషయమున వారివారి యిష్టానుసారమున కన్యథా నడచుకొనవలెనని యేను చెప్పలేను; అయినను, పావులా సెలవుచేసి పోషకమైన పదార్థములఁగొని యాఁకలిఁ దీర్చుకొనుటకు మాఱుగా నొకఁడు రసనేంద్రియమునకు లోఁబడి రెండు రూపాయలు సెలవుచేసి ప్రియవస్తువులఁగొని వాసన వస్తువులజేర్చి యాఁకలిఁ దీర్చుకొనుట యుక్తమా? వ్యయ మధికమగుటతో నెందఱికి శ్రమ! ఎంత శ్రమ! ఒకఁడొక పూఁట కుడుచుటకు నలువురిని శ్రమపెట్టవలెనా? పైఁగా ప్రియమైన తినుబండములు అఱుగుటరిది. రుచిఁగల పదార్థముల గోరుట సహజమైనను, తిండికి బ్రాధమ్యమిచ్చువాఁడును, తిండికి బరిమితి లేనివాఁడును బనికిమాలినవాఁడు గాఁబడు. మితముగాక, కాలనియమ ముండవలెను; లేనిచో జీర్ణశక్తి మందగించు. అన్నము గొంచెము మించినఁ బాలుమాలిక; నేన సగ్గిన జఠరాగ్నిలోలో భక్షించు.

ఉదయమున బడక విడిచి లేచినపుడు బాలుర పరగడుపుకు జెలివికి సమానములేదు. ఫలములకు మించిన యాహారములేదు. ఫలములచేత బుద్ధి తేటపడి తేఱు; సత్త్వలోనుత్తమము; అఱుగుటలో నతిత్వర. దంతములుగల జీవరాసుల యాహారమును వాటి దంతములఁగని తెలిసికొననగు. మానవుండాది కాలములో ఫలభక్షకుఁడని యొఱుకపడు. అయినను, పండ్లు దండిగ జిక్కవు; కాన, తక్కినపదార్థముల భుజింపఁ దటస్థించె. మనము భుజించుట కలవాటైన గింజలు, అనగా, 'రాగి, జొన్నలు, సజ్జలు, గోధుమలు, బియ్యము,' యీ వరుసక్రమమున నవి సత్త్వఁ గలయవి. బియ్యమునకంటె రాగిలో సత్త్వధికము; సత్త్వలో గోధుమకంటె రాగి యొక్కువ. జీర్ణమున కలవాటే ప్రధానము. తవుడు తొలఁగించిన బియ్యమును గంజివార్చిన యన్నమును బుష్టికరముగావు. నోటి యన్నము మృదువై పలుచనగు పర్యంతము కబళింపకుఁడు.

అమిత వ్యయపరులై కట్టికుడుచుటకే ధనమంతయు ధారపోసి దారిద్ర్యము నొందినవారు లెక్కలేక యున్నారు.

పానము:—దప్పితీర్చుకొనుటకు దాహము పుచ్చుకొనవలె గాని మత్తుగొనుటకు గాదు. స్వాభావమైన నీటికి సాటిలేదు. జలము నిర్దోగమైనయది. కాపినీళ్లు తేయాకునీళ్లు వీటిని విసర్జింపవలెను. వాటిలో రోగహేతువైన చెడ్డగుణములున్నట్లు వైద్యశాస్త్రజ్ఞులనుచున్నారు. ఆ నీళ్లకెంత ఖర్చు! ఎంత శ్రమ! శ్రమపడి తెగులు దెచ్చుకోనేల! వాటిని మందువలె బుచ్చుకొనుఁడు. చుట్ట త్రాగకుఁడు; పొగాకు దేహమున కారోగ్యకరముగాదు. పొగాకు నెన్నియో విధములుగ జనులుపయోగించెదరు. ఏ విధమున నుపయోగించినా చెరుపుగాని మంచికాదు.

మధుపానము గలలోనైన దలపకుఁడు. ఏఁజెప్పిన విషయముల మీరు గమనింతురేని మీ బ్రతుకు కాలమున మీకెట్టికొఱఁతయు రాఁజాలదు.''

ఒక బాలుఁడు లేచి 'లతమ్మకే జేయీభవా' యని యఱచినంతట దక్కినవారు నాలాగే శబ్దించిరి.

ఉదంతలేఖడియైరిన రంగనాథుఁడు ప్రసంగమున జరిగిన వృత్తాంతముల దన పత్రికలేఖకునికి వ్రాసిపంపెను. కనకమ్మగారు లతాంగి చెప్పిన విషయములను సవిస్తరముగఁ దెనుఁగు పత్రికలకు వ్రాసిపంపెను. మూఁడవ దినము వచ్చిన సమస్త వార్తాపత్రికలలో కేశవపురమున జరిగిన వృత్తాంతముల శేషముఁ బ్రచురింపబడి యుండెను.

శ్రీమతులిరువురును బురములోని దొడ్డవారి యిండ్లకుఁ జని, వారి యింటి యాడువాండ్రతోఁ గొంతసేపు సుప్రలాపము లాడి మర్యాద తాంబూలముఁ దీసికొని, రెండవ దినము రయిల్ మార్గమున జని కాశీపురముఁ జేరిరి. ఈ రీతిన పక్షమునకు, లేక, మాసమున కొక దిక్కున వెళ్లి వారు తీసిపెట్టియుండిన పరిచయకర చీట్లవల్లఁ బెక్కండ్రతోఁ బరిచయము చేసికొని గ్రామములలో సమాజముల స్థాపించుచు వచ్చిరి. అట్టి సమాజములన్నియు

మాతృసమాజమైన వనితా సమాజముతో నుత్తర ప్రత్యుత్తర సంబంధము బెట్టుకొనెను. కొంతకాలములో రాజధాని యందలి సమాజముల సంఖ్యయేఁబదికి పైబడెను. సమాజముఁజేరిన స్త్రీలు దేహారోగ్యముఁ బడయుచుఁ దమ యింటివారితోను లోకులయెడను మనోజ్ఞముగ నడుచుకొనుటకును నింపుగ సంభాషించుటకును నేర్చి, వారి నిర్దోషమైన రుచిరగుణనడవడికలచేత వారి ప్రాచీన నిర్బంధములు దమంత తఱిగి మేలుగాంచిరి,

---

21 – వ అధ్యాయము.

లతాంగియు నాలోకనార్థులును.

లతాంగి తాఁ గూర్చుండుటకు వీధిగదిలో నొకకూర్చియు నొక మేజయు నమర్చెను. ఆలోకనార్థులు గూర్చుండ మేజముందట నొక కూర్చియు రెండు ప్రక్కల రెండు బల్లలనమర్చెను. దినదినము సమాజ విషయము గుఱించి మాటాడుటకును సామాన్య విషయముల భాషించుటకును బెక్కుతెగల జేరినవారు వచ్చి పోవుచుండిరి.

ఒక నాటి యుదయమున నెనిమిది గంటలకు ధ.పంచమి యొక నామ చీటిని దెచ్చి యిచ్చుచు భయంకరమైన మాపుగల పొడుగు మనిషి వచ్చి యుండునట్లు తెలిపె. నామచీటియందు, దానవదాస్, మునిసిపల్సభికుఁడు, అని యచ్చువేయిబడి యుండెను. లతాంగి చీటిని జదివి లోపల రమ్మని చెప్పిపంపెను. వెంటనే తాటిచెట్టులో సగము పొడుగుగల కరటవర్ణుఁడు హ్రస్వముగ గత్తిరింపబడిన కచపాశముతోను వలీముఖంబు బోలిన ముఖంబుతోను మినుకు మినుకు మని పాతాళమున జంచలించుచుండిన తారకద్వయముతో గూడిన సూక్ష్మ నేత్రములతోను, సూకర రోమమువలె నుండిన గిరజామీసంబులతోను, మయూరవర్ణముగల చొక్కాయయు గొంగవర్ణము గల యిజారును గీలువన్నెగుగల బూట్సును దొడుగుకొనియు, నేరేడుపండు

చాయఁగల దుడ్డుగఱ్ఱఁ జేతఁబెట్టుకొనియు లోనవచ్చె. అతని లక్షణ లక్ష్యములఁగని లతాంగి జళుకొంది తెప్పపాటుకాలము దన శిరము గ్రిందికివంచుకొనెను. ఆదొడ్డాయన ముఖమును జోడ వెలిచి, తన దృష్టి యతని ముఖమునకు బ్రక్కగ బాఱునట్లు చేయుచు మేజముందటనుండిన కూర్చుని జూపి యందులో నతని గూర్చుండు డనెను. అతఁడు కూర్చుండినవెనుక "దానవదాస్ గారు, తాము మునిసిపల్సభికులా?" అని యడిగెను.

" జౌ "

" తమకు వివాహమైయున్నదా?"

" ఓ " అని గర్జించెను.

" తమకు బిడ్డలున్నారా?"

" నాను అరవం! తెలింగి రఆదు, కొంచుక్కలె; (లతాంగినిజూపుచు) నీ పోలెరెండు."

" కూఁతుండ్రిద్దఱా?"

" జౌ " అని గర్జించెను.

" తమ భార్య స్త్రీసమాజము జేరి యున్నదా?"

" విద్దెర ఆదు." (మాటిని బెదవులను ద్రిప్పుచు నరచెయిని ద్రిప్పి చాచుచు.)

"విద్దెరాదనియుగలదా? విద్దెచెప్పియిచ్చిన నేవారికివచ్చు"

"ఓ ! రఆదు." (తలనాడించుచు)

"తమకు యింగ్లీషు, అరవం, తెనుఁగు వీటిలో నేభాషయైనా తెలియునా?"

"మూండు రఆదు."

"తమవృత్తియేమి?"

"అనుమంబాజార్; నానుమహారాష్ట్రం"

(నవ్వుచే) "వాటిని ధరింపను; వాటిని రెండుమడతలుగ గుట్టినా నంగములు గప్పఁబడవు."

"ఏదియుఁ వలదని చెప్పుటయు నాభాగ్యమే; మిమ్ముఁజూచి యొక బహుమాన మిచ్చిపోవలెనని బహుదినములనుండి నాకోరిక."

"తాము నాకు బహుమానము నీనేల?"

"నాకు వివాహమై పదియేండ్లాయె; పెండ్లియైన చౌవంచే వత్సరములవరకు నాభార్య నాయొద్దగూర్చుండి మాటాడి నేనెఱుఁగను; దానితో మాటాడ నాకెంతో ప్రియముండియు ననుఁజూచినమాత్రము లేచి కూటామునుండి యింటిలోఁగలికి బోవు; నేనుఁలోఁగలికిబోయిన గూటమునకు వెళ్లును; నను దప్పించుకొనుటకే దారిఁగొనును. స్త్రీలకిట్టిలజ్జను భగవంతుఁడేలకల్పించెనోయని వ్యసనపడుచుంటిని. మీసమాజము జేరినపిమ్మట నలువురితో మాటాడను నేర్చి వార్తాపత్రికల జదువుచు వచ్చినందున దెలివియెక్కువయయ్యె. ఇటీవల రెండేండ్లుగ ననుజూచిన బూర్వమువలెఁ బెదరిపరుగెత్తక నాప్రక్కనగూర్చుండి మర్యాదతోను దెలివితోను సంభాషణజేయ శక్తిగల్గెను. ఇదియుంగాక గృహకృత్యములఁ దెలివితో నిర్వహింపనేర్చె. నేను వ్యాపార విషయమై బయటతిరిగి శ్రమజెంది యింటికివచ్చిన తత్క్షణమే ముందువలె ననుదప్పించుకొనక మీసాంగత్యములవల్ల సువచనముల నేర్చినందున నాకు శ్రమపరిహారమగునటుల నాతో మాటాడుచును నాకుసాహాయ్యముగను నాకు సంతృప్తికరముగను నడుచుకొనుచున్నది. ఇంతకుఁగారణము నీవే."

"స్త్రీలులజ్జగల్గియుండుట సహజంబైనను, తమపురుషుని జూచినపుడు సాంగత్యసంభాషణలనుండి తప్పించుకొనుట సరికాదు."

నేను నిలిచినచోట నిలువదు; నేనేదైననడిగిన నాముఖముఁజూచి యుత్తరమియ్యదు. ఇట్లుండి నా నాయందుఁ బ్రీతిలోఁ దక్కువలేదు. సమాజము జేరినవెనుక సహజంబైనసిగ్గును స్వభావమైనలజ్జయు నెక్కడపోయెనో! ననుంజూచి పఱుగిడినకారణము నాజూకుగను నింపుగను మాటాడఁజాలనం

చున గల్గిన శంకవల్లగాని స్వభావమైన లజ్జవల్లఁగాదు. సమాజముఁజేరినవెనుక నాభార్యకు కండకూడ పెరుగుచువచ్చుచున్నదమ్మ."

"తాము వచించినమాటలనువిని సంతసముగాంచితి; కుంతలాంబ మనస్సుకింపైన చెలికత్తె."

"తమవల్లఁబొందిన మంచికై నాయంగడినుండి యొక తెల్లబట్టనైనా బహుమానమిచ్చి పోవలెనని నాప్రియము; తాము దయనుంచి యంగీకరింపుడు."

" తాముచెప్పినదియుఁ జాలు; తామిచ్చియేనుపుచ్చుకొన్నట్లు సంతసించెదను.

"వలదనకుడు, నేను పంపుబట్టను మళ్లింపకుడీ !"

"తాము బలవంతముగఁ బంపుదాని ద్రిప్పిపంపలేక, సమాజమునకుఁ దాముచేసిన బహుమానమని వ్రాయించి, బీదసాదలకైన నింకనేదైన యుక్త విషయంబున బ్రయోగించెదము."

"లతమ్మగారు! తమకేదికావలసియుండినా తమయాజ్ఞచొప్పున నడుచుకొనఁ గలవాఁడను."

"నాకుఁగావలసినది స్త్రీవిద్యయు స్త్రీలస్వతంత్రమును. తాముమునిసిపల్సభికులై యుండుటచేత బాలురను బాలికలను విద్యనేర్చియే గావలెనను చట్టముఁ దెచ్చుటకై తమవల్లనంత శ్రమతీసికొని పాటుపడిన నదియ నాకుఁ గిరీటముఁదెచ్చి యిచ్చినట్లు."

"లతమ్మగారు ! తమయాజ్ఞచొప్పున నడుచుకొనియెద. నేనప్పుడప్పుడు చేసెడి యత్నములను కుంతలాంబద్వారా తమచెవుల కందనిచ్చెదను."

"సంతోషము ! తమపాటులకుఁ గృతజ్ఞతకలదినై యుందును."

ఇవ్విధంబున దర్శనార్థమై లతాంగినిజూచి మాటాడినవారికందఱికిని స్త్రీవిద్యయందును స్త్రీలస్వతంత్రమందును శ్రద్ధతీసికొనవలెనని నొక్కిచెప్పె. రెండుమాసములు కడచినపిమ్మట నొకనాటియుదయంబున దొమ్మిది

గంటలు కొట్టుటకుసునుపు, ధ-పంచమి యొకనామచీటిని దెచ్చియిచ్చి యొకచాలాదొడ్డమనిషి వచ్చియుండునట్లుచెప్పెను. ఆచీటిన 'వాసిష్టపంతులు-ఎం-ఎ," అని యచ్చువేయబడియుండెను. దానిజూచినతోడుతో లోపలరమ్మని చెప్పిపంప, పంతులుగారు వేంచేసి, 'సుదినం," అనినంతట, లతాంగిలేచి కూర్చిమీఁద దయచేయుఁడని ప్రార్థించెను. అతఁడుకూర్చుండినంతట,

"తమవంటి సుధీవరుల దర్శనము ప్రాప్తంబగుటకు నేనెంతపున్నెము జేసితో !" అని, లతాంగిచెప్పగ,

"పసితనమున నే బరిమళమైన గుణగణములుగల్గి ధవలమైనకీర్తియు నిరుపమానమైన వివేకమును సంపాదించియుండు నినుజూడ నెవ్వరు కోరక యుందురు ?"

"నాకుఁగొంత కీర్తిగల్గియుండిన నద్దానికిఁగారణములు శ్రీరాముల యనుగ్రహమును నా పెద్దలపుణ్యమును దమవంటివిద్వాంస శ్రేష్టుల యాదరణయు నాశీర్వాదములే."

"నీవు పూనుకొన్న కార్యము లోకోపకారార్థమైన కార్యంబగుటచేత నుత్కృష్టమనుటకు సందియములేదు; అయినను, నాకొకసంశయము తగులుచున్నది. ఏమనిన, 'స్త్రీలకు స్వతంత్రమునిచ్చిన దానినిసుప్రయోగముజేయక బహుశా దుర్వినియోగము చేయరా'యని కొందఱి యభిప్రాయము; వారికి సరియైన ప్రత్యుత్తర మిచ్చుటకు నాకుఁదోపలేదు. ఈసందేహముఁదీర్చుటకు నీవేసరి. ఎంతస్వతంత్రమిచ్చినను నీవలెను భయములేదనుటకు నాకుఁగాని, తక్కినవారికిఁగాని సంశయములేదు."

"తమవంటి సుధీవరులకే సందియముఁ దీర్పఁ దోఁపకుండిన బుద్ధియుందు బసితనమును బేదతనమునుగల యేనెట్లు సంశయము దీర్పగలను? గురువువలె దాము ప్రశ్నించినందుకు శిష్యురాలనఁదగు నేను జవాబిచ్చుటకు బద్ధనై యున్నదానను. ఇట్టి సరసమైన, చిక్కైనప్రశ్నకు నుత్తర మిచ్చునపుడు

నా పెనిమిటియు మన సమ్ముఖమునుండిన లెస్సయని తోఁచెడిని; అతను వచ్చి యుంటలోఁ దమ కభ్యంతరము గలదా?"

"సంతోషముగాని యభ్యంతరములేదు."

వాసిష్ఠపంతులుగారు విచ్చేసి ప్రశ్నించినసంగతియుఁ దాఁజెప్పిన బదులును చీటివ్రాసి తన పెనిమిటికి కందజేయునట్లు ధ-పంచమియొద్ద నిచ్చి పంపెను. కృష్ణమూర్తి వెంటనే వచ్చి పంతులుగారికి నమస్కరించి ప్రక్కన గూర్చుండెను.

"స్త్రీలకు స్వతంత్రతనిచ్చిన బహుశాదుర్వినియోగము జేయరా యని ప్రశ్నించిరి. ఒకఁడు కష్టపడి ద్రవ్యము సంపాదించి యాద్రవ్యమును నింకొకనిచేత నిచ్చిన నాయింకొకఁడు ద్రవ్యమును దుర్వినియోగము జేయకుండునా? ఉండునని చెప్పఁదరముకాదు. తానే శ్రమపడి సంపాదించి శ్రమతోఁ గూడబెట్టిన విత్తమును దుర్వినియోగము జేయఁడు. తద్రీతిగ నేటి దినమున బురుషులు స్త్రీలకు స్వతంత్రమొసంగిన సుప్రయోగమే చేయుదురని నొక్కిచెప్పలేను; అయినను స్వతంత్రతయొక్క వెల మహిమలఁ దెలిసి దానిని స్త్రీలు పాటుపడి సంపాదించిన నట్టి కష్టార్జితమును భద్రముగ గాపాడుకొందురుగాని దుర్వినియోగము జేయరని నమ్ముచున్నదానను. అదియుఁగాక, దేశాభివృద్ధి విషయమై యోచించిన స్త్రీలకు విద్యాస్వతంత్రములు గల్గుటవలన సిద్ధింపగూడిన సాధకబాధకముల తారతమ్యములజగజంపులఁబోలు; కొంతకైనా జింతలేదు; అమితమైన మేలుగాంచుటఁజేసి స్వతంత్రముగల్గినచో దేశయోగ క్షేమంబుల కనుగుణ్యముగ నుండును."

"నీజవాబు సంతృప్తికరముగ నున్నది; నాసందేహము నివారణ యయ్యె."

"కావలెనన్న నా పెనిమిటిగారి యభిప్రాయముఁ దెలిసికొనుఁడు".

"పార్వతీ పరమేశ్వరులు దేహమందైక్యము; మేమిరువురము గాయమున వేరైనను దక్కిన యన్నింటనైక్యమైన వారము; ఇట్లుండుటకు గార

ణము విద్యాస్వతంత్రములే యని నాకు స్పష్టముగ నేర్పడుచున్నది," అని కృష్ణమూర్తిగారు వాక్రుచ్చిరి.

వాసిష్ఠ పంతులు చిఱునగవుతోనుండిన లతాంగినిజూచి, "మీయిరువురి విషయమున గించిత్తైన ననుమానములేదని పూర్వమే జెప్పితి," అనెను.

"నాకుఁ దోఁచినంత చెప్పితి; అందులోఁ దప్పులుండిన వాటిని సవరించుకొను భారము తమవంటి బుధవరుల జెందినయది."

"ఎట్టివారును నోరు తెఱవఁగూడని దివ్యమైన ప్రత్యుత్తరమిచ్చితివి."

"తాము మాయింట నాతిథ్యమునకై యీపూఁటనిలిచిన మాకు దృప్తి; మాభాగ్యమెటులో."

"ఇంకొకచోట వచ్చెదనట్లు వాగ్దత్తము చేసినందున దయసేసి మన్నింపుము; రెండవసారి వచ్చునపుడు మీయింటఁ గుడువక వెళ్ళను."

లతాకృష్ణమూర్తులు దమకరముల జోడించుకొని నమస్కరింపగ,

"మీయుద్యమం బొనకూడి సత్ఫలముగాంతురుగాక," అని పంతులాశీర్వదించి, వెళ్ళిరి.

కొన్నాళ్ళకు వెనుక సంధ్యాకాలమునకు ముందు దర్శనార్థులతో భాషించుట కేర్పడ్డగదిలో లతాంగి కూర్చుండియుండగ ధ-పంచమియొక నామచీటినిఁ దెచ్చి యిచ్చుచు, చేతులలో బంగారుగాజులను గొలుసులును దొడుగుకొనియుండు బాలుఁడు స్వగమనరథమునుండి దిగివచ్చినట్లు చెప్పెను. "స్వయంప్రకాశశెట్టిఁ కోటీశ్వరుఁడు," అని, చీటియందు ముద్రింపబడి యుండెను. కొంత సేపాలోచించి లోనరమ్మని లతాంగి చెప్పిపంపెను. సరిగదోవతి గట్టుకొని, చీనాపట్టుచొక్కాయను దగిలించుకొని, సరిగకొట్టడి తలచుట్టుఁ జుట్టుకొని, పీతాంబరమును బుజముపై నివీతముగ వ్రేలాడ వేసికొని, దరహాసముతో నొకబాలుఁడువచ్చి దండముపెట్టెను. లతాంగి తనయెదుటనుండిన కుర్చిమీఁద గూర్చుండుడని చెప్ప నతఁడు కూర్చుండెను.

"కోమటికులముం జేరినవారును, బేరి, బలజె, గాండ్ల, లింగాయితులు వగైరాలు శెట్టిపట్టము వహించి యున్నారుగద," అని, లతాంగియడిగెను.

"అవును," అని, బాలుఁడు నవ్వెను.

"తాము పసివారుగనుండెదరు; తమకేదైన వృత్తిగలదా?"

"నా పెద్దలు వలసినంత ద్రవ్యముఁబెట్టి గతించిరి; సంవత్సరమునకు బ్యాంకువడ్డి పదివేలురూపాయలును బంగళాలనుండి మాసమునకు రెండువేలు రూపాయల యద్దెయు రాబడియున్నది."

"మంచి భాగ్యవంతులని పరితోషించెద; ఎంతభాగ్యముండినా, బసితనమునఁ నేవృత్తియు లేకుండిన సోమరితనమెక్కువయై బుద్ధి కుంఠత్వము నొంది కుటిల వర్తనములందుఁ బ్రవేశించు."

"నాకు మందబుద్ధిగాని కుటిల హృదయముగాని లేవు."

"తమకు వివాహంబైయున్నదా?"

"వివాహమై నాభార్య నాతోఁ గాపురముచేయుచున్నది; మాకొక మగబిడ్డయు నున్నయది."

"ఇంతటి బాల్యముననే తాముజనకులై యుండుట సంతోషకరము; తమభార్య మాసమాజములోఁ జేరియున్నదా?"

"లేదు; నాసొంతబాల్యమున నా మేనమామ కూఁతుఁగట్టుకొంటి; అది స్వల్పచదువే చదువుకొనెను."

"చదువను వ్రాయనుఁ దెలిసి వార్తాపత్రికల జదువ సత్తియుండినఁజాలు."

"పత్రికల వెనంత జదువుకొనును."

"మఱియెందుకు సమాజముఁ జేరకున్నది?"

"అది చూపుకు రమ్యముగలేనందున వెలుపటవచ్చుటకు సిగ్గుపడుచున్నది."

"స్త్రీలకు సువర్తనలేయందము; సుగుణములేభూషణములు."

"బయటికి రమ్మన్నను సిగ్గుచేతరాదు."

"తామెందుకొఱకు వచ్చితిరి?"

"చదువుకొనిన స్త్రీల జోడ నాకధికప్రియము."

"తామెందాఁక చదువుకొన్నారు?"

"వలసినంతయాస్తి యున్నందున చిన్ననాఁడే నా పెద్దలు చదువుఁ జాలించిరి."

"చదువులేనివారు చదువు మహిమల నెట్లెఱుంగుదురు? తమచదువును దమపెద్దలు చాలించిరా! లేక, తామేచాలించుకొంటిరా?"

"అత్త కోడండ్ర పోరుచేత చదువునిలిచె."

"యుక్తాయుక్తమని లేక కన్నచోట్ల సిరిపొర్లాడు! అందుగుఱించి యత్తనుఁజూచిన బలుకుల జెవరాలికి మదింపులేదు."

"లచ్చి పక్షపాతములేని భాగ్యవతి."

"మేనంత వసించునత్త! ఉత్తమాంగముననే నుండు కోడలు."

"అత్త గోచరమైనది; కోడలగోచరమైనది."

"సిగ్గుమాలి యొక్కతె; సిగ్గుచేతనొక్కతె. తామిచ్చోటికి వచ్చిన కారణంబేమో."

"తమ నామప్రఖ్యాతుల బందుండ్రు చెప్పగవింటి; తమపరిచయముఁ గోరివచ్చితి."

"మంచిది! సంతోషము! తాము వెళ్ళివచ్చెదరా?"

"మీసమాజమునకు వేయిరూపాయలిచ్చెద."

"తామియ్యకుఁడు; ఇచ్చినా సమాజముజేరినవారియ్యకొనరు; తమభార్య మా సమాజముఁజేరినయెడఁ గొంతకాలమునకు వెనుక బహుమానమిచ్చిన బుచ్చుకొనుదురు."

"నాభార్య రూపవతిగ లేనందున నేనేసిగ్గుపడి బయటికి పంపను; అందువలన ద్వితీయ వివాహముజేసికొన నుద్దేశించియుండెద."

"శివశివ! తమమాటలు నా చెవులలోఁ దూపేసినట్లున్నది; ఏకపత్నీ వ్రతము లేనివారిఁ జూచిన నాదేహములో వడకెత్తుచున్నది. తప్పొప్పుల వ్యత్యసించి యుక్తాయుక్తములను ధర్మక్రమములను విచారణచేయుశక్తి మానవునికే యుండగ నట్లువిచారింపక నడుచుకొనువాఁడు మానవజన్మమున కర్హుఁడు కాఁజాలఁడు.

"మన్నింపుము; తెలివితప్పిచెప్పితి."

"రామరామ! తమవచనములవిని తాము నాయెదుటనుండ సైతునా?"

"ఆమాట పోనిమ్ము; తమకు రోజాపుష్పములమీఁద మక్కువ యెక్కువయనివింటి; మాయింటితోఁటలో పూలు మిక్కుటమైయున్నవి! కొన్నింటి దెచ్చియిత్తునా?

"తమయింటివారికిచ్చిన బాగు; నాకక్కఱలేదు." (కనుబొమల ముడుచుకొనుచు)

"కోపముచేయకుము; నిన్ను నడపవడప దర్శించి వెళ్ళుటకు నానతి నొసంగినజాలును."

"ఇక్బాలుండు ప్రియంవదుఁడైనను గుటిల హృదయముతో వచ్చిన వాఁడే యనుటకు సందియములేదు. ఛాగచర్మము నాచ్ఛాదించి వచ్చిన వృకంబుఁ బోలినవాఁడు, కాఁబోలు," అని తనలోఁదాను తలఁచుచు, "తాము వచ్చెడి శ్రమబెట్టుకొన నవసరంబులేదు; తాము విచ్చేసినదే సంతోషమాయెను. మాసమాజమునకుఁ దమసాహాయ్యము గావలసినపుడు తమకు దప్పక తెలియపఱచెదను; అయ్యోల వచ్చినజాలు," అనెను.

"నాయందప్రియముబడకుము; నీవెప్పుడు చెప్పిపంపుదువోయని కాచుకొని యుందు; సెలవుపుచ్చుకొనియెద."

"మంచిది!" (నేలనుజూచుచు)

శెట్టిపిన్నవాఁడిలువిడిచిపోయినంతట లతాంగి ధ-పంచమిని బిలిచి వచ్చిపోయినశెట్టి తిరుగవచ్చిన జూడసమయము లేదనిచెప్పి పనుపుమనెను. "ఆలాగేచేసెదనమ్మ; పిన్నవానిజూచినపుడు తుంటయని తోఁచెనమ్మ," అని, సేవకుఁడుచెప్పెను.

ఈప్రకారము సమాజవిషయమును నెపముగొని వచ్చిన దుర్జనులకు గఠినమైన సదుత్తరములఁజెప్పి వారిరాకను నిరాకరించి మరల రానట్లు చేసెను.

22-వ అధ్యాయము.

అత్తి దర్శించి వెళ్ళుట.

మొలచుట్టుఁ దెల్లని దోవతిఁ గట్టుకొని, మోకాళ్ళవఱకు నల్లని చొక్కాయ దొడుగుకొని తలపైఁ దెల్లనిరుమాల గట్టుకొని అమెరికా చెప్పుల దొడుగుకొని పడిగవచ్చి లతాంగి యింటి వీధి తిన్నెమీఁద నొకఁడు కూర్చుండెను. అతఁడు ధ-పంచమిని జూచి, "పంచమి అయ్యగారికి దండములు," అనెను. ధ.పంచమి కొంతసేపు నిదానించి వీరునికొడుకు 'అత్తి' యా యని యడిగెను. "ఔను" అని యతఁడు నవ్వెను. "చాల సంతోషము; సీమనుండి యెపుడు వచ్చితిరి?" అని యడుగుచుండగ నెదుటింటనుండిన రంగనాథుఁడు వచ్చెను. "రంగనాథస్వామికి దండములు" అని అత్తిచెప్పగ, దండముపెట్టిన వాఁడెవ్వఁడని రంగనాథుఁడు యోచించుచుండగ "మన వీరునికుమారుఁడు, అత్తి", అని సేవకుఁడు చెప్పెను.

" తాము 'అత్తి' యా? చాలసంతోషము. సేవకుఁడును నేనును పాదిరి మందిరమునకు వెళ్ళినపుడు తాము సీమకు వెళ్ళియుంటిరట. తామెపుడు తిరుగవచ్చితిరి?"

"ఏను సీమ విడిచి మూఁడేండ్లాయెను. నాకుటుంబమునకు సంరక్షణకర్తగనుండిన తమ తండ్రిగారి దర్శనమునకు దమదర్శనమునకును మాకుటుంబ

ము ముందుకు దెచ్చుటకుఁ దోవఁ జూపిన 'పంచమి అయ్య'గారి దర్శనమున కును గాచియుంటి; నేఁడు మీయిరువురి దర్శనము ప్రాప్తంబయ్యెః మన యిరువుర మొక్క లగ్నమందుఁ బుట్టినట్లు నాతండ్రిగారు చెప్పఁగవిని నా కెంతో సంతోషము;

"తమ తండ్రిగారు సుఖమా?"

"సుఖముగ నుండెదరు."

"మా యాపత్కాల బాంధవియైన మనతల్లిగారు సుఖమా?"

"సుఖముగ నుండెదరు. తమ క్షేమ లాభములఁ బల్మారు విచారించు చుండిరి; తమప్రస్తుత స్థితిని విని సంతోషింతురు."

"పంచమి అయ్యగారు ముట్టించిన దీపమని నేటివఱకు నా తండ్రి గారు చెప్పుకొనుచున్నారు."

'ఏ నేమిచేసితి? మీ యదృష్టవశమున మంచిదశ గల్గె."

"పాదిరి దొరవారికి దాముచేసిన శిఫారసువల్ల మాకీలాటిమంచిదశ లభియించె. మాతల్లిగారు మేము పయనమయినపుడు జొన్న సెజ్జల నియ్యకొం డిన మేము దోవన మడిసి మడిసిన స్థలమున బచ్చికపడి యుండు."

రంగ-తామేకొలువున నుండెదరు?

అత్తి-రెండుసంవత్సరములవరకు దూరదేశములలో సామాన్యమైనకొలు వుఁగొనుంటి; ప్రకృతమాదియాంధ్రుల పాఠశాలలకు విచారణకర్తగను, తనిఖీ దారుఁడుగను నుండెద; నెలయొక్కటికి నూరురూపాయలు జీతము. ఏసీ ప్రాంత్యమునకువచ్చి యొకపక్షంబయ్యె. తామాంగ్లేయపత్రికకు వృత్తాంతలేఖ రియని విని సంతసము గాంచితి.

రంగ. తమతండ్రి చాల కష్టపడుచుండెను; మీకష్టములన్ని నివారణ మై మీకుటుంబమునకు సౌఖ్యము గన్యాతయుఁగల్గె.

"పంచమి అయ్యగారిదయచేత," అని, అత్తియనుచుండఁగ నామాట లను వినుచుండిన లతాంగి బయట వచ్చినంతను,

"లతమ్మగారు! ఏను అత్తి! మీకు దండములు," అనెను.

"తమమాటలనింతదనుకవినుచునుంటి; తమను జూడఁగోరి వెలుపటికి వచ్చితి" అని, లతాంగి చెప్పెను.

తమప్రఖ్యాతిని వార్తాపత్రికలమూలముగఁ దెలిసికొని, తమనుగుఱించి చెప్పబడు శ్లాఘనవార్తలను మాచిన్నదొరసానమ్మ, పెద్దదొరసానమ్మ-వీరి చెవులబడవేసి యుండెద."

"నాయన్నయు దాయును వేఱుకారు; తాముచేసిన మంచికి కృత జ్ఞత గలదియైయుందు."

"పంచమిఅయ్య! ఏనుదయించిన స్థలమందలి యత్తిమ్రాను బాగుగ నున్నదా?"

"అదియొకగొప్పవృక్షమై దానిశాఖలు నలుదెసలవ్యాపించి ఫలముల మెండుగ నిచ్చుచున్నది."

"ఎన్నిదేశములఁజొట్టివచ్చినా సౌఖ్యమునకు మన శ్రీమంతపల్లెకు సాటిలేదు," అని అత్తి చెప్పెను.

"ఎన్నిదివ్యస్థలములఁ జూచివచ్చినను, పుట్టినచోటుమీఁద ప్రియము లేనివారు గలరా?" అని, రంగనాధుఁడుచెప్పె.

"ఏలాటి వ్యావ్యాసములులేక నెమ్మదిగనుండవలెనని కోరువారికి మన శ్రీమంతపల్లెయేఁదగు," అని, లతాంగివచించెను.

రంగ.—తాము బాల్యముననే శ్రీమంతపల్లెను వదలి వెళ్ళియు నద్దాని యం దింత ప్రేమయుంచి యుండుట సంతోషకరముగ నున్నది.

అత్తి—నా పసిపాటి క్రీడలన్నియు దమచేలువద్దను నదీతీరముకడను జొట్టునుంచు గిట్టలచెంతను.

లత—దొరసానమ్మలఁ జూచి రాను నాకపేక్షయున్నది.

అత్తి—వారికిని దమను జూడవలెనను కోరికయున్నది; తామొక్కలేఖ చే సుదెంచిన వారు పల్మారు వత్తురు; వారివల్ల దమ యుద్దేశమెనకూడు ట కెంతో సాహాయ్యముఁ జెందఁగలరు.

లత—రెండు పక్షములలో వచ్చెదను; రాఁబోవుటకు రెండు రోజులకు ముందు వ్రాసి పంపెదను.

అత్తి—మంచిది; తాము వచ్చెడి సమాచారము ముందుగ వారి చెవుల బడవేసెద.

లత—అత్తియన్న! వారన్యదేశస్థులై యుండియు మనదేశస్థులలో గొందఱికి విద్య గఱపియు మనలో సామాన్యమైన స్థితిలో నుండు వారికి సాహాయ్యము చేయుచువచ్చెదరు; మనదేశస్థులకు విద్యాభివృద్ధియందు చింత తక్కువ.

అత్తి—తక్కిన దేశములలో భాషయొక్కటై మతము నొక్కటై యుండుటవలన మతసంగ్రామములులేక పదుంద్రు చేరినప్పు డొకభాషలో సంభాషించి యితరేతర యభిప్రాయముల దెలిసికొనెదరు. ఆ కారణముం బట్టి వారికి భాషాభిమానముతో దేశాభిమానము నున్నయవి.

లత—మనదేశమున నాలుభాషలు నూట ముప్పది విభజనలై యుండుట వలన జనులందఱొక్కటిగ గూడి యొక్క భాషలో భాషించి యభిప్రాయముల నిచ్చి పుచ్చుకొనుటకు హితానుకూల్యములు లేక యున్నవి. మన దేశమందలి జనులు నలుప్రక్కలనుండి వచ్చి యొకస్థలమున గూడినయెడ నొకనికిఁ బదిభాషలు దెలిసి యుండిననే యందఱితో భాషింపగూడును. భాషాభేదములు మాత్సర్యమునకు గొంతమట్టుకు హేవ్యంబగు; మతభేదములును భాషాభేదములును గలవారెట్లు గొప్ప విద్యలేక కలుపుగోలుతనము నొందియుండఁగలరు?

అత్తి—అట్టిభేదముల వల్ల సంభవము కాఁదగిన మాత్సర్యములు చాలవని తక్కిన హిందువుల సమీపింపగూడనియు నంటగూడనియు వారైన నాకులస్థులు రెండున్నర కోట్లమంది యుండగ మనమెల్లర మేలాగున నేకీభవించి యుండఁగలవారము?

లత—రోగపీడలవలె మనలనంటియుండు దురాచారములకును దురభిప్రాయములకును నొకటి కొకటి పొసఁగని వర్తనలకును బరమౌషధం బొక్కటే.

అత్తి—విద్యయే కద?

లత—ఔ; ఇంటమాటాడు భాషవేఱైయుండినా యందఱు నొక్క భాష దెలిసికొని చేదువవలసినవిధి యేర్పడిన మనలఁబట్టియుండు పీడలో ముప్పాతికపాలు తొలఁగు.

అత్తి—ఏనుచూచి వచ్చిన సీమలలో జదువను వ్రాయను దెలియనివారు నూటిలో నొక్కనికి పైనుండరు.

లత—మన దేశమున జదువను వ్రాయను దెలియనివారు పురుషులలో నూటికి యెరువది రెండున్నర; స్త్రీలలోనూటికి తొంబదినాల్గు.

అత్తి—అట్లుండుటచేత బురుషులు మాత్రము జదువుకొన్న జాలునా?

లత—ఇల్లు చక్కబడిన నూరు తనంత చక్కంబడు. ఇంటనుండు స్త్రీలు జదువుకొనిన బయట పోవలసిన మగవాండ్రు విధిలేక చదువుకొనుదురు.

అత్తి—అందఱు జదువుకొన్న మనదేశమునకు గొఱఁతయేమి?

లత—తమభార్య చదువుకొని యున్నదా? ఎందుకు మాసమాజమును జేరలేదు?

అత్తి—చదువుకొని యున్నను, చేర్తురో, లేక చేర్చరోయను సంశయము చేత.

లత—సంశయమేల? రేపే చేరునట్లు చేయుఁడు; ఆమె నామమేమి?

అత్తి—బంగారు.

లత—బంగారు నెవరు వలదన గలరు? (నవ్వుచు).

అత్తి—చాల ప్రొద్దాయె; వెళ్ళివచ్చెద, రంగనాథస్వామికి దండములు; పంచమి అయ్యకు దండములు; లతమ్మగారికి దండములు; అనుచు నింటికి జనియెను.

బంగారమ్మను లతాంగి సమాజమున జేర్చిన సమాచారము గంధవహునివలె మూలమూలకు వ్యాపించి లతాంగి నామము సుగంధ వహంబయ్యె. పంచమ కులస్థులనెడి యపద్యమైన యాహ్వాయమును నివర్తించి, 'ఆది యాంధ్రు'లను దివ్యనామమును దొరతనము చేయువారు పెట్టినందుకు దేశస్థులకుఁ గల్గియుండిన నింద నివారణమై యాదియాంధ్రులు నుత్సాహ చేతస్కులైరి.

---

23 వ, అధ్యాయము.

లతాంగియు దొరసానమ్మగారునుఁ బరస్పర దర్శనములు, లతాంగి బాల్యసఖుల యోగక్షేమముల విచారించుటయు.

ఒకనాటి ప్రభాతంబున లతాంగి, బాలాంబ, కుంతలాంబ—యీ మూవురును పాదిరిమందిరమునకుఁ బనివిని, చిన్నదొరసానమ్మగారైన 'మిస్ మేరియా' దొరసానమ్మగారిని దర్శించి; 'సుకల్యం' అనిరి. దొరసానమ్మ యొక్కొకరికి సుకల్యమని చెప్పి మువ్వురిని గూర్చుండు డనెను. దొరసానమ్మ మూవురి మూతుల దిలకించుచు, లతాంగిని జూచి,

“తాము మాలతమ్మగారా?” అని యడిగిరి.

'ఔ' అని, లతాంగి చెప్పినంతట, “మీ వీరుఁడును వీరమ్మయు ముసలివాండ్రై నందున మాకొలువు వీడ్కొని రెండు నెలలుగ వారికుమారుఁడు 'ఆటి' యొద్దనుండెదరు. తమ ముఖముఁ జూచి తెలిసికొంటిని, చూచితిర,” అని దొరసానమ్మ నవ్వెను.

“తమకుశాగ్రబుద్ధి తమ ముఖమున బ్రసన్నమగుచున్నది;” అని లతాంగి చెప్పగ, “హా,హా,హా,” అని, నవ్వెను. “బహు దినముల నాటినుండి తమను దర్శించి తమ ప్రియవచనముల శ్రవించియానందింపవలెనని యుండిన నా మనోరథము నా యదృష్టవశమున నేఁ డీడేరెను,” అని, దొరసానమ్మ చెప్పెను.

“నేను నట్టి యభిలాషకొని యుంటిని. మా దేశ స్త్రీలెంతో కలుషబద్ధులై స్వాతంత్ర్యములేక నిర్బంధములఁదగులుకొని యుండెదరు. తమ వంటి భాగ్యవంతులు మా దేశమున నడుగుపెట్టిన తరువాత మిమ్ముజోచి మీవలె మాకును స్వతంత్రము గల్గింయుడుటకు బ్రియమును నుత్సాహమును గల్గెను.”

“హిందూ స్త్రీలైన మాయప్ప జెల్లెండ్ర స్థితిని గనియు వినియు మా వర్ణస్థులు చింతపడుచుండిరి. మీ యవహేళనంబైన స్థితినుండి వీడుటకు బహు కాలమువఱకు మీరేలాటి యతనములఁ జేయకుండినయది మా మనంబుల నొప్పించుచుండెను. కొన్ని యేండ్లుగ వారి గృహమను బంధనాలయమునుండి వీడ్పుటకై మీరు పడుపాటులఁ గనియు వినియుప్రముదహృదయులైతిమి.”

“మీరన్య దేశస్థులై యన్యమతముం జేరినవారై యుండియు మీదేశ ధర్మసంచితములనుండి లక్షలకొలఁది రూపాయలను ఖర్చు పెట్టుకొని మాదవిష్ఠ దేశమునకుఁ బోగయోడలలో శ్రమపడి వచ్చినదింగాక మాదేశములోని స్త్రీలకును బురుషులకును నూరేండ్లకు పైఁబడి విద్యగఱపి పుణ్యము సంపాదించుకొనుచున్నారు. మీకుంగల యనుకంపధర్మగుణములు మా దేశస్థుల యొడ లేకుండుట మా దౌర్భాగ్యమే. మాకుఁ బూర్వమునుండి మా దేశమున వసించి వచ్చుచుండు పంచమ కులస్థులని వాడఁబడువారు హిందువులవర్ణములలోఁ జేర్పబడకయు హిందువుల సహవాస సాంగత్యముల కనర్హులని యెన్నఁబడి యుండుటయుంగాంచి, వారిని మీ గృహపరిచర్యలకు నిరాక్షేపముగఁ బరిగ్రహించియుఁ గొందఱిని మీ మతము నవలంబింపఁ జేసియుఁ గొందఱికి విద్యగఱపియు వారి యస్పృశ్యతఁ బోగొట్టజేసి వారికొక యంతస్తుగల్పించి సుకృత సమాఖ్యలఁ దెచ్చుకొనుచున్నారు. 'ఉపదేశము కంటె ప్రవర్తన మేలు' అనుటకు దృష్టాంతముగఁ బంచమ కులస్థులయెడ మేము నడుచుకొనవలసిన ధర్మ విధిక్రమములను మీరై ప్రవర్తించి మాకు వివేకమతుల వెలుఁగపడఁజేసెదరు. మీ నిదర్శన దృష్టాంతములకు మేము విశ్వాస బద్ధు

లమై యున్నవారము. మీ ధర్మ ప్రవర్తనలును మీ సుకృత కర్మములును మిమ్ము సదా కాచేఁగాక !"

"(మా 'అటీ' భార్య, నవ్వుచు) మా 'ఆటీ' భార్యను మీ సమాజమున జేర్చి యామెతోఁ గలసికొని యుండుట నాకు సంతోషకరముగ నున్నది."

"విద్యయు నాఁగరికతయుఁ గలవారితోఁ గలిసియుండుట నెక్కువ కాదు దొరసానమ్మగారు !"

"తమవంటి తెలివిపరులు మాసమాజకూటములకు వచ్చిన మాకు గౌరవము కల్గుటతో మాకుఁ దెలియని విషయముల నడిగి తెలిసి కొనఁగలము." అని, బాలాంబ చెప్పెను.

"లతమ్మకు నొకరు చెప్పఁ బనిలేదు. స్వయబుద్ధితో నన్ని పనులఁ జక్కఁగ నిర్వహింపఁగలదు."

"లతాంగికి వివేకజ్ఞానములలోఁ దక్కువలేదుగాని యనుభవము చాలదు. కనుక, తామువచ్చిన మాకుఁ బ్రోత్సాహకరముగ నుండును," అని, కుంతలాంబ చెప్పెను.

"ఏనువచ్చుట కభ్యంతరములేదు; కూటముకూడఁ బోవుదినమును రెండురోజులకు ముందుఁదెలిపిన వచ్చెదను."

"తమతోఁ దమ తల్లిగారును దమసంగడికత్తెలును వచ్చిన మాకు మఱియు నుత్సాహము," అని, లతాంగి వచించెను.

"మంచిది"! (నవ్వుచు)

"దొరసానమ్మగారికి యొకవిజ్ఞాపన; తమనామమును మాసమాజ సంబంధమైన పుస్తకములందు 'గౌరవ యధ్యక్షురాలు', అని వ్రాసికొనుటకుఁ దమ యనుజ్ఞనియ్యఁ బ్రార్థించెదను," అని, బాలాంబ చెప్పినంతట, (నవ్వుచు) "నాకభ్యంతరము లేదు; నాతల్లిగారుండగ నా పేరును లిఖియించుట యుక్తమా?"

"తమతల్లిగారికి 'సంరక్షణకర్త్రిణి' యనుబిరుదునిచ్చి యామె దివ్యనామమును మాసమాజపట్టిలో మొదట వ్రాయనుద్దేశించి యుండెదము," అని, లతాంగి చెప్పగ,

"నాతల్లిగారెట్లు 'సంరక్షణకర్త్రిణి' యగును? ద్రవ్యమును సెలవుచేసెడివారు మీరలై యుండగ నాతల్లిగారి నామమును డంబమునకుఁ బెట్టుకొనుటనుచితము. ఆమె యొప్పనూయొప్పదు."

"తమతల్లిగారు 'సంరక్షణకర్త్రిణి' యనుటకు సందియముఁ గలదా? మీరుతొలుత నడుచేకొని ప్రస్తుతమును నడుచేకొను వివేకమార్గములను మేమనుసరించెదము. స్వాతంత్ర్యమును కల్పవిత్తనమును మాదేశస్థుల యెద వెదజల్లినవారు మీరును మీజాతివారునై యుండగఁ దమతల్లిగారిపేరు తప్ప తక్కిన నామములు పొసఁగవు," అని, లతాంగి చెప్పినంతట, దొరసానమ్మ నవ్వుచు, "మంచిది, లతమ్మ! నీవుచెప్పినమాటలను నాతల్లిగారితోఁ జెప్పి యామె నొప్పునట్లు చేసెదను. అనెను.

"అట్టి యుపకారమునకు మేము వందనబద్ధులై యుందుము," అని, కుంతలాంబ చెప్పెను.

"తమవంటివారి యాదరణయుఁ బ్రోత్సాహమును లేక మాసమాజ కార్యోద్దేశములు నెఱవేరంజాలవు," అని బాలాంబ చెప్పెను,

"న్యాయవిషయములందుఁ దమవర్ణస్థులు పట్టినపట్టును సమర్థింపక విడువరు; కనుక, మీయాదరణచేత మాయుద్దేశ కార్యములు శీఘ్రములో ననుకూలించేను," అని లతాంగి నొడివెను.

"మేమీవఱకుఁ జేయుచువచ్చిన యుపకారమును నింకఁజేయ సిద్ధముగనుండెదము; మీరు పూనుకొనినపని యల్పస్వల్ప కష్టముల నిచ్చునదికాదు. మీ ఘనప్రయత్నములు లేక మానామములు మీ సమాజపట్టీలలో నెక్కిన మాత్రము ఫలమేమి?"

"ఒకఁడు చేసినపనిని నింకొకండు చేయఁగలఁడు. ఒక్కదేశస్థులు సంపాదించిన వస్తువును నింకొకదేశస్థులు పాటుపడిన సంపాదింపఁగలరు

సులభమున సంపాదించిన వస్తువును సులభముగఁ బోగొట్టుకొనఁగలరు కాని ప్రయాసపడి సంపాదించిన వస్తువును జేలుకనగవదలి పెట్టరు. అయినను. ప్రస్తుతము స్త్రీలకు వలసిన స్వతంత్ర మొక కొండశిఖరమున నున్నయది. ఆ శిఖరమును సందవలసినత్రోవ 'మిట్టపల్లములతోను గంటకములతోను నిండియుండుటంగాక నెట్రమైయుండుట మాకుఁ దెలియని విషయముగాదు.

'కష్టేఫలీ,' 'మనుష్యయత్నం ముప్పాతికపాలు దైవయత్నం పాతిక పాలు,' అన్నట్టివంటి ప్రయాసలం బడవలసి వచ్చినను ముందుపెట్టిన పాదమును వెనుకదీయక, జయము సిద్ధమను సంపూర్ణమైన నమ్మికతోఁ బాటులఁబడుటకు సిద్ధముగ నున్నవారము. మీరు మాకుముందు దారిజూపిన వారైనందునను, మేమన్వేషించు రత్నము మీయొద్దఁ బూర్వమునుండి యుండుటచేతను, మీరద్దాని మహిమను నెఱింగినవారై మాకు సహాయపరులుగ నుందురనియు మీనామగౌరవములు మాకుఁ బ్రోత్సాహకరముగ నుండుననియు మాసమాజమునకు దమను దమతల్లిగారిని 'గౌరవయధ్యక్షురాలు' గను 'సంరక్షణకర్త్రిణి'గను యధాక్రమముగ నియమించుకొన ననుమతిని బ్రార్థించిన వారై విచ్చేసితిమి,'' అని, లతాంగి మందలించెను.

''మీరు సంపూర్ణమనంబుతోఁ బాటుపడ నిశ్చయించినవారైనందున నానామమును మీసమాజ పట్టిలో నెక్కింప ననుమతి నిచ్చితిని. నాకును మీకును గీర్తిదత్తుఁడని నమ్ముచున్నదానను.''

ఇట్లు సంభాషించినవెనుక, కొంతసేపువఱకు గృహకృత్యములను మాటాడుచుండి, ముప్వురును దొరసానమ్మకు వందన మొనరించి, 'సుదినం' అనిచెప్పి, తమ నివాసంబులకు జేరిరి.

రెండువారములు కడచినతర్వాత శ్రీమంతపల్లెలో బాల్యస్నేహితురాలైన సుందరాంగి, చేంకనొక బిడ్డతోను దనజేతివ్రేలిని బట్టుకొనివచ్చిన మఱొకబిడ్డతోను, లతాంగి యింటికిఁ జనుదెంచెను. ధ-పంచమి, ''అమ్మగారికి దండములు! సుఖముగ నుండెదరా? ''అని, యడిగెను. సుందరాంగి

లతమ్మ సుఖమా యనియడుగుచు నింటిలోపలఁజనియెను. లతాంగిలేచి, సుందరాంగిని గౌగిలించుకొని, చిన్నపాపనుద్రిసి తనచేంకఁబెట్టుకొని, నడచి వచ్చిన బిడ్డను తనజేతఁబట్టుకొని, సుందరాంగిని దనప్రక్కన నొక కూర్చి మీఁదను, పెద్దబిడ్డను నింకొక కూర్చిమీఁదను గూర్చుండఁజేసెను. రెండు బిడ్డలకును బులకండమిచ్చి ముద్దుపెట్టుచు, ''సుందరీ! నినుజూచి యెన్నాళ్లాయె! ఎప్పుఁడువచ్చితివి? సుఖముగ నుండెదవా,'' అని యడిగెను.

''ఈనగరమున నామఱఁదిగారికి సీమంత ముహూర్తముజేరిగినందున నా పెనిమిటివెంట మూఁడుదినములకు ముందువచ్చితి; సుఖముగ నున్నాను.''

లతాంగి సుందరాంగిని గొంత కాఫి పుచ్చుకొమ్మని బలవంతము జేసి ''బిడ్డలిద్దరేనా! ఇంక బిడ్డలున్నారా?'' అని, యడిగెను, ''ఈ రెండు బిడ్డలు చాలవా? ఇంకబిడ్డలేల?''

''సుందరీ! నినుగనినంతట మన మొక్క వయస్సుపడుచులమై చిన్ననాఁడాడిన యాటలును బాటలును నాబుద్ధి నేత్రములకెదుట నాహ్లాదముతో వేవేగఁదోఁచుచున్నవి. మన బాల్యమువ లోకమిట్టిదని తెలియకయు సుఖదుఃఖము లిట్టివని యెఱుఁగకయు నిర్విచారముగను నిష్కళంకమైన మనోభావములతోను విచ్చలవిడిగఁ గ్రీడించితిమి. ఇపుడు పురుషుడనియు సంసారమనియు నిట్టిభావములను వహించి లోకులవద్దను మన సొంతబందుగులయొద్దను నడుచుకొనవలసినట్లేర్పడిన విధిక్రమములకు బద్ధపడిన వారమైయుండుటవలన మనమాచరించు చరియలలో యుక్తి యోచన, వివేకము, వ్యాజము—యీలాటి విషయముల నరయుచు విచారమతులై యున్నవారము. ఏదియో యొక కారణముంబట్టి, లేక, యేదియో యొక కాంక్షఁగొని యుండువారిప్పటి చెలికాండ్రును జెలికత్తెలును. మానవుల జీవితకాలములో వారు పెద్దపెరిగి యెంత ఘనధనవంతులైనను వారినిర్విచారమైన బాల్యకాలమునకును శైశవకాలమునకును సదృశము లేదని స్పష్టంబగు. మనకు నిఁక నట్టి బాల్యము రాఁబోవుచున్నదా? మనమట్టి నిర్మల హృదయముతోను

నిర్దోషమైన బుద్ధితోను వేడుకగాఁ గూడుకొని యాడిపాడి మనోత్సాహము జెందబోయెదమా ? నినుజూచి నాకెంతో యాహ్లాదము గల్గెను. మనతోడి చెలికత్తెలందఱు సుఖమా ?

రెండు నెలల క్రిందట మన చిత్రాంగికిఁ గాలఖండమున గడ్డలేచి, చికిత్సకునికిఁ దనయుదరముఁ జూపనని యొకపట్టుగ నుండినందున, గడ్డ వృద్ధమై కుక్షికడవఱకు వ్యాపించి, యందుచేత మృతినొందెను.''

“అక్కటా ! స్త్రీవైద్యులుండి దానికిఁ జికిత్సచేసియుండిన నది యొకవేళ బ్రతికియుండినా యుండవచ్చు. ఇట్టి కారణముచేత దుర్మరణము జెందిన స్త్రీలింకెందఱో ! ఒక భార్యగతించిన నింకొక భార్య వచ్చుచున్నదను నిశ్చయంబుచేతఁ బురుషుల కీవిషయమై విచారముండునట్లు కనబడలేదు. కటకట ! నా బాల్యసఖి చిత్రాంగి పురుషులతోఁ దనబాధఁ జెప్పుకొన లజ్జపడి యెంత బాధల నోర్చెనో! తన ప్రాణము యముని చేత నొప్పగించువఱకు దాని ప్రాణమెంత క్రుళ్ళెనో ! స్త్రీయను శబ్దమునకుఁ బ్రతిపదము క్షాంతి యనఁదగు, కాఁబోలు ! ప్రజావృద్ధికిఁ దక్క తక్కిన లోక వ్యవహార విషయములలో స్త్రీజాతిని జొఱనియ్యక దిగువఁ బడవేసి యుండుటకు నెంత పాపముచేసి యీ స్త్రీజన్మంబు నెత్తితిమి !''

సుం— ఎదుటలేనిది యెదలేదు, అన్నట్లును, ‘క్రొత్తవెల్లువవచ్చి ప్రాతవెల్లువంగూడా కొట్టుకొనిపోయె’ నన్నట్లును లేక నీవు సమాజముల స్థాపించి ప్రముఖత్వముఁ జెంది యసంఖ్యాతమైన స్నేహకత్తెలను సంపాదించి యుండియుఁ జాలకాలముగ నీవు చూడని నీ ప్రాతస్నేహితురాండ్రను మఱచి యుందువని పొరపాటైన యభిప్రాయముఁ గొని యుంటిని. బాల్యమునాటి స్నేహకత్తెలయందు నింత వాత్సల్యమును బాల్యమైత్రియందు నింత యాహ్లాదమును నుండునని తలవని దోషము నాదియే. నాకుఁ గట్టికుడువను దక్కఁ ఖ లేకుండినను, చిన్ననాటనుం

డిన ‘తెంపు, ఉత్సాహము, ఉద్యోగము—ఉల్లాసము,’ యివి యిపుడు రమ్మన్నను రావు.

ల—సుందరీ ! మన కనకవల్లి సుఖమా ?

సుం—దానికి, పాపము, నలుగురు బిడ్డలట; మఱి యిపుడు గర్భిణి.

ల—ఇంత పసితనమున నాలుఁగు బిడ్డలకుఁ దల్లియైన దల్లిదేహములో శక్తి యెట్లుండు? బిడ్డలును రోగరహితులై యెట్లు పుష్టిగ నుందురు?

సుం—ఈచే బోయిన కాళ్లు చేతులతో నిలువను నడువను శక్తిలేని కుకరులై పుట్టి యుండెదరు. తల్లియో, పలలమును లోహితమును లేక పేలవమైన శల్యములను వదలుగఁ గప్పియుండు చర్మముతోఁ గూడిన యొడలు గల్గియున్నది.

ల—వంకాయంత దోసకాయంత బిడ్డ లెందఱుండిన బ్రయోజన మేమి? వారు మన దేశమునకు భారమై దేశాభివృద్ధికి ననాలుకూలులైయుండుట గాక దేశదౌర్భాగ్యములకుఁ దోడ్పడువారై యుందురు. కలియుగాంతమున వంకాయతోటలలో మానవులు నిచ్చెనవేసి వంకాయలఁ గోయుదురని కొందఱు చెప్పగ వినియున్నాను; కలిముగియుటకు లక్షలకొలఁది యేండ్లుండగ నాలాటి వామనావతారములును గూణులును జనియించిన యెడ గలిసమాప్తకాలమున మనదేశస్థు లెలాగుందురో భగవంతునికే యెఱుక.

సుం—ఇట్టి దుర్దశలకుఁ గారణము బాల్యవివాహము. ఈదురాచారము నెట్లు వర్జింపనగును?

ల—సుందరీ ! స్త్రీలకు విద్యాస్వతంత్రములు గల్గిన శైశవోద్వాహ మనెడి యరాతి ధ్వంసమగును.

సుం—ఓసి, లత ! నీ మేనుమేనియు మోముమురువును మారకున్నవి; మీదఁ బతుల నన్యోన్యమువిని యరుసమొందితి.

ల—(నవ్వుచు) సుందరీ! మనతో నాడుచుండిన సావిత్రి సుఖమా ?

సుం—దాని పెనిమిటికిఁ బశ్చిమప్రాంత్యంబున నుద్యోగము; దానికి రెండు బిడ్డలు; అదిమన శ్రీమంతపల్లెకువచ్చి యేఁడాదియాయెను.

ల—సుందరీ! కోకిలాంబసుఖమా?

సుం—దాని పేరుచెప్పిన నాకుక్షిన మంటబొగ్గుల నేసినట్టున్నది. దానికి పెండ్లియైన యేఁడాదిలో విద్యార్థిగనుండిన దానిమగఁడు, జ్వరముతగిలి, గతించినాడు. దానితల్లిదండ్రులు తొందరపెట్టి దానితలవెండ్రుకలఁ దీసివేసినదిగాక, దానికొక తెల్లనివస్త్రమిచ్చి ముసుకువేయించియుండెదరు. అందుచేత నేప్రొద్దును సువారపుటింట మంతనమున జింతించుచున్నయది.

లతాంగిచేతులతోఁ దనచెవులమూసికొని, కంటనీటఁబెట్టుకొని, "హరి హరీ! ఎట్టిమాటలనువింటిని! నాకడుపులో ఫిరంగిగుండు నేసినట్టున్నది. నాప్రియకోకిల యింకను శుభములుజరుగుచోటఁ దలజూపరాదు. వీధివెంబడి వెళ్ళిన దుశ్శకునమని దూషణకుఁ బాత్రియగును. నలువురుకూడి వేడుకగ మాటాడుచుండిన, వారియెదుట నిలుచుటకుఁగూడ మనసొప్పదు; తక్కిన స్త్రీలవలె మంచికూడుగుడువరాదు; సొమ్ములఁ దొడుగరాదు; మంచిబట్టలఁ గట్టరాదు; దేహపోషణ జేసికొనరాదు. ఇంటనుండినా సెటఁబోయినా 'ముండ, మూసకమ్మ' యని నిగ్రహింతురు. అయ్యోదైవమ! నాముద్దుకోకిలను నిట్టిపరిభవంబులఁ బెట్టితివ! (కంటనీటిధారలొలుకుచు ముక్కుజీడుచు) ఓ నాసఖి, కోకిలా! నీదేహము కృశించుచు నీమనంబెట్టివేదనలఁ బడుచున్నదో! లోకమునగల నీవంటి స్త్రీల సుఖవైభవములఁగాంచి, నీహృదయమెంత పరితపించుచున్నదో! పురుషస్పర్శములేని పవిత్రగాత్రికి శిరోరుహమును వపనముచేయించి, భంగముచేసినదిగాక దానినిర్మలంబైన మనంబును నెడతెగని చింతలంబెట్టి వ్రణముచేసెడి పురుషులహృదయమును నెట్టిదనఁగొనవదగును? ఇట్టి శోకములును సహనములును స్త్రీజాతికేనేర్పఱచిన వారెట్టి మహనీయులు! బాల్యవివాహముచేతను స్త్రీలకు విద్యాస్వతంత్రములు లేనం

దునను నిట్టి తక్కసకృత్యంబులకును విపరీతంబులకును నెడమాయెను. మంచిది! మనదేశ స్త్రీలను ప్రస్తుతహీనస్థితినుండి మిగిలించుటే నేకవ్రతముగ నేకవృత్తిగఁబూని నేనుమనియుండుదాక నాస్థితిమతులను స్త్రీలయోగక్షేమములకుఁ బ్రతిబంధకములైన యాచారములనెడి పాశబంధములనుండి విడదీయుటకు నప్పననేసెద,నని ప్రతిననేసెను.

"ఓసి లత! నీవు స్త్రీకులోద్ధారకి కావుతను."

"నాలుఁగు చేతులుఁతట్టిన గొప్ప శబ్దముపుట్టును. ఒక్కచేతితో ఘోషింపనగునా?"

"నన్నేమి చేయమనియెదవు?"

"నీవు మనగ్రామముఁజేరినవెంటనే నొక స్త్రీసమాజమేర్పఱచెదవా?"

"మనగ్రామమున నిరువదింటికి పైజేరరు."

"ఇరువదింటికిఁ జేరిననెంతో కార్యము సాధింపనగును. గ్రామమునకు నిరువదివంతున నూరుగ్రామములుజేరిన రెండువేలమంది యగుచున్నారు; వారితో నెంతోపని సాధింపఁగూడును."

"మంచిది! అలాగే చేసెదను.

సుందరీ! నీవు వచ్చి చాలప్రొద్దాయెను. అన్నముతినిపొమ్ము."

"ఇంటనాకై కాచియుందురు. ఏనువెళ్ళెదను."

లతాంగి పోఁగూడదని నిర్బంధముచేసి, కృష్ణమూర్తి యొకతట్టుభుజియించుచుండగ, లతయు సుందరాంగియు నింకొకతట్టు గూర్చుండి వేడుకగామాటాడుచు, బిడ్డలనుబువ్వతినిపించి వారును భోజనముచేసి, తమలము గ్రహించిరి. కొంతసేపటికి లతాంగి సుందరాంగికిఁ గుంకుమనిడి, పసుపుకొమ్ములతో తాంబూలమిచ్చెను. వెంటనే దానిబిడ్డలకు ద్రాక్షపొట్లమును గలకండపొట్లమునునిచ్చి, రెండుబిడ్డలను ముద్దుపెట్టెను. అటువెనుక ధ-పంచమినివెంబడించి, సుందరాంగిని దాని మఱదియింటికిఁ బంపెను.

కొన్నాళ్ళకు వెనుక నొకనాటి సాయంత్రమున, ధ. పంచమి లతాంగినిబిలిచి పాదిరి పెద్దదొరసానమ్మగారు వచ్చుచుండునట్లు చెప్పెను. లతాంగి లేచివీధికివెళ్ళి దొరసానమ్మగారిచెయింబట్టికంపించి "సుదినం! సుసాయం!" అని చెప్పి లోపలబిలుచుకొనివచ్చి తనప్రక్కను గూర్చుండఁజేసెను.

"మూఁడునెలలక్రిందట మీరుముగ్గురుగ నన్నుజూడఁగోరి నాబంగళాకు వచ్చియుండినట్లు నాకూఁతురు చెప్పెను. ఈవఱకువచ్చుటకుఁ దీరుపాటులేకుండెను. (నవ్వుచు) పావరీలభారములోఁ గొంతఁదీసికొని మాపుణ్యమునకుఁ బాలివారైనందుకు సంతసించెదను," అని మిసెస్ మేరితూమస్ దొరసానమ్మగారు చెప్పిరి.

"ముందుపాదముమీయది; మీయడుగులపైగను పెట్టి యాదారిన నడుచుకొనుచున్నారము. మాపుణ్యమునకుఁ గారణము తమవంటి పుణ్యాత్ములే."

"మీసమాజము లెంతమాత్రము సాగుపాటుగల్గియున్నవి? సమాజకార్యోద్దేశము లేవఱకు సాగియున్నవి?"

"భగవంతుని కృపాకటాక్షములచేతను దమవంటి పుణ్యాత్ముల యాదరణచేతను బ్రోత్సాహముచేతను, మాసమాజకార్యములు నిర్విఘ్నముగను సంతృప్తికరముగను జరుగుచున్నవి; తమదర్శన కటాక్షములు మాయభీష్టమునకు జయప్రద చిహ్నంబులవలెఁ గనిపించుచున్నవి."

"హా! హా! హా! సంతోషము. మనసుపెట్టి ప్రయాసనెత్తికొనిన నేపని చేకూడదు? ఎత్తినపనిని జాఱవిడువక, సాధింపవలెనని పట్టుపట్టి, జయము నిశ్చయమను మనోనిశ్చయంబుతో నేపనింబూనిన నదిసిద్ధించుట రాత్రికివెనుకఁ దెల్లవాఱునంతటి నిశ్చయము."

"మాసమాజమునకుఁ దాముసంరక్షణకర్త్రియని తమ నామమును మాసమాజపుస్తకమున వ్రాసికొనుటకుఁ దమయనుమతిగోరఁ దమమందిరమునకు వచ్చియుంటిమి"

"మీరుచెప్పిన సంగతులన్నియు నాకూఁతురు చెప్పగవిన్నాను; మీయిష్టానుసారము జేసికొనుఁడు; శాఖాసమాజములెన్ని యున్నవి? ఎచ్చెటెచ్చట?"

"మావనితా సమాజమొక తీఁగవలె నేఁబదిస్థలములయందు వ్యాపించి యల్లుకొనియున్నది."

"అన్నిశాఖలకును మూలము 'వనితాసమాజము'! అట్టిమూలమున కాధారమును బోషణకర్త్రియు నీవై యుండుటంజేసి, తీఁగియకు భయములేదు; ఇఁకమీఁదట పుష్పములెత్తి మంచిఫలములు గల్గుఁగాక."

"ఫలములై భుజియించుటకుఁ బరిపక్వమగు పర్యంతము నాప్రాప్తంబెటులో."

"నీవు బసిదానవు; నీకష్టఫలములను జిరకాలమనుభవించి సంతుష్టిఁ బొందుతను!"

"తమప్రియమైన యభీష్టమునకును నాశీర్వచనమునకును వందనమొనరించెద; తమవర్ణస్తులలో గొన్నిఘనులకును రాజాంగమున నున్నతస్థితిలోనుండు ప్రభువులకును వారిరాణులకును నేను పూనియుండు లోకహితమైనకార్యమందుఁ గృపాకటాక్షముల నుంచునట్లు హితవచనములం జెపుమా. మంచిసమయముగను పెట్టియుండి తమమందిరమునకుఁ జనుదెంచెద. అప్పుడు తమకు దీక్షకయుండిన రాజసదనంబునకుఁ దోడ్కొనివెళ్ళి, రాజథానికధ్యక్షునికి నతని. రాణిగారికిని బరిచయమునుజేయించిన దమయుపకారంబునకుఁ గృతజ్ఞత గలదియైయుందును."

"ఏను నినుగుఱించి యున్నతస్థితిలోనుండు మావర్ణస్థులతో మాటాడియుండెదను. వారు నినుఁజాల మెచ్చుకొనిరి."

"దొరసానమ్మగారు! అట్టివారి యభిమానానుగ్రహములు లభియించుటకుఁ దమవంటివారి యనుగ్రహమే. తాము వచించినమాటలు నాకుఁ బ్రోత్సాహకరమై యెంతశ్రమమైన దీసికొనుటకు ధైర్యమిచ్చుచున్నది."

“నీధీరత్వమును మెచ్చుకొనియెద; నీవుకోరుపండతిమధురమును మిక్కిలియరుదునునైనయది. ఎంతప్రయాసైనాఁబడి యట్టిదుర్లభఫలము నందుకొనుదువుగాక! అని, మాదేవుని బ్రార్థించెద.”

లతాంగి రెండుచేతులను జోడించుకొని, “మాదేశస్థుల మేలుగోరుటకు వందనములు. సుసాయం. దయనుంపుమమ్మ,” అనిచెప్పఁగ దొరసానమ్మ లతాంగిచెయింబట్టి యాడించి, “సుసాయం”, అనిచెప్పి, వీధియందు నిలిచియుండిన మోటారురథంబెక్కి, లతాంగి తనదృష్టికగోచరమగు పర్యంతము రథమునుండితొంగిచూచుచుఁ దనచేతిగుడ్డ నాడించుచుఁ జనియె.

24–వ, అధ్యాయము.

లతాంగి యేకాంతము.

లతాంగి తన యలవాటు పద్ధతికి శ్రీరాముల బూజించి ప్రార్థనలు ముగిసినంతటఁ దనబాల్యసఖి కోకిల విశ్వస్తయైనందుకుదుఃఖాక్రాంతయైయిదిగువఁజెప్పెడి రీతిగఁ బర్యాలోచించెను:—

భరతఖండంబున వివాహంబైయుండు స్త్రీలలోఁ బదియేండ్లకులోఁబడ్డవయస్సుగల పడుచుల సంఖ్య యిరువదియైదులక్షలు. దేహావయవములు పరివృద్ధముకాని యీపసిపడుచుల కుదయించెడి పుత్రులును బుత్రికలును దేశాభివృద్ధికిని దేశసంరక్షణమునకు నెంతటినిర్వాహకులై యుందురు! దేహదార్ఢ్యములేక బుద్ధిబలము వర్ధిల్లఁజాలదు. బుద్ధిబలములేక లోకవ్యవహారముల సాధింపనలవికాదు. ప్రస్తుతము భారమైన వస్తువులఁ బైకెత్తుటకు నన్నాయయంత్రములేర్పడియున్నవి. ఇట్టి యంత్రములేర్పడి యుండనిమనప్రపితామహుల కాలములో నారోహణములులేక శైలశృంగములమీఁదస్థూలమైనయుపలములఁ గొంపోయి, శాశ్వతమైన గుడిగోపురంబులను వినశ్యమైన కోటలను గట్టినవారి సంతతిలోఁ బటుత్వములేని నీచదేహులమైపుట్టినందుకు బాల్యవివాహమే ముఖ్యకా

రణము. ఈదౌర్భాగ్యము చాలదని బాల్యవివాహముచేత లెక్కలేని లెంపులైరి.

స్త్రీప్రజలలో సరాసరి నూటికిబదునేడు వంతున దొంబదిలక్షలమును కలుమనఖండంబున నొచ్చుకొనుచుండెదరు. వారియంగములు ముదిరి వారికి మరలవివాహంబైనచో, హిందువుల జనసంఖ్యయిమ్మడించియుండుటతో వారిబిడ్డలువృథగాత్రులైయుందురు. ఈతొంబదిలక్షల ముసుకులలోఁ బదునేను సంవత్సరముల వయస్సునకు లోబడ్డవిశ్వస్తుల సంఖ్య మూఁడున్నరలక్షలు. హరిహరీ! నాబాల్యసఖి కోకిలయొక్కతె విశ్వస్తయైనదని నాశ్రోత్రంబులఁబడి నామనంబుపరితపించెను. నాప్రియకోకిల సంకటపడుచుండుటవలె లక్షలకొలఁదినుండునాహిందుచెల్లెండ్ర హృదయము లెంతవేదనలఁ బడుచుండవలెను! హే, హిందూ పురుషోత్తములార! సుధీవరులార! ఈఘోరమైన యవస్థలకును నీపాపసంభవమునకును బీజంబేదియని విచారించితిరా? విచారించి తెలిసికొనియు నూరకుండెదరా? ఉపేక్షతో నూరకుండిన మీహృదయములు ప్రస్తరములనియుఁ దృణములు మొలవని ప్రాంతరమనియుఁ జెప్పఁదగుఁగాని, రసయుక్తమైన రక్తమాంసములతోఁ గూడినవియని యెట్లనుకొనదగును? నావంటి స్త్రీజాతికిఁగల్గిన దురవస్థను దలఁచేకుండినను మీరుదుర్బలులై యబలులవలె నుండుటచేత స్వకీయ యోగక్షేమములను గోరియైన నీ విపరీతకరమైన బాల్యవివాహంబను క్ష్వేడమును నిర్వ్యాపకము జేయరాదా? బాల్యవివాహముచేత మానవుని జీవితకాలమును దేహపటుత్వమును క్రమేణ తగ్గుచు వచ్చిన, నాలుఁగైదు పురుషాంతరములకు వెనుక మన దేశస్థులు స్వల్పకాలమే జీవించెడి యల్పగాత్రులై పుట్టి దేహదార్ఢ్యమును బుద్ధి బలమును లేక దేశకార్యనిర్వాహకమునకు యోగ్యత లేనివారై యుందురు. నిర్మాణముకంటె నిర్మూలము సులభము; నాలుఁగేండ్లు పట్టిన నిర్మాణమును నాలుఁగు నిమిషములలోఁ జెడఁగొట్టవచ్చును. నాలుఁగు తరములుగఁ గ్రమేణ క్షీణించుచు వచ్చు దేహ బలమైనను బుద్ధి బలమైనను నలువది తరములలో నైనను

చిక్కఁబడుట దుస్తరము. ఈ యాచారము మన ముత్తాతల కాలమునుండి వచ్చుచున్నదని యెఱుఁగ నేరకుండిన గొంచెనంచెముండు పటుత్వము వారిం చినవెనుక చింతించిన, దొంగలు దూరి యాఱు నెలలకు గుక్కలు మొఱిగి నట్లుండు. కనుక, మన జీవమును బీల్చెడి రోగమువలెనుండు స్వవినాశకర యాచారమునకు జీవభేషజము ‘స్త్రీ విద్య, స్త్రీల స్వతంత్రము’, అని యెఱింగి, వాటిని వర్ధిల్లఁజేయు మార్గము నన్వేషింప వలసిన ధర్మము నెల్లరం జెందిన యది.

మన శశిపురము రాజధానిలో రెండు కోట్ల బదునాలుఁగు లక్షల స్త్రీ లుండెదరు. వారిలోఁ జదువుకొనఁగూడిన వయస్సుగలవా రరకోటి. ఇందఱికిని రెండు వేల యేనూరు పాఠశాలలున్నవి. ఏఁబది లక్షల పిల్లలకు రెండు వేల యేనూరు పాఠశాల లెంత మాత్రము? ఇంటింటికిని విద్యఁ దీసికొని పోకుండిన నందఱు జదువుకొనఁ జాలరు. మంచిది! ఇంటింటికి విద్యఁ దీసికొని పోను సాధ్యమాయని యొకింత యోచించెదను.

యావత్తు నగరములలో నివసించెడి స్త్రీల సంఖ్యకు గ్రామ పల్లె టూళ్ళలోనుండు స్త్రీల సంఖ్య పదుమూఁడు పాళ్ళధికమై యున్నది. వారిలో లెక్కింపఁ గూడిన కొందఱు తప్ప దక్కినవారు దీనత్వము నొంది యుండెదరు. వారు, ‘కృషీవలులు, గ్రామరక్షకులు, లేపకులు, కుంభ కారులు, నాపితులు, రజకులు, జాబాలులు, సౌచికులు, కింకరులు, చర్మ కారులు, జీవాంతకులు, మాతంగులు’—ఇన్ని విధములైన తెగవృత్తులఁ జేరినవారై, కొన్ని తెగలు తక్కిన తెగలతోఁ గలియక యుండెదరు. ఈలాటివారి లేమిడిచేతఁ బదియేండ్ల వరకుఁ బురుష బిడ్డలకు గోచికి మించిన వస్త్రము దొరకదు; స్త్రీ బిడ్డలకు మూరెఁడు చింపికి మించిన యంపియ చిక్కదు. ఇట్టి వారెట్లు రొక్కమిచ్చి చేదువుకొనఁగలరు? ఈలాటి వారిలోఁ గొందఱు పశువులను గొఱ్ఱెలను మేపుచుండెదరు; కొందఱు ప్రొయిక్కిఁ బుల్లల నేఱుచున్నారు; కొందఱు తమ తల్లిదండ్రులకుఁ బో

ము చెంత ‘సంబలి గంజి’ చేట్లను దీసికొని పోయెదరు. వారికి విద్యయం దాసక్తి లేదనరాదు; లేమిడిచేత విద్య నపేక్షింపనివారై యుండెదరు. ఇట్టి వారు వేవురై యుండుటచేత వారి విద్యకొఱకు నేమి చేయఁగూడును? పాలు పోషణార్థమనియు మందు రోగ నివారణార్థమనియు తెలియని బిడ్డలు వారితల్లి పాలు బోసినను మందు బోసినను నేడ్చు. తండ్రి తన బిడ్డ లను గొట్టి తిట్టి యైనను జదువుకొన జేయును. తద్రీతిగ, మూఢులై యుండు బీదలు తమ బిడ్డలకుఁ జదువు వద్దన్నను, పితృ సన్నిభులై యుండు దొరతనము చేయువారు చేదువును బలవంతము చేయవలెను. ఏలుబడివారి స్వాధీనమున లేని పాఠశాలలో మంచి చేదువెక్కదు.

అన్యదేశములయందు సొంత పాఠశాలలఁ బెట్టి విద్య గఱపుట నొక వృత్తిగ నున్నయది; అట్టి వృత్తిని మన దేశమున నవలంబించిన బేదతికముచేత ననేకులు పాఠశాలకు రాఁజాలరు; కనుక, సొంత పాఠశాలల నేర్పరచుకొను టకుఁ బ్రేరణలేక యున్నది.

సుమారు పదిపది యేండ్లుగ నెంతో శ్రమఁ దీసికొని యెంతో ధన మును వ్యయముచేసి పాఠశాలల సంఖ్యను నెక్కించుచుండు దొరతనపు వారికి మనము విశ్వాస బద్ధులమై యుండెదము. అట్లెక్కించి వచ్చియు, రెండు కోట్లు పురుషులు గల మన శశిపుర రాజధానిలో ముప్పది రెండు వేల పాఠశాలలుండిన జాలునా? పురుషులలో నూటికాఱుమందియు స్త్రీలలో నూటికొకటింముప్పాతికయుఁ బాఠశాలకుఁబోయి చేదువుకొనిన జాలునా? బీదసాదల బిడ్డలను జదివింపవలెనన్న ద్రవ్యము మెండుగఁ గావలసియున్నది. ద్రవ్యమును సంపాదించు నుపాయము నేలెడివారు కనిపెట్టవలసిన విధాయక మనుకొన్నను, కొంత మట్టుకు జనులును సొంత యతనములఁ జేయవలసినవారై యుండెదరు.

లేమిడిచేఁ జదువుకొనని బిడ్డలఁ జదివించిన మంచిపుణ్యమును నిహపర ములకు సార్థకమును గల్గును. గ్రామములోని ‘చాకల, మంగల, వడ్ల, కుమ్మర

గొల్ల, గొడగర,' యీలాటివారిబిడ్డలు నెలనెలకు జీతమిచ్చుటకు శక్తిహీనులై యుండుటతోఁ గొన్నిబిడ్డల సాహాయ్యము పెద్దలవృత్తికిఁ గావలసి యున్నది. అట్టి బిడ్డలు ప్రతియుదయము నేడుగడియలవఱకుఁ బాఠశాలలోఁ జదివి తక్కినవేళలోఁ దమపెద్దలవృత్తి కనుసరణమైన కార్యములఁ జేసి కొననగును. ప్రతిగ్రామముననుండు గ్రామాధికారియు, మేటిరైతును, సాగుదలగల్గినవారును గొంతశ్రద్ధ దీసికొని గ్రామములోని రెండుమూఁడు స్త్రీలకుఁ జదువుఁజెప్పించి, యా స్త్రీలను దమగ్రామములో సులభసంబళమునకు నుపాధ్యాయినీలుగ నియమింపనగును. పురుషప్రయత్నముకంటె స్త్రీల ప్రయత్నము సత్వరముగఁ గొనసాగును. కనుక, విద్యాస్వతంత్రముల మహిమల నెఱింగిన దొరసానులమూలముగాను దొరతనమువారిని సమీపించి, తుదఁ జెప్పబడినవారిచేత నెంతసాహాయ్యము బొందనగునో యంతసహాయ్యముఁ బొందఁ జేసెదను. మఱియుఁ గొన్ని దేశాభిమానుల మూలముగా గ్రామములలోనుండు గొప్పరైతులఁ బ్రోత్సాహపఱచి, వారివారి గ్రామమున నిలుకడగ నివసించే స్త్రీలలో రెండొకరిని జదివించి యట్టివారిని దమ గ్రామములో నుపాధ్యాయురాలుగ నియమింపఁజేసెదను. గ్రామతక్షకాదులకు నిచ్చుమేర పద్ధతికి మేరధాన్యమేర్పఱచి, గ్రామములోని బోధకికి సంబళమునకు బదులు మేరనియ్యనచ్చును. ఇట్లు చేయుచువచ్చిన, పదివత్సరములలో, పేరువ్రాయను సంతకముజేయను దెలియనివారిసంఖ్య చాలుమట్టుకు దగ్గి స్త్రీజాతికి యశస్సుగల్గియు గణ్యతహెచ్చియుఁ బ్రస్తుతముండెడి నిర్బంధములును దురవస్థలును మిహిరునిగన్న హిమమువలె హరించిపోవును. నాయభీష్టంబు బూర్తిచేయుటకై సర్వేశ్వరుండు నాకు మనోనిశ్చయమును దేహబుద్ధిబలంబుల నిచ్చుగాక !

లతాంగి యిట్లుతలపోసి, పుష్పాక్షతలను శ్రీరాముల పాదముల కర్పణ చేసి, లేచెను.

---

25 వ, అధ్యాయము.

చట్టసభకుఁ బ్రతినిధులుగ నిలువఁగోరినవారు లతాంగినిదర్శించి ప్రేరణజేసి వెళ్లుటయు, ప్రతినిధుల వ్యాజ్యమును.

ఏలుబడివారికిఁ బన్నుగట్టుప్రజలు చట్టసభకు రెండు ప్రతినిధులఁగోరుకొనవలసినకాలము, ప్రభుత్వముచేయు వారిపత్రికలోఁ బ్రకటింపబడెను. ఆరెండుస్థానములను నలువురు కోరిరి. ఆయర్థులలో ప్రభాకరపంతులుగారును దినమణి రావుగారును మాటచెల్లుబడిగలవారు; తక్కినవారు సామాన్యులు.

ఎన్నికలనిచ్చుటకు రెండుమాసములకు ముందు నొక్కనాటియుదయంబున లతాంగి తనగదిలోఁ గూర్చుండగ సామాన్యయర్థులలో నొక్కని యనుబంధకుఁడు చేనుదెంచి లతాంగితో సంభాషించి, లతాంగికిఁగల రెండుయెన్నికలలో నొక్కటిఁ దనకుఁ గావలసినవారైన పుల్లయ్యకు నిచ్చునట్లు కోరి, సమాజములఁజేరిన స్త్రీలయెన్నికలఁగూడా తనస్నిగ్ధుని కిమ్మని వేడుకొనెను. మఱునాఁడు సామాన్యయర్థులలో నింకొకండైన ఎఱ్ఱయ్యయేతెంచి లతాంగి యెన్నికయు సమాజసంబంధముగల స్త్రీల యెన్నికల దనకిచ్చిన యెడ స్త్రీవిద్యాస్వతంత్రములఁగూర్చి వలసినపాటులంబడ సిద్ధముగ నుండునట్లు తెలిపి, యెన్నికలగుర్తించేనాటికి స్త్రీలునడచిరాలేరని బండ్లు పెట్టుకొని వచ్చుటకై యేఁబదిరూపాయల నోటొక్కటిని లతాంగి మేజమీఁదఁ బెట్టెను. లతాంగి కోపించి యౌల్లిదముతో నానోటును నవతలికిఁ బాఱవేయ దానిని ఎఱ్ఱయ్య చేతనెత్తికొని, "కోపపడకుము. తల్లీ! తెలివిలేక రూపాయలిచ్చితి. ఎన్నికలనిచ్చునాఁడు నాస్నేహితులు బండిపంపుదురు తప్పకరమ్మ" అనుచువెళ్లెను.

ఇదిజరిగిన రెండవవారమున నొకనాటియుదయంబున దినమణిరావుగారు లతాంగికిఁ దననామచీటిని బంపిరి. లోనరమ్మని యనుమతినిచ్చినవెంటనే నతండు లోపల నడుగుడెంచి కూర్చుండెను.

"తాము చట్టసభకుఁ బ్రజల ప్రతినిధిగ నిలువ నుద్దేశించియుండెదరా?"

"నా స్నేహితులలోఁ గొందఱును, కొన్ని దేశాభిమానులును, పన్నుకట్టు ప్రజలలోఁగొందఱును, నన్నొకయభ్యర్థిగ నుండుమని కోరినందుమీఁద సమ్మతించితి."

"బ్రాహ్మణులలో మధ్వకులమునుం జేరినవారును గొన్ని ద్రావిడబ్రాహ్మణులును నాంధ్రబ్రాహ్మణులును బ్రాహ్మణేతరులలో మహారాష్ట్రులును బట్టలకు రంగువేసెడివారును, సాలెవాండ్రును రావుపట్టము బెట్టుకొనియుండెదరా?"

"వాస్తవము."

"తామేకులస్థులకుఁ బ్రతినిధిగ నిలువబోయెదరు."

"ఏనుకులవర్ణభేదములను లక్ష్యపెట్టినవాఁడనుగాను."

"ఆభేదముగ నుండఁబోవుట చాలసంతోషము; తాము దయసేసిన కార్యంబేమో?"

"తమ సమాజములం జేరినవారెల్లరు నేకమతముగ నాకొకయెన్నిక నియ్యవలెనని తమను బ్రార్థింపవచ్చితి."

"తామీవఱకేలాటి లోకహితమైన కార్యంబుల జేసియుండెదరు? ఏలాటి హితములజేయ నుద్యమించియుండెదరు?"

"అస్పృశ్యతగూర్చి తిరస్కరించి పెక్కుచోట్లనుపన్యసించి యుండెదను; మఱియు దేశహితమైన కార్యములకు ధనాఢ్యులు ద్రవ్యసహాయము జేయ నుద్యుక్తులై యుండవలెననియుఁ బ్రసంగము చేసియుండెదను."

"నోటిగుండా వేయిమాటలఁజెప్పి బోధించుటకంటె స్వకీయమైన నడతలచే బోధించుట మేలు."

"కర్మకరులకు రాత్రిపూఁట జదువుజెప్పి యిచ్చుటకు రెండుపాఠశాలలను నా సొంతదుగ్గాణిబెట్టి యేర్పఱచి యుండెదను."

"బీదలకట్టి యుపకారము జేయుటచేతఁ గీర్తియుఁ బున్నెమును గల్గును."

"యాచకమునకు వచ్చెడి బ్రాహ్మణులకు నాశక్తి ననుసరించి యన్నవస్త్రములనిచ్చి సహాయముజేసెదను.

"పాటుపడశక్తిలేని యంగహీనులకు సహాయ్యముచేయవలసిన విధియున్నది; దేహదార్ఢ్యము గల్గియు బాటుపడనివారు లోకులకు బనికిరాని భారమగుదురు; వారు పాటుపడకుందురేని దేశమునకు నష్టము. బ్రాహ్మణులకుఁ బక్షపాతము జూపనేల?"

"ఛాందసులుగాను, దీక్షితులుగాను, కులవర్ణమతాచారముల ననుసరించెడి వారుగాను వనీపకులై వచ్చినవారికి సాహాయ్యముజేసెదను."

"వేదవిదులై క్రతువులజేసియు గులాచార ప్రవర్తనులైయుండువారును బెక్కువృత్తుల జేయనగును. అట్లుచేయకుండిన మనదేశమునకే నష్టము; పాటుపడనివారు దేశాభివృద్ధికనానుకూలులు; గోదారణముఁ జేతఁబట్టి భూమిని బ్రక్కలింపగూడదని శాస్త్రనియమముండినను, తక్కిన వ్యవసాయపనుల జేయఁదగును. జెందెమువడకువారికి నిర్దోషమైన నేతపని సరిపడదా?"

"మీసమాజముల జేరిన స్త్రీలందఱుఁ దమయెన్నికలలో నొకటి నాకిత్తురని నమ్మియుందునా?"

"తమభార్య మీసమాజములఁ జేరియున్నదా?"

"నాభార్య పేరుపంకజం; మహిళాసంఘముఁ జేరియున్నది. స్త్రీలకు స్వతంత్రముగల్గుటకు బాటుపడుమనినను పదేపదే తాఱుచేచేన్నది."

"తాఱుచేటకంటె యొప్పించుట మేలుగదా?"

"ఏను సమ్మతించితి."

"మంచిది, వెళ్ళిరండు. ఏను సమాజములఁ జేరిన స్త్రీలతోఁ దమ విషయము గూర్చిమాటాడెదను."

"సంతోషము; తమకు బదివేలదండములు," అని, సెలవు పుచ్చుకొనెను.

వెంటనే ప్రభాకరపంతులు రాగా లతాంగి లేచి పంతులుగారికి నమస్కరించెను.

పం—నిన్న మొన్న రావలెనని యుంటిని; కచేరి కార్యములవల్లను గక్షివాండ్రతోఁ బ్రొద్దుపోయినందునను రాను వీల్పడలేదు. చేట్టసభకు నేనొక ప్రతినిధిగ నిలిచియుండెద. నే నెక్కువగఁ జెప్పఁ బనిలేదు. మన మొక్క కులస్థులమై యుండుటంబట్టి నాకు లభియించే కీర్తి మనకులస్థులఁ జేరు. మీ కూటములఁ జేరిన స్త్రీరత్నములతో మాటాడి వారి యెన్నికల నాకిమ్మని చెపుము.

ల—ప్రజల మేలుకొఱకు దామీవఱకు నేపాటులం బడితిరో వాటిని గాస్త దయసేతురా?

పం—లోకహితంబుల నోటిగుండా వెల్లడించిన వారనేకులుండెదరు. చేతలఁ జేసి చూపినవారు కదాచిత్తు.

ల—దినమణి రావుగారు భృతకులకు రెండు పాఠశాలల స్థాపించి యుండలేదా?

పం—ప్రతినిధిగ నిలువఁగోరి భృతకుల యభిమానమును సులభముగఁ బొందుట కట్లు చేసె.

ల—అట్టి యభిమానముఁ దాము సంపాదించియుండిన దమ ప్రార్థనలేకయే తమకెన్నికలు లభియించు.

పం—ప్రతినిధిగ నిలువ నుద్దేశించియుండలేదు. ఇటీవల నా స్నేహితులు నను వేడుకొన్నందున బ్రతినిధిగ నిలువ నిశ్చయించితి.

ల—ప్రజలకు ప్రతినిధిగ నుండఁగోరువారు లోకులకు హితముఁ జేసినవారుగాను హితముఁ జేయఁ గోరువారుగాను స్వప్రయోజన[illegible]

యాత్మసుఖత్యాగులుగా నుండుట మేలు. తా మీవఱకు దానధర్మములఁ జేసినట్లు నా చెవిన బడలేదు. తమవంటివారు ప్రతినిధిగ నుండిన ఫలమేమి?

పం—కాళ్ళు చేతులు బాగుగనుండియు పాటుపడక బిచ్చెమునకు వచ్చెడి జనులు దేశాభివృద్ధికి విరుద్ధులని యెఱిఁగి వారిని బాఱఁదోలెదను. అందుచేత లుబ్ధుండను నిందవార్తకు బాత్రుండనైతి. ధర్మమునకు స్వగృహము ప్రారంభము.

ల—ధర్మము స్వగృహమున దుదముట్టదు.

పం—నాకును నను నమ్మియుండు కుటుంబస్థులకును భవిష్యదుపయోగంబులకు జాలుకొలఁది యుండిన మిగులు ద్రవ్యములో గొంతవఱకు దానధర్మములు సేయనగును. నాకుటుంబమునకు గావలసినంతటి ద్రవ్యము నకు నెక్కువలేదు.

ల—చాలుకొలఁదికి మేరమట్టులు గలవా? కొద్దిగ నుంచిన గొందఱు తనియుదురు; కొండంతయుండినా నింక లేదని తనియరు. ఎట్టివానికి నిచ్చిపెట్టినందుకు మించిరానేరదు. దేవుఁడిచ్చినంతలోఁ గొంత దానధర్మములఁ జేసిన నట్టివాని కుటుంబస్థులను సృష్టికర్త కాపాడు. మన కితరులయందు దయయు ధర్మచింతయు ధర్మకృత్యములును లేనిచో, దయానిధియైన పరమాత్ముఁడు మనయందు దయయైన ధర్మచింతయైన గల్గియుండునని నమ్మఁగూడునా? ఆత్మసుఖత్యాగములేక స్వకీర్తియు స్వచింతయుఁ గల్గినవారెట్లు ప్రజలకు మంచిచేయఁగలరు?

పం—ధర్మము చేయుటనుచితమను తలంపొకింతైన లేదు; లోకులకు మేలుదెచ్చు విషయములకు సహాయముఁ జేయ నిండుమనంబు గలవాఁడను.

ల—మానసమాజములు లోకహితార్థముగావా;

పం—స్త్రీలకు విద్యాస్వతంత్రము లెక్కువయైన [illegible] స్త్రీలకు లక్ష్యమును గురుత్వమును దక్కువగునని నా యభిప్రాయము.

ల—తమవంటి విద్వాంసులైన వకీళ్ళలేకులున్నారా?

పం—ఉన్నారు.

ల—వారు తమను నిర్లక్ష్యము చేసి మర్యాద చేయక యుండెదరా?

పం—లేదు.

ల—అటులుండగ స్త్రీలు మర్యాద పెట్టరని తలఁచుటనుచితము. విద్యనేర్చి విద్దె మహిమలనెఱింగినవారే విద్యావంతులను మర్యాద గౌరవంబులఁ బెట్టుదురు. విద్దెలేనివారు మర్యాద చేయవలసిన విధాయకములును గౌరవించు పద్ధతులును నెఱుంగుదురా?

పం—ఎఱుఁగరు.

ల—తమయిల్లాలును దమసుతయు దమసోదరీలును మంచి చేదువరులై యుండినవారు తమయెడ వర్తించుకొను వర్తనలు రమ్యతరముగ నుండవా?

పం—రమ్యముగ నుండుగాని రమ్యహీనముగ నుండవు.

ల—మీయింటి యాడువాండ్రు మాసమాజముఁ జేరి, సమాజమునగల చేదువరులైన స్త్రీలతో సహవాస సాంగత్యముల బెట్టుకొనిన వారినడత వైఖరిలో నెక్కువయైన నాజూకనంబడదా?

పం-సరే.

ల—అటులుండగ జనుల మేలుకొఱకు నుండు మాసమాజములకు దాము సహాయ్యము చేసి, మాసమాజములో మీయాఁడువాండ్రఁ జేర్చిన బాగు.

పం—నేటికే మాయింటి యాఁడువాండ్రను వనితా సమాజమునఁ జేర్చి వారి చేత • వేయిరూపాయలను బహుమానముగఁ బంపెద.

ల—చాలసంతోషము; తాము చేయు సహాయ్యమునకు మాసమాజములఁ జేరిన స్త్రీలందఱు కృతజ్ఞత గల్గియుందురు. తమకు వేయినమస్కారములు. తామిఁకఁ బోవలసినచోట్లకు వెళ్ళిరండు.

"మంచిది, లతమ్మ," అనుచు, ప్రభాకరపంతులు వెఱుంచోటికిఁ బోను మనంబులేక తనయింటికిఁ జని, తనలోఁ దాను దిగువ జెప్పునట్లు దలంపసాఁగెను:—

"ఆపనిదానికిఁ దగిన జవాబిచ్చుటకు వల్లపడక, నాబుద్ధి కలవరించి, వేయిరూపాయల నిచ్చువంపెదనని మాటఁ జెప్పివచ్చితి. నేనీవఱకు సెట్టివానికి పై సాగూడ యిచ్చియెఱుఁగను. నన్నొక వేదవిదుండేమరించి పాతికరూపాయఁ దీసికొనివెళ్లె. ఇపుడు పనిదానియెదుట నేమరి వేయిరూపాయలను ధార పోసికొంటి. ఈరీతిన బదుండ్రు వాగీశులతో నేను వచించి వారి చమత్కార సువచనముల మెచ్చి, వారు విధించు దానధర్మములం జేసియుండిన, నేను కష్టపడి గడించి చేర్చిపెట్టియుండు పదిలక్షల రూపాయలలోఁ బదిరూపాయలైనను మిగిలియుండవు. నాయింటి స్త్రీలు సమాజములం జేరి నాజూకుగను నింపుగను మాటాడ నేర్చిన, వారి మాటల మనోహరమును మోహించినవాఁడై, వారు తంత్రముగఁ బెట్టు సెలవులన్నిటిని నేను భరింపవలసివచ్చును. ఏనుమాట యిచ్చివచ్చినందుకు నాయింటి స్త్రీలను సమాజమున జేర్తుంగాని సమాజసంబంధమైన స్త్రీలతో మాటాడింపను. నాకుఁ దెలియక వేయిరూపాయలఁ బోగొట్టుకొని యుండినాఁ జింతలేదు. ఏనెటుల మనసొప్పి నా చేతిగుండా వేయిరూపాయలనిత్తును? నా గౌరవముంబట్టి యేనుమాట తప్పఁగూడదు. ఏవిచ్చెడి వేయిరూపాయలను సరిచేయుటకై, రెండేండ్లవఱకు నాస్వగమన రథమును గచేరికిదప్ప మిగిలినచోట్లకుఁ దీసికొనివెళ్లను. మఱియు నాగుమస్తాలలో నొకండు కొలువును వీడ్కొనివెళ్లునట్లు చేసెద." ఈలాగున దలపోసి సంధ్యాకాలమున వేయిరూపాయల నోటొక్కటిని దనసతిచేతఁ బెట్టి, "నీవు వనితాసమాజమునకు వెళ్లి నీనామమును నామపట్టిలో వ్రాయించిన వెనుక యీవేయిరూపాయల నోటును లతాంగియొద్ద నిమ్ము. నిమిషమైనా నిలిచి యేవారితోను మాటాడక యింటఁ బనియున్నదని చెప్పి, విత్తాలున మఱలి రమ్ము. ఏనువీధివాకిటనే గాచియుండెద. విజీవరమ్ము," అని యాజ్ఞాపించి పనిచెను.

కొన్నాళ్ళకు వెనుక వార్తాపత్రికలలో నద్దులను గుఱించి శ్లాఘన వచనములు ప్రచురింపబడెను. ప్రభాకర పంతులుగారు ద్రవ్య సమృద్ధియు

వాక్చమత్కారమును గల వారనియు నేలాటి సంఘముఁ జేరి యుండనందున నభిప్రాయ భేదమును జాతిభేదమును దలపని సముదాయమైన ఘనుండనియు వృద్ధుఁడైనందున ననుభవశాలి యనియు సర్కారుద్యోగముఁగోరి ప్రతినిధిగ నిలచినవారు గారనియు వెల్లడిచేయఁబడెను. మఱునాఁ డదే పత్రికలో దినమణి రావుగారిని గుఱించి యతండు చాల సంఘములఁ జేరి జనుల మేలుకొఱకు పాటుపడిన వారనియు సొంత ద్రవ్యముతో బీదలకుఁ బాఠశాలల నిర్మించిన వారనియు లోకుల కష్టనష్టములఁ దెలిసిన వారనియు స్వకార్యలాభంబులఁ ద్యజించిన వారనియు నతని కెన్నిక నిచ్చిన జనులకు క్షేమకరమనియు వెల్లడింపబడియుండెను. కొన్ని పత్రికలలో 'ఎట్టియ్య,' 'పుల్లయ్య'—వీ రిరువురును వృద్ధత్వములేక పటుత్వముగల వారనియు నెట్టికార్యములను జెడియక సాధించే శక్తిఁగల వారనియు సామాన్యులై యుండుటచేత సామాన్య జనులకు హితకరులనియు ధనాఢ్యు లెన్నికల సంపాదించి సభికులైన తరువాత సామాన్య జనులను మఱచిపోఁగలరనియు గీర్తిఁగలవారు సభికులైనంతట, పై పైదమకు గీర్తి దెచ్చుకొనుటకే పూనుదురనియు సిరియు గీర్తియులేని ఎట్టియ్య, పుల్లయ్య వంటివారు సామాన్య జనులకు యశస్సును హితమును దెత్తురనియు నానా విధములుగ ప్రకటనలు చేయఁబడియుండెను.

ఎన్నికలనిచ్చే దివసమునకు నీరైదురోజులుండగ శశిపురములోని సమాజములంగల స్త్రీలందఱు సభకూడి తమయెన్నికలను లతాంగి చెప్పిన చొప్పున దినమణి రావుగారికిని ప్రభాకర పంతులుగారికిని నిచ్చునట్లు సమ్మతించిరి.

ఎన్నికల గుర్తించే దినమొక్క వారముండగ "ప్రభాకరపంతులు గారి కొక్క యెన్నికనిమ్ము," అని దొడ్డయక్షరములతో నచ్చువేయ బడ్డ ప్రకటన కాగితములు వీధిగోడలకును వీధిలోనుండిన దీప స్తంభములకును నంటింపబడి యుండెను. ఎన్నికల నిచ్చుదినమున దశసంఖ్యగల భృత్యులు

చేతినొక వెదురు స్తంభమును జేతవహించి వీధులవెంబడిఁ దిరుగుచుండిరి. ఆవెదురు స్తంభపు పైచివర నొకవెదురుచాప యంటింపబడియు నాచాప మీఁద "జనోపకారి దినమణి రావుగారిని మఱవకుము," అని యచ్చువేయ బడ్డ కాగితము నంటింపబడియు నుండెను. "నీయెన్నికను పంతులుగారికిఁ దప్పకనిమ్ము," అని యచ్చువేయబడ్డ ప్రకటనకాగితములు మోటారు రథములు, రిక్షాబండ్లు, జట్కాబండ్లు, వీటి పైకప్పుల కంటింపబడి, యారథములు వేవేగ రాజపథంబులమీఁదను దక్కినపంథంబులమీఁదను జరించుచుండెను. పైఁజెప్పిన రథము లెన్నికలనిచ్చువారిని నెక్కించుకొని యెన్నికలగుర్తించే మందిరముచెంత దించి, ప్రొద్దుగ్రుంకువఱకు మాటిమాటికివచ్చి మరలుచుండెను.

బండ్లయొద్ద నిలబడియుండిన ఎట్టియ్య పుల్లయ్యలు బండివిడిచి దిగిన వారితో, 'ధనముచేత మత్తు గొన్నవారు ఓపు మిమ్ము లక్ష్యముంపరు,' అనిరి. పన్నుకట్టు ప్రజలాయిరువురిని దాఁటి పదియడుగులు పోయినంతట నొకండు వారి చేయిఁబట్టి, "పంతులు వారినామమునకుఁ గుడిప్రక్కన గుఱ్ఱుపెట్టిరమ్ము," అనియెను. మందిరపు వాకిలికడ నేగినంతట నొండొకండు, "జనోపకారి దినమణి రావుగారి నామమునకుఁ గుడిప్రక్కన గుణాకారము గుఱ్ఱునేసి రమ్ము," అని చెవిలో రహస్యముగఁ జెప్పెను. స్త్రీలకై ప్రత్యేకింపబడి యుండినచోట లతాంగి నిలఁబడి వచ్చిన స్త్రీలకెల్లరకు స్త్రీసమాజములఁ జేరినవారిచేఁ గోరబడ్డ రెండు నామములఁ జెప్పి లోపలికి బంపెను.

రెండవనాఁడెన్నికల లెక్కించినపుడు దినమణి రావుగారిని గోరుకొన్న వారిసంఖ్య యొనిమిది వేలనియు, ప్రభాకరపంతులుగారిని గోరుకొన్న వారి సంఖ్య యైదువేల తొమ్మిదివందలనియు, పుల్లయ్యఁ గోరినవారి సంఖ్య యైదువేల యొనిమిదివందలనియు, ఎట్టియ్య నామము గుర్తించిన వారి సంఖ్య మూడువందలనియుఁ బఁకిరాని యెన్నికలు తొంబదియనియు

బహిరంగముగఁ జాటింపబడెను. తత్క్షణమె ప్రభాకరపంతులుగారి చెలికాండ్రును మెచ్చినవారును బూలహారముఁదెచ్చి పంతులువారిని నతని రథమును నలంకరించిరి. పంతులుగా రథమెక్కినంతట హిందువుల బ్యాండువాగుచుండగ రథము మెల్లగాగదలి యతని యింటిచెంత నిలిచెను. ఎన్నికల నిచ్చిన మందిరమునకు వెలుపట జనులు గుమికూడి, "లోకబాంధవ దినమణి రావుకే జేయీభవ, అని యఱచి, యొక రిక్షాబండిని యలంకరించి, యా బండిన రావుగారిని గూర్చుండఁజేసి జనకూటమిలో నలువురు దేశాభిమానులు బండిని దమకరంబులతోఁ దిన్నగలాగుకొని రావుగారి యింటి పొంత నిలిపిరి. రావుగారు బండి విడిచిదిగి యందఱికి వందనమాచరించి యింటిలోపలికిఁ జనిరి. పుల్లయ్యయుఁ దలవంపై యాగ్రహముతోఁ దనయింటికి నొరులతోఁ జెప్పకొనకవెళ్ళెను. ఎల్లయ్య నిరాశాన్వితుఁడై తానొక ప్రతినిధిగ నిలువని వానివలె భావించి నెమ్మదిగ నిలుఁజేరెను.

దీపములు ముట్టించిన వెంటనే, పుల్లయ్య లాయర్ జంబయ్యగారింటికిఁజని, యతనికి దండములు సమర్పించెను.

"పుల్లయ్యగారు! దయచేయుఁడు; తమకు నూరెన్నికలు తక్కువ యయ్యెనని వింటిని; వ్యాజ్యముచేయు నుద్దేశముతోవచ్చితిరా?" అని, లాయర్గారడిగిరి.

"అవును, స్వామి! తమయభిప్రాయంబేమి?"

"అభ్యంతరమేల?"

"తమ యెన్నిక నెవ్వరికిచ్చితిరి? నాకే, కద?"

"సన్నదుగనేల? తాము తెలిసికొనలేర?"

"తమ విషయమున నాకనుమానములేదు. వేతనమెంత?"

"వేతనముంగూర్చి చింతపడఁబనిలేదు; తమశక్తికొలఁది నిచ్చిన దృప్తిచెందుదు."

"వ్యాజ్యముచేసిన గూడివచ్చునా, స్వామీ?"

"సాక్ష్యము బలికించిన గూడివచ్చుట కడ్డియేమి?"

"తమ ఫీసుగాక దాఖలాఖర్చులెంత తగులును?"

"వ్యాజ్యముఁ బొడఁగుటకుఁ బూర్వము రొక్కముగఁగట్టవలసిన రూపాయలు రెండువందలయిరువది. సాక్షిబత్తెము మొదలగువాటికి రమారమి రెండువందలరూపాయలు. ఇతర ఖర్చులకేఁబదిరూపాయలు; వీటికి ముందుగ నా వేతనము."

(నవ్వుచు) "వేతనమెంత"?

"పంతులువారును నేను నొకవృత్తిననుండువారము. అందుచేత నేన తనిమీఁద ధ్వజమెత్తుట రమ్యముగాదు; అయినను న్యాయమునకు బద్ధపడిన వాఁడగుటచేత నర్జిపెట్టుట కభ్యంతరములేదు. ప్రకృతము వేయిరూపాయలిండు; వ్యాజ్యమనుకూలించినంతట నైదువందలిచ్చిన జాలును."

"ఇప్పుఁడే నూరురూపాయలుఁ బుచ్చుకొనుఁడు. అనుకూలించిన దాము చెప్పిన మేరకు నడుచుకొనియెదను."

"పెద్దపులితోఁ బోరాడవలసియున్నది; చాలకష్టములును నిబ్బందులును నున్నవి; బేరమాడకుఁడు, పుల్లయ్యగారు!"

"ఇదిగో! ఈనాలుగువందల రూపాయలఁ బుచ్చుకొనుఁడు; మిగత రూపాయలఁ బిమ్మట నిచ్చెదను; తాము రేపే యర్జీని దాఖలాచేయుఁడు, స్వామీ!"

"ఈనాలుఁగువందలను వేతనమునకు నుంచుకొనెదను; ఇంక నాలువందల రూపాయలిచ్చినబాగు."

"ఇదిగో, స్వామి! ఈయైదువందలఁ బెట్టుకొని పనినిసాగవేయుఁడు."

"మంచిది! అలాగే; సాక్షి బత్యము గట్టవలసినపుడు తమకు చెప్పిపంపెదను."

"అలాగే కానిండు, స్వామీ!"

తత్క్షణమె జంబయ్యగారు తనగుమస్తాను బిలిచి, వాదననోటఁ జెప్పచుండఁగా గుమాస్తా వ్రాయుచువచ్చెను. అందులోను వకాలత్తులోను

పుల్లయ్యగారి చేవ్రాలుదీసి, మిగతరూపాయలతో రెండుదినములలో రమ్మని చెప్పిపంపెను.

మఱునాఁడు దావాదాఖలాయైనంతట, పంతులువారిమీఁద దావా చేయఁబడిన వృత్తాంతము నందఱిచెవులఁబడఁగ, పంతులువారోడిపోవుదురని కొందఱు చెప్పినమాటను విని పుల్లయ్య సంతుష్టిజెందె. పంతులుగారికి యాగ్రహము మెండయ్యెను.

వ్యాజ్యమును విచారణచేయు కాలము మూఁడవవారపు ప్రారంభమున యని న్యాయవిచారణ స్థలములోఁ బ్రకటింపబడెను. విచారణకు ముందుదినము లాయర్ జంబయ్య పుల్లయ్యవల్లఁ జేరవలసిన వేతన మొత్తముఁ దీసికొన్నవెనుక, పుల్లయ్యనుంగని, "నేనొకబుద్ధిమతిఁ జెప్పెద; తాము దాని దీసికొనుఁడు," అనెను.

"ఏమి చెప్పఁబోయెదరు, స్వామీ?"

"మనవ్యాజ్యమును విచారణచేయఁబోవు న్యాయాధికారులు సులభములో నేవిషయము నంగీకరింపని వారగుటచేత, సీమలోఁ జదివి చేట్టపరీక్ష నిచ్చివచ్చిన బారిస్టరును నేర్పఱచిన మనవ్యాజ్యము మనతట్టగును; లేకున్న వాజ్యము చెడినాచెడును; దినమొక్కటికి నైదువందల రూపాయలువంతున బారిస్టరు సార్వభుక్కు" అనువారి నేర్పఱచిన మనకు జయమునొందుట నిశ్చయము; పంతులువారోడిపోవుటయు నిశ్చయము; తాముచేట్టసభికుం డగుటయు నిస్సంశయము."

"ఏను ధనవంతుఁడనుగాను; అయినను ముందువెట్టిన పాదమును వెనుకదీయుటకు మనంబులేదు. ఈమాటను దాముముందే చెప్పియుండిన వ్యాజ్యముఁజేయఁ గొంత యాలోచించియుందును. మనవ్యాజ్యమనుకూలించునని తాము స్థిరముగఁ బల్కుటచేతఁ దమమాటకడ్డము చెప్పలేక యొప్పుకొనెదను. తామేలాగైనా మనవ్యాజ్యమును జయించి మీకును నాకును గీర్తి దెండు, స్వామి!

"క్రొత్తగ నింకనేనెట్టి కీర్తిఁ దెచ్చుకొనవలెను!"

అక్షయనామసంవత్సరము జ్యేష్ఠమాసంబున శుక్లపక్షత్రయోదశినాఁడు, పగలుపదునొకటి గంటలకు 'మందమారుతుఁడు', 'చండమారుతుఁడు', అను రెండు ప్రాడ్వివాకులముందఱ, యీలెక్షన్ వ్యాజ్యము విచారణకువచ్చెను. న్యాయాధికారులు పొడుగుతిన్నెమీఁద నమర్పబడి యుండిన శయ్యాసనములతోఁగూడిన రెండాసనములందమరిరి. వారికెదుట నొకదిక్కున లాయర్ జంబయ్యగారును బారిస్టరు 'సర్వభుక్కును,' కుర్చిమీఁదఁగూర్చుండిరి. మఱొకదిక్కున జంబయ్యగారి కభిముఖముగ పంతులుగారి వకీలైన బారిస్టరు 'సమవర్తిని' కూర్చుండిరి. న్యాయస్థలమునకుజేరిన బంట్రోతొకండు, "అర్థిపుల్లయ్య! ప్రత్యర్థిప్రభాకర పంతులుగారు!" అని మూఁడుతడవలఱచి, "సద్దు" అని చెప్పుచు, వాకిలిచెంత నిలువఁబడెను. పుల్లయ్యయేతెంచి న్యాయాధిపతులకు దండముపెట్టి జంబయ్యగారి ప్రక్కన నిలువఁబడెను. వెంటనేపంతులుగారరుదెంచి, తనశిరమును నొక్కతేపవంచి సమవర్తినిగారి దండఁగూర్చుండిరి.

న్యాయాధిపతులు, అర్థిసాక్షులఁబిలువ నాజ్ఞాపింపగ, పుల్లయ్య మొదటి సాక్షిగవిచారణచేయబడెను. దావాయందుఁజెప్పబడిన యంశము లన్నిటిని పుల్లయ్యనోటిగుండాఁదీసి, సర్వభుక్కు గంభీరమైన యాత్కణముతో సంతుష్టమానసుండై కూర్చుండెను. సమవర్తినిలేచి యర్థిని రద్దుసవాలుచేయుచు నర్జియందుఁజెప్పబడ్డ యంశములకేమియుఁదనకుఁ బ్రత్యక్షమున దెలిసినవి కావనియుఁ బరులవల్లవిన్న యంశములనియు మాటతీసి నగవుముఖముతోఁ గూర్చుండెను. న్యాయాధిపతులు రెండవసాక్షిని బిలువ నుత్తరువుచేసినంతట ధ. పంచమిపిలువబడెను. అతఁడు వడిగనరుదెంచి సాక్షికూటిలో నిలఁబడి న్యాయాధికారులకు దండమిడి నలుదెసలనుండిన వారి నాద్యంతముగాఁ దిలకించి నిలువఁబడెను. న్యాయస్థలముఁజేరిన ద్విభాషి ధ-పంచమిని జూచి,

'నీ పేరేమి,'' అని యడిగెను.

ధ పం. నా పేరు ధనిష్టాపంచమి, స్వామి (అందఱునవ్విరి).

ద్వి—నీ తండ్రి పేరేమి?

ధ-పం—తండ్రిలేడు, స్వామి.

ద్వి—తండ్రిలేకున్న నతని పేరేమి?

ధ-పం—తండ్రియే లేడనుచుండగా, తండ్రిపేరెక్కడిది, స్వామి!

ద్వి—తండ్రిపేరు తెలియదనుచున్నావా?

ధ-పం—తెలియదనలేదు; తండ్రియేలేడనియెద. ద్విభాషి తండ్రిపేరు తెలియదని వ్రాసికొని, ''తల్లిపేరేమి?'' అని యడిగెను.

ధ-పం-—నాతల్లిగారికి పేరులేదు, స్వామి.

ద్వి—నీవు దుర్మార్గుఁడవు.

ధ-పం—ఏనా? మంచిది; నాతల్లిపేరు ''యమ్మ''

ద్వి—అధికారు లపరాధము విధింతురు; తల్లిపేరు జెప్పుము.

ధ-పం—అపరాధమెందుకు, స్వామి! నాతల్లిని నేనెఱుంగను; నాతల్లి పేరు నేనేలాగున జెపుదు?

ద్విభాషి తల్లిపేరు తెలియదని వ్రాసికొని ''నీవయసెంత?'' అని యడిగెను.

ధ-పం—ఏనుపుట్టినపుడు పుట్టినదినమును గుర్తించిపెట్టితినా? (నలుదెసలఁ జూచుచు) ఇచ్చేటుననుండు వారందఱు నాకుజిన్నవారు; ప్రభువులు గూడా నాకుఁ జిన్నవయసుగలవారే!

ద్వి—ప్రశ్నకు విఱిగినయుత్తరమిచ్చిన జుల్మానా వేయఁబడును.

ధ-పం—చిత్తం, బుద్ధి; ధాతుసంవత్సరము క్షామమువచ్చెగదా? అపుడు మంచిమగవాఁడు; ప్రభవాదిసంవత్సరము లొకతేపపూర్తియై రెండవతేపసగమునకువచ్చె; నావయస్సెంతో తామే తెలిసికొనుఁడు.

ద్విభాషి వయస్సులోంబదియని వ్రాసికొని, జీవనమేమియని యడిగెను.

ధ-పం—ఉదయమునసద్ది; పగలుడుకన్నము, మరల రేయికియుడుకన్నము; వీటిచేత జీవించియుండెద, స్వామి. ''సరియైన జవాబునియ్యనియెడ నిను బందెకానాకుఁ బంపుదుము,'' అని న్యాయాధికారులు చెప్పిరి.

ధ-పం—ప్రభులార, దండములు; సరియైన జవాబిచ్చెదను.''

(చేతులను జోడించుకొని)

ద్వి—ఏమి జీవనము?

ధ-పం—ఏనుముందు చెప్పినట్టే; సరియైన జవాబిచ్చితి, ప్రభులార!

ద్వి—కొలువులో నుండెనవా?

ధ-పం—ఆ; లాయర్ జంబయ్యాగారి వియ్యంకులు భద్రయ్యాగారున్నారు గదా? వారి తండ్రినను బెంచిరి; వారియొద్ద గొలువుకొలిచి, భద్రయ్యగారి వద్దగొలిచి, యిపుడు లతమ్మగారియొద్దగొలువుకొలిచెద, బాబు.

ద్వి—సత్యముగ నిజము చెప్పెదనని చెపుము.

ధ-పం—అబద్ధమేల? సత్యము బలుకనటుల నాకొకరుచెప్పలేదు.

ద్వి—నిజమే చెప్పెదనని చెప్పుము.

ధ-పం—సందియము వలదు, స్వామి.

ద్వి—ఏనుచెప్పమన్నట్టు చెప్పనియెడల దండింపబడుదువు.

ధ-పం—అబద్ధమెందుకు చెప్పుదు, స్వామి?

ద్వి—'సత్యముగ నిజమే చెప్పెదను,' అని చెపుము.

ధ-పం—తాము సత్యముచేయించినా, లేక చేయింపకుండినా నిజమే పలుకుదు, స్వామి.

సర్వభుక్కు. ధనిష్టాపంచమి!

ధ-ప—చిత్తం, బాబు.

సర్వ—నీవింతటి వయస్సువరకు వృథశాస్త్రముతోను వాడియైనదృష్టితోను నుండుటకు గారణమేమి?

ధ-పం—మద్యపానము జేయక బ్రహ్మచారినై దుర్వర్తనల బ్రవర్తింప కుండినందున, బాబు.

సర్వ—ప్రత్యర్థి నెఱుగుదువా?

ధ-పం—చేక్కగ నెఱుగుదు, బాబు.

సర్వ—అతఁడు చేట్టసభకు ప్రతినిధిగ నిలిచెనా?

ధ-పం—నిలిచినట్టు లోకులనుకొనెదరు, బాబు.

సర్వ—ఎన్నికల గుత్తించువోటికి నీవు వెళ్ళితివా?

ధ-పం—లతమ్మగారితో వెళ్ళినాను, బాబు.

సర్వ—లతమ్మగారితో వెళ్ళినావాయని యడుగలేదు; అడిగినందుకెంతమాత్రము జవాబియ్యవలెనో యంతమాత్రమే చెప్పుము; ఒక్క మాట, ఒక్క యక్షరముగూడా, అధికముగఁ జెప్పగూడదు.

ధ-పం—చిత్తం, బుద్ధి.

సర్వ—నీకొక యెన్నిక కలదా?

ధ-పం—కద్దు, బాబు.

సర్వ—నీవు పన్నుకట్టుచున్నావా?

ధ-పం—లేదు, బాబు.

సర్వ—అబద్ధము జెప్పుచున్నావు.

ధ-పం—ఏనా, బాబు?

సర్వ—ఔ.

ధ-పం—ఆవంతబొంకు నానోటరాదు, బాబు.

సర్వ—నీవు ప్రమాణముమీఁద నుండెదవు; నిజముచెప్పుము.

ధ-పం—నదీతీరమున గుగ్రామమున నివసించుటచేత మేము త్రికరణశుద్ధులము; నోటిమాట చాలు. మాకు ప్రమాణమేటికి, బాబు?

సర్వ—పన్నుగట్టక యెన్నికగలవారి నామపట్టిక నీ నామమెందుకు వచ్చెను?

ధ-పం—ఏనుపట్టి వ్రాయలేదు, బాబు.

సర్వ—అధికప్రసంగి.

ధ-పం—నేనా, బాబు?

సర్వ—పన్నుగట్టక నీనామమెందుకు పట్టీన వ్రాయఁబడె?

ధ-పం—పట్టీ వ్రాసినవాని నడిగి తెలిసికొనుఁడు, బాబు.

సర్వ—నీపేరిట నేదైన సొత్తులున్నవా?

ధ-పం—ఉన్నవి, బాబు.

సర్వ—అవియేవి?

ధ-పం—(దోవతినిఁ జూచుకొని) నేనిపుడుధరించియుండు యుడుపులన్నిట నాపేరున్నవి, బాబు.

సర్వ—నీవు మాటలమారి.

ధ-పం—నాకది జీవనమా, బాబు?

సర్వ—అడిగినందుకు జవాబుచెప్పుము.

ధ-పం—చిత్తం, బుద్ధి.

సర్వ—నీనామమున నేదైన స్థిరాస్తి వ్రాయఁబడియున్నదా?

ధ-పం—లాయర్ జంబయ్యగారి తోఁటను నాకు గుత్తకిచ్చి యుండలేదా బాబు?

సర్వ—అందుచేత నీపేరు పట్టీనవచ్చెనా?

ధ-ప—ఉండవచ్చు, బాబు.

సర్వ—ఎన్నికలనిచ్చుచోట ఫలాహారము లియ్యబడ్డవా?

ధ-పం—ఇయ్యబడె, బాబు.

సర్వ—ఎవరిచ్చిరి?

ధ-పం—ఒక బాపనయ్య, బాబు.

సర్వ—కాఫీ ఫలహారముల నందఱు పుచ్చుకొనిరా?

ధ-పం—కొందఱు పుచ్చుకొనిరి, బాబు.

సర్వ—నీవు పుచ్చుకొంటివా?

ధ-పం—పుచ్చుకొంటి, బాబు, (కడుపును దడవుచు)

సర్వ—కాసిచ్చినావా?

ధ-పం—అడుగనూలేదు; నేనియ్యనూలేదు, బాబు.

సర్వ—ఎవ్వరికిగానంగడివాఁడు ఫలహారములనిచ్చె?

ధ-పం—నాకుగాను, బాబు.

సర్వ—దుగ్గాణి లేక యెందుకిచ్చె?

ధ-పం—ఏనడుగలేదు, బాబు.

సర్వ—ఎందుకడుగలేదు?

ధ-పం—ఎందుకడుగవలెను, బాబు?

సర్వ—ఎన్నికలిచ్చినవారు వాలాయముగ నద్దెకుఁ దోలు జట్కాబండ్లలో వచ్చిరా?

ధ-పం—వచ్చిరి, బాబు.

సర్వ—అద్దె యిచ్చిరా?

ధ-పం—ఏను చూడలేదు, బాబు.

సర్వ—అద్దె తీసికొనక వారెందుకు వారిని నెక్కించుకొనివచ్చిరి?

ధ-పం—ఎందుకొఱకో, నాకు తెలియదు; అది యాశ్చర్యమే, బాబు.

సర్వ—ప్రత్యర్థియైనా, అతని యధికారముఁ జెందినవాఁడైనా, అద్దె యిచ్చెనా?

బారిస్టరు సమవర్తినిలేచి, "తాను కోరెడి యనుకూలమైన జవాబును దోపించు ప్రశ్నగనుండుటంబట్టి ప్రశ్న కాక్షేపించెద," అనెను.

"ప్రశ్న నంగీకరింపఁజాలము; వదలిపెట్టవలెను," అని, న్యాయాధికారులు వచించిరి.

"ప్రత్యర్థి కనుకూలమైన సాక్షిని మఱి యేలాగున బ్రశ్నింపఁదగు? ఈసాక్షి ప్రతికక్షి జేరినవాఁడని తీర్మానించి రద్దుసవాలు చేయను త్తరువునిండు," అని సార్వభుక్కు వాదించెను.

"అర్థి కనుకూలముగ సాక్ష్యము బల్కని కారణముంబట్టి ప్రతికక్షి జేరినవాఁడని తీర్మానించు టెంతమాత్రము న్యాయముగాదు," అని సమవర్తిని బదులు వాదముచేసెను.

"ఎవరికిని సందియమువలదు, ఆక్షేపణలేకున్న నిజముజెప్పెద," అని, సాక్షిపల్కెను.

"చెపుము, చూతము," అని న్యాయాధికారులు చెప్పగ, "అద్దె యెవరిచ్చినది యేఁజూడలేదు; ఇదియ నిజము, ప్రభులార," అని, ధ-పంచమి చెప్పెను.

"అనుకూలునివలె నటించెడి యిట్టి శత్రుపరమైన సాక్షిని నెదుటి కక్షిలోఁ జేరినవాఁడని తీర్మానించి యతని యందుఁగల దోషములను గురించి ప్రశ్నల నడుగని పక్షమున న్యాయమేర్పడదు; నిజమును బయటపడదు," అని, సార్వభుక్కు వాదించెను.

"ఈసాక్షి నిర్దోషి కాదనిపించు ప్రశ్నలను మాత్రము వేయుటకనుమతి నిచ్చితిమి," అని న్యాయప్రభువులు చెప్పిరి. సర్వభుక్కు వందన మొనరించి, లేచి మరల ప్రశ్నింపఁ దొడఁగుచు, 'ధనిష్టా పంచమి,' అని, సంబోధించె.

ధ-పం—చిత్తం, బాబు.

సర్వ—నీ జేబులో రెండైదురూపాయల నోట్లున్నవా?

ధ-పం—(జేబులో జెయివిడిచి చూచుకొని) ఉన్నవి.

సర్వ—అవి నీకు సొంతమా?

ధ-పం—అందుకు సందియమేల?

సర్వ—ఈ కోర్టు గదివాకిట నవి లభించెనా?

ధ-పం—నిజమే బాబు.

సర్వ—నా కక్షిదారునికి విరుద్ధముగ సాక్ష్యము బల్కుటకు నియ్యబడ్డవా?

ధ-పం—ఆలాగున జెపుట నిజముకాదు, బాబు.

సర్వ—ప్రత్యర్థికివలసిన వారిచ్చిరా?

ధ-పం—ఇచ్చినవాని గుర్తించి పెట్టలేదు, బాబు.

సర్వ—ఏమి చెప్పి యిచ్చె?

ధ-పం—"ఎవ్వరికి విరోధములేక సాక్ష్యము బల్కరమ్మ", అనిచెప్పి నా జేబులో వేసెను, బాబు.

సర్వ—అందుచేత బ్రత్యర్థికిమాత్రము విరోధములేక పల్కినావా?

ధ-పం—నిజమే చెప్పినాను; అర్థికి విరోధముగఁ బల్కలేదు, బాబు.

"నీ జేబుననుండు రెండునోట్లను సర్కారుకిచ్చుటకడ్డియేమి?"

"వల్లపడదు, బాబు."

"ఈ సాక్ష్య మీవఱకుఁజాలును; తక్కినసాక్షులఁ బిలువుము," అని, న్యాయాధిపతు లాజ్ఞాపింపగ, సమవర్తినిలేచి తాను రెండు ప్రశ్నలవేయనను మతిగోరెను. అనతిచ్చినంతట, సమవర్తిని "ధనిష్టాపంచమి!" అని పిలిచెను

"చిత్తం, బాబు."

"నీవు యెన్నికల నిచ్చుచోటికి నెవ్వరితో వచ్చితివి?"

"లతమ్మగారితో, బాబు."

"లతమ్మ యెవతె?"

"ఇంటిముద్దుపేరు లతమ్మ. వనితాసమాజమాత, లతాంగి, బాబు."

"ఆమెతో వెళ్ళనేల?"

"ఏనామెను నౌకరి, బాబు."

"ఎన్నికలనిచ్చుచోట నామె యెంతసేపుండెను?"

"ప్రొద్దుగ్రుంకుదాఁకనుండిరి, బాబు."

'ఆవఱకేమి చేయుచుండె?"

"ఎన్నికలకువచ్చిన స్త్రీలనెల్లరను దినమణిరావుగారికిని పంతులుగారికిని నెన్నికలనిమ్మని ప్రేరేపించుచుండె, బాబు."

"ప్రేరేపింపబడిన స్త్రీలు లతాంగికడ్డముఁ జెప్పఁగలరా?"

"ఒక్కతెయైన నడ్డము చెప్పదు, బాబు.

"నీవెట్లెఱుంగుదువు?"

"వచ్చినవారెల్లరు స్త్రీసమాజములఁ జేరినవారు, లేక, చేరినవారికి బాంధవ్యమైన మైత్రియైనఁగల్గినవారు. లతాంగి యభిప్రాయమునకు విరుద్ధముగ నడుచుకొనరు, బాబు."

"నీకు తెలిసి యెన్ని స్త్రీలు వచ్చిరి?"

"పదివందలమంది వచ్చిరి, బాబు."

"ఇంతచాలు; దిగిపొమ్మ," అనిసమవర్తిని చెప్పినంతట, "ఇంకెంత యడిగినా లతమ్మఁగూర్చిచెప్పెదను. బాబు," అని, చెప్పి గూటిలో నిలబడియుండగ, న్యాయాధికారులు దిగిపొమ్మని యాజ్ఞాపించిరి. ధ-పంచమిసాక్షిపెట్టియను విడిచి యొకదిక్కున గూర్చుండెను.

మూఁడవసాక్షిని బిలిచినంతట నొకగొప్పమాంసపర్వతమువచ్చి సాక్షిగూటిని నిండించుకొని నిలువఁబడెను. సర్వభుక్కులేచి, "పీపాయి," అని సంబోధింపగ,

"అయ్యా చిత్తం," అనెను.

"న్యాయాధికారులఁ జూచుచు నిలఁబడుము."

"చిత్తం" అనుచు ముఖముతో దేహమును ద్రిప్పి యధికారులకు నభిముఖముగ నిలఁబడెను.

"నీకు డెబ్బదియేండ్లయ్యు దృఢగాత్రముతో నుండుటకుఁ గారణం బేమి?"

"చిత్తం! మూఁడుపూఁటలుఁ దప్పక త్రాగి మైమఱచియుండుట చేత. ఒకపూఁటత్రాగకుండిన నాదేహమును బలమును దీసిపోవును." (అందఱు నవ్విరి)

(నవ్వుచు) "ఇపుడు త్రాగియుండెదవ?"

"చిత్తం," అని, దేహమును త్రిప్పుకొనెను.

"దేహమును త్రిప్పక నీముఖమునుమాత్రము నాతట్టుత్రిప్పి యుత్తర మీఁగలవ?"

"చిత్తం, దేహమును త్రిప్పక శిరమును మాత్రముఁ ద్రిప్పఁజాలను."

"నీవు యెన్నికలనిచ్చుచోటికి వెళ్ళియుంటివా?"

"చిత్తం! వెళ్ళియుంటిని. (మరల దేహమును త్రిప్పుచు)

"నీవుప్రతిప్రశ్నకు నాతట్టు శ్రమపడితిరిగి జవాబియ్యఁబనిలేదు. నాకభిముఖముగ నిలిచియుత్తరమిమ్ము."

"చిత్తం, ఆలాగే."

"అద్దెకుఁ దోలుబండ్లలో యెన్నికలనిచ్చినవారు వచ్చిరి, కద?"

"చిత్తం, వచ్చిరి."

"ప్రత్యర్థికిగాను నీవుబండివాండ్రకద్దె యిచ్చినావా?"

"చిత్తం, ఒక్కబండివానిఁ జెప్పమనుడు, చేతును."

"నీవిచ్చినావా లేదా?"

"ఒక్కండైన జెప్పిన జాలును"

ఈసమయంబున మూలలోఁగూర్చుండియుండిన ధ-పంచమి లేచి, "మరల యెన్నికలనిచ్చుకాలములో బాడిగవాతమన్నపడుననియే బండివాఁడు జెప్పడు, ప్రభులార," అని యరచెను.

న్యాయాధికారులు ధ-పంచమిని దమయెదుటకు రమ్మని పిలిచి, "ఒండొకసాక్షిని విచారించుచుండగ నీవడ్డపడివచ్చి, యరచి కోర్టు న్యాయాధికారులను నవమదించినందుకు నీకు పదిరూపాయలపరాధము విధియించితిమి. అపరాధముఁగట్టనియెడలఁ రెండువారములు కఠినశిక్ష," అనిరి. తక్షణమే, పోలీసు బంట్రోతొకండు ధ-పంచమిని వెలుపటికిఁ బిలుచుకొనివెళ్ళి, "రూపా

యలు కట్టెదవా? లేక, చెఱసాలకుఁ బోయెదవా?" అనియడిగెను. ధ-పంచమి తనజేబులోనుండిన రెండైదు రూపాయలనోట్లు బంట్రోతు చేతఁబెట్టి,

"ఈరూపాయ లేలాగువచ్చెనో యాలాగే పోయెను. ఇది నాకు లభించినందుకు వకీలోర్వలేక పోయెను. న్యాయాధికారు లోర్వలేకపోయిరి; పరమాత్ముఁడు నొప్పలేదు," అని, నవ్వెను.

"పీపాయి!" అని, సర్వభుక్కు పిలిచెను.

"అయ్యా, చిత్తం"

"ఫలహారములయంగడి ప్రత్యర్థిచే నేర్పడ్డవా?

"చిత్తం, పంతులువారు చెప్పినాసరే; అంగడివాఁడు చెప్పినాసరే."

ప్రత్యర్థికిగావలసిన సాక్షియని రొంటింగి యతనికిట్టి చట్టవిరుద్ధమైన పద్ధతులలోఁ బ్రశ్నలడిగిన ఫలమేమి?" అని, న్యాయాధికారులు చెప్పుచుండగ,

"చిత్తం! లఘుశంకఁదీర్చుకొని వచ్చెదను. ఒక్కనిమిషమైనా తాళజాలను," అని, పీపాయి చెప్పిన నందఱునవ్విరి. సర్వభుక్కు "పీపాయి, నీసాక్ష్యమింతవఱకుఁ జాలును. నీవులఘుశంకకువెళ్ళి త్వరగఁదిరిగివచ్చి యెవ్వరితో మాటాడక విచారణముగియుపర్యంతము నొకమూలఁ గూలబడి యుండుము," అనెను. పీపాయి, "చిత్తం" అనుచు, మెట్లను దిగుచుండఁగాళ్లు జారి క్రిందపడినంతట నతని స్థూలశరీరము మొదటిమెట్టునుండి రెండవమెట్టు మీఁదదొర్లెను; రెండవమెట్టునుండి నాల్గవమెట్టును, నాల్గవమెట్టునుండి యేడవమెట్టును నేడవమెట్టునుండి కడపటిమెట్టైన పదునొకటవ మెట్టుమీఁదకుదొర్లిపోయెను. జనులందఱు "పీపాయిమెట్లమీఁదదొర్లె" అని యరచిరి. చప్పుడుచేయవద్దని కోర్టుబంట్రోతులు చెప్పినంతట నాలుఁగు నిమిషములలో సద్దణిగెను. అటుపిమ్మట నాలుఁగుసాక్షులను విచారించి, తనసాక్ష్యము ముగిసెనని విన్నవించి కూర్చుండెను.

రెండు బారిస్టరులును రెండు గడియలవఱకు జడివలె మాటలచే వర్షింపగ నుభయకక్షివాండ్రును జూపఱులును శ్రవించి తృప్తమానసులైరి. సమవర్తిని వ్యాజ్యాంశములనుగూర్చి వాదించిన తరువాత,

“ప్రత్యర్థి శ్రేయంబైన కులంబునబుట్టి, కీర్తియు ద్రవిణమును మెండుగ సంపాదించి, గొప్పగౌరవముం బొంది యుండుటతోఁ జెట్టసభికుఁడను బిరుదును సమజ్యయుఁ బొందెనే యనెడి యీర్ష్యచేత నీతప్పువ్యాజ్యము తేఁబడెను. అంతయుడుకుబోతుతనముఁగల యర్థికిసరియైన బుద్ధిఁగల్పించుటకును నతనివల్లఁ బ్రత్యర్థికనావశ్యముగఁ గల్గిన శ్రమకును ధనవ్యయంబునకును బరిహారార్థముగ సర్కారు వెండి నాణెములలోఁ గబ్బి నాణెములు సహస్రసంఖ్యకుఁ దగ్గకయర్థి ప్రత్యర్థికిచ్చునట్లు తీర్మానింపుడని వినయముగఁ బ్రార్థించెదను,” అనెను.

రెండుగడియలవఱకు, న్యాయాధిపతులాలోచించి, “విద్వేషులవల్లనిరాధారమైన దోషములారోపింపబడి యుండవచ్చు; అందుచేత జనపదంతియెంత మాత్రము నమ్మఁజాలము; నిర్దిష్టముకాని సందిగ్ధంబైన సాక్ష్యంబేర్పడి యుండుటచేతను, నిస్సంశయమైన సాక్ష్యమేర్పడనందునను, వ్యాజ్యము ద్రోపుడుచేసి, మిథ్యాభిశంసనమునకై ప్రత్యర్థికిఁగల్గిన ఖర్చులకుగాను నర్థివల్లఁ బ్రత్యర్థి పదివందల రూపాయలు పొందవలెనని తీర్మానించితిమి,” అనిచెప్పి స్థానమువిడిచి వెళ్ళిరి.

వేడుకార్థమై వచ్చియుండిన జనులందఱుఁ దమచేతులఁ దట్టుచు, శబ్దము చేయుచు వెళ్ళిరి. బారిస్టరు సర్వభుక్కుగారును జంబయ్యగారును పంతులుగారు జయమొందినందుకు నభినందించుచుండిరి.

---

26 వ, అధ్యాయము.

లతాంగియు బాలాంబయు దొరసానమ్మతో రాజధాని యధ్యక్షులను దర్శించివచ్చుట.

భాస్కరునిఖరంబోర్వలేక తుషారగిరికిఁ జనియుండిన రాజధాని కధ్యక్షులును నతని రాణిగారును బ్రధాననగరమైన శశిపురమునకు మరలినంతట, వారిని దర్శింపఁగోరి లతాంగియు బాలాంబగారును మిసెస్ మేరి యామర్పిదొరసానమ్మగారి మందిరమునకుఁ బనివిని, దొరసానమ్మతోఁ దమ యభిప్రాయమును విన్నవించిరి.

“ప్రస్తుతము రాణిగారిని దర్శించివత్తము; సమయము గనుపెట్టియుండి యధ్యక్షుని దర్శనంబునకు వెళ్ళుదము.”

“అలాగే చేయుదము, దొరసానమ్మగారు; సమయపడిన నధ్యక్షుని గూడాదర్శించి వత్తము,” అనిఁ లతాంగివచించెను.

తత్క్షణమే దొరసానమ్మ తనరథసారథిఁ బిలిచి మోటారు రథమును సిద్ధముచేయ నాజ్ఞాపింపగఁ బది నిమిషంబులలో సారథితిరిగివచ్చి రథముసిద్ధమైనట్లు తెలుప, మువ్వురును రథమెక్కి రాజసదనంబునకుఁ జనిరి. దొరసానమ్మ యవరోధముచెంత నిలిచి తన నామమును లతాంగినామమును బాలాంబనామమును నొకచీటిన వ్రాసి యొకసేవకుని చేతఁ బెట్ట, సేవకుఁడులోనఁ జనియొక్క నిమిషమునకు మళ్ళి, రమ్మని యాజ్ఞయైనట్లు తెలిపెను. మువ్వురును లోనజని, శయ్యాసనంబు మీఁదఁ గూర్చుండియుండిన రాణిగారిని దర్శించినతోడనే, తమశిరంబులవంచుకొని, “సుదినం,” అనిరి. రాణిగారు స్మితముఖంబుతో “సుదినం,” అని బదులుచెప్పి, తనయెదుటనుండిన యాసనంబులఁ జూప, వాటియందు మువ్వురుఁ గూర్చుండిరి. రాణిగారు ప్రథమమున దొరసానమ్మగారి యోగక్షేమములను విచారించి, లతాంగినిజూచి, “సీమవార్తాపత్రికలమూలముగాను దొడ్డవారి మూలముగాను విని చాలసంతోషమొందితి

నిను జూడవలెననియు నభిప్రాయముఁ గొనియుంటిని; నేటికి నీదర్శనం బయ్యె," అని, నవ్విరి.

"రాణియమ్మగారు! తాము నాయందంతటి ప్రియమును గటాక్షమును నుంచియుండుట నాభాగ్యమే; నానామము బూర్వమే తమకుఁ బరిచయపఱచిన వార్తాపత్రికాధికారులకును దొడ్డవారికిని నుపకారబద్ధురాలయియుండెదను; తామునను జూడఁ బ్రియపడియుండుటకు నేనెంతటి భాగ్యవతిగనుండవలెను!"

"స్వార్థపరాయణికాని లోకబాంధవియైన నినుజూడ నెవరుకోరకుందురు;" అని, రాణిగారు నవ్విరి.

"నాకీర్తికి నాప్రక్కననుండు దొరసానమ్మగారును దమవంటి వారి కృపాకటాక్షములే కారణము; మిమ్ము నీవఱకు నేఁజూడనిది నాయపరాధంబే. మిమ్ముఁ జూచియుందునేని మాయుతనములు సమకూడి చాలాకాలమై యుండును."

"ఇద్దేశ స్త్రీలకు మంచిస్థితిగతులు గల్గుటకు సూచనలుకనుబడ కుండెను, నీవల్ల స్త్రీలకుఁ బురుషులకు సరియైన గౌరవయంతస్తులు గలుగనయ్యెను. కాఁబట్టి, నినునిద్దేశ స్త్రీలపాలిటి దైవమని తలపనగును."

"వరమిచ్చు దైవములు తామును దమ భర్తయు నుండగ నన్నుఁ దమ గుడిపూజకత్తెయనందగు."

"హా! హా! హా! నాభర్తవల్ల సిద్ధింపఁగూడిన కార్యసిద్ధియైన నుండిన దాని నతఁడు ప్రీతితోఁ జేయంగలఁడు; నినుగురించి పూర్వమే నా భర్త నాతో మాటాడి యుండెదరు."

"అంత కృపజూపిన ధన్యురాలౌదు. అట్టి వరమును నిచ్చించి కరుణా పూరితులైన తమ సముఖమున కేతెంచినవారము; తమ దర్శనంబుచేతఁ గృతార్థులైతిమి. ననుగూర్చి తమ భర్త తమతో భాషించి యుండుటకు నా పెద్దల పూర్వకృతసుకృతములు కాఁబోలు. ననుగూర్చి యేమని మాటాడిరో?"

"నీ చేతలను మెచ్చి నీవు పూర్వజన్మమున బశ్చిమ ఖండంబున జనియించియుండవలెననియు నందుచేత స్త్రీలకు స్వతంత్రము గల్గవలెనను చిత్తము జనియించి, గొప్ప ప్రయాసల నెత్తికొని ధీరముతో బ్రహ్మాండ ప్రయత్నములను ద్యమించినావనియుఁ బల్కిరి."

"పూర్వజన్మమందలి వృత్తాంతమును నే నెఱుంగను. ఈ రాజధాని కధ్యక్షులైన తమ భర్తగారు నాయందంతనుకంపముంచినది నాదేశ స్త్రీల భాగదేయంబనియు వారికర్మ విమోచనకాల లక్షణమనియుఁ దోఁచెడిని. ఇపుడు సమయభేదము లేకుండిన దమ భర్తను దర్శించిరానగునా?"

"ఇదిగో! ఏను చెప్పిపంపెద," అని రాణిగారొక చీటివ్రాసి, తనముంగల బల్లమీఁదనుండిన పిలుచుగంటనునొక్కిరి. ఆగంట 'కణం' అనిమ్రోగినంతట నొకయనుజీవివచ్చి తనకుడిచెయిని నెత్తిమీఁదఁ బెట్టుకొని, "సలాం" అని యఱచి నిలువఁబడెను రాణిగారు తాను వ్రాసిన చీటినినతని చేతనిచ్చి, యతని శ్రేష్ఠతయొద్ద నిచ్చిరమ్మని యాజ్ఞాపించిరి. సేవకుఁడు కొన్ని నిమిషములలోఁ దిరిగివచ్చి, తాను తెచ్చినబదులుచీటిని రాణిగారిబల్ల మీఁదఁబెట్టెను. రాణిగారు దానిజదువుకొని నవ్వుచు దర్శించుటకనుమతివచ్చెనని చెప్పి లేచినంతటఁ దక్కినయువ్వురును లేచి, యందలి ప్రాసాదముఁ జేరిన చంద్రశాలకరుగుచుండగ గపాటమువద్ద నిలబడియుండిన కృపాణపాణులైన యంగరక్షకులుఁ దమకరవాలములనెత్తి రాణిగారికభివందనమొనరించిరి. రాణిగారు నగవుముఖంబుతోఁ దలనూఁచుచుఁ జనుచుండిరి. రాణిగారు తనభర్తప్రక్కన నమర్పబడియుండిన యాసనమున నమరినంతటఁ దక్కిన యువ్వురును నధ్యక్షునింజూచి "సుదినం," అని చెప్పగ, నతని శ్రేష్ఠత, "హా! హా!" అనుచు నొక్కొక్కరి చెయింబట్టి కంపించుచు, "సుదినం," అని, వారిని బ్రత్యేకమైన యాసనంబులందుఁ గూర్చుండఁజేసె.

"లతాంగికి సహాయముగవచ్చితిరా?" అని దొరసానమ్మను నడుగ,

"లతాంగి కీర్తియే లతాంగికి సహాయము; అంతటి తఱవరైనందున బరిచయము చేయింపవచ్చితి," అని, దొరసానమ్మ వాక్రుచ్చిరి.

"హా! హా! హా! పరిచయము చేయింపవచ్చిన మీకును నాపరిచేయఁ గోరివచ్చిన లతాంగికిని జోలవందనములు. ఈభరతఖండమున నాలుఁగు లతాంగులుండిన నిద్దేశమునకు మహత్తైన దశప్రాప్తంబగును."

"నావలెఁ గోటినక్షత్రములుండినా దమయంతి సోమునియెదుటఁ బ్రకాశింపశక్తియుఁ గలవా? సామాన్యమైన నను దమశ్రేష్ఠత స్తోత్రము చేయుటచేతనే గోరివచ్చిన వరప్రసాదము దూరంబగునని వెఱచెదను."

"నాచేతనైన సహాయ్యముఁజేయుటకు మనంబును బ్రియంబును నున్నయవి. ఏవారి సహాయ్యములేక నీవే కార్య సిద్ధి గావింతువని నాకుఁ బూర్ణమైన నమ్మిక."

"ననునగ్గించి త్రోసిపంపకుఁడని తమశ్రేష్ఠతఁ బ్రార్థించెదను. ఈరాజధానికిఁ దమశ్రేష్ఠత కల్పవృక్షమును 'కామధేను' వును బోలినవారు. తమ శ్రేష్ఠతయొక్క ప్రోత్సాహరక్షణములేక మాయతనము లీడేఱవు."

నావల్లైన కార్యంబేమి?"

"స్త్రీలకు విద్యాస్వతంత్రములనెడి ధర్మమిచ్చెనుఁ దమశ్రేష్ఠత పెట్టంగోరి వచ్చినవారము."

"ఈదేశ స్త్రీలకు స్వతంత్రము లభియించునేని, నాకును నారాణి గారికిని (రాణిగారినిజూచినవ్వుచు) గల్గుమనోత్సాహముఁ బ్రీతియు నంతింత యని చెప్పనలవికాదు. వారి స్వతంత్రమును నేను చేతఁబట్టియుంచెదనా? నాచేతనుండిన నీక్షణమే వదలిపెట్ట సిద్ధముగనుండెదను."

"తమశ్రేష్ఠతకుఁ దెలియని విషయముంగలదా? స్వతంత్రమును సంపాదించుటకు స్త్రీవిద్యయత్యావశ్యకము. అందుచేత స్త్రీవి బలవంతముద్య పఱచిన, నిద్దేశ స్త్రీలు విశ్వాసపరులై తమశ్రేష్ఠతలను చిరకాలముఁబూజించి తమశ్రేష్ఠతలఁజేరిన కుటుంబస్థులందఱు నాచంద్రార్కపర్యంతము మహో

న్నతదశలో నుంచునటుల సదాసర్వేశ్వరుని ధ్యానముఁ జేయుచుందురు," అతనిశ్రేష్ఠత, క్షణకాలమాలోచించి, "స్త్రీవిద్యను బలవంతపఱచిన బురుషులవిద్యనుగూడా బలవంతము చేయవలసివచ్చును. నాకును నారాజాంగముఁజేరిన మంత్రివరులకును విద్యాభివృద్ధియందుఁగల ప్రీతికిమించినప్రీతిలేదు. మాకుంగల యాసక్తికిఁ బరిమాణములేదు. అయిన నిద్దేశమునగుగ్రామములు లక్షలకొలఁది యుండుటచేతఁ బ్రతిగ్రామమున ప్రత్యేకమైనపాఠశాలల నియమింపవలెనన్న గోట్లకొలఁది రూపాయలు గావలసియున్నవి. కొండంత ద్రవ్యమును గడియించు సాధనములేను. మేమైవిద్యకుగాను నూతనమైన పన్నులవిధించుట యుక్తముగాదని తోఁచెడిని. రాజాంగములలో వాలాయముగాఁ జేయవలసిన సెలవులుపోను మిగిలినద్రవ్యమునంతయు విద్యాభివృద్ధికి వెచ్చింప నిచ్చ గల్గియున్నవారము. సామాన్యజనులవిద్యయందు మాకుంగల చింత దేశస్థులకుఁ గొంతయుండిన మేలు. విద్యలేదను విచారము లోకులమనంబులఁ దగిలినంతటఁ దమంత వేలకొలఁది సొంత పాఠశాలలఁ బెట్టుటకు జనులు సర్వప్రయత్నములఁ జేయుదురు."

"బిడ్డలవలెనుండు జనులప్రయత్నముకంటె మాతాపితలకు సన్నిభులైయుండు దొరతనముచేయువారి శాసనము మేలని తోఁచెడిని."

"ఇటీవల నాకొండ్లుగ నీవు పెక్కుచోట్ల సమాజములఁగల్పించియుఁ బ్రసంగములఁ జేసియు స్త్రీలువృత్తాంతపత్రికల రప్పించి చేదువుకొనఁ జేసియు, వారితో సంభాషించియు లౌకికవిషయములందు జ్ఞానాభివృద్ధిఁ గలుగజేయుచు వచ్చితివి. నీవలె నల్వురు పల్మరు బోధించుచువచ్చిన, జనులకు సామాన్యజనవిద్య యందీహకల్గు. కొన్నిధనవంతులు దొడ్డపడిన సొంతపాఠశాలలఁ బెట్టనుద్యుక్తులై యుండువారికిఁ బ్రోత్సాహకరమై యుండును."

"రాజప్రతినిధిగనుండు తమశ్రేష్ఠతకుఁ దెలియని విషయముఁగలదా? తమశ్రేష్ఠతయొక్క కృపాకటాక్షములులేక మాయుత్తికొలానకూడదు."

"ప్రతిసంవత్సరమును మావల్లనైనంత శ్రమతీసికొని రాజధానియందలి పాఠశాలల సంఖ్యల నెక్కించుచే వచ్చెదము. అందుచేతనే సామాన్య జనుల విద్యయందు మాకుంగల లాలస ప్రజలకు లేదని స్పష్టంబగు."

"అట్టియుపకారమునకు విశ్వాసబద్ధులమైయుండెదము. మనస్సుండినమార్గము దోఁచె."

"సంపూర్ణమైన మనసున్నదిగాని మార్గము నాబుద్ధికందలేదు."

"ప్రకృతపురాబడిలో నొకనిష్కర్షయైన భాగమును జదువుకని ప్రత్యేకించిపెట్ట వీలుపడునో, లేక, పడదో!"

"దొరతనపువారు ప్రజలను రక్షింపవలసినది యాదిధర్మము. రాజాంగమున లక్ష్యముంపవలసిన విషయములు బహ్వయున్నను, వాటిలోఁ బ్రధానములైనవి యేవియనిన— (1) ప్రజలనారోగ్యము (2) ప్రజలు కలహపడక మతభేదములవల్లఁ బోరాడక నెమ్మదిగనుండఁజేయుట (3) స్వేచ్ఛాగమనము (4) స్వేచ్ఛగభాషించుట (5) వారివారిశక్తిబుద్ధికొలఁది జీవనోపాయములనువెతకి ద్రవ్యమార్జించుట కేలాటియభ్యంతరము లేకుండఁ జేయుట (6) ప్రజలప్రాణమునకును సొత్తులకును నేలాటియపాయములు గలుగకుండ జేయుట. (7) అన్యదేశస్థులీ దేశముమీద దండెత్తకుండునట్లు చేయుట. ఈలాటివిషయంబులందు వ్యయంబగు ద్రవ్యంబునకెయింబెట్ట వల్లపడదు. రాజాంగసంబంధమైన యిలాకాలలో మితముగ వ్యయముజేసెదము. పూర్వముండిన సెలవులలోఁ గొన్నిటిని నిటీవల సంక్షిప్తము గావించితిమి. ప్రతిసంవత్సరముఁ గొన్నిస్థలములందు గాటకమనియు ,గొన్నిచోట్ల నదీప్రవాహముచేత నష్టమనియుఁ బలువిధంబులైన సెలవులు పైపైఁ దగులుచే వచ్చియు వాటిని సంభాళించుటలో సమయపడినపుడెల్ల నూతనపాఠశాలల నేర్పఱచుచే వచ్చెదము."

"తమశ్రేష్ఠత చేయుచుండు మంచికై కృతజ్ఞతగలవారై యుండెదము. స్త్రీవిద్యాభివృద్ధికై వలసినమార్గమును మార్గణముచేసిన ప్రజలకును దొరతనము చేయువారికిని శ్రేయఃకరము."

"మంచిది! నీకోరికను జ్ఞప్తినుంచుకొని సందర్భములఁ గనిపెట్టియుండి, యేనెంతమంచి చేయనగునో యంతఁ బ్రీతితోఁ జేసెదను."

"అంత కృపనుంచుటకుఁ బదివేలవందనములు."

"బాలాంబగారేల మౌనముగనుండెదరు?"

"శిరము కంపమగుచుండగఁ బుచ్ఛముండుచోటు దెలియునా?" అని, బాలాంబ చెప్పెను.

"బాలాంబగారు నాకుడిచెయి; ఆమె నాద్వినేత్రములలో నొక్కటివలె," అని, లతాంగినవ్వుచుఁ జెప్పెను.

"బాలాంబ నీసహపాటుకత్తెయని నేనెఱుంగుదును," అని యతని శ్రేష్ఠత చెప్పెను.

"పశ్చిమ సీమలోని స్త్రీలవలె నిద్దేశములోని స్త్రీలలో గొందఱు, వారియందు నుత్తమకులమునందుఁ బుట్టినవారు విద్య నేర్చి స్త్రీలకు స్వతంత్రము గలుగఁజేయుటకై పాటుపడుట నాకాహ్లాదకరముగ నున్నయది," అని రాణిగారు వచించిరి.

"ప్రజలు క్షేమముగనుండుటతో వారు విద్యావంతులైయుండిన మన జాతివారికి ఖ్యాతియు గౌరవమును నెక్కువ," అని, దొరసానమ్మగారు మందలించిరి.

"చేదువుకొనుటకు బలవంత మేర్పడకుండిన సొంతపాఠశాల లేర్పడుటకుఁ బ్రేరణయు నావశ్యకమును నుండవు," అని బాలాంబపల్కగ,

"మీదేశస్థు లెంతద్రవ్యంబున నావశ్యమైన విషయములలో వెచ్చించెదరు! వివాహకాలమున వేడుకార్థమై నాలుఁగైదు దివసములవఱకు నెంత ధనమును వ్యయముచేసెదరు! దేవాలయముల కెంత వృథాగా సెలవు చేసెదరు! దేవాలయములకు ద్రవ్యమియ్యకాదనజాలను. పూజాదులకు వలసినద్రవ్య

షును వెచ్చించి, మిగతను విద్యాదిమంచివిషయములందు వినియోగించిన నెంత మేలు! మానీమలో మీవలెనపరిమితమైన ధనమును గుడికిని బరిణయంబులకును వ్యయము చేయను," అని, దొరసానమ్మగారు చెప్పిరి.

"దొరసానమ్మగారు! తాముచెప్పినదంతయు నిక్కమే. వివాహదినములఁ బెంచి వేడుకలను జరిపించినందు కనేకులు కష్టనష్టములఁ బొందియుండెదరు. వివాహమును నొక్కదినమునకుమించి చేయరాదనియు, దేవాలయముల రాబడిలో రెండింట లేక మూడింట నొకభాగమును విద్దెకు వినియోగింపవలెనని చట్టముదెచ్చినబాగు," అని బాలాంబ చెప్పెను.

"ద్రవ్యసమృద్ధిగలవారు పెండ్లిదినముల నెన్నాళ్ళకుఁ బెంచినా, వారికి లక్ష్యముండదు. 'పులినిజూచి పిల్లివాతవేసికొనె' నన్నట్టు, విత్తములేనివారు ధనాఢ్యులవలెఁ బెండ్లిదినముల నేల పెంచెదరు?" అని, రాణిగారడిగిరి.

"అట్టి చట్టములందెచ్చిన దొరతనముచేయువారు మతవిషయములలోను సాంఘికమైన యాచారవిషయములలోను విరుద్ధముగఁ బ్రవేశించిరని ప్రజలు మొఱపెట్టుకొనుదురు. ఈవిషయములు ప్రజలబుద్ధికిఁ దగిలి, ప్రజలే యట్టిచట్టముంగోరిన నుత్తరక్షణమే శాసనమేర్పడును," అని, యతనిశ్రేష్ఠత చెప్పెను.

"ప్రజలకట్టి తెలివికలుగుటకుఁ బ్రజలెల్లఁ జదువరులై యుండవలదా?" అని, బాలాంబచెప్పినంతట నతనిశ్రేష్ఠత,

"హా! హా! హా! నాకు మీరుపరిచయమైన విషయము చాలసంతోషకరముగనున్నది. మానీమకు నేను చేసినపుడు మానీమలోనుండు ప్రభువులతోను వారి రాణులతోను దేశాభివృద్ధియందు మీయిరువురికింగల శ్రద్ధలను నొక్కిచెప్పుదును; మిమ్ము నేనాఁడును మఱవను." అనినంతట, లతాంగియు బాలాంబయులేచి తమచేతుల జోడించుకొని, వందనమాచరించిరి. అతనిశ్రేష్ఠత, "చాలప్రొద్దాయె; మీకెల్లరకు 'సుదినం'," అనిచెప్పి, నగవుముఖ

ములో నొక్కొక్కరి చెయింబట్టి, "సుదినం" అనుచుఁ జెయినిసాడించి, తనస్థానమున గూర్చుండెను.

రాణిగారు నగవుముఖంబుతో మువ్వరిని సోపానములకు దిగువఁదోడ్కొనివచ్చి, "సుదినం, మీయతనములు సఫలమాగాక!" అనిచెప్పి తనగదికిఁ జనిరి.

దొరసానమ్మ, లతాంగిని బాలాంబను దనరథమున దీసికొనివెళ్ళి, లతాంగి యింటియొద్ద నిరువురినివిడిచి వెళ్ళుసమయంబున, లతాంగియు బాలాంబగారును దొరసానమ్మచేతులఁ దమకండ్లమీఁద నొత్తుకొని తమకృతజ్ఞతఁదెలిసి, "సుదినం" అనిరి.

కృష్ణమూర్తి లతాంగిబాలాంబలఁగని వారియుద్దేశమెంతమాత్రమునెఱవేరెనని యడుగ, జరిగిన వృత్తాంతములను సవిస్తరముగఁ జెప్పిరి.

"రాజధాని కధిపతియైనవారు తాముచెప్పినంతఁ దప్పకచేయవలసినవారై యుండుటచేత గుట్టువిడిచి, పట్టువదలి జవాబియ్యకుండినను, వాగ్దత్తముచేయకుండినను, మీరు ప్రార్థించిన విషయములను జ్ఞప్తిని నుంచుకొని సాధ్యమైనంత మేలుచేయుటకు సందియములేదు; మీరు చింతపడఁబనిలేదు," అని, కృష్ణమూర్తి చెప్పగ నిరువురు హృష్టమానసులైరి. బాలాంబ సెలవుపుచ్చుకొని తనయింటికి జనియెను.

27 వ, అధ్యాయము.

లతాంగి తల్లి కాయిలాపడి చికిత్సకై శశిపురమునకుఁ దేబడుట.

కృ—వేకువజామునకు ముందునుండి కూర్చుండియుండెదవు; ఎందుకు?

అని, కృష్ణమూర్తి తనసతిని నడిగెను,

ల—రాత్రినిదురలో దుస్స్వప్నముగంటి; వెంటనే మెలకువయై గడియారముతోడ నాలుగుగంటలు కొట్టఁ బడినవినుచుంటిని; [illegible]

ముఖకరచరణములను శుద్ధిచేసికొని నెత్తిన గుంకుమబెట్టుకొని తమ ప్రక్కన గూర్చుండియుంటి; తాము నిదురబోవుచుండినందున తమ నిదురను భంగముచేయ వెఱచి యూరకుండితి; నా స్వప్నము భవిష్యత్ఫలమునకు బూర్వ సూచనయని తోఁచెడిని.

కృ—"నిశీథియందు గనుస్వప్నము కొంతమట్టుకు ఫలించునట; వేకువజామున గనుస్వప్నమునకు ఫలములేదని పశ్చిమసీమలోని వారిలోఁ గొందఱు చెప్పుకొనియెదరు; ఉత్తరవృత్తాంతములను స్వప్నములమూలముగా సూచించుటయుఁ గలదా?

ల—కలగనినందుకు బ్రత్యక్ష విరుద్ధముగ ఫలముగల్గునని కొందఱును, ఉదయమునకుఁ బూర్వము గనినకల వెంటనే సిద్ధించునని కొందఱును జెప్పెదరు; నాకల యేమగునో!

కృ—ఏమి కలగన్నావు?
ల—అబ్బ! దానిఁదలఁచిన నాకుతీన నగ్గిపెట్టినట్టున్నది.
కృ—ఏమి స్వప్నము?
ల—నాతల్లిగారు కాయిలాపడి గతించినట్లు కలగంటి; గొంతెత్తి యేడ్వనూ యేడ్చితి.

(నవ్వుచు) "నీవు భయంపడవలదు; ఎవరైనా కాయిలాపడి గతించినట్టు కలగనిన, వారు చిరకాలము బ్రతికియుందురని లోకులు వాడుకొనగ విని యుండెదను."

"ఈభూమిమీఁద నెందాక ఋణమున్నదో యందాక నాతల్లిమని యుండును; ఋణముతీరిన మరణ సంభవమగును."

"జననమునకు వెనుక మరణము నిశ్చయమైనను మరణకాలమే యనిశ్చయము. నీతల్లిగారు (నవ్వుచు) నాయత్తగారు [illegible] మనకు [illegible] యయినను [illegible] చెల్లినట్టే కదా?"

"నాతల్లి కేమివయస్సాయెను? నాయవ్వగారు కొన్నియేండ్లకు ముందుగతించిరి. నాయవ్వగారివలె నాతల్లిగారికి చర్మము ముడుతలుపడెనా? కండ జీర్ణించిపోయెనా? వెన్నెముకలో బలముడిగి, వీపువంగిపోయెనా? శిరోకేశములందు శ్లాక్ష్యమించుకైన గనిపించెనా?"

"మనదేశమున నేఁబదియేండ్లకు పైఁబడి జీవించువారు దీర్ఘాయుష్మంతులనుకొనవలెను; పశ్చిమసీమలోను నింక గొన్నిసీమలలోను జనుల సరాసరి వయస్సుఱువదియేండ్లకు పైబడి యుండగ, మనదేశమున నలుబదియేనుకుఁ దక్కువ."

ఇట్లు సంభాషించుచుండగ, "స్వామీ, కృష్ణమూర్తులుగారు," అని పిలిచిన శబ్దము వినవచ్చి, కృష్ణమూర్తి, "ఎవరక్కడ?" అనుచు వీధికివెళ్ళగ, "అయ్యా! తంతి తపాలొకటి తమపేరిటికి వచ్చియున్నది," అని తపాలువాఁడొక తంతి సమాచారముఁగల లకోటను నొసంగెను. జోబులకోటను విప్పుచుండగ, లతాంగి వ్యాకులమును దొట్రుపాటునుగల మనంబుతోఁ జెంతచేరవచ్చి తన చేతులఁ బిసుకుకొనుచు నిలువఁబడెను.

"ఓసి, లత! నీతల్లికిజబ్బుట; చికిత్సకుగాను నీతండ్రిగారామెను దోడ్కొని రైలెక్కి నేటియుదయమున నిచ్చటికి వచ్చెదరని తంతిసమాచారము వచ్చియున్నది," అని, చెప్పగ, లతాంగి చేష్టటించి, అయ్యో! ఏమి చేయుదునే యమ్మా," అని కంటినుండి నీటిధారలొలుకగ విలపించెను. సతియొక్క శోకచిహ్నములచేతను దుఃఖోక్తులచేతను మనసు కరఁగినవాఁడై, కృష్ణమూర్తి,

"ప్రేయసి! ఎందుకు కన్నీరు విడిచెదవు? నాయత్తగారు కాయిలాపడియుండుట నిజమైనను మృతినొందదు; గతించినట్లు కలఁగనిన బ్రతికి చిరకాలముండఁబోవుట నిశ్చయము. నీతల్లిగారు రైలునుండి వచ్చువేళ సమీపించె. మనము దిగులొంది దుఃఖసాగరమున మునిగియుండిన నామెవచ్చినతోడనే చికిత్సచేయించుట కభ్యంతరము [illegible] మనమువోయి నీతల్లిని [illegible]

ముగల్గి, యామెవ్యాధి రెట్టించెను. మననగరమున బహుచమత్కారమైన చికిత్సకు లుండుటచేత వారిని ముందుగరప్పించి పెట్టెదము," అని, చెప్పినంతట, లతాంగి తననేత్రాంబువును జెఱగుతోఁదుడుచుకొని, సేవకుని బిలిచి దీననాదంబులో, "అమ్మగారికి దేహముజబ్బట; ఇప్పుడే రైలుమార్గమున వచ్చెదరట; తంతి సమాచారమువచ్చెను. నీవు మంచివైద్యుని బిలుచుకొని రమ్ము" అనెను.

"ఏవైద్యునిఁ బిలుచుకొనిరమ్మనెదరు?"

"'రాక్మైండు' అను దొరవైద్యుని బిలిచిరమ్ము," అని, కృష్ణమూర్తిచెప్పగ, "అతఁడు కఠినచిత్తుఁడట, బాబు," అని,
ధ—పంచమి చెప్పెను.

"వైద్యునికిగాని వకీలుకుగాని యనుకంపయుండిన సంపాదనలేకయుపాదానమే లభియించును," అని కృష్ణమూర్తిచెప్పగ, లతాంగ తనతల్లికిఁ గఠినచిత్తునిచేఁ జికిత్స చేయింపరాదని తలఁచి, యాంధ్రవైద్యులలో నొకని బిలిచిరమ్మని చెప్పిపంపెను. కృష్ణమూర్తి సేవకుని మఱలఁబిలిచి, దొరవైద్యుని దోడ్కొని వచ్చినవెనుక 'భూలోకఆస్తికుఁడు' అను బిరుదువహించియుండు రోగహారిఁ బిలిచిరమ్మని యాజ్ఞాపించెను.

"తాముచెప్పిన రెండువైద్యులలో నొక్కొక్కని చికిత్సచేత నూటికి పైఁబడి వ్యాధిగ్రస్తులు గతించినారట, బాబు," అని సేవకుండు చెప్పెను.

"నూటికి పైఁపడి వ్యాధిగ్రస్తులఁ జంపక యొకఁడు గొప్పవైద్యుఁడు కాఁడు. నేఁజెప్పిన వైద్యులిరువురును మహానిపుణులని కీర్తివహించియుండెదరు. వారినే బిలుచుకొనిరమ్మ," అనిచెప్పి, కృష్ణమూర్తి జంబయ్యగారియొద్దకుఁ జని, తంతిసమాచారమును నతనిచెవులఁ బడవేసి, యతని మోటారురథమును రైలుకుఁబంపెను.

పదియేను నిమిషములలో వైద్యులిరువురు వచ్చిచేరిరి. వెంటనే, జంబయ్యగారి మోటారు రథము వీధినవచ్చి నిలిచెను. అందులోఁ బరుండి

యుండిన సుబ్బమ్మగారిని లతారంగనాథు లొకప్రక్కను భద్రయ్యగారిం కొకప్రక్కను బట్టుకొని, తిన్నగ నడపించి, వీధితట్టుండిన గదిలో నొకపట్టె మంచెముమీఁదఁ బండపెట్టిరి. తోడుతో దొరవైద్యుండు తనజేబులోఁ జెయిఁబెట్టి యొక తమరపుగొట్టమును బయటతీసెను. ఆ గొట్టపు పైమూఁతను దెఱచి యందలి నొక సన్నని గ్లాసుగొట్టముఁ దీసి, యాగొట్టపు కొనలలో సన్నని కొనను సుబ్బమ్మ నాలుకక్రింద రెండునిమిషములు పెట్టియుంచి యాగొట్టమును బయట తీసిచూడగా, గొట్టములోని రసస్తంభము పైకిలేచియుండె. గొట్టముమీఁదఁ గనఁబడిన సంఖ్యలఁగని, "ఉష్ణోగ్రత, నూటమూఁడంశములు," అని చేదివెను. ఇంకొక జేబులోఁ జెయివేసి, వెలుపల వెండిపూత పూయఁబడినజెనెడు గొట్టమును బయటతీసెను. ఆగొట్టపు రెండుచివరలలో నొకచివరగొప్ప రంధ్రముండెను; మఱొకచివర దీర్ఘమైన రబ్బరు నాళములతో ద్విపాయలై యుండెను; రబ్బరు శాఖాంత్యములను, దనరెండు చెవులం బెట్టుకొని, గొప్ప రంధ్రముఁగల తట్టు సుబ్బమ్మగారి వక్షము మీఁద నాలుగైదుచోట్ల నదిమిచూచి "చిన్నయాపిరితిత్తి పెడమంటజేత వ్రణచిహ్నముల సూచించుచున్నది. ఈవ్రణము కుడితట్టుండు శ్వాసకోశమును నంటిన బ్రాణమున కపాయము," అనెను.

"ఓసి, లత! నాలుక క్రిందఁబెట్టి చూచినదేమి? ఱొమ్ముమీఁద నదిమి చూచినదేమి?" అని, సుబ్బమ్మ యడిగెను.

"అమ్మా! జిహ్వక్రిందఁబెట్టి చూచినయది 'ఉష్ణశీతలముల' సూచించు యంత్రము; దానిని 'ఉష్ణతామాపకము,' అందురు; దానిని యింగ్లీషుభాషలో 'థర్మామిటరు,' అందురు. ఱొమ్ము మీఁదఁబెట్టిచూచిన గొట్టము హృదయశ్వాసకోశముల ధ్వనులను వినిపించుసాధనము."

"శ్వాసకోశము వ్రణముచేయు నివిషజ్వరమచేటకర్గి? ఎన్నాళ్ళుగ నున్నది?" అని దొరవైద్యుండడిగెను.

"మా శ్రీమంతపల్లెలోఁ దగిలి యొక్కవారమగు నున్నది," అని భద్రయ్య చెప్పెను.

"మీ గ్రామముఁ జుట్టువనమా? వనమునుండివచ్చిన వనముఁద్రాగెదా?'

"మా గ్రామముఁ జుట్టు వనములును గుట్టలును నున్నవి; వాటిగుండా వచ్చెడి నీళ్ళను మేమెల్లరముఁ ద్రాగుచుండెదము; ముప్పదియేండ్లకు పైబడి నాలోఁగాపురముచేయుచు నానీళ్ళఁ ద్రాగుచువచ్చియు నుండెప్పుడిట్టి జ్వరము తగలలేదు. సుమారొక సంవత్సరమునకు ముందుసాలపల్లెనుండి మా గ్రామమునకు వెళ్ళినపు డరణ్యమార్గమున జెలమనీళ్ళఁ ద్రాగెను."

"ఏఁడాదివఱకు విషము కడుపుననుండి యిపుడు బయటపడెను," అని చెప్పుచు నొకచిన్నచీటివ్రాసి, భద్రయ్య చేతనిచ్చి, 'మాసిడోపెల్,' అనువిలాసముఁగల మందులంగడికివెళ్ళి, యీచీటిని నంగడివారియొద్దనిచ్చిన నందుగనిన మందులను గలిపియిత్తురు. దానిని ధరయిచ్చికొనివచ్చి రెండు గడియల కొక్కతేప 'ఔన్స్' గ్లాసులోనొకౌంసు రసముఁబోసి సుబ్బమ్మగారికి నిచ్చుచుండుము; దినములో మూఁడు తడవలు వచ్చి చూచిపోనియెడఁ బ్రాణమునకు హానికల్గు. నాకు వేతనము తడవయొక్కటికిఁ బదిరూపాయలు," అనెను.

"పథ్యమేమి?"

"అన్నము సరిపడదు; జీర్ణమునకు రాదు; ఫుండెచేరు(చిక్కెన్ బ్రాత్) తీసియిండు."

"అయ్యయ్యో! దానిని బ్రాహ్మణులమైన మేము చేతనంటము."

(నవ్వుచు) "ఔషధమువలెఁ బుచ్చుకొనరా? ఔషధముతోఁ గలిపి యిచ్చిన బుచ్చుకొనరా?"

"ప్రాణమైన విడుతుముగాని యేలాగిచ్చిన బుచ్చుకొనము."

"తక్కాలము బార్లిగింజలుదెచ్చి, నీళ్ళువిడిచి కాఁచియొద్దిగఁ జాలుచేర్చి యిచ్చుచుండుము; పోనుపోను చూచుకొనుదము."

"తాముచెప్పిన భైషజ్యశాల కడుదూరమున నుండుటచేత సమీపమునసుండు దుకాణమున మీచీటినవ్రాసియుండు మందులఁగొనరాదా?"

"ఒక్కొకమందుకు శక్తి ప్రమాణముకలదు. ఏనుచెప్పిన యంగడిలో నాకుఁ దెలిసిన ప్రమాణముఁగల మందుల నమ్మెదరు. నాకు చాల యనుభవము; అందుచేత నాయంగడిననే మందులఁ గొనిరండు."

"మంచిది! సలాం! తాము ప్రతిదినమును మూఁడు పూఁటలువచ్చి చూచిపొండు."

(నవ్వుచు) "మంచిది! జ్వరముతగిలి యొక్కవారమైనది. ఇంక రెండు వారములవఱకుఁ గొంతభయము; అటు వెనుక భయంపడఁ బనిలేదు."

"ఇచ్చట గాలి వీచుచున్నది. లోనదిక్కుఁ దీసికొని పోవుదునా?"

"గాలిధాటిగ వచ్చుచుండవలెను; కనుక, సొరణగండ్లఁ జక్కగఁ దెఱచివిడువుము; పాన్పును మాత్రముఁ బూఁటపూఁటకు మార్చుచుండుము." అని, చెప్పి పదిరూపాయలం దీసికొని, మోటారు రథమెక్కి చక్కగ వెళ్ళెను.

కర్ణములందుఁ గర్పురకుండలంబులును, కంధరంబున దులసిపూసల సరములును స్ఫటికమాలయు వ్రేలాడుచు, కళేబరముపైఁ గాశ్మీరశాలువఁ గప్పుకొని కాచుకొని యుండిన "భూలోక అస్త్రీకుండు," అను వృద్ధతుని భుండు తిన్నగ రోగిచెంతవచ్చి కూర్చుండెను.

"తాతగారు నాతల్లిగారికి నేలాగైన నీరోగమును దొలగింపవలెను,' అని లతాంగి వేడుకొనెను.

రోగహారి తన నడుమున జెక్కుకొని యుండిన బిల్వకాయ బుఱ్ఱను జేతఁ బట్టుకొని, బిరడను బయటికిలాగి, తనకుడిచేతితో నెడమలోనుయున నాబుఱ్ఱనుదట్టి రెండు చిటికలనస్యము బయటతీసి, తన కుడిచెయి 'బొటన వ్రేలు, చూపుడు వ్రేలు;' వీటితో నాసస్యముఁజేర్చి, యొడమతట్టుముక్కు రంధ్రమున శబ్దముతోఁబీల్చి వ్రేళ్ళను విదిలించి ఛటికరించి. అంతట స్వేత

ద్వయంబులనుండి రెండు నీటిబిందువులొలుక, వాటిఁదుడుచేకొని, రోగి రొడమకై మీఁద నొకపట్టుచేలముఁ బఱచి, యామె బొటన వ్రేలికగువ మణికట్టు మీఁద రక్తనాళముపైఁ దనకుడిచెయి 'ప్రదేశినీ,' 'మధ్యమా' 'అనామికా,' అను మూఁడువ్రేళ్ళను నదిమి, జొట్టనవ్రేలిని మాత్రముఁ బైకెత్తి తనశిరంబును బైకెత్తిగృహాపటలంబును జూచుచు, వెండియు నావ్రేలిని నదుముకొని మధ్యమ వ్రేలినిబైకెత్తి, తుదకుఁ దనయంగుష్ఠ తర్జనీలతోఁ నేలమీఁద రెండుతేపలు దట్టి,

"పిత్తప్రకాశమధికముగ నున్నది; శైత్యము పూర్తిగనున్నది; నాలుకపై నుండ్లుపెరిగి నేరెడి పండువర్ణముఁ గనుపించియున్నది; తగిన చికిత్స చేయక రెండు దినములుండిన బ్రాణముండుట దైవయత్నముగాని మనుష యత్నము కానేరదు,'' అనెను.

"మంచి మందిచ్చివాసిచేయుఁడు, తాతగారు !''

(నవ్వుచు) "దొరవైద్యుఁ డేమిచెప్పె?''

"రెండు వారములకు మీఁద భయములేదనిరి, తాతగారు!''

"కాగదే! రెండు దినములలో శివపాదముఁజేరు స్థితియుండగ, రెండు వారములేల? రెండు గొట్టముల మూలముగా వ్యాధిమూల స్థితుల నెట్లెఱుంగనగును? నాడిపరీక్షఁ దెలియనివారి వైద్యమెందుకు పనికివచ్చును?''

"దొరవైద్యులుచాలగొప్ప పరీక్షలనిచ్చినవారు; సామాన్యమైన వారుగారు,'' అని, కృష్ణమూర్తి చెప్పగ.

"అతనియొద్దనే మందుఁ దీసికొనుఁడు,'' అని ఆ స్త్రీకుండు చెప్పెను.

"తాతగారు! కోపపడకుఁడు; తామే మందిచ్చి స్వస్థముచేయుఁడు,'' అని, లతాంగి ప్రార్థింపగ,

"మందుసెలవులకు ముప్పదివరహాలును నాకు ముప్పదివరహాలును నిప్పుడే యిచ్చిన, 'చిటకాలో' వ్యాధిబలము హరించునట్లు చేసెదను,'' అని వైద్యుండు చెప్పెను.

"భేషజశాల నామము చెప్పిన నేనే యౌషధములఁగొని వచ్చెదను,'' అని కృష్ణమూర్తి చెప్పెను.

"సరే! నామందు లేయంగడిననుఁ దొరకవు; నేనే మూలికలరప్పించి పంచలోహములను భస్మముచేసి, మందులను సిద్ధపఱచియుండెదను. అంగడివాఁడు దొరవైద్యుని చీట్లచేతఁ దనయంగడిలో నమ్మబడినమందుల విక్రయధనములో నూటికింత యని రుసుమునిచ్చి వేయునందున దొరవైద్యుం డొక్కయంగడినే ననుగ్రహించుచున్నాడు. రెండు వారములు గడువు పెట్టెగదా? దినమొక్కటికి మూఁడు తడవలకు దర్శనమునుండి ముప్పదిరూపాయలు వంతున, రెండు వారములకు నాలుఁగువందల యిరువదిరూపాయలును, మందుఖర్చులకుగాను నందర్థమును, అంతుఁజేరి యేడువందల రూపాయల ఖర్చుకు దోవజేసివెళ్ళెను. నాకు రెండువందలైన నియ్యరాదా?''

"తాతగారు! అతృప్తిఁ జెందకుఁడు. మాయభీష్టము నెఱవేరిన మీయభీష్టముఁ బూర్తియగును,'' అని, లతాంగిచెప్పెను.

"సరే! చేతిమీఁదకాసుపడిన గాసుపడిన తెంపుమీఁదఁ జేయుచికిత్సనే సరియైన చికిత్స,'' అనగ, లతాంగి యేఁబదిరూపాయల నోటొక్కటిని తాతగారిజేతఁబెట్టి, మిగతను రెండు పూఁటలు తాళియిచ్చునట్లు చెప్పెను.

"కూఁతురికిఁ దల్లియందుఁగల ప్రేమవలెఁ దక్కినవారికి నుండునా! ఈనోటు రెండు పూఁటలమందుకు సరిపోవును. ఇంకఁ గొన్నిరూపాయలిచ్చిన నామనవృత్తికిఁ బెట్టుకొనుదును.''

"తాతగారు! 'మందువిందు మూఁడుపూఁటలు' అన్నట్టు, మూఁడు పూఁటలు తాళి కొంతస్వస్థత యైనతోడుతో నిచ్చెద.''

"మంచిది! ఒక చిన్నగంధపురాయి, రవంతమిశ్రములేని మధువు,' వీటినిదెచ్చియియ్యుమ్మ.'' అనినంతట, లతాంగివాటిని వెంటనేఁ దెచ్చిపెట్టెను. ఆ స్త్రీకుఁడు తనచేంకనుండిన యిత్తడిపెట్టియఁదీసి, దానిదెఱచి, గుడ్డపేలి

కలోఁ జొట్టబడియుండిన గండౌషధమాత్రలను రుధిరవర్ణముంగల చిన్న కాయంతగడ్డను జాతిమీఁదఁ దేనెఁబోసి చింతాకంతతాచి,

"ఇది సంజీవిమాత్ర. దీనిఁదీసికొనిన నెట్టిజ్వరమైనను వదలిపోవును. ఆయుస్సుముగిసినమాత్రము మృతినొందవలెంగాని యీమాత్ర నెట్టి వారిని వైకుంఠయాత్రకుఁ బోనియ్యదు," అనెను.

"తాతగారు! తాము చెప్పినది వ్యక్తముకాలేదు; విధిముగిసినమాత్రమే మరణమొందవలెఁగాని మీమాత్రఁదీసికొన్నవారికి మరణములేదనిరందురు; విధిముగియనివారికి మందేల?"

"ఎందుకు? విధిముగియక తగినచికిత్సలేక గతించెడివారులేర? అట్టి వారు పైశాచములై తిరుగుచుందురు."

"తాతగారు! పైశాచము లున్నవని యేనునమ్మను."

"నమ్మకపోతే, పో," అనుచు, మాత్రగల్పినతేనెను సుబ్బమ్మనాలుకమీఁదరాచి, తనచేతినిశుద్ధిచేసికొనెను. అటు పిమ్మట లతాంగిని నొక చిన్నకాగితమును సీసపుపుల్లయు దెమ్మనిచెప్పగ, వాటిని దెచ్చి లతాంగి తనచేతఁబట్టియుండగ,

"ఏనుచెప్పఁబోవు మందుదినుసులును వాటిని గలుపు పద్ధతులును వ్రాసికొనుము," అని యడుగునగనినట్లు చెప్పెను.

"మరీచం, అరపలం; జీరకం, అరపలం; విశ్వం, పాతికపలం; లవంగచెక్క, వీసంపలం; ఆకులుగిల్లివేసిన నింబపుల్లలు, అరపలం; యీయైదుదినుసులను నలగగొట్టి యొకక్రొత్తమట్టిపాత్రలో శేరెఁడునీళ్లుఁబోసి, నలగఁగొట్టబడినపొడిని నందునవేసి, శేరెఁడునీళ్లు పావుశేరు నీళ్ళగుపర్యంతముఁ గాఁచి, పైకషాయమును వడియఁగట్టి, పూఁటకు చారెఁడు కషాయమునన్నిదిగో, యీపొట్లములలో నొక్కపొట్లములోని భస్మమునందునవేసి, నాలుగుబొట్లు తేనెవిడిచి, నాలుఁగుపూఁట లిచ్చుచువచ్చిన, జ్వరమేడనో? ఉండు చోటు తెలియదు. మాతికలగుణ మెఱుఁగుదువా? వాయువును హరించుటకు

శుంఠి; ఉష్ణను నాపుటకు మరీచము; జీర్ణముఁదెచ్చుటకు జీరకం; పిత్తమణచుటకు పిచుమందం; క్రిమికి లవంగచెక్క, రుధిరశుద్ధికి మధువు."

"తాతగారు! నాతల్లిగారికి శీతలమువచ్చి కమ్ముకొని యున్నదట; ఏమిచేయవచ్చును?"

"అదిచెడె; కర్పూరతైలమైనా, లవంగపట్టతైలమైనా, బ్రాందియైనా దేహమెల్లతాచి యగ్గిసెగఁజూపుము. శీతలము తీయకపోయిన, శిరస్సుక్రింద రెండుపావురముల మాంసమును మూటఁగట్టిపెట్టిన, శైత్యముండుచోటుఁ గనిపెట్టు, చూతము! ఏనునాయింటికివెళ్ళి, బువ్వతిని, కొంతసేపుపరుండి, పగలు మూఁడుగంటలకు వచ్చెదను," అనుచు, లేచివెళ్ళెను.

లతాంగి తనతల్లిని యొంటిగవిడిచిపోను మనంబులేక, బోనపువేళ తప్పఁదక్కిన ప్రొద్దంతయుఁ దనతల్లిగారి మూతినిదాకి తాకనట్లుతేపుపై గూర్చుండియుండి, యొక్కయీఁగైనాఁబైన వ్రాలకుండఁ దోలుచు, దేహముపైనుండి యపుఁడపు దూడిపోవు చెఱఁగువైటల నెగద్రోయుచు చెమ్మటఁ దనచెఱఁగుతో మెత్తగనొత్తుచు, రెండుగడియల కొక్కసారి మందిచ్చుచు, నిమిషమైన నిట్టట్టుఁ దిరుగకయు నేమరకయుఁ బరిచర్య చేయుచుండెను.

గడియారము మూఁడుగంటలుకొట్టుచుండగ దొరవైద్యుఁడు వచ్చి, సుబ్బమ్మగారి హృదయశ్వాసకోశములఁ బరీక్షించి, "జ్వరతాపము కొంచెమైన దగ్గలేదు; చిమ్మసూదితో రెట్టపైగ్రుచ్చి 'సెలెంటుమందు,' అనగా, ఒక్కఁడే పాక్కుడెందిచేసి యమ్మోడిమందును లోనికిసెక్కించక జోర్తి దిగ్గిపోదు," అనిచెప్పి, సూదినిరెట్టపైగ్రుచ్చి సన్ననిగొట్టములోని మందును లోని కెక్కించినపిదప, జలమలములు ధాటిగవీడుచున్నవా యని యడుగ, రెండుదినములుగ నవిబంధములై యుండునట్లు భద్రయ్యతెలిపెను.

"సాయంత్రమువఱకు జలమలములు దిగకుండిన 'అంత్రాకర్షకము' (స్టొమక్ పంప్) ద్వారా వాటిని బయటతీసి వస్తికర్మచేత నాహారము నాస

నముద్వారా నిచ్చునట్లు చెప్పి, తానువచ్చినందుకుఁ బదిరూపాయలును నూది మందుకుఁ బదియేను రూపాయలును దీసికొని, నూదిమందొక్క వాఱము వఱకు దినమొక్కతడవ యీవలసివచ్చునని చెప్పి, దొరవైద్యుండు రథ మెక్కి చక్కఁగ వెళ్ళెను.

నాలుగున్నర గంటలయ్యేటప్పటికి, అస్తికుండువచ్చి, ధాతుపరీక్ష జేసి "పీడవదలుటకిప్పుడే ప్రారంభము; నామందుపనిచేయ నింతసావ కాశంబయ్యెను. ఒకటితోనొకటి కలిసియుండిన వాతపిత్తశ్లేష్మ నాడీ లిప్పుడు ప్రత్యేకించి కొట్టఁదొడఁగెను," అనెను.

"తాతగారు! దొరవైద్యుఁడు సరిగ మూఁడుగంటలుకొట్టగవచ్చి చిమ్మ నూదిఁబొడిచి మందునులోని కెక్కించి వెళ్ళెను."

"అందుచేతనే నామందు మందగతినబడి పనిచేయ నాలస్యమైనది."

"తాతగారు! మలజలములు బంధించియుండుటచేత, 'ఆకర్షక యంత్రము నుపయోగింపబోయెదననియు నాసనముద్వారా నాహారముఁ జిమ్మఁబోయెదననియు దొరవైద్యులుచెప్పిరి; పురుషులచేత నిట్టిచికిత్సలఁ జేసికొనవలసిన విధికి సంకటపడుచున్నాను."

"సంకటపడనేలనే యమ్మ? గొట్టమేల? చిమ్మటేల? నేనొక కషాయముఁజెప్పెదను; దానినిచ్చిన తోడ్తో మలజలములు ధాటిగ వీడివచ్చును. పథ్యమేమని దొర చెప్పెను?"

"బార్లిగంజిలోఁ గొద్దిగఁ బాలువిడిచి యిమ్మనిచెప్పిరి."

"బార్లి గిర్లి వద్దు; ప్రాతబియ్యపునూకలను, పునఃపాకముచేసి, పైనీళ్లను వడియగట్టి, యిచ్చుచుండుమమ్మ."

"తాతగారు! ఉష్ణోగ్రతరవంతయైనఁ దీయకుండిన మంచుగడ్డను మూటగఁగట్టి తలక్రిందఁ బెట్టుమనిరి."

"శివశివ! శైత్యమువచ్చి కప్పుకొనియుండగ మంచుగడ్డను దాఁకింప నగునా?

"తాము చెప్పిన తైలములు నాతల్లిదేహముమీఁద రాచి సెగఁజూపిన, దేహము తాళదట," అని కృష్ణమూర్తి చెప్పఁగ, "తేలుకుట్టినట్లుండు మంచుగడ్డను నొక్కనిమిషమైన దాళునా," అని, అస్తికుండు నవ్వెను.

"నాయత్తగారి దేహముమీఁదఁ బ్రజ్ఞలేదు; మనమేలాటివైద్యము చేసినా నొల్లదని చెప్పుదు. మనమాలోచించి యేలాటిచికిత్సలఁ దాళునని యెఱుఁగుకొని యట్టిచికిత్సలఁ జేయవలెను," అని, కృష్ణమూర్తి చెప్పెను.

"దొరవైద్యునిమాట మీ చెవిని జక్కఁగ నెక్కుచున్నది. ఏనుచెప్పెడి మాటలీచెవినదూరి యాచెవిగుండా బయటపోవుచున్నవి. లతాంగి యొక్క తేనాతట్లు; తక్కినవారందఱు నేకమతమే; నాకీవలసిన కాసును నిచ్చిన నేనువెళ్లెదను."

"అస్తికులుగారు! తమకువృద్ధత్వముచేతఁ గోపముమెండు; కొంత శాంతముతోఁ మకుఁదెలిసిన చికిత్సలఁజేయుచుండుడు; తమచికిత్సలనెవ్వరు నిర్లక్ష్యింపరు," అని, ధ-పంచమి చెప్పెను.

"సరే! నీవునునాతోఁ జేరుచున్నావా? నీవుచేరినా యొక్కటే. లేక, చేరకుండినా నొక్కటే."

"అందటి యభిప్రాయమును ధ-పంచమిచెప్పినట్టే," అని, కృష్ణమూర్తి వాక్రుచ్చెను.

"ఎవ్వరేమందునిచ్చినా నాగండౌషధమాత్ర యన్ని మందులకుఁ బైనుండి చేయవలసినపనిని జేయకమానదు; నామాత్రచేత సుబ్బమ్మగారి తలవ్రాత గట్టిదనుకొనవచ్చును. నేనింటికివెళ్ళి యరుణోదయమున వచ్చెదను," అని, వెళ్లుచుండగ, కృష్ణమూర్తివెంటఁజని,

"తాతగారు! ఏనుదొరవైద్యునితో భాషించితిని; రుధిరశుద్ధికి స్థానమైన హృదయము, ప్రాణవాయువు కిరవైన శ్వాసకోశములు, స్పర్శజ్ఞానాదియింద్రియములకు జన్మస్థానమైన మస్తిష్కము, యీప్రాణాధారత్రయము

లలో నొక్కఁడాని క్రియయుడిగిన తత్క్షణమే మరణసంభవమట; అందుచేత మాటికనుగుణమైన మందు నిచ్చినట్టు దొరవైద్యుండు చెప్పెను," అనెను.

"ప్రాణాధారక్రియములు మాత్రమా? పంచప్రాణములను గట్టిగబిగ పట్టుమాత్రను నేనిచ్చితిని. ఎఱుఁగుదురా?"

"చాలసంతోషము! ఉదయమునవశ్యము వచ్చిపోండు."

"మీయిల్లు నాకు సొంతము; నాకు ఖర్చులకుఁ బైకము కావలసియున్నది. రేపుమాపనక, నేనువచ్చినపుడు నాకీవలసిన మిగత రూపాయల నిచ్చివేయుఁడు; ఆయుస్సుండిన మీయత్తగారు బ్రతుకుటకు సందియములేదు."

రాత్రివేళయందు భద్రయ్య మలయాళసీమకుఁజేరిన మాంత్రికుండొకనిరప్పించి, కర్పూరముముట్టించి కాటుకబెట్టిచూచినందులో, మాంత్రికుఁడు సుబ్బమ్మగారికిఁ బురుషపిశాచముపట్టినదోషమును, శూద్రునిచే శూన్యదోషమును, త్రోపుడు ద్రొక్కినదోషమును దగిలినట్లును, పిశాచముఁబట్టినదియుఁ ద్రోపుడుఁ ద్రొక్కినదియు నొకయరణ్యమధ్యంబున నొకచెట్టుచెంగటనని చెప్పి,

"సుబ్బమ్మ యెప్పుడైన నరణ్యమార్గమున వెళ్ళెనా? శూద్రుండెవ్వండైన వైరమా?" అని యడిగెను.

"అరణ్యమార్గమున వెళ్ళినదినిజమే; చెలమయొద్దున వృక్షమువద్ద నిలిచినదియునిజమే; శూద్రబత్తెకాని గొలువునుండి తీసివేసినదియు యదార్థమే" అని, భద్రయ్యచెప్పెను.

"మూఁడుదోషములకు ముప్పదివరహాలిచ్చిన నేడే శ్మశానమునకరిగి, క్షుద్రదేవతకు నాలుఁగేటలను బలియిచ్చి, పూజచేసి, యొకరక్షను సిద్ధపఱచి యిచ్చెదను. దానిని దమభార్య మంగళసూత్రమున గ్రుచ్చికొనఁజేయుఁడు. ఒక రాగిరేకులోఁజక్రమువేసి బీజాక్షరములనువ్రాసి వీధిగోడకుఁ దగిలించెదను. అటువెనుక శూన్యపైశాచముల బాధనివృత్తియగును," అని, మాంత్రికుఁడు చెప్పెను.

"నాయనా! తామేల మాంత్రికునిమాటలనమ్మి వృథాఖర్చులం బెట్టుకొనియెదరు? అతఁడు చెప్పినదంతయు వట్టిబురుడా, వట్టి బూటకమే. ఇరువది లేక ముప్పదియేండ్లకుముందు పాలకాడు సీమలో మాంత్రికులనియు శూన్యముఁబెట్టువారనియుఁ బెక్కండ్రు పెంపొందియుండిరి. వారిచే మోసపుచ్చబడినవారి సంఖ్యయసంఖ్యాతము. లోకులు తమయనుభవముచేతను వివేకముచేతను మాంత్రికుల యపలాపానృతములఁ గనిపెట్టి, వారినిరప్పించుటను మానుకొనిరి. అందుచేత నిటీవల మాంత్రికవృత్తి ననుసరించెడివారు దుర్లభమైరి. "అందఱిని గొంతకాలము వంచింపఁగూడును; కొందఱినెల్లకాలము వంచింపఁగూడును; అందఱి నెల్లకాలము వంచింపఁగూడునా?" తామే లవృథాఖర్చులం బెట్టుకొనియెదరు?" అని లతాంగి విన్నవించెను.

"రెండు యింగ్లీషుమాటల నేర్చినందువనే, మొన్న నాకడుపున బుట్టి నాకుమించిన యనుభవముఁ దెచ్చుకొన్నావా?" అని, కోపించినందున "తమయిష్టము, నాయనా," అని, కూఁతురుచెప్పెను. తుదకు మాంత్రికునితో బేరమాడి, ముప్పదిరూపాయల కొప్పునట్లు చేసి, యామొత్తమును మాంత్రికునిచేత నిచ్చెను.

రెండవనాఁడు భద్రయ్య యొకకార్తాంతికుని రప్పించి సుబ్బమ్మ జాతకమునిచ్చెను. దైవజ్ఞుఁడు పలకవలపముల దెప్పించి, పలకమీఁద దశాభుక్త్యంతరముల లెక్కచేసివ్రాసి.

"ఈజాతకికి నిప్పుడు శనిదశాంత్యము; బుధుఁడు మారకుఁడైనందున శనిమారకము చేయక జాతకినిగాని జాతకికిఁ బ్రాణమునకు సమానమైన వారింగాని మారకముచేయునంతటి క్రూరముఁజేసియే విడుచును. ఈక్రూర మొకపక్షమువఱకే. పక్షము దాటిపోయిన జాతకికి భయములేదు," అనెను.

"జాతకికి బ్రాణమునకు సమానమైనవాఁడు నేనే కద?"

"సుబ్బమ్మ సుమంగలిగ గతించు; అమంగలికాదు."

భద్రయ్య గణకునిచేత రెండు రూపాయలఁ బెట్టి తాంబూలముతో నొసంగ, "లాయర్ జంబయ్యగారు చెప్పిపంపినందున నేనువచ్చితిని; రూప్యముఁ దీసికొనుట యుచితముగాదు," అనుచు, రూపాయలను నడుమున జెక్కుకొని, తాంబూలముఁ జేతఁ బట్టుకొని, సెలవుపుచ్చుకొని మగిడెను.

సుబ్బమ్మగారికి మొదటివారమున సన్నిపాతము జనియించి మాటలు తబ్బిబ్బై, లతాంగికిని దక్కినవారికిని మనోవ్యాకులము పుట్టెను. రెండవ వారమున జ్వరతాపము దినేదినే తగ్గుచు, శశిపురముఁ జేరిన పదియేనవదినమున జ్వరబాధ పూర్తిగ నివర్తియై, యొకరిసాహాయ్యములేక తానే కూర్చుండను లేవను గొంతభుజియింపను శక్తిగల్గెను.

పదియాఱవ దినమున మధ్యాహ్నమపుడింటికూటమున సుబ్బమ్మ లతాంగి, చంపకవల్లి, రంగనాథుఁడు, కృష్ణమూర్తి, అస్తీకుండు-వీరు కూర్చుండియుండి, వేడుకగ నూసపోక మాటల నాడుచుండిరి.

"తాతగారు! మనవైద్యము మేలా? లేక, జాతివారి వైద్యము మేలా?" అనిఁ రంగనాథుఁ డడిగెను.

"మనవైద్యమునకు వెనుకనే జాతివారివైద్యము; మనదేశస్థుల దేహతత్త్వము వారికిఁ దెలియదు; మన యాచారాహారములు వేఱే; వారిభోజనములు నాచారములును వేఱే; మనదేశమున నెంతో మహిమఁగల మూలిక లపరిమితమైయున్నవి; వారిసీమలో నేమూలిక ఉద్భవమగుచున్నవి?"

"మనదేశమున మూలికలకుఁ దక్కువలేదు; మూలికల నుపయోగమును వాటి శక్తిప్రమాణములును దృఢముగఁ గనిపెట్టినవారును వాటి యనుభవమునుఁ జక్కగఁ దెలిసికొన్నవారును దుర్లభము," అని కృష్ణమూర్తి వచించెను.

"మన వైద్యశాస్త్రమును గుఱించి యనేకగ్రంథములున్నవి; అవియే చాలును. ఏను పదిగ్రంథములఁ జదివియుండెదను," అని, నవ్వెను.

"అవి పురాతనగ్రంథములు; వాటిని బరిశీలించి వాటిలోఁ గనియుండు విషయంబుల ననుభవ దృష్టాంతములకుఁ దెచ్చుకొనినఁ గ్రంథములు పైపై విస్తరింపబడును; మనగ్రంథములు పూర్వము వ్రాయబడినట్టే యున్నవి," అని, కృష్ణమూర్తి చెప్పగ,

అస్తీ. (నవ్వుచు) "పురాతన గ్రంథములైన బాధకమేమి? మూలికలగుణము మారిపోవునా?"

"వాటిని బూర్తిగఁ బరిశోధించి మనయనుభవమునకుఁ దెచ్చుకొనలేదనుచున్నాను; మనదేశములోని మూలికల బశ్చిమ సీమలోనుండువారు తీసికొనివెళ్ళి, వాటిరసచారములఁ గ్రక్కించి యారసచారములను సీసాలలోఁ బదిలపఱచెదరు," అని, కృష్ణమూర్తి వచింపగ,

"మనదేశములోఁ గోట్లకొలఁదినుండు మూలికలరప్పించి వాటిగుణము, శక్తి, ప్రమాణము, ప్రయోగము-వీటినిశోధించి, మనవైద్యశాస్త్రములఁ బ్రోత్సాహపఱచుటకుఁ గొండంత ద్రవ్యము గావలసియున్నది; అంత ద్రవ్యసహాయ్యముఁ జేయుశక్తిగల ధనాఢ్యులలో దేశాభిమానులు దుర్లభముగనుండెదరు," అని, లతాంగిచెప్పెను.

"వ్రణశాస్త్రమందు జాతివారు నిపుణలనుచున్నారు; నిజమా, తాతగారు?" అని, రంగనాథుఁ డడిగెను.

"ఔగాక! చేతిపై దెబ్బతగిలిన మణికట్టువఱకుఁ దీసివేయవలెనట. పాదముపై దెబ్బతగిలిన మోకాలివఱకుఁ దీసివేయుదురట! ఇది మంచిచికిత్స! మన కార్వేటినగరమునకు సమీపమున నొకండు పచ్చిమూలిక బెట్టికట్టుచున్నాఁడు. ఆమూలిక గుణము తెలియునా? రెండుగచీలి పగిలిపోయిన కాళ్ళు చేతులు గూడిపోవుచున్నవి. అతనియొద్ద నొకజాతివాఁడు చికిత్సచేసికొని గుణముఁ బొందెనట. బీదసాదలే యతనియొద్దఁ జనియెదరు; మంచిమహారాజు లతని బ్రోత్సాహపఱచి యుండిన నట్టి వైద్యులెందఱో బయలుపడియుందురు," అని, అస్తీకుండుచెప్పెను.

"అట్టి మూలికలఁగనిపెట్టి యట్టివైద్యముల వ్యాపింపఁజేయుటకు మనదేశస్థులకు సుత్సాహమైన ప్రోత్సాహమైన లేవు," అని, లతాంగి చెప్పెను.

"తాతగారు! తాము రాజవైద్యులని కీర్తివహించియుండెదరు; ప్రథమమున దామేరాజునకు నేలాటివైద్యముజేసి, కీర్తిగాంచితిరి?" అని, రంగనాథుఁడడిగెను.

"మిహిరదేశపురాజునకు వైద్యము జేసితి; అతండు స్థూలశరీరి యగుటతో బృహత్కుక్షి; అతని కడుపుమీఁద రెండువలుద మడతలు; ఆమడతలఁదెఱచి చూచినవారు నేను తప్పవేఱెవ్వరులేరు ఆమడతలలో నొక్కదానినుండి రేయింబవళ్ళు జీముకాఱుచు, చీముతగిలినచోటెల్ల వ్రణమగుచువచ్చెను. ఎట్టి వైద్యుండును జీమును నిలుపకపోయె; వ్రణమును నార్పకనుబోయె. తుదకు నాచికిత్సచేత, జీమునునిలిపి, వ్రణమునార్పితిని. రాజుగారు నావైద్యమునుమెచ్చి, యొకగొప్పసభచేర్చి, నాకు పదివందలరూపాయలు బహుమానముచేయుటతో నేనిప్పుడు కప్పుకొనియుండు కాశ్మీరశాలువను నిచ్చియు 'భూలోక అస్త్రీకుఁడు' అను బిరుదును లిఖితమూలముగ నిచ్చియు, నను సన్మానించిపంపిరి. నాటంబట్టి నానామమేదో కొంతవఱకుఁ దెలియనయ్యె," అని నవ్వెను.

"మిహిరదేశపురాజుగారి వ్యాధింగూర్చియొక వినోదమైనవదంతి విన్నాను, బాబులార," అని, ధ-పంచమిచెప్పగ, "ఏమివదంతి విన్నావురా?" అని, రంగనాథుఁడడిగెను.

"మిహిరదేశపురాజుగారిని దర్శింపఁబోయిన వారిలో నొకనిచేనియ్యఁబడిన నిమ్మపండు, రాజుగారి కుక్షిమడతలలో నేలాగో జిక్కుకొని, మడతలలో నాపండుకుళ్ళుచు, కుళ్ళిననీళ్ళు దేహముమీఁద స్రవించుచు, స్రవించినచోటెల్ల వ్రణమగుచువచ్చెనట. ఈగుట్టునే వైద్యుఁడును కనుంగొనక మందిచ్చినందున రాజుగారికి వ్యాధికుదురలేదట. తుదకు మనతాతగారువెళ్ళి

యాచీమునుఘ్రాణించి, కుళ్ళిననిమ్మరసమని యెఱుఁగుకొని, రాజుగారితోఁ జెప్పకయుఁ జేర్వనెవ్వరిఁ జేర్పకయు మనతాతగారే రాజుగారి కడుపుమీఁది మడతలను గొంతశ్రమతోఁ దెఱచి, యందునకుళ్ళుచుండిన నిమ్మపండును బయటతీసి, నీళ్ళతో శుద్ధపఱచి, వ్రణమైనచోట్ల వెంకాయనూనె జిలిమి, మడతను యథాప్రకారమువిడిచి వేసిరట. ఆనాటినుండి కాఱుటనిలిచి, వ్రణమాఱెనట. అందుమీఁద రాజుగారు సంతసమొంది, మనతాతగారు చెప్పినట్టు బహుమాన బిరుదులనిచ్చి, సన్మానించిరట," అని చెప్పినంతట నందఱు 'ఘల్లు'మనినవ్విరి. అస్త్రీకుఁడు కొంతమంటతోఁ గూడిన నవ్వుతో,

"ఓరి, దబ్బిలి ! బికారిమాటలనాడెదవు! వదంతియెంత మాత్రము నిజమని తెలిసికొన్నావా? ఈలాటి తప్పుకూఁతలనేల మొఱిగెదవు?" అని, కసరెను.

"ఏనువినినవదంతిని మనవిచేసినాను; కోపపడకుఁడు, తాతగారు," అని, ధ-పంచమి చెప్పెను.

"తాతగారు ! తాము 'భూలోక అస్త్రీకుఁడు' అను బిరుదువహించియుండుట మాకెల్లరకు సంతోషము; 'రోగహారి' యనియెందుకు పిలిచెదరు? తమకుమావలె నామధేయములేదా!" అని కృష్ణమూర్తియడిగెను.

"నానామధేయము 'కోపీరావు;' ఆపేరిటనన్నెవ్వరు పిలువరు," అని, నవ్వెను.

"తమకోపముంబట్టి నామధేయమా? లేక, నామధేయముంబట్టి కోపమా?" అని, ధ-పంచమియడుగ, "ఒరి, దబ్బిలి! నీకుత్సితమైనమాటలనెన్నడు వదలవా?" అని, తాతగారలిగిరి.

"మాలతసుఖముం జూడఁగూడలేదు; నేనిచేటికివచ్చిన నాటినుండి నేటివఱకునొకనిమిషంబైనా తనకనుమీఁద ఱెప్పబడనియ్యక నాచెంతనుండి పరిచర్యజేయుచువచ్చెను; అందుచేత దాని రెండుకండ్లును రెండునూతులు వలె లోదిగబడియున్నవి. చెంపయొక్కటికిఁ జారెడు చక్కఁరఁబోయ

వచ్చునువలె నున్నది. "ఇట్లు కృశించియుండుట కేమిచేయుదము, తాతగారు," అనిసుబ్బమ్మ యడిగెను.

"తమదేహస్థితిఁగని కూఁతురికి మనోవ్యాకూలము. ఇఁకమీఁదట వేళకు భుజియించి రాత్రిపూఁటరవంత ముందుగశయనించుచు వచ్చిన దేహము కుదిరి యథారీతికివచ్చును," అని తాతగారు చెప్పిరి.

సుబ్బమ్మ—దాని కన్నము సహించేలేదట. రాత్రిపూఁట నిదుర సేయుమని నేనెంత చెప్పినా దానికి నిదురపట్టలేదట. నిన్నటి రేయియంతయు నాచెంతఁగూర్చుండి కాచియుండెను. ఇంక నాకేమి చేటు? ఎందుకు నిదురలేక నాపొంత మేలుకొని కాచి యుండవలెను?"

ధ-పం—తల్లీ! లతమ్మగారికి దృష్టిదోషము. ఎందఱినోఁ జూచివచ్చె. వారిలోఁ గొందఱిదృష్టితగిలియుండును. <u>వింటిదెబ్బతగిలినా కంటిదెబ్బతగులరాదు."</u>

సు:—వాస్తవము; దానికి దృష్టితీసి దోషపరిహారముజేయవలెను. నాకు గొంతశక్తివచ్చినవెనుక దానికి నేను తప్ప వేఱెవ్వరు చేయుదురు?

కృష్ణమూర్తి:—ప్రతిరాత్రియు నేను వచ్చిచూచి నపుడెల్ల లత తమపాన్పుప్రక్కన నిదురింపకకూర్చుండి యుండుటంగాంచి, యేనుకొంత సేపు తమ పడకవద్దనుండెద ననియు దానునిదుర సేసి రావచ్చుననియు జెప్పితి. అందుకు, మగవారు కాయిలా స్త్రీయొద్దనుండి యేలాటిపరిచర్యలఁ జేయఁదగదనిచెప్పి నను బంపివేసెను. ఈపదు నేను దినములలో నొకప్పుడైనా నిదురించియేఁ జూడలేదు. నిదురలేనందున నజీర్ణము; అజీర్ణముచేత నన్నము సహించేలేదు; అన్నములేనందున జంపలును జత్తులును గుంతలుపడెను. నేటిమొదలుకొనియైనా ముందుగ బువ్వ తిని పవ్వళించిన చెక్కులపల్లమును గనులగుంతయుబూడును.

సు:—ఓసిలత! ఇంకనను గుఱించి చింతపడఁబనిలేదు. నేటిమొదలుదీపాలతో బోవేసి తొన్నుండుము.

ల:—ఓరమువలదమ్మ; నాశిరము గిరగిరతిరుగుచున్నది. మీరందఱు వేడుకగా మాటాడుచుండినందున బడకసేయ నిష్టములేక కూర్చుండియుంటి.

సు:—తల యెందుకు తిరుగుచున్నది? నీవు పండుకొనుము. నాకింక తోడక్కఱలేదు.

ల:—దీపాలతో బండుకొనెదనమ్మ.

సు:—దీపాలతో బడకమీఁదికి వెళ్ళరాదు. ఇపుడే వెళ్ళుము. ఇపుడు వెళ్ళకుండిన దీపము ముట్టించికొంత సేపైన పిదప శయనింపుము.

ల:—ఆలాగే చేసెదనమ్మ.

"అదిగో, గుబిలికూయుచున్నది. ఒంటికూఁతకూసినది యెంతయుప లక్షణము! ఇంతదొడ్డనగరమున ప్రొద్దుగ్రుంకుటకుముందు గుబ్బిలికాఁడు వచ్చి కూఁతపెట్టు టాశ్చర్యకరముగ నున్నది. ఓరిపంచమి! నాకింకేమి చేటు లేకుండినా నాదుశ్శకున పక్షిని నవతలకిఁ దోలిరమ్ము," అని సుబ్బమ్మ చెప్పగ, ధ-పంచమి వీధికివెళ్ళి తిరిగివచ్చి,

"తల్లీ! ఏనువీధికివెళ్ళి నిలఁబడినంతట మనయింటిపై కప్పుమీఁద సందీనము చేసియుండిన కనకాక్షి ననుఁగని పశ్చిమముఖంబున బ్రడీనంబు సేసె. పాఱిపోయిన యులూకముతోటి మనకేమిపని!" అని బదులొనర్చెను.

"ప్రొద్దాయెను, ఏనువెళ్ళెదను, అందఱు బాగుగనుండుదురు గాక! ఎవ్వరికైనా జబ్బుగల్గినమాత్రము నేను రావలసినవాఁడను," అని, ఆ స్త్రీకుఁడు సెలవుపుచ్చుకొనెను.

తల్లియుఁగూఁతురు తప్ప మిగిలినవారులేచి సాయంకృత్యానుష్ఠానములకు జనిరి. దీపములుముట్టించి నాలుఁగునిమిషములైన వెంటనే లతాంగి,

"అమ్మా! నాకు మయికముగనున్నది. ఆకలిలేదు; ఏనులోన జని పండుకొనెద. నన్నెవ్వరు లేపవలదు. ఏనైలేచివచ్చిన వలసియుండిన గొంత యాహారముఁ బుచ్చుకొనెద," అని, లతాంగిచెప్పి, వీధిగదిలోన జని శయ్యపైశయనించెను.

28–వ, అధ్యాయము.

లతాంగి కకస్మాత్తైన యవసానము.

సుబ్బమ్మ తనభర్తను బిలిచి "లతమైకముగ నున్నదని చెప్పి దీపాలతోఁబడక మీఁదికిఁజేరెను. ఈవలకు లేచి రాలేదు. దాని గాస్తచూచి రండు," అనిచెప్పగ, భద్రయ్య పడకదండఁజేని, "లత! లతమ్మ;" అని పిలిచినందుకు బదులుపలుకు రానందున గాఢనిదురలో నుండునట్లు తలఁచి, "రెండుసార్లు పిలిచియుఁ బల్కలేదు. నిదురభంగము సేయరాదు; మెలఁకువకొనినపుడు తానేలేచివచ్చును," అనెను.

సు:—నిదురవోయిన మంచిదే. అన్నముదినక పట్టికడుపుతోనిదురకొనిన దెల్లవాఱగలేచిరా నెట్లు త్రాణయుండు?

భ:—రెండుగడియలు తాళిదానినిలేపి బువ్వతినిపించి, పన్నుండఁజేసెద.

తొమ్మిఁది గంటలుకొట్టువేళ సమీపించియు లతాంగి పడకవిడిచి లేవలేదను చింతతో కృష్ణమూర్తి తనప్రియసతిచెంతఁ జేని ప్రక్కన గూర్చుండిదానిముఖమును దేహమును దనచేతులతోఁ దడవుచు, సన్ననిగొంతుతో, "లత! ప్రియసి!" అనిపిలిచెను. పల్కనందున రెండునిమిషములు నిదానించిచూచి పడవేసిన కాళ్ళుచేతులు పడవేసినట్లుండుటంగాంచి లతయుంజేయు గెంగేలులంబట్టిచూచి, వేడిమిలేక చేల్లగనున్నదని కొంతజంకుపడి,దానినాసాపుటములవద్దఁ దనచెయిఁబెట్టి చూడగ, సావకాశముగఁ జల్లని పైయూపిరి విడుచుటంగనుంగొని,డీలొంది కన్నీళ్ళువిడుచుచు, గదివిడిచిలేచిపోవుటకుఁ గాళ్ళలోఁద్రాణతప్పి,తిన్నగఁగూటామఁ జేరి,మాటలు తబ్బిబ్బై,"అత్త!నా ప్రియసతి,లత మోసపుచ్చినట్టున్నది; కాస్తచూచిపత్తురు, రెండు," అనిశోకనాదముఁ జేసెను. సుబ్బమ్మయులికిపడిలేచి, కాళ్ళుతడబడుచు, లతయుండిన గదిలోని కరిగి, లతముఖముమీఁదఁ దనకైఁబెట్టి చూచి,"అయ్యోనాముద్దుకూఁతురా!కనకాక్షియొక్కకూఁతగూసివెళ్ళెనే.అయ్యయ్యో, నాముద్దులత "అని,తనరొమ్ముమీఁదను దలమీఁదను మోదుకొనెను. ఈమాఁటలనువిని,

యెదిరింటనుండిన 'జంబయ్య, అతనిభార్య, భద్రయ్య, చంపకవల్లి, రంగనాథుఁడు, వీరువచ్చిరి. జంబయ్య లతాంగి కెంగేలు బట్టి ధాతుపరీక్షజేసి, ప్రాణమున్నది; భయంపడవలదు,"అనిసుబ్బమ్మకును కృష్ణమూర్తికి సమాధానముజెప్పి,తనగుమస్తాను బిలిచి రెండు దొరవైద్యులఁబిలుచుకొని రమ్మనియాజ్ఞాపించెను.సుబ్బమ్మ ధ-పంచమినిబిలిచి,ఆస్త్రీకునిదోడ్కొనిరమ్మనిపంపెను. పదినిమిషములలో రెండు దొరవైద్యులునువచ్చి, లతాంగి హృదయశ్వాసకోశములఁ బరీక్షించి, హృదయక్రియ మితమునకు మించి తగ్గియున్నదనియుఁ బదియేనునిమిషములలో గ్రియబొత్తిగనిలిచి పోవుననియు నిరాశజేసికొన వలసినదనియు జెప్పి, మొదటి తడవరాత్రి పూఁటవచ్చినందున జెరియిరువదిరూపాయలుదీసికొని,తమరథంబుల నెక్కి చనిరి. ఆస్త్రీకుండువచ్చిలతాంగి చెయింబట్టిచూచిఁ "ధాతువేర్పడలేదు; నాడియుండుచోటు తెలియలేదు. ఇప్పడుండుస్థితిపదినిమిషములకుపై నుండరాదు, అనిచెప్పి, యెవ్వరితో జెప్పకొనకవెళ్ళెను.

"స్వామీ! నిన్నటి రాత్రియేనొకయతిశయముగాంచితిని; అని ధ-పంచమిచెప్పగ, "ఏమియతిశయము? "అని,జంబయ్యయడిగెను.

"రాత్రితొమ్మిదింకాలుగంటలకు మింట నొకజ్యోతికనంబడెను; దానిదృష్టిగఁజూచినపుడొకదొడ్డనక్షత్రమువలె నాజ్యోతి భూమండలమునుండి గగనమండలములో బ్రసరించినట్లుతోఁచెను; దొడ్డవారు గతించుటకది పూర్వసూచన యనికొందఱు చెప్పగవిని యుండెదను. నిజమా?స్వామి!"

"ఏను వినినదిలేదు," అని, జంబయ్య చెప్పెను.

తొమ్మిదిగంటలుకొట్టి పదియేనునిమిషములకు ముప్పదియవవయస్సున, లతాంగి జీవాత్మ లతాంగి కళేబరమువిడిచి శిరముగుండావెడలి కైవల్యము జెందెను. అపుడు సుబ్బమ్మయు కృష్ణమూర్తియు జేసినరోదనంబుల నంతంతయని చెప్పనలవికాదు;వారిరోదనములను విని, కనినరులైనసురులైన నోర్వలేరు.

మరణవృత్తాంతము, తత్క్షణమే నగరవాసులచెవులకంది, ప్రతివీధి యందును జనులు గుంపుకూడి, యకస్మాత్తైన మరణసంభవమునుగూర్చి, వెఱగుచెంది, చింతపడుచుండిరి. సూర్యోదయకాలమున, లతాంగిశవమును నొలికిమిట్టకుఁ గొంపోవుసమయమున శవమును దర్శింపఁగోరివచ్చిన వారిలోఁ బరిచయముగలవారు కొందఱు, కీర్తినివినివచ్చినవారుకొందఱు, స్త్రీసమాజములం జేరినవారందఱు, సమాజములలోఁ జేరనివారిలో కొందఱు, హిందుపురుషులలోవ్యాపకులైన వారందఱు, అవ్యాపకులైన వారిలో గొందఱు, అత్తయునతని భార్యయు—యిట్లునానా వృత్తివర్ణములంజేరిన వారువిచ్చేసిరి. అట్లువిచ్చేసి యుండిన స్త్రీల సంఖ్య రెండువేలు; పురుషుల సంఖ్యమూఁడువేలు; సుమారు వేయింటికిదగ్గర పిత్రువనము వఱకువెళ్ళిరి. దహన సంచయనములైనమఱునాడు, తంతివార్తలుగను దపాలువార్తలుగను కృష్ణమూర్తికి వచ్చిన పరామర్శపత్రికలును ననుశోక జాబులును లెక్కించుటకు నలవికాదు. వాటిలోబ్రధానములైనవి, రాజధానికద్యక్షుని యొద్దనుండియు నతనిరాణిగారి యొద్దనుండియుఁ బెద్దదొరసానమ్మజిన్న దొరసామ్మలయొద్దనుండియువచ్చినవి. వార్తాపత్రికలయందు మొదటిపుటలోనలుప్రక్కల శోకముగనాలుఁగుపెద్దనలుపు గీటులుగీచి, మధ్యలతాంగి మరణ సంభవమునుదొడ్డముద్రాక్షరముల జూపి, దాని గుణమహిమలను సంగ్రహముగఁ దెలిపి, దానిమరణముచేత దేశమునకును స్త్రీకులమునకును మహత్తైన నష్టము సంభవమైనట్లు ప్రచురముచేయబడెను. లతాంగిమరణమును గౌరవించి జ్ఞాపకముంచుకొను నిమిత్తము, సంచయనముజరిగినదినమున, యావత్తుస్త్రీసమాజములు ను స్త్రీపాఠశాలలును బురుషపాఠశాలలును మూయఁబడెను; మునిసిపల్సభయును స్థానికస్వపరిపాలనసభలో బడిన సిబ్బందులకెల్ల నొకదినము సెలవియ్యబడెను.

---

29 వ. అధ్యాయము

లతాంగిమరణానంతరముశ్రీమతిబాలాంబగారు దేశస్త్రీలకుజేసెడిప్రేరణయుబ్రార్థనయు.

నాచెలికత్తెలతాంగి గతించినయది. లతాంగిలేనియిద్దేశస్త్రీలకీర్తి వెలుంగు, చుక్కలదొరలేని రిక్కకోట్ల వెలుఁగెంత మాత్రమో యంతమాత్రమై యున్నది. దానిముద్దుమోము జూచినట్టి వారికిని రమ్యమిచ్చును; దానిపలుకులో రమ్యతరము. దానినడతల వైఖరియో రమ్యతమము. స్త్రీజాతియందామెకుగల్గియుండిన మక్కువకు, తక్కిన వారికుండు మక్కువ మిక్కిలి తక్కువ. ఆమెజీవించి యుండిన స్వల్పకాలమువరకు స్త్రీలు పాటుపడి పురుషులకుసమానముగ స్వాతంత్ర్యము సంపాదింపవలెనను నేకోద్దేశము నేకచింతయు నేకయత్నమును గలదియైయుండెను. స్వాతంత్ర్యమొకదివ్యంబైన ఫలముంబోలు. ఆఫలమును ననుభవించినవారు దమప్రాణములనైన వదలుకొనుదురు కాని యాఫలమును విడిచిపెట్ట సమ్మతింపరు. అట్టిఫలమును నందుకొను దారినిజూపిపోయిన లతాంగి దేవలోకమునకు దారిజూపు సుదర్శన చక్రమువంటి దనందగు. స్వాతంత్ర్యమునకు దారిజూపునిమిత్తమే భగవంతుఁడు లతాంగిని సృష్టించినట్లు తోఁచెడిని. సుదర్శనచక్రము దేవలోకమునకు దారిజూపి యంతర్ధానమైశ్రీవైకుంఠ మూర్తినందునట్లు, మనలతాంగి స్త్రీలుస్వాతంత్ర్యము బడయుటకు దారిజూపి శ్రీమన్నారాయణమూర్తి పాదపద్మములంజేరెను. లతాంగి లేదని మనదేశస్త్రీలధైర్యపడక, మనస్సు క్రుంగక నిర్విచారముతోలతాంగి చూపిపోయినదారింబట్టి యొకపట్టుగలతో నేకచింతనులైయేక మతముతో పాటుపడి స్త్రీస్వాతంత్ర్యమను దివ్యఫలమును నొందుదురు గాక ! అని, సర్వేశ్వరుని నతివినయముతోఁ బ్రార్థించుచున్నదానను.

గ్రంథకర్త—త[illegible]

సవరణపట్టి.

పుట.	తప్పులు.	సవరణ.
2	కింకిణీల్లవంబు	ర
3	గల్గినందుల్లకు	Omit ల
4	ప్రబసన్నమైన	న
5	ఎత్తిమిదవ	ని
,,	పుణ్యావాహచనము	హావాచనము
47	ఎనరైనినుండిన	న
57	నాపంటితోవకు	తో
99	దురదకందయ్యునను	యై
105	జోచేశా	జోచి
,,	ఇట్లటు	యి
106	ప్రయణీకులు	ణి
110	జోచిచ్చి వచ్చెద	Omit చి
112	పెండ్లివి	వి
127	వియ్యపుత్తట్ట	తి
159	అయిన పెండ్లియైనదే	అయినపెండ్లి యైనదే
175	ఎమిర	ఏ
171	వృద్ధాజీవుఁడు	ద్ధ్యా
175	వ్రాసియే నూరుపతులు	వ్రాసి యేనూరు

పుట.	తప్పులు	సవరణ.
184	సుమ్మారు	మా
186	ద్రష్టస్తు	ష్య
188	వ్రాయఁడిన	వ్రాయఁబడిన
208,210	ఘనపాట్రి	ఠి
241	త్రైప	తే
305	ష్టుకు దెలసిన	షా
315	కృష్ణ ర్తిమూ	మూర్తి

END OF TITLE